# మనసిచ్చి



ఆకుపచ్చని జ్ఞాపకం

వంశీకథలు



**వంశీ** పూర్తి పేరు నల్లమిల్లి వంశీ. 20-11-1956లో తూర్పు గోదావరి జిల్లా బలభద్రపురంలో పుట్టి 1975 దాకా ఆ వూరికి పదిహేను మైళ్ళ దూరంలో వున్న పసలపూడిలో పెరిగారు.

ఆ తర్వాత మద్రాసు వచ్చి మొట్టమొదట విక్టరీ మధుసూదనరావుగారి దగ్గర స్వర్గీయ ఎన్.టి. రామారావు నటించిన *ఎదురీత* సినిమాకి అసిస్టెంట్ డైరెక్టర్‌గా చేరారు. ఒకపక్క అసిస్టెంట్‌గా చేస్తూనే కథలూ నవలలే కాకుండా రేడియోకి *చంద్రకాంత శిల* అనే సీరియస్ నాటకం, *రెండు జడల బేబీ-కళ్ళద్దాల బాబ్జీ* అనే హాస్య నాటికా రాశారు. రకరకాల దర్శకుల దగ్గర పనిచేసి 1982లో *మంచుపల్లకి* సినిమాతో దర్శకుడైన వంశీ తను రాసిన *మహల్లో కోకిల* అనే నవలని *సితార* సినిమాగా తీసి దర్శకుడిగా తనదైన స్టైల్‌ని ప్రేక్షకులకి చూపించారు.

ఎన్నో ఆశలు పెట్టుకున్న *ఆలాపన* చాలా దారుణంగా దెబ్బకొట్టడంతో కసిగా కామెడీ సినిమా *లేడీస్ టైలర్* తీస్తే అది 175 రోజులాడింది. దాంతో వంశీకి కామెడీ సినిమాలు తీసే దర్శకుడిగా ముద్ర పడిపోయింది. 1982లో *జోకర్* సినిమాతో సంగీత దర్శకుడిగా కూడా మారి వరసగా నాలుగు సినిమాలకి మ్యూజిక్ చేశారు. *కాణిపాక వరసిద్ధి వినాయక సుప్రభాతం* అనే డివోషనల్ సి.డి. చేశారు గానీ విడుదల కాలేదు.

*అన్వేషణ, లేడీస్ టైలర్, శ్రీ కనకమాలక్ష్మి రికార్డింగ్ డాన్స్ ట్రూపు, ఏప్రిల్ 1 విడుదల, ఔను వాళ్ళిద్దరూ ఇష్టపడ్డారు, గోపి గోపిక గోదావరి* లాంటి మంచి సినిమాలున్నా *సితార*ని ఉత్తమమైన సినిమాగా చెప్పుకోవచ్చు.


వంశీ మొట్టమొదట పాట రాసిన సినిమా *శ్రీ కనకమాలక్ష్మి రికార్డింగ్ డాన్స్ ట్రూపు*, మొదట మాటలు రాసిన సినిమా *అన్వేషణ*.

వంశీ రాసిన నవలల్లో ఉత్తమమైన నవల *మహల్లో కోకిల*. అప్పుడో కథా అప్పుడో నవల రాసిన వంశీ ఆమధ్య రాసిన *మా పసలపూడి కథలు* ఈమధ్య రాసిన *మా దిగువ గోదావరి కథలూ* చాలా పాపులర్ అయ్యి ఆయన్ని పాపులర్ రైటర్నిచేశాయి. వంశీకి బాగా నచ్చిన రచయితలు లత, బుచ్చిబాబు, ఆర్.ఎస్. సుదర్శనం, ముళ్ళపూడి వెంకటరమణ. నచ్చిన గొప్పవ్యక్తులు బాపురమణలు.

స్నేహితులే లేని వంశీకి ప్రాణమైన మనిషి, సంగీత దర్శకుడు చక్రి.

ఇప్పటి వరకూ ఆయన తీసిన సినిమాలు 24. ఇరవై నాలుగో సినిమా *సరదాగా కాసేపు*లో రెండు పాటలు పాడి గాయకుడిగా కూడా పరిచయమయ్యారు.

ఏది చేసినా మనసుతో చేయడం వంశీ ఓషో నుంచి నేర్చుకున్నారు.



# శిఖరమ్మని జ్ఞాపకం

వంశీకథలు



ఇండియన్ ఇండియా బుక్స్
4వ అంతస్తు ఫ్లాట్ నెంబరు 13
ఫేజ్.3 జూబ్లి హిల్స్
హైదరాబాద్ 500033

# AAKUPACHANI GNAAPAKAM

**Short Stories**

*by*

**VAMSY**

ఆకుపచ్చని జ్ఞాపకం వంశీకథలు

*First Publication*
October, 2010

*Publication*

ilios
ILIOS INDIA PVT. LTD.

**Plot # 126, Road # 74, Phase III, Jubilee Hills, Hyderabad-500 033.**

*Cover & Inner Paintings*
**Kalaprapurna**
Dr. Bapu

*Sole Distribution*

**Visalandhra Publishing House**
Vignana Bhavan, 4-1-435, Bank Street, Hyderabad-500 001. A.P., India
*Branches:* Hyderabad, Abids & Sultanbazar, Vijayawada, Visakhapatnam, Ananthapur, Guntur, Hanmakonda, Tirupathi, Kakinada, Karimnagar, Ongole, Srikakulam

*Designed at*
**Akshara Creators**
AG-2, 'A' Block, Mathrusri Apts., Hyderguda,
Hyderabad-029. Phone: 040-2324 4088

*Printed at*
**Kala Jyothi Process Pvt. Ltd.**
RTC 'X' Roads, Hyderabad. Phone: 040-2764 5536

Price: **₹ 350/-**





అంకితం


శ్రీ కరటం రాంబాబు గారికి

— వంశీ



# మనవి చేస్తున్నాను

గతంలో వచ్చిన నా ఆనాటి వాన చినుకులు కథలు కూడా ఈ సంకల నంలో వున్నాయి. వాటినిందులో ఎందుకు చేర్చానంటే ఈమధ్య ఆ కథలకి కళాప్రపూర్ణ బాపుగారు రంగుల్లో బొమ్మలు వేశారు. దాంతో ఈ కలర్ బుక్‌లో ఆ కలర్ బొమ్మల్ని జత చెయ్యాలనిపించి చేశానండీ.

ఆ తర్వాత మిగతా కథలన్నీ కూడా గోదావరి, తూర్పు గోదావరి గ్రామీణ నేపథ్యానికి మాత్రమే సంబంధించినవి కాదు. కొన్ని నగరాల్లోనూ అమెరికాలోనూ కూడా కలతిరిగిన కథలు. నిజానికి నేను మా గ్రామం పసలపూడి వదిలి పట్నం వచ్చి 35 ఏళ్ళయ్యింది. అయినా నా పల్లెటూరు నా గోదావరి మీద మాతృప్రేమతో ఇన్ని మా పసలపూడి కథలు  రాశాను.

సినిమా డైరెక్టర్నయినా నా ఆ సినిమా ఇన్‌ఫ్లుయన్స్ ఈ కథల మీద పడకుండా కాపాడుకుంటూ వచ్చేనని వస్తున్నాననీ బలంగా నమ్ము తున్నాను.

ఇదే సందర్భంలో నా మీదున్న వాత్సల్యంతో ఇన్ని బొమ్మలు వేసిన కళాప్రపూర్ణ డా॥ బాపు గారిపాదాలకి నమస్కారాలు. తర్వాత వీటిని స్వాతిలో అచ్చేసిన వేమూరి బలరామ్ గారికి కృతజ్ఞతలు.

నేనిలా పుస్తకాలు వెయ్యడానికి గొప్ప ఇన్‌స్పైరింగ్ కారెక్టర్ వాసిరెడ్డి నవీన్ గారు. ఈ సందర్భంలో వారిక్కూడా కృతజ్ఞతలు.

ఈ పుస్తకం ఇంత అందంగా డిజైన్ చేసిన అక్షర సీత గారు. వారికీ కృతజ్ఞతలు.

నమస్కారం.

వంశీ



# వంశీ కథలతో సీరియస్‌గా కాసేపు...

కాసిరెడ్డి సతీష్

**వంశీ**కి సినిమా దర్శకుడుగా బోలెడంత పేరు ప్రఖ్యాతులున్నాయి. మంచి సినిమాలు తీసిన దర్శకుడిగా అఖిలాంధ్ర ప్రేక్షకులకు ఆయన తెలుసు...

గోదావరి అందాలను ఆరబోస్తూ రాసిన పసలపూడి కథలు, దిగువ గోదావరి కథల రచయితగా వంశీ, పత్రికలు చదివే పాఠకులందరికీ తెలుసు.

కోటిపల్లి రైలుమార్గం, గోదావరి ప్రయాణం, హంపీ సౌందర్యం, రైలు ప్రయాణంలో బిచ్చగాళ్ళ ప్రవర్తన వంటి యాత్రా కథనాలను సైతం వంశీ, కళాత్మకంగానూ ఆర్తితోనూ రాయగలడని అవి చదివిన కొద్దిమంది పాఠకులకయినా తెలుసు...

ఆయనకున్న సంగీత పరిజ్ఞానం తక్కువేం కాదని సినీరంగంలో ఉన్నవారికి మాత్రమే తెలుసు... (ఇప్పుడు అందరికీ తెలిసిపోయింది, కొత్త సినిమాలో ఆయన పాడిన పాటలతో.)

ఇలా ఇంకా చాలామందికి చాలా రకాలుగా వంశీ తెలుసు...

కానీ, వంశీకున్న సమాజాన్ని వీక్షించే దృష్టి కోణం గురించి, మానవ సంబంధాల పట్ల ఆర్తిగా స్పందించే గుణం గురించి అతికొద్దిమందికే తెలుసు. ఆ కొద్దిమందికి తెలిసిన లక్షణాలు ఈ కథాసంపుటం ద్వారా అందరికీ తెలిసిపోతాయి...

ఒక్కమాటలో వంశీని సమగ్రంగా దర్శించడానికి ఈ కథాసంపుటం చాలు.

❖

ముప్ఫై ఒక్క కథలు, ఒక నవలిక- ఇదీ ఈ ఆకుపచ్చని జ్ఞాపకం.

వంశీ సినిమాలు ఎంత సరదాగా ఉంటాయో, కథలు అంత సీరియస్‌గా ఉంటాయి.

తనను తాను ఆవిష్కరించుకోవడానికే వంశీ ఈ కథలు రాసినట్లు అనిపిస్తుంది. ఒకటి, రెండు కథల్లో అయితే తన ఫిలాసఫీని నేరుగానే చెప్పుకున్నాడు. తనకు తెలిసిన, తను తిరిగిన ప్రాంతం, వాతావరణం, తన మనుషులు- తనకు తెలిసిన మనుషులు, వారి మధ్య ఉన్న సంబంధ బాంధవ్యాలు, అనురాగాలు-ఆప్యాయతలు, రాగద్వేషాలు, ఇంకా సజీవంగా నిలిచి ఉన్న ప్రేమాభిమానాలు, మూగప్రేమలు-ఆరాధనలు ఈ కథల నిండా పరుచుకుని ఉంటాయి. గ్రామసీమల్లో అనేక కష్టలు కార్పణ్యాల మధ్యన సైతం మనసుతో మాత్రమే కొలవగలిగిన అనుబంధాలు ఈ కథలకు ముడిసరుకు. ఈ ముడిసరుకుతో అద్భుతమైన వర్ణచిత్రాల్లాంటి కథా చిత్రాలను, హృదయంలో హత్తుకుపోయేట్లు రాయగలిగిన కథన శక్తి వంశీకుంది.



'విశాల దృక్పథమే జీవితం, సంకుచితత్వమే మృత్యువు, స్వార్థపరత్వమే సర్వనాశనం- ఇదే జీవిత సత్యం.' బాచీ కథ చివర్లో కథానాయకుడు బాచీ ఉటంకించిన మాటలివి. నిజానికి ఈ మాటలు వంశీ రచనలకు గైడింగ్ ఫోర్స్ లాంటివి.

ఈ కథ, ఇంకా ఆ ఏటిగట్టు మీద, కుమారి దంటు రామసీత వీలునామా కథలు వంశీ జీవన దృక్పథానికి ప్రతీకలు. ప్రత్యేకమైన వ్యక్తిత్వం ఉన్న మనుషులు వంశీని విపరీతంగా ఆకర్షిస్తారు. అలా తనకు తారసపడి ఆకర్షించిన మనుషులను తన కథల్లో రక్తమాంసాలున్న పాత్రలుగా

తీర్చిదిద్దాడు. బాచీ, రామసీతలు ఈ సమాజానికి అంత తేలిగ్గా అర్థం కాని మనుషులు. ఏటి కెదురీదే తత్వమున్నవాళ్ళు. అంతేకాదు, ఏదేమైనా తాము ఇతరులకు ఉపయోగ పడాలనుకునే తెగింపు ఉన్నవాళ్ళు. ఏటి కెదురీదిన బాచీ ఊరినే వెలివేస్తే, రామసీత చావుకు సైతం వెరవలేదు. తెలుగు సాహిత్యంలో ఇప్పటికే ఉన్న మరిచిపోలేని పాత్రల స్థాయి వీటికుంది. ఈ పాత్రలను రూపొందించడంలోనూ, కథ నడిపిన తీరులోనూ వంశీకి తన జీవితం పట్ల ఉన్న అవగాహన, కథన పద్ధతి, రచనా శైలి బాగా ఉపకరించాయి.

వంశీకి రాజకీయాలు అంతగా పట్టవు లేదా తెలియవు. ఈ విషయం ఆయనే ఒకటి రెండు చోట్ల చెప్పుకున్నారు కూడా. అయినా, రెండు మూడు కథల్లో ఆయనకు తెలీకుండానో లేదా మానవ సంబంధాలకు విఘాతం కలిగిన సందర్భాల్లో అనివార్యంగానో రాజీకీయ దృక్పథం తొంగి చూస్తుంది.

రాజహంసలు వెళ్ళిపోయాయి, వంతెన వంటి కథల్లోనూ, సీతారామా లాంచి సర్వీసు... నవలిక లోనూ ఈ లక్షణాలు మనం చూడవచ్చు. ఇవి రాజకీయ దృక్పథాన్ని ప్రకటించడం కోసం రాసిన కథలు కాకపోయినా, అభివృద్ధికి, విధ్వంసానికి మధ్యనున్న వైరుధ్యాన్ని ఎత్తిచూపుతూ విధ్వంసంపట్ల నిరసన వ్యక్తం చేసిన కథలు. ఆ విధ్వంసం ప్రకృతి విధ్వంసం మాత్రమే కాదు, మానవ సంబంధాలు, జీవన సూత్రాల విధ్వంసం కూడా.

గోదావరి అటు ఒక రేవు, ఇటు ఒక రేవు. దాటడానికి ఫంట్‌లు, నావలు. ఈ రెండు రేవుల్లో కోలాహలాన్ని, నిండు గోదారిలా నడిచే జీవనయానాన్నీ, ఆత్మీయానురాగాలను గుండె నిండుగా అనుభవించినవారికే తెలుస్తుంది, ఆ రేవులు అదృశ్యమైతే ప్రాణం ఎంత విలవిల లాడిపోతుందో. యానాం, ఎదుర్లంక బ్రిడ్జి అభివృద్ధిలో భాగమే అయినా బ్రిడ్జి వల్ల నిర్మానుష్యంగా, నిర్జీవంగా మిగిలిపోయిన ఆ రెండు రేవులను చూస్తే ఏదో తెలియని బాధ, వెలితి, ఆక్రోశం వెంటాడతాయి. "అనుభూతి దూరమైపోయిందనీ, ఆ వెన్నెల మరకల్ని చూసుకుంటూ చేసిన గోదావరి ప్రయాణం మళ్ళీ తనకు కనబడకుండా పోయిందనీ, మా తల్లి గోదారిలో ఆ దారి మూతపడిపోయిందనీ, ఆ గాలిలో కలిసి నాకు మాత్రమే వినిపించిన ఒకానొక గంధర్వ గానం శాశ్వతంగా మూగబోయిం"దంటూ రాజహంసలు వెళ్ళిపోయాయి కథ చివర్లో వంశీ పడిన ఆవేదన కేవలం పదాల కూర్పు మాత్రమేనా? గుండెలోతుల్లోంచి చొచ్చుకొచ్చిన ఆక్రందన కాదూ! కథ చదివాక రచయిత కన్నా పాఠకుడే ఆ బాధను ఎక్కువగా అనుభవిస్తాడు. తన బాధలను, సంతోషాలను పాఠకుల్లోకి ప్రవహింప చేయడంలో వంశీ కథన పద్ధతికి ఓ ప్రత్యేకత ఉంది.

వంతెన కథలోనూ అంతే. కట్టుదాటి వెళ్ళబోయిన అమ్మాయిని బల్లకట్టు ముసలోడు రేవు దాటకుండా ఆపగలిగాడు. వంతెన వచ్చాక ఎవరాపగలుగుతారు? వంతెనలు, రోడ్లు, బస్సులు మానవ ప్రగతిలో భాగం. అయితే, వాటి నుండి వచ్చే దుష్ఫలితాలను ఆపగలిగే స్థితికి సామాజిక ప్రగతి స్థాయి ఎదగకపోతే, వచ్చే అనర్థమే వంతెన కథ. వంతెన ప్రతీకగా చెప్పిన ఈ కథ ముగింపు వాక్యాల్లో కథ అర్థం, అంతరార్థం దాగున్నాయి. "ఆ వెన్నెల్లో వంతెన మీద నుంచి వెళ్ళిపోతున్న (ముసలోడి మాటలు, అరుపులు వినకుండా) ఆ అమ్మాయిని, తుప్పు తినేసి ఒడ్డున పారేసి వున్న బల్లకట్టుని మార్చిమార్చి చూసే" ముసిలోడి బాధను పాఠకులు అర్థం చేసుకోగలరు. అది ముసలోడి బాధ మాత్రమే కాదు, సమాజానిది కూడా.



సీతారామా లాంచీ సర్వీస్... నవలిక ఒక మనోహర దృశ్యకావ్యం. గోదావరి అందాలు, మనుషుల ప్రేమలు, చిన్నచిన్న ఆనందాలు, నదిలో హాయిగా సాగిపోయే లాంచీ ప్రయాణం... కథలో ఎక్కడా, విలన్ అనేవాడు ఉండడు. భావాల ఘర్షణ కూడా లేదు. కథ చదువుతున్నంతసేపూ

ఆశ్చర్యం వేసింది, ఏ రకమైన ఘర్షణ కనపడని ఈ కథ ఎలా రక్తి కడుతుంది, ఎలా నిలబడుతుంది అని. కానీ, చివరి రెండు పేజీల్లో విలన్ ఎవరో అర్థమైపోతుంది. అది పోలవరం ఆనకట్ట. బయటివాళ్ళుగా పాపికొండలు లాంటి సుందర దృశ్యాలు మునిగిపోతున్నాయని చాలామంది బాధపడుతున్నారు కానీ, వంశీ బాధ అది మాత్రమే కాదు. టేకూర్లో రవణమ్మ హోటల్ ఏం కావాలి? ఆ రవణమ్మ మీద ప్రేమను పెంచుకున్న సత్తిబాబు ఏం కావాలి? పావలా వడ్డీకి మాత్రమే అప్పులిచ్చి ఆదుకునే మంగరాజేం కావాలి? ప్రియురాలి కోసం మాటి మాటికి బైనాక్యులర్స్‌తో వచ్చేపోయే లాంచీలను పరికించి చూసే కన్నాజీ ఇంకెవరి కోసం చూడాలి? లాంచీ ఓనరు మాణిక్యం, అతని స్టాఫు వీళ్ళందరి నడుమ కలగలిసిపోయిన అను బంధాలూ ప్రేమలూ అపేక్షలూ ఏమైపోవాలి? ఇలా అనురాగాలు పెంచుకున్న వారంతా ఈ ఆనకట్ట వల్ల పుట్టకొకరుగా చెల్లాచెదురైపోతే ఇంకేం మిగులుతుంది? ఇదీ వంశీ ఆవేదన. మనుషుల మధ్య దూరాలు పెరిగిపోయాక జీవితాలు అల్లకల్లోలమైపోయాక ఆ విధ్వంసపు పునాదుల పై జరిగే అభివృద్ధి ఫలాలు ఎవరి కోసం? పాఠకుల గుండెల్ని నేరుగా తాకే నవలిక ఇది. ఒక రకంగా ఇది పాపికొండల భవిష్యత్ చిత్రపటం?

వంశీకి సంగీత పరిజ్ఞానమూ ఉంది. అందుకే కారైకూడి నాగరాజన్, శిల, బాబూరావు మేష్టారు వంటి కథల్లో సంగీత రాగాలు వినబడుతూ ఉంటాయి. సంగీతపు లోతులు తెలియకపోతే ఈ కథలు రాయడం కష్టం. సంగీతంతో పాటు ఈ కథల్లో ప్రకృతినీ భావుకతనూ జోడించి మరింత ఆకర్షణీయంగా మలిచాడు. అయితే శిల కథలో నాటకీయత డామినేట్ చేయడం వల్ల విశ్వసనీయత కొంచెం దెబ్బతిన్నట్లు అనిపిస్తుంది. వంశీ తనకి తెలిసిన విషయాలను, కథా రచన కోసం తను తెలుసుకొన్న విషయాలనూ కథలో భాగంగా అత్యంత నేర్పుతో చొప్పించేస్తాడు. ఈ మూడు కథలూ చదివాక అవి చదివిన ఆనందంతో పాటు సంగీత జ్ఞానం సంపాదించుకున్నామన్న తృప్తీ కలుగుతుంది. కథలు రాయడానికి వంశీ ఎంతో పరిశోధన చేస్తాడు. తనకు తెలిసిన గోదావరి గురించి ఎలా రాయగలడో తన ప్రాంతం కాని అరకు, కిరండోలు గురించీ, తనకు ఏమాత్రం సంబంధం లేని సర్కసు వాళ్ళ జీవితం గురించీ, తను ఎప్పుడూ వెళ్ళని అమెరికా గురించి కూడా అంతే సాధికారికంగా రాయగలడు. పరిశోధనలో లీనమయితే తప్ప ఇది సాధ్యం కాదు.

జీవితాల్లో ప్రేమకున్న స్థానం, విలువ బహుశా వంశీకి తెలిసినంతగా మరెవరికీ తెలియదేమో. ఈ సంపుటంలోని కథలన్నీ మనుషుల మధ్య నెలకొన్న ప్రేమతత్వాన్ని ఉన్నతీకరించేవే. అయితే, స్త్రీ పురుషుల ప్రేమకు సంబంధించిన కథలు కాస్త ఎక్కువ. భాగ్యవతి కథ చదివితే ప్రేమకున్న విలువ తెలుస్తుంది. ఆ కథను చదివిన వాళ్ళు అరకు వెళ్ళే దారిలో చిమిడిపల్లి స్టేషన్‌లో దిగి భాగ్యవతి కోసం కట్టిన గుడి గురించి తప్పకుండా వాకబు చేస్తారు. అలాగే, ఆకుపచ్చని జ్ఞాపకం కథ చదివాక, హైదరాబాదులో సంజీవయ్య పార్కుకు వెళ్ళినప్పుడు పరిమళ కోసమూ వెతుకుతారు. ఇంతకుమించి కథకు సార్థకత ఏముంటుంది! ఇవేకాక, ధారావాహికం, ఒక అనుభవం-ఒక ప్రారంభం, మిస్డ్ కాల్ ఇవన్నీ హాయిగా సాగిపోయి పాఠకులను ఒకింత విషాదంలో ముంచే ప్రేమ కథలు. ఈ కథలు చదివితే, ఆ విఫలమయిన ప్రేమ తమ జీవితం లోదేనేమో అని పాఠకులు తమ జీవితాల్లోకి ఒక్కసారయినా తొంగి చూసుకుంటారు. అదే వంశీ కథనానికున్న శక్తి.



కథకుడిగా తను పొందిన ఉద్వేగాన్ని పాఠకులకు అందించే వరకు నిద్రపోడు. ఒక్కక్షణం కూడా పాఠకుల్ని వదిలిపెట్టకుండా తనతో తీసుకెళ్ళిపోతాడు. అందుకోసం తన భావతీవ్రతను, భావుకతను, వాతావరణాన్ని కలగలిపి కథను రూపొందిస్తాడు. ఉదాహరణకి వంతెన కథ

ప్రారంభంలో గోదావరి వర్ణన చదివాక ఆ కథలో లీనం కాకుండా ఉండడం పాఠకుడి వల్ల కాదు. ఆ వర్ణనలో ఏ చిన్న విషయమూ తన దృష్టి నుంచి తప్పుకు పోలేదు. ఆ చిత్రం మనసులో ముద్రపడిపోతుంది. గోదారితల్లి, వర్ధనరాజుగారి దివాణం, ఒక అనుభవం-ఒక ప్రారంభం కథలను చెప్పిన తీరులోనే ప్రత్యేకత ఉంది. ఏ పాత్రనూ రచయిత తాను నడిపిస్తున్నట్లు ఉండదు. అయినా, అన్ని పాత్రలు తన కోణం నుంచే తను చెప్పినట్లే నడుస్తాయి. వాటితో పాఠకులూ తెలియకుండానే ప్రయాణం చేస్తారు. వంశీకున్న ఈ కథ చెప్పే శక్తి (narrative style) అమోఘం. రచయిత పాఠకుల ఎదురుగా కూర్చొని కథ చెప్తున్నట్లే ఉంటుంది. తన కథలకు ఇదే బలమూ, బలహీనతా కూడా. బలహీనత అని ఎందుకంటున్నానంటే, అంత అద్భుతంగా కథ చెప్పాక చివర్లో ప్రత్యేకత లేని సందర్భాల్లో కథ తేలిపోయి, ఓస్... ఇంతేనా! అని పాఠకుడు అనుకునే ప్రమాదం కూడా ఉంది. అలా కాకుండా ఉంటే ఎంత బావుండేది, **13**వ నెంబరు మైలురాయి వంటి కథలు అలా తేలిపోయినవే.

కథ ప్రారంభించడం, ముగించడంలో వంశీకి తన స్వంత ముద్ర వుంది. ముఖ్యంగా, కథా ప్రారంభం విషయంలో. మొదటి రెండు లైన్లు చదివేసరికి పాఠకుడు కథలో భాగమైపోవల్సిందే. గోదారి తల్లి, వంతెన, ధారావాహికం, ఆకుపచ్చని జ్ఞాపకం, రోడ్ షో కథలు చదివాక, వాటి ప్రారంభాలను మర్చిపోవడం అసాధ్యం. అలాగే వర్ధనరాజుగారి దివాణం, న్యూ గ్రాండ్ సర్కస్ కంపెనీ, ఒక అనుభవం... ఒక ప్రారంభం, భాగ్యవతి, వంతెన వంటి కథల ముగింపులు కూడా. వాటి అద్భుతమైన ముగింపుల వల్లే ఆ కథలకు ప్రాణం వచ్చి పాఠకుల్ని వెంటాడుతూ ఉంటాయి. వంశీ తను రాసే ప్రతీ కథకీ పరిష్కారయుతమైన ముగింపు ఉండాలని కోరుకుంటాడు. అలా అనుకోవడం వల్ల కొన్ని ముగింపులు కథతో సంబంధం లేకుండా అతికించి నట్లు ఉంటాయి. మరికొన్ని కథలు చావుతో ముగిసిపోతాయి. ఆ ఏటిగట్టు మీద, **13**వ నెంబరు మైలురాయి, అలా కాకుండా... వంటి కథలు అలాంటి ముగింపుల వల్ల తేలిపోయాయి. కథకు జీవితంతో సంబంధం ఉన్నప్పుడు సత్వర పరిష్కారంతో కూడిన ముగింపు సాధ్యం కాదు. ఎందుకంటే, జీవితం సరళరేఖ కాదుకదా!

యాత్ర కథలోని థీమ్ అద్భుతమైనది. రకరకాల మనుషులు-మనస్తత్వాలు, భిన్న భావాలు-దృక్పథాలు, వాటి మధ్య సంఘర్షణలతో పూర్తిస్థాయి నవలకు కావలసిన అన్ని హంగులు ఉన్న ఈ థీమ్ కథగా రాయడం వల్ల ఏ పాత్రా పాఠకుడికి సరిగ్గా రూపు కట్టకుండానే, పాఠకుడి మనస్సులో హత్తుకోకుండానే కథ ముగిసిపోతుంది. ఎందుకో హడావుడిగా రాసినట్లు, తొందరపడి ముగించినట్లు ఉంది. ఈ వస్తువుతో ఎప్పటికైనా మంచి నవలను రాయవల సిందిగా వంశీని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను.

ఇన్ని కథలు చదివాక...

మనం చూడని ప్రాంతాలు చూసినట్లు, మనకు తెలియని జీవితాలు తెలిసిపోయినట్లు, అర్థం కాని మానవ హృదయపు లోతులు అర్థమైపోయినట్లు, ఆ పాత్రల జీవితాల్లో మనమూ భాగమై పోయినట్లు అనిపిస్తుంది. మనసు ఆనందంతో తేలిపోతుంది. గుండె బాధతో బరువెక్కుతుంది.

ఇదీ వంశీ కథల ప్రత్యేకత.



22 సెప్టెంబర్ 2010, హైదరాబాద్



పదండి...

# ఆకుపచ్చని జ్ఞాపకాల్లో విహరిద్దాం...


| | | | |
|---|---|---|---|
| 1. | గోదారితల్లి | ... | 14 |
| 2. | భాగ్యవతి | ... | 24 |
| 3. | కారైకుడి నాగరాజన్ | ... | 32 |
| 4. | యాత్ర | ... | 38 |
| 5. | బాచీ | ... | 52 |
| 6. | న్యూ గ్రాండ్ సర్కస్ కంపెనీ | ... | 60 |
| 7. | అలా కాకుండా ఉంటే ఎంత బావుండేది! | ... | 70 |
| 8. | వంతెన | ... | 82 |
| 9. | అలా అన్నాడు శాస్త్రి | ... | 96 |
| 10. | కాబూలోడు | ... | 104 |
| 11. | సీరియల్ రాత్రులు | ... | 114 |
| 12. | 13వ నెంబరు మైలురాయి | ... | 124 |
| 13. | ధారావాహికం | ... | 134 |
| 14. | రోడ్ షో | ... | 142 |
| 15. | ఏకాదశి చంద్రుడు | ... | 150 |
| 16. | ఒక అనుభవం... ఒక ప్రారంభం | ... | 158 |
| 17. | రాజహంసలు వెళ్ళిపోయాయి | ... | 164 |
| 18. | ది ఎండ్ | ... | 172 |
| 19. | ఆకుపచ్చని జ్ఞాపకం | ... | 176 |
| 20. | బొత్తిగా అర్థంకాని మనిషి | ... | 186 |
| 21. | ఆ ఏటిగట్టు మీద | ... | 194 |
| 22. | కుమారి దంటు రామసీత వీలునామా | ... | 204 |
| 23. | శిల | ... | 214 |
| 24. | వర్ధనరాజుగారి దివాణం | ... | 228 |
| 25. | కల | ... | 238 |
| 26. | బాబూరావు మాష్టారు | ... | 244 |
| 27. | అదా విలువ | ... | 252 |
| 28. | ఎర్రశాలువ | ... | 260 |
| 29. | మిస్డ్ కాల్ | ... | 268 |
| 30. | నల్ల సుశీల | ... | 280 |
| 31. | ఆనాటి వానచినుకులు | ... | 288 |
| 32. | సీతారామా లాంచీ సర్వీసు - రాజమండ్రి | ... | 302 |


# గోదారి తల్లి

దీపావళి వెళ్ళిన ఆరో రోజు ఒక మంచి ముహూర్తంలో బయల్దేరింది పెసంగి రామారావు నావ.

దాంట్లో, రామారావుతోపాటు వాళ్ళావిడ గంగాలమ్మా, పదిహేనూ పద్దెనిమిదేళ్ళ కొడుకులు అంజిగాడూ, ఏసూ, పడికట్టు మీద పడుకున్న ముసలితండ్రి కన్నయ్యా వున్నారు. జంధ్యం, నీలం నిక్కరూ తప్ప ఒంటి మీద ఇంకేం లేని రామారావు గెడేస్తుంటే అంజిగాడు చుక్కాని దగ్గరున్నాడు.

నావ లోపలి కొస్తున్న నీళ్ళని డొక్కుతో తోడి గోదాట్లో పోస్తున్నాడు ఏసు. గమేళాలో ఉన్న మట్టిపొయ్యి వెలిగిస్తున్న గంగాలమ్మ నావగూడు మీద పురికొసతో కట్టేసున్న రెండు పందెం పుంజుల్నీ ఇష్టంగా చూస్తుంది.

ఎదురుగాలి ఎక్కువగా వుంది. మలుగుబాము కన్నా అధ్వాన్నంగా వుంది నావ నడక. వాళ్ళమ్మిచ్చిన సీవండి దాకలో మిగిలిన టీ తాగిన ఏసులో హుషారు పెరిగింది. మధ్యాన్నం కూరలోకి చేపలు పడతాయని విసురుగా వేసేడు వల.



చుట్ట అంటించిన కన్నయ్య "నిరుడు కొరుటూరెళ్ళడానికి ఎన్ని రోజులు పట్టిందిరా"అనడిగేడు కొడుకుని.

"ఎనిమిది రోజులు" చెప్పేడు రామారావు.

"ఈ ఏడు ఎన్నాళ్ళు పట్టొచ్చంటావ్?"మళ్ళీ అడిగేడు కన్నయ్య.

"చెప్పలేం," అన్న రామారావు, వూళ్ళో షావుకారు కొండూరు రంగబాబుని బండబూతులు తిట్టేడు.

షావుకారు దగ్గర వచ్చే ఏడాది వడ్డీతో సహా జమ కట్టేలాగ అప్పులు తీసుకుని నావలకి రిపేర్లు గట్టా చేయించుకుని ఈ ఎనిమిది రోజులకి సరిపడా బియ్యం పప్పులూ ఉప్పులూ కిరాణా సామాన్లు కొనుక్కుని పడవకి అయిదారుగురు చప్పున ఒక వంద పడవల జనం బయల్దేరతారు. వాళ్ళు పాపికొండలకి ముందు తగిలే కొరుటూరు, శిరువాక, శివగిరి, టేకూరు లాంటి నది ఒడ్డు గ్రామాలుండే చోట గోదావరి మధ్యలో ఇసక తిప్పల మీద మకాంలు ఉంటారు. ఈ శీతాకాలం, ఎండాకాలం పట్టిన చేపలు అక్కడి వ్యాపారస్తులకమ్మి పొట్ట పోసుకుని మిగిలింది వెనకేసుకుని వర్షాకాలంలో వెనక్కొచ్చి షావుకారుకి కట్టాల్సింది కట్టేస్తారు.

అయితే నిరుడు రాబడి తక్కువయ్యి తక్కువ కట్టేరని ఈ ఏడాది సొమ్ము ఇవ్వను పొమ్మన్నాడా రంగబాబు. 'తండ్రులూ తాతల కాలంనించీ ఈ ఇచ్చిపుచ్చుకోడాల్లో మేమెప్పుడూ ఎగొట్టలేదు బాబియ్యా' అని ఎంత కాళ్ళావేళ్ళా పడ్డా విన్లేదు రంగబాబు. అంతేగాకండా ఇంకో షావుకారయిన యర్రమిల్లి చినభద్రాన్ని ఇవ్వనియ్యకండా జేసేడు.

దీంతో కాస్తోకూస్తో వెనకేసుకున్నోళ్ళు సరే, ఈ పెసంగి రామారావులాంటి బక్కోళ్ళ పరిస్థితి చాలా ఇబ్బందిగా తయారైంది. వెళ్తా వెళ్తా దారిపొడుక్కీ చేపలు పట్టుకుని చీకటి పడేసరికి ఏ రేవు వస్తే ఆ రేవులో వాటిని అమ్ముకుని, వెచ్చాలు తెచ్చుకుని ఆ రాత్రి అక్కడ వండుకు తిని, మర్నాడు బయల్దేరాల్సి వస్తుంది. అందుకే వాళ్ళ బాబు ఈసారి కొరుటూరు వెళ్ళడానికి ఎన్నాళ్ళు పడద్దంటే 'చెప్పలేం' అన్నాడు రామారావు.

ఏసుగాడి వలలో గొరకలూ, గండుమేన్లూ పడ్డాయి. ఇవ్వేళ మంచి డబ్బు అనుకున్న అందర్లోనూ హుషారు పెరిగింది.

ముందుకెళ్తున్న నావ చుక్కానికున్న తెడ్డు విరిగిపోతే ఆత్రేయపురం రేవులో ఆపేసేరు.

"ప్రతి ఏడూ సాయంత్రానికి పేరవరం రేవులో మకాం వేసేవోళ్ళం... ఈ ఏడాది జూడు" అని తిట్టుకుంటా విరిగిన తెడ్డు తండ్రికిస్తే రిపేరు చేయించుకు రావడానికి వూళ్ళో కెళ్ళాడు కన్నయ్య.

అలిసిపోయిన రామారావు అక్కడున్న రాచ ఉసిరి చెట్టు నీడలో పడుకున్నాడు.

పచ్చి పులుసూ గొరకల ఇగురూ వండి మొగుడ్ని లేపింది గంగాలమ్మ.

చేపల్ని వూళ్ళో అమ్మిన ఏసు వంటకి కావల్సిన సామాన్లూ ముసిలోడికి సారా కొనుక్కొచ్చేసరికి సాయంత్రం అయ్యింది.

అక్కడి కొబ్బరితోట యాజమాని రాజుగారు ఎక్కడ్నించొస్తున్నారు, ఇక్కడెందుకాగేరు లాంటి ప్రశ్న లేస్తుంటే అప్పుడే తెడ్డు బాగుచేయించుకొచ్చిన కన్నయ్య "చిత్తవండి..." అంటా వాళ్ళ గురించి చెప్పాడు.

"కోడిపుంజులు భలేగున్నాయి అమ్ముతారేంట్రా?" అడిగేడు రాజుగారు.

"అమ్మవండి.... ఎగువ కెళ్ళేకా పండుగలప్పుడు పందాలేసుకుంటావండి" అన్నాడు కన్నయ్య.

"ఈటికేసే మేతేంటో గానీ చాలా బలంగా వున్నాయి."

"ఇయ్యి మా మనవడు అంజిగాడియ్యండి. ఏవేసి పెంచుతాడో ఆ ఎదవ తత్తుకొడుక్కే తెలవాలండి"అన్నాకా కాసేపు అదీ ఇదీ మాటాడి వెళ్ళిపోయేడు రాజుగారు.

రాత్రి వాళ్ళ బాబు కన్నయ్యతో పాటు తాగిన రామారావుకి బాగా ఎక్కింది. షావుకారు రంగబాబు గుర్తొచ్చేసరికి తెగ తిట్టేసేడు. ఆ వాగుడుకి నిషా ఇంకా బాగా ఎక్కేసేసరికి ఏడ్డం మొదలెట్టాడు.

కొడుకుని అలా చూసిన ముసిలోడు ఒళ్ళో పడుకోబెట్టుకుని ఏడుస్తా ఓదార్చడం మొదలెట్టాడు.

అలా తండ్రీకొడుకులు ఒకళ్ళనొకళ్ళు ఓదార్చుకోడం జూసిన కుర్రోళ్ళు, గంగాలమ్మా చాటుకెళ్ళి నవ్వుకుంటున్నారు.

*

తెల్లారింది.

రాత్రి మిగిలిన పొడన్నమే అందరికీ పెట్టింది గంగాలమ్మ. ఏసూ అంజీ ఒడ్డునేసిన గుడారంలో సామాన్లన్నీ నావలో సర్దేసేక బయల్దేరిందది.

రాత్రి బాగా తాగేసి తెగ మాటాడుకున్న ఆ తండ్రీకొడుకులిప్పుడు ఎడమొకం పెడమొకంగా వున్నారు. వాళ్ళని రాత్రుళ్ళలాగ పగలిలాగా చూడ్డం అలవాటైపోయిన గంగాలమ్మ, పిల్లలూ ఏం మాటాడ్డం లేదు.

రామారావు కాస్సేపూ గంగాలమ్మ కాస్సేపూ గెడేస్తుంటే చుక్కాని దగ్గర కూర్చున్నాడు కన్నయ్య.

లంకల్లో ఇటుక బట్టీలూ, అరటి తోటలూ, మొక్కజొన్న తోటలూ, దోసపాదులూ దాటుకుంటా మధ్య మధ్యలో ఆపుతుంటే ఏసూ అంజీ వంతుల వారీగా వలలేస్తూ చేపలు పడ్తూ సాయంత్రానికి పేరవరం వచ్చి రాత్రికి అక్కడ మకాం వేసేరు.

మూడోరోజు మద్దూరులంకలో వుండి నాలుగోరోజు దవిళేశ్వరం వచ్చేరు. ఇక ఆనకట్ట దాటాలి. నావని నీళ్ళలోంచి నేలమీదకి తీసుకొచ్చి ఎడ్లబండి మీదకి ఎక్కించి ఆనకట్టకి అవతల పక్కకి వదలాలి. ఆవేళ దాటించాల్సినవి చాలా వుండేసరికి సాయంత్రమైపోయింది. రాత్రికి అక్కడే వుండిపోయి వేటలో దొరికిన ఇలసల్ని బేరేజి మీద మార్కెట్లో అమ్ముకుని మర్నాడు పొద్దుటే బయలుదేరి సాయంత్రానికి ఆరికరేవుల వచ్చేరు. ప్రయాణం చాలా తేలిగ్గా సాగుతుంది. గాలి వాళ్ళకి అనుకూలంగా వీస్తుంది. తెరచాప ఎత్తేరు.

సాయంత్రానికి తాడిపూడిలో ఆగాల్సింది ఏకంగా గూటాల దాటుకుంటా పట్టిసీమ దగ్గర కొచ్చేసేరు.

గోదావరి మధ్యలో ఆ పెద్ద ఇసకతిప్ప మీద గోపీచందనం రంగు వేసున్న వీరభద్రస్వామిగుడి, దాని చుట్టూ సీమచింత చెట్లు. దూరంగా సూర్యాస్తమయం అవుతుంది. వీళ్ళకన్నా ముందే బయల్దేరిన పొన్నామండ మంగరాజు నావ ఇసకతిప్ప అంచున కట్టేసుంది. నీలంరంగు ప్లాస్టిక్ కాయితంతో వేసిన గుడారంలో నెలలు నిండి నెప్పుల్తో గిలగిల్లాడిపోతున్న పెళ్ళాం కామేశ్వరిని పడుకోబెట్టి "పురొడొచ్చేలాగుంది నువ్వు లోపలకెళ్ళు" అని ముసలి తల్లిని పంపిన మంగరాజుకి రామారావు నావ చూసేకా ధైర్యమొచ్చింది.





# 18

"నెలలు నిండిన మనిషితో ప్రయాణం ఎలా గట్టేవురా?"మంగరాజు మీద విరుచుకుపడ్డాడు రామారావు.

"ఏం జెయ్యమంటావురా మాయ్యా... ఆ రంగబాబుగాడు అప్పివ్వనన్నాకా తిండిగింజలకి చాలా ఇబ్బం దయిపోయింది. దాంతో అన్నింటికీ ఆ గండిపోశమ్మ తల్లే వుందనుకుని బయల్దేరిపోయేం... ఏం చేద్దాం మాయ్యా... మనిషిని ఊళ్ళోకి తీసుకెళ్దామా?" రామారావు నడిగేడు మంగరాజు.

"వెళితే పోలవరం వెళ్ళాలిగాని ఈ పట్టిసీమ వూళ్ళో హాస్పిటలేం లేదురా" అన్నాడు కన్నయ్య.

"మరైతే ఏం చేద్దాం?" అన్నాడు మంగరాజు.

"ఏం చెయ్యొద్దు. మీ అత్త గంగాలమ్మకి మంత్రసాని పని బాగావచ్చు. పురుడు తను పోస్తది. నువ్వేం ఇదయిపోకు" అన్నాడు రామారావు.

నెప్పుల బాధతో మెలికలు తిరిగిపోతున్న కామేశ్వరి దగ్గరకెళ్ళి కూర్చుంది గంగాలమ్మ. నావ లోపల దాచిన పెట్రోమాక్స్ లైటు వెలిగించేడు కన్నయ్య.

బాధతో గిజగిజా గింజుకుంటుంది కామేశ్వరి. తెల్లవారుఝామయ్యింది. నావ గూటిమీది కోడిపుంజులు ఒకేసారి కూసాయి. కామేశ్వరికి సుఖప్రసవం అయ్యింది. మగకుర్రోడు పుట్టేడు.

బొడ్డుకోసిన గంగాలమ్మ మంగరాజు తల్లి కాచిన వేడినీళ్లతో చంటిబిడ్డని తుడిచి తల్లి పక్కలో పడుకోబెట్టి మాయ తీసుకెళ్ళి గోదాట్లో పారేసింది. ఇదిలా జరుగుతుండగా కన్నయ్య, రామారావు, అంజిగాడు, ఏసూ వల తీసుకుని వేట పన్లో పడ్డారు.

"పచ్చి బాలింత్రాలు ప్రయాణం మంచిదిగాదు. ఇవ్వేళా రేపూ కూడా ఇక్కడే ఉండిపోదారి" అని గంగాలమ్మ అంటే 'సరే' అన్నాడు మంగరాజు.

వేటలో ఆరు పెద్ద పెద్ద బొచ్చులు పడ్డాయి. అమ్మడానికి వూళ్ళో కెళ్తుంటే వాళ్ళ నాపిన గంగాలమ్మ "ఆటిలో ఒకటిక్కడ పెట్టి తక్కినియ్యి పట్టుకెళ్ళండొరే" అంది.

అలాగే అంటా నావ ఎక్కి బయల్దేరుతుంటే కూనవరం వేపెళ్తున్న లాంచీలో జనం ఆ బొచ్చుల్ని గుత్తకి బేరమాడి కొనేసేరు.

పిల్లలుంచిన బొచ్చుని నిప్పుల్లో కాల్చి ఉడికిన మాంసం సీవండి గిన్నెలోకి తీసి ఉల్లిపాయలూ ఎండి మిరపకాయలూ నూరి ఉప్పు, నిమ్మరసం ఆ చేప మాంసంలో కలిపి మధ్యాన్నం అన్నంలో వేస్తే రోజూ కంటే ఎక్కువ అన్నం తినబుద్దయ్యింది రామారావుకి.

సాయంత్రానికి కొరటాల నారాయణ నావ కూడా వచ్చింది. నలుగురు అన్నదమ్ములు వాళ్ళు. ఎవ్వరికీ పెళ్ళిళ్ళవ్వలేదు. ముగ్గురు వేటకెళ్తే కుంటోడయిన నాలుగోవాడు కృష్ణ వంట చేస్తాడు. నావలోంచి దిగిన నారాయణ మాణిక్యం ప్రసవం గురించి విని "ఏంటోరా ప్రతి ఏడూ కలిసిగట్టుగా బయలుదేరేవోళ్ళం. ఈ ఏడాది జూడు ఆ కొండూరి రంగబాబుగాడి వల్ల ఇలాగ చెట్టుకీ పుట్టకీ అయిపోయేం" అన్నాడు.

ఆకాశమంతా నల్లటి మబ్బుల్తో మూసుకుపోయింది. పెద్ద గాలి దుమారం. అంతా జేరి బాలింత్రాలూ పసిగుడ్డూ వున్న గుడారం చుట్టూ చీరలూ దుప్పట్లూ దడి కట్టడం మొదలెట్టేరు.

వర్షం. "కలికాలం గాకపోతే దీపాలమాస ఎళ్ళేకా కూడా వర్షమేంటెహె" తిట్టుకుంటున్నాడు కన్నయ్య.
దబదబా కురుస్తున్న ఆ వర్షంలో అందరి కంటే బాగా తడిసిపోయింది గంగాలమ్మ.

*

తెల్లవారింది.

గంగాలమ్మకి జ్వరమొచ్చింది. మధ్యాన్నానికి చలీ జ్వరం బాగా పెరిగిపోయాయి. అక్కడున్నోళ్ళ దుప్పట్లూ చీరలూ ఎన్ని కప్పినా ఒణికిపోతానే వుంది. వూళ్ళో ఆరెంపీ రంగసాయి డాక్టరు దగ్గరకెళ్ళి చెపితే బిళ్ళలిచ్చేడు.

రెండుమూడు రోజులు గడిచినియ్యి.

కొరటాల నారాయణ నావ ఎగువకెళ్ళిపోయింది.

రామారావు దగ్గరకొచ్చిన పొన్నమండ మంగరాజు "బాలింత్రాల్ని ఏ సదుపాయంలేని ఈ తిప్ప మీదుంచితే ఏ నిమిషంలో ఏం జరుగుద్దో భయంగా వుందిరా మాయ్యా. ఏడోరోజు దాకా పోలవరంలో మకాం వేస్తాంరా... మీరు కూడా వచ్చెయ్యగూడదూ మా గంగాళమ్మత్తని అక్కడ చూపిద్దారి" అన్నాడు.

"ఇక్కడ వైజ్జిగం మొదలెట్టేంగదా ఇప్పుడు డాక్టర్ని మారిస్తే రోగం తిరగబెడద్దేమోరా" అన్నాడు రామారావు.

"అయితే మేం లాగించేస్తాం" అనేసి వాళ్ళ నావని నీళ్ళలోకి తోసి పోలవరం వేపు పోనిచ్చేడు మంగరాజు.

రామారావూ అంజిగాడూ ఏసూ అందరికన్నా ఎక్కువగా ముసలి కన్నయ్యా రాత్రీ పగలనక కష్టపడి పట్టిన చేపలమ్మి ఆ డబ్బుతో రంగసాయి డాక్టరు ఫీజులిచ్చి మందులు కొంటున్నారు. జ్వరం తగ్గినట్టే తగ్గి మళ్ళా తిరగబెడ్తుంది.

ఇక లాభం లేదని పాత పట్టిసీమ వూళ్ళో రంగసాయి డాక్టరు గారింటికి మోసుకొచ్చేరు గంగాలమ్మని.

లోపల పొట్టుపొయ్యి కూరుకుంటున్న రంగసాయిగారి భార్య గిరిబాల బయటికొచ్చి వాళ్ళని చూసి పాత నులక మంచం తెచ్చి అరుగు మీద వాల్చి "మనిషిని దానిమీద పడుకోబెట్టండి" అంది. వూళ్ళో కుంపటి సంపాదించి వెలిగించిన కన్నయ్య గంగాలమ్మ నులక మంచం కింద పెట్టేడు.

ఒక దశలో "నావల్ల గావటం లేదు ఈ మనిషిని రాజమండ్రి తీసుకుపోండ్రా" అని రంగసాయి డాక్టరనే సరికి రామారావు గుండెలు జారిపోయినియ్యి. 'మా యమ్మకి జబ్బు తగ్గితే నా పందెం పుంజుల్లో ఒకదాన్ని కోస్తాం. నీకు కల్లు పోస్తాం' అని గండిపోశమ్మ తల్లికి దణ్ణమెట్టుకున్నాడు అంజిగాడు.

అమ్మోరు అంజిగాడి మాట వింది. దక్కదనుకున్న గంగాలమ్మ లేచి కూర్చుంది.

డాక్టరు ఇంటరుగు మీంచి వీరభద్రస్వామిగుడి తిప్ప మీద మకాం దగ్గరకి తీసుకొచ్చేసేరు గంగాలమ్మని.

అయిదురోజులు గడిచాయి.

గంగాలమ్మ పత్యం పుచ్చుకున్నాకా పట్టిసీమ నించి నావ బయల్దేరింది.





నావ ముందుకెళ్తుంది. గాలిలేక ఒకటే ఉక్కగా వుంది. ప్రవాహం ఆగిపోడంవల్ల నీచు వాసనొస్తుంది నీళ్ళ లోంచి. గోచీ మట్టుకీ పెట్టుకున్న అంజిగాడూ ఏసూ వంతులవారీగా గెడేస్తున్నారు. నావగూటి మీదున్న రెండు కోడిపుంజుల్నీ చూస్తున్న గంగాలమ్మ "నా జబ్బుకోసం మీలో ఒకళ్ళు అమ్మోరికి బలైపోతారా ఇవ్వేళ మట్టి" అంటుంది.

బంగారయ్యపేటా, పోలవరం, పైడిపాకా దాటిన నావ పోచమ్మగండి దగ్గరాగింది. ఒడ్డెక్కితే దారి ఎడాపెడా పాకలున్నాయి. వాటి మధ్యలో సారిక హరిబాబు కిళ్ళీకొట్టూ నాగేశ్వర్రావు కాఫీ హోటలూ బొంగు దుర్గమ్మ అరటిపళ్ళ దుకాణం వున్నాయి. అవి దాటేక పసుపూ ఎరుపూ రంగులేసున్న మహాశక్తి గండిపోశమ్మ తల్లి గుడి. భక్తులు పల్చగా వున్నారావేళ.

ఇంతకాలం తమతో పాటు కల్సున్న ఆ రెండు పందెం పుంజుల్లో ఒకదాని కాలితాడు విప్పుతున్నాడు అంజిగాడు.

"పాపం మనతో పాటు పెరుగుతున్న పుంజుల్రా ఇయ్యీ" అంది గంగాలమ్మ.

"ఈటిని పెంచుతున్నది నేనే గదా... ఇయ్యంటే నాకూ ఇష్టమే, అయితే మా యమ్మకంటే గాదు" అంటా పుంజుని తీసుకెళ్ళిపోయేడు.

బీరు సీసాకాయల్లో పోసి అమ్ముతున్న కల్లు కొన్నాడు అంజిగాడు.

పుంజుని కోసి కల్లుపోసి అమ్మోరికి నైవేద్యం పెట్టుకున్నాకా వండిన ఆ మాంసం అందరికీ పెట్టిందిగానీ తను మాత్రం తిన్లేదు గంగాలమ్మ.

అంతా అయ్యేక బయల్దేరిన నావ ఆ రాత్రికి సింగన్నపల్లి రేవులో ఆగింది.

తెల్లరింది. రాత్రి పైన బాగా కురిసినట్టుంది. నీళ్ళ రంగు మారింది. ఎర్రటి వరదనీరు. దాంతోపాటు లుబ్బలుబ్బలుగా కొట్టుకొస్తున్న నురగ. ఈ నురగనే చాలా ఇష్టంగా తింటదట పొలసచేప. అందువల్లే దాని రుచి పెరుగుద్దంట.

సింగన్నపల్లి రేవులోంచి నావ ఇలా కదిలిందో లేదో పదడుగులెళ్ళేలోపే సూదిగావున్న పెద్ద రాయి అట్టడుగున తగిలి బొక్కపడింది. నీళ్ళతో నిండిపోతుంది నావ. అది చూసి మెరికలా లేచిన ముసలి కన్నయ్య "నావని యమార్జంటుగా తిప్పమీదికి లాగండ్రా" అన్నాడు.

చూస్తే అది కత్తిరోడ్డు. గెడ అందడం లేదు. పిల్లలు రామారావూ నానాకష్టాలూ పడతా దాన్ని ఒడ్డుకి జేర్చేరు.

గోచీ బిగించిన కన్నయ్య ఈ ఏడాది అప్పివ్వని ఆ కొండూరి రంగబాబుగాడ్ని మళ్ళీ తిట్టుకుంటా బొక్కపడిన చోట ఉడికించిన కీలులో ముంచిన కొబ్బరిపీచు దూర్చి రెండుమూడు చెక్కముక్కలు చుట్టూరా దిగ్గొడుతుంటే తనకి రాని ఆ పని చేస్తున్న తండ్రి కేసి రెప్పార్పకండా చూస్తున్నాడు రామారావు.

అదంతా ఎండకి ఆరి వాళ్ళు బయల్దేరడానికి ఆవేళంతా పట్టేసింది.

*

వాడపల్లి రేవులో చింతకాయలు దొరికినియ్యి. వలలో పడిన పాలెపు జల్లల్తో పులుసెడ్తుంది గంగాలమ్మ. కుతకుతా వుడుకుతున్న పులుసు వాసనకి తెగ రెచ్చిపోయేడు కన్నయ్య. ఆ పులుసంటే ప్రాణం ఆ ముసిలోడికి. కొడుకుని పిల్చి "ఏం పడతావో ఏంటో ఎలాగైనా సరే ఈ వేళ నేను సారా తాగాలి" అంటా కూర్చున్నాడు.

తండ్రి మాటకి భయపడతా ఎత్తుగా వున్న ఆ గట్టెక్కిన రామారావుకి కలిసొచ్చిన అదృష్టంలాగ సారాగాడు ఏకంగా రెండు సీసాల తాటి చిగురు దొరికింది. వాటితో రాత్రి మామూలే, తెగ మాటాడుకుంటా నిషా బాగా ఎక్కేక ఏడ్డం, ఒకళ్ళ ఒళ్ళో ఒకళ్ళు పడుకుని ఏడుస్తా ఓదార్చుకోడం మొదలెట్టేరు.

మర్నాడు పిట్లుకొండా కచ్చులూరు దాటుకుంటా వెళ్తుంటే గట్టుకి ఎడం పక్కనున్న టేకూరు కుడిపక్క తాళ్ళూరుకి మధ్యలో ఉన్న ఇసకతిప్పల మీద పెళ్ళి జరుగుతుంది. కపిలేశ్వరపురం కుర్రోడయిన కొరటాల మరిడయ్య కొడుకు బుజ్జిగాడు టేకూరు గిరిజనుల పిల్లయిన బాగేశ్వరమ్మని ప్రేమిస్తే అంతా కల్సి పెళ్ళి చేస్తున్నారు.

రామారావు నావని ఆపిన మరిడయ్య "ఇవ్వాళ్టికిక్కడ ఉండి పోవాలి మీరు. పిల్లల మీద అక్షింతలేసి భోజనాలు చేసి పొద్దున్నే ఎళ్ళురుగాని" అన్నాడు.

"మందు పోస్తానంటేనే నావ దిగుతాం" అన్నాడు ముసలి కన్నయ్య.

"నీలాంటోళ్ళు ఇలాగ పెంట జేస్తారనే పదికాయల అమోనియా సారా సంపాయించేనుగానీ ఇక దిగండి" అన్నాడు మరిడయ్య.

పెళ్లి బాగా జరిగింది. దిగువనించొచ్చినోళ్ళు, ఎగువలో వుండే వాళ్ళూ కలగలిపి తాగడం మొదలెట్టేరా రాత్రి.

మరిడయ్యని దగ్గరికి పిల్చిన కన్నయ్య "ఏరా ఈ ఏడాది ఇక్కడ దిగీ దిగడంతోటే కొడుక్కి పెళ్ళి జేసేవు అంత ఆగలేకపోతున్నాడా మీవోడు?" అన్నాడు.

"ఆగలేక పోడం గాదెహె... ఈడి లవ్వుస్టోరీ మూడేళ్ళనించి జరుగుతా వస్తుంది... నిరుడు వానాకాలం మేం మనూరు బయల్దేరుతున్నప్పుడే పిల్ల తాలూకు కొండోళ్ళు వార్నింగేచ్చేరు" అన్నాడు మరిడయ్య.

"వార్నింగేంట్రోయ్" అడుగుతున్న కన్నయ్యకి పెద్ద గుటకే పడింది.

"వచ్చే ఏడు ఇక్కడ దిగీ దిగుతుండగానే పెళ్ళి చేసెయ్యాలి. లేకపోతే మీ వూరి జనాన్ని ఇక్కడ వేటాడకుండా దిగువకి తోలేస్తాం అని వార్నింగిచ్చేరు... అందుకే వచ్చీ రాడంతోటే ఈ తంతు" అన్న కొరటాల మరిడియ్య, "ఆ రంగబాబుగాడే గనక ఈ ఏడాది అప్పిచ్చి వుంటే ఇంకా బ్రెహ్మాండంగా చేసుండేవోణ్ని పెళ్లి" అన్నాడు.

సీవండి గ్లాసులోది ఒక్క గుక్కలో మింగేసిన కన్నయ్యకి బాగా ఎక్కింది. "ఏంటోరా జన్మ... పుట్టడం పెరగడం పెళ్ళాడ్డం పిల్లల్ని కనడం ముసలరకం వచ్చేకా చావడం... ఆ దిగువ నించి ఈ ఎగువకి వచ్చేం







జాడు అలాగే పుట్టి చావడానికెళ్తున్నాం... బతుకంటే ఏంటో తెల్సా మరిడీ... అదో ప్రయాణం రా..." చాలా ఎక్కువ తాగేసిన ముసలి కన్నయ్య అలా ఏదేదో మాటాడతా ఏం తినకుండానే ఆ ఇసుకలో పడిపోయేసరికి మర్నాడు పొద్దుట్నుంచే విరోచనాలు పట్టుకున్నాయి. జిగట విరోచనాలు. ఒకటీ రెండూగాదు ఏకంగా అవుతానే వున్నాయి. దాంతో చాలా నీరసపడిపోయేడు.

ఇక బయల్దేరదాం అనుకుంటే ముసిలోడి పరిస్థితి ఏమాత్రం బాగోలేదు. వాడిపోయిన కన్నయ్య వేలాడబడి పోతున్నాడు.

టేకూరు వూళ్ళోకి తీసుకెళ్దామంటే అక్కడుండే ఆరెంపీ డాక్టరు పూడిపల్లి వెళ్ళేడంట.

"కొండమొదలు వెళితే డాక్టరుంటాడుగానీ బాగా టైము పడద్ది గదా?" అన్నాడు మరిడయ్య కొడుకు బుజ్జి.

"శివగిరిలో గంగారావు డాక్టరుగారున్నాడు గదా, మనిషి నెక్కించి గెడెయ్యి తొరగా" అన్నాడు మరిడయ్య.

నావలో వెల్లకిలా పడుకున్న ముసలి కన్నయ్య గుడ్లు తేలేసేస్తున్నాడు. వాడ్ని చూసిన గంగాలమ్మ తెగ కంగారు పడి పోతుంది. రామారావూ అంజీ ఏసూ వంతులవారీగా వేస్తున్నారు గెడ. వాలుగాలి వాళ్ళకి బాగానే సాయం చేస్తుంది.

చిన్నప్పుడే రామారావుని కన్నతల్లి కాలం చేస్తే పెంచి పెద్ద చేసిన కన్నయ్య, గోదాట్లో చేపల వేట మీద చాలా పట్టున్న కన్నయ్య, ఎలాంటి నావనైనా పడవనైనా బాగు చెయ్యగల కన్నయ్య, వలలు నెయ్యడంలో తనదో ప్రత్యేకమైన బాణీ గల కన్నయ్య ప్రాణాలు శివగిరి చేరే లోపలే పోయాయి. కన్నయ్య కాలం చేశాడు.

ఆ మనిషినే చూస్తా అంతా ఏడుస్తుంటే పైకెళ్తున్న ఇంకో రెండు నావల మీద కర్రి ప్రసాదు కుటుంబంలో జనం దిగేరు.

అంతా కల్సి గోదారిమాత ఒడిలోనే పెసంగి కన్నయ్య కట్టెని దహన పరిచేరు.

*


అలాగ ఎన్నో రోజులు అష్టకష్టాలూ పడి వాళ్ళు చేరాల్సిన పాపికొండల ముందు గోదావరి నడిమధ్యలో వుండే ఇసక తిప్పల మీదకి చేరుకున్నారు. అప్పటికే చాలా కుటుంబాలవాళ్లు దిగిపోయి పాకలేసేసుకున్నారు.

వాళ్ళిలాగ చేరుకున్నారో లేదో ఎడం పక్కనున్న కొరుటూరు రేవు గట్టుమీద అయిదు ఖాళీ లారీలు వరసగా ఆగి వున్నాయి. ముందున్న లారీలోంచి దిగిన షావుకారు కొండూరి రంగబాబు అందరికీ నమస్కారం పెట్టి మాటాడ్డం మొదలెట్టేడు.

ఏడేళ్ళ తర్వాత సడన్‌గా వచ్చినియ్యంట సర్పంచి ఎలక్షన్లు. వూళ్ళో వున్న చాలా పెద్దోళ్ళకి అపోజిట్‌గా పోటీ చేస్తున్నాడంట. "మీరు నా మనుషులని మిమ్మల్నే నమ్ముకుని చేస్తున్నాను. ఇంతకు మునుపు నా వల్ల తప్పులేవన్నా జరిగితే క్షమించండి" అంటా అంతా కరిగిపోయేలాగ చాలాసేపు మాటాడి, "మీరు లేకపోతే నేనెక్కడ జెప్పండి... మీరు ఓట్లెయ్యకపోతే నేను నెగ్గుతానా జెప్పండి... అంతా నావల్ని ఒడ్డున కట్టేసి లారీల్లో ఎక్కండి. మీకోసం సారా పేకెట్లు తెచ్చేను, పలావు పేకెట్లు తెచ్చాను. మనూరెళ్లే లోపల దారి పొడుక్కీ మీకు వైభోగమే... తిరిగొచ్చేటప్పుడు రొక్కం ఎంత కావాలంటే అంత పట్టుకెళ్ళండి" అంటా వీళ్ళకి ముందు ముందు తను చెయ్యబోయే సేవల గురించి ఉపకారాల గురించి చెపుతున్నాడు.


వింటున్న జనం "పోన్లేద్దు షావుకారు పాపం కుర్రోడు తింగరితనంతో తెలీక ఏదో జేసేడు. ఆరోజుల్లో ఈరి తండ్రిగారూ తాతగారూ మనకెంత సాయం చేసేవోరనీ" అంటా ఆ పాతకాలాన్ని గుర్తు చేసుకుంటున్నారు జనం.

స్వాతి సచిత్రవారపత్రిక









# భాగ్యవతి

అసలు దరిశనమ్మ అంటే ఎవరో తెల్సా?

దండకారణ్యంలోనూ, దాని మధ్యలో ఉండే లోయల్లోనూ వెన్నెల రాత్రుళ్ళలో మాత్రమే కల తిరుగుతూ ఎవ్వరికీ ఎప్పటికీ దర్శనం ఇవ్వని వాళ్ళ దేవత. ఒక శక్తి.

అలాంటి ఆ ఆదిశక్తి అప్పుడప్పుడూ కొండోళ్ళ భాగ్యవతి మీద పూనుతుంది. శక్తి అలా పూనినప్పుడు తెరిచిన రెప్ప మరి ముయ్యకండా ఉండిపోతుంది భాగ్యవతి. ఆమె చూపుని బట్టి, ఆ గుడ్లు తేలెయ్యడాన్ని బట్టి వెంటనే అర్థం చేసుకునే అక్కడి జనం వెంటనే గుగ్గిలం పొగేసి పూజలు మొదలెడ్తారు.

పదహారేళ్ళ భాగ్యవతి పొడుగు, నలుపు. పెద్ద పెద్ద కళ్ళతో నవ్వుతా చూస్తుంది తప్ప మాట్లాడదు. ఎప్పుడైనా నోరు విప్పితే ఒరియా కలిసిన తెలుగు ముక్కలు రెండు అంతే. చిమిడిపల్లి రైల్వేస్టేషన్లో పాయింట్‌మెన్‌గా పని చేస్తున్న బొజ్జన్న అనే ఏభై అయిదేళ్ళ వాళ్ళ మాయ్య ఇంట్లో ఉంటుంది భాగ్యవతి. రైల్వేక్వార్టర్స్‌కి బాగా దూరంగా ఉండే చిమిడిపల్లి ఊళ్ళోకి ఎప్పుడైనా వెళితే ఎదురైన వాళ్ళు వాళ్ళ పాకల్లోకి తీసుకెళ్ళి ఇంట్లో ఏముంటే అది పెడతారు.



వాటిని తింటూ ఆ ప్రాంతంలో పెరిగే పనసచెట్ల వెనక చందమామలాగ నవ్వుతుంది. కాస్సేపయ్యేకా నవ్వుతానే వెళ్ళిపోతుంది.

భాగ్యవతి వయసు పద్దెనిమిదేళ్ళు దాటింది.

ఆ వూరిలో కుర్రోళ్ళుగాని ఆ కొండల మధ్య వుండే తతిమా వూళ్ళవాళ్ళుగానీ భాగ్యవతిని పెళ్ళి చేసుకోడానికి ముందుకు రావడం లేదు సరిగదా భయపడ్తూ "మహాపాపం. అసలమ్మోరికి పెళ్ళేంటి... ఆ దేవతకి పెళ్ళేంటి?" అంటున్నారు.

*

ఒంటి మీద చెయ్యేస్తే డాగు పడిపోద్దా అన్నంత తెల్లగా లేతగా నవనవలాడతా వుండే అతని పేరు సుభాష్. సూర్యోదయానికి ముందు విశాఖపట్నంలో అతనెక్కిన కిరండోలు పాసింజరు మల్లివీడూ, శృంగవరపు కోటా, బొడ్డవరా దాటి దండకారణ్యంలో కెళ్తుంది. కొండల్ని దొల్చిన గుహల్ని దాటుకుంటూ శివలింగపురం, తైడ స్టేషన్లు దాటేక కీకారణ్యంలో కొండల మధ్యున్న చిమిడిపల్లి స్టేషన్లో ఆగేసరికి పగలు పన్నెండయ్యింది.

ఆగిన రైలెళ్ళి పోయాకా చుట్టూ చూశాడు సుభాష్. చాలా చిన్న స్టేషనది. రైల్వేట్రాక్కి ఎడంవేపు కొండలున్నాయి. కుడివేపు లోతుల్లో రైల్వేక్వార్టర్సు. అక్కడ్నించెక్కడికెళ్ళాలన్నా రైలుమార్గం తప్ప మరో దారి లేదు. ఎలాంటి శబ్ద కాలుష్యం, వాయు కాలుష్యం లేని ప్రాంతం. పుష్కలంగా పారుతున్నాయి నీళ్ళు, ఆగకండా వీస్తున్నాయి కొండగాలులు. ఎదురొచ్చిన పన్నెండుమంది స్టాఫూ తనకి స్వాగతం చెప్పారు. "అరకులోయకి దగ్గర్లో ఉంటుందీ ఊరు అంటే కామోసనుకున్నాను ఇలాగుందేంటి?" అన్నాడు సుభాష్.

"ఇలాగే ఉంటుంది గాబట్టి ఇలాగే ఉంది" అన్నాడు డ్యూటీలో ఉన్న ఏఎస్సెమ్. అతని పేరు సలామ్.

"ఇక్కడ ఎంటర్టైన్మెంట్ కావాలంటే ఎలాగండీ?" అడిగాడు సుభాష్.

"ఇక్కడేం వుండదు. రోజుకోసారి ఆగే పాసింజరో గూడ్సో పట్టుకుని ఎస్.కోటగానీ అరకుగానీ వెళ్ళాలి" అన్నాడు మణికంఠన్ అనే తమిళ ఎస్సెమ్.

"ఇక్కడంతా ఫ్యామిలీస్‌తోనే ఉంటారా?" అన్నాడు సుభాష్.

"మేమిక్కడ బేచిలర్స్‌గా ఉంటూ వండుకుంటున్నాం. మా భార్యాపిల్లలూ వైజాగ్‌లో" అన్నాడు మణికంఠన్.

"ఎందుకలా?"

"పిల్లల ఎడ్యుకేషన్ కోసం... పైగా మగవాళ్ళం మనకంటే తప్పదు. ఆడాళ్ళు ఈ అడవుల్లో ఎలాగుండ గలరు పాపం. అన్నట్టు మీకు పెళ్ళయ్యిందా?" అడిగాడు మణికంఠన్.

"లేదు గానీ.... ఈ అరణ్యంలో ఎలా ఉండగలుగుతున్నారండీ మీరంతా?" చాలా ఇబ్బందిగా అన్నాడు సుభాష్.

# 27

అతని చుట్టూ మూగిన జనం మధ్యలో నవ్వు వినిపించింది. ఎవరా అని చూస్తే బొజ్జన్న నవ్వుతానే అన్నాడు "ఎక్కడో అరవదేశం నించొచ్చిన ఈ మేష్టారుగారుండగా మీరేంటీ బాబుగారూ భయపడ్తారూ" అని సుభాష్‌కి ధైర్యం చెప్పి తక్కిన టి.పీ.ల సాయంతో అతని సామానంతా మోసుకెళ్ళి సుభాష్ క్వార్టర్స్‌లో పెట్టాడు.

స్నానం చేసొచ్చిన సుభాష్ ముందు నిలబడ్డ బొజ్జన్న "అన్ని సామాన్లూ సదిరేశాం బాబూ. ఈ పెట్టె ఎక్కడ పెట్టాలో చెప్పండి" అంటా ఒక చెక్క పెట్టె చూపించాడు.

ఆ పెట్టె దగ్గరకెళ్ళి తలుపు తీస్తే హార్మోనియం వుంది లోపల. "దీన్ని ఈ హాల్లోనే పెట్టు" అంటుండగా లోపలికొచ్చిన ఒక మనిషి "సార్ నా పేరు పట్నాయక్. కింద నించి బియ్యం పప్పులూ ఉప్పులూ కూరలూ నారలూ తెచ్చి అమ్ముతుంటాను. మీకేమైనా కావాలేమో అని అడగడానికొచ్చాను. నా కేంటీన్ స్టేషను పక్కనే. పొద్దుటే ఒక టిఫినూ, రోజంతా టీ మీకిచ్చీగల్ను" అన్నాడు.

*

డ్యూటీలో జాయినయిన సుభాష్‌కి ఆ ఎనిమిది గంటలూ ఇట్టే గడిచిపోతుంది. ఆ తర్వాతే మొదలౌతుంది బెంగ. టిఫినూ టీలూ పట్నాయిక్ కేంటిన్లో పర్లేదుగానీ, భోజనం దగ్గర వచ్చి పడ్తుంది సమస్య. పట్నాయక్ పెట్టే ఒరియా భోజనంలో బంగాళాదుంపల కూర ఉప్పు కారం లేకుండా పసుపు వాసనేస్తుంది. ఇది కాదనుకుని బేచిలర్స్‌గా వుంటూ వండుకుంటున్న తక్కిన వాళ్ళలో చేరాడు. కానీ, ఒకరోజు ఆ అడివిలో పెరిగే చిన్న చిన్న ఈత చెట్ల మొదళ్ళు తవ్వితే వేళ్ళల్లో ఉండే తెల్లటి బొడ్డెం పురుగులు వేపుడు చేశారు వాళ్ళు. అది చూసిన తనకి వాంతొచ్చింది.

ఇక లాభం లేదని బొజ్జన్నని బతిమాలి ఎస్.కోట పంపించి స్టౌ, కిర్సనాయిలూ. అల్యూమినియం సామాన్లూ, పప్పులూ, బియ్యం, నెయ్యి, కూరలూ తెప్పించుకుని వంట చెయ్యడం మొదలెట్టాడు. కానీ, తనకి వంట రాదే. సాయం చెయ్యడానిగ్గానీ, పని చెయ్యడానికిగానీ అక్కడి గిరిజనులెవ్వరూ రారు. అతని అవస్థ చూసిన బొజ్జన్న వాళ్ళ భాగ్యవతిని తీసుకొచ్చి సుభాష్‌కి సాయంగా వుండమన్నాడు.

గది సరిగ్గా ఊడవడం లేదనీ పక్క సరిగ్గా సర్దడం లేదనీ విసుక్కుంటున్నాడు. వంట చేసేప్పుడు పప్పుచారులో గరిటె సరిగ్గా తిప్పడం లేదనీ, వంకాయవేపుడు మాడబెట్టిందనీ కసురుకుంటున్నాడు భాగ్యవతి మీద. అంతా వింటూ కూడా తన్ని కాదన్నట్టుగా నవ్వుతా తన కొచ్చిన పని తను చేసుకుంటా పోతుంది భాగ్యవతి. అక్కడ బాగా దొరికే దేశాలకోడి అనే ఒక రకం కోడిమాంసంతో వండి బలేగుంది రుచి అనిపించుకుంది సుభాష్‌తో.

*



# 28

పగలు పన్నెండు గంటల ప్రాంతంలో ఆగిన గూడ్సుబండిలో గార్డుగారు పేపరుచుట్ట ప్లాట్‌ఫారం మీద విసిరితే అంతా తలో పేజీ లాక్కుంటున్నారు. ఇంతలో అరకుసైడ్‌నించొచ్చి ఆగిన పుష్‌ట్రాలీలోంచి దిగిన రైల్వే ఉద్యోగి జీతాలిచ్చి వెళ్తుంటే "సార్ సబ్బులూ పేస్టులూ కొనుక్కోవాలి" అన్నాడు సుభాష్.

"ఇక్కడ్నించి రైలు పట్టాలమీద ఎడం పక్కకి నడుచుకుంటూ పన్నెండు కిలోమీటర్లెళ్లితే త్రైడ అనే వూరు వస్తుంది. కుడి పక్క పదకుండు కిలోమీటర్లెళ్ళితే బొర్రా గ్రామం వస్తుంది, బయల్దేరండి" అన్నాడా రైల్వే ఎంప్లాయి.

"మీ ట్రాలీలో వస్తానండి ప్లీజ్" అన్నాడు సుభాష్.

కుదరదని కరాకండీగా చెప్పేస్తున్నాడతను.

చూస్తున్న భాగ్యవతి మనసు అదోలాగయిపోయింది. అతని దగ్గరకెళ్ళి "పదండి బాబుగారూ మీకు తోడొస్తాను?" అంది.

పట్టాల మీద ముందు భాగ్యవతి వెనకాల తను. అలా  నడుచుకుంటూ బొర్రాస్టేషన్లోంచి వూరి జంక్షన్లో ఉన్న ఎస్టీడీబూత్ కెళ్ళి రెండు కాల్స్ మాటాడుకున్నాక కావాల్సిన సామాన్లు కొనుక్కున్నాక మరి పదమన్నాడు.

బొర్రా స్టేషన్ ఎడం పక్కన ఉన్న టన్నెల్లో కెళ్ళేసరికి కటిక చీకటి. ఆ చీకట్లో నడుస్తూ భయంగా భాగ్యవతి చెయ్యి పట్టుకున్నాడు. పట్టాల కింద నల్లటి చిన్న కంకర్రాళ్ళు. జాగ్రత్తగా అతన్ని  నడిపిస్తూ  ముందుకు తీసు కెళ్తుంది భాగ్యవతి.

అలా ఆ చీకట్లో చాలా దూరం నడిచారు.

టన్నెల్లోంచి బయటికొచ్చేసరికి ఆ అడివిలో చంద్రోదయమైంది. ఆ వేళ కార్తీక పౌర్ణమి. చలి గాలి వీస్తుంది. భాగ్యవతి కూడా తెచ్చుకున్న కంబళిని అతనిక్కూడా కప్పింది. ఒకే రగ్గు కప్పుకుని ఇద్దరూ నడుస్తున్నారు. ముందుకి ఇంకా ముందుకి నడుస్తూ టన్నెల్లోంచి బయటికొచ్చేసరికి వెండి వెన్నెల చంద్రుడు ఆ దండకారణ్యంలో కొత్తగా మెరుస్తున్నాడు.

*

ఎప్పుడూ పొడిపొడి ముక్కలు మాటాడే భాగ్యవతి ఇప్పుడు కథలు చెప్తుంది. ఒక్క సుభాష్ దగ్గర మాత్రమే. అదీ అతను ఒంటరిగా వున్నప్పుడే.

పొద్మా అనే నిండు గర్భిణి అడివిలోకి పుల్లలకోసం వెళ్తే వాటిని ఏరుకునేప్పుడు ప్రసవం అయ్యిందట. సాయంత్రం తిరిగొస్తున్న ఆమె నెత్తి మీద పుల్లల మోపుందట. ఒళ్ళో చంటోడున్నాడంట.

ఎప్పుడూ కొండల్లో అడివి లోపల తిరిగే చిరతపులొకటి ఈ మధ్య బయటకూడా తిరుగుతా దొరికిన మనిషిని దొరికినట్టుగా కొరికి నమిలి మింగేస్తుందంట. నిజానికది సాధు జంతువంట. దానిది ఆకలి గాదంట, పగ. ఈమధ్య తను కన్న రెండు పిల్లల్నీ ఎవడో పట్టుకెళ్ళిపోయేడు. ఏం జేసేడో ఏంటో. వాత్సల్యం మనిషిలోనూ

మృగంలోనూ ఒకటే గదా! తన పిల్లల కోసం వెతుకుతా అవి దొరక్కపోయేసరికి దొరికిన మనిషిని దొరికినట్టుగా చంపి నమిలేస్తుంది.

దిగువలో కాశీపట్నంలో వుండే హరిబొందు అనే కొండవాడికి ఆరుగురు భార్యలంట. చిత్రమేంటంటే వాళ్ళంతా ఒక తల్లికి పుట్టినోళ్ళే. ఇలా ఆ అడవుల్లో, లోయల్లో జరిగినవి చెపుతా వుంది. 'బాబుగారూ బాబుగారూ' అంటా అతని కూడా తిరుగుతా అతనికి అన్ని విధాలా సాయం చేస్తుంది. అతను హార్మోనియం మీద పాడే పాటలు హాయిగా వింటుంది. అతని ఆలోచనల్ని పంచుకుంటుంది. కీకారణ్యం మధ్యలో అతన్ది ఒంటరి జీవితం అన్న విషయం మర్చిపోయేలా చేస్తుంది.

*

సుభాష్‌కి జ్వరమొచ్చింది మామూలు జ్వరం కాదు. ఎన్ని దుప్పట్లు కప్పినా ఆగడం లేదు చలి. గజగజా ఒణికిపోతున్నాడు. తలనొప్పి అంటూ తల పట్టేసుకుని మెలి తిరిగిపోతున్నాడు. ఇంకో పక్క వాంతులవుతున్నాయి. అతని పరిస్థితి చూసిన స్టేషన్లో స్టాఫంతా కంగారు పడిపోయి అరకు ఫోన్ చేస్తే కంట్రోలర్ పర్మిషన్‌తో వచ్చిన డాక్టరు మలేరియా అని తేల్చి, గుప్పెడు మాత్రలలిచ్చి వాటిలో క్లోరోక్విన్ రెండు పూటలా రెండేసి మాత్రలు వెయ్యమన్నాడు. పేరాసిటమాల్ మూడు పూటలా మూడు మాత్రలు చొప్పున వెయ్యమన్నాడు. నుదుటి మీద చల్లటిగుడ్డ పెట్టమన్నాడు. ఇంతలో మబ్బులు బాగా మూసుకుపోతూ గాలులు విపరీతంగా వీయడంతో త్రైడ నించొస్తున్న పి.డబ్ల్యు.డి. గారి మోటార్ ట్రాలీ ఎక్కి అరకెళ్ళిపోయాడు.

తుఫానంట. మామూలు తుఫానుకాదు, పెనుతుఫాను. స్టేషన్‌కి ఫర్లాంగు దూరంలోవున్న ట్రాక్ కింద లైనుని కోరేస్తుంది కొండవాగు. వీస్తున్న పెనుగాలులకి బ్రిటీషర్స్ కాలంనాటి టేకు చెట్లూ వూడలేసిన మామిడి చెట్లూ నేల కూలుతున్నాయి. ట్రాక్షన్ స్తంభాలు పడిపోతున్నాయి. సిగ్నల్ బాక్సులు కొట్టుకుపోతున్నాయి. ఎప్పుడూ తెల్లటి బండరాళ్ళ మధ్య సనసన్నగా ప్రవహించే గోస్తనీ నది బాగా నిండిపోయి ఉధృతంగా ప్రవహిస్తుందిప్పుడు. వర్షం తెరిప్పడం లేదెక్కడా. రైళ్ళ రాకపోకలెప్పుడో ఆగిపోడంతో ఈ చిమిడిపల్లి స్టేషన్లో జనానికి బయటి ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. ఈ తుఫానుకి ఎవళ్ళ అవస్థల్లో వాళ్ళుండటంతో సుభాష్ నెవరూ పట్టించుకోడం లేదు.

అతని మంచం దగ్గరే కనిపెట్టుకునున్న భాగ్యవతి ఆ డాక్టరు చెప్పినట్టు మాత్రలేస్తుంది. ఆరారా నుదుటిమీద గుడ్డ మారుస్తుంది. జ్వరం ఇలా తగ్గినట్టే తగ్గి మళ్ళీ తీవ్రరూపం దాలుస్తుంది. ఇక రాత్రనకా పగలనకా ఒకటే వర్షం, ఒకటే గాలి. రెండ్రోజులైనా తగ్గలేదు తుఫాను. నీరసంగా కళ్ళు తెరిచాడు సుభాష్.

డాక్టరు చెప్పిన ప్రకారం అతనికి బ్రెడ్డు పెట్టాలి, పాలు ఇవ్వాలి. కొండ దిగి ఏడు కిలోమీటర్లు అడివిలో నడిస్తే వచ్చే కాశీపట్నంలో తప్ప ఇక్కడ దొరకవు పాలు.





"ఏం చేద్దాం?"అంది గుమ్మం దగ్గర కూర్చున్న బొజ్జన్నతో.

"ఈ తుఫానులో నేను దిగలేనా కొండ, కీళ్ళ నొప్పులు" అన్నాడు బొజ్జన్న.

"అయితే బాబుగార్ని కనిపెట్టుకు నుండు" అని బొజ్జన్న ఎంత వద్దన్నా వినకండా చెంబు తీసుకుని బయల్దేరింది.

ఇలా పదడుగులేసిందో లేదో చేతిలో గొడుగెగిరిపోయింది. క్షణాల్లో తడిసి ముద్దయిపోయిన భాగ్యవతి వూపేస్తున్న ఆ గాలులకి పడతా లేస్తా జారతా ఆ కొండ మీంచి కిందకి దొర్లుకుంటా నానా అవస్థలూ పడతా కాశీ పట్నం వెళ్ళింది.

వెతగ్గా వెతగ్గా ఓడియ్య అనే వాడింట్లో రెండు పాలిచ్చే మేకలున్నాయి. నాకిప్పుడు సారా తెచ్చిస్తే తప్ప పాలు పితకలేనని గుడిశలో మూల పడుకున్నాడు వాడు. వాడ్ని బతిమాలి బామాలి కూడా తెచ్చుకున్న ఆ చెంబుడు పాలు పితికించుకుని తిరిగి స్టేషన్లో కొచ్చేసరికి మధ్యాహ్నం దాటేసింది.

"నీ కోసమే చూస్తున్నాను, అలా చూడు నీ బాబుగారేం జేసేడో" అంటా గుడ్డతో ముక్కు మూసుకు నిలబడ్డాడు బొజ్జన్న.

సుభాష్‌కు మలమూత్రాలు బట్టల్లోనే అయిపోయినియ్య.

అతని వంటి మీద బట్టలన్నీ తీసేసి ఒళ్ళంతా శుభ్రం చేసి వేడినీటి గుడ్డతో శిరస్సు నించి సిరిపాదం దాకా తుడిచి మళ్ళీ పక్కేసి వేడి వేడి పాలు తాగించి పడుకోబెట్టింది.

# 31

పన్నెండు గంటలకోసారి పెరిగిపోతున్న జ్వరం నూటనాలుగు డిగ్రీల దాకా వచ్చేస్తుంది. ఏమాత్రం కంగారు పడకుండా టాబ్లెట్లేస్తూ రాత్రనక పగలనక కష్టపడ్తున్న భాగ్యవతి శ్రమ ఫలించింది. సుభాష్ జ్వరం తగ్గింది. తుఫాను కూడా తగ్గింది. మళ్ళీ రైళ్ళు నడుస్తున్నాయి.

కానీ,

ఇన్ని అష్టకష్టాలూ పడ్డ భాగ్యవతికి మలేరియా దాంట్లోంచి కామెర్లు కూడా వచ్చి మంచాన పడిపోయింది.

కొన్నాళ్ళకి కోలుకుని స్టేషన్‌కొచ్చి చూసిన ఆమెకి సుభాష్ కనపడలేదు.

"బాబుగారెక్కడా" అని అడిగితే వాళ్ళవాళ్ళొచ్చి తీసుకెళ్లారంట. భాగ్యవతి అడిగితే వచ్చేస్తానని చెప్పండని రైలెక్కాడంట సుభాష్.

జ్వరం తగ్గి ప్లాట్‌ఫారం మీదకొచ్చిన భాగ్యవతి అప్పుడే ఆగిన కిరండోలు పాసింజరంతా వెతికింది. రాలేదు సుభాష్.

ప్లాట్‌ఫారం మీద కూర్చుని రెప్పార్పకుండా సుభాష్ కోసం చూడ్డం మొదలెట్టేసరికి, అది గమనించిన వూరి జనం "ఇదివరకైతే దరిశనమ్మతల్లి పూనబోయే ముందే రెప్పార్పకుండా చూసేది భాగ్యవతి. ఇప్పుడు రెప్ప ముయ్యడం మానేసిందంటే అమ్మోరు శాశ్వితంగా భాగ్యవతిని ఆవహించేసిందన్నమాట" అని గుగ్గిలం పొగేసి పూజలూ ప్రార్థనలూ మొదలెట్టారా ప్లాట్‌ఫారంమ్మీదే.

ఎవరేం చేస్తున్నా పట్టించుకోని భాగ్యవతి చూపులు ప్లాట్‌ఫారమ్మీద ఆ రైలు రాబోయే వైపే. ఆమె ధ్యాసంతా ఇక దిగబోయే తన బాబుగారయిన ఆ సుభాష్ మీదే.

చాలా ఏళ్ళు గడిచిపోయాయి.

చిమిడిపల్లి ప్లాట్‌ఫారం చివర గుడి కట్టేశారు. ఆ గుడిలో భాగ్యవతి ఆగబోయే రైల్లో దిగబోయే తన బాబుగారి కోసం ఎదురు చూస్తానే వుందింకా.

*స్వాతి సపరివారపత్రిక*
*23 ఫిబ్రవరి 2007*







# కారైకుడి నాగరాజన్

దేన్నైతే మర్చిపోయి బతకాలనుకుంటున్నాడో అదే తన చుట్టూ అల్లుకుని క్షణం క్షణం తనని బలంగా కౌగిలించుకుని, తడి పెదవుల్తో ముద్దాడుతూ మరీ తనకి జీవితం ఇవ్వడం జరుగుతుంది. చివరికి తన స్థితి ఎలా వచ్చిందంటే దాని జ్ఞాపకంలో క్షణం కూడా బతకలేడు. కానీ, అది తనతో లేకపోతే అసలు బతుకే లేదు.

మూడు దశాబ్దాల క్రితం గొప్ప నాగస్వర విద్వాంసుడుగా పేరు గడించి చచ్చిపోయాడు కారైకుడి వైద్యవిద్వాన్. బతకలేక చావలేక ప్రతిదినం చచ్చి బతుకుతున్న నాగరాజన్ అతని కొడుకు.





నాగరాజన్ వాళ్ళ నాన్న కంటే గొప్ప విద్వాంసుడంటారు. అయితే అతను వాళ్ళ నాన్నలా కచేరీలకి, త్యాగరాజ ఆరాధనోత్సవా లకీ వెళ్లకుండా భార్య సలహా మీద సినిమా ఆర్కెస్ట్రాల్లో వాయిస్తూ సంపాదిస్తున్నాడు. ఏ పాటకి నాగస్వరం అవసరం అయినా నాగ రాజన్నే పిలుస్తారు మ్యూజిక్‌డైరెక్టర్లు. మద్రాసులో తమిళం, తెలుగు, కన్నడం, మలయాళం భాషల పాటలు రికార్డింగులూ, రీ-రికార్డిం గులూ నిత్యం జరుగుతూనే వుంటాయి. చాలా ఇన్‌స్ట్రుమెంట్స్ తాలూకు టోన్స్ కీ బోర్డులో వచ్చేస్తున్నాయి. నాగస్వరం కూడా కీ బోర్డులో వచ్చినా లైవ్‌లో వున్న ఫీలింగ్ సింథటిక్ టోన్‌లో రాదని నమ్మే మ్యూజిక్ కంపోజర్లు సితార్ కావాలంటే డేవిడ్‌ని, వీణ కావా లంటే పార్థసారథినీ, ఓబో కావాలంటే జార్జ్‌ని, నాగస్వరం కావాలంటే నాగరాజన్‌ని పిలుస్తారు. పైగా ఈ నాగస్వరం వాయించే మనిషి ఫీల్డు మొత్తం నాగరాజన్ ఒక్కడే. ఆ కారణంగా చాలా బిజీగా వుంటాడు నాగరాజన్.

ముప్ఫై అయిదేళ్ళుంటాయి నాగరాజన్‌కి. సన్నగా, పొడుగ్గా వుంటాడు. అలవాటైన గోల్డ్‌ఫ్లేక్ ప్లెయిన్ సిగరెట్‌ని ఆర్టిస్టిక్‌గా కాలుస్తాడు. భార్యాపిల్లలతో సైతం ఎక్కువగా మాట్లాడడు.

తను పుట్టిన కొన్నాళ్ళకి నాగగండం వుందని తేలిందట. అది విని వాళ్ళమ్మ శోకాలు తీస్తూ తండ్రిని శాపనార్థాలు పెట్టింది. మీరు వాయించే నాగస్వరంలో అపశ్రుతులు వుండటం వల్లే చంటిబిడ్డకి ఈ సర్పగండం ఏర్పడింది అని. కొన్నాళ్ళు గడిచాక ఆమె కలలో నాగుపాము కనిపించడంతో ఆకులా అల్లాడిపోయి దేవుడికి మొక్కు కుంది. తిరుపత్తియారు నాగేంద్రస్వామి గుడికెళ్ళి- నా భర్త తప్పి దానికి నా బిడ్డను క్షమించు స్వామీ! నా పిల్లాడికి నీ పేరే పెట్టు కుంటాను అని.

చంటి కుర్రాడికి నాగరాజన్ అని నామకరణం చేశారు. చాలా కాలం తరువాత పుట్టాడని మురిపెంగా పెంచడంతో చాలా అల్లరి చేసేవాడు నాగరాజన్. అతని గోలకి రోజులో నాలుగుసార్లు విసిగి

పోయేది తల్లి. అన్నం తిననని గొడవ చేసేవాడు. తినకపోతే పామొస్తుందని, అల్లరి చేశావంటే నాగరాజొచ్చి తీసుకుపోతాడని భయపెట్టి అన్నం తినిపించేది తల్లి.

ఏడ్చావంటే పిల్లొస్తుందని, బూచాడొస్తున్నాడని భయపెట్టి వూరుకోబెడతారు చిన్నప్పుడు. కానీ పెద్దయినా చిన్నప్పుడు నాటుకుపోయిన ఆ భయాలు వాళ్ళ నుంచి దూరం కావు. అసలు భయమంటే ఏంటో వాళ్ళకి అలాగే తెలుస్తుందేమో...!

కొందరి విషయంలో అలాగే జరగకపోవచ్చు, నాగరాజన్ విషయంలో మాత్రం జరిగింది.

పెద్దవుతున్నా తన నుంచి భయం దూరం కాలేదు సరిగదా. దానికి తోడు తనకి నాగగండం వుందని తెలిసేనాటికి తన భయం రెట్టింపయ్యి తనలో పూర్తిగా తిష్ట వేసుకు కూర్చుంది. పాము పేరెత్తితే చాలు గడగడ వణికిపోయేవాడు. తెల్లారితే తనకి ఎదురైన ప్రతివాడు తనకి పాము పేరు చెప్పి మరీ, పలకరించేవారు. అందుకు కారణం తన పేరు నాగరాజన్ కాబట్టి.

ఈ పాము భయం నుంచి దూరంగా పారిపోదామంటే వీలుకాని భార్య, బంధం. పోనీ చేసే పనిలో పూర్తిగా లీనమై మర్చిపోదామని ప్రయత్నిస్తే తను వాయించేది నాగస్వరం.

*

మేండ్లిన్, వీణ, సితార్ లాంటి ఇన్‌స్ట్రుమెంట్స్‌ని మెయిన్‌గా వుంచి ఆడియో క్యాసెట్లు, కాంపాక్ట్ డిస్కులు చాలా విడుదల చేస్తున్నారు తప్ప, నాగస్వరం మీద ఈ మధ్యకాలంలో చేయలేదని, త్వరలో ఓ క్యాసెట్టు, డిస్కు విడుదల చెయ్యాలని నిర్ణయించారు హెచ్.ఎం.వి. గ్రామఫోన్ కంపెనీ వాళ్ళు.

నాగరాజన్‌కి పిలుపొచ్చింది. సంగతంతా చెప్పి క్యాసెట్ మీద రాయల్టీ పర్సంటేజ్ చెప్పారు వాళ్ళు. క్యాసెట్టు ఐసి కవర్ మీద మీ మల్టీకలర్ ఫొటో వేస్తామని కూడా చెప్పారు. రికార్డింగ్ డేట్స్ ఫిక్స్ చేశారు.

అంతా విని ఆనందపడ్డాడు నాగరాజన్, గొప్పవాళ్లదే తప్ప మామూలు వాళ్ళ సంగీతం- క్యాసెట్లు, డిస్కుల రూపంలో రాదు మరి.

ఇరవై ఆరో తేదీ పౌర్ణమి. లక్ష్మీవారం ఉదయం తొమ్మిది గంటల నుంచి రాత్రి తొమ్మిది వరకూ నాగరాజన్‌లోని సంగీత సరస్వతి నాగావళి ఏరులా నురగలు కక్కి, సుడులు తిరిగి ప్రవహించింది. మౌంట్‌రోడ్డులో వున్న హెచ్.ఎం.వి. గ్రామఫోన్ కంపెనీవాళ్ళ సొంత థియేటర్లో రికార్డింగ్ పూర్తయ్యింది.

జన్మలో ఎప్పుడూ అనుభవించని వింత ఆనందంతో ఆటోలో ఇంటికి బయలుదేరాడు. నగరంలో వెన్నెల చాలా హాయిగా వుంది. ఆటో ఫ్లై ఓవర్ దాటుతుంటే పార్సన్ కాంప్లెక్స్ వెనుక స్పష్టంగా కన్పించిన చంద్రుడు అందంగా కనిపిస్తున్నాడు. చందనం రాసుకున్నట్టు పరిమళిస్తున్నాడు. ఆనందం ఎక్కువైన అతని గుండె అభిగుహలో హంస ధ్వనిరాగం మంద్రంగా మూలిగింది.

ఆటో వాళ్ళింటి ముందు ఆగింది. పాతకాలం డాబా యిల్లది. పాత చెక్కగేటు దాటి ఓ పద్ధతిలో లేకుండా పెరిగిన పచ్చగడ్డిని ఇరవై అడుగుల దూరం తొక్కుకుంటూ వీధి గుమ్మంలోకి అడుగుపెట్టాలి.

గేటు తెరచి హుషారుగా పెరిగిన లాన్‌మీద బలవంతంగా అడుగులేస్తూ మూసివున్న యింటి తలుపుల వైపు వెళ్తుంటే కాలి క్రింద ఏదో మెత్తగా నలిగినట్టనిపించి వెనక్కి వేశాడు అడుగు. నల్లగా, పొడుగ్గా వున్న పెద్ద పాము. వెన్నెల్లో మెరుస్తూ పాక్కుంటూ పగిలిన పూలతొట్టె వెనక వెళ్ళి దూరిపోయింది.

అంతే....

తలుపు తెరచిన భార్య నాగరాజన్‌ని చూసింది.

వళ్ళంతా పట్టిన చెమటకి లాల్చీ తడిసిపోయింది. శరీరం వణుకుతోంది. చిన్న కనుగుడ్లు పెద్దవిగా మారి ఎక్కడికో దూరతీరాలకి చూస్తున్నాయి.

అతని వాలకం చూసిన ఆమె క్షణం జడిసినా, క్షణాల్లో సెటిలై తీస్కెళ్ళి గదిలో మంచంమీద పడుకో బెట్టింది.

*

గండం దగ్గర పడింది. తన జీవితకాలంలో పాము రావాల్సిన సమయం దగ్గర పడింది. నిన్ననే కుబుసం విడిచిన ఆరడుగుల పాము. పడగ విప్పితే రెండు కృష్ణ పాదాలతో మెరుస్తూ సరాసరి తన వైపే వచ్చే వేళయ్యింది. ఇక వచ్చేస్తుంది. జరజరా పాకుతూ వచ్చేస్తుంది తన వైపు. బుస్సుమని ఊపిరి విడుస్తూ ఝురఝుర శబ్దం...

కళ్ళు విప్పాడు. పాము రాలేదు. భార్య కట్టిన కొత్త లంగా నడిచేప్పుడు నేల రాసుకుంటుంటే విన్పించిన శబ్దం అది.

జాకెట్టు, లంగా మట్టుకే కట్టుకుని ఏ రంగు చీర బావుంటుందా అని బీరువాలో చీరెల దొంతర్ని తిరిగేస్తున్న భార్య అతన్ని చూసి "కాఫీ తేనా?" అంది.

వద్దని తలూపాడు.

మేచింగ్ చీర తీసుకుని వెళ్ళిపోతోంది భార్య. అతను ఆమె పాదాలకేసి చూశాడు. పడగ విప్పిన పాము తలలు నేలమీంచి వెళ్తున్నట్టున్నాయవి.

డాక్టరొచ్చి వెళ్తున్నాడు.

నాగరాజన్‌లో మార్పు లేదు. సన్నగా వుండే తను ఇంకా సన్నగా అయిపోతున్నాడు. చిక్కిన బల్లిలా తయారవుతున్నాడు.

డాక్టరొచ్చి వెళ్తూ అడిగాడు... "కండీషన్ బాగానే వుంది. మరి మనిషెందుకలా అయిపోతున్నాడో..."

"నన్నడుగుతారేమిటండీ. డాక్టరు మీరు కదా..." తిరిగి అడిగిందామె.





బుర్ర పట్టుకు వెళ్ళిపోయాడు డాక్టరు. ఆమె ఊపిర్ని భారంగా వదిలి ఏవియం రాజేశ్వరీలో రిలీజయిన రజనీ కాంత్ సిన్మా కెళ్ళిపోయింది. తనూ, తన ఆనందమే తప్ప ఇంకెవర్నీ పట్టించుకోని తత్వం ఆమెది. పిల్లలు కూడా అంతే. ఆమెలాంటి వాళ్ళే.

నెలరోజులు దాటాయి. నాగరాజన్ అసలు మంచం దిగలేదు. ఇక బతుకుతానే ఆశ పూర్తిగా పోయింది అతనికి. ఎవరికైనా చెపుదామంటే వినేవాళ్ళే లేరు. అసలు తనని పట్టించుకునేవాళ్ళే లేరు.

*

జన్మలో ఎప్పుడూ అంత భయానకమైన రోజుని తను చూడలేదు.

మంచం మీద పడుకుని వున్నాడు. వందలాది పాములు తన శిరస్సు నుంచి సిరిపాదం వరకూ చుట్టేసుకుని ఒకదాన్నొకటి అల్లుకుని పెనవేసుకుపోయి మాగన్నుగా నిద్రపోతున్నాయి. మధ్య మధ్య బుసలు కొడ్తున్నాయి. కదిలితే కసుక్కున కాటేస్తాయి.

అరుస్తూ తెరిచాడు కళ్ళు. పాముల్లేవు. తన వంటి నిండా దుప్పటి, తెల్లటి పొరలాంటి దుప్పటి... కప్పబడి వుంది. భయంతో విడుస్తున్నాడు ఊపిరి. ఇక నిద్ర రాలేదు.

నిశ్శబ్దంగా వున్న గదిలోకి తన ఇద్దరు పిల్లలూ వస్తున్న అరుపులు విన్పించాయి. వాళ్ళు మిద్దె మీదున్న పాత కాలం మృదంగాన్ని కిందికి దించి వంతులవారీగా తన్నుకుంటూ గదిలోకొచ్చారు. పెద్ద పిల్లాడు మృదంగాన్ని ఒక తాపు తన్నేసరికి అది గోడకు గుద్దుకుంది. దాంట్లోంచి నిజంగానే చిన్న పాము పిల్ల బయటికొచ్చి జరజరా పాక్కుంటూ వెళ్ళిపోయింది. కెవ్వున అరుస్తూ పారిపోయారు పిల్లలు. అది చూసిన నాగరాజన్‌కి స్పృహ తప్పింది.

*

# 37

ఎక్కడో సుదూరంగా నాగస్వరం వినిపిస్తోంది. తనకి తెలుసు... అది తను వాయించిందే... కాని, ఎక్కడ ఎప్పుడు వాయించాడో గుర్తుకు రావడం లేదు. పోనుపోను ముమ్మరంగా వినిపించేసరికి కళ్ళు తెరిచాడు నెమ్మదిగా.

మంచానికి దూరంగా టేపు రికార్డర్‌లో కొత్త క్యాసెట్టు తిరుగుతోంది. ప్రక్కనే తన రంగుల ఫొటో వున్న హెచ్.ఎం.వి. క్యాసెట్ ఐసి కవర్ పడుంది. దృష్టి కిటికి మీదికి మళ్ళింది.

'పాము...'

ఆ వెన్నెల రాత్రి తను తొక్కిన పాము. నెమ్మదిగా టేపురికార్డర్ వేపు పాకుతూ వచ్చి, విన్పించే నాగస్వరానికి ఆనందంతో పడగవిప్పి తన్మయత్వం చెందుతూ లయగా తలాడిస్తుంది.

పామునీ, తిరుగుతున్న క్యాసెట్టునీ మార్చి మార్చి చూస్తున్నాడు తను.

క్యాసెట్టు అయిపోయింది. నాగస్వరం ఆగిపోయింది. తన్మయత్వంలో ఆడిన పాము అక్కడ నిశ్శబ్దం ఏర్పడేసరికి 'బుస్స్‌స్స్..'మని టేపురికార్డర్ మీద మూడు కాట్లు వేసింది. అప్పటికీ నాగస్వరం వినిపించక పోవటంతో, దగ్గరలో వున్న నాగరాజన్‌ని ఏం చెయ్యకుండా తన దారిన తను శరవేగంతో వెళ్ళిపోతుంటే మిడిగుడ్లతో ఆ పామునే చూస్తూ వుండిపోయిన అతడు, ఇక జన్మలో పామంటే భయపడలేదు.

అలా ఆ నాగుపాము తన శరీరం మీద కాకుండా తన భయం మీద కాటు వేయడంతో ఈ జన్మకి పాము అంటే భయంపోయింది,

కారైకుడి నాగరాజన్‌కు!

*కృష్ణాపత్రిక, మే 1979*
*ఆంధ్రప్రభ వారపత్రిక, జూన్ 2000*







# యాత్ర

సెప్టెంబరు చివరివారం.

తెల్లవారుఝాము నించే కురవడం మొదలెట్టింది వర్షం.

ఉదయం ఆరుగంటలకి నాంపల్లి స్టేషన్లో కొచ్చిన అరవింద్ అయిదో నెంబర్ ప్లాట్‌ఫారమ్మీద ఆగున్న ఈస్ట్ కోస్ట్ ఎక్కేడు. సైడ్‌లోయర్ బెర్త్ కింద సూట్‌కేసూ ఎయిర్ బేగూ సర్దుకుని సీటు వెనక్కి వాలి కళ్ళు మూసుకున్నాడు. రెండ్రోజుల క్రితమే అతని భార్య ప్రమీలారాణితో విడాకులు తీసుకున్నాడు. ఆమె శీలం మంచిది కాదని తెల్సి మంచి లాయర్ని పెట్టుకుని చాలాకాలం పోరాడి చివరికి నెగ్గిన తను కొన్నాళ్ళు విశ్రాంతి తీసుకోడానికి కలకత్తా అవతల ఫ్రెండ్ చక్రపాణి వుంటున్న మెచెడా అనే వూరెళ్తున్నాడు.



అక్కడక్కడా జనంతో సైలెంట్‌గా వున్న ఆ కంపార్ట్‌మెంట్‌లో ఉన్నట్టుండి పెద్ద కేకలు. ఏంటా అని చూస్తే ఏభై ఏళ్ళుంటాయతనికి, పొడుగ్గా కావిడి బద్దలా వున్నాడు. ట్రాలీ సూట్‌కేస్ లాక్కొస్తూ వెనకాలే ఇంకో పెట్టి మోసుకొస్తున్న భార్య దమయంతినీ పొడుగాటి ఇనప్పెట్టిని మోసుకొస్తున్న ఇద్దరు కొడుకుల్నీ రంధ్రండని అరుస్తుంటే ఆ పన్నెండు, పదిహేనేళ్ళ కుర్రాళ్ళు శంకూగాడూ వెంకూగాడూ తండ్రని కూడా చూడకుండా తెగ తిట్టేసుకుంటున్నారు భూషణ్‌రావుని.

వాళ్ళ సీట్లు అరవింద్ దగ్గర్లోనే వచ్చాయి.

అరుస్తా కరుస్తా అందర్నీ తెగ కంగారు పెట్టేస్తున్న అతని పేరు భూషణ్‌రావు. రైల్వేలో పని చేసాడు. అతని ఫేమిలీ మొత్తానికి పాసుంది. అదట్టుకుని ఆల్మోస్ట్ ఇండియా అంతా తిరిగేశాడు. ఇప్పుడు కాశీ బయల్దేరేడు. అరవింద్ ఏమీ అడక్కపోయినా చెప్పుకుంటా పోతున్నాడు భూషణ్‌రావు.

ఆరూ ఏభై అయ్యింది. బయల్దేరిన ఈస్ట్‌కోస్టు ఏడూ పది నిమిషాలకి సికింద్రాబాదులో ఆగిందో లేదో ముప్ఫై ఏళ్ళ ఆడమనిషి తుఫానులాగ దూసుకొచ్చేసింది... ఆమె వెనక ఇంకా చాలామంది జనం ఎక్కుతున్నారు. వాళ్ళ నొదిలేసి ఆ ఆడమనిషి విషయానికొస్తే భ్రమర అంట పేరు. భర్తకి కలకత్తాలో వున్న చౌరంగీ ప్రాంతంలో ఉద్యోగవట. తనకి ఈ హైదరాబాదులో పంజాగుట్ట దగ్గరున్న సైబర్‌టెక్ అనే ప్రైవేటు కంపెనీలో ఉద్యోగవంట. నెలకోసారి భర్త దగ్గరకెళ్ళాలంట అంటా భూషన్‌రావుతో "ఎందుకని అడగరేం?" అంది.

"అడగను" అన్నాడు భూషణ్‌రావు.

"ఎందుకో?"

"నువ్వే చెప్తావు కాబట్టి."

ఏడిసేవ్‌లే అన్నట్టు నవ్వేసి "సరే వినండయితే. నెలకోసారెళ్ళి ఆ మనిషిని చెక్ చేసుకోలేదనుకోండి... అక్కడ ఏ బెంగాలి మనిషినన్నా మరిగితే?" అంది భ్రమర.

ఏడూ ఇరవై దాటాకా కదిలింది రైలు.

భ్రమరా భూషణ్‌రావు కబుర్లతో కంపార్ట్‌మెంటంతా ఒకటే సందడిగా ఉంది. రైలింకా భువనగిరి దాటలేదు. ఆ కాసేపటిలోనే భూషణ్‌రావు బావా, అతని భార్య దమయంతి అక్కా అయిపోయేరు భ్రమరకి. వాళ్ళ మగపిల్లలిద్దరూ తనకేదో ఎదురుచెప్పేరని ఒకడి డిప్ప మీదేసి ఇంకోడికి శొంఠిపిక్కలు పెట్టేసింది.

పదిగంటలకి వరంగల్‌లో ఆగగానే డాక్టర్ వెంకటరమణ అనే ఏభై ఏళ్ళ బ్రహ్మచారి ఎక్కేడు. ఆయన ఇన్నాళ్ళు గల్ఫ్‌లో ఉన్నాడంట. ఇసక తప్ప పచ్చదనమే ఉండదంట అక్కడ. ఇప్పుడిండియా కొస్తే ఒకటే పచ్చదనమంట. ఇక్కడ ఏ పచ్చని పొదు చూసినా తనకి ఆశ్చర్యంగానే ఉంటుందంట. రవీంద్రనాధ్ ఠాగూర్ శాంతినికేతన్ చూడ్డానికెళ్తున్నాడంట... అతను భ్రమరనే అదోలా చూస్తుంటే ఏంటలా చూస్తున్నారని అడిగేసింది. దాంతో, కంగారు పడిపోయి పక్కకి తిరిగితే నవ్విన భూషణ్‌రావు స్వరం కాస్త తగ్గించి "అరగంట క్రితం నన్ను ఈ టైపులోనే అడిగింది. ఇది పిల్లగాదు ఫిరంగి" అన్నాడు.

మెహబూబాబాద్‌లో ఆగగానే కాల్చిన వేరుశనక్కాయలూ, మసాలా బఠాణీలూ, వేడి వేడి సమోసాలు అమ్మే జనంతో సందడి పెరిగిపోయింది. అమ్మేవాళ్ళలో ఆడాళ్ళే ఎక్కువగా వున్నారు. ఎవరొస్తే వాళ్ళ దగ్గర అన్నీ కొనేస్తూ తను తినడమే గాకండా చుట్టూ వున్న అందరికీ కొనిపెడ్తున్నాడు. కిటికీలోంచి ఏం చూస్తున్నా 'ఆహా' అని మురిసిపోతూ "ఆహా ఏమి టేస్టు. ఈ రుచుల గురించి ఈ రాత్రి నా డైరీలో రాసేసుకోవాలి" అంటున్నాడు వెంకటరమణ.

జేబులోంచి పర్స్ తియ్యని భూషణ్‌రావు వెంకటరమణ మీద వాలిపోయేడు. ఆ కబురూ ఈ కబురు చెబుతా పెట్లో కొస్తున్నవన్నీ ఆ వెంకటరమణతోనే కొనిపించేస్తున్నాడు.

భూషణ్‌రావుతో చనువు పెరిగిన వెంకటరమణ "ఈ ప్రపంచంలో మీకు బాగా ఇష్టమైన మనిషెవరు?" అన్నాడు.

"నా భార్య" అన్నాడు.

"ఎందుకు" అడిగేడు వెంకటరమణ.

"నన్ను అబ్బరంగా చూసుకుంటది. సుబ్బరంగా వండిపెడద్ది. తను ఒట్టి నీళ్ళతో చారు కాసినా అది అమృతమే. చాలా గొప్ప రుచి..." అన్నాడు భూషణ్‌రావు.

"కాశీ వెళ్తే.. అక్కడ మనకిష్టమైనది ఒకటి వదిలెయ్యాలి గదా మీరక్కడ... ఏం వదిలేస్తారు?" అడిగేడు వెంకటరమణ.

"మా ఆవిడ్ని" చెప్పేడు భూషణ్‌రావు.

"మీ ఆవిడ్ని కాశీలో వదిలెయ్యడమెందుకూ నేను బ్రహ్మచారిగాడ్ని. నా బెర్తు మీద వదిలెయ్యొచ్చు గదా?" అన్న వెంకటరమణ గూబమీద బుడగ పేలినంత పెద్ద సౌండొచ్చేలాగ ఒకటేసింది భ్రమర.

ఫూల్ అయిపోయిన వెంకటరమణకేం మాటాడాలో తెలీక "ఏదో కామెడీ కన్నాన్లే సిగరెట్ కాల్చుకొస్తా" అంటా ఫుట్‌బోర్డు వేపెళ్ళిపోయేడు.

బండి విజయవాడ వచ్చేసరికి ఒంటిగంటన్నర దాటింది. గాలివాటం బాగా పెరిగింది. వర్షం కురుస్తానే వుంది. ఎవరెవరో ఎక్కుతున్నారు. వాళ్ళతో పాటు కనకదుర్గ గుడిలో పూజార్ల ఫేమిలీల్లో ఒకడైన చక్రవర్తి అనే పూజారిగారు కూడా ఎక్కేడు. ఖరగ్‌పూర్‌లో వాళ్ళబ్బాయి వుంటున్నాడంట.

*

వర్షం కంటే గాలి బాగా పెరుగుతుంది. రకరకాల స్టేషన్లు దాటుకుంటా మధ్యాహ్నం మూడున్నర ప్రాంతాల్లో నిడదవోలులో ఆగిన బండ్లోకి అయోధ్య రామాచార్యులుగారనే డబ్బై ఏళ్ళ ముసలాయన్ని చెరో రెక్కా పట్టుకుని ఇద్దరు యువకులు, లోపలి కెక్కిస్తున్నారు. వాళ్ళ వెనకాలే శారద.



ఆ యువకుల్లో ఒకతని పేరు నరేషట, రెండో వాడిపేరు సూరిబాబు. వాళ్ళిద్దరూ అయోధ్య రామాచార్యులు గారి పెద్దకొడుకు బిడ్డలంట. ఇక శారద ఆయన ఆఖరి కొడుకు రామాచారి భార్యంట. ఆ రామాచారి ఈమధ్యే పోయేడంట.

ఒకపక్క భూషణ్‌రావూ ఇంకోపక్క వెంకటరమణా పోటీపడి మరీ చూస్తున్నారు శారదని. పలకరించే ప్రయత్నాలు కూడా చేస్తున్నారు.

వాళ్ళనలా చూసిన భ్రమర "ఈ వయసుల్లో మీకీ పని అవసరమంటారా" అనేసరికి కంగారు పడిపోయేరు.

తాడేపల్లిగూడెంలో కొన్న సొసైటీ పాలకోవా బిళ్ళలు రెండు శారద కిస్తూ "తీసుకోండి బావుంటాయి" అంది భ్రమర.

నవ్విన శారద వద్దంది.

"నాకెట్టొచ్చు గదా?" అన్నాడు భూషన్రావు.

"ఎట్టి పరిస్థితుల్లోనూ పెట్టనుగానీ ఇందాక ఏవన్నావ్... మీ ఆవిడ్ని కాశీలో వదిలేస్తావా?"

"ఇంకా మర్చిపోలేదా" అంటా వెంకటరమణతో పాటెళ్ళిపోయేడు భూషణ్‌రావు.

ముసలి అయోధ్యరామాచారిగారిని బాత్‌రూమ్‌కి తీసుకెళ్ళి తీసుకొస్తున్నాడు సూరిబాబు. ఎందుకలా అస్తమానూ బాత్రూమ్‌కి తీసుకెళ్ళి తీసుకొస్తున్నారు అనడిగితే ఆయనకి ప్రోస్టెటైటిస్ అనే వ్యాధి కారణంగా యూరిన్ రిలీజ్ ప్రోబ్లమ్ వుందని చెప్పేరు అరవింద్‌కి .

"ఆపరేషన్ చేయించొచ్చు కదా?" అని అరవింద్ అడిగితే, "ఈ వయసులో కుదరదన్నారు డాక్టర్లు" అని చెప్పాడు నరేష్.

రైలు అన్నవరం దాటుతుంటే ఆ వర్షంలోనే దూరంగా కనిపిస్తున్న దేవుడి కొండమీద లైట్లు చూస్తా కళ్ళు మూసుకుని దణ్ణవెట్టుకుంటున్న శారదని చూశాడు అరవింద్.

మధ్యమధ్యలో ఆగుతా అనకాపల్లి దాటేక వచ్చే దువ్వాడ అనే చిన్నస్టేషన్లో ఆగిపోయింది రైలు. ఏదో బండి క్రాసవ్వాలంట, కదల్డానికి టైము పడ్డదంట. అది విని పరుగెట్టుకొచ్చిన భూషణ్‌రావు ఆ ముక్క భార్య దమయంతికి చెప్పాడు.

వెంటనే వాళ్ళ శంకూగాడూ వెంకూగాడు ఆ రేకు పెట్టిని దించి ప్లాట్‌ఫారం మీదకి తీసుకెళ్ళి మూత విప్పారు. లోపల స్టౌ, వంట సామాన్లూ, పప్పులూ, ఉప్పులూ, బియ్యం ఉన్నాయి. స్టౌకి గాలికొట్టేడు భూషణ్‌రావు. ఆల్రెడీ కలిపి ముద్దలు చేసి ఉన్న చపాతీ పిండిని వత్తి తల్లి కిస్తుంటే అర్జంటుగా డజను చపాతీలూ కాల్చేసి స్టౌ ఆర్పేసింది. అది చూసిన అరవింద్ 'మొబైల్ కిచెన్ బానే ఉందే' అని నవ్వుకున్నాడు.

గ్రీన్ సిగ్నల్ పడింది.

ఏమాత్రం కంగారుపడని కుర్రాళ్ళు అన్నీ రేకుపెట్టెలో సర్దేసి కంపార్ట్‌మెంట్లోకి పట్టుకుపోతుంటే చిత్రంగా చూస్తున్నాడు అరవింద్.

# 43

రైలు కదిలింది.

వేడివేడి చపాతీల్లో బంగాళాదుంప కుర్మా వేసుకుని కడుపునిండా తింటుంది భూషణ్‌రావు కుటుంబం. ఇటుపక్క ఒన్ అండ్ హాఫ్ లీటర్ కోకోకోలా బాటిల్లో ఓల్డ్ కేస్క్ రమ్ కలుపుకుని కొంచెం కొంచెం చప్పరించడం, దొంగతనంగా శారదని చూడ్డం మొదలెట్టిన డాక్టర్ వెంకటరమణ మధ్యమధ్యలో "ఆహా ఏమి టేస్టు?" అంటున్నాడు.

వాల్తేరులో చాలామంది ఎక్కేరు.

శారద ముసలాయనకి మాత్రలెయ్యడానికి లేస్తే ఆ సీట్లోకొచ్చి కూర్చున్న నరేష్ చెప్పడం మొదలెట్టాడు అరవింద్‌కి. వాళ్ళ తాతయ్య అయోధ్య రామాచార్యులుగారికి చనిపోయిన వాళ్ళ చిన్నాన్న హరినాథన్నా, వాళ్ళ పిన్ని శారదన్నా పంచప్రాణాలంట. ఆయన చివరి కోరిక ఒకటుందంట.

"ఏమిటి?" అన్నాడు అరవింద్.

"మా శారద పిన్నిని ఎవరన్నా యోగ్యుడికిచ్చి పెళ్ళి చెయ్యాలంట. ఆ పెళ్ళి తను చూడాలంట. అంత వరకూ నన్ను తీసుకెళ్ళొద్దు అని ప్రతిరోజూ విశ్వేశ్వరుడికి ప్రార్థన చేసుకుంటున్నాడు తాతయ్య." అదంతా విన్న డాక్టర్ వెంకటరమణ 'మనం మేరేజ్ చేసుకుంటే?' అని కొశ్చనేసుకుని, 'ఈ వయసులో ఎందుకూ ఐనా సెంకడ్సెందుకూ?' అనుకున్నాడు.

శారద వచ్చింది. ఆమెకి సీటిచ్చి వెళ్ళిపోయేడు నరేష్.

వాల్తేరు స్టేషన్లో కొనుక్కున్నవీ, ఇళ్ళ నించి తెచ్చుకున్నవీ తినేసిన జనం పక్కలు సర్దుకుంటున్నారు. రమ్ము తీసుకుంటున్న డాక్టర్ వెంకటరమణ కిటికీలోంచి బయటికి చూస్తూ 'ఆహాహా ఈ అద్భుతమైన దృశ్యాన్ని ఈ రాత్రి నా డైరీలో రాసుకోవాలి' అంటుంటే ఏంటా అని బయటికి చూసింది భ్రమర.

చీకటీ, వర్షం తప్ప ఏం లేకపోయేసరికి తిట్టుకుంటూ వెంకటరమణ్ణి చూసి వెళ్లిపోయింది.

ఓ రెండు గంటలైంది.

చాలా వరస్ట్ టోన్‌తో *కురిసింది వానా నా గుండెలోనా నీ చూపులే జల్లుగా...* అని గొంతెత్తి పాడ్తున్నాడు వెంకటరమణ.

నిద్రోతున్న జనం ఉలిక్కిపడుతూ లేచిపోయారు. ఇద్దరైతే జడుసుకున్నారు కూడా. దూసుకుంటా వెంకట రమణ దగ్గర కొచ్చిన భ్రమర "అర్జంటుగా పాడ్డం ఆపు" అంది.

"ఆపకపోతే?"

"మెడ కొరికేస్తాను."

"బాగోలేదా?" అడిగేడు వెంకటరమణ.

"ఛీ ఛీ" అన్నాడు నిద్ర లేచిన భూషణ్‌రావు.

భ్రమర దగ్గరకి జరిగిన వెంకటరమణ "పోనీ *వానకాదు వానకాదూ వరదరాజా...* అనే ఓల్డ్ సినిమా సాంగు మూడున్నర శృతిలో పాడుకోనా?" అనేసరికి అతని చేతిలో కోలా బాటిల్ లాక్కుని బయట పారేసింది.



అది చూసిన పూజారి చక్రవర్తి "మంచిపని చేశావమ్మా" అనేసి రగ్గు కప్పేసుకున్నాడు.

"అసలు నేను సింగర్ని అవ్వబోయి డాక్టర్నయ్యేను తెల్సా భ్రమరా?"

"నీ సింగింగ్‌తో ఇంతమంది ప్రాణాలు బలి కోరబోయావు. డాక్టర్‌గా ఎంతమందిని పొట్టన బెట్టుకున్నావు?"

"ప్రొఫెషన్ సీక్రేటు చెప్పను" అన్నాడు వెంకటరమణ.

టైమవుతుంది. గాలి, వర్షం నీళ్ళు లోపలికొచ్చేస్తున్నాయి.

ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్ రకరకాల స్టేషన్లు దాటుతుంది.

కంపార్ట్‌మెంట్లో జనమంతా నిద్రపోతున్నారు. మావగార్ని బాత్‌రూమ్‌కి తీసుకెళ్ళాలి గాబట్టి అరవింద్ ముందు సీట్లో కూర్చున్న శారద మట్టుకి పై బెర్తెక్కలేదు. నిద్రపట్టని భూషణ్‌రావు కప్పుకున్న పచ్చగళ్ళ దుప్పటి కన్నంలోంచి చూస్తున్నాడు శారదని.

మెలుకువగా ఉన్న అరవింద్ శారదనే చూస్తున్నాడు. ఆలోచిస్తున్నాడు. దీర్ఘంగా ఆలోచిస్తున్నాడు శారద గురించి. 'మా శారద పిన్నిని ఎవరన్నా యోగ్యుడికిచ్చి పెళ్ళి చెయ్యడం మా తాతయ్య చివరి కోరిక' అన్న నరేష్ మాటలు ఆ వర్షం రాత్రి మళ్ళీ మళ్ళీ గుర్తుకొస్తున్నాయి.

పాపం శారద అనుకుంటా ఆమెనే చూస్తా చాలాసేపు ఆలోచించిన అరవింద్ ఒక నిర్ణయానికొచ్చాడు చివరికి.

మధ్యలో ఆగుతూ వెళ్తున్న బండి ఆంధ్రప్రదేశ్‌కి బోర్డరయిన ఇచ్ఛాపురం దాటి ఒరిస్సాలోకి ఎంటరవుతుంది.

అరవింద్ తనని చూస్తున్నాడని స్పష్టంగా గమనించిన శారద చీర చెంగు ముఖానికి అడ్డం పెట్టుకుంది.

ఒంటి గంటన్నర ప్రాంతాల్లో ఛత్రపూర్‌లో చాలాసేపు ఆగిపోయింది రైలు.

"ఏ స్టేషను శారద పిన్నీ" అంటా నిద్ర లేచిన నరేష్‌తో "టీ దొరుకుతుందేమో ట్రై చేద్దాం వస్తావా?" అన్నాడు అరవింద్.

"పదండి" అన్నాడు నరేష్.

దిగి ప్లాట్‌ఫారం మీద నడుస్తుంటే అదృష్టం, మోకాళ్ళ దాకా నిక్కరూ టీషర్టూ వేసుకుని నడుంకి ఎర్రటి గావంచా కట్టుకున్న ఆ ఒరియా మనిషి ఆ వర్షం రాత్రి కాసిచ్చిన టీ రుచి జన్మలో మర్చిపోలేనిది.

తాగి తిరిగొస్తుండగా నరేష్ భుజం మీద చెయ్యేసిన అరవింద్ "నీతో ఒక్క నిమిషం మాట్లాడాలి" అన్నాడు.

"చెప్పండి సార్" అన్నాడు నరేష్.

తుఫానులాగుంది. గాలి విసిరి విసిరి కొడ్తుంది. దూరంగా మెరుపులూ ఉరుములు.

"మీ శారద పిన్నిని నేను పెళ్లి చేసుకుంటాను" అన్నాడు.

ఆశ్చర్యపోతా చూసిన నరేష్‌తో ఇంకా చాలా మాటాడాడు అరవింద్.

ఇద్దరూ లోపలికొచ్చిన కాసేపటికి కదిలింది రైలు.

శారదని పడుకోమన్న నరేష్ అరగంట తర్వత అయోధ్య రామాచారిని బాత్‌రూమ్‌కి తీసుకెళ్తూ అరవింద్ చెప్పిన మాటలు చెప్పి అతన్ని చూపించాడు.

వెనక్కొచ్చి అరవింద్ ముందు నిలబడ్డ ఆ ముసలాయన కన్నీళ్లతో నమస్కారం చేసేడు.

అంత పెద్దాయన ఈ అరవింద్‌కి నమస్కారం పెట్టడం చూసిన భ్రమర ఎందుకాయనలా చేశారని అడిగింది నరేష్‌ని.

జరిగింది చెప్పాడు నరేష్.

షాకయిపోయిన భ్రమర అరవింద్ దగ్గరకొచ్చి "కొన్ని గంటల్లోనే ఆ శారదక్కని పెళ్ళి చేసుకోడానికి నిర్ణయిం చేసుకున్నారు, సంపూర్ణ జీవితానికి సంబంధించిన సమస్య ఇది. ఈ డెసిషన్ ఇంత ఫాస్ట్‌గా ఎలా తీసేసుకున్నారు. వెనకాలేమైనా కారణముందా?" అనడిగింది.

నవ్వేసిన అరవింద్ "లవ్ ఎట్ ఫస్ట్‌సైట్ అంటారు.అలా ప్రేమించిన కథలు కోకొల్లలు తెల్సుగదా?" అన్నాడు.

"ఐతే?" అంది భ్రమర.

"నా నిర్ణయం కూడా అలాంటిదే... పైగా చాలాసేపు ఆ శారదని చూసిన నాకు ఆమె కళ్ళల్లో ఎన్నో కథలూ దృశ్యాలూ కనిపించాయి" అన్నాడు.

శారద దగ్గరకొచ్చి అడిగితే పీలగా నవ్వేసి "మావయ్యగారి చివరికోరిక తీర్చాలి అంతే" అంది.

ఆ అరవింద్ తనని కన్విన్స్ చేసేడుగానీ ఎందుకో సబబుగా తొయ్యలేదు భ్రమరకి.

*

మూడుగంటలు దాటింది టైము.

వర్షం గాలీ బాగా పెరిగిపోయాయి.

కుంటుతూ నడుస్తున్న రైలు కల్లిపడఘాట్ అనే ఆ చిన్ని స్టేషన్లో ఆగిపోయింది. పావుగంటా అరగంటా కాదు చాలా గంటలసేపు.

*

తెల్లవారింది.

కంపార్ట్‌మెంట్లలోంచి దిగుతున్న అందరూ ఏంటా అని ఎంక్వైరీ చేస్తే నెక్ష్ వచ్చే నిరాకర్‌పూర్ నించి ఖుర్దారోడ్ జంక్షన్ దాకా చాలాచోట్ల చాలా పట్టాలు కొట్టుకుపోయినియ్యంట. ట్రాక్ సరిచేస్తేగానీ రైళ్ళు నడవ్వంట. ఎన్ని రోజులు పడ్తుందో చెప్పలేరంట.

*





ఆ స్టేషన్లో ఏం దొరక్క చాలా అవస్థ పడ్తున్నారంతా. కొందరైతే అక్కడమ్ముతున్న పూరీ, పసుపు బాగా ఎక్కువేసేసి తొక్క తియ్యని బంగాళాదుంప కూరా చాలా రేటు పెట్టి కొనుక్కున్నా తిన్లేక అవస్థ పడ్తున్నారు. వాళ్ళని చూసిన దమయంతి "పాపం పెట్లో చాలామంది తెలుగువాళ్ళున్నారండీ" అంది.

"అవును పాపం తిండికి వాళ్ళు పడే అవస్థ చూస్తుంటే జాలేస్తుంది" వేదనతో అన్నాడు భూషణ్‌రావు.

భర్తలో ఈ మార్పు చూసి షాకైపోయింది దమయంతి.

ఆమెకి బాగా దగ్గరగా వచ్చిన భూషణ్‌రావు కళ్ళమ్మట నీళ్ళెట్టుకుంటూ "పాపం మనతో పాటు వాళ్ళకి కూడా వండి పెడదామా" అన్నాడు.

మతి పోయినట్టు అతన్నే చూస్తా పిల్లల్తో ఆ చిన్ని స్టేషన్ ఫ్లాట్‌ఫారంలో ఒక మూల శుభ్రం చేయించి స్టౌ వెలిగించి అట్లపెనం పెట్టి వచ్చేప్పుడు అమితాబ్‌బచ్చన్ కేన్ నిండా తెచ్చుకున్న పిండితో దోసెలు వేసి విస్తళ్ళ కట్ట విప్పి ఒకో ఆకులో మూడేసి దోశెలూ, దోస ఆవకాయ వేసి పెడ్తుంది దమయంతి.

అటుపక్క నించి ఒక్క శారదని తప్ప తక్కిన అందరి దగ్గరా దోసెకింతని పెద్ద ఎత్తున డబ్బులు వసూలు చెయ్యడం మొదలెట్టిన భూషణ్‌రావుని చూసిన దమయంతి మూర్ఛొచ్చి పడిపోతే నీళ్ళుకొట్టి లేపింది భ్రమర.

మధ్యాహ్నం భోజనానికి అంతా డబ్బులిచ్చేరు. కల్లిపడా వూళ్ళో కెళ్ళిన మగవాళ్ళు కూరగాయలూ, పప్పులూ, ఉప్పులూ నూనె కొనుక్కొచ్చేరు. శంకూగాడు, వెంకూగాడు, నరేషూ, సూరిబాబూ ఫ్లాట్‌ఫారంలో పంక్తి భోజనానికి శుభ్రంగా ఊడుస్తున్నారు.

స్టేషను మూలున్న సిమ్మెంటు బెంచి మీద ఒంటరిగా కూర్చున్న శారద దగ్గరకెళ్ళి మంచీ చెడ్డా మాటాడ్తున్నాడు భూషణ్‌రావు.

నెయ్యీ పాత ఊరగాయీ, గుత్తి వంకాయ కూరా, పప్పు పులుసుతో ఆ తుఫాను రోజు మధ్యాహ్నం వడ్డిస్తుంది దమ

యంతి. అందరితో పాటు తింటున్న డాక్టర్ వెంకటరమణ... "ఆహాహా ఏం రుచి నా జన్మలో తినలేదు... ఈ టేస్ట్ గురించి ఈ రాత్రే డైరీలో రాసేసుకోవాలి" అన్నాడు.

రుచిగా ఉన్న పప్పు పులుసు ముద్దలు దోరుస్తున్న పూజారి చక్రవర్తిగారు "నీ పేరు దమయంతి కాదు మనం వెళ్తున్న ఆ కాశీలో అన్నపూర్ణేశ్వరి" అన్నాడు.

ముసలి అయోధ్య రామాచారిగారు కూడా చాలా ఎక్కువ తినేశారా వేళ.

*

సాయంత్రమయ్యింది. వర్షం దానిపాటికది కురుస్తానే వుంది. గాలి వీస్తానే వుంది.

ఇటుపక్క రాత్రి భోజనానికి ఏం చేద్దాం అని శంకూ వెంకూల్తో దమయంతి ఆలోచిస్తుంటే అటుపక్క అందరి దగ్గరా స్టార్ హోటల్ రేట్లు వసూలు చేసేస్తున్నాడు భూషణ్‌రావు.

దమయంతి దగ్గర కొచ్చిన భ్రమర "కొత్తగా పరిచయమైనా ఫ్రాంక్‌గా మాటాడ్తున్నందుకు క్షమించక్కా.. ఔనూ... ఈ మనిషినెలా భరిస్తున్నావక్కా?" అంది.

ఆ తుఫానులో నవ్వేసింది దమయంతి.

ఆ మనిషి నవ్వు చూసిన భ్రమరకి చాలా అర్థమవ్వడంతో ఇంకేం మాటాడలేకపోయింది.

*

ఆ తుఫాన్లో పగలూ రాత్రికి తేడా తెలీడం లేదు.

అయోధ్య రామాచారికి జ్వరమొచ్చింది. దమయంతిగారి దోసెల పేనంలా కాలిపోతుంది వొళ్ళు. అది చూసిన నరేష్ కంగారు పడిపోయి వూళ్ళోకెళ్ళి డాక్టర్ని పిల్చుకొస్తానంటే ఆపిన భ్రమర వున్నాడు గదా ఇక్కడ అంటా వెంకటరమణని చూపించింది.

వచ్చి చూడమని నరేష్ రిక్వెస్ట్ చేస్తే "నేను పశువుల డాక్టర్ని" విషాదంగా అన్నాడు వెంకటరమణ.

"ఛీ... నీ మీద నాకు ఎప్పట్నించో డౌటు" అని తిట్టుకుంది భ్రమర.

వూళ్ళోకెళ్ళి గోపీనాథ మహంతీ అనే ఒక ముసలి ఆరెంపీని తీసుకొచ్చేడు సూరిబాబు.

అయోధ్య రామాచారిని చెక్ చేసిన ఆ డాక్టరు రకరకాల మందులు రాసి వంద రూపాయలు తీసుకుని వర్షంలో తడుచుకుంటా వెళ్ళిపోయేడు.

ఆ ప్రిస్కిప్షన్ పట్టుకున్న మనవలు పరుగెత్తేరు వూళ్ళోకి. ఇటుపక్కన కళ్ళు తెరిచిన అయోధ్య రామా చార్యులుగారు అందర్నీ పిల్చి "నాకు పిలుపొచ్చింది. గంగానది ముందున్న హరిశ్చంద్రఘాట్‌లో కొలువు తీరి వున్న ఆ కాశీ విశ్వేశ్వరుడి దగ్గర్నుంచి నాకు పిలుపొచ్చింది. ఈ తుఫానులో మిమ్మల్నందర్నీ కోరగూడని కోరిక కోరుతున్నందుకు నన్ను క్షమించండి... నా తల్లి మా శారదకీ ఈ అబ్బాయి అరవింద్‌కీ పెళ్ళి చెయ్యండి.





అమ్మా అయ్యా... అది నేను చూసే భాగ్యం నాకు కలగజెయ్యండి" అంటా కన్నీటితో అందరికీ నమస్కారం చేస్తుంటే చుట్టూ మూగిన జనం మనసులు అదోలాగయిపోయాయి.

భ్రమరైతే ఏడ్చేసింది.

"ఈ పని చెయ్యడానికేనేమో ఆ దేవుడునన్నీ రైలెక్కించాడు" అనుకుంటూ ముందుకొచ్చిన పూజారి చక్రవర్తిగారు ఆ రైల్వే ప్లాట్‌ఫారం ముందు వాళ్ళ పెళ్ళి చెయ్యడానికి కావల్సిన సామాన్ల లిస్ట్ రాసిచ్చాడు.

ఎముకలు విరిగితే కట్లుకట్టే పుత్తూరులాగ ఈ రాష్ట్రంలో కట్లకి ఈ వూరు చాలా ఫేమస్సంట. వూళ్ళో కెళ్ళి ఆ గ్రామం వీధిలో ఉన్న కిరాణా దుకాణం దగ్గరకెళ్తే తలుపులు మూసేసుకుని ఇంట్లో కూర్చున్న షాపు యాజమాని నోట్లో నాన్చుతున్న తమలపాకుల్తో బయటికొచ్చేడు.

అతన్ని బతిమాలీ బామాలీ షాపు తలుపులు తీయించి చక్రవర్తిగారు తెమ్మన్న సామాన్లన్నీ పట్టుకొచ్చేడు సూరిబాబు. ఇక తక్కినవాళ్ళు రాత్రి భోజనాలకి ఏర్పాట్లలో ఉన్నారు. అందరికంటే ఎక్కువ కష్టపడ్డ డాక్టర్ వెంకటరమణ తడిసి ముద్దయిపోయి పూజారి చక్రవర్తి తెమ్మని అప్పగించిన ఇటుకలూ, సన్నాయి మేళం వాళ్ళని తెచ్చాడు.

ఆ రాత్రి కరెంటులేని ఆ కల్లిపడఘాట్ రైల్వేస్టేషన్లో ఆ తుఫాన్లో అక్కడ హోమగుండంలో అగ్నిసాక్షిగా జరుగుతున్న అరవింద్ శారదల పెళ్ళి చూస్తున్నారు అయోధ్యరామాచారిగారు. మాంగల్యధారణ జరుగుతుంటే ఆ స్టేషను మేష్టరు, ఆగిపోయిన రైలు డ్రైవరూ, గార్డూ కూడా వచ్చి అక్షింతలు వేశారు.

శోభనానికి ఆ పాతకాలం స్టేషన్లో గదే లేకండా పోయింది. దాంతో, ఆడాళ్ళు, మగాళ్ళు కల్సి చీరలూ దుప్పట్లూ కంపార్ట్‌మెంట్ చుట్టూ కట్టేశారు. వూళ్ళో కెళ్ళి సంపాయించిన కొవ్వొత్తులు వెలిగించింది భ్రమర.

దమయంతి తీసుకొచ్చిన ఆ కొత్త చీర కట్టుకున్న శారద ఆ కొవ్వొత్తుల వెలుగులో లోయర్ బెర్త్ మీద కూర్చున్న భర్త ముందు నిలబడింది.

బయట వర్షం చప్పుళ్ళు వింటూ, ఆమెనే చూస్తున్న అరవింద్ "కూర్చో" అన్నాడు.

అతని ఎదురు బెర్త్ మీద కూర్చుంది శారద.

తన దగ్గరకొచ్చి తన్ని జేర్చి కూర్చుని ఒకానొక అవ్యాజమైన ప్రేమతో మాటాడతాడని వూహించు కుంటున్న శారదని "శారదా" అని పిల్చేడు అరవింద్.

తలెత్తి చూసింది శారద.

అందంగా నవ్వాడు అరవింద్.

ఆనందంగా చూడ్డానికి ప్రయత్నం చేసింది శారద.

"శారదా... నువ్వు చాలా అదృష్టవంతురాలివి తెలుసా?" అన్నాడు.

నిజమే అన్నట్టు తలూపి అతని రెండు పాదాలూ పట్టుకుని నమస్కారం చేసుకుంది శారద.

"నువ్వొక విధవ్వి. అలాంటి నీకు సుమంగళి అయ్యే భాగ్యం కలగజేశాను. ఈ విషయంలో నువ్వు నాకు ఎప్పటికీ కృతజ్ఞురాలివై వుండాలి" అన్నాడు.

మీరన్నది చాలా కరెక్టన్నట్టు చూసి మరోసారి మనసారా అతనికి నమస్కారం చేసుకుంది శారద.

"అసలు కొస్తే శారదా, ఎవరో అన్నట్టు భర్త పోయిన ఆడది నమిలి వూసేసిన కిళ్ళీలాంటిది. కాల్చి పారేసిన సిగరెట్టులాంటిది. అలాంటి నిన్ను దయతో కరుణించాను. నేనొక దయామయుడ్ని, నేనొక కరుణా మయుడ్ని. నీకు మళ్ళీ ఒక జన్మనిచ్చిన ఆది దేవుడ్ని" అంటూ మొదలెట్టిన అరవింద్ మాటల మధ్యలో, నువ్వూ మనిషివి. నీకూ యవ్వనముంది నీకూ మనసుంది. నువ్వు పెళ్ళికీ సంసారానికీ అర్హురాలివి లాంటి చిన్నమాట కూడా అనకండా తనెంత గొప్పవాడో ఒక విధవ కోసం తన జీవితాన్ని ఎంత త్యాగం చేశాడో చెపుతున్నాడు. ఆ వర్షం కురుస్తుంటే ఆగిపోయున్న ఆ రైలు పెట్టె లోపలి శోభనం గదిలో మాటాడుతానే ఉన్నాడు అరవింద్.

రాత్రి రెండు దాటింది.

లెక్చరింకా ఆపలేదతను. మాటాడ్తానే ఉన్నాడు తను చేసిన త్యాగం గురించి.

అతగాడి మాటలు వింటానే నిద్రపోయింది శారద.

తెల్లారింది.

ప్లాట్‌ఫారం మీద ఎవరి పన్లలో వాళ్ళున్నారు.

టీ, పూరీ కూరా, రసగుల్లా, కోవా, ఝాల్‌ముడీ అమ్ముకునే ఒరియావాళ్ళు దిగేరు.

కొడుకుల్ని పిల్చిన దమయంతి "గుమ్మడి వడియాలున్నాయి. పచ్చిపులుసు చేసి బంగాళాదుంపల వేపుడు వేస్తాను" అంటా కావాల్సిన సామాన్లు చెపుతుంది.

పెట్లోంచి దిగిన శారదని ఇంతకు ముందులా గాకండా పవిత్రంగా చూసిన డాక్టర్ వెంకటరమణ "ఆహాహా... నా లైఫ్‌లో నేను చూడని ఈ సీన్‌ని అర్జంటుగా నా డైరీలో రాసేసుకోవాలి" అంటుంటే అతని జబ్బ పట్టుకున్న భ్రమర "డైరీలో రాసుకుంటావో డ్రైనేజిలో దూకుతావో అది నీ టేస్టుగానీ.... దమయంతక్క కొబ్బరికాయా పచ్చి శనగపప్పు కూడా వండుతానంటుంది" అంది.

"ఆహాహా... వెంటనే" అంటున్న వెంకటరమణ మూతిమీద బలంగా ఒకటేసిన భ్రమర "మీరూ భూషణరావు బావా వెంటనే బయల్దేరి అవన్నీ పట్రండి" అంది.

మధ్యాన్నం దమయంతి గారు వేడివేడి మసాలా వడలు వేస్తుంటే తింటూ "ఆహాహా ఏమి రుచి" అన్నాడు నరేష్.

"ఈ ముక్క నేను అనాలి" అన్నాడు వెంకటరమణ.

"రుచిగా వున్నాయి గాబట్టి మేంకూడా అనొచ్చు" అన్నాడు నరేష్.

వాళ్ళ జబ్బమీద ఒకటేసి నవ్వుతా మందలిస్తున్న శారదని దగ్గరకి పిల్చిన అరవింద్ "కుర్రాళ్ళని తాకి మరీ ఏంటా మాటలు, ఏంటా చనువు... తగ్గించు శారదా" అన్నాడు.





ఇందాక కొబ్బరికాయ కోసం వూళ్ళో కెళ్ళిన భూషణ్‌రావుకి నాటుసారాకాయ దొరకడంతో ఇంటర్వెల్ ఇవ్వకండా తాగడంతో ఒకటే డోకులు. భార్య దమయంతేమీ అనకపోయినా వెంకూగాడు మట్టుకి తెగ తిట్టేస్తున్నాడు.

స్టేషన్లో ఒక మూలకెళ్ళి నిలబడ్డ భ్రమర దూరంగా కనిపిస్తున్న కొండల్నీ ఘాటీని చూస్తూ "ఇవన్నీ చూస్తుంటే *కొండ గాలి తిరిగిందీ గుండె వూసులాడింది...* పాట పాడుకోవాలనిపిస్తుంది.... కానీ నాకు రాదే" అంది.

"నాకొచ్చు. పాడనా మూడున్నర శృతిలో?" అన్నాడు వెంకటరమణ.

"ఎట్టి పరిస్థితుల్లోనూ వద్దు" అనరుస్తూ అక్కడ్నించి లేచెళ్ళి పోయింది భ్రమర.

రాత్రయ్యింది.

వెలిగించిన కొవ్వొత్తుల వెలుగులు.

బెర్త్‌ల మీద ఎదురెదురుగా వాళ్ళు.

మళ్ళీ మామూలే.

"నువ్వో విధవ్వి నీకు గొప్ప భవిష్యత్తునిచ్చాను. నా జీవితం అల్పమైన నీకోసం త్యాగం చేశాను" అంటా పెద్ద లెక్చరు.

నిద్రొచ్చిన శారద నిన్నట్లాగే పడుకుంది.

తెల్లారింది. ఆ చిన్నిస్టేషన్లో ఎక్కడచూసినా జనమే.

తుఫానే మాత్రం తగ్గలేదు.

"ఈ పల్లెటూళ్ళో ఏం దొరకడం లేదంటున్నారు గదా పోన్లెండి బియ్యం, చింతపండు, పచ్చి మిరప కాయలూ ఆవాలూ పట్రండి. వైష్ణవ పులిహోర చేస్తాను" అంది దమయంతి.

పెళ్ళయ్యాకా శారదని చూడ్డం మానేసిన భూషణ్‌రావు తన కలెక్షన్ పనిలో తనున్నాడు. డాక్టర్ వెంకట రమణ కూడా అంతే.

మధ్యాన్నం భోజనాలయ్యేక "ఔను.. శారదా, పోయిన భర్త అస్తికలు కలపడానికి తమ్ముడో తండ్రో మగాళ్ళెళతారు. ఆడదానివి వాళ్ళ కూడా నువ్వెళ్ళడమేంటి... ఒక్కసారి ఎవ్వర్నన్నా అడిగి చూడు... నేనొప్పుకోను" అన్నాడు అరవింద్.

చీకటి పడింది.

లెక్చరు మామూలే.

తెల్లవారుఝాము శారద నిద్రపోవడం మామూలే.

*

వారం రోజుల తర్వాత తుఫాను తగ్గింది.

ఎండ కాస్తుంది.

రైలు పట్టాలు బాగయ్యాయి..

రైళ్ళు నడుస్తున్నాయి.

మధ్యమధ్యలో ఆగుతా నడుస్తున్న ఈస్ట్‌కోస్టు హౌరాస్టేషన్లో కొచ్చేసరికి ఇంకో రెండ్రోజులు పట్టింది.

ఇరవై రెండు ప్లాట్‌ఫారాలున్న చాలా పెద్ద స్టేషన్ హౌరా టెర్మినల్. రకరకాల జనంతో ఆగిన రకరకాల ట్రైన్స్. ఎటు చూసినా గందరగోళంగా ఉంది.

కోడలూ మనవలూ అయోధ్యరామాచార్యులుగార్ని లేపే ప్రయత్నం చేస్తే చనిపోయి వున్నారాయన.

అది తెల్సి వెళ్ళిపోతున్న జనమంతా వెనక్కి తిరిగారు.

వాళ్ళ ముంగండ అగ్రహారంలో వేదాలు వల్లించిన ఆ కోనసీమ బ్రాహ్మడు ఘనాపాటిగా పేరెల్లిన ఆ అయోధ్య రామాచార్యులుగారి శవాన్ని అంతా కిందికి దించుతున్నారు.

ఆ సీనంతా చూస్తూ వాళ్ళ మధ్యలో కొచ్చిన అరవింద్ "శారదా... ఆ పని వాళ్ళు చూసుకుంటారు. నువ్వు పద, మనకి టైమవుతుంది" అన్నాడు.

మామగారి శవాన్ని కాశీ తీసుకెళ్ళే పనిలో వున్న శారదతో ఇంకో రెండుసార్లన్నాడు అరవింద్.

చాలాసేపు అతని డైలాగులు విన్న శారద రెస్పాన్సివ్వకుండా ఆ మనిషినే చూస్తూ తన మెడలో అతను కట్టిన పసుపుకొమ్మునే చూస్తోంది.

"శారదా ఇక్కడ్నించి మనం షిల్మా స్టేషన్ కెళ్ళాలి. టైమవుతుంది పద" అన్నాడు.

మెడలో పసుపుతాడుని తీసిన శారద, అతను కట్టిన ఆ పసుపుతాడు అతని చేతిలో పెట్టేసిన శారద, 'నీకు జన్మజన్మలకీ శెల'వంటూ అతనికో పెద్ద నమస్కారం పెట్టింది.

అదంతా చూస్తున్న భ్రమర 'ఈ అరవింద్ కంటే ఆ డాక్టర్ వెంకటరమణ, భూషణ్‌రావు గొప్పవాళ్ళు. శారదక్క చేసింది సబబైన పనే' అనుకుని చప్పట్లు కొట్టింది.

స్వాతి సచిత్రవారపత్రిక








వాళ్ళ నాయనమ్మ నిద్రపోతుంటే ఆవిడ కుడి చేతికున్న బంగారపు మురుగుని సబ్బుబిళ్ళ రుద్ది లాగేసి ద్రాక్షారామంలో వుంటున్న బేబీ అనే స్కూలు టీచర్ కిచ్చేశాట్ట. ఇద్దరు పిల్లలున్న ఆ టీచరుకి భర్త పోయి మూడేళ్ళయిందట. ఇప్పుడా మనిషిని పెళ్ళాడతానని తిరుగుతున్నాడట.





ఆదిరెడ్డిగారి కోడలికి దెయ్యం పట్టింది గదా! దాన్ని వదిలించడానికి వడిశలేరు భూతవైద్యుణ్ణి తీసుకొచ్చారట. వీడికిదేం మాయరోగమో సవ్వారీ బండిమీద వచ్చిన ఆ భూతవైద్యుడికి మంత్రాలు రాకుండా ముందు పళ్ళన్నీ ఊడగొట్టేశాడట.

వెలంపేటలో వుంటున్న వాడ్రేవు చిట్టిపంతులు గారింటి వెనక పడిపోయిన గోడలో వుంటున్న పాము నిన్న రాత్రి పిడకలగూట్లో చేరిందట.

ఎలాంటి భయం లేకుండా చెయ్యిపెట్టి ఆ పాముని బయటికి లాగేసినవాడు చంపాలా?...గోపాలస్వామి గుడి అరుగుమీద మధ్యాహ్నం దాకా ఆడించి ఊరి చివరున్న బళ్ళ బుల్లెబ్బాయిగారి సమాధి దగ్గర వదిలి వచ్చేడట.

బాచి అనే ఆ మనిషి గురించి రకరకాలుగా చెప్పుకునేవారు మా ఊళ్ళో.

*

ప్రతిరోజూ తన జావా మోటారు సైకిలెక్కి మా ఊర్ని ఆన్చి ఉన్న రామచంద్రపురం వెళ్ళిపోయేవాడు. సరిగ్గా దీపాలవేళ అయ్యేసరికి ఇంటికొచ్చేసి స్నానం అదీ చేసి మడత నలగని సిల్కు బట్టలేసుకుని నూర్జహాన్ సెంటు రాసుకుని బయల్దేరే బాచి మళ్ళీ ఊళ్ళో దిగేసరికి తెలతెలవారేది.

ఒక సాయంత్రం సంతపేట దగ్గరున్న బ్రాహ్మణరెడ్డిగారి ఇంటి అరుగు మీద కూర్చున్న నా పక్కనే తన బండి ఆపి "మండపేట అవతల మురమండ అనే ఊరు వెళ్దామా" అని తీసుకెళ్ళిపోయాడు.

అదొక గ్రామం.

బండి ఒక వీధిలోకి తిప్పి ఒక ఇంటిముందు ఆపిన వెంటనే ఆ ఇంటి తలుపులు బార్లా తెరిచారు. మేం లోపలకెళ్ళేసరికి ఒక స్త్రీ నెలలు నిండి నెప్పుల్తో బాధపడుతోంది.

"ఎలాగుంది?" తలుపు దగ్గర నిలబడ్డ ముసలామెని అడిగాడు.

"మధ్యాహ్నం నుంచి మరీ ఎక్కువయ్యాయి నెప్పులు" చెప్పిందామె.

"అయితే చిన్నకారు తీసుకొస్తాను రాజమండ్రి తీసుకెళ్దాం" అని లేచి రాత్రికి రాత్రి ఆ నెలలు నిండిన మనిషిని రాజమండ్రి గవర్నమెంటు హాస్పిటల్‌కి తీసుకెళ్ళాడు.

ఆ రోజునుంచీ జోడీ అయ్యాను బాచికి.

వెన్నెల రాత్రుళ్ళు. చలివేసే సాయంకాలాలూ, వర్షం కురిసి వెలిసిన వేకువ వేళలూ తిరుగుతూనే వుండే వాళ్ళం. కొన్ని సందర్భాల్లో అతను మాటాడే తీరు విచిత్రంగా వుండేది. ఓ పట్టాన అర్థమయ్యేవి కావు అతని ఆలోచనలు.

కొన్నాళ్ళు గడిచిపోయాయి అలాగ.

మా ఊరు వదిలిపెట్టి మద్రాసు వెళ్ళిపోవాల్సిన పరిస్థితి వచ్చింది నాకు.

చాలా చిన్న వయసులోనే సినిమా డైరెక్ట్ చేసే అవకాశం కూడా వచ్చింది.

# 55

ఎనభై రెండులో మొదటి సినిమా తీసి, ఆ తర్వాత ఫ్లాపులూ అప్పుడప్పుడూ ఒక హిట్టూ తీస్తూ వస్తున్న నాకు ఒకరోజు ఉత్తరం ఒకటి వచ్చింది బాచి దగ్గర్నుంచి. 'మొదట్లో ఏబ్‌స్ట్రాక్ట్‌గా తీస్తూ వచ్చావు. ఇప్పుడు స్టైల్ మార్చి ప్లెయిన్‌గా తీస్తున్న విధానం బాగుంది కానీ, జీవం వుండటం లేదు. జనానికి విసుగ్గా వుంటోంది. అసలు విషయానికొస్తే మంచి కథలు నీకు దొరకడం లేదు. అందుకే నీ సినిమాలు దెబ్బతింటున్నాయి' అని ముగించాడు. నేను బాగా ఆలోచించేలా చేసింది ఆ ఉత్తరం. అతను రాసిన ప్రతీ అక్షరంలోనూ సత్యం కనిపించింది.

ఇరవయ్యేళ్ళ తర్వాత మళ్ళీ మా ఊరు వచ్చిన నన్ను పలకరించడాని కొచ్చారు కొంతమంది. వాళ్ళ నడిగాను బాచి గురించి.

కపాలేశ్వరుడు గుడి ఉద్యోగి చెల్లెల్తో ఊరు విడిచి వెళ్ళిపోయాడట. జనం ఇదంతా చెపుతుంటే "ఆ బాచి తత్వమేంటో ఏ మాత్రం అర్థం కావటం లేదు నాకు" అన్నాను.

"ఆ మదపిచ్చోడి గురించి అర్థం చేసుకునేదేముంటుంది" అన్నారంతా.

"ఇప్పుడతను ఏ ఊళ్ళో ఉంటున్నాడో ఎవరి కన్నా తెల్సా?" అడిగాను.

"ఊరు కాదు, లంకలో. చిలకల లంకట పేరు" చెప్పారు.

"ఎక్కడుంది చిలకల లంక?"

"యానాం రేవులో పడవేసుకుని పది మైళ్ళు వెళితే గోదావరి మధ్య తగుల్తుందట."

*

రాజమండ్రి నుంచి యానాం వెళ్ళే బస్సు మా ఊరి కాలవ గట్టుమీద ఆగుతుంది.

మర్నాడు పది గంటలకి ఆ బస్సు ఎక్కి నేను యానాం బయల్దేరాను.

ఆ ఊరి బస్‌స్టాండ్‌లో దిగి కాలి నడకన రేవు దగ్గరకెళ్ళేసరికి మధ్యాహ్నమయింది. రేవులో పల్చగా వున్న జనాన్ని అవతలున్న వెదుర్లంక రేవుకి చేరవేస్తుంది పంటు. ఒడ్డునే చిన్న కాఫీ హోటలుంది. దాంట్లో కూర్చున్న సొట్టకాలు శెట్టి పళ్ళెంలో చల్లారిపోయి వున్న మిరపకాయ బజ్జీల మీద ఈగలు వాలకుండా మసి పాతతో విసురుతూ బేరాలకోసం చూస్తున్నాడు. కొబ్బరినౌజా, బొబ్బర్లతో చేసిన మసాలా గారెలూ సత్తుపళ్ళాల్లో పెట్టుకుని అమ్ముకుంటూ తిరుగుతున్నారు ఇద్దరు పిల్లలు. ఆంజనేయస్వామి గుడి కడతన్నాం అని డిబ్బీ ఊపుకుంటూ తిరుగుతున్నాడో మనిషి.

శెట్టి కాఫీ హోటలు పాకలో కెళ్ళి రెండు బజ్జీలు తిని టీ తాగి, "నేను చిలకల లంక వెళ్ళాలి. లాంచీగానీ, పడవగానీ దొరుకుద్దా?" అన్నాను.

"దింపడానికయితే ఎవరూ రారండీ. రానూ పోనూ అయితే శేషారావుగాడి నావ మాటాడొచ్చు" అని భుజం మీది మసిపాతతో గుండెల మీదున్న చెమటని తుడుచుకుంటూ పైకిలేచి కుంటుకుంటూ వెళ్ళి, కాస్సేపటికి నిక్కరు మాత్రం వేసుకున్న శేషారావు అనే మనిషిని తీసుకొచ్చి మాటాడిపెట్టాడు.

*





ఆ ఇసుకతిప్ప మధ్యలో నిలబడితే ఎటు చూసినా గోదావరే కనిపిస్తుంది. పచ్చి ఇటుకల గోడల్ని పేడతో అలికి సున్నం ముగ్గులు పెట్టి, పైన రెల్లుగడ్డితో నేసిన కుటీరం ఒకటి తిప్ప అంచునే వుంది. పచ్చి వెదుళ్ళతో చుట్టూ కట్టిన దడికి ఒక మూల చిక్కుడు పాదూ, ఇంకో మూల వుచ్చపాదూ పాకి వున్నాయి. కుటీరం వెనకాల తులసికోటా, దానికి కాస్త దూరంలో గోరింటాకు మొక్కా, కరివేర పూల మొక్కా వున్నాయి.

నావ దిగి ఆ కుటీరం దగ్గర కొచ్చిన నన్ను "ఎవరు కావాలండీ" అనడిగిందొక స్త్రీ.

చూస్తే, నల్ల బోర్డరున్న బూడిదరంగు చీర కట్టుకునుంది. అడ్డ పాపిట తీసుకుని నొక్కి జడ వేసుకుని పెద్ద కుంకుమబొట్టు పెట్టుకుని వున్న ఆమెకి కుడికాలు లేదు.

ఆమెనే చూస్తూ నిలబడ్డ నన్ను మళ్ళీ అడిగింది, "ఎవరు కావాలండీ మీకు?" అని.

"బాచిగారి కోసం వచ్చాను" చెప్పాను నేను.

"సాబందలంక వెళ్ళారు. వచ్చే టైమైంది కూర్చోండి."

టైము చూసుకున్న నేను "ఎంతసేపట్లో రావచ్చండి?" అన్నాను.

"పనసపొట్టూ, ఆగాకర కాయలూ కావాలంటే బయల్దేరారు. వచ్చే టైమైంది. కాళ్ళు కడుక్కోండి" అని లేవడానికి కర్రలు అందుకోబోతుంటే "పర్లేదులెండి... ఆయనొచ్చే లోపు అలా వెళ్ళి గోదావరి చూసొస్తాను" అని లేచాను.

ఒడ్డు చాలా దూరానుంది. ఎటు చూసినా నిండు గోదావరి, చేపల వేటకెళ్ళే మరకాళ్ళ నావలూ,ఇసుకా, ఇటుకా, బెల్లం,చింతపండూ బుట్టలు రవాణా చేసే పడవలూ అటూ ఇటూ ప్రయాణం చేస్తున్నాయి. కాళ్ళని నీళ్ళ అంచున పెట్టి ఇసుకలో కూర్చుని వీస్తున్న చల్లగాలిని పీలుస్తున్నాను.

అక్కడి మట్టీ, నీళ్ళు, గాలి అన్నీ స్వచ్ఛంగా వున్నాయి. ఎక్కడ పాదం పెట్టినా, ఏది ముట్టుకున్నా స్వచ్ఛతే కనిపిస్తోంది. బాచి మీదా, ఆ ప్రకృతి మీదా సాగుతున్నాయి నా ఆలోచనలు.

చాలాసేపు గడిచింది.

గాలిలో చలనం పెరిగింది.

తెరచాప కట్టిన చిన్న నావని నడుపుకుంటూ వచ్చిన బాచి పక్కనే ఆపి "ఎంత సేపయిందీ వచ్చి?" అన్నాడు.

"ఇందాకే," ఇరవయ్యేళ్ళ తర్వాత మళ్ళీ చూస్తున్నా. అతన్లో సహజమైన మార్పే వుంది. జుట్టు అయితే సగానికి పైగా పండిపోయింది. పెంచిన గడ్డం కూడా.

"లోపలికెళ్ళావా? ఆవిడకి కనిపించేవా?" అడిగాడు.

"ఆఁ" అతను చెయ్యి అందిస్తే లేచాను.

"నేను దిగబెడ్తాన్లే" అని నేనొచ్చిన నావవాణ్ణి వెనక్కి పంపించేశాడు.

"కూరగాయలు తేవడానికి రాజుగారి తోటలో కెళ్ళాను. తీరా చూస్తే ఆయన లేడు" నా ముందు నడుస్తూ అన్నాడు బాచి.

*

వేడినీళ్ళతో తలమీంచి స్నానం చేశాక పల్చని ఇస్త్రీ లాల్చీ, నెమలికంఠం రంగున్న శంఖం మార్కు లుంగీ నాకిచ్చి కట్టుకోమన్నాడు.

పప్పు పులుసు చేసి, మజ్జిగ మిరపకాయలు వేసి భోజనం పెట్టిందావిడ.

బయటంతా వెన్నెల, వెన్నెల్లో గోదారి అందం అంటే అదే. చేపలు పట్టేవాళ్ళు నీళ్ళలో ఒక పక్కంతా వలలు వేశారు. రాదారి పడవలూ, లాంచీలూ ఆ పక్కకి రాకుండా ఆ వలలు వున్న ప్రాంతమంతా కొబ్బరిచిప్పల్లో తేలే ఇలాయి బుడ్లు వెలిగించి పెట్టారు. కాస్త దూరంలో మరో లంక ఏదో వున్నట్టుంది. అక్కడి వాళ్ళ గుడిసెల ముందు వెలిగించుకున్న హరికెన్ లాంతర్లు మినుకుమినుకుమంటూ ఇక్కడికి కనిపిస్తున్నాయి.

రెండు మడత మంచాలు పట్టుకొచ్చి ఇంటి బయట వాల్చాడు. పరుపు చుట్టలు తీసుకొచ్చి వాటి మీద విప్పి నల్ల బిన్నీ దుప్పట్లు పరిచి ఒక మంచం మీద తను పడుకుని ఇంకో మంచంమీద నన్ను పడుకోమన్నాడు.

ఆగాగి వీస్తున్న గాలిని అనుభవిస్తూ వెన్నెల్లో ఆ కుటీరాన్ని చూస్తున్నాను. అతని హృదయం ఎలాంటిది అని ఎవరైనా అడిగితే ఇదిగో ఈ వాతావరణం లాంటిది అని చెప్పాలనిపిస్తుంది.

"ఎప్పుడొచ్చావ్?" అడిగాడు.

"నిన్న" చెప్పాను.

"నిన్న అక్కడికొచ్చి ఇవాళ ఇక్కడికి బయలుదేరావన్న మాట. నేనింకా గుర్తున్నందుకు చాలా సంతోషం... మళ్ళీ ఎప్పుడెళ్తావ్?"

"తీసిన సినిమాలు వరుసగా దెబ్బతిన్నాయి. మంచి స్క్రిప్టు తయారుచేసి అప్పుడెళ్దామనుకుంటున్నాను."

"మంచి ఆలోచనే" అని నా గురించి మరికొన్ని ప్రశ్నలు వేసి, కాస్సేపు ఆగి చెప్పడం మొదలుపెట్టాడు. "నువ్వు మర్చిపోయి వుంటావ్. ఊళ్ళో కొవ్వూరి రాములు అని ఒకతనున్నాడు. వాళ్ళబ్బాయి పేరు బాబులు. నెల కోసారి ద్రాక్షారామం, ద్వారపూడి లాంటి చోట్ల జరిగే దూళ్ళ సంతలకెళ్ళి మంచి దున్నపోతు కనిపిస్తే ఎంత రేటుకైనా కొనుక్కొచ్చేస్తుంటాడు. తీసుకొచ్చిన ఆ దున్నపోతుల్ని బాగా మేపి గేదెల్ని పొర్లడానికి పంపిస్తుంటాడు. అది వాడి వృత్తి అయితే, ఊళ్ళో కోళ్ళ పందాలు జరుగుతున్నప్పుడు కోళ్ళ కాళ్ళకి కత్తుల్ని కట్టడం వాడి సరదా.

"దున్నపోతుల మెళ్ళో కట్టే వెంట్రుకల తాళ్ళూ, పెద్ద పెద్ద రంగుపూసలూ అమ్ముకునే వెంకటలక్ష్మి అనే సంచార తెగకి సంబంధించిన పిల్ల, ఎద్దుల కాళ్ళకి నాడాలు వేసే ఈరిగాడి ద్వారా పరిచయం అయింది బాబులుకి.





"ఒక కట్టుబాటుకి లోబడి ఒక పద్ధతిలో వుండే వెంకటలక్ష్మితో 'నిన్ను ఇష్టపడుతున్నాను. నిన్ను పెళ్ళి చేసుకుంటాను' అని చెప్పి చేసే వృత్తి మాన్పించి వాళ్ళ పొలంలో వుండే పంపుసెట్లో కాపురం పెట్టాడు బాబులు.

"అలా కొన్నాళ్ళు గడిచాకా పెళ్ళి కుదిరింది బాబులుకి. అప్పటికి వెంకటలక్ష్మికి కానుపయ్యి ఏడోరోజు, రోజుల బిడ్డ అడ్డాల్లో వున్నాడు.

"ఒక మధ్యాహ్నం వెంకటలక్ష్మి దగ్గరకొచ్చిన బాబులు ఏదో పని చెప్పి తనని పొలంలోకి పంపించి కాయితం పొట్లంలో వున్న వడ్లగింజల్ని రోజుల బిడ్డ నోట్లో పోసేసి మింగించేశాడు.

"ఆ విషయం తెల్సిన నేను పరుగెత్తుకుంటూ అక్కడికెళ్ళాను. అప్పటికే చనిపోయాడా పసి కుర్రాడు. ఆ బిడ్డ శవాన్ని తీసుకుని కొవ్వూరి రాములు ఇంటికెళ్ళాను. నా గొడవకి చాలామంది జనం మూగారు. నా దగ్గరకొచ్చిన కొందరు పెద్ద మనుషులు. 'ఈ ఊళ్ళో చాలామందికి ఇలా ఇంకో కుటుంబం వుంది. ఇప్పుడు కాదు, ఎన్నో తరాల్నుంచి వస్తూ వుందీ పద్ధతి. ఇలా కాపరాలు చేసే ఆడవాళ్ళలో ఎక్కువమంది ఏదో ఒక రకంగా ఆర్థికంగా వెనకబడినవారే. వాళ్ళు అలా పడుండటానికి తప్ప మొదటి భార్యలుగా వుండటానికి పనికిరారు' అని సర్దిచెప్పే ప్రయత్నాలు చేశారు.

"దాంతో మరింత రెచ్చిపోయిన నేను ఆ పసిపిల్లాడి శవాన్ని భుజమ్మీదేసుకుని కాకినాడ దాకా వెళ్ళాను. పోలీసులు దిగారు ఊళ్ళోకి. ఇదంతా విని రామచంద్రపురంలో వున్న విలేకర్లు సైకిళ్ళ మీద దిగిపోయారు. ప్రతి వీధిలోనూ జనం మూగారు. చాలా గందరగోళంగా తయారైంది ఊరు.

"పోలీసులూ, ఊళ్ళో పెద్దలూ ఇలా చుట్టూ మూగిన అందరి సమక్షంలోనూ సంచార తెగకి సంబందించిన వెంకటలక్ష్మి మెడలో బాబులు తాళి కట్టాక నా చేతిలో వున్న పసిపిల్లాడి శవాన్ని బాబులు చేతే మట్టికుండలో పెట్టి పాతి పెట్టించాను.

"అది జరిగిన రోజు నుంచీ ఊరు ఊరంతా నా మీద కక్ష గట్టింది. ఒకటి రెండుసార్లు నన్ను చంపే ప్రయత్నాలు జరిగాయి. ఒకళ్ళిద్దరి కాలూ చెయ్యీ తీసి రౌడీగా పేరెల్లిన మంగమ్మ కొడుకు గవర్రాజు ఒక అర్ధరాత్రి చెల్లూరు వంతెన మీద కూర్చున్న నా కళ్ళు తీసేద్దామని ప్రయత్నం చేసి చీకట్లో కత్తి గురి తప్పడంతో తన జబ్బమీద పొడుచుకున్నాడు.

"కపాలేశ్వరస్వామి దేవాలయంలో ఓ ఉద్యోగి చెల్లెలికి షుగరువ్యాధి వచ్చి కాలు తీసేస్తే భర్త వదిలేశాడామెని.

"ఏదో విధంగా నన్నొక బలమైన ఉచ్చులో బిగిద్దామని ఆలోచిస్తున్న ఊరి వాళ్ళంతా ప్రతీరోజూ నా దగ్గరకొచ్చి గుడి ఉద్యోగి చెల్లెలు ఏ ఆధారం లేకుండా పడుంది. ఆవిడికో దారి చూపించు చూద్దాం అని రెచ్చగొట్టారు.

"ఆలోచించిన నేను ఆమె దగ్గరకెళ్ళి మాటాడాక రాములవారి గుడి దగ్గరకి ఆమెని తీసుకెళ్ళి తాళి కట్టాను. ఈ విషయం తెల్సిన మా ఇంట్లో వాళ్ళు మా ఆస్తి నీకు దక్కదు. నిన్ను కులంలోంచి వెలి వేయిస్తున్నాం

అని బయటికి గెంటేశారు. దాంతో ఆమెని తీసుకొని ఊరు బయటికొచ్చిన నేను ఎక్కడెక్కడో తిరిగి చివరికి ఇక్కడ ఆగి నాకు నచ్చిన వాతావరణాన్ని నేను నిర్మించుకున్నాను."

*

మర్నాడు మధ్యాహ్నం భోజనాలయ్యాక తిరుగు ప్రయాణానికి సిద్ధమైన నన్ను నావ ఎక్కించి లంగరు లాగి గెడ వేశాడు బాచి. నెమ్మదిగా కదిలిన నావ పిసరంత వేగాన్ని అందుకుంది కాస్సేపటికి. దాంట్లో కూర్చుని లంకలో బాచి నిర్మించుకున్న పర్ణశాలని చూస్తున్నాను. నేను దూరమయ్యేకొద్దీ దాని సౌందర్యం పెరుగుతోంది అనిపించింది నాకు.

యానాం రేవులో నన్ను దింపుతూ "నాలాంటివాణ్ణి చూడ్డానికి చాలా దూరం వచ్చావు నువ్వు" అన్నాడు బాచి.

"నీలాంటి ప్రత్యేకమైన మనుషులు ఎక్కడున్నా వెళ్ళి తీరాలి" అన్నాను.

"నీ అపోహ గాకపోతే నేను ప్రత్యేకమైన మనిషినేంటి?" అన్నాడు బాచి.

"అబద్ధం ఆడ్తున్నావ్. నిజంగా నువ్వు ప్రత్యేకమైన మనిషివే" అన్నాను నేను.

"మహానుభావుల్తో పోల్చుకుంటే చాలా మామూలు జీవితం నాది. చాలామంది మామూలు మనుషుల జీవితంలో జరిగే సాదాసీదా సంఘటనలే నా జీవితంలోనూ జరుగుతూ వస్తున్నాయి. అయితే ఒక విషయం, ఈ మధ్య ఒక గ్రంథం చదివి దాంట్లో ఒక సత్యాన్ని జీర్ణం చేసుకున్నాను. ఆ సత్యాన్నే నేను అమలులో పెట్టడం జరిగితే భవిష్యత్తులో ఎప్పుడన్నా నన్ను చూడ్డానికి రావచ్చు నువ్వు. అప్పుడీ మాటన్నా ఒక అర్థం ఉంటుందేమో!"

"ఏంటా సత్యం?"

"విశాల దృక్పథమే జీవితం
సంకుచిత తత్వమే మృత్యువు
స్వార్థపరత్వమే సర్వనాశనం
ఇదే జీవిత సత్యం!"

*స్వాతి మాసపత్రిక*
*అక్టోబరు 1997*









# న్యూగ్రాండ్ సర్కస్ కంపెనీ

ఆగస్ట్16 ఆవేళ. ఒకటే ఎండ. గాలాడ్డం లేదు. చిరచిర్లాడిపోతుంది. నీలపల్లిలో ఉన్న శ్రీసత్య టూరింగ్ టాకీస్‌లోకి *ఇంద్ర* సినేమా వచ్చిందంటే నేనూ యర్రంశెట్టి అబ్బాయీ (అసలు పేరు నీలాద్రి) పిల్లా సుబ్బారావూ బయల్దేరాం.



ఇలా వంతెన దిగేమో లేదో మూడు నాలుగు లారీలు, మూడు వేన్లూ ఎదురయ్యినియ్యి. లారీల్లో ఉన్న బోనుల్లో జంతువులూ పాతబడిపోయిన గుడారాల చుట్టలూ రకరకాల సామాన్లు, వేన్లలో ఆడామగా నలభైమంది జనం. వాళ్ల దగ్గరకెళ్ళిన అబ్బాయి కనుక్కుని వచ్చాడు, అది న్యూగ్రాండ్ సర్కస్ అంట. వాళ్ళది మహారాష్ట్ర అంట. దాని ఓనరు పేరు ఏ.ఎస్.మహేంద్రకర్ ఆప్టే అంట. వారంరోజుల క్రితం ఈ వూరొచ్చి షోలేస్తామని జెప్పి నీలపిల్లమ్మ గుడి పక్క ఖాళీస్థలం యాజమానితో మాటాడుకుని వెళ్ళేడంట.

సామాన్లన్నీ దించేకా లారీలూ వేన్లూ అద్దె తీసుకుని వెళ్ళిపోయినియ్యి. చూడ్డానికి గమ్మత్తుగా ఉన్న ఒక డొక్కు వేన్ మట్టుకి మిగిలిపోయింది. అది వాళ్ళ సొంతమంట. జనంలో మరాఠీవాళ్ల కంటే తెలుగోళ్ళే చాలా మందున్నారు. వాళ్ళంతా తాడేపల్లిగూడెం పాటిమీద సాయిబులంట. ఒక ముసలిపులీ, సింహం, ఒంటె, ఏనుగూ, గుర్రం, రెండు కోతులు, మూడు కుక్కలూ అన్నీ ముసలివే దిగినియ్యి.



ఆడామగా తలో పనీ అందుకునేసరికి వాళ్ళని చూసిన మేం మేట్నీ రేపు చూద్దార్లే అని వాయిదా వేసుకుని ఆ జనంలోకి దూరేం. గుడారాలు లేపుతున్నారు. ఎలక్ట్రీషియన్ కాశీప్రసాద్ సీరియల్ బల్బులు బిగించి రాత్రి షోకి తిప్పే సెర్చిలైటు అమర్చే పనిలో పడిపోయేడు. ఇక్కడునన్నాళ్ళూ ఉండటానికి చిన్న చిన్న టెంట్లూ, మరుగుదొడ్లూ రెడీ చేసుకుంటున్నారు కొందరు. ఒకడు గాడిపొయ్యి తవ్వుతుంటే అక్కడికొచ్చిన ఒకాడమనిషి ఒక పొయ్యి వెలిగించేసి టీ కాచి రింగులూడిపోయిన పాత పింగాణీ కప్పుల్లో పోసి అందరికీ ఇస్తుంది. వాళ్ళ మధ్యలో కొచ్చిన ఓనరు మహేంద్రకర్ ఆప్టే వాళ్ళ వేన్‌లో మైక్‌సెట్టూ అదీ పెట్టి రెడీ చేయించి మధ్యాన్నం నించే షోలు అని చుట్టుపక్కల వూళ్ళల్లోకి తిరిగి కేన్వాసింగ్ చెయ్యడానికి ఏర్పాట్లు చేస్తున్నాడు.

వాళ్ళ సందడంతా చూస్తా అక్కడి కొచ్చిన కుర్ర టైలర్ సింహాచలం ఆ వాతావరణంలో బీదరికాన్ని గమనించేక "ఓనర్ మీరేనాండీ?" అన్నాడు.

"అవును భాయీ నేనే" అన్నాడు మహేంద్రకర్.

"రైతులు వర్షాల్లేక అల్లల్లాడిపోతున్నారు కానీ, ఎండ బాగా కాస్తంది. నేల పొడిగా గట్టిగా ఉంది. మీరు సుబ్బరంగా వేసుకోవచ్చండి ఆటలు. ఇయ్యాళమట్టి చూసుకోండి. ఒకటే జనం..." అనేసరికి ఆ సర్కస్ కంపెనీ ఓనరు చాలా సంబరపడిపోతా "కంపెనీ చాలా లాసులో ఉంది. దరిద్రంలో వున్నాం... ఈవూళ్ళో షోలు బాగా పడతాయని చాలా హోప్‌తో దిగేం" అన్నాడు.

"తప్పకుండా పడతాయి. రేపట్నుంచి చూసుకోండి అద్దరికి వంతెన పడిపోయిందేమో గోదారవతల్నుంచి కూడా దిగిపోతారు జనం" అనేసెళ్ళిపోతున్న సింహాచలాన్ని రెప్పార్పకుండా చూస్తున్నాడు మహేంద్రకర్.

అతన్లో హుషారు పెరిగిపోయింది. అతను నిత్యం పూజ చేసుకునే కాళీమాతకీ వాళ్ళ రాష్ట్రంలో సాయినాధుడికి దణ్ణెట్టుకున్నాడు.

*

రాత్రయ్యింది.

ఆరోజు పౌర్ణమి.

వాళ్ళు పడుకున్న చిరిగిపోయిన గుడారాల చిల్లుల్లోంచి పెద్ద పెద్ద చుక్కల్లా పడ్తుంది వెన్నెల. ఉధృతంగా వీస్తున్న గోదారిగాలికి పూనకం వచ్చినట్టూగిపోతున్నాయి కొబ్బరిచెట్లు. గాలి విసురుకి నీలపల్లి రాములోరి గుడి పూజారి అయోధ్యరామాచారి గారింటి దొడ్లో సీతాఫల చెట్టు కొమ్మలు విరిగిపోయినియ్యి. వంతెన దగ్గర అరిటిపళ్ళ క్రిష్ణ కొట్టు ముందర గానుగ చెట్టు పడిపోయింది. రెయ్యలసీడు వ్యాపారం చేసే సూర్నాణ నాలుగు నిట్రాళ్ళ పాక పక్కకి వాలింది.

న్యూగ్రాండ్ సర్కస్ కంపెనీ ఓనరయిన మహేంద్రకర్ ఆప్టే ఆ వాతావరణం చూసి మహా సంబరపడి పోతున్నాడు. మందు చవగ్గాబట్టి యానం వూళ్ళో కెళ్ళి ఒక నిబ్బు తెప్పించుకుని తాగడం మొదలెట్టేడు. మహా నందంతో ఉన్న ఆ మహేంద్రకర్ ఎప్పుడూ లేనన్ని కలలు గనేస్తుంటే ఎప్పుడూ సరిపోయే నిబ్బు ఆవేళ చాల్లేదు. కుర్రోడ్ని దవులూరోరి షాపుకి పంపించి ఇంకో సీసా తెప్పించుకుని రెండు గుక్కల్లోనే పట్టేసేడు.

సర్కసొచ్చిందని ఎనౌన్స్ చెయ్యడానికి బయల్దేరిన వాళ్ళ డొక్కువేను జార్జిపేట, మల్లవరం, తాళ్ళరేవు దాని లోపలున్న బొడ్డు వెంకటాయపాలెం, ఏటిమొగ భైరవపాలెం తిరిగొచ్చింది.

మధ్యాన్నం వచ్చిన జనాన్ని చూసిన మహేంద్రకర్ చాలా సంబరపడిపోయేడు. సర్కస్‌కి మళ్ళీ ఆదరణ వచ్చిందంటా, చాలా ఆవేశపడతా మాటాడ్తున్నాడు. "ఇన్నాళ్ళనించీ ఏ వూళ్ళో షోలు వేసినా ఏదో చాలీచాలని ఆదాయం అక్కడికక్కడ సరిపోయేది. కానీ, ఈ వూళ్ళో అలాక్కాదు. మళ్ళీ కొత్త డేరాలు కొంటాను. మహేంద్రా కంపెనీకెళ్ళి కొత్త ఫీట్లు చెయ్యడానికి కొత్త రకం వేన్ చెయ్యమని నేనే డిజైను చేసిస్తాను. వయసులో ఉన్న జంతువుల్ని కొంటాను. కలకత్తా వెళ్ళి కొత్తకొత్త ఫీట్సు చేయడానికి పనికొచ్చే సామాన్లు తెస్తాను" అంటా బుకింగ్ కౌంటరు దగ్గరకెళ్ళి తనే టిక్కెట్లు అమ్మడం మొదలెట్టేడు.

నేలా బెంచీ గేలరీ నెమ్మదిగా తెగుతున్నాయి టిక్కెట్లు.

సర్కస్ మొదలయ్యింది. ముసల్దయిపోయిన పులి నీరసంగా వచ్చింది. అలాగే సింహం కూడా వచ్చింది. వాటిలో ఏమాత్రం జీవకళ లేదు. వయసు మళ్ళిపోయిన ఏనుగుని ఇద్దరు లాగుతుంటే వెనకనించి ఇద్దరు తోస్తుంటే అడుగువెయ్యలేక వేస్తూ వచ్చింది ఫీల్డులోకి. కుక్కలూ కోతులూ వచ్చి ఫీట్లు చేసినియ్యి. వాటిని చూసిన కొందరు డిస్కవరీ చానల్లో వీటి బాబుల్లాంటి జంతువుల్ని చూపిస్తున్నారు, ఇయ్యేంటెహె అనుకున్నారు. జోకరు వేషం వేసుకొచ్చిన మనిషి జనాన్ని నవ్వించే ప్రయత్నం చేస్తున్నాడు. నాసిరకం బట్లేసుకుని యవ్వనం జారిపోయున్న ఆడాళ్ళు జనాన్ని అలరించే పన్లో ఉన్నారు. మొగ్గలేసేటప్పుడు ఒకామె టాప్ పీస్ చిరిగిపోయి... బ్రెస్ట్ బయటపడ్డంతో కుర్రకారులో ఒకటే గోల... కేకలు, అరుపులు.

అలాగ ఒక రెండు గంటలు గడిచేసరికి మేట్నీ అయ్యింది. *ఇంద్రకెళ్ళుండాల్సింది* అనుకున్నారు, బయటి కొచ్చిన జనాల్లో చాలామంది.

ఓపక్క చీకటి పడ్తుంటే సెర్చి లైటు వెలిగించేడు ఎలక్ట్రీషియన్. ఆ స్ట్రాంగ్ లైటు నెమ్మదిగా మూడువందల అరవైడిగ్రీలూ తిరుగుతూంది. స్పీకర్లలోంచి మేరానామ్‌జోకర్ సినేమాలో పాటలు వినపడ్తున్నాయి.

ఆ ప్రాంతాలకి సర్కసెప్పుడూ రాలేదేమో ఫస్ట్‌షోకి కూడా పల్చగా వచ్చేరు జనం.

వాళ్ళని చూసిన సర్కస్ చేసే జనాల్లో హుషారొచ్చింది. దాంతో, మేట్నీకంటే బాగా రక్తి కట్టించేరు ఫస్ట్‌షో.

రాత్రి తొమ్మిదయ్యింది. ఆ ఫస్ట్ షో అయ్యి జనం బయటికొస్తున్నారు.

బయట స్పీకర్లోంచి పాటలు.

జనంలో ఆ కాస్త రెస్పాన్స్ చూసిన మహేంద్రకర్ ఆనందంతో గంతులేస్తున్నాడు. ఇష్టానికి ఊగిపోతా మాటాడ్తున్నాడు. ఆమధ్య పిఠాపురంలో కేంప్ వేసినప్పుడు ఎవరో ముగ్గురొచ్చి నీ సర్కసు కంపెనీ అమ్ముతావా అని అడిగి, అమ్మే ఉద్దేశం ఉంటే ఫోన్ చెయ్యమని నెంబరిచ్చేరు. ఎంత ధైర్యం వాళ్ళకి. ఇది మా తాత ఏ.ఎస్. గంగారామ్ ఆప్టే బ్రిటీష్‌వాళ్ళ కాలంలో ఆరంభించిన సర్కస్ కంపెనీ. దొరల చేతుల్లోంచి బంగారు పతకా లందుకున్న కంపెనీ, వందేళ్ళ చరిత్రగల కంపెనీ అంటా చాలా కథలు విప్పుతున్నాడు.

ఆట వదిలి జనం బయటికొస్తుండగా ఆకాశం నిండా నల్లటి మబ్బులు. వర్షం మొదలైంది.





మామూలు వర్షంగాదు. ఈమధ్యకాలంలో ఎవరూ చూసెరగని వర్షం. దానికి గాలితోడయ్యేసరికి ఇంక చూస్కోవాలి.

చింకిపోయిన సర్కస్ గుడారాల్లో జనం తడిసి ముద్దయిపోతున్నారు. చలికి తట్టుకోలేని ముసలి జంతువులు పెద్దగా అరుస్తా పొలికేకలు పెడ్తున్నాయి. పాటిమట్టి నేలంతా తడిసిపోయి చితచితలాడిపోతుంది.

గంటా రెండు గంటలు. ఎంతకీ ఆగడం లేదు. దూరంగా ట్రాన్స్‌ఫార్మర్ పేలిపోయిన చప్పుడు. ఎలక్ట్రిక్ పవరు కట్టయ్యింది. వర్షం, గాలీ రెండు రెట్లు పెరిగాయి.

రాత్రి పన్నెండయినా తగ్గలేదు వర్షం. 'కొంపదీసి తుఫాను కాదు గదా?' అనుకున్న మహేంద్రకర్ ఆప్టే ముఖం నిండా చెమట్లు పట్టేసినియ్యి. గబగబా ఆ వర్షంలోనే నడుచుకుంటా యానాం వూళ్ళోకెళ్ళి హాఫ్ బాటిల్ గోల్డ్ కప్ బ్రాందీ కొనుక్కుని నీళ్ళు కలుపుకోకుండా ఏదీ నంజుకోకుండా తాగేసేడు.

*

పులికీ సింహానికీ మాంసం వెయ్యాలి. గొడ్డు మాంసం కొనే స్థితిలేక ఊళ్ళో ఓ డజను ఊర కుక్కల్ని పట్టుకు రండి రెండు రోజులకి సరిపోతుంది వాటి మాంసం, అని మనిషిని పంపిస్తే వెళ్ళిన వాడు ఆ వూర కుక్కల్తో పాటు వూళ్ళో చంద్రకళా లాడ్జి ఓనరు అట్లూరి శివసుబ్రమణ్యం ఇంట్లో సీమకుక్కని కూడా కొట్టుకొచ్చే సేడు. దాంతో సుబ్రమణ్యం యానాం స్టేషన్లో కేసు పెట్టేసరికి పోలీసులొచ్చి కుక్కల్ని పట్టుకున్న ఆ మనిషిని స్టేషన్‌కి లాక్కొచ్చి చితగ్గొట్టి సెల్లో పాడేసేరు.

స్టేషన్లో తమిళవాడైన సి.ఐ. సెందిల్‌నాథన్ దగ్గరకెళ్ళిన మహేంద్రకర్ బతిమాలి బామాలి ఒప్పించే ప్రయత్నం చేసేడు. ఈలోగా ఇంకో గొడవ. ఏనుగు తిండి కోసం యానాం అవతలున్న ఇంజరం దగ్గర వేసున్న చెరుకుతోటలో ఓ యాభై గెడలు సర్కసు కంపెనీ మనిషి నరుక్కొచ్చేడని ఆ వూరి రైతులు తరుముకుంటా వచ్చేరు.

అందరికీ సర్దిచెప్పి నచ్చజెప్పి వచ్చేడు మహేంద్రకర్ ఆప్టే. అప్పటికి వర్షంకూడా ఆగింది. షో పడద్దని ఆశ. ఈలోగా మళ్ళీ వాన. కుంభవృష్టి. చెట్లనీ, పుట్లనీ, పాకల్నీ, పందిళ్ళనీ కుదిపేస్తుంది. ఏం చెయ్యాలో అర్థంగాని మహేంద్రకర్ కాపాడమంటూ నమ్ముకున్న దేవుళ్ళందరికీ ప్రార్థన చేస్తున్నాడు. కాళీమాత స్తోత్రం పారాయణం చేసుకుంటున్నాడు.

ఇంతలో,

ఎన్నో ఏళ్ళనించి జంతువుల మంచీ చెడ్డా చూసుకునే ముసలివాడయిన నాగూర్‌భాయి పరుగెట్టుకుంటా వచ్చి ఒంటె నోట్లోంచి తీగలు తీగలు కింద పడ్తున్నాయని భయపడతా చెప్పేసరికి ఊళ్ళో వెటర్నరీ డాక్టరు కొండ్రావు దగ్గరకెళ్తే 'ఆవులూ గేదెల గురించి తప్ప ఈ ఒంటెలూ ఎలుగుబంటులకి ట్రీట్‌మెంట్ చేసిన అనుభవం నాకు లేదన్నా'డాయన.

ఏం చెయ్యాలో అర్థంగావటం లేదు. గాలి, వాన జూస్తే ఆగటం లేదు.

అర్ధరాత్రప్పుడు తన తండ్రికాలం నాడు రాజస్థాన్ ఎడారుల్లో కొనుక్కొచ్చిన ఆ ఒంటె తన నిండు ప్రాణాలు విడిచింది. ఆ ఒంటెశవాన్ని చూస్తూ వర్షం కురుస్తున్న ఆ రాత్రంతా అలాగుండిపోయేడు మహేంద్రకర్.

ఎవరో శాపం పెట్టినట్టు ఆగని వర్షం. అసలేం చెయ్యాలో ఈ కంపెనీని ఎలా ముందుకు నడపాలో అర్థంగాని స్థితిలో ఉంటే కంపెనీలో పనిచేసే జనవంతా తన ముందు మూగిపోయి ఎంతో కొంత ఇవ్వండి, ఊళ్ళలో మాడిపోతున్న మా కుటుంబాలకి పంపించుకోవాలని ఒకటే గొడవ చెయ్యడం మొదలెట్టేరు. చూస్తున్నారు గదా ఏమివ్వను, ఎక్కడ్నించి తెచ్చివ్వను అంటే ఏమాత్రం వినడం లేదాళ్ళు. వాళ్ళందరికీ సర్దిచెప్పే పనిలో వుండగా వచ్చిన వేన్ డ్రైవరు పాటిల్ "నాకు పదినెలల్నించి జీతం లేదు. అక్కడ మన రాష్ట్రంలో ఉన్న నా పెళ్ళాం పిల్లలు మాడిపోతున్నారు. ఇవ్వాళ ఇస్తావా ఛస్తావా" అని కూర్చున్నాడు.

"ఇలా చూస్తూ నువ్వు డబ్బులడగడం ఏవన్నా సబబుగా వుందా?" అన్నాడు మహేంద్రకర్.

"ఇదే ముక్క తొమ్మిది నెల్లనించి చెప్పి వెనక్కి పంపిస్తున్నావు. ఇక వినను. నీకంటే మాడి చస్తున్నా నా పెళ్ళాం పిల్లలే ఎక్కువ నాకు" అన్నాడు.

ఇద్దరికీ చాలా పెద్ద గొడవైంది.

అసలే చాలా బాధల్లో ఉన్న మహేంద్రకర్‌కి చాలా కోపమొచ్చేసింది. "ఏం చేసుకుంటావో చేసుకోరా' అనేసేడు.

"నేను కాకినాడలో ఎక్కడన్నా పని చూసుకుంటాను నా జీతం ఇస్తానని కబురు చేసిన రోజున వెనక్కొస్తాను" అనేసెళ్ళిపోయేడు. వేన్ నడపడంతో పాటు సర్కసులో చాలా ఫీట్లూ గమ్మత్తులూ చేస్తాడు పాటిల్. వాడు లేకపోతే సర్కసాటకి కళ ఉండదు. గబుక్కున తన కోపాన్ని అణుచుకుని వాడ్ని వుండమని ఎంత బతిమాల్నా ఉండలేదు పాటిల్.

వర్షం కాస్త తగ్గు మొకం పట్టింది. యానాం పాత బస్టాండ్‌లో గంగాధరం అనే డ్రైవర్ని పెట్టుకుని, ఉంగరాల బాబ్జీగారి ఎనౌన్సుమెంటు బండోడ్ని బతిమాలుకుని (ఇది వరకయితే రెండు పన్లూ మంద్రేకరే చేసేవాడు) పంపిస్తూ 'ఒక్క తాళ్ళరేవుతో వెనక్కొచ్చెయ్యకుండా చొల్లంగి, జగన్నాధపురం దాకా కూడా వెళ్ళి గట్టిగా కేన్వాసు చేసిరమ్మ'న్నాడు.

పొద్దుటనగా వెళ్ళిన ఆ ఎనౌన్సరూ, డ్రైవరూ సాయంత్రానికి రీజెన్సీ ఫేక్టరీవాళ్ళ లారీలోంచి దిగేరు. కంగారుగా వాళ్లని జూసి దగ్గర కొచ్చిన మహేంద్రకర్ "ఇలా దిగేరేంటి వేనేది?" అన్నాడు.

"నాకు లైసెన్సూ అయ్యా లేవని తాళ్ళరేవు దగ్గర పోలీసులు పట్టుకున్నారండి" అన్నాడు గంగాధరం.

"నీకు లైసెన్సు లేదా?" షాకయిపోతా అడిగేడు మహేంద్రకర్.

"ఉంటే మీరిచ్చిన పాతికరూపాయిలకి నేనెందుకు బండెక్కుతానండీ?" అన్నాడు గంగాధరం.

గోల్డుఫ్లేకు సిగరెట్టు కాలుస్తా రాసుకుంటున్న ఎస్సై దుర్గాప్రసాద్ దగ్గరకెళ్ళి "నమస్కారం సాబ్... నా పేరు ఎ.ఎస్. మహేంద్రకర్ ఆప్టే. వందేళ్ళ హిస్టరీ ఉన్న న్యూ గ్రాండ్ సర్కస్ కంపెనీ ఓనర్ని. కేన్వాసింగ్ చేసుకుంటుంటే మీవాళ్ళు మా వేన్‌ని పట్టుకుని స్టేషన్‌కి తీసుకొచ్చేరు" అన్నాడు.



"మావాళ్ళు కాదు నేనే పట్టుకు తీసుకొచ్చేనా వేన్‌ని... మీ డ్రైవరుకి లైసెన్సుందా?" అన్నాడు ఎస్సై దుర్గాప్రసాద్.

"ఒరిజినల్ డ్రైవర్ పాటిల్‌కి లైసెన్సే కాదు ఇన్సూరెన్సు కూడా ఉంది. టెంపరరీగా పెట్టిన ఈ డ్రైవరుకి లేదని ఇందాకే తెల్సింది."

"వేన్‌కి సీ బుక్కుందా? హారనూ పైన టోపేరం ఉన్నాయా?" అడిగేడు ఎస్సై దుర్గాప్రసాద్.

"హారనూ టాపూ ఉన్నాయి... కేన్వాసింగ్‌కి తిరిగే ఈ వేనే సర్కసులో ఐటమ్స్ కూడా చేస్తుంది... ఆ టైములో టాపూ హారనూ గట్రా తీసేసి పొద్దుట మళ్ళీ బిగిస్తాం... ఈ గాలివాన గొడవలో పడి మర్చిపోయేరు మా వెధవలు మాఫ్ కరోజీ... క్షమించి వదిలెయ్యండి."

"అయిదువేల రూపాయలు ఫైన్ కడితే తప్ప వేన్ తిరిగివ్వం" అన్నాడు కుర్ర ఎస్సై దుర్గాప్రసాద్.

"ఎమౌంటు లేదు... నాలుగు షోలు పడ్డాకా మీరడిగినంతా ఇస్తాం భాయీ సాబ్" అన్నాడు మహేంద్రకర్.

"ముందు ఫైన్ కట్టాకనే వేన్ ఇచ్చేది" నికార్సిగా అన్నాడు దుర్గాప్రసాద్.

"జంతువులన్నీ ముసలివయిపోయినియ్యి... మనుషులు ముసలోళ్ళయిపోయేరు... వేన్‌తో చేసే ఫీట్సే ప్రాణం మా ప్రోగ్రాముకి. ఈ ఫీట్సు ఎట్రాక్షన్‌తోనే మేం బతుకుతున్నాం. నాలుగే నాలుగు షోలు అయ్యేకా మీ డబ్బులు మీకు కట్టకపోతే తిరిగి వేన్ పట్టుకుపోండి" అన్నాడు మహేంద్రకర్.

అంతా విన్న ఆ ఎంగ్ దుర్గాప్రసాద్ "ఇంతమందిని పోషిస్తున్న నీ దగ్గర అయిదువేలు లేవంటే ఎలా నమ్మమంటావ్?" అన్నాడు.

"నిజంగా లేవు సాబ్" అన్నాడు మహేంద్రకర్.

"ఒకరోజుకి మీ కంపెనీకయ్యే ఖర్చెంత?"

"దగ్గర దగ్గర ఇరవైవేలు."

"మరి అదంతా ఎక్కడ్నించి తెస్తున్నావ్?"

"యానాంలోనూ నీలపల్లిలోనూ దానికెదురుగా ఉన్న జార్జిపేటలోనూ ఉన్న కిరాణాకొట్ల వాళ్ళు, మాంసం కొట్లవాళ్ళు, కాఫీ హొటేళ్ళ వాళ్ల దగ్గరా రోజు మార్చి రోజు, ఒకడికి తెలీకండా ఒకడి దగ్గర అప్పులు చేస్తున్నాం. ఆ తాడు కూడా తెగడానికి ఆనకో రేపో అన్నట్టుంది." మహేంద్రకర్ చెప్పిన మాటల్లో పరమసత్యం ఉన్నా కుర్రఎస్సైకి నమ్మకం కలగలేదు. బహుశా తాగుడువల్ల చెక్కేసిన కందగడ్డలాగున్న మహేంద్రకర్ మొకం చూసేమో... అతని మాటల్లో నమ్రత లేకేమో.

మహేంద్రకర్ చాలా జీవిత సత్యాలు చెపుతా చాలా బతిమాల్తున్నాడు. అతని మీద మొదట పడిపోయిన ఇంప్రెషన్ కారణంగా వీసమెత్తు నమ్మడం లేదు దుర్గాప్రసాద్. చివరికి కాళ్ళు పట్టుకున్నా పనవ్వలేదు. దుర్గాప్రసాద్ మనసు కరగలేదు.

ఆకాశంలో మళ్ళీ నల్లమబ్బులు మూసుకున్నాయి. ముందు వర్షం తర్వాత గాలి. కరెంటుపోయింది. పగలే చీకటిగా ఉంది. రాష్ట్రంగాని రాష్ట్రం, ఊరుగాని ఊరు వచ్చిన మహేంద్రకర్ వర్షం కురుస్తున్న ఆ జగ్గంపేట

బంగాళాపెంకుల పోలీస్‌స్టేషన్ చూరుల్లోంచి బయటికి చూస్తుంటే ఒకటే దిగులుగా ఉంది. అక్కడ మహారాష్ట్రలో ఉన్న వాళ్ళ గ్రామం గుర్తుకొస్తుంది. భార్య గుర్తుకొస్తుంది. పెళ్ళికెదిగిన ముగ్గురు కూతుళ్ళు రాస్తున్న ఉత్తరాలూ, చేస్తున్న ఫోన్లూ గుర్తుకొస్తున్నాయి. కళ్ళల్లోంచి నీళ్ళు బయటికొస్తున్నాయి.

వర్షం తగ్గేక పనుందని తన బైక్ స్టార్ట్ చేసుకుని కాకినాడ సైడెళ్ళిపోయేడు దుర్గాప్రసాద్.

ఏం పాలుపోని మహేంద్రకర్ ఒక అదురుపాటులో ఉండిపోయేడు. ఒక అయోమయంలో పడిపోయేడు. పిచ్చిచూపులు చూస్తా మరమనిషిలాగ నడుస్తా వర్షంలో ఆగిన యానాం బస్సెక్కేడు.

*

మెయిన్ ఐటమ్స్ చేసే వేన్ ఎప్పుడయితే పోలీసుస్టేషన్లో పడిపోయిందో ఇక షోలు పడ్డం కనాకష్టం అని తేల్చేసుకున్నారు స్టాఫ్.

అప్పుడో గంటా అప్పుడో అరగంటా తెరిపిచ్చినా మళ్ళీ గాలివాన మామూలే. వంటలూ వార్పులూ, రొట్టెలు కాల్చడాలూ కుర్మా వండడాలు లేవు. అయిదురోజులు గడిచినియ్యి. పనిచేసే జనవంతా తిరగబడ్తున్నారు యాజమాని మీద. ఎప్పుడూ లేంది నోటికొచ్చినట్టు మాటాడ్తున్నారు కూడా.

తన మాటల చాతుర్యంతో ఒకళ్ళిద్దర్నయితే సర్దగలడు. కాకినాడ సముద్ర కెరటాల్లాగ మొత్తం వచ్చి మీద పడిపోతుంటే ఏం మాటడగలడు, ఎలా సర్దిచెప్పగలడు.

సెప్టెంబరు **14.**

తిండిలేక మలమలా మాడిపోతున్నారు జనం. అరువులిచ్చిన కిరాణాకొట్లవాళ్ళు, యానాం వంతెన మీద మాంసంకొట్టు సాయిబులూ, ఊళ్ళో కూరగాయల దుకాణం వాళ్ళు వచ్చి మమ్మల్నిలా మోసం చేస్తారా మాలో ఒకళ్ళకి తెలీకండా ఒకళ్ళ దగ్గర అరువులు పట్టుకెళ్తారా? నూరు ఆరైనా సరే మా డబ్బులు కట్టేదాకా మిమ్మల్నీ వూరు పొలిమేర దాటనియ్యం అంటా కూర్చున్నారు. మాంసం కొట్టు వలీ అయితే కత్తితో దిగిపోయేడు. చేపలమ్మే ఈశ్వరమ్మ ఉంచుకున్న మొగుడ్ని వెంటేసుకొచ్చింది. ఈలోగా స్థలం అద్దెకిచ్చిన మనిషి దిగేడు.

ఈ గొడవంతా జూస్తున్న నీలపల్లి మాజీ సర్పంచి ర్యాలి సత్యనారాయణగారి దగ్గరకొచ్చిన టూరింగ్ టాకీస్ ఓనరు ఉంగరాల బాబ్జీ "ఏవండీ... ఒక్కోసారి ఒక్కోదానికి ఒక్కోవూపు ఉంటదండి. ఇప్పుడు సినేమాలున్నాయనుకోండి, నలభై విడుదలైతే ముప్పై తొమ్మిది పోతున్నాయండి, ఒకటి ఆడ్తుందండి. కోట్లు ఖర్చుపెట్టిన సినేమాలకే గతిలేదు ఇప్పుడీ సర్కసెవడు చూస్తాడండీ" అన్నాడు. ఈలోగా వాళ్ళ మధ్యలోకొచ్చిన తాపీమేస్త్రి అబ్బిరెడ్డి సుబ్బారావు "పాపం వర్షం వీళ్ళకి చాలా ట్రబులిచ్చేసిందండి. గుర్రంగుడ్డిదయినా దాణా తప్పదు గదండీ... వాళ్ళకి పెట్టడం కోసం అరువులు తెస్తే ఆ కొట్లోళ్ళు చూడండి దేశంగాని దేశం నించొచ్చిన ఆ మరాఠీవోడ్ని ఎలా తినేస్తున్నారో" అన్నాడు. అటుగా వెళ్తా వాళ్ళ మధ్యలోకొచ్చిన దేవదానంగారు "ఈ ఎలక్ట్రానిక్ యుగంలో తోలుబొమ్మలూ, పగటి వేషగాళ్ళు, హరికథలూ, బుర్రకథలూ, సర్కసూలాంటి కళారూపాలకి చెదలు పట్టినియ్యి" అన్నాడు.



సర్కసోళ్ళ మీద అయిటమ్ రాద్దామని నీలపల్లి వార్త విలేఖరి కాగి ప్రసాదుని వెంటేసుకొచ్చిన యానాం వార్తాపత్రిక విలేఖరి చింతా కొండలరావు "ఈ సర్కసోళ్ళ పరిస్థితి చూస్తున్నాం గదా! చాలా దారుణవండీ. ఎవరికాళ్ళు వాళ్ళ బాధలు చెప్పుకునేడుస్తుంటే కడుపు తరుక్కుపోతుందనుకోండి" అన్నాడు.

"ఎలక్ట్రానిక్ మీడియాతో పరుగెట్టలేక కుంటి నడక నడుస్తా కుప్పకూల్తున్నారీళ్ళంతా" అన్నాడు దేవదానం.

వీళ్ళిలా మాటాడుకుంటుండగానే బాలకృష్ణ సిన్మా ఆడ్తున్న శ్రీ సత్యటూరింగ్ టాకీస్ జనంతో ఫుల్లయిపోయింది.

సెప్టెంబర్ 30.

ఎవరి చేతికి దొరికిన సామాన్లు పట్టుకుని పరారయిపోడం మొదలెట్టేరు సర్కసు కంపెనీలో జనం. ఆడోళ్ళలో కాస్త బాగున్న అమ్మాయిలు యానాం వూళ్ళో కుర్రోళ్ళని బొడ్డు వెంకటాయపాలెం, బేపనపల్లి మనుషుల్నీ ఆకట్టుకుని వాళ్ళతోపాటు వెళ్ళిపోయేరు. మగోళ్ళలో కొందరు రీజెన్సీ టైల్ ఫేక్టరీలోనూ, అడివిపాలం (అదోవూరు), రెయ్యిలమేత తయారుచేసే ఇండస్ట్రీలలోనూ పనికి కుదిరిపోయేరు.

వెళ్ళిపోతున్న వాళ్ళని చూస్తానే ఏం చెయ్యక అలా ఉండిపోయేడు యాజమాని మహేంద్రకర్.

వర్షం, గాలీ ఆగినియ్యి.

ఎండ కాయడం మొదలైంది.

సర్కస్ కంపెనీలో సగానికి సగం జనం, సామాన్లు బయటికెళ్ళి పోయినియ్యి. అరువులిచ్చిన కొట్లవాళ్ళు, స్థలం అద్దెకిచ్చినాయనా మహేంద్రకర్ చుట్టూ దడిగట్టేసేరు.

చాలా ఆలోచించిన మహేంద్రకర్‌కి సర్కస్ కంపెనీ మా కమ్ముతావా అన్న పిఠాపురం సైడు జనం గుర్తుకొచ్చేరు. తోలు సంచీలో దాచిన వాళ్ళ ఫోన్ నంబరు తీసుకుని ఫోన్ చేసేడు.

మర్నాటికి దిగిన వాళ్లతో "నా కంపెనీ అమ్మేస్తాను" అన్నాడు మహేంద్రకర్.

అవకాశం చూసుకున్న వాళ్ళు అయిదురూపాయిలు ఖరీదు చేసే ఆ కంపెనీని అర్ధరూపాయికి అడిగేరు. చాలా సేపు వాదన జరిగి చివరికి బేరం తెగింది.

ఆవేళ అక్టోబర్ 3.  కేష్‌తో వచ్చినవాళ్ళు మాటాడుకున్న ఎమౌంటిచ్చి ఒక్క మహేంద్రకర్‌ని మట్టుకి మిగిల్చి మిగతా సామాన్లని గుడారాల్నీ మనుషుల్నీ లారీల్లో ఎక్కించుకెళ్ళి పోయేరు.

మహేంద్రకర్ చుట్టూ కాపలా ఉన్న జనం కనీసం వచ్చిన కేష్‌ని లెక్కెట్టే సందు కూడా ఇవ్వకుండా ఎవడి లెక్క వాడు చెప్పి, ఎవడికి రావాల్సింది వాడు లాక్కెళ్ళిపోయేడు.

అంతా పట్టుకుని పోగా మహేంద్రకర్ చేతిలో చాలా తక్కువ డబ్బులు మిగిల్నియ్యి. ఆ డబ్బుల్తో తన కూతుళ్ళకి పెళ్ళిళ్ళు చెయ్యలేడు. ఇంకో వ్యాపారం మొదలెట్టలేడు. కనీసం ప్రతి మంగళవారం కాకినాడ నించి షిరిడీ వెళ్ళే రైల్లో మహారాష్ట్రలో ఉన్న వాళ్ళ వూరు వెళ్ళలేడు.

యానాం వూళ్ళో సాయిబాబా గుడుంది.

నీరసంగా నడుచుకుంటా గుడి దగ్గరకెళ్తున్న మహేంద్రకర్‌ని చూస్తా అరిటిపళ్ళ క్రిష్ణ, రెయ్యిలసీడు

సూర్నాణ, తాపిమేస్త్రి భద్రం, హొటేలు పోసియ్యా 'పాపం సర్కసోడు' అనుకుంటా మాటాడుకుంటున్నారు. వంతెన దిగుతుంటే రీజెన్సీలో పనిచేసే చిన్నారి పలకరించేడు. కిళ్ళీలు కట్టే బూషా (అసలు పేరు భూషణం) నవ్వేడు. అందరికీ నమస్కారాలు చేసుకుంటా సాయిబాబా గుడికొచ్చిన మహేంద్రకర్ మాసిపోయిన తన పైజామా జేబులో డబ్బుని గుడి లోపలి డిబ్బీలో వేసి నమస్కారం చేసుకుని బయల్దేరేడు.

*


సాయంత్రమైంది.

వృద్ధ గౌతమీ నదిలో గాలి లేదు. పగలంతా కాచిన ఎండ వేడి ఇంకా పోలేదు. ఒకటే ఉక్కగా ఉంది. జిగట జిగటగా ఉంది. చెమట వాసనగా ఉంది. దూరంగా సూర్యుడు మబ్బుల్లో కెళ్ళిపోడంతో ఆకాశమంతా ఎర్రబడి పోయుంది. పేదరాశి పెద్దమ్మ కుంకుమ ఆరబోసుకుంది. నది ఒడ్డున ఒంటరిగా కూర్చున్న మహేంద్రకర్‌కి ఒకటే రంగు కనిపిస్తుంది. అది లోపల అన్ని దారులూ మూసేసుకున్నాకా ఏర్పడే రంగు చీకటి.

జీవితంలో ఎంతో బతుకు బతికి ఎన్నో హంగుల్నీ రంగుల్నీ రుచుల్నీ అభిరుచుల్నీ చూసిన తను వాసనల్నీ సువాసల్ని చూసిన తను శాసనాల్నీ శ్వాసనాల్ని చేసిన తను ఈనాడిలాగయి పోవడానికి కారణం, కాలంలో మార్పులు. వందేళ్ళ చరిత్రగల సర్కస్ కళ ఈనాడిలా అంతరించిపోవడానికి చాలా కారణాలు. తను... తుంటే ఒక ప్రేక్షకుడయి పోయేడు తప్ప మరేం కాలేకపోయేడు. ఓడిపోయిన యుద్ధంలో ఒంటరి సైనికుడయిపోయేడు తప్ప మరేం కాలేకపోయేడు. నెమ్మదిగా పైకిలేచి... నడుస్తా లోతైన ఆ గోదాట్లోకి నడుస్తా... లోతైన గోదాట్లోకి దిగడిపోయిన మహేంద్రకర్ ప్రాణాలు పోవడానికి అయిదు నిమిషాలకంటే ఎక్కువసేపు పట్టలేదు.

సర్కస్ కంపెనీ నడుపుతా జమీందారు బతుకు బతికిన ఏ.ఎస్. గంగారామ్ ఆప్టే మనవడయిన ఎ.ఎస్. మహేంద్రకర్ ఆప్టే జీవితంలో ఆఖరి దృశ్యం మా యానాం రేవులో అలా ముగిసింది. న్యూగ్రాండ్ సర్కస్ డేరా శాశ్వితంగా మూతపడిపోయింది.


*స్వాతి సపరివారపత్రిక*









అలాకొక్కుంటూ వుంటే ఎంత బావుండేది!



రెండు వందల ఏళ్ళ క్రితం చిట్టూరి జగపతిరామయ్య అనే ఆయన ఒక చిట్టడవి మధ్యలో ఇల్లు కట్టుకుని దానికి దగ్గర్లో ఉన్న తన పోరంబోకు భూమిని సాగుచేసి బంగారం పండించటం మొదలెట్టాడట. అది తెలిసి ఆయన బంధువులంతా ఒక్కొక్కరుగా అక్కడికి చేరి ఇళ్ళు కట్టుకోవడం మొదలెట్టారట. కొన్నాళ్ళకి అదొక గ్రామం అయ్యిందట. ఇంకొన్నాళ్ళకి గ్రామంలో వాళ్ళంతా జేరి దానికి చిట్టూరి జగపతిరామయ్యగారి గ్రామం అని పేరు పెట్టారంట. ఇంతకీ ఆ జగపతిరామయ్యగారెవరో తెలుసా? మీ ముత్తాతగారి తాతగారు.

నా పెళ్ళి ఆ ఊళ్ళోనే అయ్యిందిరా అబ్బిగా! అదయ్యిన కొన్ని రోజులకే మనుగడుపు కొచ్చిన మీ నాన్నకీ, మీ పెదమావయ్యకీ పెద్ద తగాదా రావడంతో జన్మలో ఇక నేనుగానీ, మీ చెల్లెలుగానీ ఈ వూరు రాము అని శపథం చేసి ఈ మద్రాసు తీసుకొచ్చేశారు నన్ను. ఇది జరిగి ముప్ఫై ఏళ్ళయినా ఇప్పటికీ ఆ గ్రామం మీదా, మీ పుట్టింటి మీదా కోపం పోలేదు మీ నాన్నగారికి. అయిదేళ్ళ క్రితం అనుకుంటాను 'ఒకసారి వెళ్ళొస్తానండీ' అన్నాను. 'వెళ్ళు గానీ మళ్ళీ ఇక్కడకు రావల్సిన పని లే'దన్నారు. ఆ కోపిష్ఠి మనిషి ఇక మారడు అని నిర్ణయించుకున్న నేను అడగాలనే కోరిక వున్నా ఆయన్ని అడగలేకా, మింగలేకా ఛస్తున్నాను.







నేను పుట్టిన ఊరని గొప్పలకు కాదుగానీ, నిజంగా మా వూరెంత అందంగా వుంటుందిరా? నువ్వుగానీ చూస్తే ఈ ఉజ్జోగం వద్దూ సజ్జోగం వద్దని అక్కడే స్థిరపడిపోతావ్. ఇల్లులా ఉండదురా అది. ఒక ఫిర్కాని ఏలే రాజుగారి చిన్న కోటలా వుంటుంది. ముఖ ద్వారం ముందున్న సింహం బొమ్మ లిప్పుడున్నాయో, పడిపోయాయో! నాకు ముగ్గురు అన్నయ్యలూ, ముగ్గురు చెల్లెళ్ళు- అంటే మీ మావయ్యలూ, పిన్నులూ అన్నమాట. ఉమ్మడి కుటుంబం మాది. ఒకటే కుండ. కోటలాంటి యింట్లో అంతా తలో మూలా కల తిరుగు తుంటే ఎంత సందడిగా ఉంటుందో! ఏడాది పాటూ పెళ్ళి సందడే! ఊహించుకుంటేనే వాళ్ళలో కలిసిపోయినట్టు అనిపిస్తుంటుంది. నేను పోయేలోగా ఒక్కసారన్నా వెళ్ళి రావాలిరా మా వూరు.

తల్లి సరస్వతి చెప్పే వాళ్ళ ఊరి కథ ఇప్పటికి కొన్ని వందలసార్లు విని ఉంటాడు గోపాలక్రిష్ణ. మద్రాసులోనే పుట్టి పెద్దవాడయిన గోపాలక్రిష్ణ తండ్రి పనిచేస్తున్న రామన్ అండ్ కంపెనీ అనే చార్టెడ్ ఎక్కౌంటెంట్ సంస్థలోనే ఉద్యోగానికి చేరాడు.

వైజాగ్‌లో ఉన్న ఒక సిమెంట్ ఫ్యాక్టరీకి రెండు మూడు రోజుల్లో తమ సంస్థ తరపున ఆడిటింగ్‌కి బయల్దేరాల్సొచ్చింది. ఆ విషయం తల్లికి చెపితే చాలా ఉత్సాహపడి పోతూ దగ్గరకొచ్చి, "ఎలాగూ ఆ వైజాగు దాకా వెళ్తున్నావు గాబట్టి రాజమండ్రిలో దిగిపోయి మీ తాతగారి ఊరు వెళ్ళిరా. నా బదులు నువ్వన్నా చూసిరారా అబ్బీ!" అంది సరస్వతి.

"అనుకున్న టైముకి వైజాగ్ వెళ్ళకపోతే ఉద్యోగం పోతుంది. నాన్నకి తెలిస్తే మన ప్రాణాలే పోతాయేమోనే."

"ఒకరోజు ముందే శలవుపెట్టి బయల్దేరరా! తెల్లవారుఝామున రాజమండ్రిలో బస్సెక్కితే రాత్రికి తిరిగి వెనక్కొచ్చేయ్యొచ్చు" అంటూ రాజమండ్రి నించి చిట్టూరి జగపతిరామయ్యగారి గ్రామం ఎలా వెళ్ళాలో వివరంగా చెప్పింది సరస్వతి.

## 2

గోపాలక్రిష్ణ ఎక్కిన ట్రైను రాజమండ్రి స్టేషన్లో ఆగేసరికి తెల్లవారుఝామున నాలుగు గంటలింకా కాలేదు.

సూట్‌కేసూ, బేగ్‌తో ఫ్లాట్‌ఫారం మీదికి దిగి బయటికొచ్చి రిక్షా ఎక్కి కోటిపల్లి బస్టాండ్ కొచ్చి ఇక బయల్దేరడానికి సిద్దంగా ఉన్న 'రాజమండ్రి టు కోటిపల్లి' బస్సెక్కి పసలపూడికి టిక్కెట్టు తీసుకుని సీట్లో కూర్చున్న కాస్సేపటికి బయల్దేరింది బస్సు.

ద్వారపూడి రాగానే కుడిపక్కకు తిరిగి ఇప్పనపాడు, తాపేశ్వరం ఊళ్ళలోంచి మండపేట వంతెనెక్కి దిగి, రకరకాల గ్రామాలు దాటుకుంటూ పసలపూడి కాలువగట్టు దగ్గర తనని దింపి ముందుకెళ్ళిపోయింది.

ఇంకా తెల్లవారలేదు.

చల్లగా వీస్తుంది గాలి.

కాలువ గట్టు పక్కనే ఉన్న ఆంజనేయస్వామి గుళ్ళోంచి అర్చకుడి మంత్రాలు మంద్రంగా వినిపిస్తున్నాయి. అక్కడ్నించి పామర్రు వేపు వెళ్ళే బస్సెక్కి కురకాళ్ళపల్లి మర్రిచెట్టు దగ్గర దిగి ఒక మైలు దూరం నడిస్తే వాళ్ళ గ్రామం వస్తుందని చెప్పిన సరస్వతి మాటలు ఇంకోసారి గుర్తు చేసుకుంటూ ఆ బస్సు కోసం ఎదురుచూస్తున్న గోపాలక్రిష్ణ ఆ ప్రాంతమంతా పరిశీలిస్తూ చూశాడు.

నల్లటి తారురోడ్డు పక్కనే ప్రవహిస్తున్న గోదావరి కాలువలోంచి ముగ్గు పడవ ఒకటి వెళ్తోందా చీకట్లో, పడవ గూటికి కట్టిన హరికేన్‌లాంతరు పడవ ఊపుకి కదుల్తోంది నెమ్మదిగా. అది చూసిన అతనికి పద్మరాజుగారి 'పడవ ప్రయాణం', మొక్కపాటివారి 'మా బామ్మర్ది పెళ్ళి' కథలు గుర్తొచ్చాయి. నెమ్మదిగా పాముంచాల దగ్గరకొచ్చి ముఖం కడుక్కుని ఆంజనేయస్వామి గుళ్ళోకెళ్ళి 'రాత్రికి నన్ను రాజమండ్రీ చేర్చు స్వామీ' అని దణ్ణం పెట్టుకుని రోడ్డుకి అటుపక్క నుండే గోపాలరావుగారి కాఫీ హొటల్లో టీ తాగుతుండగా వచ్చేసింది కాకినాడ నుంచి పామర్రు

వెళ్ళే ఫస్టు బస్సు. తాగుతున్న గ్లాసు ఆ హొటేలు బల్లమీద పెట్టేసి చేతిలోనూ, భుజానా ఉన్న లగేజితో దాదాపు పరుగెడ్తున్నట్టు నడిచెళ్ళి ఆ బస్సులోకి దూరిన అతను కురకాళ్ళపల్లికి టిక్కెట్టు తీసుకొని చతికిలపడ్డాడు సీట్లో.

చెల్లూరు వంతెన దిగి వెంటూరు దాటి కురకాళ్ళపల్లి మర్రిచెట్టు దగ్గర ఆగిన ఆ పామర్రు బస్సులోంచి దిగేసరికి తెలతెలవారుతోంది. తల్లి చెప్పినట్టే బస్సు వెళ్ళిన రోడ్డుకి కుడిపక్కగా ఉందో సన్నటి ఎర్ర కంకరబాట. భుజం మీంచి జారిపోతున్న బేగ్ బెల్టుని సరిగ్గా సర్దుకుని ఎడంచేతిలో వున్న సూట్‌కేసుని కుడిచేతిలోకి మార్చుకుని గుంటలు పడి ఉన్న ఆ కంకరబాట మీద నడుస్తున్న గోపాలక్రిష్ణ ఒక వంద గజాలు ముందుకి నడిచాడో లేదో కనిపించిందా అందమైన గ్రామం.

సుదూరంగా ఉన్న కొండల వెనక నుంచి అప్పుడే అవుతోంది సూర్యోదయం. పొడుగాటి తాడిచెట్ల మధ్య ఉన్న ఆ గ్రామం మధ్యలో ఎత్తుగా వెలుగుతూ ఉంది రాములవారి గుడి గోపురం. ధ్వజస్తంభం మీది చిరుగంటలు గాలికి ఊగుతూ అస్పష్టంగా కనిపిస్తున్నాయి. కథల్లో తప్ప కళ్ళతో ఎప్పుడూ పల్లెటూరుని చూసి ఎరగని అతన్లో రాత్రంతా నిద్రలేని నీరసం మొత్తం పోయి కొండంత హుషారొచ్చేసింది. నడకలో వేగం పెంచాడు. విజిలేసుకుంటూ ఉత్సాహంగా నడుచుకుంటూ వెళ్ళిపోతున్నాడు ఊరి వేపు. నడుస్తున్న కంకరబాటకి రెండు పక్కలా ఉన్న పచ్చని పంట పొలాల్లోంచి చల్లగా వీస్తున్నాయి గాలులు. పొలాల్లోకి అప్పుడే దిగిన కూలిజనం జనపథం మీంచి నడుస్తూ జానపదం పాడుతూ తియ్యడం మొదలుపెట్టారు కలుపు మొక్కలు. బాటకి కుడిపక్కనే ఉన్న తాడి చెట్టెక్కి కల్లు తీస్తున్న కుర్రాడు 'కాస్త గట్టిగా పాడండెహె' అనరుస్తూ ఊరి వేపెళ్తున్న తనకేసి పరికించి చూస్తున్నాడు. ఊళ్ళోకి వెళ్ళడానికి ముందే రెండు చెరువులు కనిపించాయి. ఎడం పక్కనున్న చెరువులో గేదెల్నీ, ఆవుల్నీ కడుగుతున్నారు పాలేళ్ళు. మాసిన బట్టల మూటల్తో దాని గట్టు మీదికి జేరిన చాకలివాళ్ళు పొయ్యిలు వెలిగించి చాకలి చౌడూ, నీళ్ళూ పోసి నానబెట్టిన బట్టల్ని ఆ పొయ్యిమీదున్న పెద్ద బానలో వేస్తున్నారు. కుడిపక్క నుంది మంచినీళ్ళ చెరువు. దాని మధ్యలో పూసి ఉన్న ఎర్రటి తామరపూల చుట్టూ రెక్కలాడిస్తూ కల తిరుగుతోంది తెల్లటి బాతుల గుంపు. నీళ్ళ బిందెలు చంకన వేసుకుని కబుర్లు చెప్పుకుంటూ ఆ చెరువు వేపొస్తున్న ఆడపిల్లలు ఎదురొస్తున్న గోపాలక్రిష్ణని చూడగానే ఆడ్తున్న కబుర్లు ఆపేసి కంగారుపడ్తూ పామంచాల్లో కెళ్ళిపోయారు. వాళ్ల వెనకాలే బట్టలమూటతో వస్తున్న చాకలోడ్ని ఆపి "ఈ వూళ్ళో చిట్టూరి జగపతిరావయ్యగారి ఇల్లెక్కడా?" అన్నాడు.

ప్రశ్న అర్థంకాని ఆ చాకలోడు అయోమయంలో పడిపోయి అదోలా చూస్తున్నాడు. అడిగిందే మళ్ళా అడుగుతున్నాడు గోపాలక్రిష్ణ. అర్థంగాని వాడు అదోలా చూస్తూ నిలబడి నువ్వడిగేదేంటో అర్థం గావట్లేదని సైగలు చేస్తుండగా, "నేను చూపిస్తాను రండి" అన్న మాటలు వినిపించడంతో వెనక్కి తిరిగి చూశాడు.

నీళ్ళు నిండిన కూజా బిందెని నడుంకి ఆన్చి పట్టుకుని ఉందామె. ఇరవై ఏళ్ళకి లోపే ఉంటుంది వయసు. నల్లటి శరీరం. అమావాస్య చీకటంత నల్లగా ఉంది జుట్టు. నవ్వకపోయినా నవ్వుతున్నట్టున్నాయి పెదాలు. వెడల్పాటి కళ్ళు. సూదిగా ముక్కు.



నా వెనక రమ్మని ముందుకు అడుగులు వేస్తున్న ఆమె కాళ్ళ వెండి మువ్వల శబ్దం వింత లయగా వినిపిస్తోంది.

పది అడుగులేశాక ఆ చాకలాడు అలా ప్రవర్తించాడేంటి అని వేసిన ప్రశ్నకి సమాధానం చెప్పింది. మూగవాడట వాడు. ఆమె తన గురించి అడిగింది. క్లుప్తంగా చెప్పాడు. ముందుకెళ్తున్న వాళ్ళిద్దర్నీ చిత్రంగా చూస్తున్నారు ఇళ్ళలోంచి బయటికొచ్చిన జనం. 'ఆ అబ్బాయెవరు నాగమణీ' అని అడుగుతుంటే 'రాజమ్మ గారి మనవడు' అని చెప్తూనే గబగబా ముందుకు వేస్తోంది అడుగులు.

తల్లి చెప్పినట్టే ఒక చిన్న రాజుగారి కోటలా పడిపోవడానికి సిద్ధంగా ఉన్న ఒక పెద్ద ఇంట్లోకి అతన్ని తీసుకెళ్ళిన నాగమణి కూజా బిందెని గచ్చు మీద పెట్టి లోపలికి పరుగెట్టి క్షణాల కాలంలో వెంటబెట్టుకొచ్చింది రాజమ్మగార్ని. చాలా వరకూ ఊడిపోయి, పండిపోయి ఉన్న జుట్టుని చిన్న ముడిగా వేసుకుని ఉన్న ఆ ముసలావిడ శరీరం ముడుచుకుపోయి ఉంది. ఎనభై నాలుగేళ్ళామెకి. చూపు సన్నగిల్లిపోయింది.

గోపాలక్రిష్ణ దగ్గరకొచ్చిన ఆమె అతని శరీరాన్ని ఆప్యాయంగా తడుముతూ తన కుటుంబం క్షేమ సమాచారాల్ని మొత్తం అడుగుతూ లోపలికి తీసుకెళ్తుంటే కింద పెట్టిన కూజా బిందెని ఎత్తుకుని వెళ్ళిపోయింది నాగమణి.

లోపలికొచ్చిన గోపాలక్రిష్ణ ముసలి అమ్మమ్మ తప్ప ఇంట్లో ఇంకెవ్వరి మాటలూ వినిపించకపోయేసరికి, "ఇంట్లో వాళ్ళింకా నిద్ర లేవలేదా అమ్మమ్మా?" అనడిగేడు.

అతని ప్రశ్నకి గొల్లుమని ఏడ్వడం మొదలెట్టింది రాజమ్మ.

క్షణం కంగారుపడ్డ అతను ఒడలిపోయి, ఒంగిపోయిన ఆమె భుజాలు పట్టుకుని "ఏడవకు" అంటూ ఓదార్చే ప్రయత్నం చేశాడు.

ఎన్నో తరాల్నుంచి ఉమ్మడిగా బతుకుతూ వస్తున్న ఆ కుటుంబం ఈ తరంలో విడిపోయిందట. కోటంత కొంపని పడగొట్టేసి విడిగా ఇళ్ళు కట్టుకుంటామని కొడుకులు గొడవ పెడితే ఒప్పుకోలేదట రాజమ్మ. కోపమొచ్చిన ఆ కన్నబిడ్డలు ఈ ముసలావిడ్ని ఒంటరిగా వదిలేసి ఊళ్ళో తలో మూలా తలో ఇల్లూ కట్టుకున్నారట. మాకూ వాటాలొస్తాయి అంటూ అల్లుళ్ళు చెప్పి పంపగా వచ్చిన కూతుళ్ళు కూడా రాజమ్మతో గొడవలు పడి దూరమయ్యారట.

"శుభమా అని మనవడొస్తే ఆ శోకాణాలేంటి మామ్మా?"

తలెత్తి చూశాడు.

నీళ్ళ బిందె వాళ్ళ ఇంట్లో పెట్టేసి వచ్చిన నాగమణి గుమ్మం దగ్గర నిలబడి ఉంది.

"బాధలన్నీ వీడికి చెప్పుకుంటుంటే వీళ్ళమ్మతో చెప్పుకుంటున్నట్టుందే మణీ!"

"నాలుగు రోజులుంటారుగా, దిగిన వెంటనే మొదలెట్టాలా మామ్మా?"

ఆమె మాటకి కంగారు పడ్తూ వాచీ చూసుకున్న అతను, "నాలుగురోజులు కాదు. రాత్రికే రాజమండ్రి వెళ్ళి అక్కడ్నించి వైజాగు బండెక్కాలి" అన్నాడు.

"ఒక్క రాత్రన్నా ఉండకుండా ఒచ్చిన రోజే వెళ్ళిపోతావా మనవడా?" అంటూ మళ్ళీ ఏడవడం మొదలెట్టిన రాజమ్మకి దగ్గరగా వచ్చి రేపు ఉదయానికి తను విశాఖపట్నంలో ఉండకపోతే తన ఉద్యోగానికి ఎంత ప్రమాదమో, తనీ ఊరు వచ్చినట్టు వాళ్ళ నాన్నకి తెలిస్తే ఇంకెంత ప్రమాదమో వివరంగా చెప్పి నొప్పి తగిలిన ఆమె మనసుని మృదువుగా ఒప్పించాడు.

"సర్లేరా దీపాలవేళకి బయల్దేరుదువుగాన్లే" అని మనవడి స్నానానికి వేడినీళ్ళు పెట్టబోయి కుండ బద్దలు కొట్టిన రాజమ్మగార్ని పక్కకు తప్పుకోమని పొయ్యి వెలిగించి రాగి బిందెడు నీళ్ళు కాచి దొడ్లో ఉన్న గోలెంలో పోసి అతన్ని స్నానానికి పంపించి వాళ్ల ఇంటికి పరుగెట్టింది నాగమణి.

స్నానం చేసి వచ్చి ఇస్త్రీ బట్టలు వేసుకుని టైము చూసుకుంటూ వచ్చిన గోపాలక్రిష్ణకి వేడి ఇడ్లెన్ల కంచం, పచ్చడిగిన్నె పట్టుకొచ్చి అతని ముందు పెట్టిందా అమ్మాయి.

ఇబ్బందిగా ఆమె కేసి చూస్తూ రాజమ్మకేసి తిరిగి, "పాపం ఈమెని ఇబ్బంది పెడ్తున్నాం అమ్మమ్మా" అన్నాడు.

"ఏం పర్లేదులేరా, మన బంధువుల పిల్లే ఈ మణి. ఒంటరిగా పడున్న నా దగ్గరకి రోజూ వచ్చి పనులన్నీ చేసి పెట్టిగానీ కదలదీ పిల్ల" అంది రాజమ్మ.

"సుబ్రంగానే వండింది మా అమ్మ... తినండి" అంది నాగమణి.

తినడం మొదలెట్టిన అతన్ని జేర్చి కూర్చుంటూ, "ఒరే బాబూ... ఈ అమ్మమ్మని చూసి ఇక్కడ్నించి వెళ్ళిపోతే మీ మావయ్యలూ, పిన్నులూ నొచ్చుకుంటార్రా... అందరి ఇళ్ళకీ వెళ్ళి పలకరించి వస్తే మర్యాదగా ఉంటుందేమోరా" అంది రాజమ్మ.

టైము చూసుకుంటూ తినడం పూర్తిచేసిన గోపాలక్రిష్ణ "అలాగే అమ్మమ్మా! ఈ వూళ్లో ఎవరిల్లు ఎక్కడుందో ఎవరు చూపిస్తారు నాకు?" అన్నాడు.

"మన మణి ఉంది గదా! దీనికూడా వెళ్ళు."

కాస్త ఇబ్బందిగా ఆమె కేసి చూసి కదలబోతుండగా రెక్క పట్టుకుని ఆపి "ఊర్నిండా మన బంధువులే. ఎవరు పిలిస్తే వాళ్ళింటి దగ్గరాగిపోయేవు. ఒసే మణీ, పిల్లలందరి ఇళ్ళకీ తీసుకెళ్ళే పూచీ నీది" అని పంపించింది రాజమ్మగారు.

నీళ్ళ బిందెల కావళ్ళని మోసుకొస్తున్న జనం, సైకిలు వెనక కేరియర్‌కి చిన్న చెక్కపెట్టి కట్టుకుని 'రొట్టీ బిస్కెట్' అని అరచే, పొరుగూర్నుంచొచ్చే ముసలి రాములూ, ఎరువులు చల్లడానికి స్ప్రే మిషన్ని అపోలో యాత్రికుళ్ళా భుజానికి కట్టుకున్న పాలేళ్ళు వాళ్ళకి ఎదురయి గోపాలక్రిష్ణ గురించే అడుగుతున్నారు.

తాపీగా వాళ్ళకి సమాధానాలు చెప్తుంటే టైము చూపించి కదలమన్నట్టు సైగచేశాడు గోపాలక్రిష్ణ.

ఆకెళ్ళవారి వీధి అవతలున్న గోపాలస్వామి గుడి దాటబోతుంటే, ఆ గుడి ఆవరణలో ఉన్న పారిజాత వృక్షం మీంచి ముందుకు నడవడానికి వీల్లేనంత దట్టంగా నేలమీదికి రాలిపడి ఉన్నాయి పుష్పాలు. రాత్రి కురిసిన మంచు తాలూకు బిందువులు ఆ పూలమీద పడి ఉదయం పూస్తున్న లేత ఎండకి స్వామి ముత్యాల్లా



మెరుస్తున్నాయి. గబగబా గుట్ట మధ్యకి చేరి గుప్పెడుపూలు ఏరుకున్న నాగమణి, "మీ రెండో మావయ్యగారింటి కెళ్ళాక సూదీ దారం అడిగి దండలాగ గుచ్చుతాను" అంది.

"గుచ్చాక ఏం చేస్తావ్?"

"జడపాయలో తురుముకుంటాను."

"నేను తురమనా నీ జడలో?"

మంద్రస్థాయిలో, మధుర స్వరంతో అతనలా అడుగుతుంటే తపోల్లాసిని రాగం వింటున్నట్టనిపించిం దామెకి. వర్షం వచ్చినప్పుడు దీపం చుట్టూ ముసిరే ఉసుళ్ళలాగ రకరకాల ఆలోచనలు గజిబిజిగా ముసురు కోవడం మొదలెట్టాయి ఆమె మనసులో.

పాత సర్పంచి రామదాసుగారి వీధిలో నడుస్తుండగా బుడ్డ కోసిన ఆంబోతొకటి లగెత్తుకుంటూ వచ్చే స్తోంది వాళ్ళ వైపు. దాన్ని చూసి కెవ్వుమని అరుస్తూ వెనక్కి పడ్డ అతని తల వెనకభాగం వెనకే నడుస్తున్న ఆమె కుచద్వయాన్ని బలంగా తాకింది.

వరద గోదావరి పోసమ్మ గండి దగ్గర సుళ్ళు తిరిగి ప్రవహించినట్టు ప్రయాణించడం మొదలెట్టింది ఆమె లేత నరాల్లో వేడి రక్తం. లేతగా ఉండే ఆమె చేతివేళ్ళు క్లిష్టమైన కానడ రాగ గమకాన్ని వీణ మెట్ల మీద కదిలిస్తున్నట్టు వణికాయి. సుగంధ సింధూరమైన ఆమె పెదవులు ఆహ్లాదంతో పురివిప్పాయి. ఆమనిలో యామిని లాంటి ఆమె నయనాలు అందంగా విరబూశాయి.

గోపాలక్రిష్ణ పెద్ద పిన్ని శకుంతల ఇంటికెళ్ళగానే అక్క సరస్వతి పోలికలున్న అతన్ని అవ్యాజ ప్రేమతో అక్కున జేర్చుకుని "కనీసం నిన్నయినా చూడగలిగాన్రా. మా అక్కని ఇక ఈ జన్మలో చూడగలుగుతానో లేదో" అని కన్నీళ్ళు పెట్టుకుంది.

సూదీ, దారపు కండే తీసుకుని మాల కడ్తూ ఒక మూల కూర్చుంది నాగమణి. శకుంతల భర్త, గోపాలక్రిష్ణ చిన్నాన్న అయిన సాంబమూర్తి స్నానాల దడి దగ్గర పక్కన పడేసి ఉన్న పచ్చి తాటాకుల మీద కల తిరుగుతున్న కోడిపెట్టని పట్టుకుని పాలేరుతో కోయించాడు. కోడిమాంసం కూర, నేతిగారెలూ, అప్పుడే తెచ్చిన చెరువు చేపలతో చింతకాయల పులుసూ వండి, కడుపు నిండా తిన్నాకా గానీ అక్కడ్నించి కదలడం కుదర్లేదు.

మేదరోళ్ళగుట్ట దాటి వస్తుండగా చేతిలో ఉన్న పారిజాతాల మాలని వాసన చూసుకుంటూ నడుస్తున్న నాగమణిని చూసి "ఈ దండ దేవుడికేస్తావా?" అన్నాడు.

"వాడిన పూలు దేవుడి కేస్తారేంటి ఎక్కడన్నా?" అందామె.

"మరేం చేస్తావ్?".

"ఇంటికెళ్ళాక జడలో తురమమనీ అడుగుతాను మా అమ్మని. అప్పటిదాకా వాడిపోకుండా ఉంటాయా ఈ పూలు?".

"నేను తురమనా?"

"ఏమిటి?"

"వాడిపోతాయి అంటున్నావ్ కదా! నీ జడలో నే తురమనా అని అడుగుతున్నాను."

"అలాగే."

నాగమణి చేతిలో పారిజాత పుష్పమాలను అందుకున్న గోపాలక్రిష్ణ ఆమె జడపాయ తీసి తురుముతుంటే కళ్ళు మూసుకున్న ఆమెకి ఏవో సుందర స్వప్నలోకాల్లో స్వైరవిహారం చేస్తున్నట్టు, దట్టంగా మంచు కురిసిన అరకులోయలో అందంగా విహారాలు చేస్తున్నట్టు ఉంది.

ఏ స్పందనకీ గురికాని అతను మాత్రం ఇంకోసారి వాచీ చూసుకుని, "టైమవుతోంది ఇంకా చాలా చోట్ల కెళ్ళాలి" అని గొణగడంతో నడిచింది ముందుకి. వెనకే నడుస్తున్నాడతను.

చింతలతోపులో గూటిబిళ్ళ ఆడుతున్నారు పిల్లలు. దూసుకుంటూ వాళ్ళలోకి జారిపోయిన నాగమణి, "రండి ఆడదాం" అంది. వాళ్ళ మధ్యకి చేరి రాని ఆటని కాస్సేపు ఆడి దూసుకొచ్చిన బిళ్ళ మోచేతికి తగలడంతో, "పద మరి" అన్నాడు.

రెండో మావయ్య చంద్రరావు, మూడో మావయ్య సూర్రావు, రెండో పిన్ని సావిత్రి కుటుంబాల్ని పరామర్శించి అపూర్వమైన వాళ్ళ ఆతిథ్యాన్ని స్వీకరించి బయటికొచ్చిన గోపాలక్రిష్ణ "ఆఖరి పిన్ని విమలగారి ఇంటికెళ్ళొచ్చేస్తే ఇక అందర్ని కల్సినట్టే" అన్నాడు.

"వాళ్లు ఊరికి ఉత్తరం వేపు తోటలో మేడ కట్టుకుని ఉంటున్నారు" అంది మణి.

మరోసారి టైము చూసుకున్న అతను "బాగా దూరమా?" అన్నాడు.

"పెద్ద దూరం కాదు. చెట్టిబల్జీల పేట అవతలున్న పిల్లకాలవ దాటితే వచ్చేస్తుంది."

"నాకు టైమవుతుంది పద మరి."

గోపాలక్రిష్ణ తొందర చెయ్యడంతో గబగబా అడుగులెయ్యడం మొదలెట్టింది నాగమణి.

పెద్దిరాజుగారి వీధి అవతలున్న పెద్ద జమ్మిచెట్టు దాటి పొలాలవేపు నడుస్తుంటే పాడుబడ్డ ఒక గుడి కనిపించింది. అది పోలేరమ్మ గుడి.

## 3

అనుకున్నట్టే అయ్యింది. రథం వీధీ, సంతపేటా దాటి కచేరి సావిడి దాటుతుండగా మూగిపోయారు అక్కడ కూర్చున్న ఊరి జనం. గోపాలక్రిష్ణ తల్లిదండ్రుల క్షేమసమాచారాలు కనుక్కున్నాకా నువ్వు నాకు మేనల్లుడి వరుసవుతావని ఒకడూ, చిన్న తమ్ముడి వరుసవుతావని ఇంకొకళ్ళూ- ఇలా రకరకాల జనం, రకరకాల వరుసలు కలిపి ఆతిధ్యం ఇవ్వడానికి వాళ్ళ ఇంటికి లాక్కుపోతుంటే వాళ్ళ బారి నుంచి అతన్ని తప్పించేసరికి చచ్చిన చావయ్యింది నాగమణికి.

పోతురాజు కిళ్ళీకొట్టులో గోలీసోడా తాగించాక మండ సావిత్రిగారి మేడ దాటి బంగారుతల్లిగారి పాత ఇంటి మలుపు తిరిగి పడాల రామన్నగారి సందు దాటుతున్నారు. చాలా ఇరుకు సందు అది. వర్షం కురిస్తే గుంటల్లో ఉండే నీళ్ళు ఓ పట్టాన ఇంకవు. ఎరుకలి వాళ్ళ పందులు ఆ గుంటల్లోనే పొర్లుతూ వుంటాయి. నడుస్తున్న గోపాలక్రిష్ణ ఓ గుంటలో అడుగెయ్యబోయి కంగారుగా వెనక్కి జంప్ చేసి ఆమె మీద పడ్డంతో





అతని కుడి భుజం ఆమె ఎడమ చెంపకి మెత్తగా తగిలేసరికి ఒక రకమైన వింత విద్యుత్తు ఆమెలో ఆవహించి అంతరాంతరాల్లో అందంగా వికసించింది. శరీరంలో ప్రధాన నరాలన్నింటికీ ప్రమాదమైన జ్వరమొచ్చినట్టు స్పందించడం మొదలెట్టాయి. అప్పుడే పూసిన ఆకు సంపెంగల పరిమళం మంద్రంగా మనసుని తాకినట్టయింది.

అతన్లో మాత్రం ఏ చలనం లేదు. ఎడం చేతికున్న వాచీ చూసుకుని, అందరిళ్లకీ త్వరగా వెళ్ళాలి అని మాత్రం అనుకుని "మా బంధువుల ఇళ్ళకి త్వరగా తీసుకెళ్ళు మణీ" అన్నాడు.

అతని ఏకవచన సంబోధన శబ్దస్ఫోరకంగా ఉందామెకి. వణుకుతున్న పాదాల్తో నెమ్మదిగా అడుగులేస్తూ నడక సాగించింది.

గోపాలక్రిష్ణకి పెద్ద మావయ్య అయిన ఆంజనేయులు ఇంటి దగ్గర కొచ్చారిద్దరూ. జీవితంలో మొట్ట మొదటిసారిగా తన మేనల్లుడ్ని చూసిన ఆనందంతో ఉప్పొంగిపోయింది అతని మనసు. మిద్దెమీదున్న బానలో మొన్న పండక్కి చేసిన నువ్వుపప్పు అరిసెల్నీ, పాకుండల్నీ ఇత్తడి కంచంలోకి తీసిన పెదమావయ్య భార్య ఆదిలక్ష్మి తినమని ఒకటే గొడవ చేసింది. మధ్యాన్న భోజనం చేసిగాని కదలడానికి లేదన్నాడు పెద్ద మావయ్య.

వాళ్ళ హడావుడంతా చూసి అదిరిపడ్డ గోపాలక్రిష్ణ నాగమణి కేసి చూస్తూ రక్షించమన్నట్టు మూగ సైగలు చేశాడు. దాంతో దీపావళినాడు నేలబారుగా వదిలిన తారాజువ్వలా దూసుకుంటూ వాళ్ళ మధ్యకి దూరిపోయిన మణిప్పుడు మధురంగా, అతిలౌక్యంగా వాళ్ళతో మాట్లాడి గోపాలక్రిష్ణని బయటికి తీసుకొచ్చింది.

సంవత్సరాని కొక్కసారి జాతర్లు జరిగేటప్పుడు తప్ప మామూలు రోజుల్లో ఎలాంటి అర్చనలు జరగవు అమ్మవారికి. కనీసం గణాచారి కూడా అటువేపు రాడు. ఊళ్ళో ధర్మన్న అనే అతన్ని ఆ అమ్మవారి గుళ్ళోనే చంపేశారట. పట్నం నించి వచ్చిన పోలీసులు ఎంత కూపీలాగినా ఆ హత్య వివరాలు తెలీలేదట. అప్పట్నుంచి పొద్దోతే ఆ గుడి పరిసరాల్లోనూ, దగ్గర్లో ఉన్న జమ్మిచెట్టు మీదా ధర్మన్న దయ్యమై తిరుగుతున్నాడని నమ్మకం జనానికి. అందుకే చీకటిపడ్తే ఊరి జనం ఎవరూ రారు ఇటు. గుడిపక్క జమ్మిచెట్టు దాటాకా నల్లూరోరి మామిడితోట కనపడ్డంతో ఠక్కున ఆగిపోయి మొగాళ్ళా ఓ చెట్టెక్కేసి కొబ్బరి మామిడికాయల జతని తెంపుకొచ్చిన నాగమణి "వీటి రుచి చూస్తే సంవత్సరాని కోసారి వీటిని తినడానికన్నా మావూరు వచ్చి తీరతారు మీరు" అంది.

"సంతోషం! మరి నడుద్దామా ముందుకి."

"పదండి."

వరి చేల గట్లూ, బోదెలూ దాటుకుంటూ ఒక పిల్లకాలవ ఒడ్డు కొచ్చారు. ఆ కాలవ అవతలి ఒడ్డుకు చేరాలంటే వంతెన లేదు. ఆ చివరా ఈ మొదలు నరికిన ఒక పొడుగాటి తాడిచెట్టు వంతెనలా వేసి ఉంది. లెదర్‌సోల్ ఉన్న షూ వేసుకుని ఉన్న గోపాలక్రిష్ణ ఆ తాటిని చూసి, "అమ్మో! మా లాస్ట్ పిన్నిని కలవడం మాట దేవుడెరుగు, ఈ తాటి దుంగ దాటడం మాత్రం నా వల్లగాదు" అనేశాడు.

లేత మామిడి చిగుర్ని అప్పుడే ఆరగించిన కోకిలల గుంపు ఒకేసారి నవ్వినట్టు నవ్విన నాగమణి, "పెళ్ళిలో ఏడు అడుగులు నడుస్తారు గదా! సంస్కృతంలో ఏవంటారు దాన్ని?" అనడిగింది.

"సప్తపది."

"అలాగ నడవండి. ఆ తాటిదుంగ ఎక్కి నేను నడుస్తుంటాను మీరు నా చెయ్యి పట్టుకుని నెమ్మదిగా ఏడు అడుగులు నడిస్తే ఆ అవతలి గట్టుకు చేరిపోతాం" అంది.

"అలాగా. కానీ నాకు భయంగా ఉంది. ముందు దాహం వేస్తుం"దన్నాడు. దగ్గర్లో ఒక పంపు షెడ్డు దగ్గరకి తీసుకెళ్ళింది. దడదడా నీళ్ళు పారుతున్న మూడంగుళాల వెడల్పున్న నీటి గొట్టపు అంచున మూతి పెట్టించి నీళ్ళు తాగించి, 'మరి పదం'డంది.

ఆ పిల్ల కాలవ దగ్గరకి చేరాక పట్టెమీద కాలు వెయ్యబోతూ వెనక్కి తగ్గి, "నువ్వన్నదే కరక్టు. ముందు నువ్వు నడిస్తే నీ చెయ్యి పట్టుకు నడుస్తాను. అది సుళువులాగుంది" అన్నాడు.

నవ్వేసిన నాగమణి "సప్తపది అన్నమాట" అంటూ చెయ్యి అందించింది.

వణుకుతూ ఆమె చెయ్యి పట్టుకు నడుస్తూ ఎక్కడ జారి నీళ్లలో పడతామో అని భయపడిపోతున్న అతని ముఖమంతా ముచ్చెమటలు పట్టేస్తున్నాయి.

"నా...గ..మణీ!"

"ఏమిటండీ?"

"నా కాలు ఈ పట్టె మీంచి జారితే ఏమవుతుంది?"

"కాలవ నీళ్ళలో పడతాం"

"పడితే ఏమవుతాం?"

"నీళ్ళలో మునుగుతాం"

"ఎక్కడ తేలతాం?"

"కోటిపల్లి రేవులో"

"అంత దూరం ఈదడానికి నాకు ఈతరాదే?"

"ప్రాణాలు పోయాక ఈత ఎందుకూ?"

"అమ్మో!" అని భయంగా అరిచేసరికి గోపాలక్రిష్ణ బూటు కాలు జారింది. క్రింద ప్రవహిస్తున్న కాలవ నీళ్ళలో జారిపోయిన అతన్తో పాటు అతని చెయ్యి పట్టుకున్న నాగమణి కూడా పడిపోయింది.

ప్రవహిస్తున్న ఆ కాలువ నీళ్ళలో మునిగిపోతున్నారిద్దరూ.

భయపడిపోయిన అతను అమాంతంగా పట్టుకున్నాడామె నడుము.

ఆ చల్లని నీళ్ళలో సైతం నిప్పుల సెగలా తగిలింది అతని చెయ్యి. తనకి తెలీకుండానే ఆవహించిన తమకంతో అమాంతంగా పట్టేసుకుందతన్ని.

ఏడు అడుగుల అనుభవం లాగుంది. ఏడు జన్మల సంబంధం లాగుంది. తమకంతో అతన్ని చుట్టుకున్న కాంక్ష దహనం అయితే రగిలి పిగిలి మనసు నిశిగా మారిన అనుభూతి.

తడి బట్టల్తోనే అవతలి ఒడ్డుకి చేరుకున్నాక మళ్ళీ టైము చూసుకున్న గోపాలక్రిష్ణ లబోదిబోమన్నాడు.

"టైము మూడు దాటేస్తోంది. బస్సు చూస్తే ఆరింటికి. ఎప్పుడు ఈ బట్టలు ఆరేదీ? ఎప్పుడు మా విమల పిన్ని ఇంటికెళ్ళి బస్టాండుకు చేరుకునేది?"



"మీరు అనుకున్న టైముకి బస్సెక్కించే పూచీ నాది గానీ అనవసరంగా బెంబేలు పడక పదండి" అని భరోసా యిచ్చిన నాగమణి లాలిస్తూ పాలించే దేవతలా సేదదీరుస్తూ అతన్ని లేవదీసి పక్కనే ఉన్న చెరుకు తోటలోకి అతన్ని పంపించి, అతను విప్పిన పేంటూ షర్టూ పిండి ఇచ్చి ఆఖరి పిన్ని విమలగారి ఇంటికి తీసుకెళ్లింది.

ఒక పక్క నించి కురకాళ్లపల్లి మర్రిచెట్టు దగ్గరకి లాస్ట్‌బస్ వచ్చే వేళయిందేమో అని టైము చూసుకుంటూనే విమల పిన్ని పెట్టిన కరకజ్జం, సున్నుండలూ తిని, చిన్నాన కొట్టిచ్చిన కొబ్బరిబొండాలు తాగి వాళ్ళెంత ఉండమని బలవంతం చేసినా, 'మళ్ళీ వస్తాగా' అని లౌక్యంగా సర్ది చెప్పి బయటికొచ్చేసరికి నాలుగయింది.

పెద్ద పెద్ద అంగలేసుకుంటూ నడుచుకుంటూ అమ్మమ్మ దగ్గరకొచ్చి ఆమెకి ఆఖరి నమస్కారం చెప్పి బట్టలన్నీ సర్దుకుని బయల్దేరాడు గోపాలక్రిష్ణ.

ఎర్రకంకర బాటమ్మట నడుస్తుంటే రోడ్డుకి రెండు పక్కలా పచ్చగా పరుచుకుపోయి ఉన్న వందలాది ఎకరాలు సాయంత్రం ఎండకి పసుపు పచ్చగా మెరిసిపోతున్నాయి. ఆ పొలాల్లోంచి వీచే పిల్లగాలి తన పక్కనే వున్న కన్నెపిల్ల శరీరం స్పందించేలా తాకుతున్నాయి.

పొలాలకి కాస్త దూరంలో ఉన్న వెలగలవారి తోటలో కోతులు రోడ్డుమీది కొచ్చేస్తున్నాయి. దుమ్ము రేపుకుంటూ ఎదురొస్తోంది ఒక పెద్ద మేకల గుంపు. రాములోరి గుళ్ళో మోగుతున్న గంటలు వాళ్ళ వేపు వీస్తున్న గాలిలో కలిసి స్పష్టంగా వినిపిస్తున్నాయి. అడుగులేస్తూ నడుస్తున్న గోపాలక్రిష్ణని అనుసరిస్తోంది నాగమణి.

ఎలాగయితేనేం అనుకున్న సమయానికి కురకాళ్ళపల్లి మర్రిచెట్టు దగ్గర కొచ్చేస్తుండగా వచ్చి ఆగింది మస్తాను గుర్రబ్బండి. ఇక్కడ బస్సు దిగిన వాళ్ళకి తన తాతముత్తాల్నుంచీ ఎన్నో తరాలుగా జట్కా తోల్తున్న మస్తానుకి తెలీని వాళ్ళెవరూ లేరు ఆ వూళ్ళో. ఎప్పుడో వలసెళ్ళిపోయిన మనిషిని కూడా ఇట్టే గుర్తు పట్టేస్తాడు. ఆ వూళ్ళో ఎవరికి ఎవరు ఏమవుతారో క్షణాల్లో చెప్పెయ్యగలడు.

అతన్ని చూసిన నాగమణి, "పొద్దుట్నుంచీ ఎక్కడ చచ్చావ్‌రా సన్నాసీ, నువ్వు లేక ఈయన ఎంత అవస్థపడ్డారో తెల్సా!" కైమని లేచింది వాడిమీద.

"ఊళ్ళో వీర్రెడ్డిగారి అమ్మాయికి నెలలు నిండాయి గదమ్మా! ఆ పిల్లని పట్నంలో హాస్పటలుకి తీసుకెళ్ళి వచ్చేసరికి ఈ టైమయింది" అంటూ గోపాలక్రిష్ణ కేసి తిరిగి, "ఇంతకీ ఈ అబ్బాయి గారెవరూ?" అన్నాడు దూరంగా మర్రిచెట్టు కింద నుంచున్న గోపాలక్రిష్ణ వేపు చూస్తూ.

"రాజమ్మ మామ్మగారి పెద్దకూతురు సరస్వతిగారి అబ్బాయిలే. ఎప్పుడో మద్రాసుకి వలసెళ్ళిపోయారట."

నవ్వేసిన మస్తాను, "ఎవరో పరాయి వాళ్ళ గురించి చెప్పినట్టు చెప్తావేంటమ్మా నాగమణీ, వాళ్ళ కుటుంబం కూడా మీ బంధువుల కుటుంబమేగా, ఈ అబ్బాయి నీకే మవుతాడో తెల్సా?" అంటూ వేళ్లతో కణాల మీద లెక్కగట్టి "ఆఁ! నీకు అన్నయ్య వరసవుతాడమ్మా" అని జట్కాని అదిలిస్తూ "పొద్దుట్నించీ ఏం తిన్లేదు ఆకలి మీదున్నాను. మరి బయల్దేరనా?" అని గుర్రం కళ్ళెం అదిలించేసరికి కదిలి గేలాపు ఎత్తిందది.

ఆ గుర్రబ్బండి వెళ్ళిన కాస్సేపటికే ఎర్రకంకర దుమ్ము లేపుకుంటూ దూరాన్నించి వస్తున్న బస్సు

కనిపించింది. దాన్ని చూసిన గోపాలక్రిష్ణ ఎగిరి గంతేశాడు. 'హమ్మయ్య! వేసుకున్న ప్లాను ఏ మాత్రం బెడిసికొట్టలేదు. రాత్రికి రాజమండ్రి వెళ్ళిపోయి వైజాగ్ వెళ్ళే ట్రైనో, బస్సో పట్టుకుని తెల్లవారేసరికల్లా ఆ వైజాగ్ చేరుకుని డ్యూటీలో జాయినై పోవచ్చు' అనుకుంటూ నాగమణివేపు తిరిగి, "పొద్దుట్నుంచీ నువ్వు నాకూడా గానీ లేకపోతే ఈ లాస్ట్ బస్సు అందుకునే వాడ్ని కాదు. నీ పుణ్యమా అని మన బంధువులందర్నీ కల్సుకో గలిగాను. మా అమ్మ కోరిక తీర్చగలిగాను. అన్నిటికీ మించి జన్మలో మర్చిపోలేని ఒక అందమైన గ్రామాన్ని చూడగలిగాను. చాలా థాంక్స్ నాగమణీ!"

దించిన తలెత్తని నాగమణి ఎలాంటి సమాధానం ఇవ్వలేదు. అంతసేపూ తెల్లటి మబ్బు పింజల్తో నీలంగా ఉన్న ఆకాశం నల్లటి కారు మబ్బుల్తో నిండిపోయినట్టు వుందామె ముఖం.

అది గమనించిన గోపాలక్రిష్ణ "మాటాడవేంటి నాగమణీ... నిన్నే?"

దించిన తల ఎత్తలేదు నాగమణి.

ఏం మాటాడకుండా నిలబడి ఉన్న ఆమె ముఖంలోకే చూస్తూ "పరిచయమైంది పొద్దుటే అయినా ఎన్నో ఏళ్ళ సంబంధం ఉన్నట్టు ఇప్పటి దాకా నానా అల్లరి చేసి ఇప్పుడేటి ఇలా అయిపోయావ్? ఊపిరి సలపనివ్వకుండా ఊరంతా తిప్పినందుకు కోపంగా ఉందా నా మీద... సరదాగా నేను మాటాడినప్పుడు ఏదన్నా మాట తూలితే క్షమించు నాగమణీ!"

బస్సు బాగా దగ్గర పడ్తుండగా దించిన తల నెమ్మదిగా ఎత్తిన నాగమణి కళ్ళలో జలజలా రాల్తూ కనిపించాయి కన్నీళ్ళు.


మతిపోయినట్టు చూసిన గోపాలక్రిష్ణ "ఏంటిది నాగమణీ, ఏడుస్తున్నావేంటి?" అనడిగాడు.

"ఈ జన్మకిక మావూరు రాలేరని పొద్దుట్నుంచీ మీరు మాటాడిన మాటల్లో అర్థమైపోయింది... సంతోషం... మీరు రావక్కర్లేదు. కనీసం ఉత్తరం ముక్కకూడా రాయక్కర్లేదు. మీ నుంచి నాకేమీ అక్కర్లేదు. మీతో గడిపిన ఈ ఒక్కరోజునీ జీవితాంతం నా మనసు లోపల దాచుకుందామనుకున్నాను. ఆ చిన్న కోరిక కూడా నాకు తీర్చకుండా అన్యాయం చేశాడు ఆ దేవుడు"

గజిబిజి అయిపోయిన గోపాలక్రిష్ణ "నువ్వు చెప్పేదేంటో నాకేం అర్ధంగావటం లేదు నాగమణీ" అన్నాడు.

"మీరు... మీరు నాకు అన్నయ్య వరస కాకుండా ఉంటే ఎంత బాగుండేది?" అని ఏడుస్తూ ఆ సూర్యాస్తమయ సమయంలో అతనికి దూరమవుతూ వెళ్ళిపోయింది నాగమణి.

*రచన, ఏప్రిల్ 1996*






# వంతెన



తుఫానంట....పొద్దుట్నుంచీ ఎక్కడా తెరిపివ్వకుండా కురుస్తుంది వర్షం. గుయ్ గుయ్‌మని చప్పుళ్ళు చేస్తా గాలి. దూరంగా ఉరుములు మెరుపులు. వూళ్ళో మండువాలోగిళ్ళ తలుపులన్నీ పగలే మూతబడిపోయినియ్యి. ఈశ్వరుడి గుడి గాలిగోపురం మీది పావురాళ్ళు ఈ చలికి ముడుచుక్కుర్చుని అప్పుడప్పుడూ మట్టుకి రెక్కల్ని టపటపా విదిలిస్తున్నాయి. వీథుల్లోనూ సందుల్లోనూ నీళ్ళూ, బాడి. మనిషి జాడ లేదు. మధ్యాన్నం దాటేటప్పటికే దీపాలవేళ అయిపోయినట్టుంది.

రాత్రయ్యింది. రేగుపూడి వూరికి దక్షిణంగా వున్న గోదారి కాలవ ఒడ్డున కట్టేసున్న ముసిలోడి బల్లకట్టు నీళ్ళలో తేల్తా తపతపా చప్పుళ్ళు చేస్తుంది. ఒడ్డునున్న తాటాకుపాకలో పాత నల్ల రగ్గు కప్పుకుని దొంతిరి కాళ్ళ మీద కూర్చున్న ముసిలోడు, వర్షం ఈదురుగాలి చప్పుళ్ళు వింటా ఆ హరికెన్ లాంతరు లోపలి మంటని చూస్తున్నాడు. గాలికి లాంతరు ఊగుతున్నప్పుడు దాని వెలుగు తన మీదపడి దూరమవుతుంటే ఆ చీకటి వెలుగుల్ని పరకాయిస్తున్నాడు. గాలిటు కొట్టినపుడు నీటి తుంపర్లు లాంతరు వేడి చిమ్నీ మీద పడి సుయ్... సుయ్మని చప్పుళ్లు చేస్తున్నాయి. దూరంగా మెరుపు తర్వాత పిడుగు పడ్డ చప్పుడయ్యింది. ఏ తాడి చెట్టు మొవ్వులో పడిందో ఆ పిడుగు అనుకున్నాడు.

ఇన్ని చప్పుళ్ళ మధ్యలోంచీ మట్టిగాజులూ, మువ్వల పట్టాల చప్పుళ్ళు. గాలి కెరటంలాగ వూడిపడ్డ ఒక ఆడపిల్ల తనెదురుగా నిలబడుంది. చాలా దూరం నించి పరుగెట్టుకుంటా వచ్చిందేమో



ఒకటే గస ఒగురుస్తుంది. ఎడం చేత్తో ముక్కుపొడుం రంగు ట్రంకు పెట్టి పట్టుకున్న ఆ అమ్మాయికి పద్దెనిమిదేళ్ళుంటాయి. సన్నగా పొడుగ్గా అందంగా ఉంది. ఒంటినిండా నగలు. పెద్దింటోళ్ళ పిల్లలాగుంది. ఇలాగ తుఫానప్పుడు గోదారి లంకలలో లేత అరిటాకులా అల్లల్లాడి పోతుంది. ఊపిరి ఎగ బీలుస్తుంది. మొత్తం తడిసి ముద్దయినా నెవరగంత మీంచి కారుతున్న చెమట స్పష్టంగా తెలుస్తుంది. “నన్ను... నన్ను....బల్లకట్టెక్కించి అవతలి ఒడ్డుకి తీసుకెళ్ళు” కంగారు పడిపోతా అంటుందా అమ్మాయి. ఆ అమ్మాయినే చూస్తున్నాడు ముసిలోడు.

"అలా చూస్తావేంటి నన్ను అద్దరికి తీసుకెళ్ళు... వెంటనే" అంటా ఒగురుస్తా ఏడుస్తుందా అమ్మాయి.

రెప్పార్పకుండా ఆ మనిషినే చూస్తున్నాడు.

"నన్ను రేవు దాటించు... నీకు దణ్ణాలెడతాను" అంటా ఆ అమ్మాయి అరిచేసరికి ఒళ్ళు జలదరించినట్టు ఉలిక్కిపడ్డ ముసిలోడు "బయట చూస్తున్నావు గదమ్మా... తుఫాను. గోదావరితల్లి పోటు మీదుంది. ఇప్పుడుగానీ బల్లకట్టు విప్పి గెడేస్తే దాంతో పాటు మనమూ కొట్టుకుపోతాం. ముందు సుడిగుండాలున్నాయి తల్లీ" అన్నాడు ముసిలోడు.

"ఉన్న ఫళాన ఈ కాలవ అవతలొడ్డు కెళ్ళాలి ఎలాగ మరీ?" ఏడుస్తానే అడుగుతుందా అమ్మాయి.

'ఇది తొలి ఝాము తల్లీ... మలిఝాముకి అంటే ఇంకో నాలుగుగంటలకి పాటు మీదకొస్తది గోదారి. అప్పటికీ మాయదారి వాన కూడా తగ్గి తోళుం తెరిపిస్తే నేను బల్లకట్టు మీద తవర్ని అవతలొడ్డుకి చేరెయ్య గలుగుతానమ్మాయి గారూ" అన్నాడు ముసిలోడు.

అతను చెప్పిందంతా విన్న ఆ అమ్మాయిగారు వెనక్కీ ముందుకీ చూస్తా వెనకడుగూ ముందడుగూ వేస్తా ఏం చెయ్యాలో పాలుపోక ఒక అయోమయంలో పడిపోయింది.

ఆ అమ్మాయిని చూస్తున్న ముసిలోడు "పాపగారండీ మీరెందుకో భయపడతన్నారు. ఎవరన్నా తరుము కుంటా వస్తున్నారా తల్లీ... భయంలేదండి నా పాకలోకి ధైర్యం చేసి ఎవడూ రాలేడండి... నా దగ్గర కొజారుం దండి... రండి. ముందు లోపలికొచ్చి తడి తల తుడుచుకోండి. లేకపోతే జొరమొస్తందండి. ముందు రండమ్మా" అన్నాడు.

వణుకుతున్న అడుగుల్తో లోపలికొచ్చిన ఆ అమ్మాయికి ముక్కి వాసనొచ్చే రుమాలిచ్చేడు.

ఎడం చేతిలో ట్రంకు పెట్టి కిందపెట్టి ఆ రుమాల్తో జుట్టు తుడుచుకోబోతూ లాంతరు ముందు కూర్చున్న ముసిలోడ్ని చూసి ఐసుగెడ్డలా గుండిపోయింది.

గుడ్లనిండా నీళ్ళు. ఏడుస్తున్నాడు ముసిలోడు. ఏ చప్పుడూ లేకుండా ఏడుస్తున్నాడు.

"ఎందుకేడుస్తున్నావు?" అందా అమ్మాయి.

చెప్పలేదు. కళ్ళలోంచి కారతానే ఉన్నాయి కన్నీళ్ళు. ఇప్పుడు ఏడుపుతో పాటు గొణుకుడు కూడా మొదలైంది గొంతుకలోంచి.

"చెప్పు... చెప్పు ఎందుకేడుస్తున్నావు" గట్టిగా పట్టుబట్టి అడిగేసరికి నోరు విప్పిన ముసిలోడు మరి చెప్పడం మొదలెట్టేడు తన గతం.

*

వందడుగుల వెడల్పాటి ఆ గోదావరి కాలవకి ఇటు పక్క రేగుపూడి. అటుపక్క మల్లవరం వున్నాయి. ఆ మల్లవరం దాటితే టౌనొస్తుంది. ఆ టౌన్నుంచి పట్నాలకి వెళ్ళే బస్సులూ రైళ్ళూ ఉన్నాయి.

తెల్లారి ఎంతో సేపవ్వలేదు.

గోదావరి కాలవలోంచి చల్లగా వీస్తుంది గాలి. కల్లుగీసే దొమ్మేటి నారాయుడు నడుంకి బిగించిన తోలు

పటకా వెనక ఒంపు కత్తి దిగేసుకుని ఒక చేత్తో ఖాళీ కల్లుకుండా ఇంకో చేత్తో కత్తికి పదునెట్టే కఱ్ఱా పట్టుకు నడుస్తున్నాడు రేగుపూడి కాలవ గట్టు మీద. పొలంలో వున్న వాళ్ళ గొడ్ల సావిట్లో పితికిన పాలని హోటేల్లో పోయడానికని కేనట్టుకుని ఆదరాబాదరా నడుచుకుంటా పోతున్నాడు కానూరోరి నర్సిం. వందడుగుల వెడల్పాటి ఆ గోదావరి కాలవని కప్పేసున్న ఆ పాతకాలంనాటి నిద్రగన్నేరు చెట్టు కిందున్న బల్లకట్టు దగ్గర ముసిలోడి పాక దగ్గర సందడిగా వుంది. చెట్టు మొదట్లో సూరయ్యతో గెడ్డం గీయించుకుంటున్నాడు దమ్ము చేలోకి దిగ బోతున్న ట్రాక్టరు డ్రైవరు తాతాలు. మధ్యాన్నం తినడానికి ముంతలు పట్టుకుని బల్లకట్టు ఎక్కుతున్నారు అవతలొడ్డు పొలాల్లో ఊడ్పుల కెళ్ళబోతున్న ఆడజనం. వీళ్ళతో పాటు వచ్చేవారంలో జరగబోయే వాళ్ళమ్మాయి పెళ్ళిబట్టలు కొనడానికి అవతలొడ్డు మల్లవరం దాటితే వచ్చే టౌను కెళ్ళడానికి ఎడ్లబండి దిగింది బాబ్జీరాజుగారి కుటుంబం. ఎన్నాళ్ళనించో ఇటుక బట్టీ కాలుస్తున్న యఱ్ఱంశెట్టి సుబ్బారావూ తాపీమేస్త్రి లక్ష్మణరావూ బల్లకట్టెక్కి ఉప్పునీటితో మట్టి కుమ్మి కాల్చే ఇటుకకీ చప్ప నీటితో ఇటుకకీ ఉన్న తేడా గురించి మాటాడుకుంటున్నారు. కాయిదా వ్యాపారం చేసే సూర్నాణతో పాటు ఇంకో ఇద్దరు కూడా బల్లకట్టెక్కేరు.

వాళ్ళందరి మధ్యలో నిలబడి పిక్కలదాకా చీర బిగించి కట్టి పొడుగాటి వెదురుగెడ పట్టుకుని నిలబడ్డ ముసిలోడి కూతురు సూరమ్మ బల్లకట్టు లంగరు తీసేసి తన జబ్బలపుష్టితో గెడేస్తూ చిన్నాపెద్దా లేనోళ్ళూ వున్నోళ్ళూ అన్న తేడా లేకుండా పేరు పెట్టి మరీ అందర్నీ పలకరిస్తుంది. అందరి మంచీ చెడ్డలూ కనుక్కుంటుంది.

బల్లకట్టు అవతలొడ్డు చేరి ఈ జనం దిగుతుండగానే వీళ్ళని తోసుకుంటా ఆ జనం ఎక్కేసేరు. వాళ్ళలో సీవండి గిన్నెలు సైకిలు వెనక తట్టనిండా కట్టుకున్న రామారావూ, వడ్డీల కిచ్చి వసూళ్లకొచ్చే షావుకారు కంచర్ల భద్రం, కొబ్బరికాయలు కొనుక్కెళ్ళే గురుమూర్తి ఇలా చాలామంది ఎక్కేరు. గెడేసి వాళ్ళనా ఒడ్డుకి తీసు కెళ్తుంది సూరమ్మ.

బల్లకట్టు దిగినోళ్ళంతా 'ఈ సూరమ్మ ముసిలోడికి ఆడ సంతానమయినా మగోడి కంటే ఎక్కువ... మరి ఎలాంటి మొగుడొస్తాడో ఈ బుల్లికి' అనుకుంటా వెళ్ళిపోతుంటే పాక దగ్గర తాడు చెట్టుకి కట్టి పేన్తా నిలబడ్డ ముసిలోడు కంచర్ల భద్రంగార్నాపి పాకలోకెళ్ళి చూరులో దూర్చిన తాటాకు పర్సులో దాచిన నలిగిన నోట్లూ కొంత చిల్లరా ఇచ్చేడు.

వాటిని తీసుకుని లెక్కెట్టుకున్న షావుకారు "వెయ్యిన్నొక్క రూపాయి" అన్నాడు భద్రంగారు.

"ఆయ్" అన్నాడు ముసిలోడు.

"నా దగ్గర దాస్తున్న ఈ డబ్బు మీ పిల్ల సూరమ్మ పెళ్ళికన్నావు గదా?" అడిగేడు భద్రంగారు.

"సిత్తవండి షావుకారుగారూ" అన్నాడు ముసిలోడు.

"నాకు వూళ్ళో బాకీలు వసూలు చేసుకునే ఇళ్ళు చాలా వున్నాయి ఇప్పుడెళ్ళి వెంటనే మొదలెడితే తప్ప దీపాలవేళకి తెమల్దు... ఇటు పక్కనేమో నీతో కొంచెం మాటాడాలనుకుంటున్నాను ఎలాగా?" అన్నాడు కంచర్ల భద్రంగారు.

"తవరూళ్ళోకి నడవండి మీకూడా నేనూ వస్తాను దార్లో మాటాడుకుందారి" అన్నాడు ముసిలోడు.



నవ్విన షావుకారు భద్రం "మంచి అవిడియారా ముసిలీ పద... అవునొరే ఇప్పుడు నీ వయసెంతరా?" అనడిగేడు.

"ఏభయ్యి వుండవంటారా?" ఎదరడిగేడు ముసిలోడు.

"ఉండొచ్చేమోగానీ... చిన్నప్పట్నుంచీ నిన్ను ముసిలోడనే పిలుస్తున్నారంతా. ఎందుకురా అలా పిలుస్తున్నారు?" అడిగేడు భద్రం.

"మా యమ్మకి పుట్టినోళ్ళంతా పోతుంటే దిష్టి పోద్దని ఈ పేరు పెట్టిందటండి" అన్నాడు.

అర్థమైన కంచర్ల భద్రం ముందుకి నడుస్తా "మీ సూరమ్మ మగోడితో సరిసమానం. అంత కష్టజీవి. చాలా నికార్సయిన మనిషి. మగోడితో పాటు సంపాయించే దానికి కట్నమెందుకంటా? ఆ చేసుకునేవోణ్నే ఎదురిమ్మను" అన్నాడు.

నవ్విన ముసిలోడు "తెల్సి మా కులంలో మీరన్నట్టు జరగదండి" అన్నాడు.

"కొన్నాళ్ళపాటు ఎదురుచూడు నేనన్నట్టే జరిగి తీరుద్ది... ఇదిగో ఒరేయ్ ముసిలీ... ఆ వచ్చేవోడ్ని ఇల్లరికం రమ్మని కండీసను పెట్టాలి అర్థవయ్యిందా?" అంటా భద్రం అంటుంటే ముసిలోడికి ఒకటే నవ్వు.

"నవ్వుతావేంట్రా" గసిరేడు భద్రంగారు.

"మీరు జెప్పినోడి కోసం ఎదురు చూస్తా కూర్చుంటే మా సూరమ్మ పండు ముసల్దయి పోద్దండి బాబూ" అంటా మళ్ళీ నవ్వేసేడు ముసిలోడు.

రేగుపూడి వూరొచ్చింది. "సరే మనం మళ్ళీ మాటాడుకుందాం" అంటా ఆ నెల వడ్డీ కట్టాల్సిన మిషను కుట్టు లోవరాజు ఇంటి దగ్గరాగేడు కంచర్ల భద్రంగారు.

కొంచెం ముందుకెళ్ళి బంగారంగారి కిరాణా కొట్లో ఏబులం శనగపిండి కొనుక్కుని వెనక్కి తిరుగుతుంటే ఒక సందులోంచొస్తా ఎదురయ్యేడు నక్కలోడు. వాడి చేతిలో వేటాడి పట్టుకున్న రెండు గునపం కోళ్ళు, ఒక జమ్ము కోడీ ఉన్నాయి (అలా పిలుస్తారు తప్ప పిట్టలే అవి). ఎగిరిపోకండా వాటి కాళ్ళని తడపతో గట్టిగా బిగించి గుత్తిలా పట్టుకున్నాడు. వుండేలు దెబ్బతినడం మూలాన గిలగిలా కొట్టుకోడం మానేసినియ్యా పక్షులు. దగ్గర కొచ్చిన నక్కలోడు "ఏంటోరా ఎదవ బతుకు ఇవ్వేళ ఒక పిట్టా కొన్లేదెవరూ" నీర్సంగా అన్నాడు.

"మా మకాం దగ్గరకెళ్దాం పద. సూరమ్మ ఏం వండిందో ఇయ్యాల తలో ముద్దా తిందాం" అన్నాడు ముసిలోడు.

"అమ్ముడవ్వలేదు గాబట్టి ఈటిని ఇగురొండమందాం మన సూరమ్మని" అన్నాడు నక్కలోడు.

ఇద్దరూ వూళ్ళోంచి వెనక్కి తిరిగేరు. ఎండ ఎంత వెచ్చగా కాస్తున్నా చలిగానే ఉందా శీతాకాలం మధ్యాహ్నం. వాళ్ళు నడుస్తున్న కంకర్రోడ్డువార జూకామల్లితీగ పూలని చప్పుడులేకుండా పూస్తుంది. ఇంకా పళ్ళు కాయని అల్లనేరేడు చెట్టు కొమ్మల్లోపల పచ్చటి రెక్కలపిట్ట ముక్కుతో ఈకల్ని సర్దుకుంటుంది. గుబురుగా వున్న ముంతమామిడి చెట్టు కొమ్మల్లో దాక్కున్న ఆ వూరి కోకిల అందంగా కూస్తుంది.

"వూళ్ళోకెందుకొచ్చేవురా ముసిలీ?" అడిగేడు నక్కలోడు.

"అవతలొడ్డు షావుకారు కూడా వచ్చే(నా" అన్నాడు ముసిలోడు.

"కంచర్ల భద్రంగారేనా? ఆ కులంలో పుట్టాల్సినోడు కాదురా...ఏవంటాడు?" అన్నాడు.

"రేపొచ్చే అల్లుడోడ్ని కట్నం ఎదురడుగూ... అంతే గాకుండా ఆడ్ని ఇల్లరికం రమ్మనూ అంటాడు... ఇయ్యన్నీ మా వర్ణాల్లో జరుగుతియ్యా జెప్పు?" అన్నాడు ముసిలోడు.

"ఏమో రేపేం జరుగుద్దో ఎవడు జూసొచ్చేడూ. సూరమ్మంత నిబ్బరమైన మణిషిని, నికార్సయిన మణిషిని నే పుట్టాకా చూళ్ళేదు" అన్నాడు ముసిలోడికి ప్రాణమిత్రుడయిన నక్కలోడు.

*

బట్టల మూట సైకిల్తో గట్టు మీదాగిన అచ్యుతం, వెన్నపూస కావిడి గంగరాజూ, రేగుపూడి వూళ్ళోకొచ్చి కాయిదా వ్యాపారం చేసుకునే సాంబమూర్తి బల్లకట్టెక్కేరు. వీళ్ళతో పాటు ఇంకా కొందరు రైతులు కూడా ఎక్కుతా వుండగా రెండు మూడు పెట్టెలూ సంచుల్తో హడావుడిగా దిగిపోయిన అంజిబాబు తన సామాన్లన్నీ బల్లకట్టు మీదికి జేర్చేసి ఇక పోనియ్యన్నాడు సూరమ్మని.

"కేవు?" అంది సూరమ్మ.

"అంటే చార్జా.... ఎంత?" అడిగేడు అంజిబాబు.

"రూపాయి" అంది సూరమ్మ.

బల్లకట్టెక్కిన తక్కిన వాళ్ళందర్నీ చూస్తా "వీళ్ళంతా ఇస్తున్నారా నువ్వడిగిన కేవు?" అన్నాడు అంజిబాబు.

"ఈళ్ళందరియ్యా కాతాలులెండి... రైతులైతే కోతలప్పుడు ఒడ్లు కొలుస్తారు మాకు. మీరు డబ్బులు తియ్యండి ముందర" అంది.

"అలాగే గెడెయ్యి" అన్నాడు.

వేస్తుంది సూరమ్మ.

బల్లకట్టు ఈ ఒడ్డుకొచ్చేకా అంతా దిగెళ్ళిపోయారు తన సామాన్లన్నీ దించుకుని ఆగున్న ఒంటెద్దు బండిలో కెక్కించేక జేబులోంచి ఎర్ర జేబురుమాలు తీసి దాంట్లో ఉన్న పావలాబిళ్ళ ఇస్తుంటే "పావళా కాదండి రూపాయి" అంది. జేబురుమాల్నోసారి దులిపి గుప్పెట్లో బిగించి తెరిచేసరికి చాలా పావలాకాసులొచ్చినియ్యి. అందులోంచి నాలుగుతీసి "చాలా ఇంకా కావాలా?" అన్నాడు.

మతోయినట్టు అంజిబాబుని చూస్తా ఉండిపోయింది సూరమ్మ.

ఒంటెద్దు బండెక్కి కూర్చున్న అంజిబాబు దాన్ని నడిపే లక్ష్మణుడితో "వూళ్ళో స్కూలు దగ్గరకెళ్ళు" అన్నాడు. కదిలిన బండి నారాయుడు కల్లు పోస్తుంటే తాగుతున్న ముసిలోడ్నీ నక్కలోడ్నీ దాటుకుంటా వెళ తుంది.

రేగుపూడి వూరి చివర చాకలి చెరువుని ఆన్చి ఉంది ఎలిమెంటరీ స్కూలు. దాని హెడ్మాస్టరయిన యండమూరి ప్రభాకరంగారి ముందు భక్తిగా నిలబడ్డ అంజిబాబు "మాది గుంటూరండి. మెజీషియన్నండి...





ఈ వూర్నుంచొచ్చి మావూళ్ళో ఉద్యోగం చేస్తున్న కాకర్లపూడి బాబ్జీరాజుగారబ్బాయి పంపితే వచ్చేనండి" అంటా అతను రాసిచ్చిన ఉత్తరం తీసిచ్చి "మీరు పర్మిషనిస్తే మీ స్కూల్లో ప్రోగ్రాం చేస్తాను. పిల్లల్తో ఏవన్నా ఇప్పించండి" అంటా రెండు మూడు ఐటమ్స్ చేసి చూపెట్టేడు.

వాటిని చూసి చాలా ముచ్చటపడ్డ హెడ్మాస్టారు "రేపు శనివారం మధ్యాన్నం తర్వాత ప్రోగ్రాం చేద్దూగాని" అని పిల్లల్లందర్నీ పిల్చి "రేపు మీరు పావళా... పది పైసలూ పట్రావాలి అర్థవయిందా... మీ ఇంట్లో హెడ్మాస్టారు పట్రామ్మన్నారని చెప్పండి" అని, బంట్రోతుని పిల్చి తక్కిన క్లాసుల్లో మేష్టార్లకి చెప్పు అని పంపించేరు.

*

గులాబీ పువ్వు గుత్తిలోంచి పావురాన్ని తీసేడు అంజిబాబు.

చూసిన పిల్లలు చప్పట్లు కొట్టేరు.

న్యూస్ పేపరు ముక్కలు నమిలి మింగి రంగు రంగుల పొడుగాటి పేపర్లు బయటికి తీసేడు.

ఇలా రకరకాల ఐటమ్స్ చేసేసరికి పిల్లల్తోపాటు పెద్దోళ్ళు కూడా ఎగిరి గంతులేసేరు.

చాలా మెచ్చుకున్న ప్రభాకరం మేష్టారు "ఈ స్కూలు స్టోర్స్ రూమ్‌లో ఉండు. ఈ చుట్టు పక్కల వూళ్ళల్లో స్కూళ్ళకి ఉత్తరం రాసిస్తాను అక్కడ కూడా ప్రోగ్రాములిద్దూగాని" అన్నారు.

*

చుట్టుపక్కల వూళ్ళన్నీ తిరిగి స్కూళ్ళల్లో ప్రోగ్రాములు చేసుకుంటా డబ్బులు సంపాదిస్తా రేగుపూడి స్కూల్లో వండుకు తింటున్న అంజిబాబు ఆ సాయంత్రం పూట కాలవ గట్టు కొచ్చి దొమ్మేటి నారాయుడు పెళ్ళాం నాగలక్ష్మి దగ్గర కల్లు తాగి వెళ్తున్నాడు.

ఆవేళ కల్లు తాగేకా లేచి గట్టుమీద నడుచుకుంటా వస్తుంటే సంత చేసిన కూరగాయల సంచి ఒక చేత్తోనూ, గవ్వాళ్ళ మాణిక్యం దగ్గర కొన్న కోడిపుంజుని ఒక చేత్తోనూ పట్టుకుని ఎదురైంది సూరమ్మ. దిగువలో నేల మీద గునపం దిగేసి కొబ్బరిబొండాలు ఒలుస్తున్నాడు సలాదోళ్ళ హరి. సూరమ్మ ముందాగి దిగువలో ఒలిచిన కొబ్బరి కాయల గుట్టలోంచి ఒక కాయ తీసి పగలగొడితే దాంట్లోంచి నీళ్లకి బదులు గులాబీ పువ్వు వచ్చింది. దాన్ని సూరమ్మకిచ్చి వెళ్ళిపోయేడు.

ఆ పువ్వునీ వెళ్తున్న మేజిక్కులోడ్నీ చూస్తా అలాగుండిపోయింది సూరమ్మ.

*

చుట్టుపక్కల వూళ్ళన్నీ తిరిగి మేజిక్కులు చేస్తా డబ్బులు నొల్లుకుంటున్న అంజిబాబు జనంలో బానే పేరెల్లిపోతున్నాడు. కొన్ని వూళ్ళలో జనం పని గట్టుకొచ్చి మరీ తీసుకెళ్తున్నారు. అలా వెళ్తున్న అంజి సాయంత్ర మైతే కాలవగట్టు దగ్గర కొచ్చి కల్లు తాగి అక్కడ కనిపించే సూరమ్మకి చేసిన మేజిక్కు చెయ్యకండా చేసి ఆ మనిషి నోరిప్పి గుడ్లప్పగించి చూసేలా చేస్తున్నాడు.

ఆవేళ బుధవారం. వూళ్ళో సంత. సీమసింత చెట్టుకింద పాకేసుకుని కల్లమ్మే నాగలక్ష్మి గెడేస్తున్న సూరమ్మ దగ్గరకెళ్ళి "పిల్లా కొంచెం బేరాలొస్తే అమ్మి పెడుదూ సంత జేసుకొస్తాను" అంటా బతిమాలింది.

"నాకు తెల్దు బాబూ... ఆ వచ్చే తాగుబోతు సచ్చినోళ్ళతో నేను పళ్ళేను" గెడేసే పని ఆపకుండానే అంది సూరమ్మ.

"నా మొగుడు జూస్తే ముండింటికెళ్ళిపోయేడు. సంత జేసుకుని నేనొచ్చేటప్పటికి కుండ నిండా ఉన్న సందకల్లు పులిసిపోద్ది... బాబ్బాబు" అంది నాగలక్ష్మి.

"సందలడతంది నాకిక్కడ వచ్చేపోయే జనాలు" అంది సూరమ్మ.

గొడుగులు బాగు చేసేవాడితో చిరిగిన గొడుగు రిపేరు చేయించుకుంటున్న ముసిలోడి దగ్గరకొచ్చిన నాగలక్ష్మి "మాయ్యా కొంచెం పిల్లకి చెపుదూ" అనేసరికి లేచిన ముసిలోడు "గెడ నేనేస్తాను. పాపం నాగులికి సాయం చెయ్యి బుల్లీ" అనడంతో విసుక్కుంటా బయల్దేరింది సూరమ్మ.

*

సూరమ్మ చుట్టూ మూగుతున్న జనానికి కల్లుపోసి కరాకండీగా వసూలు చేస్తుంది డబ్బులు.
అంతలో దిగిన మేజిక్కుల అంజిబాబు తాటాకు దొన్నె తీసుకుని "పొయ్యి" అన్నాడు.
నాలుగు దొన్నెల కల్లు తాగేక "ఇవేళ కల్లు చాలా తియ్యగా ఉంది" అన్నాడు.
"సందకల్లు బానే ఉంటది" అంది సూరమ్మ.
"మా పట్నంలో ఈ కల్లు దొరకదు" అన్నాడు అంజిబాబు.
"మరేం దొరుకుద్దీ?" అడిగింది సూరమ్మ.



"బ్రాందీ అనీ రమ్మనీ దొరుకుతియ్యి. చాలా రేటెక్కువ. ఇలా తియ్యగా గొంతు దిగవు" అంటానే ఇంకో రెండు దొన్నెలు తాగేక "నీలాంటి మనిషే గనక సిటీలో ఉంటే ఇలాగుండదు" అన్నాడు.

"ఎలాగుంటది?" అంది సూరమ్మ.

"బాత్‌రూమ్‌లో కెళ్ళి అందంగా లక్స్ సబ్బుతో స్నానం చేసి అయిదు మీటర్ల సర్ శిల్కు చీర కట్టుకుని అందంగా హెయిర్‌స్టైలు చేసుకుని ఐహీలు చెప్పులేసుకుని అందంగా అడుగు లేసుకుంటా వెళ్తుంటే చూసే వాళ్ళు కళ్ళు మరి మూస్తారేంటి?" అంటా కాలవకేసి చూస్తా "మా సిటీలో ఇలాంటి చెత్త కాలవలుండవు" అన్నాడు.

"మరేముంటాయండి" అంది సూరమ్మ.

"సముద్రముంటది.... దాని మీద తేల్తా ఓడలుంటాయి... అందులో రకరకాల సౌకర్యాలుంటాయి. సుఖాలుంటాయి. అబ్బో కళ్లతో చూసి తరించాలి తప్ప నోటితో చెప్పలేను" అంటున్న అంజిబాబు గట్టు మీంచెళ్తున్న జట్కాబండి చూసి "మా సిటీలో ఇలాంటి చెత్త బళ్ళుండవు... రాకెట్లూ, విమానాలు, రైళ్ళు, కార్లు అబ్బో ... చచ్చేకా స్వర్గం చూస్తామో లేదోగానీ వీటిల్లో ఎక్కి కూచుంటే మట్టుకి ఆ స్వర్గంలోకెళ్ళి తరించుతాం" అంటా పట్నాల్లో ఉండే అద్భుతాల గురించి చెప్పుకుంటా పోతుంటే రెప్పార్పకండా చూస్తానే వుంది సూరమ్మ.

ఆకాశంలోకి చంద్రుడొచ్చేడు. కడుపునిండా తాగి ఆ చెంద్రుడ్ని దాటుకుంటా వెళ్ళిన మేజిక్కుల అంజిబాబు, మర్నాడు సూర్యుడు దిగుతున్నప్పుడు మళ్ళీ వచ్చేడు. అతను రావడం దూరంనించి చూసిన సూరమ్మ పరుగెట్టుకుంటా వచ్చి కూర్చుంది.

నాలుగు దొన్నెలు తాగేక మళ్ళీ పట్నంలో ఎన్నెన్ని వింతలూ విడ్డూరాలూ వుంటాయో చెప్పడం మొదలెట్టేడు అంజిబాబు.

వింటున్న సూరమ్మ కలల్లో తేలిపోతుంది.

ఓ ఘడియ ఆలశ్యంగా చెంద్రుడొచ్చేడు ఆకాశంలోకి. లేస్తున్న అంజిబాబు వెనకాల నడుస్తున్న సూరమ్మ "అయితే మీతో పాటు పట్నం వస్తే నాకవన్నీ చూపిస్తారా?" అంది.

"భలేదానివే.... ఎందుకు చూపించనూ" అంటా వెళ్ళిపోయేడు.

రాత్రి పాకలో నులక మంచం మీద పడుకుని ఆలోచిస్తున్న సూరమ్మ ముఖం మీద ఇంద్రధనుసుల్లో వున్న రంగులన్నీ పడి వెళ్తున్నాయి. చాలా ఆనందంగా అటూ ఇటూ కల తిరుగుతుందా నులక మంచం మీద.

అలా ఎంతసేపో.

దూరంగా కోడి కొక్కొరోకో అన్న కూత వినిపించేక మాగన్నుగా నిదరట్టింది సూరమ్మకి.

*

పాక దగ్గర కొచ్చిన అంజిబాబుకి అప్పుడే ఉడికిన ఆవిరి కుడుం సీవండి కంచంలోకి తీసి, కొబ్బరికాయీ, మామిడికాయీ ఎండు మిరపగాయితో ముతగ్గా రుబ్బిన పచ్చడేసి పెట్టి మేకపాలు పితికి కాచిన టీ ఇస్తా "ఐతే నన్ను మీతో పాటు పట్నం తీసుకెళ్తారా?" అనడిగితే "ఓ యస్" అన్నాడు అంజిబాబు.

ఇంకోరోజు నక్కలోడు పట్టుకెళ్తున్న వేప తేనె తీసుకుని ఉడకేసిన క్రపెండలం దుంపల మీదేసి అంజిబాబుకి పెట్టింది.

ఆబగా తింటున్న ఆ మేజిక్కులోడి మోచేతి మీద తట్టి "అయితే వెళ్ళేటప్పుడు నన్ను మీతో పాటు పట్నం తీసుకెళ్తారా?" అంది.

"ఓ యస్. డౌటా" అంటా పట్నంలో కొన్ని వింతల్ని చెప్పి కొన్ని మేజిక్కులు చేసి వెళ్లిపోతుంటే కలలు గంటా ఉండిపోయింది సూరమ్మ.

సంతరోజు నక్కలోడు తను కొట్టిన మూడు కౌజు పిట్టల్ని పట్టుకెళ్తుంటే వాటిని కొనేసిన సూరమ్మ కూరొండి, వచ్చిన అంజిబాబుకి ముందు కల్లు ముంతిచ్చి నంజుకోడానికి ఇగురు దాక ముందరెట్టింది.

హాయిగా తిని లేస్తున్న మేజిక్కుల అంజిబాబుతో "అయితే... మీతో పాటు పట్నం తీసుకెళ్తారా నన్ను" అంది.

చిరాకొచ్చిన అంజిబాబు "ఏంటెహె ఎదవగోల... ఎన్నిసార్లడుగుతావు... తీసుకెళ్ళడమే గాదు తాళిగట్టి మారాణిలా ఏలుకుంటాను నిజంగా వస్తావా? అంత దమ్ముందా నీకు" అనేసెళ్ళిపోయేడు. ఇక ఇక్కడ్నుంచి సూరమ్మ ఏం చేస్తున్నా పట్నం కలలు గంటానే చేస్తుంది. బల్లకట్టు నడుపుతున్నా, చేపలు తరుగుతున్నా అన్నవండుతున్నా, బట్టలుతుకుతున్నా ఆ పిల్ల ముఖం నిండా పంచరంగులే. అలాగ కలలు గంటానే చేస్తుంది.

*

పండిన వరిచేలు బంగారం రంగులోకి తిరిగి ఒరిగిపోయాయి. ఒంటరి కొంగ ఒకటి ఆ చేల మధ్యలోకి వాలి చిన్ని కప్పపిల్లని ముక్కున కరుచుకుని మళ్ళీ ఆకాశంలో కెగిరిపోయింది. కోసేసిన వరిచేలల్లో కెగబడ్డ గొర్రెలు ఆబగా మేస్తున్నాయి. పొద్దుటే భుజం మీద గోనె సంచేసుకుని నడుస్తున్న ముసిలోడ్ని గోపన్నరాజుగారు పలకరించేరు 'ఎక్కడి'కని.

"కోతల కాలం గదండీ ఒడ్లు దండుకోడానికి మీలాంటి మారాజుల చేలల్లోకండి" అన్నాడు ముసిలోడు.

గుర్తొచ్చిన గోపన్నరాజుగారు "ఎల్లుండి కుప్ప నూరుస్తున్నాం... గుర్తెట్టుకుని మా కళ్ళంలోకి కూడా రా ఒరేయ్" అన్నాడు.

"చిత్తం బాబియ్యా" అని ముందుకి నడుస్తున్న ముసిలోడు రోడ్డు మీదే తడి మసూళ్ళు చేస్తున్న రైతుల్ని దాటుకుంటా ముందుకెళ్తున్నాడు. మాలపేట మొదట్లో ఇంకా ఆవిష్కరించని అంబేద్కర్ విగ్రహంమీద గుడ్డ ముసుగేసి ఉంది. దాన్ని దాటుకుంటా ముందుకి నడుస్తుంటే కోసేసిన చేలల్లో పరిగిలేరుకోడానికెళ్ళొస్తున్న దొడ్డికాళ్ళ ముసిల్ది పలకరించింది.





సూరన్న కాపుగారి కళ్ళంలో కెళితే అరబస్తా వడ్లు కొలిచేరు. బంగార్రాజుగారయితే బస్తా, పేకాట సుబ్బరాజు గారి పొలంలో అరబస్తాడు. ఇలా తిరుగుతా దీపాలవేళకి చాలా బస్తాలయినియ్యి. కామరాజుగారి ఎడ్లబండి అడిగి దానిమీద ధాన్యం బస్తాల్ని ఎక్కించుకుని మకాం దగ్గర కొచ్చిన ముసిలోడు హుషారుగా బండి దూకి "అమ్మా సూరమ్మా" అని పిలిచేడు.

పలకలేదు సూరమ్మ.

"రైతులు చూడు ఏడాది పొడుక్కీ ఆర్ని బల్లకట్టు దాటించినందుకు ఎన్ని బస్తాల ధాన్యం కొలిచేరో... ఎక్కడ బుల్లీ?"

ఎక్కడా సూరమ్మ సందడే లేదు. వింతగా చూస్తా పాకలోకెళ్ళి బయటికొచ్చిన ముసిలోడు అవతలొడ్డున కట్టేసున్న బల్లకట్టు కనిపించింది. ఏంటిది ఎప్పుడూ లేని విచిత్రం అనుకుంటా 'అమ్మా సూరమ్మా' అని అరిచేడు.

పలకలేదు సూరమ్మ.

అవతలొడ్డున జనం. సైకిళ్ళతో ఆగున్న జనం రమ్మని అరుస్తున్నారు. నీళ్ళలో దిగి ఈదుకుంటా ఆ ఒడ్డుకెళ్ళిన ముసిలోడు అందర్నీ ఎక్కించుకున్నాకా గెడేస్తా "మా సూరమ్మ మీకెక్కడన్నా కనిపించిందా బాబూ?" అన్నాడు.

"ఇందాక ఆ మేజిక్కులల అంజిబాబు కూడా పట్నం బస్సెక్కుతుంటే చూసేను" అన్నాడు ఒకడు.

అర్థంగాని ముసిలోడు "ఏంటి బాబూ అన్నారు?" అన్నాడు.

వివరంగా చెప్పేడా మనిషి.

ఇప్పటికీ అర్థంగాక మళ్ళీ అడిగేడు ముసిలోడు.

చెప్పిందే మళ్ళీ చెప్పాడా మనిషి.

అంతే నిలువునా చెట్టులా కూలిపోయేడు ముసిలోడు. కాస్సేపయ్యేకా ఏడుస్తా దొర్లడం మొదలెట్టేడు.

రాత్రయ్యింది. పాక ముందు పడిపోయున్న ఆడి దగ్గరకొచ్చి ఓదార్చడం మొదలెట్టేడు నక్కలోడు. ఏం లాభం లేకుండాపోయింది. నక్కలోడెంత బతిమాల్నా విన్లేదు. నోట్లోంచసలు మాటే రావడం లేదు ఎటో చూస్తున్నాడు. ఉన్నట్టుండి ఏదో గుర్తుకొస్తుంది... 'పురిటి మంచం మీద తల్లిని చంపేసిన నిన్ను ప్రేణంలా పెంచుకున్నాను. చివరికిదా నువ్వు చేసిందీ... ఇదా నువ్వు చేసిందీ' అనరుస్తున్నాడు, ఏడుస్తున్నాడు. నేల మీద దొర్లుతున్నాడు. మళ్ళీ కాస్సేపు మామూలుగా ఉంటున్నాడు. కాస్సేపు మళ్ళీ ఏదో గుర్తుకొస్తుంది. మళ్ళీ అరుపులు, కేకలు. మళ్ళీ చడీ చప్పుడు లేకుండా పడుండడం. జుట్టూ మూగిన జనంలో ఉన్న కానూరోరి నర్సిం 'ఏంటీడి వాలకం' అన్నట్టు చూసేడు.

"కొడుక్కంటే ఎక్కువైన ఆ కూతురు అలాగెళ్ళిపోవడాన్ని అరాయించుకోలేకపోతున్నాడు" అన్నాడు వెన్నపూస కావిడి గంగరాజు.

*

రోజులు గడుస్తున్నాయి.

ముసిలోడు ఎవరితోనూ మాటాడ్డం లేదు. మరమనిషిలాగ బల్లకట్టు మీద ఎక్కినోళ్ళని ఆ పక్కనించి ఈ పక్కకీ ఈపక్కనించి ఆ పక్కకీ దింపుతున్నాడు. నక్కలోడొచ్చి ఏవన్నా పెడితే తింటున్నాడు. ఆడు రాకపోతే అలాగే ఉండిపోతున్నాడు.

ఆరోజు,

వెడల్పాటి ఆ గోదారి కాలవలోకి తొమ్మిది నెలల గర్భిణీ స్త్రీ శవం కొట్టు కొచ్చింది. జనవంతా మూగేరు. ఆ గుంపులో కెళ్ళిన ముసిలోడు పాపం ఎవరో ఆ ఆడకూతురు ఏ కష్టాలొచ్చినియ్యో ఆ తల్లికి అనుకుంటా దగ్గరకెళ్ళి చూస్తే... సూరమ్మ. తన కూతురు సూరమ్మ. తుఫాను రాబోయే ముందు ఉరుములాగ పెద్దగా అరుస్తా ఆ పెనుతుఫానుకి కూలిన మహావృక్షంలాగ విరుచుకు పడిపోయేడా కటిక నేల మీద.

జరిగింది మొత్తం ఆ అమ్మాయికి చెప్పిన ముసిలోడు కాస్సేపు ఏమీ మాటాడకండా ఉండిపోయేడు. ఆ తర్వాత పాకచూరులోంచి బయటికి చూసి "వర్షం తగ్గిందమ్మా... గోదారి కూడా పాటు మీదకొచ్చింది రండమ్మా అవతలొడ్డుకి దిగబెడతాను" అన్నాడు.

"నేను రేవు దాటను" ప్రశాంతంగా అందా అమ్మాయి.

విస్తుపోతా చూసేడు ముసిలోడు.

"అవును... నేను రేవు దాటను" ఒక నిర్ణయానికొచ్చిన దాన్లా అందా అమ్మాయి.

ఆ అమ్మాయినే చూస్తున్నాడు ముసిలోడు.

నా పేరు రామసీత. నేను పక్కూరు రామాలయంపేట కరణం వాడ్రేవు భుజంగరావుగారమ్మాయిని. నాది కూడా మీ సూరమ్మలాంటి కథే. అయితే మీ సూరమ్మని మేజిక్కుల అంజిబాబు ఇక్కడ్నుంచి తీసుకెళ్ళాడు. నా ప్రియుడు టౌన్లో వుండి నన్ను రమ్మని కబురెడ్తున్నాడు. అంతే తేడా, అనాగి "వచ్చేవారమే నా పెళ్ళి. నేను చచ్చినా ఈ ఊరు దాటి వెళ్ళను. నన్ను మా వూరు తీసుకెళ్ళి మా ఇంటి దొడ్డిగోడ దాటించు" అంది రామసీత.

సంతోషపడ్డ ముసిలోడు 'పదండయితే' అంటా ఆ అమ్మాయి వెనకాలే బయల్దేరేడు.

వారంరోజులు గడిచినియ్యి వర్షాలు తగ్గి ఎండలు కాయడం మొదలెట్టినియ్యి. బాడితో జారిన మట్టిబాటలు గట్టిబడ్డాయి.

ఆవేళ రామసీత పెళ్ళి.

చుట్టుపక్కల వూళ్ళనించి సవ్వారీ బళ్ళు కట్టుకుని దిగిపోతున్నారు జనం. ఇంకా ఎక్కడెక్కడి నించో వస్తున్నారు. నక్కలోడ్ని వెంటేసుకుని ముసిలోడు కూడా వెళ్ళేడు ఆ పెళ్ళికి. కూలీనాలీ జనం వరసలో కూర్చుని కడుపు నిండా భోజనం చేసిన ముసిలోడు కాశీతువాల్లో బొడ్డుగిన్నెడు పులిహోరా, బూరెలూ మూటగట్టుకున్నాడు.

రంగరంగ వైభోగంగా జరుగుతుంది పెళ్ళి. జనం మధ్యలో కూర్చుని పెళ్ళి చూస్తున్న ముసిలోడ్ని పెళ్ళి పీటల మీద కూర్చున్న రామసీత గుర్తుపట్టింది. కళ్ళలో నీళ్ళతో ముసిలోడ్నే చూస్తా చేతులెత్తి దణ్ణవెట్టుకుందాడికి.

బెంబేలెత్తిపోయిన ముసిలోడు తప్పు తల్లీ అన్నట్టు చేతులాడించి, రెండు చేతుల్తో దీవించి బయటి కొచ్చేసేడు.



నక్కలోడితో పాటు తన తన మకాం వేపు నడుస్తున్న ముసిలోడు చాలా ఆనందంగా ఎగిరి గంతు లేస్తున్నాడు. మాటిమాటికీ నవ్వేస్తున్నాడు. ఆకాశం కేసి చూస్తా దణ్ణవెట్టుకుంటున్నాడు. వాడి వాలకం చూస్తా విస్తుపోయిన నక్కలోడు "ఏంట్రా ఏవయ్యిందీ వేళ నీకు?" అన్నాడు.

ఏ జవాబూ చెప్పకుండా పాక దగ్గర దాకా వచ్చిన ముసిలోడు అమాంతంగా కాలవలోకి దూకేసి ఆనందంగా ఈత కొట్టడం మొదలెట్టేడు.

కంగారు పడిపోయిన నక్కలోడు "ఏవయిందిరా నీకు... పెనికేరు పిచ్చాసుపటలుగ్గానీ తీసుకెళ్ళాలా నిన్ను?... తల్లకిందులుగా పడుకోబెట్టి ఆచార్లుగారితో ముక్కు బెజ్జాల్లో అల్లం రసంగానీ పోయించాలా నీకు?" అన్నాడు.

"ఏడిసేవు నోర్మూయ్యెహె" అని ఈత కొట్టడం ఆపిన ముసిలోడు ఒడ్డున దొంతిరి కాళ్ళ మీద కూర్చుని తన వేపు చూస్తున్న నక్కలోడి దగ్గరకి ఈదుకుంటా వచ్చి "ఇందాక పెళ్ళయిన ఆ పెళ్లికూతురు ఆ మధ్య ఒక వర్షం కురుస్తున్న రాత్రిపూట మన పాక దగ్గరకి రేవు దాటి పారిపోడానికొచ్చింది. అప్పుడు ఒక కథ చెప్పి ఆ పిల్ల మనసు మార్చి వెనక్కి పంపించేను" అన్నాడు ముసిలోడు.

"కథా... ఏ కథ చెప్పేవురా?" ఆశ్చర్యంగా అడిగేడు నక్కలోడు.

"నాకో కూతురున్నట్టు అదెవడో మాయలమరాఠీతో పట్నం పారిపోయి ఆనక మోసపోయి శవమై ఈ కాలవలోనే కొట్టుకొచ్చినట్టు."

మూర్ఛొచ్చినట్టయిపోయిన నక్కలోడు "నీకసలు పెళ్ళే అవ్వలేదన్న సంగతి ఆ పిల్లకి తెలీదా?" అడిగేడు.

"మనలాంటి పాటకపోళ్ళ గురించి మనూరోళ్ళకే తెలీదు. ఇక పొరుగూరోళ్ళకేం తెలుస్తదిరా ఎదవా?" ఎదురడిగేడు ముసిలోడు.

"అదా నీ ఆనందం... అందుకా ఈ గంతులూ... పోన్లేరా కళ్ళకి కట్టినట్టు కథలు చెప్పగలిగే నీ గొప్పదనం ఓ గొప్పింటి పిల్ల రేవు దాటెళ్ళిపోకుండా కాపాడింది..." అంటున్న నక్కలోడ్ని ఆపిన ముసిలోడు "ఇలా కాపాడ్డానికి ముందు నా బల్లకట్టుకి దణ్ణవెట్టుకోవాల్రా. ఈతల్లి వల్లే కదా... ఆ పాపగారు ఆగింది... ఆ తర్వాత మనమేదో మాయచేసేవనుకో" అన్నాడు.

నక్కలోడు కూడా నీళ్ళలో దిగి ఈత కొడతా "ఒక ఆడపిల్లని మూడో కంటికి తెలీకండా కాపాడినందుకు ఆనందంగా ఉందిరా ముసిలీ" అంటా "తేరగా దొరికింది గదాని పెళ్ళి భోజనం తెగ తినేసేం. కాస్సేపు ఈత కొడితే గానీ అరిగేలాలేదు" అంటా తపతపా కొట్టుకుంటా అవతలొడ్డు కెళ్ళిపోయేడు నక్కలోడు.

*

ఇరవయ్యేళ్ళు గడిచిపోయినియ్యి.

లోకం చాలా మారిపోయింది. ముసిలోడికి డబ్బయ్యేళ్ళు వచ్చేసినియ్యి. బాగా ముసిలోడయిపోయేడు. జుట్టు పండిపోయినా శరీరం వడిలిపోయినా చూపు మట్టుకి చత్వారం లేకండా చాలా బాగుంది. దూరంగా ఎక్కడ్నుంచో తుప్పల్లోంచి పారిపోతున్న చుంచుపిల్లని ఇట్టే పసిగట్టగలిగేంత చురుగ్గా ఉంది.

గురుపౌర్ణమి ఆరోజు.

గోదావరి కాలవ నిండుగా ప్రవహిస్తా ఉంది. వీస్తున్న గాలి ఉన్నట్టుండి ఆగి మళ్ళీ వీస్తుంది. ముసిలోడి పాకకి నీడ నిస్తున్న నిద్రగన్నేరు చెట్టు ఆకులు హాయిగా ముడుచుకు నిద్రోతున్నాయి. కాస్త దూరంగా ఉన్న రావిచెట్టు ఆకుల్ని గలగలా రాలుస్తుంది. దూరంగా ఉన్న చెరుకుతోటలో వండుతున్న బెల్లం వాసన ఈ పక్క కొస్తుంది. తూర్పు పక్కనున్న అంబేద్కర్‌పేటలో పెంతికోస్తోళ్ళ పాటలు గాలి ఈ పక్కకి తిరిగినప్పుడల్లా విని పిస్తున్నాయి. నులక మంచం మీద వెల్లకిలా పడుకుని హాయిగా ఆ వాతావరణాన్ని చూస్తున్న ముసిలోడి చూపులు గట్టుమీదకి మళ్ళాయి. చాలా చురుగ్గా చూస్తున్నాడు ముసిలోడు. చాలా సూటిగా చూస్తున్నాడు ముసిలోడు.

శిల్కు పంజాబీ డ్రస్సు వేసుకున్న ఒక పద్దెనిమిదేళ్ళ అమ్మాయి చిన్న వి.ఐ.పి సూట్‌కేసు పట్టుకుని పరుగులాంటి నడకతో వస్తుంది.

ఆ పిల్లని చూడగానే ఇంట్లోంచి పారిపోయి వస్తున్న బాపతని ఇట్టే పసిగట్టేసేడు ముసిలోడు.

తన కళ్ళ ముందు నించే వెళ్ళిపోతున్న ఆ అమ్మాయిని "అమ్మా... ఆగు" అన్నాడు.

ఆగలేదా అమ్మాయి.

"ఆగు తల్లీ... ఆగు బుల్లీ... ఇదిగో పాపా..." అరుస్తున్నాడు ముసిలోడు.

ఆగకుండా వెళ్ళిపోతుందా అమ్మాయి.

"ఆగమ్మా... నీకు నా కూతురు గురించి చెప్పాలి... మా అమ్మ సూరమ్మ జాలికథ చెప్పాలి" అరుస్తున్నాడు ముసిలోడు.

అదేం వినకండా అసలు తననే మాత్రం పట్టించుకోకండా గేలాపెత్తుకుంటా వెళ్ళిపోతుందా అమ్మాయి.

పిలిచి పిలిచీ ఈమధ్యకాలంలో ఎప్పుడూ అరవనంతసేపు అరిచి అరిచి అలిసిపోయేడు ముసిలోడు. వాడు అరిస్తే ఆగడానికి ఒకప్పట్లా బల్లకట్టుతో పనిలేదా అమ్మాయికి.

ఇప్పుడా కాలవ మీద వంతెన కట్టేసేరు.

ఆ వెన్నెల్లో ఆ వంతెన మీంచి వెళ్ళిపోతున్న ఆ అమ్మాయినీ తుప్పు తినేసి ఒడ్డున పారేసున్న బల్లకట్టునీ మార్చి మార్చి చూస్తున్న ముసిలోడు ఏమీ చెయ్యలేక అలాగుండిపోయేడు.

స్వాతి సపరివార పత్రిక
27 జనవరి 2006





రోజులో ఎక్కువ టైము లైబ్రరీలోనే గడిపేవాడు శ్యామశాస్త్రి. ఓ రోజు 'మైదానం' చదివితే, ఇంకోరోజు 'చెలియలకట్ట' చదివేవాడు. కొమ్మూరి సాంబ శివరావు డిటెక్టివ్ నవలలూ, రుద్రకవి 'జనార్ధనాష్టకం', అంబటిపూడి పుస్తకాలూ, 'పురాణ వైరిగ్రంథమాల', సారంగపాణి గీతాలూ, మధు అనే రచయిత సెక్స్ పుస్తకాలూ, ఇలా ఒకదాని కొకటి సంబంధం లేనివి చదూకుంటూ పోతున్న వాడి టేస్టేంటో అర్ధమయ్యేది కాదు నాకు.

అడిగితే "మంచి పుస్తకాల్లోనే కాదు, చెత్త పుస్తకాల్లోనూ కొంత మంచి వుండి తీరుతుంది. కాబట్టి మంచీ, చెడ్డా విభజన లేకుండా చదూకుంటూ పోవడమే" అన్నాడు.

దత్తుడు సుబ్బరాజుగారూ, మా దేవదానంరాజు తప్పిస్తే సాహిత్యాన్ని పెద్దగా ఇష్టపడేవాళ్ళు లేరు మా కోలంకలో. ఓరోజు వాళ్ళు కల్సినపుడు శాస్త్రి అన్నమాట చెప్పాను. తర్వాతెప్పుడో వాడితో చర్చించిన సుబ్బరాజుగారు "పంతులు చెప్పింది కరెక్ట్" అన్నాడు.

"రేపట్నుంచి నేను కూడా అతని టైపులో చదవాలనుకుంటున్నాను" అన్నాడు దేవదానం.

శాస్త్రి, నేనూ సగం సగం డబ్బులేసుకుని యానాం వెళ్ళిపోయి బ్లూరైబన్డ్ జిన్ కొనుక్కున్నాం. మా పెద్దన్నయ్య గారి దొడ్లో కొట్టుకున్న చిన్నంగి బొండాల్లో దానిని కలుపుకుని తాగేశాక నా హంబర్ సైకిల్ మీద పిల్లంక ఏటిగట్టు వైపు బయల్దేరాం.

అప్పటికి సాయంత్రమయ్యింది. అసలే చలికాలం. గోదాట్లోంచొచ్చే గాలి చల్లగా కొడ్తాంది. జిన్ను లోపల బాగా పనిచేస్తోంది. స్పీడుగా ఒకళ్ళ తర్వాత ఒకళ్ళం వంతులు మారి తొక్కుకుంటూ మసకపిల్లి దాకా వెళ్ళాక అలుపొచ్చింది. ఒకచోట ఆగిపోయాం.

కాస్సేపు గోదావరిలో వెళ్ళే లాంచీనీ, నెలపొడుపునీ చూశాక నా పక్కనే కూర్చున్న శాస్త్రి, "సుహాసినీ... అజ్ఞాత విలాసినీ... అంధకార గుహాంతరాళ విలాసినీ" అన్నాడు.


"రాయడం మొదలుపెట్టేశావా!!! ఎప్పుడో అనుకున్నాన్లే" అన్నాను.

"ఎలాగుంది?" అడిగాడు.

నవ్వేసిన నేను- "బిగినింగ్ స్టేజ్ కదా ఎలాగుంటుంది?" అన్నాను.

నా హేళనను గమనించిన వాడు "ఇంకోటి చెప్తాను, ఎలాగుందో చెప్పు" అన్నాడు.

"దంచేస్తున్నావ్. జిన్ను బాగా పనిచేస్తోంది గదా?" అన్నాను.



*తాగుబోతుకు ఉగ్గేల.*
*తాజ్‌మహాలు మునివాకిటలో ముగ్గేల*
*క్రిష్ణశాస్త్రికి విగ్గేల.*
*భావకవికి సిగ్గేల...*

మొత్తం విన్నాక శాస్త్రిగాడి భుజంమీద చెయ్యేసి "చాలా పూర్‌గా వుంది. బాగా ఆలోచించు. బాగా మెచ్యూరిటీ రావాలి నీలో" అనడంతో పెద్దగా నవ్వేసి "పద" అన్నాడు.

"నేనేదో అంటే నువ్వేదో అంటావేంటి... అసలా నవ్వేంట్రా" అంటుండగానే "తర్వాత చెప్తాను పద" అని సైకిలు స్టాండు తీశాడు.

మా ఇంటి ముందు వంట కోసం సెపరేట్‌గా కట్టిన పాక ముందు చింత చితుకుల మంటేసి కోడ్ని కాల్చే పని నాకు అప్పగించాడు, సాయంత్రం ఉత్తర కంచి నుంచి వచ్చిన మా బావ. ఆ పనిలో బిజీగా వుండగా దిగిపోయారు దత్తుడూ, దేవదానం.

ఏంటిలా వచ్చేరు అన్నట్టు వారివంక చూస్తే... "రాక చస్తామా?" ఇద్దరూ ఒకేసారి అన్నారు.

"అసలు మేటరేంటి?" అన్నాను అర్థంగాక.

"ఆ శ్యామశాస్త్రి చెప్పిన కవిత్వం చీప్‌గా వుంది. బాగా ఆలోచించు అనే టైపులో మాటాడావా?!" నా చొక్కా కాలరు పట్టుకుని అడిగాడు దేవదానంరాజు.

"అనిపిస్తే అనమా. అసలు అదేం కవిత్వం?"

"అది శాస్త్రి రాసింది కాదు."

"మరి?"

"మహాకవి 'శ్రీశ్రీ'దిరా ఎదవా! నిన్న మీ మధ్య జరిగిందంతా ఇవాళ మాతో చెప్పాడు శాస్త్రి."

అర్జంటుగా నా నోరు మూసేసుకుని కోడిని కాల్చే పనిలో బిజీగా వున్నట్టు నటిస్తున్న నన్ను కొట్టడం తప్ప అన్ని చేసేస్తుంటే "ఏరా అయ్యిందీ?" అంటూ వచ్చాడు మా బావ. అతన్ని చూసి స్వరం తగ్గించేసి "ఇక్కడ కాదు. జమ్మిచెట్టు దాటి రోడ్డు మీదికి రా. అక్కడ చెప్తాం నీ పని" అనేసి వెళ్ళిపోయారు.

తర్వాత శాస్త్రి దగ్గరకి పరుగెత్తుకు వెళ్ళి నిన్న వాడు చెప్పింది మళ్ళీ మళ్ళీ చెప్పించుకుని భావం కనుక్కుని అజ్ఞానంతో మాట్లాడిన నన్ను నేను తెగతిట్టుకుని, ఇక జీవితంలో ఎప్పుడూ సొల్లు వాగుడు వాగనని ప్రామిస్ చేసుకుని మరీ వెనొక్కొచ్చాను.

*

కొన్నాళ్ళకి తనే పుస్తకం చదివినా అక్షరం పొల్లుపోకుండా తిరిగి అప్పగించేవాడు శ్యామశాస్త్రి. ఏకసంథాగ్రాహి అయిన వాడ్ని తెగ మెచ్చుకునేవాళ్ళం.

దేవదానం రాజయితే "పుస్తకాలు చదువుకుని గూట్లో దాస్తారు అంతా, ఈ శాస్త్రిగాడు మాత్రం నోట్లో దాస్తున్నాడు" అని పొగిడేవాడు.

*

మరికొన్నాళ్ళు గడిచాయి.

బోసు బొమ్మ దగ్గర వున్న అచ్చమ్మ కాఫీ హోటలు స్తంభానికి పలక ఒకటి వేలాడదీసి రోజుకొకటి చొప్పున రాయడం మొదలెట్టాడు. ఎవరిదైనా అయితే కింద రాసినాయన పేరుండేది. తను సొంతంగా రాసిందయితే పేరు రాసుకునేవాడు కాదు. ఒకరోజు నే వెళ్ళి చూసేసరికి పలకమీద ఈ విధంగా రాసుంది.

*బు బుక్షఃకిమ్ న కరోతి పాపమ్?*

అర్థం- ఆకలిగొన్నవాడు పాపం ఎందుకు చేయడు?

శ్రీనాథుడి 'కాశీఖండం' లోనిది.

ఇవాళేం రాసుంటాడా అని మర్నాడు వెళ్ళాం.

*మనకు మనికి వేదనా నాద వేష్టితమ్*

అర్థం- మన జీవనం వేదన అనే నాదంతో అల్లుకోబడి వుంటుంది - కె.ఎస్.వి. నరశింహమ్.

మరోరోజు-

తాకితే పొడి రాలేంత చిక్కటిరాత్రి

ఈ రాత్రిని వేలితో రాసి రాలిన పొడిలో (నా కన్నీటిని రంగరించి) నీ కంటికి కాటుకగా దిద్దాలనీ...

కింద కవి పేరు లేదు. అంటే శ్యామశాస్త్రి సొంత వాక్యాలన్న మాట అవి. అలా వాడు రాస్తున్నవి చదువుతున్న మా ఊరి జనానికి ఏ మాత్రం అర్థం కావటం లేదు. అందుకు ఎవరూ జుట్లు పీక్కోవటం లేదు. తలలు గోడకేసి బాదుకోడం లేదు.

'ఏంటా పిచ్చిరాతలు... పైత్యం బాగా పెరిగిపోయిందనుకుంటాను ఆ బ్రాహ్మల అబ్బాయికి' అనుకునేవారు.

*

యానాంలో రసరంజని అని ఒక నాటక సమాజం వుంది. ఊళ్ళో టీచర్లంతా అందులో సభ్యులు. కాత్రేనికోన శీను అనే అతను దాని ఫౌండర్.

ఆరోజు వాళ్ళు 'ఫిమెల్ డ్రామా' అనే నాటికి ఆడుతున్నారు. ఈ ప్రాంతానికి పని మీద వచ్చిన తనికెళ్ళ భరణిని ఆహ్వానిస్తే చూడ్డానికొచ్చాడు.

పిల్లా సుబ్బారావూ, కొంకుదురు సత్తిరాజూ, ఎల్లైసీ తాతారెడ్డీ, ద్రాక్షారామం సరోజ, చెక్కల గణపతీ యాక్ట్ చేస్తుంటే ప్రదర్శిస్తున్న నాటిక చూస్తున్న భరణి "శీనూగారూ! మరైతే రాత్రి కార్యక్రమం ఎక్కడ?" అన్నాడు.

"మా డాబా మీద ఎరేంజ్ చేసాం సార్" అన్నాడు కాత్రేనికోన శీను.

"మరి నేను చెప్పిన మనిషి గురించి వాకబు చేశారా? తీసుకొస్తున్నారా?" అడిగాడు.

"మా అబ్బాయి అనీలూ, వాడి ఫ్రెండ్స్ చిన్నా, శీనూ ఆ పనిమీదే వున్నారు సార్" చెప్పాడు కాత్రేనికోన శీను.

చంద్రకళా లాడ్జిలోంచి పరుపులూ, తెల్ల దుప్పట్లూ తెప్పించి పరిచారు డాబా మీద. జనం చుట్టూ మూగి వుంటే వాళ్ళ మధ్యలో కూర్చున్న భరణి ట్రేమిస్ తీసుకుని వాయిస్తూ "ఆటగాదురా శివా!" అని పాడుతున్నాడు. మధ్యమధ్యలో తను కబురెట్టమన్న మనిషి ఇంకా రాలేదేంటా? అని చూస్తున్నాడు.

కాస్సేపటికి శీనుగారి గేటు ముందు మూడు సైకిళ్ళాగాయి. అందులో ఒకడు డబుల్స్ ఎక్కించుకున్న మనిషితో 'వచ్చేశాం దిగ' మన్నాడు. ఆ మనిషెవరా అంటే? మా శ్యామశాస్త్రి. సందకాడ్నుంచి తనికెళ్ళ భరణి ఎదురుచూస్తుంది వాడికోసమే.

పైకొచ్చిన శ్యామశాస్త్రిని చూసి కూర్చోమని సైగ చేసిన భరణి "మీ ఊళ్ళో ఆ కోమటావిడ కాఫీ హోటలు పలక మీద రాసింది నువ్వేనా" అన్నాడు.

"నేనేనండి" సమాధానమిచ్చాడు శాస్త్రి.

"ఇవాళ రాసిందేంటో చెప్పు."

"మహాభారతం నిజమే అయితే అద్భుతం, కల్పనగానీ అయితే మహాద్భుతం" చెప్పాడు.

"నీ సొంతమా?"

"కాదండి నాయుని కృష్ణమూర్తి అనే ఆయన రాశాడు."

"నువ్వు సొంతంగా రాసింది ఏదైనా చెప్పు... సిగ్గుపడకు చెప్పు."

"నా తోటలో ఎటుచూసినా యవ్వనం. పైగా వడగళ్ళ వాన కురిసింది. నీకోసం కొన్ని ఏరి తెచ్చి వెచ్చటి నా గుండెల్లో దాచాను. అవి కరిగిపోక ముందే రా... నా ప్రియతమా!"

"వడగళ్ళు అంటే యవ్వనం అనేగా అర్థం."

"అవునండీ" అన్నాడు శాస్త్రి.

"శభాష్" అని చప్పట్లు కొట్టిన భరణి శ్యామశాస్త్రి భుజం మీద చెయ్యేసి "నేను ఆటగదరా శివా" అనే పుస్తకం రాశానీ మధ్య. ఆ తత్త్వాల్ని వంద ప్రాచీన శివాలయాల్లో పాడతానని మొక్కుకున్నాను. ఆ పని మీదే ద్రాక్షారామం భీమేశ్వరుడి గుడికెళ్ళి ఈ యానాం వస్తూ దారిలో వున్న మీ కోలంకలో పలక మీది మేటర్ చదివాక నీకోసం ఎంక్వైరీ చేయించి రప్పించాను" అని వివరించి "నాతో నువ్వు వస్తావా... సినిమాకి పాట రాసే ఛాన్సిప్పిస్తాను నీకు. రాస్తావా?" అనడిగాడు.

నెత్తిమీద కొబ్బరికాయ పడ్డట్టు అయిపోయిన శాస్త్రి కాస్సేపయ్యాక మామూలు స్థితికొచ్చి "నేనిప్పుడు చెప్పిన దాంట్లో అంత గొప్పేముందండి. ఆ మాత్రం ఎవరైనా రాయగలరు గదా?" అన్నాడు.

వాడి నిజాయితీని మెచ్చుకున్న భరణి "సానపడితే ఇంకా గొప్పగా రాయగలవు. నువ్వు రా నాతో" అన్నాడు.

అది కలో, కాదో తేల్చుకున్నాక సంబరంతో "సరే" అన్నాడు శ్యామశాస్త్రి.

*

కొన్నాళ్ళకి విడుదలయిన 'శ్రీ చరణం' అనే సినిమా హిట్టయ్యింది. అందులో శాస్త్రి రాసిన పాట సూపర్ హిట్టయ్యింది. అప్పట్నుంచీ పాపులర్ అయిన శాస్త్రి తన పేరు 'శ్రీ చరణం శ్యామశాస్త్రి'గా మార్చుకున్నాడు.

ఆ తర్వాత చాలా బిజీ అయిపోయిన వాడు మావేపు రాలేదు. మావూరు వాళ్ళు మట్టుకు 'ఆయన మా వూరివాడే' అని ఘనంగా చెప్పుకుంటూ, వాడి పాటల్ని ప్రత్యేకంగా వింటూ పాడుకుంటున్నారు.

ఇంతకు ముందు అచ్చమ్మ కాఫీ హోటల్లో లేబర్ తప్ప మేమెవరం తినేవాళ్ళం కాదు. ఇప్పుడా హోటలు కూడా పాపులర్ అయిపోయింది.

*

చాలా కాలం గడిచిపోయింది.

దత్తుడు సుబ్బరాజుగారు రతన్‌బాబు అనే కలం పేరుతో అప్పుడప్పుడు కొన్ని మినీ కథలు రాస్తున్నాడు.

ఎమ్మే బీఈడి చేసిన దేవదానంరాజు ఇంజరం స్కూల్లో టీచరుగా పనిచేస్తూ శాస్త్రి చెప్పిన పద్ధతిలో అన్నీ చదువుతూ ఇప్పుడు కథలు, కవితలూ కూడా రాస్తున్నాడు. ఆమధ్య 'వానరాని కాలం' అనే కవితా సంపుటి, ఈ మధ్య రాసిన 'గుండె తెరచాప' అనే ఇంకో పుస్తకం రిలీజ్ చేశాడు.

ఒకరోజు దవులూరి వాళ్ళ బ్రాందీషాపులో ఓల్డ్ రైబన్డ్ నిబ్బు కొనుక్కుందామని యానాం వెళ్తే తెలిసింది.

గతవారం నించీ పరిషత్తు నడుపుతున్నారట రసరంజనివాళ్ళు. ఈరోజు ఆఖరిరోజట. రాత్రికి ముఖ్య అతిథిగా శ్రీ చరణం శ్యామశాస్త్రి గారొస్తారట.

చాలా సంబరపడిపోయాను. పరిగెట్టుకుంటూ కాత్రేనికోన శీను దగ్గరకెళ్ళాను.

"అవునండీ ఫంక్షన్ తొమ్మిదింటికి. శాస్త్రిగారు ఏడూ ఆ ప్రాంతాల్లో రావచ్చనుకుంటున్నాను" అన్నాడు.

"చాలా సంతోషమండీ" అన్నాను.

"మీరు సంతోషించే వార్త ఇంకోటుంది. రాత్రి వేదిక మీద శాస్త్రిగారు కొత్తగా రాసిన కవిత ఒకటి చదువుతారు. ఆయనతో పాటు మన ప్రాంతాల్లో యువ కవులు రాసినవి చదవాలని కబురు చేశారు. అంబేద్కర్ నగర్‌లో వుండే లాజర్‌కి కబురు పెట్టాను. బుర్రోజు మేస్టారి లాస్ట్‌సన్ ఆలీబాబాకీ, చిన్నారికీ చెప్పాను. జార్జిపేటలో శామ్యూల్ రాస్తున్నాడట కదా. అతనికి చెప్పే పని మీది" అన్నాడు శీను.

మేం మాటాడుకుంటుంటే తన హోండా మోటారు సైకిలుతో పాటు మధ్యలోకి దూరిపోయిన చంద్రకళా లాడ్జి సుబ్రమణ్యం "డిన్నర్ మా లాడ్జిలో ఎరేంజ్ చేద్దాం. రేపట్నుంచి మాకు మంచి ఎడ్వర్‌టైజ్‌మెంట్ కదా" అన్నాడు. తాసిల్దారు కృపానందరావుగారొచ్చి "ఇవాళ మంగళవారం సంతలోంచి రెండు నాటుకోళ్ళు తెప్పించాను. వంట మా ఇంట్లో పురమాయించాను" అన్నాడు.

కుర్చీలో కూర్చుని వున్న విద్యాసాగర్ "వాళ్ళు బ్రాహ్మలు. నాన్ విజిటేరియన్ తినరయ్యా. అయినా మీకీ విషయం తెలీదా. అనుమిల్లి రాముా, నీలపల్లి బ్రాహ్మల ఇంట్లో పులిహోర, ఆవపెట్టిన పనసపొట్టు కూర, అరటిదూట పచ్చడీ, పప్పులుసూ చేయిస్తున్నాడు. ఆ సినిమా కవిగారికి భోజనం పెట్టేసి ఊళ్ళో పాపులర్ అయిపోదామని గాబోసు" అన్నాడు.

కాస్సేపయ్యేసరికి కాట్రేనికోన శీనుగారిల్లు రసరంజని సభ్యులతో నిండిపోయింది. ఎప్పుడూ జేబులోంచి పైసా తియ్యని పిల్లా సుబ్బారావు ఆవేళ మాత్రం రెండు మేన్షన్ హౌస్‌ఫుల్ బాటిల్స్ కొనుక్కొచ్చి సినిమా కవిగా రెప్పుడొస్తారా, ఎప్పుడు పరిచయం చేసేసుకుందామా అని చూస్తున్నాడు. హార్ట్ ఆపరేషన్ తర్వాత మందు ముట్టుకోవటం మానేసిన డ్రిల్ మేష్టారు కొప్పులస్వామి నాయుడుగారు ఇవాళ్టికి మాత్రమే మీతో కూర్చుంటానని ప్రామిస్ చేసి "ఆ శాస్త్రితో వెళ్ళి పాట రికార్డింగెలా చేస్తారో చూడాలి" అన్నారు.

ఒళ్ళు బాగా వచ్చేసిన వల్లూరి ఆదినారాయణగారు డైటింగ్‌లో వున్నా, ఈ పూటకి మీతో గడుపుతానని హామీ ఇచ్చి "శాస్త్రిగారితో సరదాగా ఫొటో దిగుదాం, జెమినీ స్టూడియో వాళ్ళకి కబురుచేద్దామా" అన్నాడు.

సాయంత్రం చల్లగా వుంది.

ఊళ్ళో సందడి మొదలైంది.

శాస్త్రి రాసిన పాటల్తో మారుమోగిపోతున్నాయి మైక్‌సెట్లు. గతవారం నుంచి నడుపుతున్న పరిషత్తులో ఆఖరి నాటిక అయ్యే టైముకి రెండు అంబాసిడర్ కార్లు, ఒక మారుతీ వచ్చి ఆగాయి.

ఒక్కసారిగా కోలాహలం, అరుపులు, కేకలు. కారులోంచి దిగిన శ్రీ చరణం శ్యామశాస్త్రికి ఎర్ర తివాచీ పరిచి, పసుపు, పూలు జల్లుకుంటూ తీసుకెళ్తున్నారు రసరంజని సభ్యులు. ఫంక్షన్ ప్రారంభమైంది.

తన ఇమేజ్‌కి ఇంత గౌరవం ఇస్తున్న ప్రజలకి కృతజ్ఞతలు చెప్పిన శాస్త్రి "ఇప్పుడు కొత్త కవులు తమ కవిత్వం చదూతారు. విని, వాళ్ళను ఎంకరేజ్ చేద్దాం" అన్నాడు.

చర్చిలో పాటలు పాడే సునీత అనే అమ్మాయి తన కవిత చదివింది. విన్న అన్ని వందలమందిలో ఏ పదిమందో చప్పట్లు మోగించారు. బహుశా వాళ్ళ ఫామిలీ మెంబర్స్ అయివుంటారనిపించింది.

భీంనగర్ నుంచి వచ్చిన రాజారామ్మోహనరావూ, రీజెన్సీలో పనిచేసే వెంకట్రావు, ఇంకా చాలామంది చదివారు కానీ, ఎలాంటి రియాక్షన్ లేదు జనంలోంచి. శాస్త్రి చప్పట్లు కొడుతుంటే మరి బాగోదన్నట్టు వాళ్ళూ కొడ్తున్నారు.

ఇక నావంతు అన్నట్టు లేచాడు శ్యామశాస్త్రి.

జనంలో స్తబ్దత.

ఏం చదవబోతాడా అన్న ఆత్రం.

ఒకరకమైన కుతూహలం.

అందర్నీ చూసి పల్చని వెన్నెల్లా నవ్విన శ్యామశాస్త్రి-

*"పురివిప్పి అధరం*
*విరబూసి నయనం*
*పిలిచాయి కాంక్షతో*
*ధారాళమైన మన ప్రేమకథనే*
*పాడాయి వాంఛతో..."*

వింటున్న జనం పూనకం వచ్చినట్టు "ఆహా...ఓహో" అంటూ అరుపులు, చప్పట్లు హోరు. ఆ హోరులోనే చదవటం పూర్తి చేసిన తను "నేను రాసింది మీ అందరికీ బాగా నచ్చిందనుకుంటాను" అన్నాడు.

"మీరేం చేసినా అద్భుతమే కదా!"

"అసలు మీరీ ఏరియాలో పుట్టడం అద్భుతం"

ఇలా రకరకాల వ్యాఖ్యానాలు, పొగడ్తలు అందరిని అన్ని విధాలుగా పొగడనిచ్చి "ఇప్పుడు మీరు షాకయ్యే వార్త ఒకటి చెబుతాను. విన్నాక మూర్ఛపోతారేమో అని నా అనుమానం" అన్నాడు శ్యామశాస్త్రి.

నిశ్శబ్దం. షాకయ్యే ఆ వార్త ఏంటా అని చూస్తున్నారు. మరికొన్ని క్షణాలు గ్యాప్ ఇచ్చిన తరువాత "ఇప్పుడు నేను చదివిన కవిత్వం నేను రాసింది కాదు. కుయ్యేరు నుంచి వచ్చిన యువకవి మంచె జనార్ధనరావు గారిది" అంటూ జనంలో వున్న జనార్ధనరావుని స్టేజి మీదకి పిల్చి "మీరు కురిపించిన అభినందనలు వీరికి చెందుతాయి" అనడంతో నిజంగానే మూర్ఛవచ్చినట్టయ్యింది జనానికి.

వర్షం చినుకు నేలమీద పడితే వినిపించేంత కటిక నిశ్శబ్దం. మీళ్ళీ మాట్లాడ్డం మొదలుపెట్టాడు.

"ఒకప్పుడు మహాకవి కవిత్వం నేను చదివితే, కేవలం నేను రాశాను అన్న తక్కువ భావంతో పూర్‌గా వుంది, చీప్‌గా వుంది అనేశాడు మా కొండూరి రామరాజు.

"ఎన్నో మంచి వాక్యాలు పలక మీద రాస్తే, పిచ్చి బ్రాహ్మడు ఏదో రాస్తున్నాడు అన్నారు మా వూరి వాళ్ళు.

"ఇప్పుడు ఇమేజ్ వచ్చాక ఎవరిదో నాదని చదివితే ఆహా పరమాద్భుతం అంటున్నారు మీరు."

అని కొన్ని క్షణాలాగి...

"అయ్యా! రాసినవాడు చిన్నవాడయినా, పెద్దవాడయినాసరే, ఎవరు రాశారు అని గాకుండా ఏం రాశారు అని చూడండి. ఆలోచించండి, స్పందించండి, అప్పుడు మాట్లాడండి.. నమస్కారం".

*స్వాతి సపరివారపత్రిక*
*1 సెప్టెంబర్ 2000*









అతనంటే అప్పులు తీసుకున్నోళ్ళందరికీ భయం. ఆ వీధిలో చిన్న పిల్లలకి మట్టుకి చాలా యిష్టం.

వడ్డీలకి డబ్బిచ్చే అతన్ని కాబూలోడని అనుకుంటారు వెనకనించి. ఎదురుపడ్తే సాయిబుగారూ నవాబుగారూ అంటారు. అసలు పేరు నీక్ బాబూ ఖాన్. ముఖం గులాబీరంగులో సద్దాం హుస్సేన్ ముఖం లాగుంటుంది. చాలా ఎత్తుగా బలంగా వుంటాడు. ఎక్కువగా నలుపూ ముక్కుపొడుం రంగుల పఠాను డ్రస్సు లేస్తాడు. కాళ్ళకి చడావులూ తల మీద టర్బనూ ఆ చివరా ఈ చివరా వెండి తొడుగులున్న అడుగున్నర పొడుగుకర్ర పట్టుకుని భూదేవిని గుద్దుతా నడుస్తాడు.

రైల్వేస్టేషను ఎదురుగా చారుగుడివారి వీధి చివర్లో గోదావరి గట్టునాన్చి రెండువేల గజాల స్థలంలో బ్రిటీషోళ్ళ దగ్గరకొన్న ఆ పెద్ద ఇల్లు బాబూఖాన్ సొంతం. పై అంతస్థులో బాబూఖాన్ కాపురం. ఒకళ్ళూ ఇద్దరూ గాదు ఏడుగురు పిల్లల్తో ఇల్లంతా ఒకటే సందడి. భార్య సలీమా అన్నా, ఆ పిల్లలన్నా ప్రాణం ఖాన్‌కి.

*

పాకిస్తాన్ విభజన జరిగింది.

అక్కడున్న ఖాన్ అత్తమామలూ కూతుర్నీ అల్లుడ్నీ వచ్చెయ్యమని ఒకటే గొడవ చెయ్యడం మొదలెట్టారు.

ఉన్నట్టుండి ఖాళీ చేసేసి వెళ్ళాలంటే కుదరదు. ఇవ్వాల్సిన బాకీల వాళ్ళు పూర్నిండా వున్నారు. అంతే గాకుండా గ్రౌండ్‌ఫ్లోర్‌ని మనీ లెండింగ్ ఫారాలు ప్రింటింగ్ చేసే శంకర్ ప్రింటింగ్ ప్రెస్‌వాళ్ళకి అద్దెకిచ్చేడు వున్న పళాన ఖాళీ చెయ్యమంటే వాళ్ళు చెయ్యరు. అదంతా భార్య సలీమాకి చెప్పి "ఏం చేద్దాం?" అన్నాడు.

"మీరు చెప్పండి" అంది సలీమా.

"ముందు నువ్వూ పిల్లలూ వెళ్ళండి. బాకీలన్నీ వసూలు చేసుకుని ఇల్లు అమ్మి డబ్బు చేసుకుని వెనకాల నేనొస్తాను" అన్నాడు.

"ఎన్నాళ్ళు పడ్తుంది?" అడిగింది భార్య.

"మూడు నెల్లు పట్టదూ" అన్నాడు ఖాన్.

"సరే అయితే... మూడ్నెల్లోపల వచ్చెయ్యండి" అంది.

"అలాగే" అని వాళ్ళని రైలెక్కించి ఇంటికొచ్చేడో లేదో మొదలైంది బెంగ.

ఇల్లంతా బోసిపోయింది. ఏ మూల తిరుగుతున్నా రైలెక్కి వెళ్ళిపోయిన తన బిడ్డలే గుర్తుకొస్తున్నారు. తన సలీమా గుర్తుకొస్తుంది. రాత్రుళ్ళు నిద్రపట్టడం లేదు. ఆ వీధిలో వుండే పిల్లల్ని పిల్చి తను కాల్చుకున్న రుమాల్‌రోటీలు వాళ్ళకి పెట్టి తన పిల్లల్ని ఆ పిల్లల్లో చూసుకుంటూ తన పిల్లల గురించి ఆ పిల్లలకి చెపుతా తక్కిన పన్లు చేసుకుంటున్నాడు.

*

భార్య దగ్గర్నుంచి ఉత్తరం వచ్చిందావేళ. పిల్లలు అస్తమానూ తననే అడుగుతున్నారంట. చిన్న కుర్రోడు సలీమ్ బెంగపెట్టుకున్నాడంట. ఇంకా చాలా రాసింది సలీమా. చదివిన ఖాన్‌కి కళ్ళు తెరిచినా మూసినా తన చిన్నారి సలీమే కనిపిస్తున్నాడు. తనవాళ్ళే కనిపిస్తున్నారు. ఎప్పుడు పాకిస్తాన్ వెళ్ళిపోతానా ఎప్పుడు తన మనుషుల మధ్య చేరిపోతానా అనుంది ఖాన్‌కి.

'నువ్వేం ఇదవ్వొద్దు. పిల్లలకి సర్ది చెప్పు. ఇక్కడన్నీ సర్దుబాటు చేసుకుని నీకు చెప్పిన టైమ్‌కి వచ్చేస్తాను' అని ఉత్తరం రాసి పోస్ట్ చేసి తిరిగి వస్తా శంకర్ ప్రింటింగ్ ప్రెస్ ఓనర్ బుద్ధవరపు పద్మనాభంగార్ని కల్సి "ఏం చేసేరు నే చెప్పింది?" అన్నాడు.

ఆ పద్మనాభంగారికి కోపం కాస్తెక్కువ "ఏం చెప్పేవు... ఏం చెయ్యాలి?" అన్నాడు.

"అదేనండీ ఇల్లు ఖాళీ చెయ్యడం గురించి" అన్నాడు ఖాన్.

"నేనూ మా అబ్బాయిలూ ఇల్లు వెతికే పనిమీదే ఉన్నాం" అన్నాడు పద్మనాభంగారు.

"అయితే నాకెప్పుడు చెబుతారు?"

"అది దొరికిన వెంటనే."

ఇక తొందర్లోనే ఈ దేశం విడిచిపెట్టి వెళ్ళిపోవడానికి ఒకోటీ చక్కబెట్టుకోడం సర్దుకోడం మొదలెట్టేడు ఖాన్.

నాలుగురోజుల తర్వాత తన ఇంటిమెట్ల దగ్గర టీ అమ్ముకు బతికే ఆదియ్యా కాంతమ్మా వచ్చి "సలాము లండి నవాబుగారూ" అన్నారు.

"ఏంటీ?" అన్నాడు.

"వడిశలేరులో ఉంటున్న మా తమ్ముడు కూతురు పెళ్ళండి. ఆడి కట్నంలో రెండొందలు తక్కువొచ్చింది. ఆ డబ్బు మీరిస్తే మేమిద్దరం లోటు మీద వేలిముద్రలేస్తాం నవాబుగారూ" అన్నాడు ఆదియ్య.

"మీరు పెట్టిన గడువుకి నెలనెలా కట్టేస్తుంటాం. అయినా మేమెక్కడికి పోతాం నవాబుగారూ మీ ఇంటి మెట్ల దగ్గరే గదా మా టీ యాపారం" అంది కాంతమ్మ.

"ఇప్పుడు ఇచ్చినవి వసూలు చేసుకోడం తప్ప కొత్తగా ఎవరికీ అప్పులు ఇవ్వడం లేదు. నేను మా దేశం వెళ్ళిపోతున్నాను... అప్పు ఎక్కడన్నా తీసుకోండి" అనాగి "ఇదిగో మీ తమ్ముడి కూతురు పెళ్ళికి నా చదివింపు" అనేసి పాతికరూపాయిలిచ్చి వాళ్ళని పంపేడు.

తర్వాత నెల్లో ఉత్తరం వచ్చింది 'మీకోసం బెంగెట్టుకున్న ఆఖరి కుర్రోడు సలీమ్‌కి జ్వరమొచ్చింది. హాస్పిటల్లో చేర్చేం. మిమ్మల్నే కలవరిస్తున్నాడు వాడు' అంటా, ఆ దృశ్యాన్ని కళ్ళకి కట్టినట్టు రాసింది సలీమా.

సాంతం చదివి చలించిపోయిన ఖాన్ కిందికి దిగేడు.

వర్కరెవడో పని ఎగ్గొట్టేడా వేళ. కాలితో తొక్కే ట్రెడిలు మిషను రిపేరొచ్చింది. దాంతో అక్కడున్న వాళ్ళందర్నీ తెగ తిడ్తున్నాడు పద్మనాభంగారు. సరిగ్గా అదే టైముకి వచ్చిన బాబూఖాన్‌ని చూసి "ఏంటీ?" అన్నాడు.

ఉత్తరంలో ఉన్నదంతా పూసగుచ్చినట్టు చెప్పి "మీరు తొందరగా ఖాళీ చేస్తే ఈ ఇల్లు అమ్ముకుని బయల్దేరతాను" అన్నాడు ఖాన్.

అసలే కోపంగా వున్న పద్మనాభం "ఏంటయ్యా... బాకీ వున్నట్టు ఎన్నిసార్లు చెపుతావ్... ఖాళీ చెయ్యి... ఖాళీ చెయ్యి అని చెప్పిందే చెబుతుంటే వినడానికి చిరాగ్గా వుంది" అంటా అరిచేడు.

"మీకెలాగున్నా నా కనవసరం ఖాళీ చెయ్యమన్నాను చెయ్యాల్సిందే" అని బాబూఖాన్ గొంతు పెంచేసరికి భయపడిపోయేడా బుద్ధవరపు పద్మనాభం.

*



రెండు వారాలు గడిచాయి.

పద్మనాభంగారి దగ్గర్నుంచి ఎలాంటి కబురూ రాలేదుగానీ పాకిస్తాన్ నించి మరో ఉత్తరం వచ్చింది. హాస్పిటల్లో జేర్పించిన వాళ్ళ ఆఖరి కుర్రోడు సలీం తననే కలవరిస్తూ చనిపోయాడంట.

చంటికుర్రోళ్ళాగ ఏడ్చేసేడు బాబూఖాన్. అలా ఏడుస్తానే నిద్రపోయిన తనకి రాత్రెప్పుడో మెలుకువొచ్చింది.

లేచి కోటగుమ్మం దగ్గరున్న సారాకొట్టు దగ్గరకెళ్ళి చిన్న సీసా తెచ్చుకుని ఎప్పుడూ లేంది దాంట్లోది నీళ్ళల్లో కలుపుకుని మొత్తం తాగేసేక ఆమధ్య కరుగ్గా మాటాడిన ప్రెస్ ఓనర్ పద్మనాభం గుర్తుకొచ్చేసరికి లేచి కిందికొచ్చేడు ఖాన్. అప్పుడే తాళాలేస్తున్నాడు పద్మనాభంగారు.

"ఏం చేసేరా విషయం?" అడిగేడు బాబూఖాన్.

"వెతుకుతున్నాం. ఇంత పెద్దిల్లు ఎక్కడా దొరకడం లేదు. బాగా టైము పట్టేలాగుంది. ఈలోగా మమ్మల్నిబ్బంది పెట్టొద్దు."

"అక్కడ నా కొడుకు చచ్చిపోయేడు. నేను వెంటనే వెళ్ళాలి. మీరు ఖాళీచేసి తీరాలి... వారం టైమిస్తున్నాను. ఈలోగా ఖాళీ చెయ్యకపోతే నా నిజస్వరూపమేంటో చూపిస్తాను" అనెళ్ళిపోయేడు పై అంతస్తులోకి.

ఖాన్ పెట్టిన వారంలోపే బుద్ధవరపు పద్మనాభంగారు కుదుర్చుకున్న లాయర్ దగ్గర్నుంచి నోటీసొచ్చింది. శంకర్ ప్రింటింగ్ ప్రెస్‌వాళ్ళు పర్మనెంట్ ఇంజక్షన్ దావా వేశారు నీక్ బాబూఖాన్ మీద.

జెండా పంజారోడ్‌లో అనంతరామయ్యగారని ఒక లాయరున్నాడు. ఆయన దగ్గరకెళ్ళి జరిగిందంతా చెప్పేడు ఖాన్.

చాలా ప్రశ్నలేసిన అనంతరామయ్య నీక్ బాబూఖాన్ తరపున ఆ కేసు వాదించడానికి ఒప్పుకున్నాడు.

"కేసు తేలడానికి ఎన్నాళ్ళు పడ్తుందండీ ప్లీడరుగారూ?" అనంతరామయ్య నడిగేడు ఖాన్.

"రెండేళ్ళు" చెప్పేడు.

"ఎన్నాళ్ళన్నారు?" అర్థంగాని ఖాన్ మళ్ళీ అడిగేడు.

"రెండు... రెండు సంవత్సరాలు తక్కువ పట్టదు" అని అనంతరామయ్య అనేసరికి ముచ్చెమటలు పోశాయి ఖాన్‌కి.

"అవతల మాదేశం వెళ్ళాలండీ" అన్నాడు.

"అయితే కేసు వదులుకుని వెళ్ళాల్సిందే" అన్నాడు అనంతరామయ్య.

"అదిగాదు ప్లీడరుగారూ కేసు కాస్త తొరగా తెమలడానికి దారేం లేదా?"

"నాకు తెల్సి లేదు."

ఆ రోజంతా ఆలోచించిన ఖాన్ జరిగిందంతా వివరిస్తూ చాలా పెద్ద ఉత్తరం రాశాడు భార్యకి.

'ఏం చేస్తాం మన ఖర్మ, మా తలరాత. కనీసం ఒక్కసారి వచ్చి వెళ్ళండీ... పిల్లలు తెగ అడుగుతున్నారు' అని జవాబు రాసింది భార్య.

దానికి చాలా ఇదయిపోయిన బాబూఖాన్ ఇంకేం ఆలోచించకండా 'వచ్చే నెల అంటే జూన్ మొదటివారం లో వస్తున్నాను' అని జవాబు రాసేశాడు.

కానీ, ఆ జూన్‌లో ఇద్దరు బాకీలు ఎగ్గొట్టి చాగల్నాడు పారిపోబోతుంటే టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబులు ఆదినారాయణ ద్వారా వాళ్ళని పట్టుకుని బాకీలు వసూలు చేసే పనిలో పదిహేనురోజులు దాటింది. ఉత్తరంలో తనవాళ్ళకి వస్తానని రాసిన ఆ జూన్ మొదటివారం వెళ్ళిపోయింది.

ఎప్పటికప్పుడు ఫలానా నెల్లో ఫలానా తేదీన ప్రయాణమవ్వాలనుకుని వాళ్ళకి రాయడం సరిగ్గా అదే టైముకి కొంపలంటుకుపోయే పనేదో తగిలి వెళ్ళలేకపోవడం. అదంతా చూసిన బాబూఖాన్ భార్యబిడ్డలు విసిగిపోయేరు.

"నా కుటుంబీకుల దగ్గర కెళ్ళాలని ఎంత బలంగా అనుకుంటున్నా వెళ్ళలేకపోతున్నాను" అని ప్లీడరు అనంతరామయ్య దగ్గర తెగ బాధపడ్తున్నాడు ఖాన్.

"ఆ మంచిరోజు త్వరలోనే వస్తుంది. వెళ్దుగాని. కానీ, సాయిబూ... అందరితోనూ మీ దేశం వెళ్ళిపోతున్నా నని చెబుతా అప్పులివ్వడం మానేస్తున్నావంట. కేసు తేలడానికి టైము పడ్తుందని చెప్పేను గదా... కాబట్టి నువ్వు వ్యాపారం చేసుకోవచ్చు. ఆలోచించుకో" అన్నాడు అనంతరామయ్య.

ప్లీడరుగారు చెప్పింది సబబుగానే వుందనుకుని ఆ మర్నాటినించీ నమ్మకం కుదిరిన వాళ్ళకి అప్పులిస్తా ఇంకో పక్కనించి వాయిదా పడ్డప్పుడు కోర్టు కెళ్తా కాలం గడుపుతున్నాడు బాబూఖాన్.

కాలం గడుస్తుంది.

వుత్తరాలు రాసుకుంటా వీధిలో మసుల్తున్న చిన్న పిల్లల్ని భూషణం కిళ్ళీ కొట్టు దగ్గరకి తీసుకెళ్ళి అక్కడ వరసగా పేర్చిన గాజుసీసాల్లో ఉన్న శనగపప్పుండలూ, బర్ఫీలూ, పచ్చి శనగపప్పు అద్దిన చిన్ని చేగోడీలూ, చిట్టి కాజాలూ వాళ్ళకి కొనిపెడ్తా వూళ్ళోకెళ్ళి వ్యాపారం చేసుకుంటూ, ఇంకో పక్కనించి కోర్టు పన్లు చూసుకుంటు న్నాడు. లాయరు అనంతరామయ్య అడిగిన ఫీజులు ఇస్తున్నాడు.

అలా చూస్తుండగానే మూడేళ్ళు కాదు ఏకంగా అయిదేళ్ళు గడిచిపోయాయి.

నీక్ బాబూఖాన్ కింది కోర్టులో ఓడిపోయేడు.

విలవిల్లాడిపోయిన ఖాన్ ఆ అపజయాన్ని తట్టుకోలేక మట్టిలో పడిపోయి దొర్లిదొర్లి ఏడ్చేడు. ఆ రాత్రి ట్రంకాల్ బుక్ చేసి జరిగిందంతా కుటుంబసభ్యులకి చెప్పాడు.

"ఆ కేసింక అలా వదిలేసి వచ్చిన కాడికి బాకీలు వసూలు చేసుకు వచ్చెయ్యండి. ఇక్కడ రెండో పిల్ల పెద్దదైంది. రావల్పిండి సంబంధం ఖాయం అయ్యిందని ఆమధ్య చెప్పేను గుర్తుంది గదా?" అంది భార్య సలీమా.



గుర్తుందన్నాడు.

"వచ్చే నెల రెండోవారం నిఖా అంటున్నారు వాళ్ళు. కాబట్టి మీరు బయల్దేరి రండి" అంది భార్య.

"పిల్ల పెళ్ళికి నేను రాకపోతే ఎలాగ?" అన్నాడు ఖాన్.

"పెద్దపిల్ల పెళ్ళప్పుడు కూడా ఇలాగే అన్నారుగానీ బయల్దేరండి" అని పిల్లలందరికీ ఇస్తే వాళ్ళందరితోనూ పరమానందంగా మాటాడ్తున్న నీక్ బాబూఖాన్‌కి తన ఒళ్ళో వాళ్ళంతా పడుకుని మాటాడ్తున్నట్టు సంబరపడి పోయాడు.

పాకిస్తాన్ వెళ్ళడానికి పెట్టీ బెడ్డింగూ సర్దుకుంటున్న ఖాన్ గుమ్మం దగ్గర చప్పుడైతే వెనక్కి తిరిగి చూసేడు. లోపలికొస్తున్న ప్లీడరు చల్లా అనంతరామయ్యగారు "ఎక్కడికీ ప్రయాణం?" అన్నాడు.

"మా దేశవండీ... మా రెండో అమ్మాయికి నిఖా. ఈ పిల్ల పెళ్ళికన్నా బయల్దేరి రమ్మని మా సలీమా గొడవ చేస్తే బయల్దేరుతున్నాను" అన్నాడు.

"చాలా సంతోషం మళ్ళీ ఎప్పుడు రాక?" అడిగేడు ప్లీడరుగారు.

"మళ్ళీ నేను వెనక్కి రాకపోవచ్చండి" అన్నాడు బాబూఖాన్.

"అయితే నువ్వు పాకిస్తాన్ అప్పుడే వెళ్ళొద్దు" అన్నాడు అనంతరామయ్యగారు.

"ఎందుకు వెళ్ళొద్దూ?"అన్నాడు ఖాన్.

"మనం పై కోర్టుకి వెళ్ళాలి వెంటనే. ఎట్టి పరిస్థితుల్లోనూ మనం నెగ్గి తీరతాం. ఇది నా ప్రెస్టేజికి సంబంధించిన విషయం. అసలు ఇంత మంచి ఆస్తి వదులుకుని మీదేశం వెళ్ళడానికి నీకు మనసెలాగొప్పింది" అంటా చాలా మాటాడిన అనంతరామయ్య బాబూఖాన్‌కి ఆ ఆస్తిమీద చాలా ఆశ పుట్టించేడు. దాంతో అతని ప్రయాణం ఆగిపోయింది.

ట్రంకాల్ చేస్తే తను లేకుండా తన రెండో పిల్ల పెళ్లి కూడా జరిగిపోతున్నందుకు చాలా ఏడ్చింది భార్య. ఆమెతో పాటు తనూ ఏడ్చాడు. ఇంటి మెట్ల కింద టీ అమ్ముకునే ఆ మొగుడూ పెళ్ళాల్ని పిల్చి ఏడ్చాడు. వీధిలో పిల్లల్ని పిల్చి ఏడ్చాడు. హైదరాబాదు జామ్‌బాగ్ రోడ్‌లో పళ్ళ వ్యాపారం చేసుకునే షఫీ అనే పిసినిగొట్టు కజిన్ బ్రదరుకి ఫోన్ చేసి ఏడ్చాడు.

*

ఇలా చూస్తుండగానే మరో పదేళ్ళు గడిచిపోయినియ్యి.

బాబూఖాన్ అత్తమామలెప్పుడో పోయారు. పిల్లలందరికీ పెళ్ళిళ్ళవ్వడమే గాదు మనవలు కూడా పుట్టేశారు. అయితే ఇప్పుడు ఒక్క భార్య తప్ప, పిల్లలెవరూ తన గురించి పెద్దగా ఇదవ్వడం లేదు. తన దగ్గర్నుంచి ఫోనొస్తే ఏదో పొడిగా మాటాడ్తున్నారు తప్ప, పూర్వం రోజుల్లో ఆత్రం వాళ్ళలో లేదిప్పుడు. వాళ్ళలాగ వుండటానికి్కారణం

తను వాళ్ళకి దగ్గరగా లేకపోవడమే, తన అలవాటు తప్పిపోవడమే అని సర్దుకున్న ఖాన్ వాళ్ళతో మాటాడ్తూనే వున్నాడు.

ఒక పక్క వ్యాపారం చేసుకుంటూనే లాయరుగారింటికీ కోర్టుకీ తిరుగుతున్నాడు.

మరి కొన్నాళ్ళు గడిచాయి.

పోరాటం చేస్తున్న బాబూఖాన్ వయస్సు అరవై అయిదేళ్ళు దాటేసింది.

ఆరోజు కోర్టులో తీర్పు ఇస్తున్నారు.

చాలా కంగారుగా బయల్దేరేడు బాబూఖాన్.

కోర్టువారు శంకర్ ప్రింటింగ్ ప్రెస్ యాజమాని బుద్ధవరపు పద్మనాభంగారికి అనుకూలంగా తీర్పు ఇచ్చారు. పై కోర్టులో కూడా ఓడిపోయాడు నీక్ బాబూఖాన్.

ఇంకా ఏదో చెప్పబోతున్న ప్లీడరు అనంతరామయ్యకి పెద్ద నమస్కారం పెట్టేసి బయటికొచ్చేడు.

కాలం చాలా మారిపోయింది.

పఠాను డ్రస్సూ నెత్తిమీద టర్బనూ కాళ్ళకి చడావులూ చేతిలో పొన్నుకర్రా పట్టుకుని నడుస్తున్న ఆ ముసలి కాబూలోడికి రాజమండ్రీ వూళ్ళో లేబరోళ్ళూ రిక్షావాళ్ళూ కూడా భయపడ్డం లేదు గదా, పుచ్చుకున్నది ఎగ్గొట్టడం మొదలెట్టేరు.

"నా ఆరోగ్యం అంతంత మాత్రంగా ఉంది. ఇక నాకు టైమయ్యింది. హాస్పిటల్లో ఉన్నానిప్పుడు. గుండెకి ఆపరేషన్ పడద్ది, చాలా డబ్బు ఖర్చవుద్దీ అంటున్నారు డాక్టర్లు. అక్కడ ఎంత దొరికితే అంతతోనే ఇక్కడున్నట్టు రండి" అంటూ దీనంగా మాటాడింది ముసలి భార్య సలీమా.

*

చాలా సంపాయించిన హెడ్ కానిస్టేబుల్ ఆదినారాయణ వూళ్ళో చాలా ఆస్తులు కొన్నాడనీ కొంటున్నాడనీ విన్న బాబూఖాన్ ఆ సాయంత్రం అతన్నెళ్ళి కల్సి జరిగిందంతా చెప్పి "ఈ కేసులో న్యాయం నా పక్కనుంది. కావాలంటే మా ప్లీడరుగార్నడుగు. ఆస్తిని మన సొంతం చేసుకోడానికి ఇంకా హైకోర్టూ, సుప్రీంకోర్టూ వున్నాయి" అన్నాడు.

"నాకంతా తెల్సు. నువ్వెందుకొచ్చేవో చెప్పు భయ్యా" అన్నాడు ఆదినారాయణ.

"లిటిగేషన్లో వున్న నా ప్రాపర్టీ ఇవ్వాళ రోజున ఇరవై అయిదులక్షలు పైన పలుకుతుంది. అది నీ కమ్మేసి మాదేశం వెళ్ళిపోవాలనుకుంటున్నాను. ఎంతిస్తావో చెప్పు" అన్నాడు బాబూఖాన్.

"రెండ్రోజుల్లో ఫోన్ చేసి వస్తాను భయ్యా" అని ఖాన్ని పంపించేసిన ఆ ఆదినారాయణ పదిరోజులైనా అజాపజా లేడు.








ఒకరోజు పొద్దుటే అతనింటికెళ్తే చాలా మర్యాదలు చేసి అన్నీ మాడాడ్తున్న ఆదినారాయణ ఈ మేట రెత్తడం లేదు.

చివరికి తనే దించేసరికి "క్షమించు భయ్యా, మా ఆడోళ్ళకి ఇలాంటి లిటిగేషన్‌లో ఉన్న మీ ఇల్లు కొనడం ఇష్టం లేదు. అయినా సరే ఆళ్ళని ఎదిరించిన నేను ఒక ఎమౌంట యితే కొందామనుకుంటున్నాను" అన్నాడు.

"ఎంత?" అన్నాడు ఖాన్,

"చాలా తక్కువ. అందుకే సిగ్గుపడి నీకు చెప్పడం లేదు" అన్నాడు.

"పర్లేదు చెప్పు భయ్యా" అన్నాడు ఖాన్.

"రెండున్నర లక్షలు కేషిచ్చేస్తాను" అన్నాడు ఆది నారాయణ.

ఆ ఎమౌంటు విని చాలా డీలా పడిపోయిన బాబూ ఖాన్ నీరసంగా లేచి బయటికొస్తున్నాడు. ఆలోచిస్తు న్నాడు. చాలా ఆలోచించిన ఖాన్ అవతల నా కుటుంబం ముఖ్యం, నా మనవరాలి పెళ్ళి ముఖ్యం అనుకుని ఆ తక్కువ డబ్బుకే ఆదినారాయణకి అమ్మేసి వూళ్ళో ఇచ్చిన అప్పుల్నిక వదిలేసి ఆరోజు రాత్రి ట్రైన్‌కే కజిన్ బ్రదర్ షఫీ వుంటున్న హైదరాబాదు బయలుదేరేడు. అక్కడ్నించి పాకిస్తాన్ వెళ్ళాలి అదీ ప్లాను.

బెర్త్ మీద కూర్చున్న ముసలిబాయీ ఖాన్ ఈ వయసులో తను కాల్చుకున్న రుమాల్ రోటీలు, వండు కున్న కుర్మా తిని, ట్రైన్ తాడేపల్లిగూడెం దాటిం తర్వాత బెర్త్ మీద వెల్లకిలా పడుకుని తన సలీమానీ పిల్లల్నీ మనవల్నీ తల్చు కుంటా చూడబోతున్న మనవరాలి పెళ్ళి దృశ్యం అందంగా ఊహించుకుంటా ఆ వూహల్లో తన బేగం తన ప్రియాతీ ప్రియ మైన సలీమాని కల్సుకున్నాడు. తను లేకపోడంతో ఆమె పడ్డ బాధలెన్నో చెప్పింది సలీమా. ఆమె లేకపోడం వల్ల తను పడ్డ

కష్టాలెన్నో చెప్పాడు బాబూఖాన్. ఆ వూహల్లో గతంలో ఎప్పుడూ లేనంత ఆవేశానికి గురయ్యి గుభిల్లు గుభిల్లుమంటా ఏడ్చాడు.

తెల్లవారింది.

ట్రైన్ సికింద్రాబాద్ స్టేషన్లో ఆగింది.

బాబూఖాన్ ముందే తెలీజెయ్యడంవల్ల ఎస్-ఫోర్ ఎక్కడుందా అని ఆ భోగీ వెతుక్కుంటా వచ్చిన పిన తండ్రి కొడుకు షఫీ లోపలికొచ్చి ఖాన్ చెప్పిన బెర్త్ దగ్గర కొచ్చేసరికి దళసరి రగ్గు లోపల చనిపోయి కనిపించాడు బాబూఖాన్.

అవాక్కయిపోయిన షఫీ సామాన్లూ అవీ వెతికితే హెడ్ కానిస్టేబుల్ ఆదినారాయణ ఇచ్చిన రెండున్నర లక్షల డబ్బు కనిపించలేదు. తన అన్న బాబూఖాన్ అబద్ధం చెప్పడు. మరేవయ్యిందా డబ్బు? అనుకున్న షఫీ పాకిస్తాన్ ఫోన్ చేసేడు.

ఫోన్ అందుకున్న ఖాన్ పెద్దల్లుడు ఖాసిం "ముసలావిడ హాస్పిటల్లో ఉంది" అన్నాడు.

జరిగింది మొత్తం చెప్పిన షఫీ "మృతదేహాన్ని అక్కడికి పంపించాలంటే ఖర్చవుద్ది. వెంటనే పంపండి మరి" అన్నాడు.

"ఇక్కడ మా పరిస్థితి అంతంత మాత్రం. ఆ ముసలాయన ఏవన్నా తెస్తాడని మేం చూస్తున్నాం" అన్నాడా అల్లుడు.

"విషయం ఆవిడకి చెప్పండి" అన్నాడు షఫీ.

"ఆమె కండిషన్ ఏమాత్రం బాగోలేదు. డిస్చార్జి అయ్యేక తప్ప ఇప్పుడు చెబితే ముసలావిడ దక్కదు" అన్నాడు ఖాసిం.

విషయం మొత్తం అర్థమైన షఫీ బాబూఖాన్ అంత్యక్రియలు హైదరాబాదులోనే జరిపించేశాడు.


స్వాతి సచిత్రవారపత్రిక











రాత్రి... ముసురు మధ్యాహ్నమనగా పట్టుకుంది. ఇంతట్లో వదిలేలా లేదు. యానాం రేవు ఒడ్డున ఆ తాటాకు పాకలో తీగకి వేలాడదీసిన లాంతరు గాలి గట్టిగా కొడ్తున్నప్పుడల్లా ఒక లయతో ఊగుతూంది.

వర్షం చినుకు వేడి చిమ్నీ మీద పడ్డప్పుడు చుయ్‌మని ఆవిరైపోతోంది. ఆ పాకలో టేబిలూ, కుర్చీ ఉన్నాయి.

కుర్చీలో ముడుచుకు కూర్చుని వున్నాడు టిక్కెట్లమ్మే రేవు గుమాస్తా వీరభద్రరావు. సొంత నావ యాజమాని హనుమంతు ఒకమూల దొంతరి కాళ్ళ మీద కూర్చుని చుట్ట కాలుస్తూ రేవు వేపే చూస్తున్నాడు.

ఇంత దళసరి మిలటరీ స్వెట్టరేసుకున్నా చలికి ఆగలేకపోతున్న వీరభద్రరావు హనుమంతుని చూసి ఆశ్చర్యపోతున్నాడు. నిక్కరు తప్ప ఒంటి మీద ఇంకే గుడ్డముక్క లేని ఈ వెధవ ఈ చలిలో ఎలా వుండగల్గుతున్నాడు.

"చలెయ్యడం లేదూ, హనుమంతూ?!" అడిగాడు.

చిన్నగా నవ్వాడు హనుమంతు.

వెధవ... నవ్వుతాడేవిటి?

"ఆ ఆంజనేయస్వామి బొమ్మ కింది రావిచెట్టు కొట్టేస్తే బాగుండును" అన్నాడు వీరభద్రరావు.

"గోదావరి కప్పేట్టేస్తే బాగోదా! అసలు చలి దాని వల్లండీ" అన్నాడు హనుమంతు.

"అది కాదయ్యా. చూడు చీకట్లో ఎలా ఊగిపోతుందో... ఈ చలంతా ఈ చెట్టు వల్లే."

నవ్వేసిన హనుమంతు "దీన్నానుకునే దీని పెళ్ళాం చెట్టు ఇంకోటుండేదండి- ఆమధ్య కూలిపోయింది లెండి."

"ఏమిటీ?" ఆశ్చర్యంగా అన్నాడు వీరభద్రరావు.

"చిత్తం... కొన్నేళ్ళ క్రితవండి... అది వేప చెట్టులేండి. తుఫానుకి ఆ పెళ్ళాం చెట్టు బాగా వాలిపోయిందండి. అప్పట్నుంచి ఈ మొగుడు చెట్టుకి పాడైపోయిన పెళ్ళాం మీది అసహ్యం పుట్టేసి పచ్చగా ఆకులేసేసేదండి. వాలిన చెట్టుని మొన్నా మధ్య వూళ్ళో యెర్రా సుబ్బారాయుడిగారికి కలప కావల్సొచ్చి వేలం పాడి కొట్టించేరండి. ఆ గాలి తుఫాను యేళకి నేనూ, మా బావ సముద్రంలో ఇరుక్కుపోయాం తెల్సాండి. చచ్చి బలుసుతిప్పలో తేలాల్సినోళ్ళమే. గోదావరి తల్లి గొప్పది కదండి... పాపం అనుకుని మమ్మల్ని కాపాడిందండి."

"అలాగా!"

"అవునండీ. ఆ చలికి శరీరం చిట్లి రక్తం కారిపోద్దని భయమేసిందండి..." చెప్పుకుపోతున్నాడు హనుమంతు. వర్షం వుధృతం అయ్యింది. ఆరిపోయిన చుట్ట వెలిగించి "బాబూ తవరు సిగరెట్ వెలిగించరేటి?" అడిగాడు.

"సిగరెట్లు అయిపోయాయ్."

చూరులోంచి లాగిన కత్తిలా లేచిన హనుమంతు "మరి చెప్పరేం. అర్జెంటుగా డబ్బులిలా పారెయ్యండి క్షణంలో పట్టుకొస్తాను" అని చెయ్యి చాపాడు.

"ఇక్కడ కొట్లన్నీ మూసేశారు. ఊళ్ళో కెళ్ళాలి గదా?"

"బాషా కిళ్ళీకొట్టు వీరేస్పరా టాకీసులో రెండోఆట వదిలిపెట్టే దాకా తీసే వుంటుందండి."

"అంత దూరమెళ్తావా ఈ వర్షంలో?"

"పదడుగులు వేస్తే వచ్చేస్తదిగాని డబ్బులు పారెయ్యండీ, టీ కూడా తెచ్చేస్తాను" అనేసి రాటకి వేలాడగట్టిన ఫ్లాస్కు తీసుకుని భుజానికి తగిలించుకున్న హనుమంతుకి పది రూపాయలిచ్చి-

"మన బ్రాండ్ తెలుసుగా చిన్న గోల్డ్ ఫ్లాక్, టీ ఫ్లాస్క్ నిండా పోయించు" అన్నాడు వీరభద్రరావు.

మొన్నటి వరకూ కాకినాడలో వుండేవాడు వీరభద్రరావు. రేవు కాంట్రాక్టరు కడప రెడ్డిగారి మనిషి "ఈ సంవత్సరం యానాం రేవు పాట మాది. పని చూపిస్తాను రావయ్యా, పంతులూ" అని లాక్కొచ్చాడు.

ఫ్లాస్కుతో వచ్చిన హనుమంతు "టీ చాలా యేడిగా వుంది బాబూ, ఓ గళాసు నిండా పోసుకుని అర్జెంట్‌గా తాగెయ్యండి" అన్నాడు.

చలి, వర్షం. విసురుగా వీస్తున్న గాలి అందమైన ఆడది మెత్తని చేత్తో చెంపని తడుతున్నట్టుంది వీరభద్ర రావుకి. టీ తాగి సిగరెట్ తీశాడు.

తను కూర్చున్న పాకలో తప్ప ఆ ప్రాంతం మొత్తం చీకటి. దూరంగా ఇంకో పాకలో ఫంట్ నడిపే స్టాఫ్ తప్ప జనసంచారం లేదు. కొట్లన్నీ సందకాడే కట్టేసిపోయారు. లాంతరు వేడి వెచ్చగా తగుల్తోంది వీరభద్ర రావుకి. అంత వర్షంలోనూ అవతల రేవులో దుర్గమ్మవారి గుడిలో దీపం అప్పుడప్పుడూ కనిపిస్తోంది. ఇలాంటి సమయాలు అందరి జీవితాల్లోనూ రావు అనుకున్నాడు అతను.

*


రాత్రి... శీతాకాలం. వెన్నెలా, చంద్రుడూ గోదావరి నీళ్ళలో ముఖాలు కడుక్కుంటున్నాయి.

వీరభద్రరావు ఈ యానాం వచ్చి ఏడాది అయ్యింది. ఊరంతా బాగా అలవాటయిపోయింది. నాటకాలు వేసే కాత్రేనికోన శీనూ, పేకాటలో డబ్బులు సంపాదించే సాగరూ, మేండ్లిన్ వాయించే కృపానందరావూ మంచి ఫ్రెండ్సయ్యారు. దరియాలతిప్ప రోడ్డూ, నీలపల్లమ్మ గుడి ముందు ఖాళీస్థలం, పిల్లంక ఏటిగట్టూ గొప్పగా నచ్చాయి. ఈ ఊర్నీ, గోదార్నీ ఈ జన్మకి విడిచిపెట్టనని పెద్ద శపథమే చేసుకున్నాడు మనసులో.

ఆ వెన్నెలరాత్రి అందంగా వుంది. 'జాలారి పాట అలలు మోసుకెళ్తున్నాయి' కోలంక రామరాజు రాసిన కొత్త హైకూలు గుర్తు చేసుకుంటున్నాడు. ఆ కొండూరి రామరాజులా తను కూడా కవి అయి వుంటే మూడు శతకాలు రాసి ఉండేవాడీ పాటికి. కానీ తను కవికాడు; ప్రేమికుడు. అతని ప్రేయసి తెల్లని లేసుతెర కప్పుకున్న అరబ్బు రాణీలా వుంటుంది. కాస్సేపట్లో ఇక్కడికొస్తుంది.

పాకలోంచి బయటికొచ్చి దూరంగా కనబడే ఎదుర్లంక రేవు వేపు చూశాడు. అమ్మవారి గుడి దీపాలూ, కాఫీ హోటలు పాక, ఎక్సయిజ్ ఆఫీసు షెడ్డు తాలూకు దీపాలు మెరుస్తూ కనిపిస్తున్నాయి.

ఆ వెలుగు వెన్నెల గోదావరిలో హనుమంతు నడుపుతున్న పడవ ఒడ్డుకొస్తుంది. అతనిలో ఆనందపు కెరటం, అదుగో తను ఆ పడవలో నిలబడి ఎలా చూస్తుందో చంద్రుడ్ని. 'సన్యాసినీ.. శుద్ధ సన్యాసినీ... కలల కాసుల పేరు కంఠానికుందేమి దరహాసినీ' అని పాడబుద్ధేస్తుంది. ఆ చలిలో వెచ్చని జ్వరంతో కాగిపోతూ ఆ ప్రేయసినే చూస్తున్నాడు. ఆమె పేరు ఊర్మిళ.



"నీళ్ళు లోపల కొచ్చేస్తున్నాయ్... యెదవ నావకి కర్రెయ్యలేక సత్తన్నా బాబూ. తాళ్ళరేవు నించి మేస్త్రిని పిల్చి నావకి కీలు పూయమని చెప్పాలి" నావని రాటకి కడుతూ అన్నాడు హనుమంతు.

తెల్లచీరలో పడవలోంచి దిగిన ఊర్మిళ పాకలో కొచ్చింది. ఆమె జడలో మల్లెల వాసన ఆ పాకంతా నిండిపోయింది. దాంతో పాటే వింత వెలుగొచ్చేసింది ఆ పాకలో.

"అలా చూస్తున్నారేం... ఎలా వున్నాను!" అనడిగింది.

"ప్రపంచంలోని అందమంతా ఈ పాకలోకి తీసుకొచ్చావని మురిసిపోతున్నాను."

భలేగా సిగ్గుపడింది ఊర్మిళ.

"నిద్రొస్తోందా?"

"ఇప్పుడే టీ తాగాను."

"చలిగా వుంది. నాకూ కాస్తివ్వండి" అందామె.

"తలంటుకున్నావా పట్టు జుట్టు రేగింది?"

"అవును. ఇవాళ గోకులాష్టమి."

"ఆ పొట్లాం ఏమిటి?"

"బొబ్బట్లు, మీకోసం."

చిన్నగా నవ్వి వాటిని తీసుకున్నాడు.

"గెడ్డమెందుకు అలా పెంచుతున్నారు?"

"విరహ గీతాలు రాద్దామని."

"అంతగా మిమ్మల్నేం బాధపెట్టాను?"

"లేదు. నేనే పడ్తున్నాను... ప్రతీవారం ఒక రాత్రి తప్ప మనం కలుసుకోవడం వీలుకావడం లేదని."

*

రాత్రి. పగలంతా ఎండలు కాయడం వల్ల ఆ వేడిగాలి గోదావరి మీంచి ప్రసారమవుతూనే వుందింకా.

అతనిప్పుడు పూర్వంలా లేడు. చాలా సీరియస్‌గా మారిపోయాడీ మధ్య. రిజర్వుడుగా కూడా వుంటున్నాడు. తక్కిన ఫ్రెండ్స్‌తో వచ్చిన జేడీ ప్రసాదే 'రమ్ తెప్పించనా?' అంటే, నన్ను ఇబ్బంది పెట్టొద్దంటున్నాడు.

"బాబూ! టీ తెచ్చాను."

"కూర్చో హనుమంతూ, నీకో కథ చెప్తాను."

కూర్చున్నాడు హనుమంతు.

"ఇది కథ కాదు, హనుమంతూ! నాలో పుడుతున్న ఊహలూ, కలలూ కలగలిపిన కందంబం" ఆ దీపం వెలుగులో నల్లని గెడ్డంతో సిగరెట్ కాలుస్తూ ఏదో చెప్తున్న అతన్ని చూస్తూ ఓ మూల కూర్చున్నాడు హనుమంతు.

"ప్రేమ అనేది అమృతం హనుమంతూ! అది ఎప్పుడన్నా విషమిస్తే తియ్యటి విషంగా కూడా మార్తుందట. నా విషయంలో ఆ పరిస్థితింకా రాలేదు. ఇక రాదు.

"నా ప్రేయసి దేవతయ్యా! నిన్న రాత్రి మేమిద్దరం అలా హిమాలయాల్లో కెళ్ళాం. సిమ్లాలో యాపిల్ కాయలు తిన్నాం. శాఫ్రిన్ పరిమళాల మధ్య నిద్రపోయాం. అరకులోయ మంచుతెరలు కప్పుకున్నాం. పాపికొండల మధ్య గూటిపడవలో ప్రయాణం చేశాం.

"నాది ఊహ; ఆమె నిజం. నిజంగా ఆమె నా ఇష్టదేవత. అదృష్టదేవత. జన్మజన్మలకీ ఆమే కావాలి నాకు. నువ్వెవర్నన్నా ప్రేమించావా, హనుమంతూ? లేదా... ఓసారి ప్రేమించి చూడు నీ మనసెలా అలజడి చేస్తుందో నీకు స్పష్టంగా తెలుస్తుంది. నిజం హనుమంతూ, పచ్చినిజం."

*

రాత్రి... "ఏవండీ నావకో టిక్కెట్టిస్తారా?"

తలెత్తి చూసి "రా, ఏమిటీ రహస్యం! ఆలస్యమైందేం?"

"అడ్డంకులొస్తున్నాయ్" చెప్పిందామె.

"కూర్చో" అన్నాడతను.

"ఏం కూర్చోడమో మా ఎదుర్లంకలో జనం చూపులన్నీ నా మీదే. ఎక్కువసేపుండను వెళ్ళాలి."

"అలాగేలే, రా కూర్చో... టీ తెప్పించనా?"

"వద్దు. తాగితే మళ్ళీ నిద్రరాదు."

"నా ఊహల్లో తేలిపోయి జాగారం చెయ్యడంలో ఆనందం వుండదా?" అడిగాడతను.

"ఎప్పుడూ మీ ఆలోచనలతోనే గడుపుతాను."

"ఏం ఆలోచిస్తున్నావ్?"

"మీ భార్యని ఎప్పుడవుతానా! అని."

"మళ్ళీ వారం ఇదే సమయానికి మనం భార్యాభర్తలం."


"నాతో ఎప్పటికీ ఇలానే వుంటారు కదూ!"

"ఈ శరీరం వున్నంతకాలం నీలో లీనం అయిపోయి వుంటాను సరా!" అన్నాడు.

ఆ క్షణం అతనిలో లీనమయ్యింది ఊర్మిళ.

చాలాసేపయ్యాక అవతలి రేవుకి ఆమెని సాగనంపి రమ్మన్నాడు హనుమంతుతో.





ఊర్మిళ హనుమంతు ఎక్కిన నావ గోదావరి మధ్య కెళ్లేసరికల్లా గాలి ఉధృతమైంది. ఆకాశంలో మబ్బులు నల్లగా కమ్ముకున్నాయ్. వీరభద్రరావు చాలా భయపడిపోయాడు. కానీ క్షణాల్లో మళ్ళీ అతనికి ధైర్యం వచ్చింది.

హనుమంతు ఊరు గోదావరి మధ్యలో వున్న చావుబందలంక. ఆ రేవులో పనిచెయ్యక పూర్వం సముద్రంలో చేపలవేట కెళ్ళేవాడు. చిన్నప్పట్నుంచీ వాడు నావకి కర్రెయ్యడంలో నేర్పరి. పర్లేదు ఊర్మిళని క్షేమంగానే దించుతాడు. ఒడ్డున కూర్చుని సిగరెట్ వెలిగించాడు.

గంటకి హనుమంతు సొంత నావ ఈ ఒడ్డుకొచ్చింది.

"యెదవ గాలి బాబూ! ఈ అందమైన అమ్మాయిగార్ని నావెక్కించుకునేసరికి దానిక్కూడా అసూయ పుట్టేసింది" నావను ఒడ్డుకు చేరుస్తూ అన్నాడు హనుమంతు.

"నువ్వు చాలా ధైర్యస్థుడివి హనుమంతూ! టీ తాగుదామా?" అన్నాడు వీరభద్రరావు.

"ఊఁ... డబ్బులియ్యండి బాబూ అర్నిమిసం."

హనుమంతు ప్లాస్కు తీసుకెళ్ళి పావుగంటలో టీ, సిగరెట్లు పట్టుకొచ్చాడు. టీ తాగి సిగరెట్ కాలుస్తుండగా హనుమంతడిగాడు. "బాబూ! ఈ అమ్మాయిగార్ని మీరు పెళ్ళాడతానని అన్నారా?"

"అవును. నీతోకూడా చెప్దామనుకుంటున్నాను. వచ్చేవారం ఇదే రోజు పెళ్ళి. నువ్వే పెళ్లి పెద్దవి."

"బాబూ..." అన్నాడు హనుమంతు.

"ఏవిటోయ్! ఏవిటలా సందేహిస్తున్నావ్ చెప్పు?"

"ఆ అమ్మాయిగార్ని మీరు చేసుకోవద్దు బాబూ!"

"ఏవిటీ?"

"అవును బాబూ! మీకిద్దరికీ మధ్య గోదారుంది."

"నువ్వనేదేంటో అర్థం గావట్లేదు."

"ఆమెని ఆ ఒడ్డునే వుంచండి బాబూ! గోదావరి దాటించి ఇక్కడికి తీసుకురాకండి."

"ఏం ఎందుకని?".

"ఆ పిల్ల మీకు తగదు... మీకసలు జోడీ కాదని నా అనుమానం" అన్నాడు హనుమంతు.

"ఏ రకంగా, నాకు వివరంగా చెప్పు, హనుమంతూ!"

"పొద్దున్నే చెప్తాను... ఇప్పుడు పడుకోకపోతే తెల్లవారుజామునొచ్చే జామికాయల సైకిళ్లూ, చేపల బుట్టలూ ఒడ్డు చేర్చడానికి మెలకువ రాదు."

"పర్లేదు హనుమంతు, ఈ రాత్రికి ఈ విషయం వివరంగా చెప్పి నా పాకలో పడుకుందువు రా!"

"వద్దు బాబూ! యెదవది సల్లగాలి శరీరానికి తగలకపోతే నాకు నిద్రపట్టదు. బాబూ! మీకీ యిసయం తెల్సా, నేను పుట్టడమే నావలో పుట్టాను" అనేసి ఒడ్డున కట్టి వున్న నావ వేపెళ్లిపోయాడు పడుకోవడానికి.

వీరభద్రరావు పాకలోకెళ్ళి టేబిలు ముందు కుర్చీలో కూర్చున్నాడు. సిగరెట్ నోట్లో పెట్టుకుని హరికెన్ లాంతరు మంట కొద్దిగా తగ్గించాడు. హనుమంతు విషయం చెప్పిన దగ్గర్నుంచి అతని మనసులో పెద్ద తుఫాను లాంటిది చెలరేగింది. విలవిల్లాడిపోతున్నాడు.

హనుమంతు చాలా మంచివాడు. వాడలా అన్నాడంటే ఏదో వుంది. ఏదీ లేకుండా, ఏదీ కాకుండా అనడు.

ఏమై వుంటుంది! ఊర్మిళ చెడిపోయిందా? ఛఛ! ఊర్మిళ చెడిపోతుందా?

"ఈ అమ్మాయికి మూర్ఛరోగం వుందండీ!"

"పాపం ఈ పిల్లకి వేపకాయంత పిచ్చి."

ఇలా... చిన్న లోపం వుంటే చిత్రంగా చిత్రిస్తారు స్త్రీ గురించి. కానీ శీలం పరంగా ఏదైనా నిఘా వుంటే దాని గురించి గుసగుసల్లోంచి గ్రంథాలే రచిస్తారు.

అయితే ఊర్మిళ చెడిపోయిందా?

ఏ కరణం కొడుకుతోనో, ఇంటిగోడల మీద వారం వారం వచ్చి సంతకాలు పెట్టే మలేరియా డిపార్ట్‌మెంట్ ఉద్యోగితోనో సంబంధం చెడి తను చెడిపోయుంటుంది.

ఆ రాత్రి ఎంతకీ నిద్రపట్టలేదు వీరభద్రరావుకి. గజిబిజిగా తయారైంది మనసు. గోరంత ఆలోచన కొండంతగా మారింది. వెన్నెలంతా చీకటయ్యింది. ఆ చీకట్లో పెనుతుఫాను మొదలైంది.


రెండు గంటలుగా గాలి వీస్తూ దబదబా వర్షం కురుస్తూనే వుంది. పాకంతా వర్షం. వీరభద్రరావు కప్పుకున్న మిలటరీ రగ్గు మీద పడ్తున్నాయి వర్షం చినుకులు.

ఇంత వర్షంలో హనుమంతెక్కడున్నాడబ్బా!

పెళపెళా శబ్దం. సుళ్లు తిరుగుతూ గాలి.

తలమీద టవలు వేసుకుని లాంతరు పట్టుకుని బయటికొచ్చాడు. కొబ్బరిచెట్లు మెలితిరిగి పోతున్నాయ్. క్షణక్షణానికి పొంగుతోంది నీరు. గోదావరి మధ్యలో పడవ మునిగి హాహాకారాలూ, నురుగులూ కక్కుతూంది. మట్టం మరీ పెరిగిపోవడం వల్ల ఒడ్డు వరకూ వచ్చేసింది నీరు. చాలా ఏళ్ళ తరువాత వచ్చిన పెనుతుఫాను అది. హనుమంతు ఏమయ్యాడీ తుఫానులో.

అర్ధరాత్రి దాటింది. ఆర్.ఈ.ఓ. ఆఫీసు దగ్గర జెండా స్తంభం దాకా వచ్చేసింది వరదనీరు. కంచెర్ల వాళ్ళ రైసుమిల్లు గోడలు పడిపోయాయి. బ్రిడ్జీ కింద క్రిష్ణ అరటిపళ్ళ దుకాణం, రొయ్యలసీడ్ అమ్మే సూర్యనారాయణ షాపూ, తాళ్ళకొట్టు వెంకట్రావు కిళ్ళీకొట్టు గాలిలో ఎగిరిపోయాయి. పశువులు నీళ్ళలో కొట్టుకుపోతున్నాయ్. భైరవపాలెంలో వేటకెళ్ళిన పడవ లేమయ్యాయో తెలీదంట. ఎటుచూసినా జన నష్టం. ఆస్తి నష్టం.





ఇంతకీ ఆ హనుమంతుడేమయినట్టు?

మర్నాడు తెలిసింది. హనుమంతు చనిపోయాడు. గోదావరి హనుమంతుని మింగేసింది.

వీరభద్రరావుకి ఊర్మిళ విషయం విశదీకరించకుండానే తనలో ఇముడ్చేసుకుంది ఈ వృద్ధ గౌతమి.

*

రాత్రి పదయ్యింది.

"ఎక్కడికే బయల్దేరావ్?" గుమ్మం ముందు దెయ్యం లా నిలబడి నిలదీస్తుంది ఊర్మిళ సవతి తల్లి.

"అమ్మా! అక్కయ్య మొలలో పసుపుతాడు కట్టిన మంగళసూత్రం వుంది" చెప్తున్నాడు ఊర్మిళ తమ్ముడు.

"ఏమిటే నిజమా?"

"నిజం అమ్మా! కంసాలి భద్రంకి వందరూపాయలిచ్చి మంగళసూత్రం చేయించిందట."

"ఈ మధ్య దీని ప్రయాణాలు చూస్తూనే వున్నాను. ఊళ్ళో దీని గురించి అనుకుంటుంటే ఏమో అనుకున్నాను. నిజం చెప్పవే ఎక్కడికి?"

"అవతలి ఒడ్డుకి" నిజం చెప్పింది ఊర్మిళ.

"ఏముందక్కడ?ఎవడున్నాడక్కడ? దేనికి?"

"నా భర్త వున్నాడక్కడ. అతనితో జీవితానికి."

"అయితే మళ్ళీ నువ్వీ ద్వారబంధం తొక్కక్కర్లేదు" గదిలోంచి బయటికొస్తూ అన్నాడు ఊర్మిళ తండ్రి.

"సరే" నిశ్చయంగా బయల్దేరింది ఊర్మిళ.

ఫంట్ ఎక్కిన ఊర్మిళ యానాం రేవుకొచ్చింది.

మొన్న గోదావరి పొంగినప్పుడు పాతపాక కొట్టుకు పోయినట్టుంది... కొత్తది వేశారు. పాకలో టేబిలూ, హరికెన్ లాంతరూ, టిక్కెట్ల పుస్తకాలూ, టేబిల్ మీద తల పెట్టుకు నిద్రపోతున్న గుమస్తా. అంతా అలాగే వుంది.

"నమస్కారం, వీరభద్రరావుగారూ!"

ఆ మాటకి తలెత్తిన ఆ వ్యక్తిని చూసి భిన్నురాలయ్యింది ఊర్మిళ. అతను వీరభద్రరావు కాదు ఎవరో.

"రాత్రే వీరభద్రరావుగారు ఈ వూర్నుంచి వెళ్ళిపోయారు. నా పేరు హరిబాబు. రేవు కాంట్రాక్టరుగారి మేనల్లుడ్ని" చెప్పాడతను.

"అలాగా!" అని నిలబడిపోయింది.

ఆమెకిప్పుడు ఎటు వెళ్ళడానికీ దారి లేదు. గోదావరి వేపు చూసింది. ప్రసవానంతరం నిద్రపోయే తల్లిలా చల్లగా నిద్రపోతోంది. అవతల ఒడ్డు మసగ్గా కనిపిస్తోంది. అసలు హనుమంతు చచ్చిపోకుండా వుంటే వీరభద్ర రావుకి చెబుదామనుకున్న విషయం-

"బాబూగారూ! ఇంతరాత్రి యేళ మీ దగ్గరకొచ్చే ఈ అమ్మ పెళ్ళయ్యాక మీతో సంసారం సేత్తదా అని నాకో పెద్ద అనుమానం. మొన్న ఈమె ఇసయం కనుక్కుందామని నావకి కర్రేత్తూ ఎయ్యాలనే ఆ యమ్మ భుజం మీద చెయ్యేత్తే, సచ్చినోడా ఒంటి మడిసి మీద సెయ్యేత్తవా! అని తిడద్దని చూశాను. కానీ తిట్లేదు బాబుగారూ.

'హనుమంతూ నావేటి ఇలా కదుల్తుంది' అందంతే. ఈ అనుమానాలు నన్ను పీకి నిన్న రాత్రి మీతో అలా అన్నాను. అంతేగాని ఈ అమ్మ సెడిపోలేదు. సెడిపోద్దేమో, కాపరం తిన్నగా సెయ్యదేమో అనుకున్నానంతే. అంతే, బాబుగారూ అంతే... అంతే..."

*జ్యోతి దీపావళి ప్రత్యేక సంచిక, 1978*







13వ
నెంబరు
మైలురాయి

ఎస్.కె. రివైరా... ఎ రివర్ ఫ్రంట్ రిసార్ట్ హోటల్ అనున్న వినయిల్ హోర్డింగ్ మీద వాలి ఉన్న కాకి బ్లాక్ కలర్ ఇన్నోవా వేన్‌ని చూసి అరవడం మొదలెట్టింది.

సగం విడదీసిన యూ ఆకారంలో ఎగువ నించి బాగా దిగువుకున్న సన్నటి సిమ్మెంటు పాథ్ మీంచి కిందకొచ్చి పార్కింగు స్థలంలో ఆగింది వేన్. తలుపులు తీసుకుని దిగుతుంటే సీతాకోకచిలకల గుంపొకటి వాళ్ళకి స్వాగతం చెప్పి పక్కనే ఉన్న పూలతోటలో కెళ్ళిపోయింది.

రిసెప్షన్ బిల్డింగ్ వెనకే కిచెన్ హాలు, దాన్ని ఆన్చి ఓపెనెయిర్ రెస్టారెంట్. ఏ పక్కకి చూసినా పచ్చదనమే. లాన్‌లో నిలబడి ఆ అందాల్ని చూస్తున్న ధనుంజయ బైరాగి కాళ్ళ మధ్యలోంచి నాలుగు కుందేలు పిల్లలు పారిపోయాయి. గిన్నీకోళ్ళూ, టర్కీకోళ్ళూ, ఖజానా బాతులూ చుట్టూరా ఆడుకుంటున్నాయి. సన్నగా తెల్లగా పొడుగ్గా పొడుగాటి జట్టుతో ఉన్న ధనుంజయ బైరాగి గోదావరినే చూస్తున్నాడు.

రిసెప్షన్ బిల్డింగ్ పక్కనే రివైరా క్లబ్ అని రాసి ఉన్న సిమ్మెంటు తోరణం దాటుకుని లోపలికి నడుస్తుంటే ఆ బాటకి ఎడాపెడా రకరకాల పూలమొక్కలూ ఫలవృక్షాలు. నేలమీద రాలిన చైనీస్ చెర్రీ పళ్ళు ఏరి అందరికీ పెడ్తున్నాడు బైరాగి. ముందు వెళ్తున్న వాళ్ళ బాట కుడిపక్కన అందమైన రెస్టారెంట్ చిల్డ్రన్ పార్కూ జిమ్‌హౌస్, నేచిరోపతీ హెల్త్ సెంటర్, దూరం దూరంగా కనిపించాయి.



ఆ దారిలోనే ముందుకెళ్తే సిమ్మెంట్‌తో కట్టి ప్లెజంట్ కలర్స్ వేసున్న అందమైన కాటేజ్‌లు వరసగా కనిపించాయి.

కాటేజ్ తలుపులు తెరిచారు సామాన్లు మోసుకొచ్చిన కుర్రాళ్ళు. కుడిపక్క బాత్‌రూమ్ డోరూ దాన్ని దాటుకుని ముందుకెళ్తే డబుల్‌కాట్ సిమ్మెంట్ బెడ్. అది దాటి ముందుకెళ్తే బాల్కనీ. దానికి, పదంటే పదే గజాల దూరంలో సుళ్ళు తిరుగుతా ప్రవహిస్తున్న అఖండ గోదావరి. జూయ్ జూయ్‌మని చప్పుళ్ళు చేస్తూ గాలి. చుట్టూ వున్న పూల పరిమళాలు ఆ బాల్కనీలో వేసున్న కెయిన్ చెయిర్‌లో కూర్చున్న బైరాగి ఏదో కలలో తిరుగుతున్నట్టు తల అటూ ఇటూ తిప్పుతున్నాడు.

గోదావరిలోంచి అటూ ఇటూ వెళ్తున్న తెరచాప పడవలూ, గూటి పడవలూ వేట పడవలూ ఇసకలోడు ఇంజను పడవలూ, జనంతో వెళ్తున్న పాసింజరు లాంచీలు- వాటిని చూసి చాలా థ్రిల్లయిపోయిన బైరాగి "చాలా అద్భుతమైన ప్లేస్ కొచ్చేం మనం" అన్నాడు.

స్నానాలవీ చేసి ఫలహారాలారగించేక  కథ చెప్పడం మొదలెట్టాడు యువ బెంగాలీ రచయిత ధనంజయ బైరాగి.

ఆ లోయలో వయలెట్ కలర్ చీర, నల్ల జాకెట్ వేసుకుని తెల్లగా అందంగా అపస్మారకస్థితిలో పడున్న వసంతసేనని విల్లీస్ జీపులో ఎక్కించుకున్న ఆ యువకుడు, ఆమెని హవేలీలోకి తీసుకొచ్చేడు.

చెపుతున్న బైరాగి ఠక్కున ఆగిపోయేడు. పక్కనెక్కడినించో ఒక స్త్రీ వయొలిన్ వాయిస్తూ పాడుతున్న పాట వినిపిస్తుంది. *నీలలోహిత హిత కారిణీ భవానీ శక్తి ధారిణీ...* అమృతవర్షిణి రాగం, శృతీ సడోలికర్ వాయిస్ లాగ జీరతో వుంది.

విని థ్రిల్లయి పోయేరంతా.

"పక్క కాటేజ్‌లో ఎవరో దిగి వుంటారు" అన్నాడు డైరెక్టర్ చక్రవర్తి.

కథ చెప్పడం కంటిన్యూ చేసేడు బైరాగి "హీరోయిన్ వసంతసేనని తీసుకొచ్చి దివాన్‌కాట్ మీద పడుకోబెట్టి సేవలు చేస్తా ఆమె ముఖంలోకే చూస్తున్నాడు. గతంలో అతనొక రాక్షసుడు. ఒక నల్లని బానిసని తెల్లని తివాచీ మీద పడుకోబెట్టి కొరడాతో కొడ్తుంటే ఆ తివాచీ మీదపడి మెలికలు తిరుగుతున్న ఆ బానిస శరీరంలోంచి వస్తున్న ఎర్రటి రక్తం ఆ తివాచీకి చాలాసార్లు అంటుకోడం వల్ల తెల్లటి కేన్వాస్ మీద కేవలం ఎరుపురంగుతో వేసిన మోడ్రన్ పెయింటింగ్‌లా తయారవుతుంది. అలాంటి అతన్లో ఏదో మార్పొస్తుంది. ఆమె ముఖంలో ఒక కరుణామయి కనిపిస్తుంది. సేవలు చేస్తున్నాడు. తెలతెలవారుతుంది. హీరోయిన్ వసంతసేన లేవలేదు" అని చెపుతూ ఆగిన  బైరాగి "ఫస్ట్ డే గదా గేప్ ఇద్దాం" అన్నాడు.

ప్రొడక్షన్ మేనేజరూ డైరెక్టర్ చక్రవర్తీ, అతని అసిస్టెంట్సూ ఎవరి రూములకి  వాళ్ళెళ్ళిపోయేకా రచయిత బైరాగి ఆ ఎస్.కె. రివైరా ప్రాంతంలో నడుస్తున్నాడు.

నడుస్తున్న అతనికి ఇందాక పాడిన ఆ స్త్రీ గొంతే గుర్తుకొస్తుంది. ఆ పాటనే ఆ రాగాన్నే తల్చుకుంటూ ముందుకు నడుస్తూ అక్కడ పూచిన గులాబీల్ని చూసి ఆగిపోయాడు.

రకరకాల రంగుల్లో రకరకాల గులాబీలు కనిపించాయి. ఒకటి కాదు రెండు కాదు రెండువందల యాభై రకాల గులాబీలు. వాటి మీద వాలుతూ ఎగురుతూ రకరకాల రంగుల్లో రకరకాల సీతాకోకచిలుకలు. ఇటుపక్క

పూచిన గులాబీపూలకి అటుపక్క ప్రవహిస్తున్న గోదావరితల్లి మధ్య కట్టి వున్న రేవు మెట్ల మీద కూర్చున్నాడు. మళ్ళీ వినిపించింది *నందబాలం భజరే నంద బాలం బృందావన వాసుదేవ బృందాలోలం*... గాత్రానికి వయొలిన్ సపోర్టు. రాగం మారింది. అమృతవర్షిణి కాదు అభేరి.

ఆ గాత్రమే వింటున్న ధనంజయ బైరాగి కాస్సేపటికి అది ఆగిపోయినా తను మట్టుకి ఆ ట్రాన్స్‌లోనే వుండిపోయేడు.

మధ్యాన్నమైంది.

మేనేజర్ గౌరీశంకర్ భోజనానికి పిలిస్తే రెస్టారెంటు వేపు నడుస్తున్న అతను పంచరంగుల బోగన్ విలియా పూలచెట్లని దాటుకుంటూ పర్ణశాల టైపులో కట్టిన రెస్టారెంట్‌లో కెళ్ళాడు.

అనసూర్య అనే అక్కడి వంటావిడ వండిన దక్షిణ గోదావరి ప్రాంతపు వంటల్ని మైమరిచిపోయి తిన్నాక తిరిగి తనకిచ్చిన కాటేజ్‌లో కొచ్చేడు.

గడిచిన తన జీవితకాలంలో ఇంత అద్భుతమూ అమోఘమూ అయిన వాతావరణాన్ని, అంత మధురమూ సుమధురమూ అయిన గాత్రాన్ని వినలేదు. బాల్కనీలో కూర్చుని అదే అదే... పదే పదే తల్చుకుంటూ గోదావరిలోంచి ధవళేశ్వరం వేపెళ్తున్న లాంచీని చూస్తున్నాడు. తెరచాప విప్పిన రెండు గూటిపడవలు తూర్పువేపుకి ప్రయాణం చేస్తున్నాయి.

వీస్తున్న గాలి ఆగిపోయినట్టయ్యింది. కునేగా మరికుళందు వాసన ముక్కుకి తగిలింది.

'ఎంత బాగుందీ పర్‌ఫ్యూమ్?' అనుకుంటా తలెత్తి చూసిన ధనుంజయ బైరాగి రెప్పార్పకండా అలా చూస్తూ వుండిపోయేడు.

బురఖాలో వుందామె. తెల్లటి పాదాలూ, తెల్లటి చేతులూ మాత్రం కనిపిస్తున్నాయి. ఒక చేతిలో వయోలిన్ నిగనిగా మెరిసిపోతుంది. కర్పూర చామంతి, చిట్టిచామంతి, పెరుగుబంతీ, వూకబంతీ, పూలచెట్ల మధ్యలోంచి అడుగులో అడుగేసుకుంటా నడుస్తా ముందుకెళ్తుందామె. ముసుగులోంచి ఆమె కళ్ళు వెన్నెల్ని మింగినట్టు వెలిగి పోతున్నాయి. సృష్టిలో సర్వ అందాల్నీ సంపూర్ణంగా తాగినట్టూ ఎవరికీ అందకుండా ఇన్ని యుగాల్నుంచీ ఎక్కడో దాక్కున్నట్టు వెలిగిపోతూనే వున్నాయి ఆ కళ్ళు. వాటిని చూసిన బైరాగి 'కళ్ళే ఇంత గొప్పగా వున్నాయి, ఇక మనిషెంత గొప్పగా వుంటుందో' అనుకున్నాడు.

రివైరావాళ్ళ ఫిషింగ్‌బోటులో ఆమె కూర్చున్న వెంటనే ఇంజను స్టార్ట్ చేసి గోదాట్లోకి పోనిస్తున్నాడు సరంగు. ఇక వాయించడం మొదలెట్టింది వయొలిన్.

చూస్తే ముస్లిం స్త్రీ. హిందూస్తానీ వాయించాలిగానీ కర్ణాటిక్ రాగాలేంటి? చాలా సస్పెన్స్‌గా వుంది. బొత్తిగా అర్థం కావటం లేదు.

సాయంత్రం బీరుసీసా తీసుకొచ్చిన బోయ్ అంజికి టిప్ ఘనంగా ఇచ్చి అడిగితే చెప్పాడు వాడు. "ఆళ్ళది హైదరాబాద్‌లో ఓల్డ్‌సిటీ అంట. ఒక మగతనితో పాటొచ్చిందండి. పేరు షహనాజ్. మగతను రాత్రి పది దాటేక వచ్చి కోడి కుయ్యక ముందే వెళ్ళిపోతాడు. వాళ్ళిద్దరూ మొగుడూ పెళ్ళాలు గాదండి. మరే టైపో మాకెవరికీ అర్థం కావడం లేదండీ. మా రిజిస్టర్‌లో మట్టుకి వైఫ్ అండ్ హజ్బెండ్స్ అని రాసేడండి" అనెళ్ళిపోయేడు అంజి.



ఆ రాత్రి ఆలోచించాడు షహనాజ్ గురించి.

తెల్లవారురఝామున తన వయొలిన్‌తో ప్రాతఃకాల రాగాల్లో ఒకటైన తోడి వాయించింది. ఎక్కువ తాగి పడుకోడం వల్ల మెలుకువ రాలేదు బైరాగికి.

అంతా ఎనిమిదింటికే రెడీ అయ్యి కూర్చున్నారు. భైరాగి మట్టుకి పదిన్నరకి లేచి పదకొండున్నరకి తయారయ్యి వచ్చేడు. కథ గురించేదీ మాటాడ్డం లేదు. ఏదీ చర్చించడం లేదు. తెల్లకాయితం మీద కళ్ళ బొమ్మ గీస్తున్నాడు.

ఆ మర్నాడయితే మధ్యాన్నం దాటేక వచ్చేడు.

అఖండ గోదావరి కేసీ ఆకాశం కేసీ రివైరాలో పూచిన పువ్వుల కేసీ చూస్తున్నాడు తప్ప అసలేం మాటాడ్డం లేదు. కదలేస్తే కళ్ళ గురించి, వాటి సౌందర్యం గురించీ విరామం ఇవ్వకుండా మాటాడుతున్నాడు.

అందరికీ కోపాలొచ్చాయి. డైరెక్టర్ చక్రవర్తి మట్టుకి సైలెంట్‌గా వున్నాడు.

వారమయ్యింది.

తను చెప్పిన సినిమా కథకి ట్రీట్‌మెంట్ చేద్దామని వచ్చిన ధనంజయ బైరాగి తంతు మట్టుకి అలాగే వుంది. ఎప్పుడు చూసినా ప్రపంచంలో ఏ స్త్రీ కళ్ళు ఎంత అందంగా ఉంటాయో ఏ ఏ చిత్రకారులు స్త్రీ కళ్ళని ఎంత అద్భుతంగా గీసారో చెప్తున్నాడు.

"పనయ్యేలాలేదు. ఇప్పటివరకూ మనమూ అతనూ వున్న దానికి బిల్లు పే చేసి బయల్దేరండి" అన్నాడు డైరెక్టర్ చక్రవర్తి.

*

ఆ సాయంత్రం వేళ...

బాల్కనీలో కూర్చున్న బైరాగికి అందంగా పూచిన నాగమల్లి పరిమళం, అప్పుడే పూచిన తీగ పరిమళాలు కలగలిపి వస్తున్నాయి.

ఆరోజు పౌర్ణమి.

దూరం నించి వెన్నెలలో మల్లియలూ, మల్లెలలో వెన్నియలూ మల్లెలలో ఘుమఘుమలూ ఏవేవో కోరికలూ... పాట లౌడు స్పీకర్లలో వినిపిస్తుంది.

తాగుతా చంద్రుడ్ని చూస్తా షహనాజ్ గురించే ఆలోచిస్తా ఎప్పటికో నిద్రపోయిన బైరాగి నిద్రలేచేసరికి వర్షం.

ఆ రోజు రెస్టారెంట్లో పరిచయమైన షహనాజ్‌ని "మీరు అమృతం తాగేరా?" అనడిగేడు.

నల్లగుడ్డ వెనకనించి నవ్వింది.

"మీ కళ్ళు గురించి ఆలోచిస్తుంటే నాతో పనిమీద వచ్చిన వాళ్ళంతా వెళ్లిపోయారు... మాది వెస్ట్ బెంగాల్" అన్నాడు.

"అయితే ఇక్కడికెందుకొచ్చేరు?" అడిగింది షహనాజ్.

"నేనొక కథకుడ్ని... బెంగాలీ సినిమాలకి కథలు రాస్తాను. గోవా ఫిలిం ఫెస్టివల్లో పరిచయమైన ఒక తెలుగు డైరెక్టరు అడిగేడు గదాని తెలుగు సినిమాకి కథ రాయడానికొచ్చాను" అన్నాడు.

"రాసేరా..." అడిగింది షహనాజ్.

"ఎప్పుడూ మీ కళ్ళ తలంపులోనే వుండిపోయేసరికి... విసుగొచ్చిన వాళ్ళెళ్ళిపోయేరు. నేనుండిపోయేను మీకోసం... నేను, నాకు నచ్చినట్టు బతికే మనిషిని. నా మనసుకి ఏమనిపిస్తే అది చేసే మనిషిని. నన్ను ఎక్సెంట్రిక్ అంటారు. పట్టించుకోను. ఎప్పుడేదనిపిస్తే అది చేస్తాను" అని మాటాడ్తున్న బైరాగి ఇంద్రనీలాల్లాంటి ఆ కళ్ళే చూస్తా "మీ సంపూర్ణ దర్శనం ఎప్పుడు కలుగుతుంది నాకు?" అన్నాడు.

"మీకు సాహసం చాలా ఎక్కువ" అనెళ్ళిపోయింది షహనాజ్.

*

చంద్రుడు చెన్నంగి బొండాల గెలల్తో నిండివున్న కొబ్బరిచెట్టు పైనున్నాడు. దాంతో, కొబ్బరాకు నీడలు సాగుతా పడ్తున్నాయి నేలమీద. గోదావరితల్లి ఒడ్డునే వున్న ఇంకో కొబ్బరిచెట్టుని చిక్కటి ఆకుల్తో చక్కగా అల్లేసి వున్న తీగలకి అరచేతి మందాన పూచి పరిమళిస్తున్నాయి జూకామల్లెలు. మినుకుమినుకు మంటా మెరుస్తున్న గోదారి నీళ్ళ మధ్యలోంచి వెళ్తుంది కపిలేశ్వరపురం నావ. ఆ నావ చుక్కాని దగ్గర తెల్లటి సిల్కుబట్ట లేసుకుని పొడుగ్గా ఒక స్త్రీ.

పడవ ఒడ్డుకొచ్చి ఆగింది. ఆ స్త్రీ పడవలోంచి ఒడ్డున ఒత్తుగా వున్న బ్రహ్మకమలం పూలమీదికి దూకి సరాసరి బైరాగి దగ్గర కొస్తుంటే గుర్తుపట్టాడు, ఆమె షహనాజ్. అయితే కళ్ళు తప్ప తక్కిన రూపం మొత్తం మెత్తటి శాటిన్ బట్టల్తో కప్పి వుంది.

నందివర్ధనం పూలదండ తన మెడలో వేసుకుని, పారిజాతం చెట్టునీడలో కూర్చుని ఆ రాత్రంతా పనస చెక్కతో చేసిన బొబ్బిలివీణ వాయిస్తూ పాడుతూ తెల్లవారుఝామున వెళ్ళిపోయింది.

*

ఆరోజు ఏడెనిమిది కాటేజ్‌లు నిండా జనం. ఆర్డర్లు తీసుకోడానికి సర్వర్లూ వాళ్లకి కావల్సినవి తెచ్చి పెట్టడానికి రూము కుర్రాళ్ళు హడావుడిగా తిరుగుతున్నారు. రాత్రి కంటే ఎక్కువగా వీస్తుంది గాలి. ఆకాశంలోకి ఆలస్యంగా వచ్చాడు చంద్రుడు. ఆకు సంపెంగపూలు ఆ చెట్టుకున్న ఆకుల కంటే ఎక్కువగా పూచాయి.

నల్లటి బురఖాతో ఎప్పుడొచ్చిందో ఆ సంపెంగ చెట్టు దగ్గర నిలబడి వుంది.

ఆమెని చూసి ఉలిక్కిపడ్డ బైరాగి "నిన్న రాత్రిలాగ మళ్ళీ వచ్చేరా?" అన్నాడు.

"నేనివ్వాళే వచ్చాను... అయితే నిన్న రాత్రి ఎవరు వచ్చారు మీ దగ్గరకి?"

"కల... ఆ కలలో మీరు" అని కాస్సేపాగాక, "మిమ్మల్నొక విషయం అడిగాను. అదే మీ దర్శనం గురించి" అన్నాడు.

"నా రూపంతో పనేంటి. ఇది జావెద్ వింటే మిమ్మల్ని బతకనియ్యడు" అంది షహనాజ్.

"జావెద్ ఎవరు?" అడిగాడు బైరాగి.





"హైదరాబాద్ నించి నన్నిక్కడికి తీసుకొచ్చిన మనిషి" చెప్పింది షహనాజ్.

"మీ ప్రియుడా?"

"కాదు."

"మరెవరు?"

"ఒక ఒప్పందం కోసం చర్చించడానికి నన్ను తీసుకొచ్చిన మనిషి. మా డీల్ ఇంకా తేలలేదు. నిజం చెప్పాలంటే అది తేలేవరకూ నేను బయటికి రాకూడదు" అంది షహనాజ్.

"ఏమిటా డీల్?"

దూరంగా జావెద్ కారాగిన చప్పుడు.

తర్వాత చెపుతానని చెప్పి, కళ్ళతో నవ్వుతా వెళ్ళిపోతున్న ఆమెనాపి "సంపూర్ణ రూపంతో ఎప్పుడు దర్శనం ఇస్తారు?" అన్నాడు.

"జావెద్‌తో విషయం తేలిన వెంటనే" అనేసి వెళ్ళిపోయింది.

*

ఉన్నట్టుండి ఆకాశం మబ్బుల్తో నిండిపోయింది. గాలీ వర్షం. ప్రశాంతంగా దర్శనమిచ్చే అఖండ గోదావరి దళసరి లేసు తెరదించుతున్నట్టు కనిపిస్తుంది. గజగజా వణుకుతున్నాయి చెట్లు. నేల రాల్తున్నాయి పూలు. విండ్ డైరెక్షన్ మారడం వల్ల జల్లు బాల్కనీలోకి కొడ్తుంది. వర్షాన్నే చూస్తూ ఆలోచిస్తున్నాడు బైరాగి. ఆ జావెద్‌తో డీల్ ఏమై వుంటుంది. పెళ్ళికీ ప్రేమకీ సంబంధించా అంటే కాదంటోంది. మరి దేనికి, ఏదైనా వ్యాపారానికా, ఇంకేదైనా వ్యవహారానికి... ఏ ప్రాసిట్యూటన్నా కాదు గదా ఈమె? ఎంత ఆలోచించినా ఏమీ తొయ్యడం లేదు. కళ్ళు మూసుకున్న బైరాగికి మణిదీపాల్లాంటి విశాలమైన ఆమె కళ్ళే గుర్తుకొస్తున్నాయి. పరమ పవిత్రమైన కళ్ళు. అపురూపమైన కళ్ళు. ఆపదలో అదుకునే అమ్మవారి కళ్ళు. అంత గొప్ప కళ్ళు గల ఆమె సంపూర్ణమైన రూపంతో ఆ దివ్యదర్శనం ఎప్పుడో అనుకుంటుండగా ఆగింది వర్షం.

చీకటి పడింది. రకరకాల పురుగులూ దోమలూ ట్యూబులైటున్న కాటేజ్ గోడలకి అంటుకుపోతున్నాయి. కరెంటు పోయింది. గాలి బాగా పెరిగింది. సన్నగా పెరిగిన వర్షం తుంపరలు బాల్కనీలో కొస్తున్నాయి. చాలా రాత్రయ్యింది. కరెంటింకా రాలేదు. బోయ్ వచ్చి కొవ్వొత్తి వెలిగించాడు. పుల్కాలు తెప్పించుకుని ఆ చీకట్లోనే తిని ఎప్పటికో నిద్రపోయిన బైరాగికి షహనాజ్ అరుపులకి మెలుకువ వచ్చింది.

పెద్దగా అరుస్తూ ఏడుస్తుంది.

ఒక రకమైన ఆందోళనకి గురైన బైరాగి ఆమె కాటేజ్ వేపు నడిచేడు. ఉర్దూలో పెద్దగా అరుస్తూ జావెద్.

కాస్సేపటికి షహనాజ్ ఏడుపూ జావెద్ అరుపులూ ఆగిపోయాయి.

వెనక్కొచ్చిన బైరాగికి ఏమాత్రం అర్థంగావటం లేదు. హైదరాబాదునించి ఎందుకు తీసుకొచ్చేడా షహనాజ్‌ని... రకరకాల ప్రశ్నలు... జవాబులు దొరకడం లేదు వాటికి.

కరెంటు ఎప్పుడొచ్చిందో ఎప్పుడు నిద్రపోయేడో తెలీదు.

మర్నాడు పొద్దుట కూడా వర్షమే.

మామూలు టైముకే లేచిపోయిన ధనంజయ బైరాగి ఆలోచిస్తున్నాడు. రాత్రెందుకు ఏడ్చిందా షహనాజ్? ఆ జావెద్ కొట్టాడా ఆమెని? గొంతు నులిమేడా? కత్తితో పొడిచేడా? ఏవీ అర్థం గావటం లేదు. కళ్ళు మూసుకు ఆలోచిస్తున్న తనకి నందివర్ధనం పూలరంగుని అంటించుకున్న ఆ కళ్ళే గుర్తుకొస్తున్నాయి.

రెండురోజులు గడిచాయి. మూడురోజులు గడిచాయి. తగ్గడం లేదు వర్షం. తుఫానంట. షహనాజ్ బయటికి రావడం లేదు. ఆమె కాటేజ్‌కి వెళ్దామనిపిస్తుంది. ఆ జావెద్ గుర్తొచ్చి ఆగిపోయాడు.

వర్షం కురుస్తున్న ఆ మధ్యాన్నం పూట సత్తిబాబు అనే రూమ్‌బోయ్‌తో పంపించిన చీటీలో 'నేనొస్తానని చూస్తున్నారా? వస్తాను. ఎప్పుడో వస్తాను. జావెద్‌తో డీల్ కుదరకపోతే బురఖా లేకండా వస్తాను. ఎదురుచూడొద్దు' అని రాసుంది.

కురుస్తున్న వర్షాన్ని, వీస్తున్న చలిగాలిని భరిస్తా ఆ షహనాజ్ కళ్ళతో ఆత్రంగా ఆప్తంగా మాట్లాడ్తూ ఇంకో రెండు రోజులు గడిపేక 'నాంపల్లి స్టేషన్‌లో నేనేం వూహించుకుని ఈస్ట్‌కోస్ట్ ఎక్కి ఇక్కడికి వచ్చానో ఆ విధంగా జరగడం లేదు. అతన్తో నా డీల్ ఫైనలైజ్ అయ్యే అవకాశం కనిపించడం లేదు... దేవుడు చాలా గొప్పవాడు... చూద్దాం ఏం చేస్తాడో' అని రాసున్న చీటీ వచ్చింది తన దగ్గరకి.

గజిబిజయిపోయిన మనసుతో గదంతా కల తిరిగి చివరికి బెడ్ మీద బోర్లా పడుకుని కళ్ళు మూసుకుని ఆ కళ్ళనే జ్ఞాపకం చేసుకుంటూ వుండిపోయాడు.

వర్షం, గాలి ఆగడం లేదు. గోదావరి పొంగడం మొదలెట్టింది.

ఫస్ట్ వార్నింగూ సెకండ్ వార్నింగూ అయిపోయాయి. సూపర్‌వైజర్ అనిల్ వచ్చి "నీళ్ళు గట్టు దాటేశాయి సార్. ఇక్కడి స్టాఫ్ అంతా వెళ్ళిపోతున్నారు. మీరూ వెళ్ళిపోండి" అన్నాడు.

"రెండో నెంబరు కాటేజ్‌లో వాళ్ళు వెళ్ళిపోయేరా?" అడిగాడు బైరాగి.

"మొన్న బయటికెళ్ళిన ఆ సారింకా రాలేదు... ఆవిడ మట్టుకు వుంది" అన్నాడు అనిల్.

అక్కడ ఒంటరిగా వున్న ఆ షహనాజ్ ఎలాగుందో అని ఒకటే ఆందోళన పడ్డం మొదలెట్టేడు బైరాగి.

మరో రెండురోజుల తర్వాత వున్నట్టుండి ఆగిపోయింది తుఫాను.


వర్షం, గాలీ ఆగిపోయాయి. గోదావరి నీటిమట్టం తగ్గిపోయింది. వెళ్ళిపోయిన అక్కడి ఇరవై రెండుమంది స్టాఫూ వెనక్కొచ్చేరు.

ఇంకో రెండురోజుల తర్వాత సాయి అనే పన్నెండేళ్ళ రూంబోయ్‌తో 'జావెద్ ఇక రాడు. మీరు అడిగిన పద్ధతిలో నేను మీకు కనిపిస్తాను. తర్వాత మనం మాటాడుకుందాం. ఆ మనిషి మీదున్న అయిష్టం వల్లేమో తెలీదు, మీరంటే గౌరవం ఇష్టం కలుగుతున్నాయి నాకు' అని రాసి పంపించింది.

'ఎప్పుడూ, ఎక్కడా? మీకోసమే ఇక్కడున్నాను. చాలా ఆత్రంగా వున్నానిక్కడ' అని చీటీ రాసిచ్చేడు.

'ఈ సాయంత్రం ఈ ఎస్.కె. రివైరా దాటి కిలో మీటరు ముందుకెళ్తే పదోమూడో నెంబరు మైలురాయి ఉంది. దాని దిగువలో ఏభై ఎకరాల పామ్ ఆయిల్‌తోట వుంది. ఆ తోటలో అయిదు గంటలకి కలుసుకుందాం. అక్కడికి రండి' అని రాసి పంపించింది.

*



ఆ చీటి చదువుకుని కళ్లు మూసుకున్న ధనంజయ బైరాగికి ఆ విశాలనేత్రాలే గుర్తుకొస్తున్నాయి. అవి ఎవరి నేత్రాలు? సీతమ్మవారి నేత్రాలా... రాధమ్మగారి నేత్రాలా? ఎవరి నేత్రాలు? ఆ స్త్రీ సంపూర్ణ రూపాన్ని ఈ సాయంత్రం దర్శించబోతున్నాను అన్న తలంపే అతన్నో మధురమైన మాధుర్యంలోకి తోసేస్తుంది.

కాలొకచోట నిలవడం లేదు. రివైరా బయటికొచ్చిన బైరాగి ఎత్తైన నాగమల్లి చెట్టు కిందికెళ్ళి నిలబడ్డాడు. ఎర్రగా గులాబీరంగులో మూసిన పాముపడగ ఆకారంలో వున్న చాలా నాగమల్లి పూలు నేలమీద రాలిపో యున్నాయి. అక్కడ కాస్సేపు కలతిరిగి అక్కడ్నించి పారిజాత వృక్షం వేపెళ్ళేడు. అక్కడా ఇలాగే పండిన నారింజ రంగు కాడల్తో తెల్లగా పూచిన పారిజాతాలు చెల్లాచెదురుగా పడున్నాయి. కొన్ని ఏరుకుని షర్ట్ జేబులో వేసు కున్నాడు. కాలం గడవడం కోసం కల తిరుగుతున్నాడు.

ఆ రిసార్ట్‌లో ఎక్కడ చూసినా వింత పరిమళాల్ని నింపుకున్న పూలవనాలు. అల్లనేరేడు చెట్టునీడలో కాసేపు నిద్రపోయే ప్రయత్నం చేసేడుకానీ లోపల గుబులుండటంతో పట్టలేదు.

మధ్యాన్నవయ్యింది.

భోజనం ఆర్డరు తీసుకోడం కోసం మనిషి వస్తే ఈ పూటకేం వద్దు అనేసి కాస్త దూరంగా వున్న పంపర పనాస చెట్టు దగ్గరకెళ్ళాడు. ఒకచోట నిలవడం లేదు కాలు. ఆమె చెప్పిన టైము అవ్వాలంటే ఇంకా ఆరుగంటలు గడవాలి. అంత కాలాన్ని కరిగించడం ఎలాగా?.

గుండెల్లో ఒకటే దడ. అక్కడ కాస్సేపు గడిపిన బైరాగి గోదారొడ్డుకొచ్చాడు. అక్కడికి చిన్న నావ వేసు కొచ్చిన ఇద్దరు జాలరోళ్ల పిల్లలు రొయ్యలు పట్టే పనిలో వున్నారు.

"ఆ రొయ్యలు పడితే మీకొచ్చే ఆదాయం కంటే ఎక్కువిస్తాను కొన్ని గంటలపాటు నన్ను నావలో తిప్పండి. సరిగ్గా నాలుగ్గంటలకి ఇక్కడికి తీసుకొచ్చెయ్యాలి" అని కండిషన్ పెట్టి ఆ నావ ఎక్కేడు.

ధవిళేశ్వరంలో రామపాదాలు రేవు దగ్గరకి, అక్కడ్నించి గోదావరి మధ్యలో వున్న పిచ్చికల్లంకలోకి తీసు కెళ్ళేరు. ఎక్కడి కెళ్ళినా ఆకళ్ళే. ఆ నిండు స్వరూపాన్ని ఇంకొన్ని గంటల్లో చూడబోతున్నానన్న ఆనందం, ఆత్రం బైరాగిలో... హార్ట్ బీట్ పెరుగుతుంది. విజ్జేశ్వరం, అక్కడ్నించి కొవ్వూరు గోపాదాల రేవు దగ్గర కెళ్ళేక నావని వెనక్కి తిప్పిన కుర్రాళ్ళు బైరాగి చెప్పిన టైముకి రివైరా రేవులో దింపేసారు.

గబగబా తన కాటేజ్‌లో కెళ్ళి స్నానం చేసి బట్టలేసుకుని సిమ్మెంటు బాటెక్కి ఏటిగట్టు చేరుకుని ముందుకు నడుస్తుంటే అతన్లో పెరుగుతున్న ఆత్రం అతనికే స్పష్టంగా తెలుస్తుంది. వూపిరిలో వేగం పెరుగు తుంది. చెమటలు ఒక్క నుదురు దగ్గరేంటి ఒళ్ళంతా పడ్తున్నాయి. పరుగులాంటి నడకతో ముందుకు నడుస్తున్న తను చాలా దూరం నడిచి ఆ కాలం నాడు కాటన్ దొరగారు వేసిన పదమూడో నెంబరు మైలురాయి దగ్గర కొచ్చేసరికి దాని పక్కనే దిగువ కెళ్ళడానికి బాట కనిపించింది.

ముందుకెళ్తే ఏభై ఎకరాల్లో ఎత్తుగా అడివిలాగ ఎదిగిన ముదురుపచ్చని పామాయిలుతోట. చీకటిగా వున్న ఆ తోటలోకి నడుస్తూ కొంచెం ముందు కెళ్ళాడో లేదో పెద్దగా కేక "ప్లీజ్... ప్లీజ్ సేవ్ మీ" అంటూ పొలికేక.

అది షహనాజ్ గొంతు.

ఏవయ్యింది షహనాజ్‌కి, ఎందుకరుస్తుందలా. పరుగెట్టాడు ముందుకి.

నది ఒడ్డున ఏభై ఎకరాల్లో చిక్కగా ఎదిగున్న ఆ తోటలో షహనాజ్ గొంతు ఎక్కడ్నించి వినిపిస్తుందో అసలామె ఎక్కడుందో అర్థంగావటం లేదు.

"రక్షించండి... నన్ను రక్షించండి."

"షహనాజ్ ఎక్కడ... ఎక్కడున్నావ్ నువ్వు" అడుగుతున్నాడు బైరాగి.

"ఇక్కడే ఇక్కడే."

ఆమె గొంతు వింటున్నాడుగానీ పెరిగున్న ఆ పామాయిల చెట్ల మధ్య ఆమె ఎక్కడుందో పోల్చుకోలేక పోతున్నాడు. పిచ్చివాడిలా ఆ మూలనించి ఈ మూలకీ ఈ మూలనించి ఆ మూలకీ పరుగెడ్తున్నాడా తోటలో.

"ప్లీజ్ బైరాగీ ప్లీజ్ సేవ్ మీ" పెద్దగా పొలికేకలు.

"ఎక్కడ షహనాజ్ నీకేవయ్యింది?" పెద్దగా అరుస్తున్నాడు బైరాగి.

"నేను దిగబడిపోతున్నాను లోపలికి. ఇది ఊబి అని నాకు తెలీదు. ప్లీజ్ త్వరగా రా ప్లీజ్."

అర్థమైంది బైరాగికి. పరుగెడ్తున్నాడు ముందుకి. కానీ, ఎక్కడికెళ్ళాలో ఎటువెళ్ళాలో ఎటువెళ్తే అక్కడ షహనాజ్ వుంటుందో అర్థంగావటం లేదు.

"బైరాగీ రా బైరాగీ" ఏడుస్తూ అరుస్తుంది. "నేను మొలదాకా దిగబడిపోయాను బైరాగీ... బైరాగీ నన్ను రక్షించు బైరాగీ. నన్ను పైకిలాగి నీకూడా తీసుకుపో బైరాగీ. ఇవి నా మనసులోని మాటలు బైరాగీ" పెద్ద ఆర్తనాదం.

ఇటుపక్క చూస్తే పొద్దుపోతుంది. శీతాకాలం పొద్దు.

పరుగెడ్తున్నాడు. ఎటు పడితే అటు పరుగెడ్తున్నాడు.

"బైరాగీ నేను బ్రెస్ట్ వరకూ దిగబడిపోయా నీ ఊబిలోకి. తొరగా రా" అరుస్తుంది. ఏడుస్తుంది. గావుకేకలు పెడుతుంది షహనాజ్.

ఆమె ఆర్తనాదం ఎటుపక్క నించి వినిపిస్తే అటు పక్కకి పరుగెడ్తూ పడ్తూ లేస్తూన్నాడు. ఇప్పుడు షహనాజ్ మాటాడ్డం లేదు. ఒకటే ఏడుపు. పెద్దగా అరుస్తుంది. ఏడుపు, కేకలు.

అలా పడతా లేస్తా పరుగెడతా ఆ సంధ్య చీకట్లలో ముందుకెళ్ళిన బైరాగి మొత్తానికెలాగో అక్కడికి చేరుకునేసరికి శరీరమంతా ఆ పెద్ద ఊబిలో దిగబడిపోయి ఎప్పుడూ తనకి ఎంతవరకూ కనిపించేదో అంతవరకూ ఆ కళ్ళ వరకూ మాత్రమే కనిపించింది.


*ఆర్. సుందర్‌రాజన్‌గారికి కృతజ్ఞతలు*

*స్వాతి సపరివారపత్రిక*










వాళ్ళిద్దరూ ఒకళ్ళనొకళ్లు మోసం చేసుకుంటారు. ఒకళ్ళకొకళ్ళు ప్రాణం పోసుకుంటారు. సరిగ్గా రెండేళ్ళ క్రితం పింపోడువలస నుంచి రథమేణి, నిమ్మగుడ నుంచి రత్నమణి గాలికొండపురానికి వలస వచ్చారు.

కొండలకి కిందనున్న శృంగవరపుకోట, కొత్తవలస, విజయనగరం లాంటి చోట్లకెళ్ళి బియ్యం, ఉప్పు, కందిపప్పు, చీరలూ, చిన్నపిల్లల బట్టలూ, సీవండి గిన్నెలూ టోకుధరకి కొనుక్కుని వచ్చి గాలికొండపురం, సుంకరమెట్ట, పిప్లిగుడలలో జరిగే సంతలో దుకాణాలు పెట్టి అమ్ము తుంటారు.

# ధరాకొపికం



అడవుల మధ్యలోనూ, కొండల దిగువల్లోనూ ఉన్న పులుగుడ-బోయిగుడ-కిపర్ల-బందవలస-జాలాడ లాంటి మారుమూల గ్రామాల నుంచి వచ్చే గిరిజనులు కమలాఫలాలూ, చింతపండూ, కుంకుడుకాయలూ, ఒలిసి గింజలకి పట్నాల నుంచి తెచ్చిన సామాన్లు అమ్ముతుంటారు. పాపం మన తెగవాళ్ళే అన్న ఆలోచన లేకుండా అక్కడి అమాయకమైన ఆటవికుల్ని దబాయించి దగా చేసి అమ్మకాలు సాగిస్తుంటారు. అలా వాళ్ల దగ్గర సంపాయించిన పంటల్నీ, గింజల్నీ తిరిగి పట్నాల్లో అమ్ముతుంటారు.

అస్తమానం పట్నాలు తిరిగి రావడం వల్ల అక్కడి షోకులూ, షావుకార్ల దగ్గర పదేపదే బేరాలు చెయ్యడం వల్ల వాళ్ళ తెలివితేటలూ బాగా నేర్చారు వాళ్ళిద్దరూ.

క్రిష్ణమూర్తిని మొట్టమొదటిసారిగా సిమిలిగుడ సంతలో చూసింది రత్నమణి.

ఈమధ్య కాలంలో ఆ ప్రాంతాన విషజ్వరాలు విపరీతంగా వచ్చి దారుణంగా చనిపోతున్నారు జనం. శిమిలిగుడ సంతలో చిన్న శిబిరంలాంటిది వేసుకుని నిలబడ్డ క్రిష్ణమూర్తి అక్కడికి వచ్చిన గిరిజనులందరికి విషజ్వరం అనేది రాకుండా ముందు జాగ్రత్తగా ఇంజక్షన్లు చేస్తున్నాడు. ఎవరన్నా డబ్బులు ఇవ్వబోతుంటే ససేమిరా వద్దంటున్నాడు.

ఏ ఆదాయం ఆశించకుండా ఈ పని ఎందుకు చేస్తున్నాడీ పట్నం మనిషి? అనుకుంది అతన్ని చూస్తున్న రత్నమణి. రథమేణి దగ్గరకెళ్ళి అడిగింది రత్నమణి.

"వేసుకున్న బట్టలూ అవీ చూస్తుంటే డబ్బున్నవాళ్ళా ఏమాత్రం కనపడ్డంలేదు. కనీసం మందుల ఖర్చుల క్కూడా తీసుకోవడం లేదు కదా?" అతన్నే చూస్తూ ఎదురు ప్రశ్న వేసింది రథమేణి.

అతనలా ఎందుకు చేస్తున్నాడో ఏమాత్రం బోధపడ్డం లేదా ఇద్దరికి. అప్పుడప్పుడూ ఏసుప్రభువు మతం వాళ్ళు వస్తుంటారు ఆ ప్రాంతానికి. ఊరికే చాలా వస్తువులిచ్చి తమ మతంలో చేరమంటారు వాళ్ళు. ఇతను ఆ బాపతు మనిషిగానీనా అని ఆరాతీ స్తే కాదని తెలిసింది. పోనీ ప్రజలకి ఉచితంగా సేవ చెయ్యాలంటే కాస్త స్తోమతు కావాలి.

ఏమీలేని, ఏమీకాని ఈ మనిషి ఆ పని ఎందుకు చేస్తున్నట్టు? ఏది ఏమైనప్పటికీ ఇతను ఆశిస్తున్నది మాత్రం ఏదో ఉంది అనిపించింది.

చీకటి పడుతోంది.

ఇలాయి బుడ్లూ, పెట్రోమాక్స్ లైట్లు, హరికెన్ లాంతర్లు గల దుకాణాల వాళ్ళు తప్ప తక్కిన వాళ్ళంతా సర్దేసుకుంటున్నారు. పెట్రోమాక్స్ లైటు సౌకర్యం లేకపోవడంతో తన టెంట్ విప్పేసి ఒకచోట కూర్చున్న క్రిష్ణమూర్తి దగ్గర కొచ్చిన రత్నమణి, రథమేణి చాలా ప్రశ్నలు వేశారు.

కడప దగ్గరున్న రాజంపేట వాళ్ళ ఊరట. ఆరెంపీ సర్టిఫికెట్టుందిట. ఈ ప్రాంతంలో ప్రజలకి ఉచితంగా వైద్యం చేసి ఇక్కడ స్థిరపడిపోదామని వచ్చాడట.

ఈ రాత్రికి ఈ ఊళ్ళో ఎక్కడుండాలా అని ఆలోచిస్తున్నాడు.

"వైద్యం ఊరికే చేస్తున్నావ్... మందులన్నీ అయిపోతే ఏం చేస్తావ్?" అడిగింది రత్నమణి.

"అప్పుడు నా పరిస్థితి చూసిన జనమే సాయం చేస్తారనుకుంటున్నాను" అన్నాడు క్రిష్ణమూర్తి.

అతనెంత నిజాయితీగా మట్లాడుతున్నా మొత్తానికి అతనేదో ఆశిస్తూనే ఇక్కడికొచ్చాడనిపించింది రథమేణికి. ఆదేమాట అతనితో అనేసింది.

"అబ్బే మీరు తప్పుగా అంచనా వేస్తున్నారు నా గురించి" అన్నాడు క్రిష్ణమూర్తి.

"మీరు ఇక్కడ ఉండటానికి లాడ్జింగులయ్యీ ఉండవు. కనీసం డాబా ఇల్లు గలవాళ్ళు కూడా లేరు ఇక్కడ. మాది ఇక్కడికి దగ్గర్లోనే వున్న గాలికొండపురం. ఈ రాత్రికి మా ఇంట్లో ఉంటానంటే మీ ఇష్టం" అంది రథమేణి.

కాస్సేపు తటపటాయించిన క్రిష్ణమూర్తి చాలా ఇబ్బందిపడుతూనే వాళ్ల కూడా వెళ్ళాడు.

ఆ రాత్రికి ఆ ఇద్దరితోనూ కాస్త స్నేహం కలిసింది. ఒక వారంరోజుల పాటు వాళ్ళింట్లోనే ఉండిపోయాడు. ఈ వారం రోజులు వాళ్ళ కూడా సంతలకెళ్ళి ఫ్రీ మెడికల్ సర్వీసు చేస్తూనే వున్నాడు.

దగ్గర్లో వున్న దుమ్రిగూడా అనే ఊళ్ళో ఒక గిరిజన స్త్రీకి కడుపులో బిడ్డ అడ్డంపడి ప్రసవం కనాకష్టమైతే రాత్రికి రాత్రే ఆమెని గాలికొండపురంలో ఆగే పాసింజరెక్కించి పట్నం తీసుకెళ్ళడంతో క్రిష్ణమూర్తి మీద అక్కడివాళ్ళకి కాస్త గుర్తింపు ఏర్పడింది.

క్రిష్ణమూర్తి సంతలకెళ్లినప్పుడు మీరెక్కడ ఉంటున్నారని జనం అడిగితే మధ్యలో కొచ్చేసిన రథమేణి, రత్నమణి 'మా ఊళ్ళో... మా ఇంట్లోనే' అని చెప్పేవాళ్ళు.

*

కేవలం ఇద్దరికి మాత్రమే సౌఖ్యంగా ఉండటానికి పనికొచ్చే రెల్లుగడ్డి పాక అది. ఇద్దరమే ఉంటాం గదా అన్న ఆలోచనతో ఇనప్పెట్టెలా కట్టుకున్న ఆ పాకని పేడతో అందంగా అలుక్కొని ముగ్గు పెట్టుకున్నారు. ఇప్పుడు చేరిన మూడో మనిషి ఒకమూల ముడుచుకు పడుకున్నా అర్ధరాత్రి అయ్యేసరికి అతని చెయ్యో, కాలో ఆ ఇద్దరాడాళ్ళకీ తగిలి కోరికలు చింతనిప్పుల సెగల్లా రగులుకోవడం మొదలెట్టాయి. అలాంటి విషమ పరిస్థితులెన్ని ఏర్పడ్డా సభ్యతగా ఒక పద్దతిలో పడుకునేవాడు. ఎలాంటి ఆవేశం కలగనట్టే ప్రవర్తిస్తున్నాడు. నిజమేనా అనిపించేది వాళ్ళకి.

సరిగ్గా వారం తర్వాత ఆ రెల్లుగడ్డి పాక దగ్గరికి రావడం మొదలెట్టారు జనం.

పాక ముందు హాస్పిటల్ పేరు రాసిన ఒక బోర్డు. దాని పక్కనే ఒక హుండి పెట్టాడు. వచ్చిన వాళ్ళని నోరు మెదిపి ఏమీ అడక్కుండా వైద్యం చేస్తూనే ఉన్నాడు. ఎవరన్నా ఏంటిదీ అనడిగితే ఒక హాస్పిటల్ కట్టుకుని ఈ కొండల మధ్య ఉండిపోవాలనుకుంటున్నట్టు మాత్రం చెప్పేవాడు. ఉన్నవాళ్లు హుండిలో ఏవన్నా వేసేవారు; లేనివాళ్ళు లేదు.

*

"గాలికొండపురంలో ఆగే పాసింజరెక్కి సరుకు కొనుగోలుకు బయల్దేరినప్పుడు ఏమో అనుకున్నాను తెలివైనోడు క్రిష్ణమూర్తి డాక్టరు" అంది రత్నమణి.



"ఏం చూసి అంటున్నావ్?" అడిగింది రథమేణి.

"ఇంజక్షన్ చేసి రెండు రూపాయలు అడిగితే చేయించుకున్నవాడికి అక్కడితో పోద్ది. కానీ ఇక్కడ హుండి పెట్టాడు."

"హాస్పిటల్ కడతానంటున్నాడు కదా?"

"ఎప్పుడు?"

"ఎవరి దగ్గరో అన్నాడట... అంతా కలిసొస్తే వచ్చే సంవత్సరం అని."

"అంటే వచ్చే ఏడు దాకా హుండీ తియ్యడు. సిమ్మెంటుతో కడతాడా. అద్దాలతో కడతాడా? పచ్చి వెదుళ్ళు పాకేసి జమ్ముగడ్డి నెయ్యడాని కెంతవుద్ది." రత్నమణి విశ్లేషణకి ఆలోచనలో పడింది రథమేణి.

జనానికి కావలసింది గోరంత చేస్తూ తనక్కావలసింది కొండంత లాక్కునే తెలివైన క్రిష్ణమూర్తి ఈ అరణ్యంలోకి రావడం నిజంగా తనలాంటి వాళ్ళ అదృష్టం. ఇంత గొప్పవాణ్ణి నా అనిపించుకోకుండా పోవడం నేరం. అటువైపు నించి రత్నమణి కూడా ఇదే దారిలో ఆలోచిస్తుందని తెలీని రథమేణి ఆలోచనలు అలా సాగుతున్నాయి.

*

తన పినతల్లి కూతురు రజస్వల అయింది రమ్మని కబురొస్తే సొంత ఊరయిన నిమ్మగుడ బయల్దేరింది రత్నమణి. సంతకని బయల్దేరిన రథమేణి ఒక అడవికోడి పట్టుకుని మధ్యాహ్నానికే ఇంటికొచ్చేసరికి బాగా ముసురు పట్టేసింది. ఎక్కడా ఆగకుండా వీస్తున్నాయి తూరుపుగాలులు. హరిబొందు అనే కుర్రాణ్ణి పిలిచి రాత్రికి సొలపకల్లు కుండ సంపాయించమని పురమాయించింది.

సాయంత్రం కాకముందే చీకటి పడిపోయింది. సన్నగా మొదలయిన వర్షం జల్లు క్షణాల కాలంలో వుధృతమై పోయింది. కొండల మీద వున్న టేకు వృక్షాలు, యూకలిప్టస్ ప్లాంటేషన్లు ఇష్టానికి ఊగిపోతున్నాయి. కాఫీ తోటలున్న ప్రాంతమంతా చీకటిమయం అయిపోయింది.

ఉడుకు నీళ్ళు మంచి వాసనొచ్చే సబ్బుతో స్నానం చేసి రథమేణి చెక్కపెట్టె లోపల దాచుకున్న నైలెక్స్ చీర తీసి కట్టుకుంటుండగా వచ్చేసింది పురమాయించిన సొలప కల్లుకుండ. అది పట్టుకుని క్రిష్ణమూర్తి దగ్గర కొచ్చింది.

"చూస్తుంటే తుఫానులాగుంది. కల్లు తాగుదామా ఇవాళ?" అంది.

"రత్నమణికూడా ఉంటే బాగుండును?" అన్నాడు.

"అది లేనప్పుడే బాగుంటుంది... రా తాగుదాం."

"ముందు నువ్వు మొదలెట్టు."

సగం తాగేసిన ముంత అతని కందించింది. అలవాటులేని వ్యవహారం. "ఇంకొంచెం తాగు" అన్నాడు.

సొలపకల్లు మహత్యం చిత్రమైంది. తాగడం మొదలెట్టాలే కాని ఇక ఆపబుద్ది కాదు. మళ్ళీ తాగడం ప్రారంభించిన ఆమెని మాటల్లో పెట్టాడు. అందులో పడ్డ ఆమె, తనకి తెలీకుండానే కుండలో ఉన్నది మొత్తం

తాగేసింది. తాగుతూ మాట్లాడ్డం వల్ల తలకి బాగా ఎక్కింది నిషా. మామూలు మాటల్లోంచి శృంగారానికి సంబంధించిన అంశాలు మట్లాడ్డం మొదలెట్టిన రథమేణి ఒంటి మీద నైలెక్స్ చీర నెమ్మదిగా ఊడిపోవడం మొదలెట్టింది. తను వివస్త్రని అవుతున్నానన్న సంగతి ఏ మాత్రం పట్టించుకోకుండా అతని శరీరం మీద చేతు లేసింది. మృదువుగా మాట్లాడుతూ మొత్తం మీద ఆమె నుంచి తప్పించుకున్నాడా వర్షం రాత్రి.

మర్నాడు పొద్దుటికి తెలివొచ్చిన రథమేణి రాత్రి అతని విగ్రహాన్ని, నిజాయితీని గుర్తు చేసుకుని ఆశ్చర్య పోయింది. నిజంగా ఇతను నిజాయితీపరుడే! ఇంకెప్పుడూ ఇతని దగ్గరలా ప్రవర్తించకూడదు అనిపించింది. ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతను నా సొంతం కావాలని కూడా అనిపించింది.

*

ఆ దండకారణ్యంలో మరీ మారుమూలనున్న కుగ్రామాల్లో జనం తనుంటున్న గాలికొండపురానికి రావడం ఇబ్బందవుతుందన్న విషయం గ్రహించిన క్రిష్ణమూర్తి విజయనగరం వెళ్ళి ఒక గుర్రం కొనుక్కొచ్చి ప్రతిరోజూ సాయంత్రం దానిమీద లోపలున్న గ్రామాలన్నీ తిరిగివస్తుంటే పరిసరాల్లో జనానికి తన మీద అపారమైన విశ్వాసం ఏర్పడింది.

అలా గుర్రం ఎక్కి తిరుగుతున్న క్రిష్ణమూర్తి యువరాజులా అనిపించాడు రత్నమణికి.

మొన్న తను ఊళ్ళో లేనప్పుడు రథమేణి చర్య అప్పుడే తన చెవుల్లో పడ్డంతో ఇతను ఆడదాని ఉద్రేకా నికి లొంగే బాపతు కాదు అనుకుంది.

నిజంగా అలాంటి మనిషే అయితే ఇన్నాళ్ళ నుంచి ఇద్దరి మధ్యా పడుకుంటున్నాడు. ఏనాడైనా చలిం చాడా? వెర్రి రథమేణి తను లేనప్పుడు తనని మోసం చేసి ఎంత వెర్రిపని చేసింది అనుకుంది.

ఒక మంచు కురుస్తున్న వెన్నెలరాత్రి క్రిష్ణమూర్తి దగ్గరకొచ్చిన రత్నమణి అలా లోయలోకి షికారు తీసుకెళ్ల కూడదా నన్ను అంది.

సరే అని లోయలోకి తీసుకెళ్ళాడామెని.

పగలే జనసంచారం వుండని ఆ లోయలో ఆ వెన్నెలరాత్రి వేళ వాళ్ళిద్దరే కూర్చుని వున్నారు.

జనాన్ని తనెలా మోసం చేసి సంపాయించగలదో, లౌక్యం అనేది ఇంకా తనకి ఎంత బాగా తెలుసో క్రిష్ణమూర్తికి వివరించిన ఆ స్త్రీ నువ్వు కూడా తెలివైన మోసగాడివే కనక మనిద్దరం ఒక్కటైతే రాజురాణీల్లాగా పదికాలాలపాటు ప్రాంతాన్ని పరిపాలించొచ్చు అంది.

గట్టు తెగిన గోస్తనీ నదిలా ఆమెని మొత్తం వాగనిచ్చి "బాగా పొద్దోయింది మరి బయలుదేరదామా" అన్నాడు మృదువుగా.

మరీ రెచ్చిపోయిందామె దాంతో.

ఏ విధమైన ఆవేశానికి గురవ్వకుండా నవ్వుతూనే వున్నాడు క్రిష్ణమూర్తి.

కాస్సేపటికి బూతులు కూడా మొదలెట్టింది.

ఆ వెన్నెలలో అలా నవ్వుతూనే వున్నాడు తప్ప ఎలాంటి సమాధానం లేదు.





బాగా తెల్లవారాకా ఆమెని తీసుకెళ్ళి ఇంటి కాడ దింపేశాడు.

ఆ ఇద్దరాడాళ్ళలో ఏ ఒక్కరికి లొంగడం లేదు. క్రిష్ణమూర్తి నా మనిషంటే నా మనిషని కొట్టుకు చచ్చి పోతున్నారు.

ఒకళ్ళకి తెలీకుండా ఒకళ్ళు గేలాలు వేస్తూనే వున్నారు అతని మీద.

అతను మాత్రం వాళ్ళ ఆవేశానికి, వెర్రిచేష్టలకి అతీతంగా ఉంటూ తనే ఆశయంతో ఈ ప్రాంతాని కొచ్చాడో దానికోసమే నిరంతరం కృషి చేస్తున్నాడు.

*

హుండీలో పోగయిన డబ్బు మొత్తం అణాపైసల్తో లెక్కకట్టాడు. వాటిలో ఒక్క పైసా తనకోసం వుంచు కోకుండా కొత్తవలస వెళ్ళి ఇటుకా, సిమ్మెంటూ, ఇనుప ఊచలూ కొన్నాడు. లక్కవరపుకోట వెళ్ళి తాపీమేస్త్రులను తీసుకొచ్చాడు.

కొన్నాళ్ళకి ఒక చక్కని హాస్పిటలు తయారైంది ఆ ప్రాంతంలో. అదంతా చూసిన స్త్రీలిద్దరూ క్రిష్ణమూర్తి గురించి వేసిన తమ అంచనాలు తారుమారయ్యాయి అనుకున్నారు. ఇతను వాళ్ళనుకున్న మోసగాడు కాదు. ఒక సత్సంకల్పంతో ఇక్కడికొచ్చిన నిజాయితీపరుడనుకున్నారు.

ఆడవాళ్ళ కాన్పుల విషయంలో వస్తున్న సమస్యలు గ్రహించి శమంతకమణి అనే ఒక నర్సుని తీసు కొచ్చాడు. నిజమే ఇతను మనలాంటి ఆడవి మనుషులకెందుకు సొంతమవుతాడు?

ఆడాళ్ళ కురుపులు కడుగుతూ, పురుళ్ళు పోస్తున్న ఆ నర్సునే పెళ్లాడతాడు త్వరలో. ఆముదం వాసనేసే మనం ఎలా పనికొస్తాం.

అసలతన్ని సొంతం చేసుకోవాలని వేసిన అంచనా ఎంత తప్పు అనుకున్నారు వాళ్ళిద్దరూ.

*

ఆరోజు...

చల్లటిగాలి వీస్తోంది గాలికొండపురంలో.

ఆ ఊరిజనం, ఆ చుట్టుపక్కల ఊళ్ళ జనం ఆంజనేయస్వామి గుడి చుట్టూ గుమిగూడి పోయి వున్నారు. వాళ్ళంతా సంబరం చేసుకోవడానికి సిద్ధంగా ఉన్నట్టున్నారు.

కొద్ది క్షణాల్లో ఏవో ప్రభలు జరగబోతాయి అన్న వాతావరణం కనిపిస్తోందక్కడ.

చిలకలగడ్డ సంత నుంచి అప్పుడే ఊళ్ళోకొచ్చిన వాళ్ళిద్దరికీ ఏమాత్రం అర్థంకావడం లేదు.

ఎవర్నడిగినా ఆంజనేయస్వామి గుడి దగ్గరకి రండి, మీకే తెలుస్తుంది అంటున్నారు.

అక్కడేముంది?

ఏం తెలుస్తుంది అన్న ఉత్కంఠతో దేవుడి గుడి వున్న గాలికొండ ఎక్కినవాళ్లు అక్కడ జరుగుతున్న దృశ్యం చూసి అవాక్కయి నిలబడిపోయారు.

క్రిష్ణమూర్తి పెళ్ళి చేసుకుంటున్నాడు.

పెళ్లి జరుగుతుంది వాల్తేరు నుంచి వచ్చిన ఆ నర్సుతో కాదు.

అడవిలో చెట్లకి కాసే పళ్లు కోసుకుని, పుల్లలు ఏరుకు బతికే బీద గిరిజన స్త్రీ అయిన సుంకి దుర్గ కూతురు పద్మతో.

ఈ మారుమూల జనానికి సేవలు చెయ్యడానికొచ్చాడు. ఆఖరికి అర్ధణా ఇచ్చినా వద్దని రాత్రీ పగలూ తేడా తెలీకుండా సేవలు చేస్తూ చివరికి ఈ జాతిలో పిల్లనే పెళ్ళి చేసుకుని ఇక్కడి ఆదిమవాసుల్లో ఒకడయ్యాడు.

స్వార్థం అంటే ఏమిటో తెలీదు ఇతనికి. నిజాయితీకి నిర్వచనం చెప్పాలంటే క్రిష్ణమూర్తి పేరే చెప్పాలి.

పొగుడుతున్న జనంలో రథమేణి, రత్నమణి కూడా చేరారు. అతని గురించి వేసిన అంచనాలన్నీ నిజంగా తారుమారయ్యాయి. ఎలాంటి లోపం ఎంచుదామన్నా ఏదీ దొరకడం లేదు అతన్లో.

అపార్థం చేసుకున్నాం... నిజంగా అతను మహానుభావుడే అన్న స్పృహ వచ్చిన వాళ్ళిద్దరూ అందరి కంటే ఎక్కువగా పొగడ్డం మొదలుపెట్టారతన్ని.

కానీ... ఆ అరణ్యానికి మధ్యలో వేల ఎకరాల్లో వున్న భూములూ, కొండలూ సొంతం చేసుకునే హక్కు ఒక్క గిరిజనుడికే వుంది.

కింద నుంచి వచ్చిన గిరిజనేతరుడు కొందామన్నా ఒప్పుకోదు ప్రభుత్వం.

కనీసం చిన్నిల్లు నిర్మించుకునే హక్కుకూడా లేదు కిందివాడికి. మరి సొంతం కావాలంటే...

అక్కడి గిరిజనుల్లో ఒకడు కావాలి.

గాలికొండపురం చుట్టుపక్కలున్న కొండల్లో విలువైన వజ్రాలు చాలా పడుతున్నాయి.

వీటి గురించి బాగా తెలుసుకున్న క్రిష్ణమూర్తి మామూలు మనిషిగా అక్కడికొచ్చాడు.

ఒక ఉత్తమమైన, నిజాయితీపరుడైన డాక్టరుగా పేరు సంపాదించాడు.

తను తప్పు చేసినా, కాదు రైటు అని జనం తిరగబడేంత గొప్ప పేరు సంపాదించాడు.

తెలివైన స్త్రీని పెళ్ళి చేసుకుంటే భవిష్యత్తులో వచ్చే సమస్యలేంటో ముందే గ్రహించడంతో అలాంటి వాళ్ళని దూరంగా వుంచి, అమాయకమైన గిరిజన యువతి పద్మని పెళ్లి చేసుకున్నాడు.

కానీ అతని నర్సుగా వచ్చిన శమంతకమణిని అంతకుముందే పెళ్లి చేసుకున్నాడన్న విషయం అక్కడి అమాయకమైన జనానికే కాదు; తెలివైన రత్నమణి, రథమేణిలక్కూడా తెలీలేదు.

అప్పటికే కాదు; ఎప్పటికీ తెలీలేదు.

*స్వాతి సపరివారపత్రిక*
*17 అక్టోబర్ 1997*







# రోడ్ షో

మే నెల రెండోవారంలో ఆ మధ్యాన్నం పూట.

ఎక్కడా గాలాడ్డం లేదు.

ఎండ చూస్తే పేలిపోతుంది.

ఒకటే ఉక్కపోత. చెమట జుట్టులోంచి కారిపోతుంది.

ఆ టైములో కూడా జనంతో నిండిపోయి ఉందా చౌరస్తా. కుడిచేతికీ కాలుకీ కట్లు కట్టుకుని కర్ర అసరా ఉన్నా సరే వూగిపోతా ఆ సిగ్నల్స్ దగ్గరాగిన కార్ల దగ్గరకీ ఆటోలూ టూవీలర్ల వాళ్ళ దగ్గరకీ వెళ్ళి అడుక్కుంటుంది నాగమణి అనే నలభై ఏళ్ళ మనిషి. కుడిచెయ్యి పనిచెయ్యని బక్కచిక్కిన నాగూరు చిన్నబల్లకి నాలుగు బేరింగులు ఆ బండి మీద బిగించి, ఒక చేత్తో అడుక్కునే లక్ష్మణ అనే వాడు, ఎడంపక్క కొయ్యకాలు బిగించుకుని దండుకుంటున్న దస్తగిరీ, ఉర్దూలో ఉన్న ప్రింటెడ్ పాంప్లెట్ చూపించి అడుక్కుంటున్న అఫ్సర్ అనే కుర్రాడూ, అయ్యప్ప స్వామి బట్టలు వేసుకుని కొండ కెళ్తున్నానని చెప్పి భుజం మీద కండువా విప్పి అడుక్కుంటున్న శీనుగాడితో కళకళలాడిపోతుంది చౌరస్తా.



అడుక్కుంటున్న నాగమణి దృష్టి రోడ్డుకి అటు పక్కనున్న మోదుగచెట్టు కింద కూర్చున్న దుర్గ మీద పడింది.

మధ్యాన్నమైంది అలా కూర్చునే వుంది దుర్గ. సాయంత్రమైంది. చీకటిపడింది. కూర్చునే ఉంది దుర్గ. ఇక అడుక్కోడం ఆపిన నాగమణిలో ఒణుకు లేదిప్పుడు. చేతికీ కాలికీ ఉన్న కట్లు తీసేసింది. ఏ గాయాలూ లేవు ఒంటిమీద.

దుర్గ దగ్గరకొచ్చిన నాగమణి నవ్వుతా మృదువుగా పలకరిస్తే పలకలేదు. చాలా ప్రశ్నలేసింది నాగమణి.

జవాబులేదు దుర్గ నించి.

చివరికి "నాతోపాటు మా ఇంటికొస్తావా?" అంటే "సరే" అంది దుర్గ.

ఫ్లై ఓవర్ దిగువలో ఉన్న ఆ బస్తీలో బాగా లోపలికి నడిచెళ్తే పాతకాలంనాటి హవేలీ గోడల నాన్చి వున్నాయి పాకలు. అవన్నీ ఆకుల్తోనూ రేకుల్తోనూ సైను బోర్డులతోనూ కట్టున్నాయి. ప్రతి పాక మీదా వేసిన డోరియా రేకులు గాలికి ఎగరకండా పెద్ద పెద్ద రాళ్లు, కారు టైర్లూ వేసున్నాయి.

తన ఇంటి వేపెళ్తున్న ఆమెని 'నాగమణక్కా' అని చాలామంది పలకరిస్తుంటే అందరికీ నవ్వుతా ఆప్యాయంగా సమాధానాలు చెప్తున్న నాగమణికి ఈ అడుక్కునే పనేగాకండా వడ్డీ వ్యాపారం కూడా ఉంది. అయిదు లక్షలు తిప్పుతుందా బస్తీలో. ఆ పాకల మధ్య ఏభై సెంట్ల స్థలంలో పర్మనెంటుగా ఇల్లు కట్టుకుని పైన ఒక ఫ్లోరు వేసి నరశింహ అనే ఆటోడ్రైవర్‌కి అద్దెకిచ్చింది.

ఇంటి ముందు కొచ్చేక తాళం తీసి తలుపు తెరిచింది.

లోపల పోర్టబుల్ బ్లాక్ అండ్ వైట్ టీవీ, ఫానూ ఉన్నాయి.

స్నానం చేసొచ్చి టీ.వీ. ఆన్ చేసి దుర్గ ముందు కూర్చున్న నాగమణి ప్రేమగా దుర్గ భుజం మీద చెయ్యేసి "ఆ ఇప్పుడు చెప్పు... ఏంటి నీ కత?" అంది.

ఎక్కువగా లాగకండా తన గురించి ఒక్క లైనులో చెప్పేసింది దుర్గ. ఎవడో వెధవ తననీ నగరం తీసుకొచ్చి మోసం చేస్తే మోసపోయిన కథట తనది. "మా వూరు తిరిగెళ్ళలేను. అడుక్కు తింటానుగానీ ఏ ఎధవ పనీ చెయ్యనని ఒట్టేసుకున్నాను దేవుడి మీద" అని స్ట్రాంగా చెప్పేసింది దుర్గ.

కాస్సేపు ఆలోచించిన నాగమణి "అయితే మా చౌరస్తాలో అడుక్కుంటావా?" అడిగింది నాగమణి.

"అలాగే" అంది దుర్గ.

"మెయిను పాయింటు... కన్నొంకరో కాలొంకరో అయితే ఎవడన్నా డబ్బు లేస్తాడుగానీ పుష్టిగా సుబ్బరంగా ఉన్న నీకెవరేస్తారు?...." అని మళ్ళీ ఆలోచించి... "భుజంమీద చంటి బిడ్డనేసుకుని అమ్మా బాబూ బిడ్డకి పాలు లేవని అడుక్కుంటావా?"అంది నాగమణి.

"రాత్రికి రాత్రి నేను చంటిబిడ్డనెలా కనగలను?" ఎదురు ప్రశ్న వేసింది దుర్గ.

"అద్దెకి తెచ్చుకుంటాం చంటిబిడ్డని" మెత్తగా చెప్పింది నాగమణి.

"ఎవరి బిడ్డనో నా బిడ్డని అబద్ధాలాడి అడుక్కోడం పాపం... ఆ పని నేను చెయ్యను" ఖచ్చితంగా అంది దుర్గ.

వెన్నెల్లాగ నవ్విన నాగమణి "ఈ పట్నంలో బిడ్డ నెత్తుకుని అడుక్కునే వాళ్ళ పిల్లలంతా వాళ్ళ సొంత పిల్లలనుకుంటున్నావా?" అంది.

"కాదా?" అడిగింది దుర్గ.

"కాదు. ఈ బస్తీలో పిల్లల్ని అద్దెకి తెచ్చిచ్చే భిక్షపతి అని బ్రోకరొాడున్నాడు. వాడికి చెపితే తెస్తాడు" అంటూ అడుక్కోవడంలో లౌక్యమంతా వివరంగా చెపుతుంటే నాగమణి మాటల్లో ఏ మంత్రముందో ఆమెకి వశమైపోతుంది దుర్గ.

"పొద్దుటే మనం ఒకచోటు కెళ్దాం వెనక దడిలోకెళ్ళి స్నానం చేసిరా" అని దుర్గని పంపేక వడ్డీలకి పట్టుకెళ్ళడానికీ, పట్టుకెళ్లిన బాకీలు జమ కట్టడానికీ వచ్చిన జనంతో మాటాడే పనిలో పడిపోయింది నాగమణి.

*

మొన్నటిదాకా అడవుల్లో తిరిగిన వీరప్పన్‌లాగ సన్నగా పెద్దమీసాల్తో ఉన్నాడు. భిక్షపతి అంటే వాడేనంట. ఒక ఆర్నెల్ల బిడ్డని భుజాన్నేసుకుని నాగమణి ఇంటికొచ్చిన ఆ భిక్షపతి "బిడ్డకి రోజుకి వంద, నా కమీషను ఏభై" అంటూ దుర్గ వేపు తిరిగి "నీకే అట గదా ఈ బిడ్డ, అక్కచెప్పిందిలే. పిల్లోన్ని పువ్వులా చూసుకోవాలి టైము దొరికినప్పుడల్లా ఏ చెట్టు కిందికో తీసుకెళ్ళి డబ్బా పాలు పడ్తుండాలి. అర్థమయిందా?" అన్నాడు వార్నింగ్ ఇస్తున్నట్టు.

అయ్యిందన్నట్టు తలాడించింది దుర్గ.

"పిల్లోనికేవన్నా అయినదంటే మేం వూరుకోం ప్రాణాలు తీస్తాం" అన్నాడు.

"అలాగే" అంది దుర్గ.

అన్నీ మాటాడుకున్నాకా వెళ్ళిపోయేడు భిక్షపతి.

దుర్గకో ఇడ్లీ పెట్టి తను తిన్నాకా, చంటి కుర్రోడికి డబ్బాపాలు పట్టించేక లోపలికెళ్ళి ఎవరో డాక్టరు రాసిన ప్రిస్కిప్షను పట్టుకొచ్చి దుర్గకిచ్చింది నాగమణి.

"ఏంటిది?" అంది దుర్గ.

"మందుల చీటీ... జనానికి ఈ చీటీ చూపించి... కుర్రోడికి మందులు కొనడానికి డబ్బుల్లేవని చెప్పి ఏడుపుగొట్టు గొంతుకుతో అడుక్కోవాలి" అంది నాగమణి.

ఎదురుతిరిగిన దుర్గ "ఆరోగ్యంగా ఉన్న బిడ్డకి జబ్బూ జ్వరం అనిజెప్పి అడుక్కోడం తప్పు. పాపం. నేనొప్పుకోను... అలాగ నేనడుక్కోను" అంది.

నందివర్ధనం పువ్వులాగ నవ్విన నాగమణి "ఇందులో పాపం ఏమీలేదు చెల్లీ!" అంటా మొదలెట్టి అడుక్కోడంలో లౌక్యాన్ని ఒక కోణంలో చెపుతుంటే నాగమణి మాటలకి మైమరచిపోయి పెంచుకుంటున్న కుక్క పిల్లలాగయిపోయిన దుర్గ "అలాగే అక్కా.... అలాగలాగే" అంది.



నవ్వుతా బిడ్డనీ మందుల చీటీనీ దుర్గ చేతికిచ్చింది నాగమణి.

కాసేపటికి గుక్కపట్టి ఏడ్డం మొదలెట్టాడా పిల్లాడు. ఎంత వూరుకోబెట్టినా వూరుకోవడం లేదా బిడ్డ.

కంగారుపడ్డ దుర్గ "ఏం చేద్దామక్కా?" అంది.

గుట్కాపేకెట్టు చింపి నోట్లో వేసుకున్న నాగమణి ఇప్పుడే వస్తానని లోపలికెళ్ళి ఒక కాయితం పొట్లం తెచ్చి విప్పితే నల్లతారులాగ గోళీకాయ సైజు ఉండ కనిపించింది. దాంట్లోంచి గురువింద పూసంతది గిల్లి వుండ చుట్టి "కుర్రోడి నోట్లో వెయ్యి హాయిగా నిద్రోతాడు" అంది.

"ఏంటిది?" అంది దుర్గ.

"నల్లమందు... ఎప్పుడూ విన్లేదా ఇదో మత్తుమందు" అంది.

"ఓహో" అన్న దుర్గ ఆ చిన్ని నల్లమందు ఉండని ఏడుస్తున్న చంటి కుర్రోడితో ఇలా మింగించిందో లేదో అలా నిద్రోయేడు.

*

పగలు పదిగంటలు దాటింది.

రకరకాల జనం.

సిగ్నల్స్ దగ్గర నాలుగు పక్కలా కాపేసిన ముష్టోళ్లు చాలా చాకచక్యంగా అడుక్కుంటుంటే కుర్రోడ్నెత్తుకుని వాళ్ళ మధ్యలో కొచ్చిన దుర్గకి ఎలా అడుక్కోవాలో అర్థంగాక జనం మీదికి ఒంగిపోయి వాళ్ళ జబ్బల మీదా మణికట్ల మీదా చేతులేసి దీనంగా అడుక్కుంటుంటే 'చిక్కినా చక్కగానే ఉంది' అనుకుని కొందరు, 'పాపం ఎవరో అడుక్కోడం రాని మనిషి' అనుకుని కొందరు డబ్బులేస్తున్నారు.

చెయ్యిలేని నాగూరూ, అయ్యప్ప డ్రస్సు శీనుగాడూ, బేరింగుల బండి లక్ష్మణ, కొయ్యకాలు దస్తగిరీ కొత్తగా దిగిన దుర్గ కేసి చూస్తా ఎవరీ పిల్ల అనుకుంటుంటే ఉర్దూ కుర్రాడు అఫ్సరు చెప్పేడు నాగమణక్క తాలూకని.

ఆ మధ్యాన్నం, సాయంత్రం కూడా అందరికంటే ఎక్కువ డబ్బులు దుర్గకే పడ్డాయి.

రాత్రి ఆ డబ్బులన్నీ లెక్కెట్టిన నాగమణి కుర్రోడి తల్లిదండ్రులకెంతివ్వాలో భిక్షపతి కెంతివ్వాలో తనెంత తీసుకోవాలో లెక్కలేసేకా ఇంకా మిగిలిన ఏభైరూపాయిల్ని "నా దగ్గరుండనీ... వడ్డీకి తిప్పుతాను" అంది.

*

రోజులు బాగా గడుస్తున్నాయి.

చౌరస్తాలో అందరి కంటే దుర్గకే ఎక్కువ డబ్బులు వస్తున్నాయి. రాత్రయ్యేక అవన్నీ నాగమణి కిస్తుంది.

ఆరోజు ప్లాట్‌ఫారం మీద ఒకడు పచ్చబొట్లు పొడుస్తుంటే తన అరచేతి మీద ఎన్ అన్న అక్షరం పొడిపించుకుంది. అది చూసిన నాగమణి "ఏంటే ఇది నువ్వు ప్రేమించినోడి పేరా?" అని అడిగితే "ఛీఛీ... నాకు అన్నం పెట్టిన నీ పేరక్కా" అంది దుర్గ.

నవ్విన నాగమణికి ఒకరోజు జ్వరం వచ్చి అడుక్కోడానికి రాలేకపోయింది.

మధ్యాహ్నం ట్రాఫిక్ పల్చబడిపోతుంది. అడుక్కునే వాళ్ళకది లంచ్‌బ్రేక్. ఆ మధ్యాహ్నం పూట మోదుగ చెట్టు కింద బిడ్డకి పాలు పట్టిస్తున్నప్పుడు తన దగ్గరకొచ్చిన కొయ్యకాలు దస్తగిరి "ఆ నాగమణికి రోజుకి నలభై ఇస్తున్నావంటమ్మా... మా ఇంటికొచ్చి పాతికియ్యి చాలు. వారానికోసారి మాంసం కూడా వండి పెడద్ది మీ పిన్ని" అన్నాడు మర్యాదగా.

అంతలో వచ్చిన నాగూరు "ఆ నాగమణిని నువ్వు అమాయకంగా నమ్మేస్తున్నందుకు మాకు చాలా బాధగా ఉందమ్మా... అది మేకలా కనిపిస్తున్న పులి" అన్నాడు.

"ఈ జంక్షన్‌కి నీలాంటోళ్ళని ఎంతమందిని తీసుకొచ్చి మాయజేసిందనీ. లేకపోతే అది వడ్డీకి తిప్పుతున్న అయిదు లక్షలూ ఎక్కడ్నించొచ్చినియ్యనీ... అదంతా నీలాంటి అమాయకుల్ని ముంచిన సొమ్ము" అన్నాడు లక్ష్మణ.

"దాని దగ్గర మంత్రాలున్నాయంట... మనుషుల్ని ఇట్టే మాయజెయ్యడం వచ్చు. ఆ ఉచ్చులోంచి బయటికి రా చెల్లీ" అన్నాడు శీనుగాడు.

"మా ఇంటికి రాకపోయినా పర్లేదు తల్లీ!... దాన్ని మాత్రం నమ్మకమ్మా" అన్నాడు దస్తగిరి.

అందరి మాటలూ విన్నాకా తలెత్తిన దుర్గ "మీరు నాగమణక్క గురించి లక్ష చెప్పండి నేను వినను. నేను నమ్మను. నాకు అన్నం పెట్టిన ఆ తల్లికి వ్యతిరేకంగా ఏదీ చెయ్యను. అంతే" అనేసింది. అలా అనడమే గాకుండా ఆ రాత్రి ఇంటికొచ్చి జరిగిందంతా నాగమణికి చెపుతుంటే, ఆమె దగ్గర కూర్చుని ఉన్న నలుగురు బలమైన మనుషులు ఆ మాటలన్నీ విన్నారు.

ఆ తర్వాత వాళ్ళు ఒకరాత్రి పూట ఆ ముష్టి జనం మీద కలపడి పచ్చడి కింద కొట్టేసేరు.

దాంతో దుర్గ మీద కక్ష పెంచుకున్న ముష్టిగేంగంతా త్వరలోనే దీన్ని చంపి మేన్‌హోల్‌లో పారేయాలని నిర్ణయించేసుకున్నారు.

*

ఉన్నట్టుండి వర్షం పడ్డం మొదలెట్టింది. మామూలు వర్షంకాదు. బానలు దిమ్మరించినట్టు. బంగాళాఖాతంలో డిప్రెషనట. పొద్దుట్నుంచి రాత్రిదాకా కురుస్తానే ఉంది.





దాంతో, ముష్టోళ్ళెవరికీ అడుక్కునే అవకాశమే లేకుండా పోతుంది. నాగమణీ దుర్గా కూడా ఇంట్లోంచి బయటికి రాలేకపోతున్నారు. అయితే అద్దెకి తెచ్చిన పిల్లాడికి కట్టాల్సిన కిరాయీ తన కమీషన్ ఏరోజుదారోజు లాక్కెళ్లిపోతున్నాడు భిక్షపతి. ఇంకోపక్క కుర్రోడికి పాలడబ్బాలు, దుర్గ తిండి అన్నీ నోటితోనే లెక్కలు కట్టుకుంటుంది నాగమణి.

*

వారం రోజులపాటు కురిసిన వర్షం ఆగింది.

ఎండ కాస్తుంది.

బిడ్డతో బయల్దేరబోతున్న దుర్గతో తనకీ మధ్య ఇద్దరు ముగ్గురు పెద్ద పెద్ద బాకీలు ఎగ్గొట్టి పారిపోయిన విషయం చెప్పి "ఇటు చూస్తే మనిద్దరికీ కొన్నాళ్ళ నించి ఆదాయం లేకండాపోయింది. కాబట్టి ఇద్దరం చాలా గట్టిగా సంపాదిస్తే తప్ప ఈ మహానగరంలో బతికి బట్టకట్టలేం చెల్లీ" అని కళ్లమ్మట నీళ్ళు పెట్టుకుంది నాగమణి. అది చూసి చలించిపోయిన దుర్గ బిడ్డని తీసుకుని చౌరస్తాకి బయల్దేరింది.

నాగూరూ, లక్ష్మణా, శీనుగాడు, దస్తగిరీ వస్తున్న దుర్గని చూస్తున్నారు.

వాళ్ళనేం పట్టించుకోకండా గుల్‌మొహర్ చెట్టు కింద కెళ్ళి పిల్లాడికి సీసాలో ఉన్న పాలలో కొన్ని పట్టించి చిన్న నల్లమందు వుండ వాడి నోట్లో వేసి మింగించి, వాడు నిద్రోయేకా ఇక అడుక్కోడం మొదలెట్టింది. సాయంకాలం లోగా చాలా సంపాయించి నాగమణక్కకివ్వాలి. తన నాగమణక్కకివ్వాలి. అదే ఆలోచన, అదే పట్టుదల. అంతే... అంతే.

"బాబూ... నెలల బిడ్డ బాబూ. ఇదిగోండి డాక్టరుగారు రాసిన మందుల చీటీ. వెంటనే కొనకపోతే నా బిడ్డ నాకు దక్కడు బాబూ" అంటూ జనాన్ని ముట్టుకుని బతిమాల్తూ, ఏడుస్తుంది.

నాగూరూ లక్ష్మణా దుర్గనే చూస్తున్నారు 'కంగారుపడకు ఐపోవచ్చింది నీ పని' అనుకుంటున్నారు.

గంటన్నర గడిచింది.

రోళ్ళు పగిలేలా కాచిన ఎండ ఉన్నట్టుండి మాయమయ్యింది. గాలి, మబ్బులు. ఆకాశం నిండా నల్లటి మబ్బులు.

ఒకటే గాలి, వానా. తక్కిన ముష్టోళ్ళంతా షాపుల ముందరా బస్సు షెల్టర్లలోకీ వెళ్ళి నిలబడి ఒణికి పోతుంటే చంటిపిల్లోడితో పాటు తడుస్తానే అడుక్కుంటూనే ఉంది దుర్గ. తడిసి ముద్దయిపోతూ అడుక్కుంటున్న ఆమెనీ బిడ్డనీ అలా చూసిన జనం పాపం అని డబ్బులేస్తూనే ఉన్నారు.

దుర్గనే చూస్తున్న లక్ష్మణ "దాని స్పీడు జూడు" అన్నాడు.

"ఇంక రేపెలాగా ఉండదు గాబట్టి ఇవేల్టికి స్పీడుగానే ఉండనీ" అన్నాడు నాగూరు.

వర్షం కురుస్తానే ఉంది. ఏ బండినీ ఏ మనిషినీ వదలడం లేదు దుర్గ.

దుర్గ జోలెనిండా డబ్బులే డబ్బులు.

ఒక పూనకంలో అడుక్కుంటున్న దుర్గ నిద్ర లేచి ఏడుస్తున్న ఆ కుర్రోడ్ని ఊరుకోబెడతానే అడుక్కుంటుంది.

ఊరుకోవడం లేదు కుర్రాడు. గుక్కపట్టి ఏడుస్తానే ఉన్నాడు. ఆ నెలల బిడ్డ కళ్ళల్లోంచి కన్నీళ్ళూ నోట్లోంచి చొంగలు కారతానే ఉన్నాయి. ఉచ్చ పోసేస్తున్నాడు.

దాంతో, చీర చెంగుకి కట్టిన ఆ నల్లమందు ఉండ తీసి బలవంతంగా మింగించడంతో నిద్రపోయేడు.

ఈ పక్క చాలా డబ్బులు పోగడుతున్నాయి దుర్గకి.

ఆ పక్కనించి ఆ రాత్రికి దుర్గని ఎలా చంపాలన్న ప్లాను గురించి మాటాడుకుంటున్నారు ముష్టోళ్ళు.

బాగా చీకటిపడింది.

వర్షం కాస్తాగినా తుంపర్లు పడుతూనే వున్నాయి.

నాగమణి దుర్గా వాళ్ళింటి వేపు నడుస్తుంటే వాళ్ళకి కాస్త దూరంనించి ఫాలో అవుతుంది ముష్టోళ్ళ గేంగ్.

నాగమణి ఇంటి తాళం తీస్తుంటే నాగూరూ లక్ష్మణా కిటికీ దగ్గరికీ, దస్తగిరీ అప్సర్ ఇంటి వెనక స్నానాల దడిలోకి దూరేరు. వాళ్ళ దగ్గర బ్లేడ్లూ ఒక నైలాన్‌తాడూ ఉన్నాయి. బాగా రాత్రయ్యేకా పని మొదలెడదామని చూస్తున్నారు.

ఇంట్లోపల ఆవేళ దొరికిన డబ్బులు మొత్తం నాగమణి ముందు కుప్పగా పోసింది దుర్గ.


ఆనందంగా వాటిని లెక్కపెడతా "నీకివ్వేళ లక్కీ హోటల్నించి బిర్యానీ తెప్పించిపెడతాను చెల్లీ. బాగా ఆకలేస్తున్నట్టుంది గదూ" అంటుంది నాగమణి. ఆకలంటే బిడ్డ గుర్తొచ్చింది దుర్గకి. పాలిచ్చి చాలా సేపయ్యింది. సీసాలో పాలు పట్టి ఆ బిడ్డని లేపే ప్రయత్నం చేసిన దుర్గ ఉలుకూ పలుకూ లేకుండా అలా ఉండిపోయింది.

నల్లమందు డోసు ఎక్కువైన ఆ బిడ్డ ప్రాణాలు పోయి చాలాసేపయ్యింది.









# ఏకాదశి చంద్రుడు

"చంద్రంనాన్నకి పిచ్చెక్కింది"అన్నారు.

"మూమూలు పిచ్చిగాదు, మదపిచ్చి" అని ఇంకొందరన్నారు.

"పిచ్చీగాదు గిచ్చీగాదు ఇన్నాళ్ళూ మంచోళ్ళా కనిపించేడు. ఆఖర్రోజుల్లో బయటపడిపోయేడు."


"మంచోడనుకున్నాం మోసగాడని ఇప్పుడర్థమైంది."

"మోసం, దగా ఇంత బాగా చెయ్యొచ్చా?!"

వూళ్ళో ఎక్కడబడితే అక్కడ అలా మాటాడుకుంటున్న జనం మాటలకి నవ్వుకుంటున్నాడు చంద్రంనాన్న. నవ్వుకుంటానే ఒడ్డుమీద కూర్చుని గోదావరి అలల గలగలల్ని వింటూ, ముఖాన్ని కొడ్తున్న గాలిని హాయిగా అనుభవిస్తొ దూరంగా కరవాక సముద్రంలోకి అస్తమిస్తున్న సూర్యుడ్ని చూస్తొ అలాగే వుండిపోయిన అతనికి కాస్త దూరంగా చాలామంది ఆడవాళ్ళు చంటిపిల్లలూ నిలబడి వున్నారు. వాళ్ళంతా సముద్రంలోకి వేటకెళ్ళిన వాళ్ల భార్యలూ పిల్లలూ. దీపాలవేళయ్యేసరికి అలా ఒడ్డుకొచ్చి మగాళ్ళకోసం ఎదురుచూడ్డం వాళ్ళకి అలవాటు.

కాస్సేపయ్యేసరికి కొన్ని నావలొచ్చి ఒడ్డున ఆగాయి. వాళ్ళలో కామాడి వానబాలుడు అనే అతని వలలో బ్రూడర్‌రెయ్యి పడిందంట. పిల్లలు పెట్టే ఆ రెయ్యిని కోనపాపపేట హేచరీస్ వాళ్ల కమ్మితే చాలా డబ్బిస్తారు. ఒకప్పుడైతే 'చంద్రం నాన్నా' అంటా చాలా సంబరంతో తన దగ్గరకొచ్చి చెప్పేవాడు వాన బాలుడు. ఇవ్వేళ మాత్రం తనకి తప్ప అందరికీ చెప్పుకుంటా ఎగిరి గంతులేసుకుంటా వెళ్ళిపోతున్నాడు వూళ్ళోకి. ఆ వానబాలుడే గాదు వేట నావలు దిగుతున్న వాళ్ళెవరూ చంద్రం నాన్న దగ్గరకి రావడం లేదు.

గోదావరి మీద ఒకటీ అరా పడవలు ప్రయాణం చేస్తున్నాయి. చీకటి చిక్కబడ్తుంది.



చలిగాలి బొంగురు గొంతుతో వీస్తుంది. పూజారిగారబ్బాయి భైరవస్వామి గుళ్ళో భక్తి రికార్డు లేస్తున్నాడు. ఊరు ఊరంతా దీపాలు వెలిగించుకుంటున్నారు. తను కూర్చున్న ఆ ఒడ్డు మీంచి కనిపిస్తున్న ఆ వూరినే చూస్తున్న ముసలి చంద్రంనాన్నకి నెమ్మది నెమ్మదిగా ఒకప్పటిరోజులు గుర్తుకొస్తున్నాయి.

*

యానాంనించి పరంపేట, దరియాలతిప్ప దాటి రోడ్డుకి కుడి పక్కనించి కొంతదూరం వెళ్తే వృద్ధ గౌతమీనది మధ్యలో పెద్ద తిప్ప. ఆ తిప్ప మీదుంది భైరవపాలెం. చుట్టూ ఎటు చూసినా నీళ్ళే. ఆ వూర్నిండా వుండేది చేపలు పట్టేవాళ్ళే. చిన్నచిన్న సందుల్లో ఇళ్ళు. భైరవస్వామి గుడి, రామాలయం వున్నా భోగం మాత్రం భైరవస్వామిదే.

వూళ్ళో మరకాళ్ళ మనిషైన సంగాడి దుర్గారావు నాలుగో కొడుకు సూర్యచంద్రరావు. అసలు పేరు పొడుగ్గా వుందని చంద్రంనాన్న అని పిలవడం మొదలెట్టారు. అయితే చంద్రంనాన్న పిఠాపురంలో ఉండే దూరపు బంధువు కొప్పాడి గుణసుందరిగారింటికి దత్తత వెళ్ళిపోయి కులవృత్తి మానేసి చదువుకుంటా ఎస్సెస్ఎల్సీ అయ్యేకా ఖాదీ బండారులో గుమస్తా ఉజ్జోగం సంపాయించాడు. ఓపక్క ఉజ్జోగం చేస్తానే పరీక్షలు రాసి పాసవుతా బియ్యే దాకా వచ్చాడు. గాంధీగారి పుస్తకాలు బాగా చదివే చంద్రంనాన్న తన జీవిత ప్రయాణంలో తన గుడ్డలు తనే నేసుకుని తన చొక్కాలు తనే కుట్టుకుంటా పూర్తి గాంధేయవాదిగా మారిపోయేడు. అలా ఎందుకు నిర్ణయించుకున్నాడో ఏమోగానీ బ్రహ్మచర్యం పాటించి బ్రహ్మచారైపోయాడు.

పెంచుకున్న తల్లి గుణసుందరి చచ్చిపోయింది. దాంతో, పిఠాపురంలో తనకంటూ ఎవరూ లేకపోవడంతో భైరవపాలెం వచ్చేసేడు. టీచర్లు ఆ గోదారి మధ్య చేపల వాసనలో వుండకుండా పోవడంతో ఆ ఉజ్జోగం చంద్రం నాన్న కొచ్చింది. అలాగే పోస్ట్‌మేస్టరు రంగాచార్యులుగారు అస్తమానూ శలవులు పెట్టేసి తాళ్ళరేవు వెళ్ళిపోడంతో టెంపరరీ పోస్ట్‌మేస్టరు పని కూడా తనే చెయ్యడం మొదలెట్టాడు. వాళ్ళ కులంలో మనిషి ఇలా మేష్టరుజ్జోగం, పోస్ట్‌మేష్టరుజ్జోగం చెయ్యడం చాలా గర్వంగా వుంది భైరవపాలెం జనానికి. అంతా అతన్ని చాలా ప్రేమగా గొప్పగా చూసుకుంటున్నారు.

కాలం గడుస్తుంది.

వాళ్ళంతా డబ్బులు దాచుకోరు. ఎలా వస్తుందో అలా ఖర్చు పెట్టేస్తారు. వాళ్ళకి చావులు చాలా తొందరగా వస్తాయి. ప్రతి కుటుంబంలోనూ ఎవరో ఒకరు సముద్రం పాలైపోతుంటారు. అందుకే వాళ్ళెప్పుడూ గడిచిపోయిన దాన్ని గుర్తు పెట్టుకోరు. వెంటనే మర్చిపోయే ప్రయత్నం చేస్తారు. తెల్లారితే రేపు. ఆ రేపు వస్తుందో లేదో. అందుకే దాని గురించి అస్సలు ఆలోచించకుండా ఆరోజే పండగలాగ గడుపుతారు. ఆ రోజునే నమ్ముతారు.

తల్లీదండ్రీ పెదనాన్నా పెద్దమ్మా అన్నలూ ఒకళ్ళ తర్వాత ఒకళ్ళు కాలం చేశారు. చేపల వేటకెళ్ళి సముద్రంలో కల్సిపోయిన వాళ్ళే ఎక్కువమంది. దాంతో, పెదనాన్న కూతురు,పెద్దన్న, చిన్నాన్న పిల్లల్నీ వచ్చే జీతంతో పోషించడం మొదలెట్టాడు. గొప్ప చిత్రం ఏంటంటే పేరుకి చంద్రంనాన్న బ్రహ్మచారి కానీ, అతని కున్నంత కుటుంబభారం ఎవరికీ లేదు. రెండు జీతాలూ చాలీచాలడం అయిపోతుంది.

జులపాల జుట్టుతో సన్నగా పొడుగ్గా వుండే చంద్రంనాన్న పొద్దుటే స్కూలు కెళ్తున్నాడు. ప్రశాంతంగా పిల్లలకి పాఠాలు చెప్తున్నాడు. మధ్యాహ్నం భోజనం టైములో పోస్టాఫీసుకొచ్చి ఉత్తరాలు అందుకుని ముద్రలేసి పోస్ట్‌మేన్ శివన్నారాయణకిచ్చి డబ్బాలో వాటి మీద ముద్రలేసి బేగ్‌లో పెట్టి సీలు వేసి పంపిస్తున్నాడు. అంతా అన్నీ నవ్వుతానే చేస్తున్నాడు.

*

రెండో అన్నగారూ మూడో అన్నగార్ల పిల్లలకి కట్నాలిచ్చి పెళ్ళిళ్ళు చేసి సాగనంపుతున్నాడు. ఇంట్లో వుండి పోయిన వాళ్ళ బాధలూ రోగాలూ వస్తే తనే చూస్తున్నాడు. ఏ సమస్య వచ్చినా ఎవరి మీదా విసుక్కోకండా నవ్వుతా సర్దుతున్నాడు. ఇవన్నీ చేస్తూనే ఎమ్.ఏ కట్టి పాసయ్యేడు.

చంద్రంనాన్నని చూస్తున్న వూళ్ళో కొందరు 'పాపం పిచ్చోడు' అంటున్నారు.

అది తన చెవిన పడి నవ్వేశాడు చంద్రంనాన్న.

"ఇందరికి పెడ్తున్నావ్ ఇంత చేస్తున్నావ్. నీకోసం ఏమీ చేసుకోని నువ్వు ఇంత కష్టం ఎందుకు పడ్తున్నావ్ చంద్రంనాన్నా?" అని ఎవరో అడిగితే చప్పుడు చెయ్యని చంద్రోదయంలాగ నవ్వేసేడు.

*

ఎలాంటి స్వార్థం లేకుండా ఇన్ని సేవలు చేస్తున్న చంద్రంనాన్నని వూరి పెద్దలు వాళ్ళలో ప్రధానమైనవాడిగా ఎంచుకున్నారు.

ఇళ్ళ ముందు వాల్చిన మంచాలమీద సావిడాల్ని (ఒక రకం ఎండు చేపలు) ఎండబెడ్తుంటే వెండి రేకుల్లా మెరుస్తున్నాయవి. పేరు తెలీని పక్షి ఒకటి గోదావరి మీంచి ఎగురుకుంటూ వచ్చి పండిన ఈతచెట్టు గెలమీద వాలి నచ్చిన పళ్ళని పొడుచుకు తింటుంది. గోదారి అంచు మీద నిలబడ్డ కొంగ ఒకటి నీటిలో చేపని పొడుచుకు తిందామని ప్రయత్నం చేస్తుంటే ఎగిరి పల్టీలు కొట్టిన ఆ చేపపిల్ల కొంగకి దొరక్కండా నీటిలోపల కెళ్ళిపోయింది, ఎండవేడిని తట్టుకోలేని కాకులు గుంపు కొద్దిపాటి నీళ్ళల్లో తలలు ముంచి అటూ ఇటూ వూపుతున్నాయి. భైరవ స్వామి గుడి శిఖరం పైకి ఎక్కిన కొండముచ్చు చుట్టూ ఉన్న గోదావరిని పరికిస్తుంది. కొబ్బరాకు మీంచి దబ్బున నేల మీద పడ్డ తొండ పాక్కుంటా వెళ్ళిపోయింది పక్కింటి దడిలోకి. చాలా ఏళ్ళు గడిచాయి.

తన ఏభై ఎనిమిదో ఏట రిటైరైన చంద్రంనాన్న వెంటనే పోస్ట్‌మేస్టరు ఉద్యోగానికి కూడా రాజీనామా చేసేశాడు.

ఆ తర్వాతనించీ భైరవపాలెం దాటి బయటికొచ్చిన తను ఒకటే తిరుగుడు. ఖద్దరు సంచీ భుజాన వేలాడేసుకుని తిరగడం మొదలెట్టాడు. ఎక్కడెక్కడ బంధువులుంటే అక్కడికెళ్తున్నాడు. అందర్నీ ఆప్యాయంగా పలకరించి వచ్చేప్పుడు ఎంతో కొంత వాళ్ళ పిల్లల చేతిలో పెడ్తున్నాడు.

తన పెద్దన్నయ్య గోవిందరాజులు కొడుకు సూర్రావు చేపలు పట్టడం మానేసి యలమంచిలి దగ్గర గుడివాడలో ఎండి చేపలు చేసి సంతల్లో హోల్‌సేల్‌గా అమ్ముతున్నాడని తెల్సి ఆ వూరెళ్ళాడు.



ఈ ఎండుచేపల తయారీ చాలా పెద్ద పని. చేపని అడ్డంగా కోసి విడదీసి ఉప్పు జల్లుతుంది సూర్రావు భార్య సక్కుబాయి. మళ్ళీ ఇంకో చేపని అలాగే చేసి ఒకదాని మీదొకటి అంటించినట్టు పెట్టి ఎండబెడ్తుంది.

ఆ మనిషికి సాయిపడ్తున్న చంద్రంనాన్నతో "ఉప్పు సమపాళ్ళలో పెట్టాలి మాయ్యగారూ. ఏమాత్రం ఎక్కువా తక్కువా పెట్టినా చేప పాడైపోయి కండలు కింద వూడిపోద్దండి" అంది.

ఆమె చెప్పినట్టే చేస్తున్న చంద్రంనాన్నతో "చదువుకున్నోరు మీకెందుకీ పని మాయ్యగారూ" అని సక్కుబాయి అంటుంటే "మనిషన్నాకా అన్నీ చెయ్యాలమ్మా" అంటున్నాడు చంద్రంనాన్న.

వాళ్ళింట్లో కొన్నాళ్ళుండి బయల్దేరేటప్పుడు పిల్లల చేతిలో కొంత డబ్బు పెట్టిన చంద్రంనాన్న రెండో అన్నగారి కొడుకు హనుమంతు సముద్రంలోకెళ్ళి చేపలు పట్టే పని ఎప్పటికైనా ప్రాణాల్తో ముప్పే అనుకుని రాజానగరం వెళ్ళిపోయి చిన్నచిన్న కాఫీ హోటళ్ళలో ఊకపొయ్యిలు కట్టే పని చేస్తున్నాడని తెల్సి ఆ వూరెళ్ళాడు.

హనుమంతు పెళ్ళాం సత్తుగిన్నెలో నూకల అన్నం చారూ వేపుడు చేపముక్కలూ వేసింది.

వాటిని నుంజుకు తింటుంటే అప్పుడే నెల జీతం పట్టుకొచ్చి పెళ్ళాంకిచ్చి "లోపల బీరువాలో పెట్టు" అంటున్న హనుమంతు చంద్రంనాన్న తింటున్నది చూసి "మా చిన్నాన్న ఎవరనుకుంటున్నావ్... నూకల కూడెడ్తావా?" అని గసిరేడు.

"ఏడ్చేవ్లే" అని హనుమంతుని కేకలేసి "అమ్మా సావిత్రీ వాడిచ్చిన డబ్బులు నువ్వు బీరువాలో దాస్తున్నావ్ గానీ మా భైరవపాలెంలో మనవాళ్ళు సంపాయించిన సొమ్ము ఇళ్ళల్లో దాయరు. నావలోనే చిన్న ట్రంకుపెట్టి పెట్టుకుని అందులో దాచుకుంటారు తెల్సా?" అన్నాడు.

"ఎందుకంట మాయ్యాగారూ?" అడిగింది సావిత్రి.

"గోదారితల్లి అప్పుడప్పుడూ కోపంతో వూర్ని ముంచేస్తే ఇంట్లో దాచిన సొమ్ములు మన సొంతం గాకండా పోతాయిగదా... అదే నావలో అయితే దాంట్లో మనం ఏ వూరి ఒడ్డుకో చేరొచ్చుగదా. అందుకు" అన్నాడు.

తన చదువు పక్కనెట్టి తను నేర్చుకుంది వాళ్ళకి చెప్పే చంద్రంనాన్న ఎక్కడా అప్పనంగా తినడు. నిమిషం ఖాళీగా వుండడు. శ్రమ పడతానే వుంటాడు. నిరంతరం నవ్వుతానే వుంటాడు. చంద్రుడు పౌర్ణమి రోజునొస్తాడు. చంద్రంనాన్న నోట్లో ఎప్పుడూ చంద్రుడుంటాడు.

*

రోజులు గడుస్తున్నాయి.

మామూలు నావలు పోయి ఇంజను నావలొచ్చాయి. 96 తుఫానుకి వూరు మునిగి చాలామంది చని పోడంతో నేలమీంచి వూళ్ళోకి కాలిబాట వంతెన వేయించింది తెలుగుదేశం గవర్నమెంటు. వూళ్ళో చాలామంది డబ్బున్నవాళ్ళవ్వడంతో పూరిళ్ళు డాబాలుగానూ మేడలుగానూ మారిపోయాయి. ఇప్పుడు వేటకెళ్తూ సెల్ఫోన్లు కూడా పట్టుకెళ్తున్నారు. వాటిద్వారా వాతావరణం వివరాలూ వార్తలూ సముద్రంలో వున్నవాళ్ళకి తెలీడంతో రిస్క్ కాస్త తగ్గుతుంది.

వూళ్ళు తిరుగుతానే డబ్బాయ్‌లో పడిపోయిన చంద్రంనాన్న తిరిగి భైరవపాలెం వచ్చేశాడు. గ్రామం మధ్యలో ప్రశాంతంగా గడుపుతున్న చంద్రంనాన్నకి ఒంట్లో బాగోకపోతే ఆరోజు కాకినాడెళ్ళి డాక్టర్‌కి చూపించు కుంటే తెల్సింది లంగ్ కేన్సరని, నెలకి మించి బతకడని.

చావు గురించి అలా తెల్సిన చంద్రంనాన్న భయపడి బెదిరిపోలేదు. బెంబేలెత్తి పోలేదు. అసలు ఏమీ అవ్వలేదు. నవ్వుతానే వున్నాడు.

అతన్ని గురించి విన్న ఏభై ఏళ్ళ కమలమ్మ ఆశ్చర్యపోయింది. వెనకా ముందూ ఎవరూ లేని ఆమె ఆ భైరవపాలెంలో కొత్తగా దిగింది.

ఎదురైన అందర్నీ ఆప్యాయంగా పలకరిస్తా, మనసు లోపల మౌనంగా ముసులుకుంటా యానాం వెళ్ళి అక్కడి బేంకుల్లోనూ, పోస్టాఫీసుల్లోనూ దాచిన డబ్బు మొత్తం డ్రా చేసుకుని భైరవపాలెం వచ్చేడు.

అందరికీ తలా కొంతా ఇచ్చేడు.

పెద్ద మేనల్లుడు నాగేటి శ్రీను కూతురు నెలలు నిండి వుంటే వాడ్ని పిల్చి 'పిల్ల పురుడు ఖర్చులకి వుంచుకో' అని కొంత డబ్బిచ్చి చిన్న మేనల్లుడు బాబ్జీగాడింటికెళ్తుండగా నాగరాజనే కుర్రాడు వేటకెళ్ళి సముద్రం లో గల్లంతయి పోయిన వార్త తెల్సింది. ఒడ్డునున్న జనం మాటాడుకుంటున్నారు. అక్కడికెళ్ళి నిలబడ్డ చంద్రం నాన్న నీరసమొచ్చి వాలిపోతుంటే లేపి రాములోరి గుడి అరుగుమీద కూర్చోబెట్టి వెళ్తున్న కమలమ్మనే చూస్తా 'ఈ వూళ్ళో ఎప్పుడూ చూళ్ళేదు ఎవరీమె?' అనుకున్న చంద్రంనాన్న లేచి బాబ్జీ ఇంటికెళ్ళి వాడికి రాసేసిన ఇంటి స్థలం కాయితాలతో పాటు పాతికవేల రూపాయిలు కూడా ఇచ్చి 'నా దహనసంస్కారాలకి ఖర్చుపెట్టి మిగతాది నువ్వుంచుకోరా' అన్నాడు.

రెండో అన్నగారి కొడుకు వూళ్ళోనే వున్నా తన తలకొరివి వాడ్ని పెట్టొద్దన్నాడు. ఎందుకంటే ఈమధ్యే క్రైస్తవ మతం పుచ్చుకున్నాడు వాడు. గుడివాడలో వున్న సూర్రావుకి కబురుచేసి 'నువ్వన్నా చెయ్యి రాజమండ్రిలో వుంటున్న హనుమంతుతోనన్నా చేయించు' అన్నాడు.

ఆరోజు పొద్దుట, భైరవస్వామిగుళ్ళోకెళ్ళి దేవుడికి దణ్ణం పెట్టుకుంటున్న చంద్రంనాన్నకి మళ్ళీ కనిపించిన కమలమ్మ చేతులెత్తి నమస్కారం పెట్టింది.

అలా తనకి నమస్కారం పెట్టిన మనిషి గురించి ఆ రాత్రంతా ఆలోచించాడు. తనతో చాలా సాయాలు పొందిన బంధువులే ఈవేళ తప్పించుకు తిరుగుతున్నారు. అలాంటిది ఎవరీ మనిషి.

*

రాత్రి వర్షం కురవడం వల్ల నేలంతా చితచితలాడ్తుంది. గాలాడ్డం లేదా పొద్దుటిపూట. సైకిలుకి కట్టి వున్న పెద్ద వెదురుబుట్టకి తగిలించిన సీవండి గిన్నెల సైకిలువాడూ, ప్లాస్టిక్ సామాన్లు అమ్మేవాడూ, నువ్వుపప్పు జీళ్ళకి పాత ఇనప సామానూ కొనేవాడూ నావ ఎక్కి ఊళ్లో కొస్తున్నారు. అదే నావలో సవరాలు కట్టేవాడూ సూది పిన్నీసులూ, రిబ్బన్లూ అట్టకి కట్టినవాడూ కూడా ఎక్కేరు. నావ వూరి ఒడ్డుకొచ్చి ఇంక ఆగుతున్న టైములో





పరుగు పరుగునొచ్చిన కోడిపుంజు పెట్టని తొక్కేసి వెళ్ళిపో యింది. ఒకపాక మీంచి కిందికి పాకిన గుమ్మడిపాదులో పసుపురంగు గుమ్మడి పువ్వులోకి సీతాకోకచిలక దూరు తుంది. ఆ ఇంటి వెనక రేగుచెట్టు విరగ్గాచి కొమ్మల్ని కిందకి వం చేసింది. భైరవస్వామి గుళ్ళో పూజలు ఘనంగా చేస్తు న్నాడు పూజారిగారు. అది చూసిన చంద్రంనాన్న 'ఒక్క భైరవ స్వామి కేనా ఆ చంద్రుడికి శ్రీరామచంద్రుడికి పూజలు చేసుకునే యోగం లేదా' అనుకుంటా నడుస్తూ గొప్పు తగిలి ముందుకి పడిపోయాడు.

ఎదురొచ్చిన కమలమ్మ అతన్ని లేవదీసి "నీరసంగా వున్నారు ఇంటికి తీసుకెళ్ళనా?" అంది.

"గుడికి.... రాములోరి గుడికి వెళ్ళాలి" అన్నాడు.

తీసుకెళ్ళి అర్చనా అదీ చేయించి ఇంటికి తీసుకొచ్చిన ఆమెని "వూళ్ళో చాలాచోట్ల చూస్తున్నాను. ఎవరు నువ్వు" అనడిగితే తన పేరు తన వూరు గురించి క్లుప్తంగా చెప్పి చివర్లో "అనాధగా మిగిలేనండి చివరికి" అంది.

ఆ తర్వాత అప్పుడప్పుడూ తనింటికొచ్చి చిన్న చిన్న పన్లు చేసెళ్తుంది 'ఏంటిది?' అంటే "మీ గురించి విన్నాను మీరు చాలా గొప్పోరు" అనెళ్ళిపోతుంటే ఆపి "నేను నీకు ఋణపడి వున్నాను. ఏమిచ్చి నీ ఋణం తీర్చుకోవాలి? నా దగ్గర వున్న దంతా అయిపోయింది. నావిప్పుడు ఖాళీ చేతులు" అన్నాడు.

"నేను మీకేది చేస్తున్నా మీ నించి ఏదో ఆశించి మాత్రం చెయ్యడం లేదండి" అంది కమలమ్మ.

"అలా నువ్వు చెయ్యడం నీ సంస్కారం... నా చివరి రోజుల్లో నీకేదన్నా చెయ్యడం నా బాధ్యత" అని లేచెళ్ళి పోయి రెండురోజులపాటు బాగా ఆలోచించిన చంద్రంనాన్న ఆవేళ పొద్దుట రమ్మని కమలమ్మకి కబురుచేశాడు.

వచ్చిన కమలమ్మకి ఒకమాట చెప్పి "ఏవంటావ్?" అన్నాడు.

విన్న ఆమెకి ముందు మాటపడిపోయింది. తర్వాత స్పృహతప్పి పడిపోయింది.

సాయంత్రం మళ్ళీ ఆమెని కల్సి 'కంగారు పడిపోకు' అని తన మనసులో మాట చెప్పాడు.

రెండుమూడు రోజులు పాటు బాగా ఆలోచించిన ఆమె చివరికి ఒప్పుకుంది.

వెంటనే రాములోరి గుళ్ళో పెళ్ళి చేసుకున్నాడు కమలమ్మని.

అది చూసిన వూరి వాళ్ళు పూనకం వచ్చినట్టు ఊగిపోయారు. అతని కళ్ళ ముందు బూతుకానాలు తిట్టడం మొదలెట్టారు 'అదిగాదు నా మాట వినండి' అని చంద్రంనాన్న చెబుతుంటే ఏ ఒక్కడూ వినడం లేదు. అతని పెద్దరికం మొత్తం ఎగిరిపోయింది. ఊరి చరిత్రలో అతనంత చెడ్డవాడు, మోసగాడు ఇంతకు ముందు పుట్టలేదట. ఇక పుట్టరంట.

'ఇక వీళ్ళకి ఎంత చెప్పినా దండగ' అనుకున్న చంద్రంనాన్న చెప్పే ప్రయత్నం చెయ్యలేదిక.

మరో నాలుగురోజులకి అనగా భీష్మ ఏకాదశికి ముందు దశమిరోజున మంచంమ్మీద పడుకున్నవాడల్లా లేచి నేల మీద చాప పరుచుకుని నిద్రపోయిన చంద్రంనాన్న మరింక లేవలేదు.

భీష్మ ఏకాదశి రోజున దహన సంస్కారం జరిపించాలనుకున్నారు. రాజమండ్రి నుంచి హనుమంతు వచ్చేడు.

చంద్రంనాన్న పాడె సుందరంగా తయారైంది. ఆయన అంతిమయాత్ర మొదలైంది. ఊళ్ళోవాళ్ళు, నలుగురు కొమ్ము పడితే మరో పదిమంది కూడా బయలుదేరారు. ఆయనకోసం ఏడ్చినవాళ్ళు ఎవ్వరూ కనపడ లేదు. అంతా నిశ్శబ్దం. ఊరంతా స్మశానానికి తరలి వెళ్ళాల్సింది. పట్టుమని పదిమంది కూడా రాలేదు... కానీ, భీష్మ ఏకాదశి భజన్లు గుడి స్పీకర్లో వినపడుతున్నాయి. భక్తి పాటల్తో మార్మోగిపోతుంది వూరు. చంద్రంనాన్న పాడెని వూరు చివర వంతెన దాటే వరకూ సాగనంపిన భక్తి పాట ఆగిపోయింది. అక్కడికి కొంచెం దూరం పొలాల్లో వున్న ఇంట్లో పెళ్ళి జరుగుతుంటే సన్నాయి మేళతాళాలు మోగుతున్నాయి. చంద్రంనాన్న పాడెని స్మశానంకి ఆహ్వానిస్తూన్నట్టున్నాయి ఆ మేళతాళాలు.

అలా చంద్రంనాన్న రెండుగంటల్లో బూడిదైపోయాడు.


కమ్మలమ్మ చంద్రంనాన్న పెన్షన్‌తో హాయిగా బతుకుతుంది. అసలు ఆమె అలా బతకడం కోసమే ఆమెని పెళ్ళి చేసుకున్నాడు పవిత్రమైన ఆ చంద్రంనాన్న.

*స్వాతి సపరివారపత్రిక*
*13 అక్టోబర్ 2006*





# ఒక అనుభవం... ఒక ప్రారంభం



అతనొక ఫిల్మ్ డైరెక్టర్. పేరు మూల విరాట్.

ఆ మధ్య ఒక రెండురోజులు అతనికి పిచ్చి ఎక్కిందని ప్రచారం చేశారు జనం. కొన్నేళ్ళ నుంచి మూలవిరాట్ తీస్తున్న సినిమాలు ఫ్లాప్ అవుతూ వస్తున్నాయి. అప్పటి వరకూ సంపాయించింది కాస్తా పోయింది. అతని మాట దురుసుతనం కారణంగా జనంలో ఎప్పుడో వచ్చిన చెడ్డపేరు ఇప్పటికీ పోకుండా అలానే ఉండిపోయింది. భవిష్యత్తు మీద భయంతో మనశ్శాంతి కరువైపోయింది.



జరిగిపోయిన రోజుల గురించి తీవ్రంగా ఆలోచించడంతో ఒక రకమైన ఉద్రేకం, చిత్ర విచిత్రమైన భ్రమలూ భ్రాంతులూ అతన్లో ఏర్పడ్డం మొదలెట్టాయి.

దాంతో విచక్షణాజ్ఞానం లేకుండా ఇష్టానికి ప్రవర్తిస్తున్న అతన్ని సేతు మాధవన్ అనే సైకియాట్రిస్ట్ దగ్గరకి తీసుకెళ్ళారు. చాలాసేపు అతనితో మాట్లాడిన మాధవన్ "మీకు ఏర్పడ్డ ఈ మానసికవ్యాధి స్కిజోఫ్రెనియాలా అన్పిస్తోంది. ప్రారంభదశలోనే వుంది కాబట్టి ప్రమాదం లేదు" అన్నాడు.

"అయితే ఇప్పుడేం చెయ్యాలి నేను?"

"మీకిష్టమైన ప్రదేశానికి వెళ్ళి కొన్నాళ్ళు అక్కడ గడపండి. మీ మనసుకి ఏది బావుంది అన్పిస్తే ఆ పని చెయ్యండి" అన్నారాయన.

"మందులు ఏమైనా వాడాలా?"

"అక్కర్లేదు... మీకేదో ప్రమాదం సంభవించబోతుందనే భయం, అప్పుడప్పుడూ అర్థంపర్థం లేని తాత్విక చింతనా మీలో ఏర్పడుతున్నాయి. వాటిని మీ నుంచి దూరం చేస్తూ మీ చుట్టూ వున్న వాతావరణాన్ని ఫ్రెష్‌గా చూసే ప్రయత్నం చేయండి." పది నిమిషాలసేపు మాట్లాడిన సేతుమాధవన్ ఇదొక థెరపీ అని పంపించారు.

అరకులోయ, గోదావరి- ఈ రెండూ మూల విరాట్‌కి చాలా ఇష్టమైన ప్రదేశాలు. రెండింట్లో ఎక్కడికెళ్ళాలా అని ఆలోచించిన తను కొన్నాళ్ళపాటు గోదావరి ఒడ్డున గడుపుదాం అనుకున్నాడు.

"మా ఏటి ఒడ్డుకు ఎందుకొచ్చారు మీరు?" బాలరాజు అనే వ్యక్తి అడిగినదానికి సమాధానం చెప్పాడు.

"రైలుబళ్ళు, గోదావరీ మీ సినిమాల్లో బాగా కన్పిస్తుంటాయి. అవంటే ఇష్టమా మీకు?"

"ఔను" అన్నాడు మూలవిరాట్.

"ఇక్కడుండి మీకిష్టమైన పనేం చేస్తారు?"

"సాహిత్యం చదువుతాను. సినిమాకి ఒక కొత్త సబ్జెక్ట్ తయారు చేద్దామనుకుంటున్నాను."

"ఈమధ్య మీరు తీస్తున్న సిన్మాలు పరమచెత్తగా వుంటున్నాయి. మంచి కథ రాసి మంచి సిన్మా తీయండి" అన్నాడు బాలరాజు.

"ప్రయత్నం చేస్తాను" అన్నాడు మూలవిరాట్.

"కొన్ని ఏళ్ళ క్రితం ఇక్కడ ఒక దివాణం వుండేదట. ఈ గట్టుమీద కొంత దూరం నడిచి వెళ్ళితే పడిపోయిన పాటిమట్టి గోడలు ఇప్పటికీ వున్నాయి. పాతకాలం వాళ్ళు చెప్తే విన్నాను. ఆ కాలంలో ఒక ప్రేమకథ జరిగిందట కోటలో. వింటారా?"

"చెప్పండి."

"ఇప్పుడు కాదు, రేపు సాయంత్రం వచ్చి చెప్తాను" అని దూరంగా కొబ్బరితోటల మధ్య ఉన్న వాళ్ళ ఊరివేపు వెళ్ళాడు బాలరాజు.

ఆ ఊరిని అనుకుని ఉధృతంగా ప్రవహించే గోదావరిలోంచి ఒక పాయగా విడిపోయిన కాలువ అది. కాలువ గట్టుకి కుడిపక్కనున్న వంద ఎకరాల పొలాలు ఊరి దేవుడు వేణుగోపాలస్వామి మాన్యం అంట. అంతా నీటితో నిండిపోయి వుంది. నాలుగు ట్రాక్టర్లు నీళ్ళతో నిండిన ఆ పొలంలోకి దిగబడి దున్నుతుంటే, కాకులు వలయాకారంలో తిరుగుతున్న ట్రాక్టర్ల చుట్టూ తిరుగుతున్నాయి.

రైతులు గట్లమీద తిరుగుతూ అవతలిగట్టు మీదున్న వాడికి వినబడ్డం కోసం ఫాల్స్‌వాయిస్‌తో అరుస్తూ చెప్తున్నారు. గట్టుకి ఎడంపక్క నాలుగైదు ఇటుకబట్టీలున్నాయి. బట్టీ కళ్ళాల్లోకి దిగిన కూలిజనం ఉలుకూ పలుకూ లేకుండా పచ్చి ఇటుక తీస్తున్నారు. గోదావరికాలువలో ఇసుక, ముగ్గూ మోసుకెళ్తున్న తెరచాప పడవలు ముందుకి ప్రయాణం చేస్తున్నాయి.

సాయంత్రం అవుతోంది. గాలిలో వేగం పెరుగుతోంది. వస్తానన్న స్కూలు టీచర్ బాలరాజు జాడలేదు.

అతనికోసం చూసి చూసి ఇంకాస్త ముందు కెళ్లేసరికి అంతసేపు కనిపించిన ఆ దమ్ముచేలు మాయమై కనిపించాయి. వందల ఎకరాల్లో వున్న కొబ్బరితోటలు. పగలే చీకటిగా వుండే ఆ చిక్కని తోటలు దాటి ఒక మైలు వెళ్ళేసరికి పెద్ద మైదానం ఎదురైంది. దానికి ఈశాన్యం మూల విశాలమైన ఒక ప్రదేశంలో కనిపించాయి పడిపోయి వున్న కొన్ని గోడలు.

నెమ్మదిగా వాటి మధ్యలో కెళ్ళాడు మూలవిరాట్. వీస్తున్న గాలి శిథిలమైన ఆ గోడల మధ్యలోకి దూసుకుంటూ వెళ్తుంటే ఈలు శబ్దాలొస్తున్నాయి.

బాలరాజు చెప్పిన ఆ దివాణం గోడలు ఇవే. బహుశా ఈ మైదానమంతా ఒక పెద్ద దివాణంతో నిండిపోయి వుండాలి ఒకప్పుడు. రాజులు అంబారీల మీదా, రాణులు పల్లకీల మీదా ఈ ప్రాంతమంతా సంచరించి వుంటారు. ఆటవెలదుల నాట్యాలూ, రుద్రవీణల మీద దర్బారీ ఆలాపనలూ ఇక్కడే చేసి వుండొచ్చు.

గతాన్ని ఊహించుకుంటూ ఆ శిథిలాల మధ్య సంచరిస్తున్న మూలవిరాట్‌కి ఆ గోడలకి సుదూరంగా కొలను ఒకటి కనిపించింది. అక్కడికెళ్ళాడు. గోదావరి కాలువ పక్కనే వున్న ఆ కొలను దాదాపు ఎకరం నేలలో వుంది. కొలను ఒడ్డునే కూర్చుని, దాంట్లో పాడయి పచ్చబడిపోయి వున్న నీళ్ళని చూస్తున్న అతనికి మాటలేవో వినిపించి తలెత్తి చూశాడు.

ఒడ్డుకి అప్పుడే వచ్చి ఆగింది అందమైన గూటి పడవ. చాలా అందంగా వున్న ఒక అబ్బాయీ, అమ్మాయీ ఆ గూటి పడవలోంచి దిగి నెమ్మదిగా కొలను ఒడ్డుకొచ్చి ఓ మూల కూర్చున్నారు.

అతనికి వాళ్ళు కన్పించేలాగా, వాళ్ళకి తను కనపడకుండా కొలనుకి దూరంగా వున్న ముసలి వేపచెట్టు వెనకాల కూర్చున్నాడు.

చాలాసేపయింది. అందమైన సూర్యుడు అందంగా కూర్చుని వున్న వాళ్ళ వెనుక నుంచి అస్తమించాడు.

వాళ్ళనే చూస్తున్న మూలవిరాట్ కళ్ళు మూసుకుని ఆలోచించడం మొదలుపెట్టాడు.

చీకటి ఎప్పుడు పడిందో అతనికి తెలీదు. భుజంమీద ఎవరో తడితే కళ్ళు తెరిచాడు.

లాంతరూ, కర్రతో వచ్చిన చెవిటి పాలేరు. 'గట్టంతా మీకోసమే వెతుక్కుంటూ వస్తున్నాను. మీ బంధువు లంతా కంగారు పడ్తున్నారు. పదం'డని లేపుకు తీసుకెళ్లాడు మూలవిరాట్‌ని.

ఆ ఏటిగట్టు దిగువన పాతకాలం ఒంటరి మేడ ఒకటి వుంది. ప్రస్తుతం అతను వుంటున్నది అందులోనే. భోజనం అయ్యాకా మేడ వెనుక తులసికోట పక్కనే మంచం వేశారు. గాలి వేగం పెరుగుతోంది. నల్లగా మూసేస్తు న్నాయి ఆకాశంలో మబ్బులు.

అతి స్వచ్ఛమైన, ప్రశాంతమైన ఆ వాతావరణం మధ్యలో వున్న అతన్లోంచి గత అనుభవాలన్నీ ఆకాశం లోకి మబ్బుల్లా పారిపోతున్నాయి.

సినిమా ప్రపంచాన్నీ, ఆ ప్రపంచంలో 'ఇదిగో పువ్వు పూసింది అంటే అబ్బే ఎప్పుడో దానికి పురుగు పట్టేసింది' అనే కథలు సృష్టించే జనాన్నీ, వాళ్ల మధ్య అనుభవాన్ని మర్చిపోగల్గుతున్నాడు.

ఏమీ లేకుండా హీనమైన స్థితిలో వున్నాడు. రేపెలా గడుస్తుందో, రేపేం జరుగుతుందో లాంటి బీభత్సం మనసులో ఏర్పడ్డం లేదు. ఎలాంటి శంకలూ, సందేహాలూ పట్టి పీడించడంలేదు. గతంలోలా ఏ శక్తులూ అతన్నిప్పుడు శాసించడం లేదు. సాధించడం లేదు.

పండు వెన్నెల కురుస్తున్న గోదావరి మధ్య పల్లవిస్తున్న వనంలో నేనున్నాను అన్న అనుభూతితో అతను ఉక్కిరిబిక్కిరి అయిపోతున్న క్షణాలవి.

తూర్పుగాలీ, తరువాత వర్షం మొదలయ్యాయి. క్షణాల్లో అవి విజృంభించడంతో లోపల గదిలోకి తీసుకెళ్ళి పడుకోమన్నారు బంధువులు.

కిటికీ ఊచల మధ్యలో దూసుకొస్తున్న వర్షం తుంపర్లు. అపూర్వమూ, అద్భుతమూ, అమలినమూ అయిన అనుభూతితో వర్షం కురుస్తున్న ఆ చీకటి రాత్రిని చూస్తూ ప్రశ్నించుకున్నాడు. దెబ్బతిన్న ప్రతివాడి జీవితంలోనూ ఇలాంటి అనుభవం ఒకటుంటే వాడెందుకు మళ్ళీ పునర్జన్మించడూ? అని.

చాలాసేపు గడిచింది.

అవి ఆగిన కాస్సేపటికి పెట్రోమాక్స్ లైటుతో దిగాడు బాలరాజు. అతని భుజాన టీ ఫ్లాస్క్, చేతిలో గొడుగూ వున్నాయి. మట్టిబాటంతా తొక్కుకు రావటం వల్ల బురదతో వున్నాయి కాళ్ళు.

"ఈ సాయంత్రమంతా మీకోసం చూశాను" కాళ్ళు కడుక్కుని లోపలికొచ్చిన అతనితో అన్నాడు మూలవిరాట్.

"మీకు చెప్పిన టైముకి వద్దామనే అనుకున్నానండి. దేశంలో రోడ్లు వెడల్పు చేస్తున్నారట కదా, సర్వేయర్ జనంతో వచ్చి పిడబ్ల్యూడి వాళ్ళ స్థలంలో వున్న మా స్కూలు పడగొట్టించేశాడు. ఇంతసేపూ అక్కడుండటం వలన ఆలస్యమైపోయింది" అన్నాడు బాలరాజు.

సాయంత్రం తను ఆ కోటగోడల మధ్యకి వెళ్లిన విషయం. అక్కడ ఊహించుకున్న దృశ్యాన్ని, చూసిన జంటని గురించి చెప్పాడు. టీ పోసిన గ్లాసు తనకిచ్చిన బాలరాజు చెప్పడం మొదలుపెట్టాడు.

"వరహాల రాజుగారి ఆఖరి కూతురయిన శివాన్విత గది దివాణం రెండో అంతస్తులో ఒక మూలనుంది. ఇక తెల్లవారుతుందనగా దివాణానికి అంచునే వున్న గోదావరికాలవలో చిన్న నావ ఒకటి వెళ్లిపోతుంది. మళ్ళీ సూర్యాస్తమయం అయ్యే సమయానికి వెనక్కి తిరిగి వచ్చేస్తుంది.

"తెరచాప కట్టిన ఆ చిన్నినావలో క్రిష్ణుడు వుంటాడు. ప్రతిరోజూ చేపలవేటకి వెళ్ళే క్రిష్ణుడు చాలా అందగాడు. వాడంటే చాలా ఇష్టం శివాన్వితకి. వెన్నెల రాత్రుళ్ళలో కేవలం శివాన్విత కోసమే తన నావ నడుపుకుంటూ దివాణం వైపు వచ్చే క్రిష్ణుడికి ఆమె అంటే ప్రాణం. అతని నావ ఆ అమ్మాయి గది దాటి వెళ్తున్న సమయంలో ఆమె గది కిటికీలోంచి దూసుకుంటూ వచ్చే పావురం, నావ తెరచాప కొయ్యమీద ఆగి కొన్ని క్షణాల తర్వాత ఎగిరెళ్ళిపోతుంది.

"కొన్నాళ్ళ తర్వాత ఒక పౌర్ణమిరాత్రి తన పెంపుడు పావురం కాళ్లకి ఒక ఉత్తరం కట్టి పంపించింది. 'మా దివాణంలో వాళ్లంతా రేపు తెల్లవారుఝామున సవారీ బళ్ళమీద పెళ్ళికి వెళ్ళిపోతున్నారు. ఎర్ర కలువలు పూచే కొలను దగ్గరకి రాకూడదా?' అని రాసుంది.

"దివాణానికి దూరంగా వున్న ఆ చెరువు దగ్గరికి వెళ్లాడు క్రిష్ణుడు. కలుసుకున్న ఇద్దరి మధ్య మౌనంగా కొన్ని గంటలు గడిచింది. సుళ్ళు తిరుగుతూ వీస్తున్న గాలిలో సంగీతం వినిపించింది.

"వెన్నెల కురిసే సమయం తొందరగా వచ్చేసింది. కాలవలో నీళ్ళు ప్రశాంతంగా ప్రయాణం చేస్తున్నాయి. కొబ్బరిచెట్ల ఆకులన్నీ ఒకేసారి కదిలి వింజామరలు విసరడం మొదలెట్టాయి.

"ఆరోజునుంచీ అవకాశం దొరికినప్పుడల్లా అదే కొలను ఒడ్డున కలుసుకోవడం మొదలుపెట్టారు.

"అంత పెద్ద కొలనులో అక్కడొకటి అక్కడొకటిగా పూచే ఎర్ర కలువలకి వాళ్ళిద్దరి కలయికతో వింత సౌరభం ఏర్పడ్డం వల్ల కొన్నాళ్ల గడిచేసరికి, కేవలం కలువలు తప్ప నీళ్లసలు కనిపించనంత చిక్కగా పూయడం మొదలెట్టాయి ఆ కొలనులో.

"దివాణంలో కొమ్ముల గేదె ఈనితే మిరియాలతో జున్ను చేశారు. గాలులు విపరీతంగా వీస్తున్నాయి. ఆకాశంనిండా నల్లమబ్బు నిండి వుంది. చాలా చీకటయింది.

"తన కోసం ఎదురుచూస్తున్న క్రిష్ణుడి కోసం ఒక ఇత్తడి గిన్నె నిండా జున్ను పెట్టుకుని బయల్దేరింది శివాన్విత. కొలను గట్టున కూర్చున్న ఇద్దరూ ఆ జున్ను తిన్న కాస్సేపటికే మరణించారు.

"గాలిలో పెరిగిన వేగానికి కాస్సేపట్లో తీవ్రమైన వర్షానికి ఆ ప్రాంతంలో వున్న రెల్లుగడ్డి ఇళ్ళు కొట్టుకు పోతున్నాయి. కొబ్బరి చెట్లు మెలితిరిగిపోతున్నాయి. సపోటా చెట్లు, జామచెట్ల అందమైన కొమ్మలు పెళపెళా విరిగి పోతున్నాయి. దగ్గర్లోవున్న పనసచెట్టు, పొన్నచెట్టూ వేళ్ళతో సైతం పెకిలించుకుని నేలమీద కూలిపోయాయి. గోదావరి పొంగడం వల్ల ఆ ఏటి గట్టంతా మునిగిపోవడం మొదలుపెట్టింది.

"వరదలో పడిన పశువులూ, మనుషులూ పొలికేకలు వేస్తూ కొట్టుకుపోతున్నారు. అలా ప్రారంభమైన తుఫాను వారంరోజుల వరకు వదలకుండా బాధించి ఆ తర్వాత శాంతించింది. కొన్నాళ్ళకి వరహాలరాజుగారు చనిపోయారు. వాటాలకి వచ్చిన ఆస్తుల్ని అమ్ముకుని కొడుకులంతా తలో మూలకీ వలస వెళ్ళిపోయారు.

"చీకటి నిండివున్న దివాణంలోకి గబ్బిలాలు రావడం మొదలుపెట్టాయి. గోడలు పగిలి రావిమొక్కలు మొలిచాయి. పడిపోయిన ప్రహారీ గోడల మధ్య తిరుగుతున్న పాములు కొన్నాళ్ళకి దివాణం లోపలికి వెళ్ళి పోయాయి. ఆ జంట కలయికకి సంబరపడిపోతూ నిండా పూసిన ఆ కొలనులో కలువపూలన్నీ చచ్చిపోవడంతో స్వచ్ఛమైన నీళ్లన్నీ పాడయి పచ్చగా మారిపోయాయి. ఆ రాజు దివాణం ఇప్పుడు శ్మశానంగా మారిపోయింది. గతం మాత్రం ఒక చరిత్రగా మిగిలిపోయింది."

చెప్పడం పూర్తి చేసిన బాలరాజు ఆ రాత్రిపూటే వెళ్ళిపోయాడు.

అతను చెప్పిందంతా విన్న మూలవిరాట్ ఆ రాత్రంతా జాగరణ చేస్తూ ఆలోచించాడు. తెల్లవారురఝాము నెప్పుడో వర్షం మళ్ళీ ప్రారంభమైంది. ఈదురుగాలులూ, వర్షం జల్లూ కిటికీలోంచి లోపల కొస్తున్నాయి. ఒక కొత్త స్క్రిప్టు వెంటనే మొదలెట్టాలనుకున్న అతను ప్రారంభం ఇలా అనుకున్నాడు.


చాలా ఏళ్ళు గడిచిపోయాయి.

ఒక చల్లని సాయంత్రం ఆ గోదావరి కాలవ ఒడ్డుకి అందమైన గూటిపడవ ఒకటొచ్చి ఆగింది. అందు లోంచి దిగిన ఒక అందమైన అబ్బాయీ, అమ్మాయీ శిథిలమైపోయి జీర్ణమైపోతున్న దివాణం గోడలు తొక్కు కుంటూ కొలను ఒడ్డునున్న చిలకలు వాలిన జామచెట్టు కింద కూర్చున్నారు.

వాళ్లలా కూర్చున్న మరుక్షణం ఒక వింత కదలిక ఏర్పడిందా కొలను నీళ్లలో.

పాడైపోయిన నీళ్లతో నిండి వున్న ఆ కొలనులోంచి రెండే రెండు ఎర్రటి కలువమొగ్గలు ఆనందంగా పైకి లేచాయి.

*స్వాతి సపరివారపత్రిక*
*31 అక్టోబర్ 1997*




రాజహంసలు

"ఇవ్వాళ పౌర్ణమి" అన్నాడు కొండూరి రామరాజు.

"అయితే రాత్రి తొమ్మిది దాటేకానే మనం వెనక్కొచ్చేది" అన్నాను నేను.

అప్పుడే తెల్లవారింది. పల్లెగాలి పీల్చుకుంటా యానాం ఫెర్రీ రోడ్డు మీంచి నడుచుకుంటా రేవు దగ్గరున్న కుంచనపల్లి సుబ్బారావు హోటల్ దగ్గర కొచ్చాం. "పెసరట్టు రడీ అయ్యిందాండీ?" ఆ హోటల్లో మనిషి నడిగేడు రామరాజు.

"పిండిరుబ్బాలి... ఇంకో అరగంట పడద్దండీ" అన్నాడా మనిషి.

"అయితే అలాగ రేవులో కెళ్ళొస్తాం... అల్లప్పచ్చడి చాలా బాగుండాలివ్వేళ" అనేసి నా వేపు తిరిగి పదమన్నాడు రామరాజు.

మేం నడుస్తున్నాం ముందుకి. మీరాసాహెబ్ దర్గా పక్కనే నడింపల్లి అశోక్‌రాజుగారి గౌతమీబార్ (ఆ చిన్న బ్రాందీకొట్టు పేరు), వెల్డింగ్‌షాపూ, అద్దంకోరి కిళ్ళీకొట్టూ, దూలిపూడి సీతా రామయ్య కిళ్ళీకొట్టూ మూసేసి ఉన్నాయి. ఫంట్ ఎక్కి అవతలి ఒడ్డుకి వెళ్ళడానికి ఆటోల్లోంచి, టూ వీలర్స్ మీంచీ, అంబాసిడర్లు, మారుతీవేన్‌ల్లోంచీ దిగుతున్నారు జనం. రామరాజూ నేను గోదావరి గట్టుకి ఎడం పక్కనున్న కొబ్బరితోటలో నడుస్తున్నాం. చెట్లమీంచి దించిన కొబ్బరిబొండాల గెలలు రెండెడ్ల

బళ్ళ మీద వేసుకెళ్తున్నారు. తోటమధ్య నిన్నెప్పుడో ఇటిక కాల్చినట్టున్నారు. చల్లారిన ఇటుకని ఒడ్డున ఆగున్న నావలోకి మోస్తున్నారు. రాత్రంతా గోదావరిలో చేపల వేటకెళ్ళిన నావలు వెనక్కి తిరిగి వస్తున్నాయి. లాంచీల జాడ మట్టుకి ఎక్కడా కనపడ్డం లేదు. దూరంగా నీళ్ళలో వెళ్తున్న ఇంజను నావ మనిషి "ఏవండీ రాజుగారూ బాగున్నారా?" అని అరుస్తా పలకరించేడు రామరాజుని.

అతనికి సమాధానం చెప్పేక నా వేపు తిరిగిన రామరాజు "అతని పేరు గంజా సీతారావుడు. మనకి తెల్సులే" అంటూ దూరం నించి వస్తున్న ఇంకో ఇంజను నావని చూపిస్తా "అది విత్తనాల అబ్బులు నావ. సినిమా వాళ్ళు ఇక్కడి కొస్తే ఎక్కువగా ఇతని నావనే వాడతారు" అన్నాడు.

ఇంకొంచెం దూరం నడిచిన తర్వాత "చావు బందలంక తెల్సా. చుట్టూ నీళ్ళ మధ్యనున్న లంకలో ఊరు. నువ్వు మళ్ళీ వచ్చినప్పుడు ఓ ట్రిప్పు వెళ్ళొద్దాం" అన్నాడు.

గాలి మంద్రంగా వీస్తుంది. సూర్యుడు పైకి లేస్తున్నాడు. ఆ వెలుగులో చూస్తుంటే ఎడం పక్కంతా గోదావరి, కుడిపక్క పచ్చటి చెట్లూ పొదలూ పాదులూ. అందులో ఆకుపచ్చ, లేతపచ్చ, ముదురుపచ్చ, ఏ పక్క చూసినా పచ్చదనమే. మొత్తమంతా పచ్చదనమే. మొకం మొత్తే పచ్చదనం. "పద ఆ సుబ్బారావు హోటల్లో మనిషి చెప్పిన టైమయ్యింది" అన్నాడు. గట్టు దాటుకుంటూ హోటలు ముందుకొచ్చేసరికి ఫలహారాలారగిస్తున్నారు జనం. వాళ్ళ మధ్యలోంచి లోపలికెళ్తే పెనం మీద కాల్తున్న పెసరట్ల మీద ఉల్లిపాయముక్కలూ పచ్చి మిరపకాయ ముక్కలూ అల్లం జీలకర్రా జల్లేక చుట్టూ ఆవునెయ్యేసి ఒకో అట్టు తిరగేస్తుంది ఒక ఆడమనిషి. కమ్మటి వాసన. ఒక కుర్రోడు ఆవిర్లొస్తున్న ఇడ్లీల వాయ తీస్తున్నాడు. పన్నెండేళ్ల పిల్ల రోట్లో రుబ్బిన అల్లం పచ్చడి అల్యూమినియం దాకలోకి లాగుతుంది. జనం పెరగడంతో ముందేసిన బల్లలమీద కూర్చోడానికి చోటు దొరక్క నిలబడే నేతి పెసరట్లూ, వేడి ఇడ్డెన్లూ తిని, మీగడేసిన త్రీ రోజెస్ స్ట్రాంగ్ టీ తాగి డబ్బులిచ్చి బయటికొచ్చేం.

కొంచెం ముందుకి నడిస్తే కనిపించింది పులుపు తాతారావు కిళ్ళీకొట్టు. పాత పాటలు ఇష్టమనుకుంటాను అతనికి. ఈ మధ్య రిలీజ్ అయిన ఘంటసాల, నాగేశ్వర్రావు హిట్‌సాంగ్స్ కేసెట్టు తెగ మోగిపోతుంది. నీలికురుల వన్నెల జవరాలా... పాట ఎప్పుడు విన్నా ఏవో తియ్యటి జ్ఞాపకాల్లోకి వెళ్ళిపోతాం. అలాంటిది మనిషిని కుదిపేసేలా గాలి వీస్తున్న ఈ గోదారి వడ్డున వింటుంటే వెనకటి రోజుల్లో కెళ్ళిపోయేను. అక్కడో పేకెట్ సిగరెట్లు కొనుక్కున్న రామరాజు దగ్గరకొచ్చేరు లెక్కల గణపతిగారు. ఆయన యానాం స్కూల్లో మేష్టరేగాకుండా స్టేజి నటుడు కూడానట. స్కూలయ్యేక ఊళ్ళో కట్టిన షిర్డీ సాయిబాబా గుళ్ళో ఎక్కువసేపు గడుపుతున్నాడట. నన్ను చూసి "ఈయనెవరు?" అన్నాడు.

"నా బాల్య మిత్రుడు. కొన్నాళ్ళపాటు ఇక్కడుందామని వచ్చేడండి మెద్రాసు నించి. ఈడికి గోదావరంటే ఇష్టం లెండి" అంటూ చెప్పేడు.

వాళ్ళతో అదీఇదీ మాటాడుతుండగానే ప్రశాంతంగా ఉన్న వాతావరణంలో మార్పొచ్చేసింది. నల్లటి మబ్బుల్తో మూసుకుపోయింది ఆకాశం. తూర్పు గాలులు సుళ్ళు తిరుగుతూ వీస్తున్నాయి. అలా కాసేపు

గడిచిందో లేదో వచ్చిన మబ్బులు వచ్చినట్టే వెళ్ళిపోయాయి. గాలి ఆగిపోయింది. మళ్ళీ మామూలే. గోరువెచ్చటి ఎండ. నీలం రంగు ఆకాశం.

టైము పదకుండు దాటేసింది.

"ఇవ్వేళంతా ఈ రేవులోనూ అవతలి రేవులోనూ గడుపుదామని వచ్చేం. మరి వెళ్తావండి" అన్నాడు రామరాజు.

ఇద్దరం దిగువలో కొచ్చేసరికి గోదావరి ఒడ్డున నీళ్ళలో తేల్తున్న ఆ ఫంట్ మీద రాజహంస అని రాసుంది. అంత పెద్ద ఫంట్‌ని నేనెప్పుడూ చూడలేదు. బహుశా గోదావరి పుట్టిన త్రయంబకం నించి ఇక్కడి వరకూ ఇంత పెద్ద ఫంట్ ఎక్కడా ఉండి ఉండదేమో. చాలా పవర్‌ఫుల్ ఇంజనుతో ఉన్న ఆ ఫంట్ మీద రకరకాల జనం. సైకిళ్ళు, మోటారు సైకిళ్ళు, అంబాసిడర్, మారుతీ, జెన్ రకరకాల కార్లు. కొందరయితే రోడ్డు మీంచి సరాసరి ఫంట్ మీదికెక్కేసి డ్రైవింగ్ సీట్లోంచి దిగడం లేదు. కాకినాడ హోల్‌సేల్ కొట్లో పిండీ నూనే కొనుక్కోడానికి అటుపక్క పల్లెటూళ్ళనించి టూ వీలర్ మీదొచ్చిన ఒక షావుకారు పెరిగిపోతున్న రేట్ల గురించి మారిపోతున్న కాలం గురించీ ఒకటే మాటాడ్తున్నాడు. తాళ్ళరేవులో రొయ్యల సీడ్ కొని అవతలొడ్డు కెళ్తున్న ఒక రాజుగారు వింటున్నాడు.

ఇంకా రకరకాల జనం ఎక్కుతున్నారు. వాళ్ళ కబుర్లలో రకరకాల కథలూ వ్యధలూ కష్టాలూ నష్టాలూ ఇష్టాలూ నిష్టూరాలూ నిందలూ అపనిందలూ నీలాపనిందలూ ఇలా ఒకటేంటి వంద.

బయల్దేరింది రాజహంస.

కుడిపక్కనున్న కోటిపల్లి మీంచీ, ఎడం పక్కనున్న ధనియాలతిప్ప నించీ వీస్తున్న గాలి ఉధృతంగా వుంది, అద్భుతంగా ఉంది. ఏ మలినంలేని గాలి. చెంపల్నీ, శరీరాన్ని హెయిర్‌డ్రై వేసిన జుట్టునీ తాకుతా పోతుంది.


సరంగు గంజా శ్రీను చిరంజీవి పాటలు పెట్టేడు. టేపు బాగా అరిగిపోవడంతో పాట శృతి మారిపోయింది. బాలసుబ్రమణ్యంగారి ఓకల్‌కార్డ్స్‌కి తేడా చేసినట్టుంది టోను.

చుట్టుతిరిగి వెళ్తుంది రాజహంస.

"తిన్నగా వెళ్ళొచ్చు కదా?" అంటే, "అదంతా మెరక. అలాగెళ్తే ఫంటు కిందున్న ఫేన్లకి ఇసక తగిలేస్తదండి" అన్నాడు ఇంకో సరంగు అయిన పెసింగి సత్యనారాయణ.

ముందుకెళ్తున్న మాకు నిండా జనాన్ని నింపుకుని ఎదురొచ్చింది ఇంకో ఫంట్. "దాని పేరు కూడా రాజహంసే నంట. బహుశా బాపూ రమణల అందాలరాముడు సిన్మా చూసి పెట్టుంటారు ఈ పేర్లు... పందెం" అన్నాడు రామరాజు.

హాయిగా జాయ్‌జాయ్‌గా ముందుకెళ్తుంది మేమెక్కిన రాజహంస. జనం మధ్యలో కొచ్చిన ఒక ముసలాయన చేతిలో ఉన్న కాకీ సంచిలోంచి జంతికల్నీ, కొబ్బరి ఉండల్నీ తీసి మాకు చూపిస్తా "తీసుకోండి బాగుంటాయి... పెద్ద రేటేం గాదండి" అంటున్నాడు.



వాళ్ళది ముమ్మిడివరమంట. కొడుకులు చూడకపోడంతో ఈ వయసులో భార్య ఈ వస్తువులన్నీ చేసి ఇస్తుంటే ఈ ఫంట్ ఎక్కి అమ్ముకుంటున్నాడంట ఆయన. "ఈ గోదారితల్లే... మాకింత ముద్ద పెడ్తుంది బాబూ!" చాలా బాధగా నీరసంగా ఆయన అంటుంటే జాలేసింది.

కాస్సేపయ్యింది. రాజహంస ఎదుర్లంక రేవులో కొచ్చింది .

మేం ముందు దిగాలంటే మేం ముందు దిగాలని పోటీ పడతా ఫంట్ మీంచి ఒడ్డు మీదకి దూకుతున్న జనం, ఆగి ఉన్న అమలాపురం బస్సు దగ్గరకీ ఆటోల దగ్గరకీ పరుగెడ్తున్నారు. మోటారు సైకిళ్ళవాళ్ళు వాటిని స్టార్ట్ చేసుకుని ఐ.పోలవరం వేపు వెళ్ళేవాళ్ళు తిన్నగా, అమలాపురం వెళ్ళేవాడు కుడిపక్కగా వెళ్తున్నారు. ఇక దిగిన కార్లూ వేన్లూ కూడా అంతే. ఆ జనం మధ్యలో కొచ్చిన ఎక్సైజు పోలీసులు యానాం నించి లిక్కరు స్మగుల్డు చేసే జనం ఎవరన్నా వున్నారా అని తనిఖీ చేస్తున్నారు. ఫంట్ ఇలాగ ఖాళీ అయ్యిందో లేదో అటుపక్క కెళ్ళే జనంతో అయిదు నిమిషాల్లో నిండిపోయింది. అది చూసిన కొండూరి రామరాజు "ఈ రాజహంస నిత్యం ఒక నిండు గర్భిణీ. మా తల్లి అందర్నీ అద్దరికి చేరుస్తుంది" అన్నాడు.

ఏ పక్కకి చూసినా పచ్చదనమే. ఎండిన చిన్నముక్క కనపడ్డం లేదు. రేవుకి కుడిపక్కనున్న కనకదుర్గ గుడి దగ్గర కెళ్ళేం. చల్లగా వీస్తుంది గోదావరి గాలి. గుడిలో అమ్మవారి ముందు దీపాలు ఇంకా వెలుగుతున్నాయి. ఆ గుడిని నావల సంఘం, యువజన సంఘం, రేవులో వర్తకసంఘం వాళ్ళంతా కల్సి కట్టుకున్నారంట. ముదునూరి సత్యనారాయణరాజుగారి భార్య సూరమ్మగారు మైక్‌సెట్ ఇచ్చేరంట. అక్కడ కాస్సేపు కూర్చున్నాక రేవుని ఆన్చి ఉన్న మన్యం నారాయణరావుగారి కాఫీ హోటల్లో కెళ్తే సీవండి పళ్ళాల్లో పెసర పొణుకులూ మసాలా వడలూ పకోడీలూ లాంటివి పెట్టి ఉన్నాయి. జనంతో ఒకటే రద్దీగా ఉంది హోటలు. టీ తాగేక ఆ నారాయణరావు దగ్గరకెళ్ళిన రామరాజు "మేం ఫలానా అండీ. సాయంత్రం దాకా ఈ రేవులో ఉందామని వచ్చేం. మధ్యాన్నం భోజనం దొరుకుద్దాండీ మీ హోటల్లో" అనడిగేడు.



"మా ఒటేల్లో ఒకప్పుడు భోజనం పెట్టేవాళ్ళవనుకోండి. ఇప్పుడు మానేసేవండీ" అన్నాడాయన.

బయటికొచ్చి ఆ హోటలు అవతలున్న గాలి వెంకటేశ్వర్లు హోటల్లో కెళ్ళేం. అక్కడకూడా రద్దీగానే వుంది.

రామరాజు అడిగితే "మా హోటల్లో భోజనం ఉండదండి. ఎక్కడ్నించో వచ్చేం అంటన్నారు గాబట్టి మీ కోసం ఏర్పాటు చేస్తాం. ఎంతమందీ?" అన్నాడు వెంకటేశ్వర్లుగారు.

"ఇద్దరమే" అని చెప్పి బయటికొచ్చేం.

మరచాని ఏసు బ్రాంచి సైకిలు షాపు దగ్గరా, గాదిరాజు వెంకటపతిరాజుగారి టెలిఫోన్ బూత్ దగ్గరా తెలిగొండి సత్తిబాబు కిళ్ళీకొట్టు దగ్గరా జనం. జంపన మధురాజుగారి కిళ్ళీకొట్టు దగ్గరైతే ఎక్కువమందున్నారు. రేవులో బంకు లేకపోవడంతో పెట్రోలు కూడా అమ్ముతాడట మధురాజు. అతనమ్మే ఆ పెట్రోలు ఆటో వాళ్ళు ఎక్కువ కొంటారంట. ఇంకా కొండేపూడి శ్రీనివాసరావు టైలరింగ్ షాపూ, రామవరపు సత్యన్నారాయణ మంగలిషాపు, రాచకొండ సుబ్బారావు కిరాణా అండ్ కూరగాయల కొట్టూ, కట్టా నర్సిమ్మూర్తి కిళ్ళీ అండ్ కిరాణా కొట్టూ ఉన్నాయక్కడ. ఎక్కడ చూసినా నదిలో జలంలాగ జనం. ప్రతి మనిషిలోనూ హుషారే. వాళ్ళ అరుపుల్తో పాటు ఆటోల్లో జనం కేకలు, అద్దెకి నిలబెట్టిన పాత అంబాసిడర్ కార్ల హారన్లు. మధ్యలో ఒకటీ అరా పాతకాలం జట్కాబళ్ళ ముసలిగుర్రాల సకలింపులు, తిరునాళ్ళలో వాతావరణం కంటే గొప్పగా ఉందక్కడి వాతావరణం.

గాలి వెంకటేశ్వర్లు హోటల్లో గోదావరి తల్లిని చూస్తా చక్కటి భోజనం చేసి బయటికొచ్చేం.

ఎత్తైన ఏటిగట్టు మీంచి దిగువకొచ్చి ఆగిన ఒక ట్రాక్టరు వెనక తొట్టిలోంచి దిగేరు పెళ్ళి జనం. ఎక్సైజు పోలీసుస్టేషన్లోకి చిలకజోస్యం వాడ్ని పిల్చిన కానిస్టేబులు చిలకతో కార్డు తీయిస్తున్నాడు. ఈలోగా దేవుడి ఊరేగింపు వచ్చింది. దేవుడి ఉత్సవ విగ్రహం ఉన్న పల్లకిని ఎడాపెడా ఇద్దరు బోయీలు మోస్తున్నారు. ముందు ఆముదం కాగడా పట్టుకుని ఒక మనిషి. విగ్రహాల పక్కనే నడుస్తా పూజారీ రేవుదాకా వచ్చేకా వెనక్కి తిరిగిన పల్లకీ ఏటి గట్టెక్కి ఊళ్ళో కెళ్ళిపోయింది.

ఆ సందట్లో పడ్డ మాకు తెలీకుండానే సూర్యాస్తమయమైపోయింది.

ఎదుర్లంక రేవు ఒడ్డున నిలబడ్డ మా ఎదురుగా ఉన్న తూర్పునించి సుళ్ళు తిరుగుతా వీస్తుంది చల్లటిగాలి. గుండ్రటి చంద్రుడు వెలిగిపోతా వచ్చేడు ఆకాశంలోకి. *వెండివెన్నెల జాబిలీ నిండు పున్నమిరాతిరీ...* పాట గుర్తు కొస్తుంది. ఆ దుర్గమ్మగుడి అరుగుమీద కూర్చుని ఆ చంద్రుడ్నే చాలాసేపు చూసిన తర్వాత "బయల్దేరదాం ఫంట్ ఆఖరి ట్రిప్పంట" అన్నాడు రామరాజు.

మళ్ళీ మామూలే, రాజహంస నిండా జనం. కార్లూ, వేన్లూ, కెనటిక్ హోండాలు, స్ప్లెండర్లూ మామూలు సైకిళ్ళు. మమ్మల్ని ఆనుకుని నిలబడ్డ ముసలాయన్ని పలకరించేడు కొండూరి రామరాజు. వాళ్ళూరు పిఠాపురానికి ముందు తగిలే చిత్రాడ అంట. వాళ్ళమ్మాయిని కాట్రేనికోన ఇచ్చేరంట. డెలీవరీకి తీసుకెళ్తున్నారంట. తాటిపాక





నించి బయల్దేరిన ఆ నల్లటి సిల్కుచీర అమ్మాయి పేరు ఈశ్వరి. పెద్దాపురం వెళ్తుందంట, పెదవలస నివాసి అయిన ధనలక్ష్మి (అతని పేరు) అనాతవరం అవతల ఆక్వాకల్చరు చేస్తున్నాడంట. కూతుర్ని కాకినాడలో అచ్యుతాపురం గేటు దగ్గర ఇచ్చేడంట. ముండ ఇంద్రపాలెం బ్రిడ్జి డౌన్లో ఉందంట. ఇద్దర్నీ చూడ్డానికి వారానికి ఒకరోజు కేటాయించుకున్నాడంట. ఆళ్ళని చూడ్డంతో పాటు రిలీజు బొమ్మలు కూడా చూసేస్తాడంట. ఆ ధనలక్ష్మి మాటాడ్తుంటే "ఆల్రెడీ బిగించినట్టున్నాడు" అన్నాడు రామరాజు. మధ్యలో కొచ్చిన పొద్దుటి ముసలాయన "చేగోడీలూ చల్లగుత్తులూ బాగుంటాయి తీసుకోండి" అంటున్నాడు. నీటి మీద మంచుపొగలు మెల్లమెల్లగా లేస్తున్నాయి. అంచున కూర్చుని చంద్రుడ్ని చూస్తుంటే దుర్గమ్మ గుడి స్పీకర్లోంచి *నీ వుండేదా కొండపై నేనుండేది నేలపై...* అన్నపాట గాలిలో కల్సి వినిపిస్తుంది.

*

యానాం రేవులో ఆగింది రాజహంస. దిగిన జనం గట్టుమీద ఆగున్న బస్సు దగ్గరకీ ఆటోల దగ్గరకీ టాక్సీల దగ్గరకీ పరుగెడ్తున్నారు. టూ వీలర్సూ ఫోర్ వీలర్సు వాళ్ళు దిగడానికి ఒకటే హడావుడి చేస్తున్నారు. నడింపిల్లి ఆశోక్‌రాజుగారి గౌతమీబారు గోల్డెన్ ఎంటర్‌ప్రైజెస్ అనే ఇంకో చిన్న బ్రాందీ కొట్టు జనంతో వెలిగి పోతున్నాయి. అక్కడ మూగి తాగుతుంది యానాం వూళ్ళో జనం కాదు. గోదారవతల కొమరగిరి, ముమ్మిడివరం, మురమళ్ళ, అనాతవరం, ఇటువేపు కాకినాడ, తాళ్ళరేవు ప్రాంతాల్నుంచి అటు కోలంకా, కుయ్యేరూ, ద్రాక్షా రామం, రామచంద్రపురం ప్రాంతాల్నుంచి వచ్చిన జనం. బ్రాందీకొట్ల ముందు బజ్జీలూ పొణుకులూ గారెలూ వేసే నాగేశ్వర్రావు చాలా హుషారుగా ఉన్నాడు. కాస్త దూరంగా పిడత కింద పప్పు బండి సత్తిబాబు బిజీగానే ఉన్నాడు. రకరకాల లైట్లతో రిలీజైన సినీమా పాటల్తో ధగదగా మెర్సిపోతున్నాయి పొద్దుట మూసి ఉన్న కిళ్ళీ కొట్లన్నీ.

ఆ పౌర్ణమిరోజు, ఆ వెన్నెల్లో, ఆ చల్లగాలిలో దూరంగా వెలుగు వెన్నెల గోదావరిలో అలల మధ్య అక్కడక్కడా ఇళాయిబుడ్లు తగిలించుకున్న వేటనావలు, మిలమిలా మెరుస్తున్న అవతలొడ్డు దీపాలు. అర్ధరాత్రి దాటేదాకా అక్కడే గడిపి వెన్నెల్లో సాగుతున్న మా నీడల్ని మేమే చూసుకుంటూ ముందుకెళ్ళిపోయాం.

ఆ తర్వాత కొన్నాళ్ళు ఆ ప్రాంతాన్నుంచి వెళ్ళిపోయాను.

## 2

1-10-2002 రోజున యానాం ఎదుర్లంక బ్రిడ్జి ఓపెనయ్యిందని పేపర్లో చదివేను. టీవీల్లో చూసేను.

కొండూరి రామరాజు పెద్ద ఉత్తరం రాశాడు. రూటు బస్సులు పడ్డాయంట. కొబ్బరి ఉత్పత్తులూ, కూర గాయలూ, ధాన్యాల ఎగుమతులు ఇప్పుడు చాలా సులువైపోయిందంట. వ్యాపారపరంగానూ విద్యాపరంగానూ చాలా అభివృద్ధి చెందబోతుందంట కోనసీమ ప్రాంతం. ఇలాగ ఎ.క.ఇ. బాలయోగి వారధి వల్ల ఎన్ని లక్షలమందికి ఎన్నెన్ని ఉపయోగాలో చాలా వివరంగా రాశాడు.

కొన్నాళ్ళకి ఒక పని మీద యానాం ప్రాంతాలకి వచ్చిన నేను రామరాజుతో కల్సి రేవులో కొచ్చేను.

ఒకప్పుడు జనంతో ఒకటే సందడిగా ఉన్న రేవు ఇప్పుడు ఖాళీగా పోల్చడానికి వీల్లేకండా ఉంది. కొట్లన్నీ చాలా వరకు మూసేసి ఉన్నాయి. నడింపల్లి అశోక్‌రాజుగారు ఫేమిలీతో అన్నవరం వెళ్ళొస్తుంటే యాక్సిడెంటులో పోయేరంట. ఆ రాజుగారు పోయిన వార్త తెల్సినప్పుడు రేవులో పెద్దోళ్ల కంటే చంటిపిల్లలు ఎక్కువగా ఏడ్చేరంట. గుమస్తా హరనాధరాజు టిక్కెట్ల పాక పీకేసేరు. గంజా నాగూరు ఇంజను నావ ఏదో లోడేసుకుని కోటిపల్లి వేపెళ్తుంది. బేరాల్లేక రావుడి ముసలి గుర్రబ్బండి నీరసంగా నిలబడుంది. రావిచెట్టు కిందున్న ఆంజనేయస్వామి భుజం మీద వాలి అరుస్తున్న మాలకాకీ ఉన్నట్టుండి ఎగిరిపోయింది. కట్టా వెంకటేశులు నావ మాటాడుకుని అవతలున్న ఎదుర్లంక ఒడ్డు కెళ్ళాం.


ఎదుర్లంక రేవుతో పోలిస్తే యానాం రేవు చాలా నయం. ఒకప్పుడు చాలా షాపులున్న కొన్ని చోట్ల పాకలు పీకెయ్యడంతో దుక్కు దున్నేశారు ఆ స్థలాలు గల రైతులు. కొందరు వ్యాపారస్తుల దుకాణాలు మట్టుకి ఖాళీగా అలాగే ఉన్నాయి. ఇంకొందరు బ్రిడ్జి మీది కెళ్తే తక్కినవాళ్ళు చెల్లాచెదురై పోయేరంట. రాజహంసలు ఎక్కడికో వెళ్ళిపోయేయంట. వాటిని నడిపిన సరంగుల చిరునామాలు ఎవరికీ తెలీదంట.

## 3

చెట్టుకీ పుట్టకీ పోయిన జనం ఏదో ఓ దారి చూసుకుని ఏదో ఓ చోట ఈ పాటికి సెటిలై ఉంటారని ఆశపడ్తున్న నేను పడే... అసలు బాధ ఏంటంటే-

ఒకానొక అనుభూతి దూరమైపోయిందనీ... వెన్నెల మైదానంలో తెల్ల ఏనుగు మీద షికారు కెళ్తుంటే సుళ్ళు తిరుగుతా వీస్తున్న పాపికొండల గాలులూ, ఆగాగి ఊగుతున్న అడవి సంపెంగలూ, పసిపిల్లల నవ్వుల్లా రాల్తున్న పారిజాతాలూ నాజూగ్గా నన్ను పలకరించినప్పటి అనుభూతి దూరమైపోయిందనీ... ఆ వెన్నెల మరకల్ని చూసుకుంటూ చేసిన ఆ గోదావరి ప్రయాణం మళ్ళీ కనబడకుండా పోయిందనీ... మాతల్లి గోదారిలో ఆ దారి మూతబడిపోయిందనీ... ఆ గాలిలో కల్సి నాకు మాత్రమే వినిపించిన ఒకానొక గంధర్వగానం శాశ్వితంగా మూగబోయిందనీ.

*స్వాతి సపరివారపత్రిక*





# ది ఎండ్



నది వెనకనున్న కొండల్లో సూర్యాస్తమయం అవుతోంది. అలల అంచున కాళ్ళకి మువ్వలు కట్టిన రెండు ఎద్దులు ఒక గూడు బండిని లాక్కెళ్తున్నాయి. గూడు లోపల వున్న ఆ ఇద్దరు ప్రేమికులూ ఇష్టంగా విషం తాగి లోపల్నుంచే కొండల్లోకి దిగుతున్న సూర్యుణ్ణి చూస్తున్నారు.

అంతసేపూ అలల అంచున ప్రయాణం చేసిన ఆ గూడు బండి మలుపు తిరిగి ఇప్పుడు సరాసరి సూర్యుడి వైపు వెళ్తోంది.

The End



గత రెండున్నర గంటల్నుంచీ నిశ్శబ్దంగా ప్రివ్యూ చూసిన ప్రేక్షకులు ఆడిటోరియంలో నెమ్మదిగా లేచి, థియేటర్ మెయిన్ గేటు దగ్గర నిశ్శబ్దంగా నిలబడి వున్న ఆ తమిళ సిన్మా డైరెక్టర్ అమరన్‌ని 'ఇది మీకు ఫస్ట్ ఫిల్మ్ అంటే నమ్మబుద్ధి కావడం లేదు... ఈ కథకి కరెక్ట్ ఎండ్ అదే. అసలు ఇలా ముగిద్దామనే ఆలోచన మీకు రావడం చాలా గొప్ప విషయం...' అలా రకరకాలుగా అభినందించి వెళ్ళిపోయాక, ప్రొడక్షన్‌వాళ్ళ కారెక్కిన అమరన్, నగరంలో ఆ మధ్యనే కొత్తగా పెట్టిన 'లాండ్‌మార్క్' అనే షాపు కెళ్ళి రెండు మూడురకాల లెటర్‌పేడ్‌లూ, శాండల్ స్టిక్ పెన్‌లూ కొనుక్కుని ఉడ్‌లాండ్స్ డ్రైవ్ ఇన్ రెస్టారెంట్ కెళ్ళి కూర్చున్నాడు.

'ఇక్కడ కావ్యం వుంది. నాయిక లేదు...' రాయడం మొదలుపెట్టిన అమరన్‌కి తర్వాత వాక్యం ఎలా మొదలుపెట్టాలో తోచక ఆ కాయితం చింపేశాడు.

'నువ్వు వస్తానంటావు. బృందావనంలా నా ఒళ్ళో వాలతానంటావు. పురి విప్పిన నీ అధరంతో అందంగా నవ్వుతావు. విరబూసిన నీ నయనంతో విచిత్రంగా ప్రమాణం చేస్తావు... కానీ రావు.' ఆ తర్వాతేం రాయాలో అర్థంగాక మళ్ళీ ఆగిపోయాడు.

ఆ రోజంతా ఏదో విధంగా ఒక ప్రారంభం చేస్తూనే వున్నాడు. ముగింపు వాక్యాలు మాత్రం దేనికీ పలకలేదు. అలా ప్రతిరోజూ ఆ రెస్టారెంట్‌కి వస్తూనే వున్నాడు. తన రాని ప్రేయసి కోసం ఏదో రాస్తూనే వున్నాడు. ఏదీ పూర్తిచేసి పోస్ట్ చెయ్యడం జరగడం లేదు.



ఆ రోజు తన సినిమా తమిళనాడంతా విడుదల కాబోతుంది. నిజానికి ప్రతి కొత్త దర్శకుడికి భవిష్యత్తుని చెప్పే రోజది. సినిమా విడుదలైన ప్రతి థియేటర్ తిరుగుతూ జనం ఎలా రియాక్ట్

అవుతున్నారో గమనిస్తూ ఎగ్జిబిటర్స్‌ని కలుసుకుని సినిమా ఫ్యూచర్ తెలుసు కుంటారు కొత్త డైరెక్టర్లు. ఎవరికీ కనిపించకుండా, ఎక్కడికి వెళ్ళకుండా సరాసరి రెస్టారెంట్‌కి వచ్చేశాడు అమరన్.

కాస్త పెరిగిన గడ్డం, నలిగిన బట్టల్తో ఇలియట్స్ రోడ్‌లో నడుస్తున్నాడు రమణమూర్తి. మూడు నాలుగేళ్ళ క్రితం రెండు మూడు ఫ్లాప్ సినిమాలు తీసిన కళాత్మక భావాలు గల తెలుగు డైరెక్టర్ అతను. రెస్టారెంట్‌కి వచ్చి ఖాళీగా వున్న ఒక టేబుల్ దగ్గర కూర్చున్న రమణకి కన్పించాడు అమరన్. విపరీతంగా ఆలోచిస్తూ టేబుల్ మీదున్న కాగితాల మీద రాసి చింపేస్తూ పావుగంటకోసారి టీ ఆర్డర్ చేస్తూ పది నిమిషాల కోసారి సిగరెట్ వెలిగిస్తూ సగం కాలకుండానే నేలకేసి తొక్కేస్తున్నాడు.

అరగంటసేపు అమరన్ తీరంతా గమనించిన రమణ కాసేపు ఆలోచించి, నెమ్మదిగా కొన్ని లెక్కలు వేసి దగ్గరకెళ్ళి అతని ముందు కుర్చీలో కూర్చుని తమిళంలో అడిగాడు "మీరు ప్రేమలో పడ్డారు. అవునా?" అని.

షాకయ్యాడు అమరన్.

"మీరూ, ఒకావిడా చాలా ఇష్టపడ్డారు. ఆమె మీ దగ్గరకి వచ్చేద్దామని గాఢంగా తాపత్రయపడుతోంది. కానీ రావడం లేదు. దాంతో మీకొక రకమైన దిగులు ప్రారంభమైంది.

"ఎప్పుడూ ఆమే... ఈ ప్రపంచంలో ఆమె కంటే ముఖ్యమైంది ఏదీ మీకు అన్పించడం లేదు. అవునా?"

"ఇదంతా మీకెలా తెలుసు?"

"మీకు కాస్త దూరంలో కూర్చుని మిమ్మల్ని కాస్సేపు గమనించిన వాళ్ళెవరికైనా తెలుస్తుంది. మీరు అక్టోబరు ఇరవై మూడు, నవంబర్ ఇరవై రెండు మధ్యలో పుట్టి వుంటారు?"

"నా బర్త్ డేట్ నవంబర్ ఇరవై, ఇదంతా మీరెలా తెలుసుకోగలిగారు?"

"లిండా గుడ్‌మేన్ 'లవ్‌సైన్స్' చదివితే మనిషి ప్రవర్తనని బట్టి వాళ్ళ బర్త్ పీరియడ్ అంచనా వెయ్యొచ్చు" అని ఫేమస్ సన్‌షైన్ పర్సనాలిటీస్ గురించి కాస్సేపు మాట్లాడేసరికి, సందేహం లేదు ఈ తెలుగువ్యక్తి ఎవరో గొప్పవాడనిపించింది అమరన్‌కి. తన గురించి సర్వం ఇతనికి చెప్తే ఒక సాల్యేషన్ ఏర్పడేట్లు ఏదైనా చెపుతాడు అనిపించి తన గురించీ, తన ప్రేమ గురించీ సంపూర్ణంగా చెప్పిన అమరన్-

"నేను డైరెక్ట్ చేసిన నా ఫస్ట్ పిక్చర్ రిలీజ్ ఈరోజే సార్. ఆ సినిమాకి కథ ఆమెతో నా అనుభవాలే. ఇంత తియ్యగా హింసించిన ఆమె ఇక రాకపోతే మా భవిష్యత్తు ఏమవుతుందో ఊహించుకుని ఒక ఫినిషింగ్ ఆలోచించాను. చూసిన వాళ్ళంతా ఆ ముగింపు అద్భుతం అంటున్నారు. నా జీవితం కూడా నా సినిమా ముగింపు లా అవుతుందేమో అన్న దిగులుతో దహించుకుపోతున్నా" అన్నాడు.

"ఈ సినిమా ఇండస్ట్రీకి రాకముందు మా ఊళ్ళో ప్రేమలేఖలు రాసి పెడుతుండేవాడ్ని... ఆఖరి పేరా ఒక్కసారి చదవండి."

చదవడం మొదలెట్టాడు అమరన్. "మన ప్రేమకథనే స్క్రీన్‌ప్లే చేసి నేను తీసిన నా సినిమా విడుదల ఈరోజే, దయచేసి వెళ్ళి చూడు. నేనిచ్చిన ముగింపులాగే మన జీవితాలు ముగియాలనుకుంటే ఇక నా దగ్గరికి రాకు. ఇక నేను బతికేది కూడా ఈ రాత్రి పన్నెండు గంటలవరకే" చదవడం పూర్తి చేశాడు అమరన్.

"ఈ గులాబీరంగు కాగితం మీద మీ హేండ్‌రైటింగ్‌తో కాపీ చేసుకుని వెంటనే పోస్ట్ చెయ్యండి" అన్నాడు రమణ.

ది ఎండ్

వెంటనే అతను చెప్పిన విధంగా చేశాడు అమరన్.

"మీ పెళ్ళికి నన్ను తప్పకుండా పిలవాలి! అమరన్" అన్నాడు రమణ.

"మా పెళ్ళి జరిపించబోయే పెద్ద మీరే సార్" అన్నాడు అమరన్.

"థాంక్యూ" అని కదలి వెళ్ళిపోబోతున్న అమరన్‌ని చెయ్యి పట్టుకుని ఆపిన రమణ "మీరేం అనుకోకపోతే నాకు ఒక సాయం చెయ్యాలి" అన్నాడు.

"అయ్యో అంతకన్నానా? చెప్పండి సార్!"

"నేను కూడా ప్రేమించి పెళ్లి చేసుకున్న మనిషిని. చాలా లగ్జరీ జీవితానికి అలవాటుపడ్డ మనిషి నా భార్య. ప్రతిరోజూ ఉదయం పాలలో కూర్గు తేనె కలిపి తాగడం అలవాటు ఆమెకి. ఇంట్లో తేనె సీసా అయిపోయి రెండు రోజులైంది. ఇవ్వాళ ఎట్టి పరిస్థితుల్లోనూ తేవాలని గొడవ పెట్టింది. పరిస్థితి చెప్పాను. విన్లేదు. ఇద్దరి మధ్య ఘర్షణ జరిగింది. దొరికాకే ఇంటికొస్తాను అని శపథం చేసి ఇంట్లోంచి బయటికొచ్చేశాను."

అర్థం చేసుకున్న అమరన్ అయిదొందలు రమణ చేతిలో పెట్టి "చాలా?" అన్నాడు.

"కూర్గు తేనె సీసా ఖరీదు నూటనలభై. ఈ రెండు వందలూ చాలు." అతనిచ్చిన అయిదొందల్లో మిగతా మూడువందలు అమరన్ చేతిలో పెట్టి ఆ తేనె దొరికే నీలగిరీస్ అనే షాపు దగ్గరకి బయలుదేరాడు.

ఆ రోజు సోమవారం నీలగిరీస్ సెలవు. ఒరిజినల్ తేనె ఈ షాపులో మాత్రమే దొరుకుతుంది. భార్యతో జరిగిన ఘర్షణ గుర్తొచ్చింది. ఎట్టి పరిస్థితుల్లోనూ తనడిగిన తేనె బాటిల్ సంపాదించాకే ఇంటికి వెళ్ళాలి అన్న పట్టుదలతో బీచ్‌కెళ్ళి తెల్లవారే దాకా కాలక్షేపం చేసి, మర్నాడు ఉదయం తొమ్మిది గంటలకి షాపు తెరిచే దాకా వెయిట్ చేసి ఆ తేనె సీసా కొనుక్కుని ఇంటికి బయల్దేరాడు. రెండు బస్సులు మారి ఇంటి కొచ్చేసరికి ఉదయం పదకొండు గంటలయ్యింది. హుషారుగా ఇంట్లోకి అడుగుపెట్టిన రమణకి భార్య కనిపించలేదు కానీ, టేబుల్ మీద ఒక లెటర్ కనిపించింది.

'మీకు-

ప్రాణానికి ప్రాణంగా ప్రేమించి పెళ్ళి చేసుకోవడంతోనే అయిపోలేదు.

అన్నీ వదిలివచ్చిన ఆ మనిషి అవసరాలు తీర్చాలి. కోరికలు నెరవేర్చాలి. అవి కూడా తీర్చడానికి సంపాదించలేని మీతో ఇక బతకడం కష్టం.


నేను శాశ్వతంగా వెళ్ళిపోతున్నాను.'

ఆ ఉత్తరం పక్కనే అమరన్ గులాబీరంగు కాగితం మీద రాసిన ఉత్తరం కూడా వుంది.


*స్వాతి సపరివారపత్రిక*
*7 నవంబర్ 1997*








# ఆకుపచ్చని జ్ఞాపకం



ఆటో క్రిష్ణా ఒబెరాయ్ దాటి డౌన్‌లో కెళ్ళేక ఎడం పక్కకి కట్ చెయ్యమన్నాడు చందర్. రోడ్ నెంబర్ ఫోర్ చివర ఎకరం నేలలో ఒంటరిగా ఉన్న ఆ బంగాళా నిజామ్స్ కాలం నాటిది. గోడలకి తెల్లసున్నం పచ్చ రంగేసిన కిటికీలు. బంగ్లా ముఖద్వారం ముందు స్కోడా, ఎస్సెంట్ కార్లూ లేండ్ క్రూయిసర్ వేనూ ఆగున్నాయి. ఎక్కడ చూసినా వెల్వెట్ లాన్సూ పూలమొక్కల్తో బాగా మెయింటెయిన్ చెయ్యబడ్తున్న ఆ బంగాళాకి దూరంగా ప్రహారీని ఆన్చి కట్టిన పెద్ద ఔట్‌హౌసుంది.

ఆటో దిగి చూస్తున్న చందర్ దగ్గర కొచ్చిన వాచ్‌మెన్ రాములు ఎవరికోసం వచ్చేరన్నాడు.



"జయేందర్‌రెడ్డి సాబ్ బంగ్లా ఇదేనా?" అడిగేడు చందర్.

ఇదేగానీ ఆ రెడ్డి చనిపోయి పదేళ్లయ్యింది. ఇప్పుడిందులో వాళ్ళబ్బాయి కిషన్‌రెడ్డి సాబ్ కుటుంబంతో వుంటున్నట్టు చెప్పాడు రాములు.

"నేనిప్పుడు వచ్చింది కిషన్‌రెడ్డి సాబ్‌కోసమే. మాది వాళ్ళూరే" అన్నాడు చందర్.

"రెడ్డి సాబ్‌కి రాత్రుళ్ళు జరా లేటవుద్ది. పొద్దుట సాబ్ తయారై బయటికి రావడానికి గ్యారాబజే" అన్నట్టు చెప్పేడు వాచ్‌మెన్ రాములు.

ఆటోని పంపించేసి సూట్‌కేసుతో నిలబడ్డ చందర్‌కి, పదకుండున్నరకి దొరికింది కిషన్‌రెడ్డి దర్శనం.

వాళ్ళూరయిన రెల్లకుంట్లపల్లిలో తనెవరి తాలూకో చెప్పిన చందర్ "మీ ఔట్‌హౌస్‌లో వుండి చదువుకున్న చాలామంది పెద్ద పెద్ద ఇంజనీర్లూ డాక్టర్లూ అయ్యేరని చెప్పుకుంటారు మనూళ్ళో. ఆ సెంటిమెంటుతోనే వచ్చేను. నాక్కూడా ఇక్కడ కొంచెం చోటిస్తే అందులో ఉండి చదూకుంటాను" అన్నాడు.

రాముల్ని పిల్చిన కిషన్‌రెడ్డి ఔట్‌హౌస్‌లో విరిగిపోయిన పాత సోఫాలూ, పాత సామాన్లూ తీయించి శుభ్రం చేయించమన్నాడు.

సాయంత్రానికి అక్కడ సెటిలయిపోయేడు చందర్.

*

పాతికేళ్ళ చందర్ అందరు కుర్రాళ్ళలాంటోడు కాదు. ప్రతిరోజూ బ్రహ్మముహుర్తంలో లేచి కాలకృత్యాలూ అవీ తీర్చుకున్నాక 'అపవిత్ర పవిత్రోవా...' అంటూ సంధ్యావందనం మొదలెట్టి అదయ్యాకా గాయిత్రీ మాత విగ్రహం ముందు కూర్చుని వెయ్యీ ఎనిమిదిసార్లు జపిస్తాడు.

సూర్యోదయం అయ్యేలోపే తయారయ్యి బయటికెళ్ళిపోయే చందర్ పొద్దుటా సాయంత్రం ట్యూషన్లు ఒప్పుకోడం వల్ల రాత్రి తొమ్మిది దాటాకాగానీ రాడు.

నిర్మలమైన పవిత్రమైన చోట్లలోనే తిరుగుతుంటాడు. ఫ్యూచర్ని తొమ్మిదిరంగుల్లో తియతియ్యగా ఊహించుకుంటాడు. ఒక అంశాన్ని నీలం రంగులో ఊహించుకుంటాడు. ఒక మాటకీ ఒక నీతికీ కట్టుబడి వుంటాడు.

*

రెండేళ్లు గడిచాయి.

ఈ రెండేళ్లలో కిషన్‌రెడ్డిని ఒకటి రెండుసార్లు మించి చూళ్ళేదు చందర్. ఇక ఇంట్లోపల ఆడవాళ్ళ నసలు చూసే ఎరగడు.

ఆరోజు రాత్రి తనుంటున్న ఔట్‌హౌస్‌లో కొచ్చిన రాములు "రేపు కిషన్‌రెడ్డి సాబ్ మీతో కల్సి మాటాడేది ఉందంట. మిమ్మల్ని జరా ఇక్కడనే ఉండమన్నారు" అన్నాడు.

మర్నాడు పదకుండు దాటేక తెల్లటి శిల్కు బట్టలతో పువ్వులాగ తయారయ్యి కాళ్ళకి చడావులేసుకుని పైప్ కాలుస్తూ చందర్ దగ్గర కొచ్చిన కిషన్‌రెడ్డి, చందర్ చదువుతున్న చదువేంటో కనుక్కుని అదింకా ఎన్నాళ్ళు చదవాలో తెల్సుకున్నాక "ఆ తర్వాత ఉద్యోగం ఎక్కడ దొరుకుతుంది?" అన్నాడు.

"హైటెక్ సిటీ సెకెండ్ ఫేజ్‌లో ఒక డచ్ కంపెనీ ఉంది. అందులో నా చదువుకి ఉజ్జోగం వచ్చే అవకాశం బాగా ఉంది. నెలకి లక్షన్నర సేలరీ వస్తుంది" అన్నాడుచందర్.

"ఎంత?" మళ్ళీ అడిగేడు కిషన్‌రెడ్డి.

"లక్షన్నర... ఒన్ అండ్ హాఫ్ లేక్... అదీ ప్రారంభంలో. తర్వాత బాగా పెరుగుతుంది" అన్నాడు చందర్.

చందర్‌ని వాళ్ళింటికి ఆహ్వానించేడు కిషన్‌రెడ్డి.

హాల్లో ఉన్ని పర్షియానిక్ బ్లూ కార్పెట్ల మీదున్న ఖరీదైన సోఫాలో కూర్చున్నాడు చందర్.

కాస్సేపటికి ఒక నలభై అయిదేళ్లు దాటిన స్త్రీ వచ్చింది అక్కడికి. "ఈవిడ అనిత, నా భార్య" అన్నాడు కిషన్‌రెడ్డి. ఇంకాస్సేపటికి నలభైయేళ్ళావిడొచ్చింది. "ఈవిడ సబిత, నా భార్య చెల్లెలు. అయిదేళ్ళ క్రితం భర్త పోవడంతో మా ఇంటికొచ్చేసింది" అన్నాడు. ఇంకాస్సేపటికి చాలా మోడ్రన్‌గా తయారైన ఒకమ్మాయి వచ్చింది. "ఈమె మా అమ్మాయి రేణూ... నిఫ్ట్‌లో ఫేషన్ డిజైనింగ్ చేసింది. దీనికంటే పెద్దవాడు హరీష్ అట్లాంటాలో వుంటాడు" అన్నాడు కిషన్‌రెడ్డి.

ఆ తర్వాత చాలా మర్యాదలు చేసేకా "మా ఔట్‌హౌస్‌లో చాలామంది చదువుకుని వెళ్ళేరు. కానీ నీలాంటి వాడ్ని మేమెక్కడా చూళ్ళేదు. గత రెండేళ్ళనించి మా వాచ్‌మేన్ రాములు చెబుతూ వస్తున్నాడు నీ గురించి... మా రేణూని నీకిచ్చి పెళ్ళి చేద్దాం అనుకుంటున్నాం. ఈ విషయం మన రెల్లకుంట్లపల్లిలో ఉన్న మీ పేరెంట్సుకి చెప్పినాం... చాలా ఆనందపడ్డ వాళ్ళు నీ అభిప్రాయం అడగమన్నారు."

ముందు పెద్ద షాకయిపోయిన చందర్ నెమ్మదిగా నార్మల్ కండీషన్ కొచ్చేకా "నాకు జన్మనిచ్చిన నా తల్లిదండ్రులంటే నాకు చాలా భక్తి. నేనేం చేసినా రుణం తీరదు. కాబట్టి వాళ్ళేం చెపితే నాకది వేదం" అన్నాడు.

ఆ తర్వాత నెల్లో జరిగిన పెళ్ళికి రెల్లకుంట్లపల్లి నించి వచ్చిన చాలామంది జనం 'నీ అంత అదృష్ట వంతుడు ఈ ప్రపంచంలో లేడ'ని తెగ పొగిడారు చందర్ని.

చందర్ మకాం ఔట్ హౌస్‌నించి మెయిన్‌హౌస్‌కి మారింది. బంగ్లాలో ఒక మూల చిన్న గది తీసుకుని అందులో ప్రతిష్టించుకున్నాడు పంచలోహాల్తో చేసిన గాయత్రీదేవిని.

*

రాత్రుళ్ళు తను ఇంటి కొచ్చేసరికి కనిపించేది కాదు రేణూ. అడిగితే పబ్‌లకీ డిస్కోతెక్‌లకీ నగరం చివర రిసార్ట్స్‌కీ వెళ్ళినట్టు చెప్పేవాళ్ళు పనివాళ్ళు. ఒకరోజు రాత్రి రెండింటికెప్పుడో వచ్చిన రేణూ బాత్‌రూమ్‌లో బ్రష్ చేసుకొచ్చి చందర్‌ని లేపి బ్రష్ చేసుకు రమ్మంది. ఆ తర్వాత చాలా రెచ్చిపోయింది. అలా తన కిష్టమంట, అది తన టేస్టంట.



ఆరోజు ఆదివారం. రేణూ బాత్‌రూమ్‌లో ఉంది. సెల్ మోగితే మాటాడేడు. రహమానంట. ఏకవచనంలో మాటాడ్తున్నాడు. కాస్సేపయ్యేక సుధీర్. ఆమె బాత్‌రూమ్‌నించి వచ్చేలోపు మూడుకాల్స్ వచ్చాయి. అన్నీ మగాళ్ళవే.

ఒకరోజు ఎక్కడికీ వెళ్లకండా ఇంట్లోనే ఉన్నాడు. రోజు మొత్తంలో ఎన్ని కాల్సు వచ్చాయో లెక్కపెట్టలేక పోయాడు.

మధ్యాన్నం దాటింది. బంగ్లా ముందాగిన కారులోంచి దిగొడొకతను. ఏభై పై నుంటుంది వయసు. ఇన్నాళ్ళూ జెద్దాలో ఉండి వచ్చేడంట. సొంత వూరు ఎమ్మిగనూరంట. నవ్వుతా అతనికెదురొచ్చి లోపలికి రమ్మన్న అనితారెడ్డి తన గదిలోకి తీసుకెళ్ళిపోయింది. వాళ్ళు కాలేజ్ డేస్‌లో ఫ్రెండ్సంట. తలుపు లేసుకుని చాలాసేపు మాటాడుకున్నారు. అతన్ని చూసిన పనివాళ్ళు చెప్పేరు. ఇలా చాన్నాళ్ళ నించొస్తున్నాడంట ఆ మనిషి. అది కిషన్‌రెడ్డి సాబ్‌కి కూడా తెల్సంట.

సాయంత్రమయ్యింది. లేండ్ క్రూయిసర్‌లో బయటికి బయల్దేరిన కిషన్‌రెడ్డి కూడా మరదలు అనితా రెడ్డిని తీసుకెళ్ళేడు.

రాత్రి లోపల్నుంచి వైన్ బాటిల్ తెచ్చిన రేణూ "తాగుతారా, ఇది మా ఇంట్లో తయారు చేసిందే. వైన్ చెయ్యడంలో చాలా ఎక్స్‌పర్ట్ మా మమ్మీ" అంది.

టీ.వీ. చూస్తా తాగుతా ఫోన్లు మాటాడ్తా రాత్రి పదిదాకా గడిపేక "పదండి... పబ్‌కి వెళదాం" అని తీసుకెళ్ళింది.



ఆ పబ్‌లో రేణూ భుజం మీద నడుం మీదా చనువుగా చేతులేసి పలకరించిన మగాళ్ళు ఎంతమందో.

పోనుపోను చాలా విషయాలు తెల్సాయి చందర్‌కి. రేణూకి మూడుసార్లు అబార్షన్లయ్యాయంట. ఆ విషయం అందరికీ తెల్సంట. ఔట్‌హౌస్‌లో వుంటున్న తను ఎంత సాత్వికుడో తెల్సుకున్నాక తనకిచ్చి చేసేరంట.

ఇంకా చాలా విషయాలు తెల్సుకున్న చందర్ ఒకరాత్రి కిషన్‌రెడ్డితో గట్టిగా మాటాడదాం అని అతని గది దగ్గరకెళ్ళేసరికి తాగేసుకున్న కిషన్‌రెడ్డీ అతని భార్యా దెబ్బలాడుకుంటున్నారు.

వాళ్ళ కొట్లాట విన్న చందర్‌కి ఇంకా చాలా విషయాలు తెలిశాయి.

ఏమయ్యాయి నీలం రంగు నా కలలు? ఏమయ్యాయి నా గులాబీరంగు గాలిమేడలు? ఏమిటీ ఎరగని మనుషులు... ఏమిటీ గిజాటు వాతావరణం? నేనున్న ఈ మాయేదో... ఈ గొయ్యేదో చాలా చిత్రంగా వుంది. ఇందులో మునక్కండా చావకండా తేల్తున్న నేను చివరికి బతికి నిజంలో కొస్తానా? వెలుగులో కొస్తానా?

ఇన్నాళ్ళు ఒక నీతికి కట్టుబడి ఉన్న నేను దాన్ని తెంచుకుని పారిపోదామంటే అక్కడ పటాపంచలవ్వుద్ది. మా గ్రామాల్లో ఫలానా గడీగల ఒకనాటి పటేల్ జయేందర్‌రెడ్డి సాబ్ కొడుకు కిషన్‌రెడ్డి అల్లుడిగా మారుమోగిపోయేను. దాంతో అక్కడున్న నా తల్లిదండ్రులకి జన్మలో ఎరగని గౌరవం, జన్మలో ఎరగని మర్యాదలు ఇచ్చేస్తున్నారు జనం. ఇప్పుడు నేనేం చేసినా సర్వం తల్లకిందులయిపోతుంది. ఐతే... మరైతే ఎలాగ... మరెలాగ... ఈ కాటుక రంగు చీకట్లోంచి వెలుగుని చూసేదెలాగ.

ఒక విషాదంలోంచి ఒక రకమైన నిర్వేదానికి ఒకానొక వైరాగ్యానికీ లోనయిపోతున్న చందర్ ఎప్పుడో అర్ధరాత్రి పూట వచ్చి తెల్లవారుఝామున పూజా, జపం చేసుకుని 'చీకట్లోంచి చీకట్లోకి అంటే ఇదేనా' అనుకుంటూ వెళ్ళిపోతున్నాడు. అదే వేదనతో ఎన్నో రోజులు గడిచిపోయాయి.

*

రెల్లకుంట్లపల్లి నించి చాలామంది జనం వచ్చారావేళ. కిషన్‌రెడ్డికి చాలా దగ్గర బంధువుల పెళ్ళంట. ఇంటిల్లిపాదీ రావాలని గొడవపెట్టారు. "రాత్రి కొచ్చేద్దాం వస్తావా?" అని చందర్ని అడిగితే "నేను ఇల్లు చూసుకుంటాన్లే మీరెళ్ళి రండి" అన్నాడు.

అంతా వెళ్ళిపోయాకా ఆరోజు సాయంత్రం దాకా ఎక్కడన్నా ప్రశాంతంగా గడుపుదాం అనిపించి బయల్దేరాడు.

ఎందుకనిపించిందో సంజీవయ్య పార్కుకి వెళ్దామనిపించి ఆటో ఎక్కేడు.

హుస్సేన్‌సాగర్ మధ్యలో వందెకరాల స్థలంలో ఉందా పార్కు. అయిదు రూపాయిలు టిక్కెట్టు కొనుక్కుని లోపలికి నడుస్తుంటే ఎప్పటికప్పుడు నేలని శుభ్రం చేస్తున్న హుడా పని మనుషులు, లాన్స్‌ని తడిపే డిప్పర్లు. చల్లగా హాయిగా ఉంది వాతావరణం. నేలబారుగా ఉన్న సిమెంటు బెంచీల్నిండా జంటలు. ఎక్కువగా బురఖాలు తగిలించుకున్న అమ్మాయిలు. (ఆ బురఖాలు బయటెక్కడో అద్దెకిస్తారంట) విచిత్రం- జంటల్లో వయసులో ఉన్నవాళ్ళే గాకండా నడివయసు వాళ్ళూ ముసలాళ్ళూ కూడా ఉన్నారు.

పార్కు మధ్యలో కొచ్చేక ఆగేడు చందర్.





ఈ ఏడాది ఆక్షన్ అయిపోడంతో మూసేసి ఉన్న పాత రెస్టారెంట్ ఎదురుగుండా కొత్తగా తెరిచిన పసుపు రంగు రెస్టారెంటు కనిపించింది. ఆ రెస్టారెంట్లో కెళ్ళి టీ ఇమ్మని కుర్రాడ్నడుగుతున్నప్పుడు తన్ని చూసి నవ్వుతా వెళ్ళిపోయిందా మనిషి.

పరిణీతలో విద్యాబాలన్‌లాగుంది. పాతికేళ్ళలోపే వయస్సు. నారాయణపేట చీర. పొడుగు వుండటం వల్ల ఐహీల్ చెప్పులెయ్యలేదు. తెల్లకలువ పూల్లా మెరుస్తున్నాయి కళ్ళు. నవ్వినప్పుడు స్వరోస్కీ క్రిస్టల్స్‌లా మెర్సినియ్యి పళ్ళు.

టీ తాగేక దూరంగా ఉన్న మోదుగ చెట్టు దగ్గరకెళ్ళి దాని మొదట్లో కూర్చున్న కాస్సేపటికి మళ్ళీ కనిపించిన ఆమె "టైమ్ పాస్ కావాలా?" అంది.

అర్థంగాక "ఏంటన్నాడు."

"ఇక్కడ ఒంటరిగా కూర్చున్నారు గదా... మీకు టైమ్‌పాస్ కావాలా అని అనడుగుతున్నాను" అంది. కూర్చోమంటే కూర్చుంది.

నవ్వుతా అంది "చీకటి పడేదాకా మీతో మాటాడ్తూ గడుపుతాను. మీ మనసులో మాటలు చెపితే విని నాకు తోచిన సలహాలిస్తాను. మీతో చాలా ఫ్రెండ్లీగా ఉంటాను. వెళ్ళేప్పుడు మీరు ఇవ్వాలనుకున్నది ఇవ్వండి" అంది మృదువుగా.

నవ్విన చందర్‌కి ఈమధ్య పార్కుల్లో తిరుగుతున్న టైమ్‌పాస్ అమ్మాయిల గురించి పేపర్లో చదివిన ఆర్టికల్ గుర్తొచ్చి "తర్వాత?" అన్నాడు.

మాట్లాడ్డం మొదలెట్టింది. చందర్ మనసుని చదివినట్టు మాటాడ్తుంది. పేరు పరిమళట. జీవితం అర్థం గాకండా వుందా?... "పరమహంస యోగానంద ఆత్మకథ చదవండి... ఒక క్లియర్ పాథ్ కనిపిస్తుంది. ఝుమ్ఝూమురా కథ చదవండి ఒక ఫీల్ మిమ్మల్ని వెంటాడ్తుంది." ఆ పరిమళ మాటాడ్తుంటే ఆమెగొంతు 'సాహిబ్ బీవీ ఔర్ గులామ్'లో మీనాకుమారి గొంతులాగ ఒకసారి, మళ్ళీ తీసిన దేవదాస్‌లో జయంతి గొంతులా ఒకసారి వినిపించింది. జీరతో కూడుకున్న ఆ మంద్రస్థాయిలో ఒక ఫీల్, ఒక వేదన .

ఇంకాస్సేపయ్యింది. ఆమె చాలా మాటాడ్తుంది. ప్రస్తుతం ఉన్న తన మానసిక స్థితికి సంబంధించినవే అవన్నీ. చాలాసేపు గడిచింది. చాలా హాయిగా అనిపిస్తున్న ఆమె మాటలకి ఆ పార్కులో పావురాళ్ళు కూడా పరవశించిపోయి అక్కడ కొచ్చి వాలాయి. వాలడమే కాదు తన భుజం మీదా ఒళ్ళో తలమీదా ఎగిరి కూర్చున్నాయి. వాటితో పాటు రంగురంగుల లవ్‌బర్డ్సూ రంగురంగుల పూలు తన చుట్టూ పుట్టాయి. ఎక్కడినించో పరుగెట్టుకొచ్చిన లేడిపిల్ల, ఇంకెక్కడినించో ఎగురుకుంటూ వచ్చిన ఆడ నెమలీ పక్షులూ పావురాళ్ళ మధ్యలోకి కలిశాయి.

"బయటికెళ్ళి ఏవన్నా తిందాం" అన్నాడు.

మాట్లాడతానే లేచింది.

బయటికొచ్చిన ఇద్దరూ రోడ్డుకి ఎడం పక్కనే కిలోమీటరు పైన నడుచుకుంటా ఆ నెక్లెస్ రోడ్లో ఉన్న ఈట్‌స్ట్రీట్ (ఆ రెస్టారెంట్ పేరది)లో కెళ్ళేరు.

ఎంట్రన్స్ టైల్స్ మీద వైకుంఠపాళీ వేసుంది. డార్క్ మిక్స్‌డ్ కలర్ టైల్సవి. స్తంభాలకి వైలెట్, ఆకుపచ్చ రంగులేసున్నాయి. యూరోపియన్ కంట్రీస్ ఇన్‌ఫ్లూయెన్స్ బాగా కనిపిస్తుంది ఇంటీరియర్ డెకరేషన్‌లో. లోపలికెళ్తే నిజంగానే స్ట్రీట్‌లాగుంది. సబ్‌వే, పిజ్జాహట్, మినర్వా కాఫీషాప్, కాఫీ డే, ఓక్ ఆఫ్ హైదరాబాద్, చాక్‌లెట్ హౌట్ వాళ్ళ బ్రాంచెస్ వరసగా ఉన్నాయి ఆ వీధిలో. సపరేట్‌గా ఉన్న ఒక స్టాల్‌లో హాట్ అమెరికన్ స్వీట్ కార్న్ అమ్ముతున్నాడో కుర్రాడు. చిలకజోస్యం చెప్పేవాడొకడు తన సరంజామాతో నవ్వుతా కూర్చున్నాడు. హుస్సేన్ సాగర్‌కి ఎదురుగా చాలా వెడల్పుగా ఉన్న ఆ రెస్టారెంట్‌కి రెండు పక్కలా రెండు ఎల్.జి. ఎక్స్ కేన్వాస్ హోమ్ థియేటర్స్ టీవీలున్నాయి. వాటిలో ఇండియా×జింబాబ్వే క్రికెట్ మేచ్ వస్తుంది. ఇక టేబుళ్ళ మీద పల్చపల్చగా అమ్మాయిలూ అబ్బాయిలూ... డవ్‌లప్ అయిపోతున్న కల్చరంతా అక్కడుంది. రెస్టారెంటు హుస్సేన్‌సాగర్ని ఫేస్ చేసి ఉంది గాబట్టి గాలెలాగూ వస్తుందనేమో ఫేన్లు బిగించలేదు. వుక్కగా ఉంది. లేక్ అంచున వరసగా ఎరేంజ్ చేసున్న టేబుళ్ళలో ఇద్దరు మట్టుకే కూర్చునే సదుపాయం గల టేబుల్ దగ్గరకెళ్ళి కూర్చున్నారు.

"ఏం తింటారు?" అడిగేడు చందర్.

ఏవన్నా పర్లేదంది పరిమళ.

సబ్‌వే షాప్‌కెళ్ళి రెండు ఆల్‌వెజ్ ఆలూపేటీ సబ్స్, డైట్ కోక్ తెచ్చేడు.

తినడం మొదలెట్టిన పరిమళ చందర్ పేపర్ ప్లేట్లోంచి ఆల్‌పైనో పీసెస్ తీసుకుని తింటా "ఇవంటే నాకిష్టం" అంది. 'సెపరేట్‌గా పట్రానా' అంటే వద్దంది.

అలా ఆ మనిషి తన పళ్ళెంలోంచి చొరవగా తీసుకుంటుంటే అది తనకెంతో ఇష్టమైన పని లాగని పించింది.

కాస్త గాలాడక చందర్ నుదురు మీద పట్టి కారుతున్న చెమటని తన చీర కొంగుతో సుతిమెత్తగా తుడుస్తుంది పరిమళ.

చాలా థ్రిల్లయిపోయి చాలా ఎగ్జైటయిపోయి ఆ మనిషినే చూస్తున్నాడు. తన భార్య ఎప్పుడూ అలా చెయ్యలేదు. ఆమె నేచర్‌కి ఈరకం స్నేహం తెలీదు. అలాంటిది ఎవరో ఇప్పుడే పరిచయమైన ఈ పరిమళేంటి లాగ? గతంలో ఎప్పుడో ఎక్కడో ఏదైనా సంబంధముందా ఈ మనిషితో?... అర్థం గావటం లేదు.

తింటుంటే మధ్యలో "మంచినీళ్ళు తెస్తాను ఈసారి మీరు లేవకండి" అనెళ్ళి రెండు ఒన్ లీటరు అక్వాఫినా బాటిల్సు తెచ్చింది.

తినడం, తాగడం అయ్యేక తనకేసి చూస్తా "మెడిటేషన్ చెయ్యండి... ఒకమ్మాయి ప్రతిరోజూ భగవంతుడికి ఉత్తరాలు రాసేదంట. లెటర్స్ టు గాడ్ అదీ ఒక రకమైన మెడిటేషనే అని ఒక లెక్చర్‌లో అంటాడు ఓషో" అంది పరిమళ.

మాటాడ్డం మొదలెట్టింది పరిమళ. "ఆ ఒంటరితనాన్ని బ్రేక్ చేసే బెర్నార్డో బెర్టూలుచ్చి తీసిన బి సీజ్డ్, విన్సెంట్ వార్డ్ డైరెక్ట్ చేసిన వాట్ డ్రీమ్స్ మే కమ్ సినిమాలు చూడండి. మీకెప్పుడన్నా అవకాశం వుంటే ఎక్కడన్నా టైమ్ దొరికితే కాల్ ఆఫ్ ద వేలీ, మొజార్ట్ సింఫనీ నెం.41 జూబిటర్ వినండి. అప్పుడు జీవితం వ్యర్థం అనిపించదు.





అర్థం కానిదనిపించదు. మీకూ బతకాలనిపిస్తుంది. ఆయుషు పెంచమని ఆ దేవదేవుడ్ని, ఆదిదేవుడ్ని కోరాలనిపిస్తుంది." ఇలా ఆమె పల్లవీ చరణాల నిబంధన లేకండా ట్యూన్ చేసిన ఒక లాంగ్ పోయెమ్‌ని పాడ్తున్నట్టు పోతుంది.

ఒకానొక తన్మయత్వంలో పడిపోయి వింటున్నాడు చందర్. రంగురంగుల లవ్‌బర్డ్స్ తన తలమీద వాలి పాపిట రువ్వి గూడు కట్టుకుంటున్నాయి. మోచేతుల మీద వాలిన బూడిదరంగు పావురాళ్ళు ముక్కుల్తో పొడుస్తున్నాయి. ఇంతలో వచ్చి టేబుల్ మీద వాలిన నెమలి అమాంతంగా పురివిప్పేసి తన మీద ఎండ పడకండా కాస్తుంది. కుందేళ్ళూ, లేడిపిల్లలు చుట్టూ కల తిరుగుతూ ఆడుకుంటున్నాయి. వీటితో పాటు చల్లటి గాలి రింగులు తిరుగుతా వచ్చింది. వాళ్ళ టేబుల్‌కి అటూ ఇటూ ముందు వెనకా ఉన్న టేబుల్స్ మీది జనం టీవీల్లోం చొస్తున్న డిజిటల్ సరౌండ్ మ్యూజిక్ విని ఎంజాయ్ చేస్తుంటే, పరిమళకీ తనకీ మట్టుకి అవేం వినిపించడం లేదు.

సాయంత్రం అయ్యింది. గాలి బాగా వీస్తుంది. ఈట్‌స్ట్రీట్ రెస్టారెంట్‌ని ఆన్చి ఉన్న ఏ.పీ. టూరిజం వాళ్ళ బోట్లు తిరగడం మొదలెట్టాయి హుస్సేన్‌సాగర్లో.

"మనమూ వెళ్దామా?" అన్నాడు చందర్.

పదమంది.

లేస్తుంటే పావురాళ్ళు నెమళ్ళు గాలిలోకెగిరి పోయాయి. జింకలూ కుందేళ్ళూ పారిపోయాయి.

ఆ రెస్టారెంట్ దాటేక హుస్సేన్‌సాగర్‌లోకి వేసున్న చెక్కవంతెన ఎక్కి టూరిజం వాళ్ళ బోట్ ఎక్కేరిద్దరూ. గాలి బాగా ముదిరింది. చాలా జంటలతో పాటు చాలా ఫేమిలీస్ వాళ్ళ పిల్లలు కూడా ఎక్కారు బోట్ మీద. కాసేపటికి జనంతో నిండిపోయింది.

మెలికలు తిరిగి వీస్తున్న గాలిలాగ ఒకటే సందడి. దూరంగా సూర్యాస్తమయమవుతుంది. పక్షులూ, నెమళ్ళు, లేళ్ళు మళ్ళీ ప్రత్యక్షమయ్యాయి.

తనూ పరిమళా సపరేట్‌గా వున్న ఒక టేబుల్ మీద కూర్చున్నాక వీస్తున్న గాలినీ చుట్టూ ఉన్న నీళ్ళనీ దూరంగా ఉన్న మల్టీస్టోర్డ్ బిల్డింగ్స్‌లో వెలుగుతున్న దీపాల్నీ చూస్తా హాయిగా నవ్వుతా "ఎప్పుడన్నా మదనపల్లి వెళ్ళేరా?" అడిగింది పరిమళ.

"లేదు ఏం?" అన్నాడు చందర్.

"ఐతే హార్స్‌లీ హిల్స్... ఠాగూర్ జనగణమన ట్యూన్ చేసిన రిషీవేలీ స్కూల్ చూసి వుండరు" అంది

"చూళ్ళేదు" అన్నాడు.

"ఎందుకు అడుగుతున్నానంటే... జిడ్డు క్రిష్ణమూర్తి ప్లేసది... ఒక లెక్చర్లో ఆయనేమంటారో తెల్సా... మొనాటనీని బ్రేక్ చెయ్యమంటారు... నిత్యం... అదే గది... అవే గోడలు... అవే బాధలు... అదే భార్య అని మొనాటనస్‌గా ఫీలవకండా వాటినే కొత్తగా చాలా ఫ్రెష్‌గా చూడమంటారు. దానికి మెడిటేషన్ అవసరం. అదేగానీ చేస్తే ఏమిటీ జీవితం ఏమిటీ బంధాలూ... ఏమిటీ రోత? అనే ప్రశ్నలుండవు" అంది. ఇంకా చాలా చెపుతూనే ఉంది.

రంగుల లవ్‌బర్డ్సూ, పావురాళ్ళు, నెమళ్ళు, జింకలూ, గోరువంకలూ తన చుట్టూ తన శరీరమంతా ఆవరించాయి. సున్నితంగా తనని పొడుస్తున్నాయి. ఒక తన్మయత్వానికి గురిచేస్తున్నాయి. ఒకానొక జ్ఞానోదయం కలగజేస్తున్నాయి.

గాలి ముమ్మరంగా వీస్తుంది. చీకటి పడ్డం మొదలెట్టింది. దూరంగా భవనాల్లో దీపాలకాంతులు పెరుగుతున్నాయి.

పరిమళ శ్రావ్యంగా మాటాడ్తూనే ఉంది.

చాలాసేపు గడిచింది. చీకటి బాగా చిక్కబడింది.

హుస్సేన్‌సాగర్ చుట్టూ చాలాసేపు తిరిగిన బోటు ఎక్కడ బయల్దేరేరో అక్కడికొచ్చి ఆగింది. అంతా దిగిపోయేరు.

ఆ చీకట్లో దశమినాటి జాబిలిలా నవ్వుతూ శలవు తీసుకుంటున్న పరిమళ కూడా పక్షులూ, కుందేళ్ళూ, నెమళ్ళూ, జింకలూ వెళ్ళిపోయాయి.

ఇప్పుడు తన మనసు నిండా ఆమే. ఆ పరిమళనే తల్చుకుంటూ ఇంటికి బయల్దేరేడు.

ఇంటికొచ్చిన కాస్సేపటికి వూరెళ్ళిన జనం దిగిపోయారు.

మళ్ళీ మామూలే. కిషన్‌రెడ్డీ భార్యా తాగి కోట్లాడుకుంటున్న మాటలు బయటికి వినిపిస్తున్నాయి. ఇంకో గదిలో మరదలు సబితారెడ్డి వింటున్న పాత హిందీ పాటలు వినిపిస్తున్నాయి.


చాలాసేపు రెడ్ వైన్ తాగిన రేణూకి గ్రీన్‌పార్క్‌లో మిడ్ నైట్ బిర్యానీ తిందామా అని ఎవరో ఫోన్ చేస్తే కారేసుకు బయల్దేరింది.

చందర్ ఆ పరిమళనే తల్చుకుంటున్నాడు. ఆ నవ్వునే తల్చుకుంటున్నాడు. ఆ జ్ఞాపకాల్తోనే ఆడుకుంటున్నాడు. ఆమె చేసిన జ్ఞానోదయాన్నే పాడుకుంటున్నాడు.

మర్నాడు పొద్దుట పూజగదిలో నవ్వుతూ తనని ఆశీర్వదిస్తున్న గాయత్రీదేవి ముఖం కేసి చూసేక... ఆశ్చర్యంతో అలాగుండిపోయేడు.

అమ్మవారి ముఖం నిన్న కనిపించి మాయమైన పరిమళ ముఖం ఒకేలాగున్నాయనిపించింది. అది భ్రమో నిజమో అర్థం కావడం లేదు. ఆ తర్వాత ఎన్నిసార్లు సంజీవయ్య పార్కుకెళ్ళి వెతికినా టైమ్‌పాస్ అమ్మాయిలు చాలామంది కనిపించేరుగానీ, నవ్వే ఆ పరిమళ మాత్రం మళ్ళీ కనిపించలేదు.

*స్వాతి సపరివారపత్రిక*





# బొత్తిగా అర్థంకాని మనిషి




అతను పెట్టుకునే కళ్ళద్దాల ఫ్రేము చిత్రంగా వుంటుంది. పౌరాణిక నాటకాలు వేసే వాళ్ళలా పొడుగ్గా పెంచుకుంటాడు జుట్టు. చిన్న చిన్న గింజల్లాంటివేవో భుజాన తగిలించుకున్న సంచిలోంచి తీసి నములుతుంటాడు.

శుక్రవారం ఊళ్ళో జరిగే సంతంతా తిరుగుతాడుగానీ ఏమీ కొనడు. ఎవరైనా నచ్చిన మనిషి కనిపిస్తే తదేకంగా చూస్తుంటాడు.

ఆ రోజు ఉదయం, పనిచేస్తున్న వేలి స్కూల్లో ఉద్యోగానికి సెలవు పెట్టేసి, టేప్ రికార్డరు తీసుకుని పర్వతానికి అటుపక్కనున్న డుమ్రిగుడా అనే గ్రామం వెళ్ళాడు.

అక్కడ పనిచేసుకుంటూ పాడుకుంటున్న ఒరియా జానపద గీతాన్ని రికార్డ్ చేసుకుని వింటూ రైల్వేస్టేషన్‌లో కొచ్చాడు.



శృంగవరపుకోట వేపు వెళ్ళే రైలు కోసం సిమ్మెంటు బెంచీ మీద కూర్చుని వున్న రైల్వే ఉద్యోగులు అతన్ని చూసి పలకరించారు. "ఏవండి, వాసుగారూ, బాగున్నారా?" అని.

"ఆ" అన్నాడు జవాబుగా.

"చాలా చిత్రమైన మనిషి"

"మనుషుల్లో కలవడు."

"పొరపాటున నోరు విప్పితే ఎవరికీ ఏమీ అర్థం గాకండా మాటాడతాడు."

"ఏదో రాస్తాడట?"

"అవును... రచయిత."

"ఎందులోనన్నా అచ్చయ్యాయా?"

"నే రాసినవి అచ్చుకావు అన్నాడు."

"ఏంటో విచిత్రమైన మనిషి."

"ఆ మధ్య ఒక అర్ధరాత్రి ఇంట్లోంచి బయటికొచ్చేస్తే పాపం భార్య హరికెన్ లాంతరు పట్టుకుని ఈ అడివంతా వెతుక్కుందట. తీరా చూస్తే ఈ స్టేషన్ చివర తల కింద ఇటుక పెట్టుకుని పడుకుని చుక్కల్ని చూస్తున్నాడట."

"గాలికొండపురంలో వుండే వాళ్ళెవరికీ వాసూ మీద స్పష్టమైన అభిప్రాయంలేదు. అతను కనిపించినప్పుడల్లా 'అదో' రకమైన అభిప్రాయంతో మాటాడుకుంటూ వుంటారు.

*

ఐ.ఎ.ఎస్. ఆఫీసర్ గోపాలాచారికి ముప్ఫై ఎనిమిదేళ్ళు వుంటాయి. ఆమధ్య ఒక వీక్లీలో అతను రాసిన హైకూలు అచ్చయ్యాయి.

వెన్నెలని అనుభవించే శక్తి పరిస్థితుల వల్లనో వయసువల్లనో పోయినవాడు, హృదయంలోంచి వెన్నెలని సృజించుకోలేని మనిషి దురదృష్టవంతుడు. తను చదివిన ఈ వాక్యాలు చాలాసార్లు మననం చేసుకుంటాడతను.

ఏ వెన్నెలా లేని పదవి తనకి దొరికినందుకు చాలా ఇబ్బందిపడ్డ సందర్భాలు ప్రతిరోజూ ఏర్పడుతుంటాయతనికి.

గాలికొండపురం లోయల్లో ఘనీభవించే సుందర చైతన్యాన్ని దర్శించడానికి వచ్చిన అతను నిన్న రాత్రే హేట్‌హిల్ మీదుండే బేంబూ గెస్ట్‌హౌస్‌లో దిగాడు.

ఒక రెండువారాల పాటు అతని మకాం ఇక్కడే.

ఆ ఉదయం షార్ట్స్, షూ వేసుకుని మార్నింగ్ వాక్‌కి బయలుదేరిన గోపాలాచారి స్టేషన్ దాటి టన్నెల్ నెంబర్ 42 వేపు వెళ్తూ కింద అందంగా ప్రవహిస్తున్న గోస్తనీనది కనిపించేసరికి దారి అటు మళ్ళించాడు. మంచు తెరలతో నిండిన ఆ నది అందం అద్భుతం అనిపించింది.

దగ్గర్లో వున్న సొలపచెట్టు మీద కోయిలకి వంతగా కూస్తున్న చాలా పక్షుల శబ్దాలు వింతగా వినిపించాయి.

ఆ పక్షుల రాగాల్నే వింటూ ఆగిపోయిన అతనికి మంచులో నడిచి వస్తున్న వాసూ అతని భార్య కనిపించారు. వాళ్ళు తన వేపే వస్తున్నారు.

వాళ్ళ మాటలు తనకి వినిపిస్తున్నాయి.

"ఈ ఉదయం చాలా అందంగా వుందండీ" అంటోందామె.

"సౌందర్యమంటే ఏమిటి?" వాసు అడిగాడామెని.

"ఏమిటీ?" ఎదురు ప్రశ్నించిందామె.

"మనం ఏమీ లేకుండా వున్నప్పుడు, మనల్ని గురించి మనకొచ్చే ఊహలూ ఆలోచనలూ లేనప్పుడూ సౌందర్యం గోచరిస్తుంది. ఎలాంటి మానసికతకీ దాసులు కాకుండా వున్నప్పుడు సౌందర్యస్పర్శ లభిస్తుందట" అన్నాడు.

"నేనొకదాని గురించి మాటాడ్తుంటే మీరింకోదాని గురించి చెప్తున్నారేమో!" అందామె.

వాళ్ళు మరీ దగ్గరయ్యారు. బక్కపల్చటి వాసూని గమనించిన గోపాలాచారి గెస్ట్‌హౌస్ కొచ్చాక అడిగితే చిత్రంగా చెప్పారంతా.

ట్రాన్స్‌ఫరై వెళ్ళిపోయిన మలయాళీ స్టేషన్ సూపర్నెంట్ నాయర్‌గారు వాసూలో ప్రత్యేకతేదో ఉందని అభిప్రాయపడి ఇక్కడి రైలు నిలయం ఆడిటోరియంలో సన్మానం ఏర్పాటు చేయిస్తే ససేమిరా వద్దన్నాడు. అతన్ని ఒప్పించేసరికి ఇక్కడ చాలామందికి పదేళ్ళ ఆయుష్షు తగ్గింది.

లాస్ట్‌కి ఒప్పుకున్న ఈ వాసు స్టేజి మీద ఎలాంటి సభామర్యాద పాటించకుండా మైకు ముందుకొచ్చి దేవతల ఆశీర్వాదం పొందిన ఈ లోయలో ఆనందంగా గడుస్తున్న ఈ చల్లని సాయంత్రం వేళ ఎన్నో ఏళ్ళనించి నేను పెట్టే యాతనని ఆనందంగా భరిస్తున్న ఒక వ్యక్తికి పాద నమస్కారం చెయ్యాలి అని స్టేజి మీదున్న తన భార్య కాళ్ళకి నమస్కారం చేశాడు.

అక్కడున్న వాళ్ళు చెప్పిన ఆ సంఘటన విన్న గోపాలాచారికి వాసుని కలవాలన్న కుతూహలం పెరిగింది.

"అతన్ని కలవాలి... కబురుచేస్తే వస్తాడా?" అడిగాడు అక్కడివాళ్ళని.

"డౌట్ సార్! రాడు" అన్నారు.


"అతనికి స్నేహితులెవరైనా వున్నారా ఇక్కడ?"


"లేనట్టే సార్."

"అతని ఇల్లెక్కడ?"

"మీరు జాగింగ్‌కి వెళ్ళిన గోస్తనీనది ఒడ్డున."

*





సాయంత్రం నాలుగు గంటలు దాటింది.

శీతాకాలం గాలి అతి చల్లగా వీస్తోంది.

చాలా దారులున్న ఆ పర్వతం ఎక్కుతున్నాడు గోపాలాచారి. ఎటుపక్క చూసినా నారింజచెట్లు, అక్కడక్కడా పనసచెట్లు, చెట్టు మొదట్లో పుంజీడు పనసపళ్ళు. వాటి మధ్యలో కొన్ని మిగలముగ్గి పగిలిపోవడం వల్ల నారింజల పరిమళంలో ఆ పరిమళం కూడా కలుస్తోంది.

ఇంకాస్త ముందుకి నడిచి పర్వతం మరో పక్కకి దిగుతుండగా ఆకులకి సమసంఖ్యలో పూచిన ఆకు సంపెంగలు, అక్కడక్కడా పేరు తెలియని వింత రంగుల పుష్పాలు, వింత వింత పరిమళాలు.

'ఆ వాసూ అన్నట్టు దేవతల ఆశీర్వాదం పొందిన వనమే ఇది' అనుకుంటూ పర్వతం పూర్తిగా దిగి కొంత దూరం నడిచేసరికి కనిపించింది గోస్తనీ నది. దాని ఒడ్డునే వుంది పచ్చి వెదుళ్ళతో నిర్మించుకున్న వాసు ఇల్లు.

నది ఒడ్డున కూర్చుని నీలంగా వున్న ఆకాశాన్ని తన్మయత్వంతో చూస్తున్నాడతను. అతని ఏకాంతానికి భంగం కలక్కూడదని దూరం నించే గమనిస్తున్నాడు గోపాలాచారి. కాస్సేపటికి తెల్లటి డేగ ఒకటి నీలం ఆకాశంలో వలయాలు తిరుగుతోంది. తదేకంగా దాన్నే చూస్తున్నాడు.

ఇంతలో ఎక్కడ్నుంచి వచ్చిందో ఒక వింత పక్షి , నది ఒడ్డునున్న తడి మట్టి దువ్వి దాంట్లో దాక్కున్న పొడుగాటి పురుగుని లాగే ప్రయత్నం చేస్తోంది.

నెమ్మదిగా లేచిన వాసు ముందుకెళ్ళి తనని పరిచయం చేసుకున్నాడు గోపాలాచారి.

ఇంత గొప్ప మనిషి తన దగ్గరకొచ్చాడని కంగారుపడకుండా "రండి" అని ఇంటికి తీసుకెళ్ళాడు.

చెమ్మగా వున్న ఆ గదిలో ఎక్కడ చూసినా పుస్తకాలు చిందరవందరగా పడున్నాయ్. సగం రాసి వదిలేసిన కాయితాలు, వాటిమీద సిరా మరకలు.

మంచం నిండా కూడా పుస్తకాలు. కూర్చోండి అని చెప్పి లోపలికెళ్ళి కాఫీకి బదులు ఒక పళ్ళెం నిండా సరస్వతీ ఆకూ, నాలుగు పచ్చి వేరు ముక్కలూ పట్టుకొచ్చి "నమలండి మంచిది" అన్నాడు.

"ఏం రాస్తున్నారు?" అడిగాడు గోపాలాచారి.

"రాసింది నచ్చితేగా" అన్నాడు వాసు.

"ఎవరికి?"

"నాకు."

గది మూల రాసి చింపి వుండలు చుట్టి పారేసిన కాయితాలూ చాలా కనిపించాయి.

దేని గురించి అడిగినా పొడిపొడిగా సమాధానాలు చెప్పిన అతను చివరికొకటి స్పష్టంగా చెప్పాడు. రాసినవి చాలా చింపేయగా కాస్తేదో తృప్తినిచ్చిన ఒక నాటకం వుందట. దాన్ని తనే డైరెక్ట్ చేసి వేలీ స్కూల్ ఆడిటోరియం లో ప్రదర్శించాలట.

"వీలవుతుందో,లేదో" అన్నాడు.

"ఆ నాటకం కథేంటి?" అడిగాడు గోపాలాచారి.


"ఏదో లెండి... 'నీడలు వేలాడే సమయమిది' అనిపేరు పెట్టానందాకా."

"చాలా బాగుంది. అందమైన ఈ గాలికొండపురం అంతా మీలాంటి క్రియేటర్స్‌తో నిండిపోవాలని పిస్తుంది" అన్నాడు గోపాలాచారి.

"వంద మంది వుంటే అందులో ఒకడు క్రియేట్ చెయ్యాలి. తక్కినవాళ్ళు వాడు చేసినదాన్ని రివ్యూ చెయ్యాలి. రజనీష్ అన్నట్టు నాలాంటి ప్రతివాడు క్రియేటరయితే ఈ ప్రపంచం చాలా అగ్లీగా తయారవుతుంది. అసలుకొస్తాను క్రియేటివిటీ అంటే ఏమిటీ? నాక్కావల్సింది లిటరల్ మీనింగ్ కాదు."

"మీరే చెప్పండి" అని అన్నాడు గోపాలాచారి.

"స్వచ్ఛమైన మనసుతో చేసింది ప్రతిదీ క్రియేటివ్‌గానే వుంటుంది. తెల్లకాయితం లాంటి మనసుతో మీ ప్రేయసికేదైనా రాయండి. అందులో క్రియేటివ్ థింగ్ వుంది. అంతే తప్ప క్రియేటివిటీ అంటూ ప్రత్యేకించి ఏమీ లేదట" అన్నాడు వాసు.



గెస్టుహౌస్ కొచ్చిన గోపాలాచారి మనసునిండా నిండిపోయాడు వాసు. అతని గురించి పదేపదే ఆలో చిస్తుంటే అతనో తత్వవేత్తలా అనిపించాడు. తనీ ఊరినించి వెళ్ళేలోపే ఆ నాటక ప్రదర్శన జరగాలి అనుకున్నాడు చివరికి.

*

అనుకున్నట్టే ప్రదర్శనకి సంబంధించిన పనులు చాలా అద్భుతంగా సాగుతున్నాయి.

వైజాగ్ నుంచి నాగమణి అనే అమ్మాయిని, కొందరు మగాళ్ళనీ నాటకంలో వేషాలకి పిలిపించిన వాసు రాత్రీపగలూ తేడా లేకుండా రిహార్సల్స్ చేయిస్తున్నాడు. తన జీవితంలో అంతగా శ్రమించిందెప్పుడూ లేదేమో!

అతనలా శ్రమపడ్తుంటే ఇరిటేట్ అయిపోతూ తిట్టుకుంటున్నారు ఆర్టిస్టులు. హీరోయిన్ వేషం వెయ్యడాని కొచ్చిన అమ్మాయయితే చెప్పాపెట్టకుండా కిరండోలు పాసింజరెక్కి పారిపోయింది. నానా అవస్తాపడి ఇంకో అమ్మాయిని తీసుకొచ్చారు.

వైజాగ్‌లో వుండే రైల్వే డివిజినల్ మేనేజర్‌ని, రైల్వే కాంట్రాక్టర్స్‌నీ, డివిజినల్ ఫారెస్ట్ ఆఫీసర్లనీ, గొప్పగొప్ప కళాకారుల్నీ ప్రదర్శనకి ఆహ్వానించాడు గోపాలాచారి. దగ్గర్లో వున్న అనంతగిరి, అరకు, పాడేరు ప్రాంతాల్లో వుండే జనం కూడా పిలవబడ్డారు.

ఆ చల్లని సాయంత్రం గాలికొండపురమంతా ఇంతకు మునుపెన్నడూ లేనంత వింత కాంతిని చిమ్ముతూ మెరిసిపోతోంది.

వేలీ స్కూల్ ఆడిటోరియం నిండా జనం గోస్తనీ నదిలో జలంలా నిండిపోయారు. గాలికొండ మీంచి వీస్తున్న చల్లగాలిని వచ్చిన జనమే పీల్చేసి, వదలడంతో వేడిగా తయారైంది వాతావరణం. జనం మాటలకి డిస్టర్బయిపోయిన లోయలో పక్షులు ఆ పూటకి రాగాలు తీయడం మానేశాయి. పచ్చటి లోయల్నిండా చిక్కటి చీకటి అలుముకుంది.

వాసు నాటక ప్రదర్శన ప్రారంభమైంది.

"...కోరికని అర్థం చేసుకోవాలి. కోరికది ఒకే చర్య- అది రకరకాలుగా ఒకదానికొకటి వ్యతిరేకంగా కోరుతూ కృషి చేస్తున్నప్పటికి అవన్నీ కోరిక నించి పుట్టినవే. కోరికని ఉన్నతమైనదిగా చూడ్డంగానీ, అణచి వెయ్యడంగానీ చెయ్యకూడదు. దాన్ని అర్థం చేసుకోవాలి. అర్థం చేసుకునే రూపమొకటి వున్నట్టయితే అదీ కోరిక రూపమే. అనుభవం పొందేది లేకుండా అర్థం అయినట్టయితే అనేకం నించీ ఒక్కటినించీ కూడా స్వేచ్ఛ లభిస్తుంది..."

స్టేజి మీద ప్రసంగిస్తున్న ఆ మనిషి వేషం మహా తత్వవేత్త జిడ్డు కృష్ణమూర్తిని పోలి వుంది.

అతని చుట్టూ వున్న కొందరు అతని మాటల్ని వ్యతిరేకిస్తున్నారు. స్వామీజీ వేషంలో వున్న ఒక మనిషైతే మరీ మర్యాద దాటిపోతున్నాడు.

చాలా అద్భుతంగా, ఆసక్తికరంగా సాగుతోంది నాటకం. రెప్పార్పకుండా చూస్తున్నారంతా.

'చెత్త నాటకం' అన్న మాటలు ప్రేక్షకుల్లోంచి వినిపించాయి. ఆ మాటలన్న మనిషిని పట్టించుకోని స్థితిలో వున్న జనం ప్రదర్శనలో లీనమయి ఉత్కంఠతో చూస్తున్నారు.

"జె.కె. జుట్టు వెండిలా వుండుంటుంది. ఆ స్టేజి మీదున్న వాడిలా నల్లగా వుండదు" మళ్ళీ వినిపించాయి మాటలు.

తన్మయులై వున్న జనం ఈసారి కూడా పట్టించుకోలేదు.


"ఆ స్వామీజీని చంపెయ్యండి... అసలా పాత్ర ఏమిటి... చాలా అబ్సర్డ్‌గా వుందీ నాటకం. అసలు దీన్ని రాసి డైరెక్ట్ చేసినవాడ్ని ఉరితియ్యండి... వెంటనే ఉరి వెయ్యండి వాడ్ని."


జనం లోంచి వినిపిస్తున్న అరుపులకి కలకలం రేగింది. ఆడిటోరియంలో లైట్లు వెలిగాయి.

నాటకం ఇంత గొప్పగా జరుగుతూంటే పేలుతున్న ఆ ఇడియట్ ఎవరా అన్నట్టు కోపంగా ఒకేసారి తలలు తిప్పి చూశారంతా.

"స్టాప్ ది ప్లే... స్టాప్ ది ప్లే!" పూనకం వచ్చినవాళ్ళా పెద్దగా అరుస్తున్న ఆ మనిషి- ఆ నాటక రచయితా, నిర్దేశకుడూ అయిన వాసు.

*స్వాతి సపరివారపత్రిక*
*24 జులై 1997*






ఏటిగట్టుమీద..



వాళ్ళిద్దరూ లేచిపోయి నెలరోజులైంది. పట్టిసం అవతల పాతిక ఎకరాల పొగాకు తోట యాజమాని బులిసుబ్బయ్య కూతురు సావిత్రి. వేగేశ్వరపురం పంపింగ్ షెడ్‌లో రోజువారీ కూలీకి చేరిన మనిషి సుందరం.

నిరుడు పట్టిసీమ జాతరకి వెళ్ళినప్పుడు పరిచయం అయ్యింది సావిత్రి. పదినెలల కాలంలో ఆ పరిచయం బలమైన బంధంగా మారింది. పెళ్ళి చేసుకుని అదే ఊళ్ళో కాపురం చేద్దామంటే పరిస్థితులు ఏమాత్రం అనుకూలించలేదు.

దాంతో ఒకరోజు రాత్రి, పాపికొండల దగ్గర్లో వున్న కొండమొదలు అనే ఊర్నుంచి బయలుదేరే పాసింజరు లాంచి వాళ్ళ ఊరి రేవులో ఆగినప్పుడు అది ఎక్కి రాజమండ్రి గో పాదాలరేవు దగ్గర దిగారు.

అక్కడ్నుంచి అన్నవరం వెళ్ళి పెళ్ళి తంతు ముగించుకుని రెండురోజులు సత్రంలో కాపురం చేసేసరికి తెచ్చుకున్న డబ్బులు మొత్తం అయిపోయాయి. ఇక వేరే దారిలేక దేవస్థానం సత్రంలో పనికి కుదిరారుగానీ నాలుగు రోజులకంటే ఎక్కువ వుండలేక పోయారక్కడ.

ఆ తర్వాత కత్తిపూడి జంక్షన్‌కి, అక్కడ్నుంచి బంగాళాపెంకుల బట్టీలుండే జగ్గంపేటకీ మారారు.

సావిత్రి అందగత్తె అయిన కారణంగా విషమించే పరిణామాలు ఎక్కువగా ఏర్పడ్డంతో ఒకరాత్రి లారీ ఎక్కి రావులపాలెం వెళ్ళారు. అమృతపాణి అరటిగెలలు టోకున అమ్మే కొండల్రావు దగ్గర పనికి కుదిరారు. అక్కడా సమస్యే.

వారంరోజులపాటు అంబాజీపేటా, అమలాపురం తిరిగి ఒకరోజు రాత్రయ్యేసరికి ఎదుర్లంక రేవుకొచ్చారు. ఆ ఒడ్డుకి అవతలివైపుంది యానాం. టిక్కెట్లు కొనుక్కుని ఫంట్ ఎక్కారు.

పౌర్ణమి వెళ్ళిన మూడోరోజు అది.

చంద్రుడు ఆకాశంలోకి ఆలస్యంగా వచ్చాడు.

ఆగాగి వీస్తుంది తూరుపుగాలి.

గోదావరి మధ్యలో వేట పడవల వాళ్ళ లాంతర్లు మినుకు మినుకుమంటూ వెలుగుతున్నాయి.

ఫంట్ నిండా వున్న జనం తెగ మాటాడుకుంటున్నారు. ఒక మూల కూర్చున్న సావిత్రికి కాస్త ఆనుకుని కూర్చున్న సుందరం. "మనం ఎక్కడికెళ్ళినా ఏదో ఒకటి జరిగి మనల్ని అక్కడ వుండనియ్యకుండా చేస్తుంది. ఎందుకంటావ్?" అన్నాడు.

వెన్నెల్లో గోదావరిని చూస్తున్న సావిత్రి తలెత్తలేదు. నోరు విప్పలేదు.

మళ్ళీ అడిగాడు.

"ఏమో!" అంది మంద్రంగా.

"నిజంగా నీకు తెలీదా, సావిత్రీ?"

"తెలీదు."

"నాకు తెలుసు. చెప్పనా!"

"ఏంటీ?"

"నీ కళ్ళు బాగుంటాయి. నువ్వు పొడుగ్గా, అందంగా వుంటావు. నాకు కొంచెం పొట్ట వుంది. పొట్టిగా వుంటాను. నా ముఖం పెద్దేం బాగోదు."

"ఏదో చెప్తానని ఇదంతా చెప్తున్నావేంటి?" ఇబ్బందిగా అడిగింది సావిత్రి.

"అక్కడికే వస్తున్నాను విను... పక్కపక్కనే నిలబెడితే మనిద్దరిదీ సరైన జంట కాదు. మనిద్దర్నీ చూసిన జనం మొగుడూ పెళ్లాలుగా లెక్కేసుకోలేక, నన్ను నీ భర్తగా అంచనా వెయ్యలేక లోకువ కడ్తున్నారు. ఆ కారణంగానే మన పెళ్లయిన రోజు నించీ ఏదో ఒకటి జరుగుతూనే వస్తోంది."

ఇంకా ఏదో చెప్పబోతున్న సుందరాన్ని ఇక ఆపమని సైగచేసి "భార్యాభర్తలంటే ఈడూ జోడూ సరిగ్గా వుండటం కాదు. నువ్వు పొడుగు లేకపోవచ్చు. నీ ముఖం బాగోకపోవచ్చు. ఏ అందగాడికి లేనంత అందమైన మనసుంది నీకు. నాకు కావల్సింది అదే. అది నచ్చే నిన్ను కోరుకున్నాను. ఇక జనం మనల్ని ఎలా అనుకున్నా నా కనవసరం. నాకు నువ్వు, నీకు నేను. అంతే. ఇంకెప్పుడూ ఇలా ఆలోచించొద్దు" అనేసింది సావిత్రి.

వాళ్ళలా మాటాడుకుంటుండగా మధ్యలో కొచ్చాడు ఒక మనిషి. నల్లగా, సన్నగా, కాస్త పొడుగ్గా వున్నాడు. ఓపెన్ షర్టూ, లూజు పైజామా వేసుకున్న అతను "ఎందాకా ప్రయాణం?" అనడిగాడు.

"యానాం ఊళ్ళోకి" చెప్పాడు సుందరం.

"ఎవరింటికీ?" మళ్ళీ అడిగాడా మనిషి.

"ఎవరింటికీ కాదు. చాలా దూరంనించి వస్తున్నాం. అక్కడేమన్నా పని దొరుకుతుందేమోనని బయల్దేరాం" అంది సావిత్రి.

"మీ ఇద్దరూ ఏమవుతారు."

"భార్యా భర్తలం."

"ఏంటీ??"

"అవునండీ మేమిద్దరం మొగుడూ పెళ్ళాలం. ఏం?" అంది సావిత్రి.

"ఏం లేదు... మరి నీ భాషకీ ఇతని భాషకీ, తేడా వుందేంటీ?"

"తను బాగా చదూకుంది" చెప్పాడు సుందరం.

"అలాగా" అని కాస్త ఆలోచించిన ఆ మనిషి "పారిపోయి వచ్చారా?" అన్నాడు.

"అవును... అన్నవరం వెళ్ళి పెళ్ళి చేసుకున్నాం" చెప్పింది సావిత్రి.

"ఏ పని చెయ్యగలరు?" అడిగాడా మనిషి.

"ఏదైనా సరే... కష్టపడి చేస్తాం."

వాళ్ళ మాటల్లో నిజాయితీ కనిపించిందా మనిషికి. "నా పేరు యర్రంశెట్టి నీలాద్రి. ఊళ్ళో అంతా అబ్బాయి అని పిలుస్తుంటారు. వంతెనకి అటు పక్కన ఒక ఇటుకలబట్టీ వుంది మాకు. వెయ్యి పచ్చి ఇటుక తీస్తే యాభై రూపాయిలిస్తాను. మీ ఇద్దరూ కలిస్తే సునాయాసంగా రోజుకి వెయ్యి తీసెయ్యగల్రు" అన్నాడు.

"ఇటుక ఎలా తియ్యాలో మాకు రాదే?" అన్నాడు సుందరం.



"అదెంత... పూట పని. రేపు నాతోపాటొస్తే మట్టిలో పాళ్ళు ఎలా కలపాలో. అచ్చులో మట్టిముద్ద నొక్కి నేల మీదెలా గుమ్మరించాలో నేర్పుతాను" అన్నాడు అబ్బాయి.

అలాగే అన్నారిద్దరూ.

"పదకొండు దాటేసింది- మీరు భోజనం చేసినట్టు లేదు."

"పర్లేదండీ."

"భళేవోరే" అన్నాడు అబ్బాయి.

ఇంకాస్సేపయింది.

రేవు దగ్గర పడేసరికి అంతసేపూ కబుర్లలో పడి వున్న జనంలో కలకలం రేగింది. ఒడ్డుకి పూర్తిగా చేరకండానే నీళ్లలోకి దూకేస్తున్నారు కొందరు. మరికొందరు ఒడ్డు మీదికి జంప్ చేసేస్తున్నారు. పంట్ ఒడ్డు అంచు తాకాకా బల్ల వేశాడు సరంగు. ఒకళ్లనొకళ్లు తోసుకుంటూ ఒడ్డు ఎక్కుతున్నారు. అబ్బాయి వెనకాలే నడవడం మొదలెట్టారు. వెన్నెల్లో ముగ్గురి నీడలూ పొడుగ్గా సాగుతున్నాయి.

పెద్ద దొరగారి ఆఫీసు మీదుగా వెంకన్నబాబు గుడి వీధి దాటి, పాత బస్టాండ్ వైపు మలుపు తిరిగి వంతెన కేసి నడుస్తున్నారు.

వంతెనకి అటుపక్కగా వున్న గట్టువేపు మలుపు తిరుగుతుంటే తలుపులు వేసి వున్న రేకుల షెడ్డు ఒకటి కనిపించింది. గట్టుకి ఆ చివర్నుంచి ఈ చివరి దాకా పెద్ద ఇనప గొలుసు ఒకటి అడ్డంగా కట్టి వుంది.

"ఇదిగో గవర్రాజుగారూ! కొంచెం గొలుసు తీద్దురూ" అరిచాడు అబ్బాయి.

అలా రెండు మూడుసార్లు అరిచాకా మూసివున్న రేకుల షెడ్డు తలుపులు బద్దకంగా తెరుచుకున్నాయి. కాకీ నిక్కరూ, ఖద్దరు బనియనూ వేసుకున్న ఒక నల్లటి లావుపాటి మనిషి ఆవులిస్తూ లాంతరు అందుకుని "ఏంటయ్యా గొలుసు తియ్యడానికి మాకు వేళాపాళా లేదా?" అన్నాడు.

"ఇటుక బేరం వుందంటే అనాతవరం వెళ్ళాను. ఇవేళ అవతల ఒడ్డున పంటి ఆలస్యంగా బయలుదేరింది" మెత్తగా చెప్పాడు అబ్బాయి.

విసుక్కుంటూ గొలుసు లాగాడు గవర్రాజు.

కొంచెం ముందుకెళ్ళాకా "ఆ గొలుసేంటి? ఎవరతను?" అనడిగింది సావిత్రి.

"అది పి.డబ్ల్యు.డి వాళ్ళ ఆఫీసు. వాడు మైలుకూలీ గవర్రాజు. ఈ గట్టుకి మహారాజులే. మా ఇటుకల బళ్ళు ఈ గట్టు దాటాలంటే ట్రిప్పుకి పదిరూపాయిలిస్తే తప్ప గొలుసు తియ్యడు" చెప్తూ ముందుకి నడుస్తున్నాడు.

గట్టుకి ఎడం పక్క గోదావరి కాలవ, కుడిపక్క నక్కలదిబ్బ. దానికి దూరంగా చిక్కగా వున్న కొబ్బరి తోటలు, పంట పొలాలు.

గాలివేగం పెరిగింది. చంద్రుడు మబ్బుల్లో కెళ్తున్నాడు. అప్పుడప్పుడూ నక్కల అరుపులు తప్ప వాతావరణం అంతా నిశ్శబ్దంగా వుంది.

గట్టుమీద కొంతదూరం నడిచాకా కొత్తగా కట్టిన డాబా కనిపించేసరికి అక్కడాగిన అబ్బాయి "ఇదే మా ఇల్లు. ఇంకొంచెం ముందుకెళ్తే మా బట్టీ వస్తుంది. దాని ముందు ఆరిన పచ్చి ఇటుక దాయడానికి నేసిన మా తాటాకు పాక వుంది. మీ ట్రంకుపెట్టి అదీ అందులో పెట్టుకుని గోదాట్లో, కాళ్ళూ చేతులు కడుక్కు రండి. ఈలోగా మా వెంకటలక్ష్మిని లేపి వంట చేయిస్తాను" అన్నాడు.

*

ఆడుతూ పాడుతూ రోజుకి పదిహేను వందల ఇటుక తీసేస్తున్నారిద్దరూ. వెన్నెల రాత్రుళ్ళలో అయితే రెండువేలకి పైనే తీస్తున్నారు.

తెల్లవారుఝామున రేవులో సరిగంగ స్నానాలు, కొబ్బరితోటల్లో సరసాలూ సల్లాపాలూ, ఇటుక రవాణా చేయడానికి వచ్చే పడవల్లో షికార్లు, కాలవకి అటుపక్క టూరింగ్ టాకీసులో సినిమాలు, మస్తాను మిలటరీ హోటల్లో పలావు పొట్లాలు. డబ్బులు ఇష్టానికి ఖర్చు పెట్టేస్తున్నారు.

ఆ రోజు ఆకాశం నిండా మబ్బులు, ఒకటే ఈదురు గాలులు. కుండపోతగా కురుస్తోంది వర్షం.

ఏటిగట్టంతా బందబందగా తయారవడంతో ఎడ్లబళ్ళు రావడం మానేశాయి. ఒక్క వర్షం, గాలి శబ్దం తప్ప ఎక్కడ చూసినా నిశ్శబ్దం.

మొన్న సంతలో కొన్న బర్మా రగ్గు కప్పుకుని వెచ్చగా మెలికలు తిరిగి పడుకున్నారు.

వెచ్చటి వెన్నెల్ని ఇక స్వేచ్ఛగా గిల్లుకోవచ్చనీ, కరిమబ్బులకి ఉయ్యాల వేసుకుని హాయిహాయిగా ఊగొచ్చనీ, తారల్నించి వెండిదారాలు తీయొచ్చనీ, నది అలల్లో చేరి అందమైన కలల్ని అల్లొచ్చనీ అప్పుడే తెలిసింది.

జీవితం పరమ సుఖమయం అని ఇప్పుడే అర్థమయ్యింది.

*

పాత మైలుకూలీ గవర్రాజుకి దవిళేశ్వరం ట్రన్స్‌ఫరైతే కోటిపల్లి నుంచి రవణరాజు అనే కొత్త మైలుకూలీ దిగాడు.

గవర్రాజులాగ ఏభై ఏళ్ళ మనిషి కాదు రవణరాజు, మహా అయితే ముప్పై వుంటుంది. అందగాడు. ముక్కుపొడుం రంగు పాంటూ, చిన్న గళ్ళచొక్కా వేసుకుని కొత్త హంబర్ సైకిలు తొక్కుకుంటూ ఏటిగట్టు మీద వెళ్తుంటే చొక్కాకి రాసుకున్న నూర్జహాన్ సెంటు ఆ గట్టంతా గుభాళిస్తుంది.



అతను సిగరెట్ కాలుస్తుంటే చాలా చక్కని వాసనొస్తుంది. అతని పక్కన కూర్చున్న వాళ్ళకి కూడా కాల్చాలి అనిపిస్తుంది.

అక్కడి గోదావరి కాలవలో స్నానం చేస్తున్నప్పుడూ, వెన్నెల్లో ఇటుక ఆవఁ కాలుస్తున్నప్పుడూ సావిత్రి రవఁణరాజుకి కనిపించింది. అతని డేగ చూపులు జారిపోయిన బాల్చీ కోసం నూతిలో వదిలే గేలం ముళ్ళలాగా గుచ్చుకోవడం మొదలెట్టాయి ఆమెకి.



ఆ రోజు మంగళవారం. యానాం సంత.

ఎండుచేపల దుకాణం దగ్గరున్న సావిత్రి పక్కనే నిలబడ్డాడు. తనని గమనించి కూడా పట్టించుకోని సావిత్రి అక్కడ్నుంచి చింత చిగురు అమ్మే దుకాణం దగ్గరకెళ్ళింది.

ఆమె పక్కనే నడిచెళ్ళాడు.

వాళ్ళిద్దర్నీ అలా పక్కపక్కనే చూసిన ఆ సంతలో జనం కొత్తగా పెళ్ళయినట్టుంది. చూడ్డానికెంత ముచ్చటగా వున్నారూ అనుకోవడం ఇటు సావిత్రీ, అటు రవఁణరాజూ విన్నారు.

రాత్రంతా సంతలో జనం అన్నమాటల గురించే ఆలోచించాడు రవఁణరాజు. తన ప్రమేయం లేకుండానే సావిత్రి తనకు చాలా దగ్గరయినట్టూ, ఆ తర్వాత సొంతమయినట్టూ కలలొచ్చాయి.

అలా కొన్నాళ్ళు అలాంటి కలలనే అందంగా అనుభవించిన రవఁణరాజుకి ఆమె లేకపోతే ఇక బతకలేని స్థితి ఏర్పడింది. చచ్చి అయినా సరే సాధించాలి అన్న నిర్ణయానికొచ్చేశాడు.

ఇటుకబట్టి వ్యాపారం చేసే అబ్బాయికి ఊకపొయ్యిలు కట్టే పని కూడా వచ్చు.

ఆ ప్రాంతాల్లో కొత్తగా కాఫీ హోటళ్ళు పెట్టుకోబోతున్న వాళ్ళు పొయ్యి కట్టడానికి అబ్బాయినే ఎక్కువగా పిలుస్తుంటారు.

ఒక సాయంత్రం ఆ పనిమీద ధనియాలతిప్ప నించి కబురొస్తే బయలుదేరుతూ పై పని చెయ్యడానికి పనికొస్తాడని సుందరాన్ని కూడా తీసుకెళ్లాడు.

ఒంటరిగా వున్న సావిత్రి దగ్గరకెళ్ళి ఆ మాటా ఈ మాటా అయ్యాకా తన మనసులో మాట బయట పెట్టేసరికి కొమరిపాలెం పేలుడుజువ్వలా లేచింది సావిత్రి. ఇంకా ఏదో మాటాడబోతుంటే ఇక మాటాడే అవకాశం ఇవ్వలేదు. వెనక్కి తిరిగి వచ్చెయ్యడం తప్ప చేసేదేం లేకుండా పోయింది.

*

ఇంతకుముందు ఎప్పుడూ లేనంత విపరీతంగా వున్నాయి ఎండలు. మిట్ట మధ్యాహ్నం బయటికి రావడానికి చాలా భయపడిపోతున్నారు జనం.

వీచి కొడ్తుంది వడగాల్పు.

ఆ ఎండలో బట్టీ కాల్చడానికి పైకెక్కిన సుందరం దానిమీద గంటసేపు వుండిపోయేసరికి కొడ్తున్న వడగాల్పుకి కళ్ళు తిరిగినట్టయ్యి ఎత్తయిన ఆ బట్టి మీంచి కింద పడిపోయాడు.

స్పృహ తప్పింది సుందరానికి.

ఊళ్ళో వున్న వర్మ డాక్టరుగారి దగ్గరికి తీసుకెళ్ళేసరికి కోమాలోకి వెళ్లిపోయాడు సుందరం.

తలలో చిన్న నల్ల కంకరాయి గుచ్చుకుంది. రాజమండ్రి స్వతంత్ర హాస్పిటల్నించి న్యూరోసర్జన్ని తీసుకురావాలి అన్నాడు డాక్టరు.

అబ్బాయి దగ్గరికి పరుగెట్టుకెళ్ళిన సావిత్రి అతన్ని బతిమాలింది. కాయితం మీద సంతకం పెడితే పదివేల దాకా సర్దగలను అన్నాడతను.

మళ్ళీ డాక్టరు దగ్గరికి పరుగెట్టుకెళ్ళి ఎంత ఖర్చయినా పర్లేదు. మా సుందరం బతకాలి... నా భర్తని బతికించండి అని భోరున ఏడ్చింది.

రోజులు గడుస్తున్నాయి.

సుందరం ఇంకా స్పృహలోకి రాలేదు.

*

కాదు పొమ్మంటుంది కానీ ఆ సావిత్రి నాకు సరైన జోడీ. ఈ ఏటిగట్టు మీదే కాదు; ఊరి మొత్తంమీద ఎవర్నడిగినా అదే చెప్తారు. నూరు ఆరైనా సరే సావిత్రితో ఒప్పించాలి.

ఎలాగ?





ఈ గట్టు గవర్నమెంటుది. ఇటుకతీత ఆపేసి బట్టీలు పడగొట్టెయ్యండి. వెంటనే నే చెప్పినట్టు చెయ్యకపోతే కోటిపల్లిలో వుండే మా పెద్ద దొరగారికి కంప్లయింట్ చెయ్యాల్సి వస్తది. ఆయనొచ్చాడంటే మీ బట్టీలు పడగొట్టడమే కాదు; జుర్మానాగా తలో లక్షా వేసేస్తాడు అంటూ అబ్బాయితోనూ, ఆ గట్టు మీదున్న తక్కిన బట్టీవాళ్ళతోనూ ఘర్షణ పడ్తున్నాడు రవణరాజు.

అందరికి తెల్సు అతను పెడ్తున్న గొడవ వెనకాల అంతరార్థం. ఎలాగూ లేచిపోయి వచ్చిన బాపతేగా ఒక రాత్రి ఆడి దగ్గరకెళ్తే వచ్చిన నష్టమేంటి.

అసలు దాని మొగుడి కంటే వాడెంత అందగాడనీ. నిజం చెప్పాలంటే సావిత్రికి సరైన జోడు సుందరం కాదు; ఆ రవణరాజే. బయటపడ్డం లేదుగానీ ఎవరికి వాళ్ళు గొణుక్కుంటున్నారు.

సావిత్రికి ఖాయంగా అర్థమైపోయింది. రవణరాజు డేగచూపు. వాడి గురి మహారథులు, బ్రహ్మ రాక్షసులు కూడా తప్పించుకోలేని గురి.

ఆ సాయంత్రం మబ్బులు దట్టంగా మూసేసి వున్నాయి. పెద్ద వడగళ్ళ వాన పడేలా వుంది. కళ్ళంలో ఆరబెట్టిన పచ్చి ఇటుకని పాకలోకి చేరవేస్తున్న టైములో కడుపులో తిప్పినట్టయ్యి పెద్దగా వాంతి చేసుకుంది.

ఏదో అనుమానమొచ్చి డాక్టరు దగ్గరకి పరుగెట్టింది. పరీక్షలు చేసిన నర్సు హాయిగా చెప్పేసింది నీకు మూడో నెల అని. ఒకప్పుడు ఆనందపడేదేమో! ఆ క్షణంలో మాత్రం గుండెలు సర్వం జారిపోయినట్టనిపించి గబగబా డాక్టరు దగ్గరకి పరుగెత్తి-

"నర్సమ్మ నాకు కడుపని చెప్పింది. భర్త లేని నేను రేపు పుట్టబోయే నా బిడ్డతో ఈ ఏటి ఒడ్డున చాలా దుష్టశక్తుల్ని ఎదుర్కోవాలి. చెప్పండి... నా భర్త బతుకుతాడు అంటే ఈ కడుపు వుంచుకుంటాను. లేకపోతే తీయించేసుకుంటాను."

గొంతు పెంచి ఆవేశంగా మాటాడ్తున్న ఆమె మాటలు ఏ మాత్రం అర్థంగాని డాక్టరు వర్మ రాజమండ్రి నించి వచ్చిన న్యూరోసర్జన్‌తో సుందరం గురించి చర్చించి, "రేపు రా" అన్నాడు.

వారం తిరిగింది. కోమాలోంచి బయటపడ్డాడు సుందరం.

నీ భర్త ఖాయంగా బతుకుతాడు అన్నారు వర్మగారు.

రోజులు గడుస్తున్నాయి. సావిత్రి కడుపులో పిండం పెరుగుతోంది. గట్టుమీద రవణరాజూ, తక్కిన బట్టీల వాళ్ళూ పెడ్తున్న గమ్మత్తయిన బెదిరింపుల్ని భరిస్తూనే పరమానందంగా తన భర్తకి సేవలు చేస్తోంది.

సుందరం ఇప్పుడు చక్కగా మాటాడ్తున్నాడు. సరదాగా నడిచి తిరుగుతున్నాడు.

ఒక సాయంత్రం అతనితో చెప్పింది- "ఇప్పుడు నాకు నాలుగో నెల నిండబోతుంది" అని. చాలా సంబరపడ్డాడు సుందరం.

*

వెంకన్నబాబు గుడి ఎదురు వీధిలో వున్న హాస్పిటల్లోంచి డిశ్చార్జయిన సుందరం, సావిత్రి తీసుకొచ్చిన రిక్షాలో కూర్చున్నాడు. చిన్నా సెంటరూ, పాత బస్టాండ్ దాటి వంతెన పై వెళ్తోంది రిక్షా.

ఎప్పుడూ లేనంత ఆనందంగా వున్నాడు సుందరం. ఏదో చెప్పి అది పూర్తి చెయ్యకుండానే నవ్వేస్తున్నాడు. ఆ నవ్వు మధ్యలో ఆపేసి, ఇంకోటి చెప్పి మళ్ళీ నవ్వేస్తున్నాడు. అతని నవ్వులకి రిక్షా ఊగుతోంది.

వాళ్ళెక్కిన రిక్షా వంతెన దాటి ఏటిగట్టు మొదట్లో వుండే పి.డబ్ల్యు.డి. వాళ్ళ రేకుల షెడ్డు వైపు మలుపు తిరుగుతుంటే గట్టుమీద పేపరుతో నిలబడ్డ తెలుగుదేశం సత్తిబాబూ, కాఫీ హోటలు పోసయ్యా, సూర్య నారాయణా రిక్షాలో వున్న సుందరం కేసి చూస్తున్నారు.

సాయంత్రం ఆ ఏటిగట్టు మీదుండే డ్రైవరు సుబ్బారావు సత్తెమ్మకి కల్లు పోస్తూ శేషారావుతో ఓ ముంత పంపించాడు. బాగా పొద్దుపోయేకా స్నానం చేసి హుషారుగా ఆ ముంత అందుకుని గబగబా తాగేశాడు సుందరం.

చాలా ఆనందంగా వున్న సుందరాన్ని చూస్తూ వంతెన దగ్గర కెళ్ళొస్తాను అంది సావిత్రి. ఎందుకన్నాడు. "నీకు దిష్టి తియ్యడానికి ఎండు మిరపకాయలూ, ఇవాళ కూర వండటానికి మేకమాంసం తీసుకొస్తాను" అంది.

"పొద్దుపోయింది ఒంటరిగా ఏం వెళ్తావ్, అందులోకి అయిదు నెలలు నిండాయి నేనూ వస్తానుండు" అని ఆమె వెనక బయలుదేరాడు. రేకులషెడ్డు దాటి రోడ్డుమీద కొచ్చారో లేదో, చొల్లంగి వైపు నించొస్తున్న ఎండుచేపల లారీ ఇద్దర్నీ గుద్దేసేసరికి చెరోమూలా పడ్డారు.

సావిత్రికి మోచేతులు కొట్టుకుపోయాయి తప్ప పెద్దగా దెబ్బలేం తగల్లేదు. గబుక్కున లేచి ఇంకో మూలపడున్న సుందరం దగ్గరకి పరుగెత్తింది. ఇంతకు ముందు ఏ తలమీదయితే దెబ్బ తగిలిందో సరిగ్గా అక్కడే చిన్న దెబ్బ తగలడంతో అతని ప్రాణం పోయింది.

చనిపోయిన సుందరం కేసి అవాక్కయి చూస్తోంది సావిత్రి. అప్పుడే రేకుల షెడ్డులోంచి బయటికొచ్చిన రవణరాజు డేగకళ్ళతో ఆమెనే రెప్పార్పకుండా చూస్తున్నాడు.

*స్వాతి సపరివారపత్రిక*
*3 జూలై 1998*







"ఇవ్వేళా రేపూ మా హొటేలు కట్టేసేం" అన్నాడు దొరయ్య కాఫీ హొటేల్లో సప్లయరు దుర్గారావు.

"ఈ హొటేల్లో టిపినీల రుచికే అలవాటు పడ్డాం. ఉన్నట్టుండి కట్టేసేం అనేస్తే ఎలాగ. ఎక్కడి కెళ్ళమంటావ్ ఇవ్వేళ?" ఎదురడిగింది రామసీత.

"సినేమా హాలు దగ్గర లక్ష్మి విలాస్‌లో బానే వుంటాయి" అన్నాడు దుర్గారావు.

"ఎక్కడ్నించో దిగడి మా వూళ్ళో హొటేళ్ళ గురించి మాకు చెపుతావేంట్రా... అవునూ... ఎప్పుడూ లేంది ఎందుకు కట్టేసేరు మీ ఒటేలు?" అడిగింది రామసీత.



"ఊకపొయ్యి వాంటింగొచ్చింది. ప్రెతిరోజూ రిపేరే. ఇక లాభం లేదని భైరవపాలెం నించి ఊకపొయ్యిలు కట్టే మనిషిని రప్పించేడు మా ఓనరు... అదిగో చూడు అక్కడ పని జరుగుతుంది కళ్ళానడం లేదా బుల్లీ" అన్నాడు దుర్గారావు.

ఒక చేతిలో తాపీ ఇంకో చేతిలో ఇటికా పట్టుకుని చాలా  సీరియస్‌గా ఊకపొయ్యి కడ్తున్న సంగాడి గంగాధరం అప్పుడు కనిపించేడు రామసీతకి.

రెండు కళాయిలూ లేకపోతే పెసరట్లు వేసుకునే ఇనపరేకు పెట్టుకునే ఓ మోస్తరుసైజు పొయ్యి కడ్తున్నాడు. పొయ్యి ముందు ఊక పొయ్యడానికి తొట్టి కట్టి పొడుగాటి గాడులుండే ఇనపచక్రం బిగిస్తున్నాడు. ఒక సన్నటి ఇనపకడ్డీని ఆ గాడుల్లోకి గెంటి కదిపితే కొంచెం కొంచెం ఊక దిగే ఏర్పాటు చేస్తున్నాడు. అలా చేస్తున్న ఆ మనిషినే చూస్తూంది రామసీత.

ఒంటి మీద కాకి నిక్కరూ ఒక జంధ్యం తప్ప ఇంకేం లేవు. వయసు నలభైకి తక్కువుండవు. జుట్టు అక్కడక్కడా నెరిసింది.

చూసీ చూడనట్టు కాస్సేపు ఆ మనిషిని చూసింది రామసీత.

ఆ మనిషీ రామసీతని చూసేడు.

తాళ్ళరేవు వూళ్ళో వాళ్ళిల్లున్న వీధిలో నడుస్తుంటే రామసీత కోసం ఎప్పట్నుంచో మనసు పారేసుకుంటున్న డబ్బున్నవాళ్ళ కుర్రాళ్ళు, అందమైన కుర్రాళ్ళు వెనకబడ్తుంటే వాళ్ళని కాదంటా... ఛీ పొండంటా ముందుకు నడుస్తున్న అందమైన రామసీత హొటేల్లో ఊకపొయ్యి కడ్తున్న ఆ నడివయసు గంగాధరం గురించే ఆలోచిస్తుంది.

సాయంత్రం, ఆ మర్నాడూ అతన్ని చూడ్డానికని వెళ్ళింది.

దొరయ్య హొటేల్లో ఊకపొయ్యి కట్టడం అయిపోయేకా తాపీ సామాన్ల సంచి సర్దుకుని వెళ్ళిపోతున్న గంగాధరం వెనకాలే వచ్చి "అదేంటో నువ్వు నాకు నచ్చావు అంతే..." అనేసింది.

మూర్ఛొచ్చి బోర్లా పడిపోయిన సంగాడి గంగాధరం ఆ తర్వాత ఎప్పటికో లేచి వాళ్ళూరు భైరవపాలెం వెళ్ళిపోయేడు.

అలా వెళ్ళిన అతను మర్నాడు పొద్దుటికే తాళ్ళరేవు సినేమా హాలు దగ్గర రామసీతని కల్సేడు. ఆ మాటా ఈ మాటా అయ్యేకా "మా అక్క కూతుర్నే చేసుకున్నాను. ఇప్పుడు వదిలేసేననుకో. అయినా అది చేసింది తల్చుకున్నప్పుడల్లా తాగ బుద్దేసి తెగ తాగేస్తున్నాను... నువ్వు నాతో పాటు మా భైరవపాలెం వచ్చేస్తానంటే ఇంక జనమలో మందు జోలికెళ్ళను. మా వూరి భైరవసామి మీద ఒట్టేసి చెపుతున్నాను" అన్నాడు.

"భైరవపాలెంలో మరకాళ్ళు వుంటారు గానీ నీలా ఊకపొయ్యిలు కట్టే వాళ్ళుండరే" అంది రామసీత.

"మేమూ మరకాళ్ళమే. మా నావ మీద కూలికొచ్చే జనంతో పేచీల వల్ల చేపల వేటకెళ్ళడం కుదరక ఈ పన్లోకి షిఫ్టయ్యేను" అన్నాడు గంగాధరం.

"ఇందులో కంటే అందులోనే ఎక్కువ రాబడి గదా?" అంది రామసీత.

"నువ్వు నాకూడా వచ్చేస్తానంటే మళ్ళీ అందులోకే షిఫ్టయిపోతాను" అన్నాడు.

"వస్తాను" అంది రామసీత.

"ఐతే నేను వదిలేసిన భార్య క్రిష్ణవేణి దగ్గర నాకు పుట్టిన కూతురుంది. ఆ పిల్లని మనింటికి తీసుకొస్తాను."

"నేనొప్పుకోను."

"దానికో అన్నం ముద్దెట్టలేవా?"

"నీతో నేను కలుస్తాను, నీ బిడ్డతో కలవలేను. నీ పిల్ల రాడంతో మొదలైన ఇల్లు మొత్తం బంధువుల్తో నిండిపోద్ది. తర్వాత... బాగా ఆలోచించుకుని చెప్పు" అంది రామసీత.

"సరే నువ్వు చెప్పినట్టే చేద్దారి. పండగలకీ పబ్బాలకీ పిల్లొచ్చినప్పుడు ఓ గౌనుకి సరిపోయే ఒక చీటీ గుడ్డా నాలుగు పప్పులూ పెట్టి పంపించాలి. నువ్వు దీనికి కాదనకు బాబ్బాబు" అన్నాడు.

"సరే" అన్న రామసీతతో పాటు గుడ్డోడి తూము దగ్గరున్న ఓబులేసు జట్కా ఎక్కి దార్లో తగిలే రకరకాల వూళ్ళు దాటుకుంటా భైరవపాలెం రేవులో దిగారు.

అప్పుడే పెళ్ళిచేసుకుని వచ్చిన పెళ్ళివాళ్ళు గోదాట్లో కాళ్ళు కడుక్కుని ఇంట్లోకి వెళ్తున్నారు. గోదారి మీద ఎగురుతూ... ఎగురుతూ వడుపుగా ఒక చేపపిల్లని పట్టుకుని ఎగిరిపోయింది పిట్ట... అందమైన మందార పువ్వుని నల్లమట్టి పురుగు ఒకటి పట్టుకుని తినేస్తా వుంది. దూరంగా కొబ్బరితోట మధ్యలో వెళ్తున్న టెలిఫోను తీగల మీద ఎన్నో పిచ్చుకగూళ్ళు ఒకదాని పక్కనే ఒకటిగా వున్నాయి. వాటిని చూస్తుంటే శూన్యంలో ఒక వీధి వేలాడుతున్నట్టుంది.

గంగాధరంతో వచ్చిన రామసీతని చూడ్డానికి వూళ్ళో రకరకాల జనం వచ్చేరు. మనిషి వయసు తక్కువే అంటా మొదలెట్టి రకరకాల మాటలన్నారు. అన్నీ పుల్లిరుపు మాటలు, ఒంకరటింకర మాటలు. అప్పుడే వాళ్ళ మధ్యలో కొచ్చిన పోతాబత్తుల కన్నబాబుతో "చూస్తుంటే పెద్దింటోళ్ల కులం పిల్లలాగుందిరా" అన్నాడొకడు.

"ఏవండీ... ఇవేళన్నరోజు ఇలాంటి తప్పులన్నీ చేసేది పెద్దపెద్ద ఫేమిలీసులో ఆడోళ్ళే" రామసీతకి వినబడే లాగన్నాడు కన్నబాబు.

ఏం పట్టించుకోకుండా గంగాధరానికి వాళ్ళ మధ్య ఏమాత్రం విలువుందో గమనిస్తుంది. అతని అన్న దమ్ములు మొత్తం ముగ్గురు. ఆఖరోడు ఈ గంగాధరం. వాళ్ళ అన్నలూ వదినలూ వచ్చేరు. సూటీపోటీ మాటల్తో మొదలెట్టి ఆ తర్వాత పెద్దపెద్ద గొడవలు లేవదీసి రామసీతని వెళ్ళగొట్టే ప్రయత్నం చేసేరు. అన్నీ భరించి వాళ్ళని చాలా బాగా గమనించి ఒక నిర్ణయానికొచ్చేసరికి రాత్రయ్యింది.

నిండా ఏదో వున్న ఒక సీసా పట్టుకొచ్చిన గంగాధరం "ఇది సారాగాదు సీతా సిగురు. టైగర్‌రెయ్యిలు కొనడాని కొచ్చిన కొండారెడ్డిగారిచ్చారీ సీసాకాయి... ఇవేళ్టికిది పుచ్చుకుని రేపట్నుంచి మానేస్తాను మా భైరవ సామ్మీదొట్టు" అన్నాడు.

అంతే, అక్కడందరూ చూస్తుండగానే సంగాడి గంగాధరం చొక్కా పట్టుకున్న సీత వాడి ఛాతీ మీద ఓ గుద్దు గుద్ది, గాల్లో కెగిరి మరీ సట్టమీద తన్ని "ఏరా... చంకలు గుద్దుకుంటా నీ వెనకాతలే వచ్చేసేనని మీ





వూరోళ్ళతో పాటు నీ బంధువుల్తోపాటు నువ్వూ లోకువ గట్టేస్తావా నన్ను?" అనరుస్తున్న రామసీత బొంగురు గొంతుక్కి భైరవపాలెం వూరంతా పరుగెట్టుకొచ్చింది.

దూసుకుంటా వాడి మీదకొచ్చిన రామసీత "మొన్న ఏవన్నావు, మా భైరవసామి మీదొట్టు నువ్వు నాతో పాటొస్తే తాగుడొదిలేస్తానన్నావా లేదా? మరిప్పుడిదేంట్రా?" అంది.

తలొంచుకున్న గంగాధరాన్ని గోదాట్లో ముంచి స్నానం చేయించి వాడి దగ్గరున్న చిగురు సీసా మూతతీసి గోదాట్లోకి విసిరేసి భైరవసామిగుళ్ళోకి లాక్కెళ్ళి "చెయ్యి, ఈ జన్మకి తాగుడు జోలికెళ్ళనని ప్రెమాణకం జెయ్యి" అంది.

చేస్తున్న గంగాధరాన్ని చూస్తున్న భైరవపాలెం జనాలకి ఉచ్చలు పడిపోయినియ్యి. రామసీత కేసి చూస్తా 'ఇది పిల్లగాదురా పిరంగి, మనిషిగాదురా మరమేకు' అనుకున్నారు.

దాంతో బెదిరిపోయిన భైరవపాలెం ఆడోళ్ళంతా ఒక పద్ధతిలో మసులుకోవడం మొదలెట్టేరు రామసీత దగ్గర.

*

"పొద్దుటే నువ్వు వేటకి బయలుదేరాలి" ఆ రాత్రి గంగాధరానికి గుర్తు చేసింది రామసీత.

"రేపంటే... రేపు కుదరదులే" అన్నాడు గంగాధరం.

"ఎందుకో?" అడిగింది రామసీత.

"ఎప్పుడో ఒడ్డున పడేసున్న నావ చాలా బొక్కలు పడిపోయుంది. దాన్నిప్పుడు రిపేరు చేయించాలంటే చాలా అవుద్ది" అన్నాడు.

"ఆ పాత నావ అమ్మేస్తే ఎంతొస్తుంది?" అడిగింది రామసీత.

"ఆ ఎంతా... మావొస్తే ఓ వెయ్యొస్తది."

"ఆ నావ నాకమ్మెయ్యి" అని ఆ మర్నాడు తన మెడలో బంగారు తాడిచ్చి యానాం పంపించి రెండు వేలకి తాకట్టు పెట్టించి వచ్చిన ఆ డబ్బుతో వెయ్యి రూపాయిలు గంగాధరానికిచ్చి ఈ నావ నాకు అమ్మేసే ననుకో" నవ్వుతా అని మిగతా రూపాయిల్తో నావకి రిపేర్లు చేయించింది.

భైరవపాలెం రేవులోంచి సముద్రంలో చేపల వేటకెళ్ళాలంటే తాగే నీళ్ళూ, ఐసుగెడ్డలూ వేసుకుని నావకి ఏడుగురు మగాళ్ళు చొప్పున వెళ్తారు.

"ఈ గంగాధరంతో వేటకెళ్ళడెవడు. వెళ్ళిన ప్రెతివోడి డబ్బులూ ఎగ్గొడతానే వచ్చేడు. దాంతో ఎవడూ ఈ మనిషితో వేట కెళ్ళడు. అందుకే రూటు మార్చి ఊకపొయ్యిలు కట్టుకుంటున్నాడు" అన్నారు ఆ వూరి జనం.

తన ముక్కుకున్న బేసరి అక్కడున్న ఆ ఆరుగురికీ తీసిచ్చి "ఇది అడ్మాంసు బయల్దేరండి అన్నయ్యలూ" అని సాగనంపింది వాళ్ళని.

మధ్యాన్నానికే ఆకాశం నిండా నల్లని మబ్బులు కమ్మేసుకున్నాయి. చలిగాలులు వీస్తున్నాయి. తుఫాను సూచన్లు కనిపిస్తున్నాయి.

రోజూలాగే వేటకెళ్ళిన వాళ్ళ కుటుంబాలు ఒడ్డుకు చేరినియ్యి వేటకెళ్ళిన వాళ్ల మగాళ్లకోసం. ఐతే అందరి కంటే ముందు రామసీత నిలబడుంది.

వీస్తున్న గాలితోపాటు వానకూడా మొదలైంది. తడిసిపోతున్న జనం దూరంగా వున్న ఇళ్ళల్లో కెళ్ళిపోయేరు. రామసీత మాత్రం అలా తడుస్తానే ఆ రేవులోనే నిలబడి చీకట్లోకే చూస్తుంది. వెళ్ళిన మనిషి రాక కోసం ఎదురు చూస్తుంది.

బాగా పొద్దోయింది. వర్షం కురుస్తానే వుంది. ఒక్క గంగాధరం నావ తప్ప తక్కిన నావలన్నీ వచ్చేసినియ్యి. అర్ధరాత్రయ్యింది.

ఒడ్డున తడుస్తా కూర్చున్న రామసీత దగ్గరకొచ్చిన ఓ ముసల్ది "బుల్లీ ఇంత ఆలెస్యవయితే వేటకెళ్ళినోడు ఇంక రానట్టు లెక్కేసుకుని వెనక్కెళ్ళిపోతాం" అంది.

ఏం మాటాడలేదు రామసీత.

"ఏ చెడు ముహుర్తంలో ఆడ్ని వేటకి పంపించేవో, ఆడు గంగమ్మతల్లి ఒళ్ళో కల్సిపోయేడు...." అంది ముసిల్ది.

ఏం మాటాడలేదు రామసీత.

ఆ ముసిల్దాని లాంటోళ్ళే ఇంకొంతమంది తాటాకు గొడుగులేసుకొచ్చి సూటీపోటీ మాటలన్నారు.

కదల్లేదు మెదల్లేదు. అసల్లక్కడ్నించి లేవలేదా రామసీత.

భైరవపాలెం వూరెప్పుడో మాటుమణిగింది. బాగా రాత్రయ్యింది. గాలి బొంగురు గొంతుతో వీస్తుంది, వర్షం కురుస్తానే వుంది. ఆమె చీకట్లోకి చూస్తానే వుంది. భైరవసామికి మొక్కుతానే వుంది.

ఉన్నట్టుండి ఆ కారు చీకట్లో అరుపులు, కేకలు. ఆ గొంతు గంగాధరానిది. "మూడు పప్పురెయ్యలు పడినియ్యి... అదెనెహె టైగర్‌రెయ్యిలు..."

ఒంచి వదిలిన పేకబెత్తంలా లేచింది రామసీత.

నావ ఒడ్డుకొచ్చింది. నావలోంచి దిగిన గంగాధరం రామసీత దగ్గర కొచ్చేడు "ఇదిగో హేచరీ వోళ్ళకమ్మితే పిల్లలు పెట్టే టైగర్ రెయ్యికి ఎంత కిడద్దో తెల్సా... పాతిక... పాతిక వేలు. మన వలలో మూడు రెయ్యిలు పడినియ్యి. ఇదిగో సీతా నీ ఎదురు మా గొప్పది" అంటా ఆనందంగా అరుస్తున్నాడు.

"అవును చెల్లీ" అన్నారు మిగతా ఆరుగురూ.

తెల్లారేక పందెం పుంజుకోసి అమ్మోరికి నైవేద్యం పెట్టి ఆ తర్వాత అందరికీ భోజనాలు పెట్టి అయిదే సొందలు చొప్పున బోనస్ లాగిచ్చిన రామసీత కోనపాపపేట హేచరీస్ నించి వాటిని కొనడానికి వచ్చిన నాగులా పల్లి కొండారెడ్డిగారికి లక్షరూపాయిల కమ్మి ఆ డబ్బుని కాకినాడలో ఎవరి దగ్గరో దాచొచ్చింది.





అది చూసిన భైరవస్వామి గుడి అరుగుల మీద కూర్చున్న ముసిలోళ్ళకీ ఇంకా వూళ్ళో జనాలకీ ఏమాత్రం అర్థం గాలేదు.

వాళ్ళ మధ్యలో కొచ్చిన పోతాబత్తుల కన్నబాబు "మీకెవరికీ అర్థంగాక పోయినా నాకు మాత్రం బాగా అర్థమయిపోయింది" అన్నాడు.

"ఏంటి?" అన్నారంతా.

"ఎందుకూ పనికిరాని గంగాధరం గాడ్నడ్డు పెట్టుకుని బానే చేస్తుంది బిగినెస్సు. ఇక్కడ సంపాయించి అక్కడ ఎవడికో పోస్తంది... ఈ టైపు మనిషినే ఎనకటికి నందరాడలో చూసేను. చూస్తుండండి తొందర్లో ఈ కత ఎలాంటి మలుపు తిరుగుద్దో" వెటకారంగా అన్నాడు కన్నబాబు.

*

గంగాధరం అన్నలు మాసిపోయిన గుడ్డ లేసుకు తిరుగుతుంటారు. వాళ్ళంతా బద్ధకస్తులు, తాగుబోతులు. అమ్ముతావంటే నావ అయిదొందలు చొప్పున వాళ్ళ రెండు నావలూ కొనేసి కూలిజనాన్ని పెట్టి వేటకి పంపించింది రామసీత.

ఆ వూళ్ళో అంతా వచ్చిన ఆదాయాన్ని బేంకుల్లో దాయకండా బంగారంగా మార్చి ట్రంకుపెట్లో పెట్టి నావలోనే దాస్తారు. రామసీత మాత్రం వచ్చిన ఆదాయాన్ని కాకినాడ పట్టుకెళ్తుంది. ఒకపక్క అందరికీ వడ్డీల కిస్తుంది. భైరవస్వామి గుడికి ఎక్కువ చందా తనే ఇస్తుంది.

రామసీత సంపాయించిన ప్రతి పైసాతోనూ ఏ బంగారపు నగ చేయించుకోడంగానీ, నాణ్యమైన బట్ట కట్టుకోడంగానీ, శుభ్రమైన తిండి తినడంగానీ చెయ్యకండా కాకినాడలో దాచి వస్తుంది. ఎవరి దగ్గర దాస్తుంది అన్నది అందరికీ సస్పెన్సే.



ధనుర్మాసం వచ్చేసింది. చలి. రేవులో ఆగివున్న పడవల పైన నీడకి బరకాలు కట్టుకున్నారు పల్లోళ్ళు. ఒకావిడ తట్టు మీద కూర్చుని బట్టలు ఉతుకుతోంది. మరో పడవ మీద కబుర్లాడుకుంటున్నారు. బొబ్బాసచెట్టు కొబ్బరిచెట్టంత ఎత్తుకి ఎదిగింది. కానీ, దాని కాయలు చిన్న చిన్న పిందెల్లాగ వున్నాయి. ఏటిగట్టు చెట్టునీడలో ఓ కుర్రోడు కుక్కలకి బండి కట్టి ఆడుకుంటున్నాడు. పేరు తెలీని పక్షి ఒకటి ఈత గెలమీద వాలి ముగ్గిన పండ్లని పొడుచుకు తింటోంది. ఇద్దరు బట్టల మూటోళ్ళు చిల్లోబుల్లోమని మాటాడుతూ వెళ్తుంటే మూట నెత్తుకుని వాళ్లకి ఎదురెల్లుతున్నాడు చాకలివాడు. వూళ్ళో నడుస్తున్న వడిశలేరు భూతవైద్యుడు సరాసరి గంగా ధరం విడిచిపెట్టేసిన అతని భార్య క్రిష్ణవేణి ఇంటి వేపు నడుస్తున్నాడు.

మొగుడొదిలేసేకా ప్రభువు మతంలోకి చేరిన క్రిష్ణవేణి చర్చిపాక దగ్గర్నించి అప్పుడే వచ్చి అరుగు మీద కూర్చున్న భూతవైద్యుడ్ని చూసి అతనికంతా చెప్పి "ఆ దొంగ నా సవితిపేరు రామసీత. దానికి చాలా పెద్ద దెయ్యాన్నే పట్టించాలి" అని అతను అడిగినంత ఇచ్చింది.

కాకినాడలో రామసీతకి రంకు మొగుడున్నాడని ఈ డబ్బంతా ఆడికే ధారబోస్తుందని పోతాబత్తుల కన్నబాబు అన్నమాటలే ఆ కన్నబాబుగాడి తోటే గంగాధరం దగ్గర చెప్పించింది.

దాంతో బాగా తాగేసొచ్చిన గంగాధరం ఇంటికొచ్చి ఆడెవడో చెబుతావా లేదా అనేసి చితగ్గొట్టి చెయ్యి విరిచేశాడు.

మర్నాడు కాకినాడెళ్ళి సిమ్మెంటు కట్టు కట్టించుకొచ్చిన రామసీత రేవులో పడవెక్కి వూళ్ళోకొచ్చి ఇంటి కెళ్ళకండా సరాసరి భైరవసామిగుడి దగ్గర కొచ్చి పెద్దలందర్నీ పిల్చింది. ఆ పెద్దలతో వూరి జనం మొత్తం దిగి పోయేరు.

తను కాకినాడ పట్టుకెళ్తున్నది తన సొమ్ము తప్ప దాంతో ఈ సంగాడి గంగాధరానికే సంబంధం లేదని గంగాధరంతోనే చెప్పించింది.

"మరైతే నన్నెందుకు కొట్టేడో రాత్రి నా చెయ్యి ఎందుకు విరిచేడో కనుక్కోండి" అంది.

"చెయ్యెందుకు విరగ్గొట్టేవురా?" చెంద్రుడు అనే పెద్ద గంగాధరాన్నడిగేడు.

"తనెవరితోనో తిరుగుతుందని పోతాబత్తుల కన్నబాబుగాడు చెప్పేడు" అన్నాడు గంగాధరం.

"ఆ పిల్ల ఎవడితో ఎలాగపోతే నీకెందుకురా. మన కులం పిల్లా. పోనీ ఆ పిల్ల మెళ్ళో చిన్న పసుపుకొమ్ము కట్టేవా?" అడిగేడింకో పెద్ద.

"కట్టకపోతే తీసుకొచ్చింది నేనే గదా? సొంతమని వుండదా నాకు?"

"ఎందుకుండాలి?" అని ఇంకో పెద్ద గదమాయిస్తుంటే మధ్యలో కొచ్చేసిన రామసీత "ఎవడేం చెబితే దాన్ని ఇట్టే నమ్మేసే ఈ గంగాధరం నా చెయ్యి విరగ్గొట్టేసేడు. జూకతో నా జబ్బల దగ్గర దద్దుర్లొచ్చేలాగ కొట్టేడు. నడ్డిరిగి పోయేలా తన్నేడు... నేను తన సొంతమన్న ఇదితో నన్నిలాగ చేసేనంటున్నాడు గదా... ఇదిగో చూడండి, నేను రంకుదాన్నని ఈ వూళ్ళో ఎవరైనా రుజువు చెయ్యగలిగితే బట్టల్లేకండా ఈ భైరవపాలెం వీధిలో తిరిగి చివర్లో గోదాట్లో మునిగి జలసమాధైపోతాను... ఛాలెంజ్" అంది.

దాంతో ఎవరికి నోట మాట రాలేదు.





ఎప్పుడూ ఆ గుడి అరుగు మీద కూర్చునే ముసలోళ్ళు తప్ప తక్కినోళ్ళంతా చెల్లాచెదురైపోయేరు.

"మొదట్నుంచీ నాకో అనుమానం, ఆ పిల్ల కులం మన కంటే పెద్దకులం. పైగా మంచి అందగత్తె. వయసులో గంగాధరం కన్నా చిన్నది. అలాంటిది ఏం జూసి ఈడి కూడా వచ్చేసింది?" అడిగేడు ముసిలోళ్ళలో ఒకడైన బొమ్మిడి సత్తియ్య.

"ఆడదాని ఇష్టానికి వయసు, కులం, అందం ఈ పట్టింపులేం వుండవంటారు" అన్నాడు కాస్త చదువు కున్న పెసంగి గోవిందు.

"ఆ మనిషి నువ్వు చెప్పిన టైపు మనిషి కాదు మాయ్యా" అన్నాడు కన్నబాబు.

"మరే టైపురా" అడిగేరంతా.

"ఊరికొకడితో కాపరం చేసే బాపతు" అంటా ఇంకా ఏవేవో కథల్ని చాలా పచ్చిగా పేలేడు.

*

ఆరోజు నించీ రామసీత మీద చెయ్యి చేసుకోవడంగానీ పల్లెత్తు ముక్క అనడంగానీ చెయ్యలేదు గంగాధరం.

రామసీత గంగాధరాన్ని ప్రాణంలో ప్రాణంలా చూసుకుంటుంది. అతనేవడిగితే అది కొనిస్తుంది. అతనెంత డబ్బు అడిగితే అంతిస్తుంది. రకరకాల వంటలు అతనికి చేసి పెడ్తుంది. గంగాధరానికి పిసరంత నలతగా వుంటే కంగారుపడిపోతుంది. అతనుగానీ అతని తాలూకోళ్ళుగానీ ఎప్పుడన్నా ఎదురుతిరిగితే ఏంటి మీకూ నాకూ సంబంధం, అసలు మీరెవరూ నేనెవరూ అంటుంది. అదంతా చూస్తున్న జనం ఏంటీ రామసీత తత్వం అనుకుంటున్నారు. ఎంత ఆలోచించినా ఎవరికీ ఎంతకీ అంతుపట్టడం లేదు.

"వయసులో వున్న పిల్ల ఈ నడివయసోడితో ఇన్ని అవస్థలు పడతా చేపల కంపుగొట్టే ఈ వూళ్ళో వుండే బదులు, చేతిలో డబ్బుంది ఏ వూరన్నా గేలాపెత్తెయ్యొచ్చు గదా?" అన్నాడు సత్తియ్య.

"అది అందరు ఆడోళ్ళు చేసే పని... మంచో చెడ్డో వయసులోవాడో ముసలోడో ఒకడ్ని నమ్ముకుని దిగేం. ఇక ఈడితోనే అంతా అనుకునే ఆడోళ్ళుంటారు. ఆళ్ళు చాలా తక్కువనుకో. ఈ రామసీత ఆ బాపతు గొప్పమనిషని నా అనుమానం" అన్నాడు మల్లాడి రామదాసు.

"నే నొప్పుకోను" అంటా వచ్చిన కన్నబాబు రామసీత శీలాన్ని దుయ్యబడతా మాటాడేడు కాస్సేపు.

*

రేవులో తల్లి బట్టలుతుకుతుంటే చుట్టూ జేరిన పిల్లలు ఈతలు కొడ్తున్నారు. గోదారి మీద మలిపొద్దు పరిచిన బాటమీద తెరచాప వేసిన పడవొకటి పొద్దుకి ఎదురుగా వెళుతోంది. రోడ్డమ్మట బఠానీలు, సెనగలూ, మురమురాలూ, వేరుశెనక్కాయలూ సైకిళ్ళు బూరా వూదుకుంటూ తిరుగుతున్నాయి. ఎండుచేపల్ని వేసుకున్న గుర్రబ్బండి సంతకెళ్తుంది. ఆ ఏరియా అంతా చెడువాసన వదుల్తా పోతా వుంది. టీవీఎస్ ఫిఫ్టీలో వస్తున్న మూర్తి రాజు డాక్టరుగారు సంగాడి గంగాధరం గాడింటి ముందాగి రామసీత ఇచ్చిన రిపోర్టులు చూసేడు.

రామసీతకి షుగరొచ్చింది. రక్తపోటు బాగా పెరిగింది. ఈ జబ్బులు వాళ్ళ వంశంలోనే వున్నాయంట.

*


1995వ సంవత్సరం జనవరి మూడో తేదీన, ఆ వర్షం కురుస్తున్న ఉదయం పూట రామసీత చనిపోతే పుణ్యస్త్రీగానే ఆమె కర్మకాండలు జరిపాక ఆ మర్నాటినించి ఒకటే వర్షం.

తూర్పుగాలులు వీస్తానే వున్నాయి. చేపల వేట కెళ్ళని జనం ఇళ్ళల్లోనే ముడుచుకు పడుకున్నారు. ఒడ్డున కట్టేసి వున్న నావలన్నీ తపా తపా చప్పుళ్ళు చేస్తున్నాయి. బస్సు దిగి నావ ఎక్కి భైరవపాలెం వచ్చి భైరవస్వామి గుడి ముందు మీటింగ్ పెట్టిన కాకినాడ స్టేట్‌బేంక్ మేనేజరు మాధవరావూ అదే ఊరి ప్లీడరు బులుసు అచ్యుతరామయ్యగారు రామసీత దాచిన సొమ్ము వడ్డీతో సహా మొత్తం సంగాడి గంగాధరమే అనుభవించాలి, ఇంకెవరికీ పెట్టకూడదు. అతని చుట్టూ వున్న బంధువులంతా దొంగలు. వచ్చిన కొత్తలో అది తెల్సుకునే ఇలా ప్రవర్తించింది రామసీత. అతనో అమాయకుడు, అర్భకుడు. అదంతా గమనించే ఇలా ప్లాన్ చేసుకుంది రామసీత. అయితే ఇంత సంపాయించి నీ రోగాలు బాగు చేసుకోకండా ఎందుకు ముదర బెట్టుకున్నావు అని ఎవరన్నా అడగొచ్చు. అలాగ్గానీ అడిగితే దానికావిడిచ్చిన గొప్ప సమాధానం... షుగరూ బీపీ వచ్చి నేను అవస్థ పడ్తానే కాకినాడెళ్ళి చీకటిపడ్డాకా ఇంటి కొచ్చేసరికి ఫాస్టరుగారి చెల్లెలయిన మేరీ సుశీలని పక్కలో వేసుకు కనిపించాడు గంగాధరం. అది చూసి తను ఇంకతనికి అడ్డెందుకని ఈ నిర్ణయం తీసుకుంది. ఇదండీ కుమారి దంటు రామసీత వీలునామా" అని చదివి ముగించాడు లాయరుగారు. అందరి ముందూ ఆ డబ్బు ఆ సంగాడి గంగాధరానికి అందజేశాడు స్టేట్‌బేంక్ మేనేజర్ మాధవరావుగారు.

భైరవపాలెంలో ముసిలోళ్ళు, పెద్దలు ఒణుకుతానే ఆవేశంగా పైకి లేచి "గోదారంతా ఈ తల్లిదే... ఈ తల్లినా... ఈ సీతమ్మోరినా మేం అనుమానించింది. ఈ సీతమ్మకా మేం రంకు గట్టింది... బగమంతుడా... ఎందుకు బ్రెబువా... ఎందుకండీ మా గుడ్లింకా పేలిపోలేదూ? ఎందుకండీ మా ఎదవ ప్రేణాలు పోలేదూ..." అని ఏడుస్తా వర్షంలో తడుస్తా ఆ చీకట్లో చితచితలాడ్తున్న నేలమీద జారుకుంటా ముందుకి వెళ్ళిపోయేరు.

పొద్దుటే గోదావరి ఒడ్డున ఒక శవం తేలింది. ఎవరిదా అని చూస్తే రామసీత మీద రకరకాల కథలల్లి రకరకాలుగా అవమానించిన పోతాబత్తుల కన్నబాబుది. పశ్చాత్తాపంతో కుమిలిపోయిన కన్నబాబు రాత్రి గోదాట్లోకి దూకి ఆత్మహత్య చేసుకున్నాడంట.

*స్వాతి సపరివారపత్రిక*











అక్కడ పూచే జలతారు జాబిలిలోంచి మాత్రమే జనిస్తుంది 'జయసావేరి' రాగం. ప్రభాత వేళల్లో మంచు తెరలతో మునిగిపోయి, మహాద్భుతంగా వీస్తుంది 'మనోరంజని' రాగం. నిత్యం చీకటితో నిండిపోయి వుండే అక్కడి గుహల్లోంచి, వచ్చి వెళ్ళే రైలుబళ్ళ చక్రాల్లోంచి మిశ్రజాతి ఏకతాళం శబ్దస్ఫోరకంగా తాకుతుంది చెవుల్ని. అక్కడి ఎత్తయిన కొండలు యుగయుగాల్నుంచీ ప్రసారం చేస్తున్నాయి శీత కిరణాల్ని. అల్లిబిల్లిగా ఒకదాన్నొకటి అంటుకు పోయి వుండే ఆ పచ్చటి కొండల కింది లోయ ఒక మిసమిసల కిసలయాల మయం.

గాలికొండపురానికి నైరుతిమూలగా వుంది ఆ మ్యూజిక్ స్కూల్. పచ్చి వెదుళ్ళతో కట్టి, పైన రెల్లుగడ్డి నేసిన పొడుగాటి ప్రార్థనా మందిరం. దానికి కాస్త దూరంగా విద్యార్థుల సాధన కోసం నిర్మించిన పర్ణశాలలు. వాటికి ఇంకాస్త దూరంలో పచ్చి వెదుళ్ళూ, దేవదారు చెక్కలతో నిర్మించిన లైబ్రరీ.

ఈ సమూహం చుట్టూ కర్రల్తో ఫెన్సింగ్ వేయించి, ముఖద్వారం దగ్గర అర్ధచంద్రాకారంలో బిగించిన సిరమిక్ బోర్డు మీద 'శివమంజులా సంగీత అకాడమీ' అన్న పేరు రాసి వుంటుంది.

ఇరవై ఏళ్ళ క్రితం విజయనగరం మ్యూజిక్ కాలేజ్‌లో చదువుకుని ఒక ఆడపిల్ల కడుపులో వుండగానే భర్తని పోగొట్టుకుంది ప్రభావతి.

ఇక మిగతా జీవితాన్ని ఎలా గడపాలా అని ఆలోచిస్తూ ఆ నెలల పిల్లని తీసుకుని ఈ గాలికొండపురం వచ్చి ఆ మ్యూజిక్‌స్కూల్ పెట్టిన ప్రభావతి పెంచి పోషించుకుంటున్న ఒకే ఒక స్వప్నం-ఆమె కూతురు లీల.

## 2

సామాన్యమైంది కాదు లీల అందం.

కాటుక కంటే ముదురురంగులో వుండే ఆమె శిరోజాలు గాలికొండ మీంచి వీచే గాలులకి ఆనందంగా కదుల్తుంటాయి. ఆమెకుండే ఆ పెద్ద పెద్ద కళ్ళు కావ్యాల్లో వుండే నాయికల్లో ఏ నాయికకీ వుండవు.

ఎంత చవక రకం బట్ట కట్టినా సమ్మోహనంగా ఇమిడిపోతుందామె శరీరానికి.

నడుస్తున్నప్పుడు కాళ్ల కుండే వెండి సిరిమువ్వలు ఆదితాళంతోనూ, అప్పుడప్పుడూ ఆటతాళంలోనూ ఘలంఘలిస్తుంటాయి. లీల అందం కన్నా ఇంకో మహాద్భుతాన్ని ఆమెకి ఆపాదించాడు ఆ ఈశ్వరుడు. అది-సంగీతం.

నిత్యం తన గుప్పెట్లో మృదువుగా దాచుకునే అందమైన పిల్లనగ్రోవితో జనప్రియ రాగాలన్నింటినీ అద్భుతాతి అద్భుతంగా వాయిస్తూ వుంటుంది లీల. చివర వెండి తొడుగులుండీ, రంగు రంగుల సిల్కు కుచ్చుల్తో లయబద్ధంగా ఊగే ఆ అందమైన పిల్లనగ్రోవి ఆమెకెప్పుడూ చేస్తూనే వుంటుంది చాకిరీ. మనసు ఆనందంతో గంతులు వేసినప్పుడు 'ఆహిర్‌భైరవి', మౌనంగా మసిలినప్పుడు 'మార్గహిందోళం', విషాదంతో మూల్గినప్పుడు 'చక్రవాకం' రాగాలు ధ్వనిస్తూ వుంటాయి, ఆ పిల్ల పెదవుల్ని తాకే ఆ పిల్లన గ్రోవిలోంచి.

ఒక పన్నలాల్ ఘోష్‌లాగా, హరిప్రసాద్ చౌరసియాలాగా, టి.ఆర్. మహాలింగంలాగా మహోన్నతంగా వెలిగిపోవాలన్నది ఆమె ఆశయం.

ఈ మారుమూల లోయలో రాక్షస సాధన చేశాక హఠాత్తుగా తన ప్రతిభని సంగీత ప్రపంచమంతా ప్రసరింప చేయాలన్నది ఆమె కాంక్ష. ప్రతిభావంతులందర్నీ అధిగమించి వాళ్ల తనని మించిపోతే అణగదొక్కేసి రాజ్యమేలాలన్నది ఆమె వాంఛ.

## 3

చలికాలం చీకటి రాత్రి అప్పుడే వెళ్ళిపోయింది. మంచు మాత్రం మరీ దళసరి ముసుగేసుకుంది. పొడుగాటి టన్నెల్లోంచి బయటికొచ్చిన పాసింజరు అప్పుడే ఆగింది, గాలికొండపురం రైల్వేగేటు స్టేషన్లో.

ఆగిన ఆ రైలులోంచి పల్చగా దిగిన పాసింజర్లలో దాసు కూడా వున్నాడు. రకరకాల సైజుల్లో ఒక తాడుకి కట్టి వున్న పిల్లనగ్రోవిల కట్ట అతని కుడిచేతిలో వుంది. ఆ కట్టలో మధ్యమస్థాయి, అంతిమస్థాయి ఫ్లూట్లున్నాయి. బట్టలు కుక్కిన సంచి ఒకటి వేలాడ్తూ వుంది అతని భుజానికి.

కాస్త నల్లగా, కాస్త పొడుగ్గా, సన్నగా వున్నా సిరి గల ముఖం అతన్ది.

లూజుగా వున్న కోరా ఖద్దరు లాల్చీ వేసుకున్నాడు. వెలిసి, అక్కడక్కడా చిరిగిన నీలం రంగు జీనుప్యాంటు తొడుక్కున్నాడు. సాక్స్ లేకుండా కాళ్ళకి బిగించుకున్న ఫ్యూమా బూట్లు పాతబడిపోయి వున్నాయి.

అప్పుడే మంచు పొరలు కరిగి నేల మీద పడ్తున్న ఎండ పొడల్ని తొక్కుకుంటూ సిగరెట్ వెలిగించుకుని నిర్లక్ష్యంగా నడుస్తున్నాడు.

మ్యూజిక్ స్కూలుకి కాస్త దూరంగా వుంది ఆ ముసలి పనసచెట్టు. దాని కింద జేరారు స్టూడెంట్సంతా. మధ్యలో కూర్చుని 'పంతువరాళీ' పాడడం మొదలెట్టింది ప్రభావతి.

"స్వామి నిన్నే..." కుడి తొడ మీద అరచేత్తో ఆదితాళం వేస్తూ ఆమె పాడుతుంటే కోరస్‌గా అందు కుంటున్నారు స్టూడెంట్స్. అప్పుడే అక్కడికొచ్చిన దాసు అపశృతిలో పాడుతున్న పిల్లలకి పిల్లనగ్రోవితో శృతి చూపించాడు.

అతను వాయించే విధానం చూసి జన్మలో ఎప్పుడూ పడనంత ముచ్చట పడిపోయిన ముసలి ప్రభావతి 'ఎవర్నువు... ఏ ఊర్నుంచి వచ్చావు?' లాంటి ప్రశ్నలేమీ వెయ్యకుండా గుంపులో వున్న అప్పలాచారి అనే స్టూడెంట్‌ని పిల్చి ఇతన్ని హాస్టల్‌కి తీసుకెళ్ళమంది.

పొద్దుట ఉదయించిన సూర్యుడు పడమటి దిక్కుకి దిగకుండానే అక్కడొక పెద్ద టాపిక్ అయిపోయాడు దాసు. అతని గొప్పదనం గురించి గుబాళించడం మొదలెట్టిన గుసగుసలు లీల చెవులదాకా వచ్చాయి. బలంగా వంచి వదిలిన చెట్టుకొమ్మలా లేచి నిలబడ్డ లీల అతను బసచేసిన కాటేజ్ ఎక్కడో కనుక్కుని పరుగెట్టింది.

లేడక్కడ.

ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ సన్యాసిరాజు భార్య డెలివరీకి వెళ్ళింది. తీసుకొద్దామని సెలవుపెట్టి క్వార్టర్స్ తాళ మేసుకు వెళ్ళిన ఆ మనిషి నెలరోజుల తర్వాత వచ్చి తలుపులు తెరిచాడో, లేదో ఇంటి నిండా కల తిరుగుతూ కనిపించాయి పాములు.

వాటిని చూసి భయపడిపోతూ, ఊళ్ళోకొచ్చి కొందరు గిరిజనుల్ని తీసుకొచ్చాడు పట్టుకోవడానికి.

వచ్చిన ఆ గిరిజనులు రాత్రి పగలూ ప్రయత్నాలు చెయ్యడం మొదలెట్టారు. వెతకడానికొచ్చిన వాళ్ళలో ఒకడు చచ్చిపోయాడు తప్ప వచ్చిన పనవలేదు.

ఈ అడవిలో ఇక కాపురం చేసేదెలారా దేవుడో అని సన్యాసిరాజు మొత్తుకుంటున్న టైములో దూసు కుంటూ వచ్చిన దాసు క్వార్టర్సంతా కలతిరిగి ఆరుగంటల కాలంలో అరడజను పాముల్ని పట్టుకుని ఒడిసెల తిప్పినట్టు గిరగిరా తిప్పి విసిరిపారేశాడు.

ఇంకో పాముని ఈశ్వరుళ్ళా మెళ్ళో వేసేసుకున్నాడు.

అవాక్కయి నిలబడిపోయింది అతన్ని చూద్దామని వచ్చిన లీల. గబగబా అక్కడ్నుంచెళ్ళిపోతుంటే వెనకాలే పరుగెత్తింది.

రైలు బ్రిడ్జికింద కూర్చుని జేబులోంచి తాళంగుత్తిని మళ్ళీ బయటికి తీశాడు. వాటి మధ్యలో వున్న ఆ చిన్న మడత చాకు తీసుకుని అరికాలి మీద కర్కశంగా కోసి లోపలికి దిగిన నల్లతుమ్మ ముల్లుని బయటికి లాగేసున్న వాడల్లా ముఖం మీద నీడ పడేసరికి తలెత్తాడు.





నవ్వుతూ అతని పక్కన చతికిలపడ్డ లీల తనెవరో పరిచయం చేసుకుని సంగీతంలో తనకున్న ప్రవేశమేంటో, తనే దశ దాటిందో చెప్పింది.

ఏదీ ఎదురడక్కుండా వింటున్న దాసు ఎడంచెయ్యి జేబులోపెట్టి నలిగిపోయిన సిగరెట్ తీశాడు.

"అవునూ... ఎక్కడ నేర్చుకున్నావు సంగీతం?" అడిగింది లీల.

"సముద్రాల అనే గురువు ముందు మూడ్నెల్లు కూర్చున్నాను. ఆయన సొంత గొడవలు తప్ప శాస్త్రమేమీ చెప్పేవాడు కాదు. విసుగొచ్చి మానేశాను" చెప్పాడు దాసు.

"ఏదైనా వాయించు."

వాయించడం మొదలుపెట్టాడు. అతను వాయిస్తున్న పిల్లనగ్రోవి రంధ్రాల్లోంచి విడుదలవుతున్న ఆ రాగంలో విచిత్రంగా మెలి తిరుగుతున్న గమకాల్ని వింటున్న లీల మైమరచిపోతోంది. తనని తను మరచిపోతున్న ఆమె కళ్ళు వర్షిస్తున్నాయి. విషాదంతో అలుక్కుపోతుంది ముఖం.

"ఏడుస్తున్నారేంటి, నేను వాయించింది నచ్చకా?"ఆపేసి అడిగాడు.

కళ్ళు తుడుచుకుంటూ నవ్వి "మైసూర్ వాసుదేవ అయ్యర్ పిబరే రామరసాన్ని చాలామంది విద్వాంసులు పాడగా, వాయించగా చాలాసార్లు విన్నాను. కానీ, ఇంత అద్భుతమూ, విషాదమూ దాంట్లో వున్నాయని ఇప్పుడే అర్థమైంది... ఎవరి దగ్గర నేర్చుకున్నావీ రాగం?" అడిగింది.

"మా ఊళ్ళో ఎవళ్ళో అంటే చెవిన పడింది తప్ప ఈ రాగ లక్షణం నాకు తెలీదు. అసలు మీరు చెప్పే దాకా ఈ రాగం పేరే తెలీదు నాకు."

"అబద్ధం."

"నిజం."

"ఏ ఊరు మీది?"

"అన్నవరం."

"ఏం చేసేవాడివక్కడ."

చెప్పాడు. తండ్రి కొండ మీదున్న సత్యనారాయణస్వామి ఆస్థానంలో మంగలట. అప్పుడప్పుడూ వాళ్ళ నాన్నతో పాటెళ్ళి యాత్రికులకి గుండు గీసేవాడట. లేకపోతే గుళ్ళో కూర్చుని వుండిపోయేవాడట. మనసు బాగున్నప్పుడు బస్‌స్టాండ్‌కెళ్ళి వాయిస్తే జనం డబ్బులేసేవారట.

రెండు మూడుసార్లు శవాల్ని కూడా మోసేడట. అప్పుడు తాగేవాడట.

ఒకసారి వాళ్ళ నాన్న తాగొచ్చి వాళ్ళమ్మ జుట్టు పట్టుకుని, కొండ కింది మెకానిక్ షెడ్ సత్తార్‌తో అక్రమ సంబంధం అంటగట్టి బండబూతులు తిట్టడం మొదలెట్టాడట. గొడుగు మడతపెట్టి బాదాడు కూడా. అది చూసి సహించలేని తను మొలకున్న బెల్టు తీసి చితక్కొట్టేశాడట.

వాళ్ళ నాన్న దక్కన్ సిగరెట్లు కాల్చేవాడట. అతను చనిపోయిన రోజు శవం పక్కనే వున్న సిగరెట్ పెట్టి తీసుకుని జీవితంలో మొట్టమొదటిసారిగా సిగరెట్ కాల్చేడట. అప్పట్నుంచీ అలవాటయిందట సిగరెట్లు కాల్చడం. తన తాళాల గుత్తిలో వుండే ఆ చిన్న మడత చాకు కూడా వాళ్ళ నాన్నదేనట.

ఒకరాత్రి ఒక అమ్మాయి దగ్గరకెళ్తే 'అబ్బ పెదాలు చూడు రక్తం వచ్చేలా కొరికేవ్' అందట ఆ పిల్ల. అది చూసి జాలిపడిన తను 'అయ్యయ్యో ఆవేశంలో చేసేశాను. నే చేసిన పనికి శిక్ష నేనే వేసుకుంటాను' అని మడత చాకు విప్పి తన మోచెయ్యి కసుక్కున కోసేసుకుని చెరెడు రక్తం ఆ పక్కంతా చల్లేడట. ఒకరోజు హాస్పిటల్లో చేరిన ఆ పిల్లకి రక్తం కావాలంటే తనే ఇచ్చాడట.

విచిత్రంగా వున్న అతని కథ విన్న లీల "మరి సాధన ఎప్పుడు చేసేవాడివి?" అంది.

"బుద్ధి పుట్టినప్పుడు వాయించడం తప్ప సాధన చేద్దాం అని నేనెప్పుడూ కూర్చోను."

దాసు చెప్పిందాంట్లో పచ్చి నిజాలే తప్ప అబద్ధం ఎక్కడా అనిపించలేదు లీలకి. నిజమే! నిజంగా అతనికి శాస్త్రం తెల్సి వుంటే ఎందుకు చెప్పడు. అలా చెపితే అతని కీర్తి ప్రతిష్టలు పెరుగుతాయి తప్ప ఏమాత్రం దిగజారవు గదా!

ఏంటీ విచిత్రం. ఏమీ తెలియని, ఏ శాస్త్రం చదవని, ఏ సాధన చెయ్యని ఈ మనిషికి ఇంత ప్రతిభ ఎలా వచ్చింది? ఎన్నో ఏళ్ళుగా రాత్రీ పగలూ సాధన చేస్తోంది తను.

అయినా ఇతనంత అద్భుతంగా పిల్లనగ్రోవి రంధ్రాల మీద వేళ్ళని ఎందుకు నాట్యం చేయించలేక పోతోంది. జీవితంలో ఏనాడూ ఆలోచించనంత తీవ్రంగా ఆలోచిస్తున్న ఆమెకీ సమస్య ఏ మాత్రం అంతు పట్టని జటిల సమస్యగా తయారయ్యింది. శరీరాన్ని కొరికేసేలా వీస్తున్న ఆ చలిగాలిలో చెమటలు పోస్తున్నాయి.

ఆ రాత్రి ఆమెకి శివరాత్రి అయ్యింది.

## 4

రైల్వే ఎంప్లాయిస్ పిల్లలు క్రికెట్ ఆడ్తుంటే వాళ్ళలో కల్సిపోయి బౌల్ చెయ్యడానికి వెళ్తున్న దాస్‌ని వెనక్కి లాక్కొచ్చిన లీల రకరకాల ప్రశ్నలెయ్యడం మొదలెట్టింది మళ్ళీ.

కోపం వచ్చేసింది దాస్‌కి. "పిల్లల్తో ఆడుకోనియ్యకుండా ఏంటండీ ఇదీ?"

నవ్వేసిన లీల "అది కాదు దాసూ, మూడు శృతి తర్వాత నాలుగే వుంటుంది. మూడున్నర ఎందుకుండదో చెప్పు?" అంది.

మాట్లాడలేదు దాసు.

"సంగీతంలో రిథమ్ గొప్పదా? మేలోడి గొప్పదా?"

"చూడండి మీరేం చెప్పండి చేస్తాను. ఆ వెళ్ళే రైలు కింద మెడ పెట్టమనండీ- పెడతాను. అంతేకానీ ఇలాంటి భేతాళ ప్రశ్నలేసి ప్రాణాలు తియ్యకండి" అనేసి వెళ్లిపోబోతుంటే రెక్క పట్టుకుని బలవంతంగా ఆపేసిన లీల, "నేనేం చెప్పినా చేస్తానన్నావ్ గదా! నిజంగా చేస్తావా?" అంది.

"చేస్తాను, ఆ చెప్పేదేదో కాస్త అర్జంటుగా చెప్పెయ్యండి" క్రికెట్ ఆడ్తున్న పిల్లలకేసే చూస్తూ అన్నాడు.

"సరే నా పిల్లనగ్రోవితో ఖరహరప్రియ కొంత వాయించి ఆపేస్తాను. మిగతాది నువ్వు వాయించాలి. చూడూ... ఖరహరప్రియ అవుట్ లైన్ తెల్సుగదా! చతుశృతి రిషభం, సాధారణ గాంధారం, శుద్ధ మద్యమం, పంచమం చతుశృతి ధైవతం, కైశిక నిషాదం..."





చాలా ఇరిటేట్ అయిపోయిన దాసు "మీరు చెప్పిన దాంట్లో ఒక్క ముక్క అర్థమైతే కత్తి పట్టుకొచ్చి కసక్‌మని కోసెయ్యండి నా మెడ... నాకేం తెలియదు మొర్రో అంటే ఎందుకండీ చంపుతారు?"

"అబ్బా అరవకు, దాసూ! ఇదిగో నేను వాయించి ఎక్కడో ఆపేస్తాను. వెంటనే నువ్వు కంటిన్యూ చెయ్యాలి సరేనా?"

వర్షం చినుకులు రాలడంతో ఆట ఆపేసిన పిల్లలు క్వార్టర్స్‌లోకి పారిపోవడం చూసిన దాసు "సరే కానివ్వండి" అన్నాడు.

కావ్యనాయికలా నిలబడ్డ లీల అందంగా పిల్లనగ్రోవి అందుకుని వాయించడం మొదలెట్టి అయిదు నిమిషాలు కూడా అవ్వకుండా హఠాత్తుగా ఆపేసి కంటిన్యూ చెయ్యి అని సైగ చెయ్యడంతో అదే రాగాన్ని అరగంటసేపు ప్లే చేశాడు తన బేస్ ఫ్లూట్‌తో.

అవాక్కయిపోయిన లీల 'నటభైరవి' వాయించి ఒక స్టేజ్ కెళ్ళిన వెంటనే ఠక్కున ఆపేయడంతో, అమాంతంగా అందేసుకుని అదే రాగాన్ని ఫోక్ టచ్ వచ్చేలా వాయించేశాడు.

వింటూ ఆ తన్మయత్వంలో శిల్పం అయిపోయిన లీల కాంప్లికేటెడ్ రాగం అయిన 'కానడా' అందుకుంది.

ఎన్నెన్నో మలుపులు తిప్పుతూ మూడు స్థాయిలకీ మారుస్తూ మూర్ఛపోయేలా చేశాడా సౌందర్యరాశిని.

జాగరణ చేస్తోందీ లీల. ఎంత ఆలోచించినా అంతుపట్టడం లేదు దాసు ప్రవర్తన. సంగీతం మీద తపన లేదు. వాయిద్యం తీసుకుని సాధన చెయ్యడు. సాధ్యం కానిది ఎలా సాధ్యం అవుతుందీ మనిషికి.

ఏమిటీ లీల?

అతని ప్రతిభ చూస్తుంటే పాదాలమీద పడాలి. మరోపక్క ఆలోచిస్తుంటే ఇంత కృషి చేస్తున్నా అతని ముందు ఎందుకూ పనికిరాకుండా పోతున్నానే అన్న ఈర్ష్య దొలిచేస్తోంది.

ఆ రాత్రి శివరాత్రి అయ్యింది లీలకి. నిద్రపోబోతూ అనుకుంది, అతన్ని నాశనం చెయ్యాలి. సర్వనాశనం చేసి తను మాత్రమే సామ్రాజ్ఞి కావాలని.

ఉదయం పదిగంటలకు లేచి, దుప్పటి కప్పుకుని స్కూలు బయటికొచ్చాడు. పెద్ద పెద్ద పనసకాయలూ, కమలాఫలాల బుట్టలూ మోసుకుంటూ అటుగా వెళ్తున్నారు కొండవాళ్ళు.

ఆ గుంపు అందంగా ఆకర్షించింది దాసుని. వాళ్ళ దగ్గరకెళ్ళి ఒక పనసకాయ ఇవ్వండని అడిగాడు.

తలల మీదున్న చాలా కాయల్ని చూపిస్తూ ఈ కాయలన్నీ సిమిలిగూడా స్టేషన్‌దాకా మోసుకొస్తే ఇస్తాం అన్నారు వాళ్ళు.

ఏ మాత్రం ఆలోచించకుండా వాటిని నెత్తి మీద పెట్టేసుకుని మోసుకెళ్ళి వాళ్ళిచ్చిన పనసకాయని కోసి తొనల్ని స్టూడెంట్స్ అందరికీ పంచి పెట్టాడు.

బాగా రాత్రయింది. చిక్కగా వుంది చీకటి. సుళ్ళు తిరుగుతూ వీస్తోంది గాలి. ఊరిలో జనం, గూటిలో గువ్వలు, లోయలో అందాలు నిశ్శబ్దంగా నిద్రోతున్నాయి.

గాలికొండ మీంచి గూడ్స్ ట్రైనొకటి వెళ్తోంది.

గదిలో కూర్చుని పిల్లనగ్రోవితో సాధన చేస్తున్న లీల బయటి చెక్కగేటు శబ్దానికి లేచి కిటికీలోంచి తొంగి చూసింది.

గేటు తియ్యమని గొడవ చేస్తున్నాడు దాసు.

"ఇంత రాత్రిపూట బయటికెక్కడి కెళ్ళావ్" అడుగుతున్నాడు ఒరియా వాచ్‌మేన్.

"అరకులో 'జీవనతరంగాలు' సిన్మా ఆడ్తుంటే వెళ్ళాను" చెప్పాడు దాసు.

"నీ ఇష్టానికి బయట తిరిగి, ఎప్పుడు బడితే అప్పుడొస్తే ఇక్కడి గేటు తలుపులు తెరవబడవ్. అది రూలు" అంటున్న ఆ వాచ్‌మేన్‌ని తోసుకుంటూ లోపలికి వచ్చిన దాస్ ఎదురుగా నిలబడి వుంది ప్రభావతి.

ఆమెని కూడా పట్టించుకోకుండా వెళ్ళిపోతున్న దాస్‌ని ఆపి, వెళ్లిపొమ్మంది.

వాళ్ళ మధ్యలో కొచ్చిన లీల "ఉండనియ్యి" అంది.

కూతురుకేసి ఆశ్చర్యంగా చూసిన ప్రభావతి "ఏంటి నువ్వు మాట్లాడుతున్నది?" అంది.

"అతన్ని ఉండనియ్యమ్మా!" అంటూ తల్లి దగ్గరకొచ్చి "ఈ క్షణం నించీ ఇతన్ని ఒక పద్ధతిలో నడిపే పని నాది... సరేనా" అంది.

ఎప్పుడూ మాటాడని కూతురు వింత మాటలకి ఏం చెప్పాలో తోచడం లేదా ముసలావిడకి.

## 5

రాత్రంతా కూనిరాగాలు తీసి తెలతెలవారేముందు దుప్పట్లోకి దూరబోతే తడిసి ముద్దయి చల్లగా తగిలింది. చాపా, దిండూ అన్నీ తడిసిపోయి వున్నాయి. వర్షంగానీ కురిసిందా అని వెదురు కిటికీలోంచి చూస్తే నవ్వుతూ కనిపించిన లీల "ఇది నిద్రపోయే సమయం కాదు... స్నానాల దడిలో వేడ్నీళ్ళు వున్నాయి" అంది.

ఆమె నవ్వులో వింత ఆకర్షణని గమనించి కూడా నడిచాడు. స్నానాలదడి బయట్నించి పళ్ళు తోముకునే పుల్ల, సబ్బుబిళ్ళ అందిస్తుంటే ఇంతకుముందు లేని కొత్త ఉత్సాహం పుట్టుకొచ్చేస్తోంది.

ఆమె పెంచుకుంటున్న జింకపిల్లలా చెప్పినట్టల్లా చేస్తున్నాడు దాసు.

సరిగ్గా ప్రార్థన సమయానికి అందరి మధ్యా నిలబడ్డ దాసుని చూసి కంగారుపడింది ప్రభావతి.

సాధన కూడా అయ్యాక నిదరొచ్చి ఒక మూలకి జారుకోబోతుంటే టీ కప్పుతో వచ్చేసింది లీల. కప్పు పట్టుకోబోతుండగా ఆమె తెల్లని వేళ్ళు అతని నల్లని వేళ్ళను తాకాయి.

జన్మలో ఎప్పుడూ రాని, ఇక రాబోని వింత ఆవేశం, ఆనందం అతనిలో.

గళ్ళ దుప్పటి దాసు మెడకి కట్టి హెయిర్ కటింగ్ చేసింది లీల. బోసుబెడ దొరగారి బంగ్లా ముందు కుంకుడుచెట్టు కాయల్తో తలంటింది. అరచేతిలో పెద్ద కాకరాకు పెట్టి గోరింటాకు పెట్టింది.

ఆ తెల్లవారుఝామున చినుకులు పడ్డం మొదలెట్టాయి సన్నగా, నిద్రలేచిన లీల లాంతరుతో బయటికొచ్చి ముగ్గులేస్తోంది. తాటాకు గొడుగులో వచ్చిన దాసు, వర్షం చినుకులు ఆమె మీద పడకుండా పట్టాడు.



నవ్వుతూ అతన్ని చూసిన లీల అడిగింది. "నువ్వు అప్పుడే లేచిపోయావా?"

"అసలు నిద్రపోతేగదా లేచిపోవడానికి."

"రాత్రంతా ఏం చేసేరు?"

"అర్ధరాత్రిదాకా కలగన్నాను."

"అక్కడ్నించి తెల్లవారేదాకా?"

"కన్న కల నిజమైతే ఎంత బాగుంటుందో అనుకున్నాను."

మువ్వల్ని ముఖ్‌మల్ గుడ్డలో కట్టి గలగల్లాడించినట్టు నవ్వేసింది లీల.

## 6

స్టేషన్ స్టాఫంతా పూలమాలలతో నిలబడ్డారు. కాస్సేపట్లో ఆగబోయే ట్రెన్‌లోంచి ఆ లైనుకి జోనల్ మేనేజర్ అయిన వాసుదేవ నాయర్‌గారు ఫ్యామిలీతో దిగబోతున్నారా స్టేషన్‌లో.

మొట్టమొదటిసారిగా ఆయన ఈ ఊరు వస్తున్నందుకు టెన్షన్‌గా వుంది అందరికి.

చిమిడిపల్లి స్టేషన్ వదిలిన పాసింజరు పది నిమిషాలకల్లా గాలికొండపురం రైల్వేగేటు స్టేషన్లో ఆగింది.

ఎత్తుగా, బలంగా మిలటరీ క్రాఫ్‌తో, ఫుల్ సూట్‌లో నాయర్ వెనకాలే ఆయన ప్రాణమిత్రుడైన పార్థసారధీ దిగారు.

ఎత్తైన గాలికొండ దిగి ఊళ్ళో కొంతదూరం నడిస్తే ఎదురయ్యే హేట్‌హిల్ మీద కట్టిన రైల్వే గెస్ట్‌హౌస్‌లో విడిది ఏర్పాట్లు ఘనంగా చేశారు.

శాంతమూర్తీ, కళలంటే ప్రాణం ఇచ్చే గొప్ప వ్యక్తీ అయిన వాసుదేవ నాయర్‌కి మిత్రుడైన పార్థసారధికి అరవై ఏళ్ళకి పైనే వుంటుంది వయసు. న్యూయార్క్‌లో ఓరియంటల్ కాంపాక్ట్ డిస్క్ మేన్యుఫాక్చరింగ్ కంపెనీ పెట్టిన పార్థసారధి- ఎల్. సుబ్రమణ్యం, కిషోరీ అమోంకర్, సుధా రఘునాథన్, శృతీ సడోలికర్‌లాంటి విద్వాంసుల ప్రోగ్రామ్స్ డిస్కులుగా విడుదల చేస్తూ మన ఇండియన్ మ్యూజిక్ గొప్పదనానికి పాపులారిటీ తీసుకురావడానికి నిత్యం శ్రమిస్తున్న అతను రెండు వారాలు వుండేలా రమ్మని ప్రాణమిత్రుడు పోరుతుంటే ఇండియాకి రాక తప్పలేదు.

అనీజీగా ఊళ్ళోకి దిగిన పార్థసారధి ఈ దండకారణ్యం మధ్యలో వున్న ఎత్తైన కొండల్నీ, అత్యంత సుందరమైన లోయల్నీ చూసి చలించిపోయాడు.

మీసాల్రాజు మిలటరీ హోటల్లో మేకపోతు పలావూ, అడివికోడి వేపుడూ, ఉప్పురొయ్యల్తో పకోడీలు, కొరమేను ఇగురూ వండించిన స్టేషన్ సూపరింటెండెంట్ ముత్యాలరావు చాలా గ్రాండ్‌గా ఎరేంజ్ చేసేడు డిన్నర్.

రాత్రయ్యింది.

చీకటి బాగా చిక్కబడింది.

ఊరంతా మాటుమణిగింది.

చలిగాలి సుళ్ళు తిరగడం మొదలెట్టింది.

స్కాచ్‌బాటిలూ, గ్లాసూ, ఐస్ క్యూబ్‌లున్న ఫ్లాస్క్ గెస్ట్‌హౌస్ బయట లాన్‌లో వున్న టీపాయ్ మీద పెట్టడం అయ్యాకా చేతులు కట్టుకుని నిలబడ్డ రైల్వేస్టాఫ్‌ని ఇక ఇళ్ళకు వెళ్ళిపొమ్మని చెప్పాడు నాయర్. లోపలికెళ్ళిన పార్థసారథి ఒక పోర్టబుల్ టేప్‌రికార్డర్ తీసుకొచ్చి ప్లే బటన్ నొక్కాడు.

ప్లే అవుతున్న టేప్‌రికార్డర్‌లోంచి మంద్రస్థాయిలో వినిపిస్తోంది పన్నాలాల్ ఘోష్ ఫ్లూట్.

ఆ కాన్సర్ట్ వింటూ ఆల్కహాల్ తాగడం అలవాటు పార్థసారధికి. ఒకో రాత్రయితే ఆ సంగీతంలో లీనమై తాగడం కూడా మానేస్తాడు.

రాత్రి దాటుతూంది. చుట్టూ వున్న కొండల మీంచి వీచే గాలి కాస్త ఉధృతమైంది.

రెండు పెగ్గులయ్యాక నిద్రొస్తోందని లోపలి కెళ్ళిపోయాడు నాయర్.

ఆ కొండగాలిని ఆహ్వానిస్తూ ఒంటరిగా తాగుతున్న సారధికి వీస్తున్న ఆ గాలిలో ఏదో నాదం కలిసి వినిపించినట్టయ్యి రికార్డర్ ఆఫ్ చేశారు.

నిశ్శబ్దం.

రికార్డర్ ప్లే బటన్ నొక్కబోతుండగా మళ్ళీ వినిపించింది.

దిగ్గున లేచిన పార్థసారధి ఆ నాదం వినిపించిన వేపే ఆ కటిక చీకట్లో ఒంటరిగా అన్వేషిస్తూ నడుస్తున్నాడు.

ఊరికి దూరంగా వున్న రైలు బ్రిడ్జి కింద కూర్చున్న దాసు తన ప్రాణానికి ప్రాణమైన లీలను స్మరించు కుంటూ, ఒకానొక చిత్రమైన తన్మయత్వానికి లోనవుతూ తన పిల్లనగ్రోవితో ఎన్నో గంటలనించీ ఆలపిస్తున్న వాడల్లా చీకట్లో తన ఎదురుగా నిలబడ్డ పార్థసారధి రూపాన్ని గమనించి ఠక్కున ఆపేసి "ఎవరు?" అన్నాడు.

"నీ భక్తుణ్ణిలే... వాయించు" అన్నాడు పార్థసారధి.

"ఈ చీకట్లో ఇక్కడి కెందుకొచ్చారు?" అన్నాడు దాస్.

"నువ్వు వాయించిన ఆ రాగం పేరేంటి?"

"నాకు తెలీదు... నాకు సంగీతం రాదు."

"సంగీతం రాదా?" నవ్వేసిన పార్థసారధి "పిచ్చివాడా అసలు సంగీతమంటే ఏంటో తెలుసా? మన హృదయం లోపలి అనుభూతి... నిజమైన కళాకారుడికి అది వుంటే చాలు. అదే వున్నవాడు ఈ సైన్స్ తెలుసు కోవాల్సిన పనిలేదు... మహావిద్వాంసుడ్ని సొంతంగా ఒక ట్యూన్ చేయమను. చెయ్యలేడు. సా...పా...సా అంటే ఏంటో తెలియకపోయినా పర్లేదు. గుండె ఆఖరి గుహలో వుంటుందే- ఆ ఇన్నర్ ఫీలింగ్- అది వుంటే చాలు. రాళ్ళు నీళ్ళలా కారతాయ్. బాణీలు పంచరంగుల వోణీలు కడతాయ్... నువ్వు రెండో కోవకి చెందిన మహాను భావుడివి!!!"

## 7

తూర్పున ఎర్రవారి తెల్లవారింది.





ప్రతిరాత్రి చీకటిరంగు దుప్పటి కప్పుకుంటూ యుగంసేపు యవ్వనంలో మిగిలిపోయే గాలికొండపుర నివాసి పరదేశిని 'ఆజారే పరదేశీ' అని పహాడి రాగంలో ఆలపిస్తూ ఆహ్వానించి తుషారంలో విహారం చేయించి ఆవహిస్తున్నాను అని చెప్పి మరీ ఆవులించి తనలో ఐక్యం చేసుకునే సర్వ సౌందర్యరాశి తన ముదురు పచ్చచీర కట్టుకోవడం అప్పుడే మొదలెట్టేసింది.

ప్రభావతి మ్యూజిక్ స్కూల్లోకి వచ్చి నిలబడ్డ పార్థసారధి, డివిజినల్ మేనేజర్ వాసుదేవ నాయర్ వెనకాల రైల్వేస్టాఫ్ మొత్తం నిలబడుంది.

కొన్ని నిముషాల్లో ఆమె కథనం అంతా విన్న సారధి ప్రభావతికి దగ్గరగా వచ్చి "చూడండమ్మా! మహాను భావులూ, మేధావులూ నూటికో కోటికో పుడ్తారు అంటారు. నమ్ముదాం. అత్యంత విలువైన ఏకముఖి రుద్రాక్ష నేపాల్ అడవుల్లో కొన్ని సంవత్సరాలకొకసారి ఒక్కటంటే ఒక్కటి మాత్రమే కాస్తుందట. అలాంటి గొప్ప జాతికి చెందిన మనీషి ఈ దాసు.

"ఇంతటి గొప్పవాడు ఈ చీకటి అరణ్యం మధ్యలో అనామకుళ్ళా మిగిలిపోవడం అన్యాయం. ఒక టి.ఆర్. మహాలింగంలాగో, పన్నాలాల్ ఘోష్‌లాగో, హరిప్రసాద్ చౌరసియాలాగో, ఫస్ట్ ఏసియన్ సింఫనీ కంపోజర్ అయిన ఇళయరాజాలాగో వెలగాలి. కాబట్టి ఇతన్ని నాతో తీసుకెళ్తాను. ఒక అనాధగా నిన్నగాక మొన్న ఇక్కడికి వచ్చిన ఇతన్ని నాకూడా తీసుకువెళ్ళడానికి ఎవరి అభ్యంతరం లేదనుకుంటాను."

ఒక మూల నిలబడ్డ లీల పార్థసారధి చెప్పిందంతా విని ఎటో చూస్తూంది. చాలా తీవ్రంగా ఆలోచిస్తూంది.

తన ప్రాణంకంటే ఎక్కువగా ఇష్టపడ్డ లీలని వదిలి వెళ్ళడానికి ఎంతమాత్రం ఇష్టంలేని దాసు ఆమెకేసే చూస్తున్నాడు.

"ఎవరూ మాటాడరేంటి?" అని పార్థసారధి వేసిన ప్రశ్నకి అంతసేపూ మూల నిలబడి వున్న లీల ముందు కొచ్చింది.

ఏంటన్నట్టు చూశాడు సారధి.

"చూడండి బాబూ! మేం గుర్తించలేని ఇతనిలో గొప్పదనాన్ని మీరు గుర్తించినందుకు చాలా సంతోషం. ఇతను ఈ అడవి దాటి మీకూడా వెళ్తే నిజంగానే చాలా గొప్పవాడైపోతాడు. ఈ జన్మలో ఈ పక్కకి రాడు కూడా. కాబట్టి మాదో కోరిక."

"ఏంటమ్మా?" అడిగాడు పార్థసారధి.

"మా అమ్మ ఈ అడవిలో మ్యూజిక్ స్కూల్ పెట్టి ఎల్లుండికి పద్దెనిమిది సంవత్సరాలు అవుతుంది. ప్రతి ఏడూ వార్షికోత్సవం జరుపుకుంటూనే వస్తున్నాం. మీరూ, ఇతనూ ఆరోజు వరకూ వుండివెళ్తే చాలా కృతజ్ఞులం" అంది.

ఆనందంగా తలూపిన పార్థసారధి "తప్పకుండా" అన్నాడు.

ముందు సారధికీ, తర్వాత దాసుకీ నమస్కారం పెట్టిన లీల "చాలా సంతోషం. ఇక్కడ మమ్ముల్నందర్నీ వదిలేసి వెళ్ళిపోయి త్వరలో ఒక ఫేమస్ పర్సన్ కాబోతున్న శ్రీ దాసుగారు ఆ రోజు స్టేజి మీద వారి మురళీ నాదంతో మా సభ రక్తి కట్టించడానికి ఒప్పుకుంటారనుకుంటాను" అనేసి వెళ్ళిపోయిందక్కడ్నించి.

*

ఎత్తైన కొండల మీంచి గుండెలదిరేలా శబ్దాలు చేస్తూ ఉధృతంగా కిందికి ప్రవహిస్తున్నాయి జలపాతాలు.

కొండ మీది కెక్కిన దాసు తన చేతిలో వున్న పిల్లనగ్రోవులన్నింటినీ అగాధంలోకి విసిరేశాడు.

పరుగున అక్కడికొచ్చిన లీల "ఏంటీ నువ్వు చేసిన పని" అంది.

"నాకు ఏ కీర్తి వద్దు. నువ్వు తప్ప ఈ ప్రపంచంలో ఇంకేదీ వద్దు. అందుకే ఈ పని చేశాను" అన్నాడు.

"విషయం చాలా వరకూ వచ్చింది. ఇప్పుడు నువ్వు కాదన్నా ఊరుకోరు వాళ్ళు. రేపు జరగబోయే ఫంక్షన్‌కి వాయించి తీరాలి నువ్వు. వాళ్ళ కూడా వెళ్ళాలి కూడా."

"నా జీవితం నా ఇష్టం. మొదట్నించీ అలాగే బతుకుతూ వస్తున్నాను నేను."

"ఇప్పుడు మాత్రం నీ జీవితం నీ ఇష్టం కాదు."

"ఎందుకు కాదు."

"నీలో వున్న అసాధారణమైన ప్రతిభ ఇన్నాళ్ళూ ఎవరికంటా పళ్లేదు గాబట్టి..." అంటూ అతని దగ్గరకొచ్చిన లీల "చూడు దాసూ! ఏ కోటిమందిలోనో ఒకడిలో వుండే గొప్పదనం నీకు ఆపాదించాడు ఆ ఈశ్వరుడు. అరుదుగా పుట్టే నీలాంటి గొప్పవాళ్ళు కాదన్నా అవతలివాళ్ళు ఊరుకోరు. నీ మీద దమనకాండ జరిపన్నా ఆ పని చేయించి తీరతారు. నా మాట విను. రా నా కూడా" అంది.

"వింటాను. నిన్ను విడిచిపెట్టి మాత్రం నే నెక్కడికి వెళ్ళను" మొండిగా అన్నాడు దాసు.

నవ్వేసిన లీల సైగ చేసింది తనతో రమ్మని.

ఆమె ప్రేమామృతవర్షంలో సర్వం తడిసిన దాసు, ఆమె రగిలించిన ప్రేమజ్వాలలో జ్వలించిపోతున్న దాసు, ఆ ప్రేమ సామ్రాజ్ఞి లాలనలో చిగురించిన శిల అయిన దాసు ఆమె వెనకే నడిచాడు.

## 8

రెండోరోజు సాయంత్రం.

ప్రభావతి మ్యూజిక్ స్కూలు పద్దెనిమిదవ వార్షికోత్సవానికి అక్కడి స్టూడెంట్సూ, ఊళ్ళనించీ వచ్చిన వాళ్ళ తాలూకా పేరెంట్స్‌తో పాటు గాలికొండపురంలో వుండే సంగీత విద్వాంసులు, అరకులోను, డముకులోనూ వుండే పెద్దలూ, అనంతగిరిలో ప్రముఖులు కూడా రావడంతో ఎటు చూసినా జనంలో పెద్ద సందడి మొదలైంది స్కూలు ఆవరణలో.

స్టేజిమీద కొచ్చి సభకి సమస్కారం చేసిన లీల దాసులో గొప్పదనాన్ని గుర్తించిన పార్థసారధిని చాలా గొప్పగా పొగిడి ఆయనకి కృతజ్ఞతలు చెప్పాకా ఇక దాసు గురించి కూడా ఆయనే చెబితే బాగుంటుంది అంది.

వేదిక మీదికొచ్చిన పార్థసారధి.

"శ్రీ దాసు మామూలు మనిషికాదు. సంగీతం గురించి స్థాలీపులాక న్యాయంగా కూడా తెలీదతనికి. అయినా అతని పిల్లనగ్రోవి ద్వారా రాగాలు ఆలపించి రోగాలు నయం చెయ్యగల మహావైద్యుడు. శిలతో చేసిన మురళినైనా అతని చేతికిస్తే డెబ్బై రెండు మేళ కర్తరాగాలూ అవలీలగా వాయించగలడు. సప్త తాళాల్నీ



చూపుడువేలుతో శాసించగలడు. గాలిలో సంగీతాన్ని సృష్టించగలడు. సంగీతంలో నిశ్శబ్దాన్ని నిర్మించగలడు. ఇప్పుడు ఆయన తమ వేణునాదంతో కొంతసేపు మనల్ని ఆలరింపజేస్తారు. అది వినబోతున్న మనం నిజంగా ధన్యులం" అన్నాడు.

ఇంకో దేశంలో స్థిరపడ్డ గొప్పవాడైన పార్థసారధి, దాస్ గురించి ఇంత గొప్పగా పొగుడుతుంటే మతులు పోయాయి అందరికీ. వేణునాదం ఎంత త్వరగా ప్రారంభిస్తాడా అని ఉత్కంఠతో ఎదురుచూస్తున్న జనం పూనకం వచ్చినట్టు ఊగిపోతూ దాసుని స్టేజి మీదకి రమ్మని అరుస్తున్నారు.

వేదిక మీదికొచ్చిన దాసు అందరికీ నమస్కారం చేస్తుంటే జనం కొడ్తున్న చప్పట్లకి ఆ పరిసరాలన్నీ మారుమ్రోగిపోతున్నాయి. ఇదిలా జరుగుతుండగా సరికొత్తదైన, ఖరీదైన ఒక పిల్లనగ్రోవితో స్టేజిమీద కొచ్చిన లీల దాన్ని దాసు కందించింది.

"లీలా! నిన్ను వదిలిపెట్టి నే నెక్కడికి వెళ్ళను. నువ్వంటే నాకు ప్రాణం."

"నేనంటే నిజంగా ఇష్టమా?"

"చెప్పాను గదా... నా ప్రాణంలో ప్రాణమని."

"అయితే ఈ పిల్లన గ్రోవితో వాయించాలిప్పుడు."

అయిష్టంగా దాన్ని అందుకున్నాడు దాసు.

మైకు ముందుకొచ్చిన లీల "శ్రీ దాసు ఇక తమ వేణుగానం ప్రారంభిస్తారు" అని ఎనౌన్స్ చేసి స్టేజి దిగేసి జనంలో కూర్చుంది.

ఇక వాయించడానికి సిద్ధమైన దాసు తన పెదాలని లీల బహుకరించిన పిల్లనగ్రోవికి ఆన్చి, రెండు చేతుల వేళ్ళనీ ఏడుస్వరాల్నీ ప్రసారం చేసే రంధ్రాల మీద ఆన్చబోయి చూశాడు. సహజంగా పిల్లనగ్రోవికి వుండే రంధ్రానికి మధ్య దూరం అంగుళంన్నర వుంటుంది. కానీ లీల బహుమతిగా ఇచ్చిన ఈ పిల్లనగ్రోవి విచిత్రంగా వుంది. రంధ్రానికి రంధ్రానికి మధ్య మూడు అంగుళాల దూరం వుంది.

గమనించిన దాసు నిర్ఘాంతపోయాడు. తన వేళ్ళని సాగదీసి ఆ రంధ్రాల మీద ఆన్చే ప్రయత్నం శక్తి కొద్దీ చేస్తున్నాడు. సాధ్యం కావడం లేదు.

ఇంతకాలం తనని ఆరాధించినట్టు నటించిన ఆ లీల ఎంత మోసం చేసిందో అప్పుడు అర్థమైంది దాసుకి.

వాయించమని నానా గొడవ చేస్తున్నారు జనం.

అసలే ఆవేశపరుడైన అతనిలో ఉడుకురక్తం మరింతగా వింతగా సలసలా మరుగుతోంది. శరీరమంతా స్వేదంతో నిండిపోతోంది. కడుపు క్రోధంతో రగులుకుపోతోంది. ఒక మహాగ్ని గోళం బద్దలయినప్పుడు పైకి వెల్లుబికే ఆవిర్లలా విడుస్తున్నాడు నిశ్వాసాన్ని.

అల్లకల్లోలంగా తయారైంది సభ. మరిక వాయించమని నానా గొడవ చేస్తున్నారు జనం.

ఎప్పుడూ తన జేబులో వుండే తాళాలగుత్తి బయటికి తీశాడు. వాటి మధ్యలో వుండే మడత చాకు తీసుకుని ఆ పిల్లనగ్రోవి రంధ్రాల మధ్య ఇమిడేలా తన రెండు చేతులవేళ్ళ మధ్యా కసిగా కోసి వేళ్ళని విడదీసి అనంతరం వాయించడం మొదలు పెట్టాడు.

ప్రఖ్యాత హిందూస్థానీ గాయకుడైన భీమ్‌సేన్ జోషి ఈ మధ్యనే కనిపెట్టిన 'హిందోళ బహార్' అనే రాగాన్ని అత్యంత మనోహరంగా ఆ సంగీత సరస్వతే దిగివచ్చి చప్పట్లు చరిచేంత ఆవేశంగా రకరకాల స్థాయిల్లో వాయిస్తూనే వున్నాడు.

కసితో కోసిన తన వేళ్ళ మధ్య రక్తం ధారలు ధారలుగా కారుతున్నా ఆపడం లేదు.

అపూర్వమూ, అత్యంత సుమధురమూ అయిన అతని సంగీతంలో విలీనమైపోయిన జనం అతని వేళ్ళ మధ్యలోంచి కారి వేదిక మీద పారుతున్న రక్త ప్రవాహాన్ని గమనించడం లేదు.

అలా గంటసేపు వాయించి, మొదలుకే నరికిన మహా సంగీతవృక్షంలా ఆ వేదిక మీద కూలిపోయాడు.

అంతసేపూ ఊహల్లోకి వెళ్ళిపోయి అప్పుడే వాస్తవంలోకొచ్చిన పార్థసారధి వేదిక మీదకెళ్ళి పడిపోయిన దాస్‌ని లేపే ప్రయత్నం చేస్తున్నాడు. కానీ,అప్పటికే చాలా రక్తం పోయిన ఆ దాసు ఇక లేస్తాడో లేదో!!!

చైతన్యాన్ని కోల్పోయి రక్తం మధ్యలో పడిపోయి వున్న దాసు స్థితిని చూస్తూ ఆ డయాస్‌కి ఒక మూల నిలబడి వుంది లీల. ఆమె మనసు గండశిలలో గుక్కెడు నీళ్ళూ స్రవించి ధారలుగా వర్షిస్తున్నాయామె కళ్ళలోంచి. ఆ దాసునే చూస్తూ గొణుక్కుంటుందామె.

సరస్వతీదేవి ప్రత్యేకమైన వరాలిచ్చి ఈ లోకానికి పంపించిన దాసులాంటి వాళ్ళమీద దమనకాండ జరిపించి తను మాత్రమే ప్రభవించాలనుకోవడం కన్యాకుమారి కెరటాల్ని అరచేతుల్తో ఆపాలని చేసే ప్రయత్నం లాంటిది.

*స్వాతి సపరివారపత్రిక*
*2 ఫిబ్రవరి 1996*






# ఫకీర్రాజుగారి దివాణం



ఫకీర్రాజుగారితో పాటు ఆర్కిటెక్ట్ గీతాంజలీ మేడమ్, ఆవిడ అసిస్టెంటు జననీ, సివిల్ ఇంజనీర్స్ బలరామ్‌రెడ్డీ, వేణూ, నేనూ అరకు రైల్వేస్టేషన్లో కిరండోల్ పాసింజరు దిగేసరికి మధ్యాన్నం పన్నెండు దాటింది.

ఫకీర్రాజుగారి దగ్గరకి పరుగెట్టుకొచ్చిన పాతికేళ్ళ కుర్రాడు "కన్నాజీరావుగారి అబ్బాయినండి, నా పేరు సుధాకర్. నాన్నగారు అర్జంటు పని బడి జైపూరెళ్ళారండి. ఆయనొచ్చేలోగా మిమ్మల్ని జాగర్తగా చూసుకోమన్నారండి... రండి" అన్నాడు.





సుధాకర్ ముందు నడుస్తుంటే మేం అతన్ని ఫాలో అవుతున్నాం.

"మీ ఫాదరెళ్ళింది రాజస్థాన్‌లో జయపూరా?" అడిగారు ఫకీర్రాజుగారు.

"అబ్బే కాదండి... ఒరిస్సా జైపూరు... ఇక్కడికి వంద కిలోమీటర్లలోపే నండి... రండి" అని పద్మాపురం గార్డెన్‌లోకి తీసుకెళ్ళాడు. పొడుగాటి సిల్వర్‌హ్యాక్ చెట్లకి పది అడుగులపైన టీక్ చెక్కతో కట్టిన కాటేజెస్ చూపించి "మీకు తెల్సును కోండి అయినా చెప్తున్నాను. వీటిని ట్రీ కాటెజెస్ అంటారు. లోపల చాలా బాగుం టాయి. వీటిలోనే మీ మకాం" అన్నాడు.

వాటిలో సింగిల్ కాటేజ్‌లూ డబుల్ కాటేజ్‌లూ వున్నాయి. ఎవరికి కావల్సి నవి వాళ్ళని తీసుకొమ్మని ఫకీర్రాజుగార్ని మట్టుకు "మీకోసం సూటు బుక్ చేశాను

రండి" అంటా గార్డెన్ మధ్యలో ఎకరం నేలలో వందలాది వూడలూ కొమ్మల మధ్య ఉన్న పెద్ద మర్రిచెట్టు మధ్య కట్టిన కాటేజ్ దగ్గరకి తీసుకెళ్ళి ఎల్ షేప్‌లో ఉన్న చెక్క మెట్లమీంచి పై కెక్కించాడు.

లోపలికెళ్ళి చూస్తే అద్భుతం. అక్కడున్న ఫర్నీచరంతా రా టీక్‌వుడ్‌తో చేసిందే. ఆదివాసీలు చేసిన వస్తువుల్తో ఇంటీరియర్ డెకరేషన్ చేశారు. హాల్లో తెల్లటి స్పాంజి పరుపులేసిన సోఫాలు, లోపలి కాట్స్ మీద బూరుగుదూది పరుపులు. ఏసీ మిషన్లు ఆన్ చేసేసరికి హాయిగా వుంది.

భోజనాలొచ్చాయి.

తిన్నాకా సుధాకర్‌ని పిల్చిన ఫకీర్రాజుగారు "మీ నాన్నగారు వచ్చేలోగా కాలక్షేపమేంటి మాకు?" అన్నారు.

"మీరెక్కడికెళ్ళాలన్నా బండి రెడీగా వుంది" అన్నాడు సుధాకర్.

"చీకటి పడేలోగా ఎక్కడికెళ్ళి రమ్మంటావ్?" అన్నాను.

క్వాలిస్ డ్రైవర్ నాజర్ని పిల్చిన సుధాకర్ "డుమ్రిగూడా వాటర్ ఫాల్స్ దగ్గరకి తీసుకెళ్ళు" అన్నాడు.

బయల్దేరింది బండి.

చాలా పద్ధతిలో నడుపుతున్నాడు డ్రైవర్ నాజర్.

అరకు లెవెల్ క్రాసింగ్ దాటి పదకొండు కిలోమీటర్లు ప్రయాణం చేశాకా డుమ్రిగుడా (చాపరాయి) వాటర్‌ఫాల్స్ దగ్గర ఆపాడు. ఆగస్ట్ నించి జనవరి దాకా ఉధృతంగా పారే ఆ జలపాతం మొత్తం ఎండిపోయుం దిప్పుడు. వందల సంవత్సరాల నించి పడున్న ఆ బండరాళ్ళ మధ్య టూరిజం వాళ్ళు కొత్తగా కట్టి రంగులేసిన ఆ కట్టడాలు చాలా ఆర్టిఫిషియల్‌గా వున్నాయి.

ఎక్కువసేపుండ బుద్ధవక అక్కడ్నించి కించమండ, పెదగరువు, కోట్నపల్లి, హుకుంపేట దాటి చింతల వీధొచ్చి రైట్లో ఉన్న జోలాపుట్టూ, ఒనకడిల్లీ రూట్లోకి తిరిగి ముందుకెళ్తే మత్స్యగుండం వచ్చింది.

అక్కడ చిన్నచిన్న గుంటల్లో చేపలు. అవి వాళ్ళకి దేవతలంట. వాటి ముక్కులకి బంగారపు తీగలు కుడతారట. అక్కడకెళ్ళిన మాకు టూరిజం వాళ్ళ కట్టడాలే బాగా కనిపించాయి. ఎవరో చూపించారు చేపలుండే గుంటలు. తీరా అక్కడికెళ్ళి చూస్తే ఆ గుంటల్లో చేపలూ కనిపించలేదు. దేవతలూ కనిపించలేదు.

అక్కడ కాస్సేపు గడిపాకా బలరామ్‌రెడ్డికీ గీతాంజలి మేడమ్‌కీ మధ్య దేవుడున్నాడా లేడా అన్న వాదన మొదలయ్యింది. "ఈ టైపు ఆర్గ్యుమెంట్లు చాలా చూశాను. ఎప్పటికీ తెమలవు" అన్నారు ఫకీర్రాజుగారు.

సెగలు గక్కుతున్న ఆ డిస్కషన్ మధ్యలో కొచ్చిన క్వాలిస్ డ్రైవర్ నాజర్ "సార్ మీకు మనుషుల్లోనే దేవుళ్ళుంటారని తెలీదాండీ?" అన్నాడు.

"ఏ మనిషిలో దేవుడున్నాడో చెప్పవయ్యా" అంది గీతాంజలి మేడమ్.

"చీకటి పడిపోయింది. రేపు వెపుదూగానీ రాత్రి భోజనానికి అరకు వెళ్దామా మధ్యలో ఏదన్నా వూరుందా?" అన్నాడు సివిలింజనీరు వేణు.

"పాడేరు వెళదాం సార్... అరకులా పాపులరవలేదుగానీ ఆ వూరికన్నా పెద్దది" అని బండిని ముందుకు పోనిచ్చాడు నాజర్.

పాడేరు ముందు తగిలే పాలిటెక్నిక్ వాళ్ళ బిల్డింగుల్లో లైట్లు వెలగడం లేదు. తలారిసింగి ట్రైబల్ వెల్‌ఫేర్ హాస్టలు వార్డెనుగారు స్ప్లెండరేసుకుని నక్కలపుట్ట వేపెళ్ళిపోతున్నాడు. కాశీగారి సినిమాహాలు ముందున్న జనం నెమ్మదిగా లోపలకెళ్తున్నారు. కొండల మధ్యలో ఉన్న మోదకొండమ్మ (పాదాలు) గుడి పూజారి జన్నికృష్ణ ప్రసాదు పూళ్ళో కొస్తున్నాడు. భవానీ రెడీమేడ్, భవానీ హార్డ్‌వేర్ ఇలా ఆ వూళ్ళో చాలా బోర్డులున్నాయి. నాజర్నడిగితే "అవన్నీ ఒక కుటుంబానికి చెందినవేనండి" అంటా బండిని గంపరాయిలక్ష్మి హోటలు ముందాపాడు.

భోజనం చేస్తూ "ఇప్పుడే కాచినట్టున్నారు చాలా బాగుంది చేపల పులుసు" అన్నారు ఫకీర్రాజుగారు.

"నిన్నరాత్రి కాచిన చేపల పులుసు ఇవేళ తింటే రుచి అంటారండి మా సుగుణమ్మగారు" అన్న నాజర్ వాళ్ళ సుగుణమ్మగారి ఆవపెట్టిన పనసపొట్టు కూర గురించీ, రోట్లో దంచీ దంచని కొబ్బరీ, పునాసమావిడీ, పండు మిరప్పళ్ళ పచ్చడి గురించీ, చిన్నముక్కలు కోసిన వేటమాంసం ముక్కలూ, ఆగాకారగాయ ఇగురు గురించీ వారం రోజులైనా పూరగాయలాగ పాడవని నాటుకోడి వేపుడు గురించీ చెపుతుంటే నోరూరింది అందరికీ. ఆ వంటలు వెంటనే ఆరగించాలన్న ఆత్రం అందర్లోనూ పెరిగింది.

భోజనాలయ్యేకా తిరిగి అరకెళ్ళేసరికి బాగా రాత్రయ్యింది.

మర్నాడు అందరికీ బ్రేక్‌ఫాస్ట్ పట్టుకొచ్చిన వాళ్ళబ్బాయి చెప్పాడు. కన్నాజీరావుగారింకా రాలేదంట. "ఫోనులో మాటాడదామంటే నాలుగురోజులుగా ఇక్కడ బిఎస్ఎన్నెల్ టవర్ ఫెయిలైంది. ఎట్టి పరిస్థితుల్లోనూ రేపు సాయంకాలానికి దిగిపోతారండి ఈలోగా ఇక్కడ మీరు చూడాల్సినవి చాలా ఉన్నాయి గదండి" అన్నాడు సుధాకర్.

"ఇవ్వేళ పద్మాపురం వాటర్ ఫాల్స్ వేపెళ్దాం సార్" అన్నాడు నాజర్.

పద్మాపురం ఊరు దాటేదాకా బాగానే వుందిగానీ అక్కడ్నుంచి మొదలైంది గతుకుల రోడ్డు. బండి కదలడం కనాకష్టంగా వుంది.

పేరు తెలీని పసుపుపచ్చ చెట్ల కింద గొర్రెలూ మేకలూ మేస్తున్నాయి. వాటి యాజమాని విప్పిన గొడుగు నేలమీద పెట్టి ఆ నీడలో తల పెట్టి పడుకున్నాడు. అరడజను మంది గిరిజన స్త్రీలు షోగ్గా తయారయ్యి అరకు లోయవే వెళ్తున్నారు. వాళ్ళని క్రాసయిన అయిదుగురాడాళ్ళు నీళ్ళు పట్టుకుని సీవండి బిందెమీద సీవండి బిందె అలాగ నాలుగు బిందెల్దాకా పట్టుకుని ఎదురొస్తున్నారు. హాస్టళ్ళలో చదువుకుంటున్న కుర్రాళ్ళు శలవల కొచ్చారేమో ఎర్రటి టీ షర్టులూ వెలిసిపోయిన జీన్ పేంట్లేసుకుని ఎదురొస్తున్నారు.

ఆ గ్రామం పేరు రణజిల్లెడంట. అంగన్‌వాడీ స్కూలు, చిన్న కిరాణాకొట్టు, కాఫీ హోటలు సందుల్లోంచి వెళ్తున్న క్వాలిస్‌లోంచి చూస్తుంటే గిరిజనుల ఇంట్లో ఫంక్షనేదో జరుగుతుంది. గాడిపొయ్యిలు తవ్వి, వాటి మీద ఇత్తడి డేగిశాలు పెట్టి వంటలు చేసుకుంటున్నారు.

బండిని ఇంకొంచెం ముందుకి తీసుకెళ్తుంటే ఎదురైన గిరిజన స్త్రీ "వెళ్తున్నారుగానీ అక్కడ నీళ్ళు లేవు దారి సరిగా లేదు" అంది ఒరియాలో.

చిరాకుపడ్తా వెనక్కి తిప్పాడు క్వాలిస్‌ని.





ఘాటీ ఎక్కాం. దారి పొడుక్కీ వేలాది ఎకరాల్లో ఉన్న పొడుగాటి సిల్వర్‌హుక్ చెట్ల కింద రెండడుగుల ఎత్తులో కాఫీ చెట్లున్నాయి. ముదురు పచ్చరంగులో ఉన్న ఆ చెట్లు ఆకులమీద పడిన ఎండ వెండిలా మెరుస్తుంది. ఇక మిరియాల పొదులు సిల్వర్‌హ్యుక్ చెట్ల చుట్టూ అల్లుకుపోయున్నాయి. లోపలికి చూస్తుంటే పగలే వెన్నెల్లా కొన్నిచోట్ల, కొన్ని చోట్ల పగలే చీకటిలాగుంది. అక్కడక్కడా రోడ్డు పక్కనే ఉన్న పనసచెట్ల మొదట్లోనూ, కొమ్మలకీ కాయలు. పండటానికింకా టైముందంట.

త్రైడ స్టేషనూ, ఏటిడిసి వాళ్ళు జంగిల్‌బెల్సూ అని పేరు పెట్టి కట్టిన కాటేజ్‌లూ, డముకువాటర్ ఫాల్సూ తిరిగి మధ్యాహ్నం అనంతగిరిలో వున్న తమిళం వాళ్ళ హోటలు శంకర్‌విలాస్‌లో భోజనం చేస్తున్నప్పుడు మళ్ళీ సుగుణమ్మగారి టాపికొచ్చింది. ఆమె హోటలు కొచ్చిన కారు డ్రైవరుకిగానీ ఆటోడ్రైవరుకిగానీ డబ్బులు పుచ్చుకోకండా భోజనం పెడతారంట. జాన్ అనే డ్రైవరు టూరిస్టుల్ని సుగుణమ్మగారి హోటలుకి ఎదురుగా వున్న అనకాపల్లి వాళ్ళ హోటలుకీ గరివిడి వాళ్ళ హోటలుకీ తీసుకెళ్తాడు. అది తెల్సి కూడా నవ్వుతా వాడికి ఫ్రీ భోజనం పెడతారు సుగుణమ్మగారు. అంతేగాకండా చాలామంది డ్రైవర్లు ఆవిడ దగ్గర అప్పులు పట్టుకెళ్తారుగానీ తిరిగివ్వరు.

ఇలా ఆవిడ గురించి వింటుంటే 'ఎంత మంచి మనిషి ఆ సుగుణమ్మగారు. రేపు బొర్రా గుహలకెళ్ళినప్పుడు తప్పకుండా ఆవిడ్ని చూడాలి, ఆవిడ హోటల్లో తప్పకుండా భోజనం చెయ్యాలి' అనుకున్నామంతా.

*



మర్నాడు పొద్దుట మంచులేదుగానీ చలి బాగా ఉంది. చెట్ల మీదున్న పక్షుల కిచకిచల శబ్దాలు చక్కగా వినబుద్దేస్తున్నాయి. పేరు తెలీని పక్షేదో అంతిమస్థాయిలో కూస్తా వెళ్ళిపోతుంది. వరసగా వున్న ఒక రకం పూలచెట్లు రాత్రంతా తియ్యటి వాసనొచ్చే వైలెట్ కలర్ పూలని గుట్టలుగా రాల్చాయి. ట్రీ కాటేజ్ చెక్క మెట్లు దిగి ఆ రాలిన పూలని తొక్కుకుంటా ముందుకెళితే బాటకి కుడిపక్కన మూడు అంతస్తుల్లో గుండ్రటి పాక కనిపించింది. తాటాకుతో కూడా మూడంతస్తుల పాక వెయ్యొచ్చా, ఇంతకుముందెక్కడా చూళ్ళేదే అనుకుంటా లోపలికెళ్ళి చూస్తే కుందేళ్ళు తాబేళ్ళూ రామచిలకలూ పిచ్చికలూ పావురాళ్ళూ లవ్‌బర్డ్సూ ఆ పాక లోపలి పంజరాల్లో ఆడుకుంటున్నాయి. కాఫీ ఫ్లాస్కూ పేపర్‌తో వచ్చిన సుధాకర్ "టిఫిన్లు కుర్రాళ్ళు తెస్తున్నారు సార్" అన్నాడు.

గంటలోపే తయారైపోయామంతా. నాజర్ క్వాలిస్ కూడా వచ్చేసింది.

ఘాటీ ఎక్కి రకరకాల మలుపులు తిరిగి సుంకరమెట్ట వంతెన దగ్గర కొచ్చాం. ఆ బెల్టులో జరిగే సంతల్లో కల్లా పెద్దది అరకు సంతయితే తర్వాతది సుంకరమెట్ట సంతేనంట. కర్రల్తో వేసిన పందిళ్ళ మీద ఎరుపురంగూ ఎక్కువగా నీలం రంగు ప్లాస్టిక్ సంచులు పరిచి ఆ నీడలో దుకాణాలు పెట్టారు. పందిళ్ళ చుట్టూ తాళ్ళు కట్టి వాటి మీద ముదురురంగుల చీరలూ గౌన్లూ చొక్కాలూ లుంగీలూ వేలాడగట్టి వ్యాపారస్తులు అమ్మడం. వాటిని తిరగేసి మరగేసి చూస్తూ "ఇవన్నీ కలకత్తా నించి తెచ్చిన చవకరకం మాకు తెల్దా" అని తెలివిగా బేరాలాడు తున్నారు.

స్లోగా ముందుకెళ్తుంది క్వాలిస్.

ఒకచోట కారం పెద్ద గుట్టపోసి కూర్చున్నాడో మనిషి. అతనికి కాస్త దూరంలో ఉప్పు పెద్ద రాసిగా పోసు క్కూర్చున్నాడింకో మనిషి. వాడి పక్కనే ఎండి చేపల దుకాణంవాడు. ఒకచోట పిక్క తియ్యని చింతపండు రెండు బుట్టలు పెట్టుక్కూర్చున్న గిరిజన స్త్రీ, రెండు కొండ అరిటిపళ్ళ గెలలూ ఓ వంద పైనాపిల్సు గుట్టతో గిరిజనుడు. టమోటాల గంపల్తో వచ్చిన భార్యాభర్తలు చాలా చవగ్గా అమ్మేస్తున్నారు.

"పంట ఎక్కువ అవటం వల్ల టమోటాల రేటు బాగా పడిపోయింది. అరకులోయలో ఏ హోటల్లో చూసినా టమోటా చెట్నీలే. ఈ సంతలో దుకాణాలన్నీ కిందనించి వచ్చిన వాళ్ళవేనండి. ఈ వ్యాపారుల్లో ఎక్కువమంది కోమట్లే సార్" అంటా హారన్ కొడ్తున్నాడు నాజర్.

అనంతగిరి దాటి బొర్రాజంక్షను దగ్గర కొచ్చాం.

కుడి పక్కకి తిరిగితే విశాఖపట్నం, ఎడం పక్క దిగివలో కొన్ని మైళ్లు ప్రయాణం చేస్తే బొర్రా గ్రామం.

వెళ్తున్న మా దారి కడ్డంగా చెక్‌పోస్ట్ గేటులా పొడుగాటి కర్ర అడ్డం పెట్టి దానికి ఎడాపెడా నిలబడ్డారు కొంతమంది గిరిజన యువతులు.

"ఇదేంటి?" అన్నాడు ఉదయంనించీ నోరు విప్పని జనని.

"ఈ నెలంతా ఈ ఘాట్‌రూట్‌లో ఇలా పొడుగ్గా ఉన్న లావుపాటి కర్ర అడ్డం పెట్టి వచ్చే బళ్ళనీ వెళ్ళే బళ్ళనీ ఆపి ఒక రూపాయి వసూలు చేస్తారంట."





"ఎందుకంట?" అడిగాడు వేణు.

"వేసవికాలం గదా, వీళ్ళకి పన్లుండవండి. అందుకని ఇలా దండుకుంటారు. ఈ దండుకోడాన్నే ఈటెల పండగంటారండి. మనం రూపాయిస్తే సరే లేకపోతే మనమీద ఏదో కలిపిన రంగు నీళ్ళు పోసేస్తారండి. వంటి మీద అవి పడ్డచోటల్లా ఒకటే దురద. అంతేగాకండా ఈ ఆడోళ్లు ఒరియా భాషలో పచ్చి బూతులు తిడతారండి మన కర్థం కాదనుకోండి" అన్నాడు.

"ఇదేం పండగయ్యా బాబూ" అంది గీతాంజలి మేడమ్.

"ఇది అనాదిగా వస్తున్నదండి. అయితే వీళ్ళీ మధ్య బాగా ముదిరిపోయారు. కింద నించి వచ్చిన వాళ్ళంటే చాలా చిన్న చూపయిపోయింది. ఇది మా నేల, మా రాజ్యం అంటా ఒకటే గొడవ, ఒకటే డామినేషన్" అన్నాడు నాజర్.

ఇక అక్కడ్నించి దారి పొడుక్కీ అదే గోల. రూపాయిస్తే కాదు అయిదంటున్నారా ట్రైబల్ లేడీస్. ఇవ్వకపోతే ఒరియాభాషలో తిట్లు.

"ఇవాళ ఫస్ట్ డే. రేపట్నుంచి ఘాటీ అంతా ఇదే అల్లరి" అన్నాడు నాజర్.

అలా కొంతదూరం వెళ్ళి అలిసిపోయిన మేం దారి పక్కనున్న ఆ పెద్ద పనసచెట్టు కింద బండాపాం.

ఫకీర్రాజుగారు బొర్రా జంక్షన్‌లో కొన్న చల్లటి బీర్లు బయటికి తీసి అందరికీ ఇస్తున్నారు.

నా పక్కనే కూర్చున్న నాజర్‌కి బీరిస్తే రెండు గుటకలేసి "ఈ గిరిజనులు ఇలా ప్రవర్తించడానికి కూడా కారణం ఉందిలెండి. కింది నించి వచ్చిన వాళ్ళు చాలా సంపాదిస్తున్నారు. ఎప్పటికైనా వీళ్ళు గిరిజనుల్ని ముంచేస్తారని వాళ్ళ భయం. అందుకే ఈ డామినేషను. మీకో సంగతి తెల్సా సార్. అరకులోయలో వ్యాపారాలు చేసే వాళ్ళెవరిదీ సొంతూరు అరకులోయ కాదండి. ఆ మాట కొస్తే నాదీ కాదండీ" అన్నాడు.

"ఏ వూరు మీది?"

"ఉత్తర కంచి."

"కాశీ, దక్షిణ కాశీ తెల్సు. కంచి తర్వాత ఉత్తర కంచి ఒకటుందా?" అన్నారు ఫకీర్రాజుగారు.

"ఉందండి... ఎక్కడుందో లాస్ట్‌లో చెబుతాగానీ ఆ వూరంతా రాజుల మయమండి... ఈ బీరు తాగడం అయ్యేలోపు కాలక్షేపానికి మా వూరి కథొకటి చెప్తాను వింటారేంటి?" అన్నాడు.

"తప్పకండా" అని ఆ చల్లటి పనసచెట్టు మొదట్లో కూర్చుంటే తక్కిన వాళ్లంతా జేరారు.

ఊళ్ళో రాజుల మేడలూ మండువా లోగిళ్ళు చాలా ఉన్నాయిగానీ వర్ధనరాజుగారి దివాణం తర్వాతే అవన్నీ. రాజ వీధిని జేర్చి వుంది వారి చావడి. దాన్ని కాకర్లపూడి వారి చావిడి అంటారు. దాంట్లో దశావతారాలూ, పేకాటలూ జరుగుతుంటాయి. రాత్రుళ్ళు పురాణకాలక్షేపాలు జరుగుతాయి. చావడికి అటూ ఇటూ పెద్ద పెద్ద గచ్చరుగులు. మధ్యనున్న ద్వారబంధం దాటి లోపలికెళ్తే లోపల అర్ధచంద్రాకారంలో రంగురంగుల అద్దాల కిటికీలున్న గోపీచందనం రంగుమేడ. దాని చుట్టూ పెద్ద ప్రహారీగోడ.

లోపలికెళ్తే ఎత్తుగా పుష్టిగా బలంగా పొడుగాటి గిరజాల జుట్టూ, సిందూరపు బొట్టూ, మెలేసిన కోర మీసాల్తో వుండే వర్ధనరాజుగారు పెద్దాపురం శిల్కులాల్చీ, ప్లేటంచు పొందూరు ఖద్దరు పంచా, పిఠాపురం నూర్జహాను అత్తరుతో గుబాళించి పోతావుంటారెప్పుడూ.

అతిధుల్ని తన ఇష్టానికి పిలుస్తారు భోజనానికి. అలా పిల్చినందుకు రాజుగార్ని ఒక్క మాటనరు రాణిగారు. సరిగదా, ఆవిడే వంటశాలలోకెళ్ళి స్వయంగా వండి పనోళ్ళతో లోగిట్లోకి పంపిస్తుంటారు. ఈ అతిధులు పర్లేదు, అర్ధరాత్రీ అపరాత్రీ అనక రంగుల సవ్వారీ బళ్ళమీద ఆడవాళ్ళు బిషాణా సావిట్లోకి దిగుతుంటారు రాజుగారి కోసం. ఆ వచ్చిన వాళ్ళకి వండి వడ్డిస్తుంటారు మారాణీగారు.

విజయనగరం అవతల రాజపులోవలో ఉంటా ఎప్పుడన్నా చుట్టం చూపుకొచ్చే వర్ధనరాజుగారి అమ్మయ్యగారూ కన్నమ్మయ్యగారూ అప్పయ్యగారూ, ఆ రాత్రిపూట దిగేరు దివాణంలోకి. సరిగ్గా అదే టైముకి ఈ ఆడోళ్ళు కూడా దిగేరు. ఈళ్ళొచ్చినట్టు ఆళ్ళకి తెలీకండా వుండటానికి చాలా అవస్థలు పడాల్సొచ్చింది మా రాణిగారికి.

ఒకసారేవయ్యిందో తెల్సాండీ, పెద్దాపురం నించి దిగిన నల్లశిల్కు చీరమ్మాయికి రాణీగారు ఇలా మర్యాదలు చేసి వెళ్ళేప్పుడు పసుపూ కుంకుమా చీరా జాకెట్టూ పెడితే ఏడుస్తా మా రాణీగారి పాదాల మీద పడిపోయి ఆ తర్వాత వృత్తి వదిలేసి దొండపూడి సాధువుగారి ఆశ్రమంలో చేరిపోయిందంట. ఇప్పటికీ మా ఉత్తర కంచిలో కథల కింద చెప్పుకుంటారా సంగతి.

జిల్లాలో ఎక్కడ కోడి పందాలు జరిగినా ఆ వార్తలు రాజుగారికి అందుతాయి. వచ్చేటప్పుడు ఉత్త చేతుల్తో వచ్చే వర్ధనరాజుగారు వెళ్ళేటప్పుడు ఎన్ని నోట్లకట్టలు తీసుకెళ్తున్నా మా రాణిగారు వద్దని ఆపరు సరిగదా ఆయన ఆనందానికి అడ్డెళ్ళగూడదు అనుకుంటారు.

రాజుగారికి నోటిదురుసు ఎక్కువ. ఎక్కడ ఏం మాటాడాలో తెలీదు, ఎలా మాటాడాలో తెలీదు. కాస్త పుచ్చుకున్నాకా అయితే బొత్తిగా తెలీదు. నోటి కొచ్చినట్టు మాటాడి గొడవలు పడొస్తే తెర వెనకనుంచి రాణీగారే మనుషుల్ని పంపించి గొడవలు సర్దుమణిగే ఏర్పాటు చేస్తారు. అంతే గాకండా వర్ధనరాజుగారి గురించి బయట ఏవనుకుంటున్నారో ఎప్పటికప్పుడు వాకబు చేయించి, వారికి పదికాలాలపాటు మంచి పేరు రావడానికి ప్రయత్నాలు చేస్తుంటారు.

లోవకొత్తూరు నించి ఒక గుంపు దివాణంలో కొచ్చిందారోజు. లోపల్నుంచొచ్చిన రాజుగారు ఏంటన్నారు. వాళ్ళకి పెద్దయిన ఆ మనిషి వర్ధనరాజుగారి ముందుకొచ్చి వాళ్ళ వూరు నాలుగూళ్ళ కూడలిలో వుందంట. అక్కడ వందడుగుల ఎత్తున్న ఆంజనేయస్వామి విగ్రహం కడదామంటే ఎవరూ రూపాయి చందా ఇవ్వలేదంట అందుకని మీ దగ్గర కొచ్చేం అన్నాడా పెద్ద.

"వందడుగులు కాదు రెండు వందల అడుగుల విగ్రహం కట్టించి పంచరంగులు వేయించండి మొత్తం నేనిస్తాను" అన్నారు రాజుగారు.

వాళ్ళంతా ఒక్కసారిగా వర్ధనరాజుగారికి నమస్కారం చేసుకుని జయజయ నాదాలు చేసుకుంటా వెళ్ళిపోయారు.





మాటివ్వడం జరిగిందికానీ ఆ రెండు వందల అడుగుల స్వామి విగ్రహానికి చాలా ఖర్చయ్యింది. దివాణం లో సొమ్మంతా తీసిచ్చినా చాల్లేదు. అప్పుడు రాణీగారు వజ్రాలు పొదిగిన తమ ఏడువారాల నగలూ రాజుగారి కిచ్చేశారు. ఇలా మారాణిగారి గురించి చెప్పుకుంటూపోతుంటే వీడేదో కల్పించి చెపుతున్నాడు ఇలాంటోళ్ళుం టారా అని మీరనుకోవచ్చు. నమ్మకపోవచ్చు. నా వెనకాల నవ్వుకోవచ్చు. కానీ అల్లాసాక్షిగా నిజం మాటాడ్తున్నానండి.

మా వూరి రాజుల కుటుంబాల్లో రెండు కుటుంబాలు వెనకటికెప్పుడో నెల్లూరుజిల్లాలో వున్న పాపిరెడ్డి పాళెం వలస వెళ్ళిపోయేయి. వాళ్ళమ్మాయి పెళ్ళికి ఆ రాజులు మా వర్ధనరాజుగార్ని స్వయంగా వచ్చి పిలిస్తే మందీ మార్బ లంతో బయల్దేరి వారం తర్వాత తిరిగొచ్చేరు రాజుగారు.

వచ్చిన వర్ధనరాజుగారు ఏదో మనేదతో మంచం పట్టేరు.

రాజుగార్ని చూసి బెంబేలెత్తిపోయిన మారాణిగారు "ఏవయ్యిందో చెప్పండి" అన్నారు.

చెప్పకండా అటు పక్కకి తిరిగి పడుకున్నారు రాజుగారు.

ఎంతసేపు ఎన్నిసార్లు అడిగినా చెప్పడం లేదు రాజుగారు.

ఎప్పుడూ లేంది రాణీగారి గొంతు శృతి పెరిగి పెద్దగా అరుస్తూ "చెప్పకపోతే నా మీద ఒట్టే" అన్నారు.

అప్పుడు చెప్పేరు వర్ధనరాజుగారు. పెళ్ళికెళ్ళిన పాపిరెడ్డి పాళెంలో ఒక అందమైన నల్లటి అమ్మాయి మీద మనసుపడ్డారు. మనుషుల్ని పంపించి అడిగిస్తే ఒక పొద్దుటి పూట వర్ధనరాజుగారి విడిది దగ్గరకొచ్చిన ఆ నల్లటి అమ్మాయి 'ఈ వయసులో నేన్నీకు కావల్సివచ్చేన్రా?' అని తిట్టి ఉమ్మేసి వెళ్ళిపోయిందంట. ఆ అమ్మాయి పేరు రత్నకుమారంట. రాజుగారి మనేదకి కారణం అదంట.

ఆమె చుట్టూ వున్న ఆడజనాన్నేసుకుని ఆ అమావాస్యరాత్రి పాపిరెడ్డిపాళెం బయల్దేరారు మారాణిగారు.

వారం పదిరోజులు గడిచాయి.

ఆవేళ తెల్లవారురఝామున రాజుగార్ని తిట్టి ముఖంమీద వుమ్మేసి వెళ్ళిన ఆ రత్నకుమారితో దివాణంలోకి దిగారు మా రాణిగారు.

నల్లటి ఆ రత్నకుమారిని చూసిన వర్ధనరాజుగారికి తలెత్తి రాణీగార్ని ఎలా చూడాలో అర్థంగాక సిగ్గుతో తలొంచుకున్నారు.

ఆర్నెల్లు గడిచినియ్యి.

వర్ధనరాజుగార్ని రకరకాల డిమేండ్లు చేసి ఆయన దగ్గర్నించి వస్తురూపంలోనూ డబ్బురూపంలోనూ చాలా డబ్బు లాగేసుకోడం మొదలెట్టిన రత్నకుమారి రాజుగార్ని మురిపిస్తా బులిపిస్తా వుందిగానీ ఏ రాత్రీ ఆయన పక్కలో పడుకోలేదు. ఒక అర్ధరాత్రి లాక్కున్న సొమ్ముతో సవ్వారీ బండోడి సాయంతో ఉత్తర కంచి దాటేసిందా నల్లటి రత్నకుమారి.

ఆ మనిషెళ్ళిపోయిన తర్వాత చాలా బెంగెట్టేసుకున్నారు రాజుగారు.

కాలం గడుస్తుంది.

ఆస్తులు సర్వం పోయాయి. దివాణం గోడలు కూల్తున్నాయి. బాగా ఆలోచించిన మారాణిగారు దివాణం లో పనివాళ్ళనందర్నీ తీయించేసి తలుపులు మూయించేసి దివాణం లోపలేం జరుగుతుందో పిసరంత కూడా బయటి ప్రపంచానికి తెలీకండా కాపాడారు.

సర్వం ఆర్పేసిన వర్ధనరాజుగారు ఓ తెల్లవారుఝామున కాలం చేశారు. పిల్లల్లేని వారి వంశం అక్కడితో అంతమైంది అని, చెప్పడం ఆపిన నాజర్ "ఐనాగానీ ఇప్పటికీ దేవుడి పల్లకీ ముందు మూసి వున్న వర్ధనరాజుగారి దివాణం ముందు ఆపి ఆ రాజుల పేర్న అర్చన చేసి ముఖ్యంగా మారాణి పేర్న ప్రత్యేకమైన పూజలు చేసేకగానీ వూళ్ళోకెళ్ళదు. అలాగే వీరముష్టోళ్ళు, గంగిరెద్దులోళ్ళు, పగటి వేషగాళ్ళు, మల్లికాసులోళ్ళు, మొదటి ఆట వర్ధనరాజుగారి దివాణం ముందే కడతారు. వాళ్ళ ఆటలూ పాటలూ మారాణిగారు ఆ దివాణం కిటికీలకున్న పంచరంగుల అద్దాల్లోంచి చూస్తున్నారని వాళ్ళ నమ్మకం."

"ఇంతకీ ఆ రాణిగారు దివాణంలో వున్నారా లేరా?" కుతూహలంగా అడిగాడు ఫకీర్రాజుగారు.

నవ్వాడు నాజర్.

"నువ్వు చెప్పిందంతా విన్నాకా మీ సుగుణమ్మగారి కంటే ముందు ఉత్తర కంచి వెళ్ళి వర్ధనరాజుగారి దివాణంలో వున్న మీ రాణీగార్ని చూడాలనుంది?" అంది గీతాంజలి మేడమ్.

మళ్ళీ నవ్విన నాజర్ "ఈ ప్రపంచంలో మూడో కంటికి తెలీని రహస్యం ఒకటి చెప్పనాండీ?" అన్నాడు నాజర్.

"ఏంటీ?" అన్నాం.

"మారాణీగారే ఈ సుగుణమ్మగారు" అన్నాడు నాజర్.

"అర్థం కాలేదు" అంది జనని.

"ఒక అర్ధరాత్రిపూట ఆ దివాణం వదిలేసి ఈ బొర్రాగుహలు దగ్గరకొచ్చి హోటలు పెట్టుకున్న మారాణీ గారే ఈ సుగుణమ్మగారు... పదండి భోజనాల టైమయ్యింది" అన్నాడు నాజర్.

*స్వాతి సపరివారపత్రిక*
*13 అక్టోబర్ 2006*









చచ్చిపోతావా?...దేనికి?.... బాధా!

ఓస్, ఇంతేనా! బాధని మరిచిపోవాలి. భవిష్యత్తుని స్మరించుకోవాలి. అంతే! అంతే!

*

"రాత్రి నాకో చక్కటి కలొచ్చింది కాంతం! నేను చచ్చిపోతున్నాను. ఓ రాజకుమారుడొచ్చి..."

"పోదూ. నీ కెప్పుడూ కలల గోలే. ఈ బిగి తగ్గకముందే నాలుగు డబ్బులెనకేద్దామని ఉండదు" విసుక్కుంది కాంతం.

నవ్వుకుంది తను. ఆ నవ్వులో విషాదం లేదు. తన కలలెవరూ వినరనే బాధలేదు. కేవలం నిర్లిప్తత.

"ఇదుగో, రాజమ్మా!"

"నన్నా పేరుతో పిలొద్దన్నానా" అరిచింది రాజమ్మ.

"పోన్లే రాణీ! కల లెప్పుడూ నిజం అవ్వవే" అంది కాంతం.

"నాకు ఆ కల తెల్లవారుఝామునొచ్చింది."

"తెల్లవారుఝామునొచ్చినా సరే, తొలిపొద్దు వేళప్పుడొచ్చినా సరే- కల కలే, జీవితం జీవితమే."

"పోదూ పేద్ద చెప్పొచ్చావ్. చదివేవులే అయిదోక్లాసు!"

"చదువు గురించి కాదే నిజం చెబుతున్నాను. మీ అమ్మేంతెడుస్తుందని మాలా వృత్తి చెయ్యకపోయినా, ఆ రిక్షావాణ్ణి కట్టుకోడాని కొప్పుకోకూడదూ?"

"ఇదిగో కాంతం నేనెవరనుకున్నావో జాగ్రత్తగా మాటాడు."

"అబ్బ ! నీ పిచ్చెప్పుడొదుల్తుందో!!"

"అదిగో, మళ్ళా."

"నువ్వెన్ని చెప్పినా, నే వాగేదేదో నీ ముందు వాగేసి పోతాను. నువ్వు అమాయకపు పిల్లవి. అభం శుభం తెలీదు నీకు. నలుగురినెలా మెప్పించాలో అసలు తెలీదు. అనకూడదు కానీ, నువ్వు నల్లగా వుంటావు. నీ పదోక్లాసు చదువెవరిక్కావాలి? వాళ్ళకి అందం కావాలి. అదైనా కాస్సేపు. తర్వాత వాళ్ళెవరో నువ్వెవరో, మీ అమ్మ రాజవంశంలో పుట్టినా చేసిన పనేమిటి? నిన్నే రాజూ వరించి పల్లకి పంపడు. ఆలోచించుకో. చీకటి పడుతోంది. నేను తల దువ్వుకోవాలి" అని లేచెళ్ళింది కాంతం.



తను అలా నీరసంగా నడుస్తూ పోతున్న కాంతం వంకే చూస్తూంది. ఈ ఇంటికి వచ్చిన కొత్తలో ఎంత అందంగా వుండేది కాంతం! పాపం ఎలా అయిపోయిందో. కరిగిపోయిన పచ్చి మట్టిబొమ్మలాగ! కొత్త రోజుల్లో పదిహేను రూపాయలైతేనే గానీ లోనికడుగు పెట్టనిచ్చేది కాదు కాంతం. మరి ఇప్పుడో? హవ్వా! కాంతం మొకమెవడైనా చూస్తున్నాడా? ఆరోజుల్లో స్టూడెంటు కుర్రాళ్లకి

రాత్రి రాణి కదూ కాంతం! పాపం స్వానుభవంతో చెబుతుంది. తన భవిష్యత్తులో చాలా నికృష్టమైన బతుకు గడపాలట. అందుకే ఇప్పుడే మేల్కొని వుంటుంది కాంతం. తను అందంగా వుండేదట. తనకి అప్పు డప్పుడూ వచ్చే ఛాతీ దగ్గర నొప్పి గురించి తెలుసా ఈ కాంతానికి! నీ ఆరోగ్యం మంచిది కాదే ఆ రిక్షావాడ్ని కట్టుకో అంటుంది. కానీ, ఎలా? తన తియ్యటి కల? అసలు తన కులమేమిటి? తన తాత ముత్తాతల చరిత్రలేమిటి? తన తండ్రి యుద్ధంలో పని చేశాడు. యుద్ధంలోనే పోయాడు. తన ముత్తాత ఇంగ్లీషువాళ్ల కాలంలో గుర్రం మీద తిరిగేవాడు. తాతగారు రైల్లో ప్రయాణం చేస్తుంటే ఆయనెక్కడ ఆగమంటే అక్కడ ఆపేవారట రైలుబండి. ప్రతి ఊళ్ళోనూ ఓ సౌందర్యరాశి ఆయన సొత్తై పడి వుండేదట. కొన్ని వందల ఎకరాలకి ఆయన అధిపతట. మన్యం ప్రాంతాల్లో వేల ఎకరాల బీళ్ళుండేవట. ఓసారి ఓ కొండజాతి మనిషి మీద ఆయన చెయ్యేస్తే అది శపించిందట. అప్పట్నుంచీ ఆయన పతనమవుతూ వచ్చేడట. చివరికి తన తండ్రికి యుక్తవయస్సు వచ్చేటప్పటికి ఆస్తులు హారతై అంతస్తులు బూడిదపాలై కొంత గత కీర్తి మాత్రం మిగిలిందట. ఒకడి కింద నేను గులాము నెప్పటికీ కాదు. నా శరీరంలో ప్రవహించేది మా తాత ముత్తాతల రక్తం. అందుకే నేను యుద్ధంలోకి పోతాను, యుద్ధంలోనే చస్తాను. ఇదే నా తుది నిర్ణయం అంటూ మిలటరీకి వెళ్ళిపోయాడట తన తండ్రి.

ఈ కథలన్నీ తన చిన్నప్పుడు వాళ్ళమ్మ చెపుతుంటే వింటున్న తన రక్తం ఉప్పొంగేది. ఎప్పటికైనా ఓ రాజకుమారుడే నన్ను వరిస్తాడు అనే నమ్మకం తనకి. దానికి తగ్గట్టు తన కలల్లోకి అందమైన భవంతులు, యువరాజులు వస్తుంటారు.

భారతదేశానికి మరో శత్రు రాజ్యానికి యుద్ధం ముమ్మరంగా సాగే రోజులవి. తన తండ్రి నుంచి ఉత్తరం కోసం ఎదురుచూస్తుంది. నాన్న వస్తారా! నాకు నైలాను గౌనులు, రబ్బరు బూట్లు, చలికోట్లు తెస్తారు అంటూ మురిపించేది అమ్మ. ఆరోజు వర్షం కురిస్తుంది భోరున. పోస్ట్‌మెన్ తెచ్చిన టెలిగ్రామ్ విప్పింది అమ్మ-ఆతృతతో. అంతకు మించిన ఉత్సాహంతో పోస్ట్‌మెన్ టెలిగ్రామ్ చదివాడు.

అంతే.

అమ్మ కుప్పకూలిపోయింది. నిలువెల్లా ఒణికిపోయింది. అది నిజమని నమ్మటం లేదు. నాన్న పోయా డంటే అన్నవాళ్ళ మీద విరుచుకు పడ్తుంది.

కొన్నాళ్ళు గడిచాయి. ఆ తర్వాత ఈ ఊరు వచ్చేశారు అమ్మ, తనూ. రోజూ ఇంటికి ఒకాయన వస్తుండే వాడు. కొన్నాళ్ళకి ఆయన రావడం మానేశాడు. ఇంకొక వ్యక్తి రావడం మొదలెట్టాడు. ఇలా కొంతకాలం. అతనూ రావడం మానేశాడు. ఆ తరువాత అమ్మ ఈ ఇంటికొచ్చింది. అప్పట్నుంచి ఇప్పటివరకూ ఇక్కడే. ఇక్కడ తిరుగుతుంటారెప్పుడూ. ఇద్దరు ముగ్గురు బయటి ఊళ్ళెల్లి వారం పదిరోజులుండి డబ్బూ, దస్కం బాగా సంపాదించుకొస్తారు. శాశ్వతంగా ఇక్కడే ఉండే వాళ్ళలో అమ్మ ఒకర్తె. అమ్మెప్పుడూ బయటి ప్రపంచాన్ని చూడదు. ఎప్పుడూ ఆ చీకటి గదిలోనే, నులక మంచం మీదే.

*

"ఏమిటి రాణీ, కలలు కంటున్నావ్?" మళ్ళీ వచ్చింది కాంతం.

"కల కాదు"

"ఆలోచిస్తున్నావా? అదీ- ఇప్పుడు నచ్చావ్ నాకు."

కు

"ఇప్పుడు నీకు నేను నచ్చానా?"

"చూడు, రాణీ! ఇప్పుడు జరుగుతున్నది మరచిపోవాలి. రేపటి గురించి మత్తుగా కలలు కనాలి."

"మా రాజా ఇదే చెప్పాడు."

"ఇంకా చాలా చెప్పబోయి ఉంటాడు. ఈ లోపున నీకు మెలుకువ వచ్చేసి ఉంటుంది."

"నా రాజా చెప్పబోయేది నువ్వు చెప్పరాదూ!"

"చెబుతాను. ఏవిటంటే... రేపు గురించి ప్రతివాళ్ళూ సుఖాన్నీ, సంతోషాన్నీ కోరుకుంటారు. కానీ, చేయాల్సింది మరచిపోతారు. భవిష్యత్తులో మనం గొప్పోళ్ళం కావాలంటే దానికి కారకులెవరు? మన కృషి ఎంత వరకు? అది... అది ఆలోచించాలి."

"ఛీ! నా రాజైతే ఇలా చెప్పడు. ఏదో రోజొచ్చి నిన్ను ఎత్తుకుపోతాను మేనాలో, అంతవరకూ నిరీక్షించు-ఏఁ!! అంటాడు."

"అలా చెప్పే రాజులు అందరికీ తారసపడరు, రాణీ!!!"

"ఫో... నాకేం చెప్పకు" తోసేసింది రాణి.

"నీ ఖర్మ!" తెల్లవారుఝామున నీట్లో వేసిన నిన్నటి చామంతి పూలదండ జడలో తరుముకుని వెళ్ళిపోయింది కాంతం.

*

"మా ఆవిడకేదో రోగం. ఈ మధ్య శానిటోరియంలో చేర్పించాను. నేనెవర్నో ఏమిటో నీకు పూర్తిగా తెలుసు. మీ రాణీని రాణీలాగే చూసుకుంటాను. మీ రాణికి రాత్రుళ్ళు తియ్యటి కలలొస్తాయట- రాత్రి కాంతం చెప్పింది. ఆ కలల్ని నిజం చేస్తాను" అన్నాడతను రాణీ తల్లితో.

"బాబూ! తమలాంటోళ్లు నాలాంటి నికృష్టపు బ్రతుకు బ్రతికే దాని కూతుర్ని అడగడమే పదివేలు. కానీ, బాబూ! ఓ విషయం అడగడానికి వెనకాడ్తున్నాను."

"ఏమిటీ?" ఉత్సాహంగా లేచాడతను.

"ఏమీ లేదు, బాబూ! ఎలాగా శాశ్వతం చేసుకుంటానంటన్నారుగా!!"

"అనడమేమిటి? నిజం."

"నిజం అంటున్నారుగా?"

"అయ్యో! మళ్ళీ మొదలుకే? మన మాటకి ఢోకాలేదు".

"మూడు ముళ్ళేసెయ్యండి,బాబూ!"

"పెళ్ళా? పెళ్ళికి ఒప్పుకోదు చట్టం. శానిటోరియంలో ఉన్న మా ఆవిడ చస్తుందనా నీ ఉద్దేశ్యం? అమ్మో! అది నే చచ్చేదాకా చావదు."

"నా కూతురు నల్లగా ఉంటుంది, బాబూ!"

"నల్లగా ఉన్న వాళ్ళలోనే గొప్ప అందం ఉంటుంది. అది తరగని సౌందర్యం."

"సర్లే, బాబూ! పిల్ల నడుగుదాం."





"మళ్ళీ అడగడమొకటా? కన్నదానివి ఏదో కాస్త చదివించి ఇంత దాన్ని చేశావ్- నీ కెదురు తిరుగుతుందా?"

"లేదులెండి, బాబూ! దానికి స్వేచ్ఛ ఇచ్చాను."

"సర్లే. కనుక్కో. నాకు పాసెంజరు బండికి టైమవుతోంది" తొందరపెట్టాడతను.

"ఇదిగో, రాణీ! నీ రాజొచ్చాడు" అంటూ పిలిచింది కాంతం.

"రాజా? నా రాజా?" ఉత్సాహంగా గంతులేసింది రాణి.

"అవును. నీ రాజే."

"ఏడీ, ఎక్కడ? నాకు తెలుసు కాంతం, నా రాజొస్తడని చెప్పలే?" అంటూ బయటికి పరుగెత్తింది రాణి.

"ఈయనే నీ రాజు" అంది కాంతం.

అతని వేపు చూసింది రాణి.అలా కొద్ది క్షణాలు చూసి తల తిప్పేసింది. "ఊహూ నా రాజిలా ఉండడు" అనేసింది మొహమాటం లేకండా.

"ఏమిటీ పొగరు? అవతల రైలుకి టైమవుతోంది" చిరాకు పడ్డాడతను.

"తప్పమ్మా. అలా అనకూడదు. లే... లేచి బట్టలూ అవీ సర్దుకో" అని తల మీద చెయ్యేసింది రాణి అమ్మ.

"ఊహూ. నా రాజా కాదంటే వినపడదేం మీకు? నా రాజెలా ఉంటాడనా! పట్టుబట్టలు కట్టుకుంటాడు. మంచి గంధం పూసుకుంటాడు. నుదుట కళ్యాణతిలకం. బుగ్గన కాటుక దిద్దిన చుక్క. పల్లకీలో వస్తాడు. వీడ్ని నా రాజంటారేంటీ? నా రాజు పల్లకీ మోసే బోయిల్లో ఒకడేమో కనుక్కోండి."

నిప్పులు తొక్కుతా ఆ మనిషి నిలబడ్డాడు. చెయ్యెత్తాడు. రాణీ కళ్ళలోకి చూశాడు. ఆ కళ్ళలో ఏదో అద్భుత శక్తి ఉన్నట్టు స్ఫురించింది. ఎత్తిన చెయ్యి దించాడు. తర్వాత వెళ్ళిపోయాడు.

*

"రాత్రి నా రాజొచ్చాడు, కనకం! ఎలా ఉన్నాడనుకున్నావ్? అబ్బా, రాజకుమారుళ్ళానే ఉన్నాడనుకో, పల్లకీని అదుగో, మన వీధుందా- మురిక్కాలవ లేదూ? దానిపక్క ఎర్ర కంకరరోడ్డు మీద దించారు బోయిలు. ఆ బోయీలేమో మన ఎదురింటి మేడ అరుగుల మీద కునుకుపాట్లు పడుతున్నారు. నిన్న రాత్రంతా యుద్ధం చేసి ఆ పశ్చిమ భాగాన్నంతా కొల్లగొట్టుకొచ్చాడు."

"రాజేమిటి, రాజ్యాలేమిటి? రాజులెప్పుడో మట్టిలో కలిసిపోయారు. వాళ్ళ కోటలన్నీ కూలిపోయాయి కదమ్మా?" అంది, కొత్తగా ఆ కొంప కొచ్చిన కనకం.

"అబ్బ! నువ్వూ ఆ పాడు కాంతంలానే. విను... ఆ... ఆ... పశ్చిమం వేపు రాజ్యాన్ని కొల్లగొట్టుకొచ్చాడన్నాను కదూ? నన్నేమో తన తెల్లగుర్రం మీద అడవుల్లోకి తీసుకెళ్ళాడు. అక్కడ అడివి మధ్యలో పెద్ద జలపాతం. జలకాలాడాం. నన్ను నువ్వు వన కిన్నెరలా ఉన్నావన్నాడు. నా తడిసిన చీర లాగేసి ఎక్కణ్ణించి తెచ్చాడో ఆ మన్మధుడు! ఓ గంధం రంగు పట్టుచీర నా ఒంటి మీద కప్పాడు. ఆ కొత్త చీర గరగర చప్పుడు ఎంత బాగుందనుకున్నావ్?"

తను చెప్పేదంతా కళ్ళు పెద్దవి చేసి వింటున్న కనకాన్ని అప్పుడే వచ్చిన కాంతం- "నువ్విక్కడున్నావా? లే లే, బట్టల మూట సాయిబొచ్చాడు. చీర కొనుక్కుంటానన్నావుగా!" అంటూ లేవదీసుకుపోతూంది.

"రాజులూ, రాజ్యాలంటుందేంటి రాణీ?" కనకం అడిగింది కాంతాన్ని.

"అన్నీ కలలే" తేలికగా నవ్వింది కాంతం.

"కలలా! నిజమనుకుని ఈర్ష్యపడ్డాను సుమా!"

"ఏడ్చిందిలే నీ బుద్ధి" అని నవ్వి ముందుకు తోసింది కాంతం.

*

"నా రాజిక రాడు. నేను చచ్చాకనే వస్తాడు" అని చీటి వ్రాసి, ఆరు మాత్రలు మింగి, ఇత్తడి చెంబుడు నీళ్లు తాగి బయటికి వస్తాయని రెండు చెంచాల ఉప్మా తింది రాణి.

మరి కొన్ని క్షణాలకి రాణి ప్రాణం ఎక్కడికి పోయిందో పోయింది- ఇంత వరకూ మనిషి కనుగొనలేని చోటికి. రాణి కళేబరం అక్కడే మిగిలిపోయింది. ఆఖరిక్షణాల్లో కూడా రాజు కోసం ఎదురుచూస్తూ ఉండి పోయిందిలా ఉంది- రాణీ కళ్ళు వీధి గుమ్మం వేపు చూస్తూనే ఉన్నాయి.

*

శ్మశానంలో రాణీ శవం ఎర్రగా, నీలంగా కాలుతూంది.

ఎవరో సాధువు పరధ్యానంగా నడుస్తూ అక్కడ నిలబడి శవాన్ని చూస్తూ ఏడుస్తున్న వ్యక్తిని చూసి దగ్గరగా వెళ్ళి, "బిడ్డా! ఏడుస్తున్నావేం? ఎవర్నువ్వు?" అన్నాడు.

"రాజుని."

"రాజువా! రాణేదీ?"

"అదుగో..."

"అయ్యో, అదేం? రాణీ అలా కాలిపోతూంది?" అడిగాడు సాధువు.

"ఆలస్యమయిందిగా!!!" సమాధానం చెప్పాడు రాజా.

*ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక*
*10 సెప్టెంబర్ 1975*











# బాబూరావు మాష్టారు



రెండు కుంచాల మినుముల మూట నా నెత్తిమీద పెట్టి "కాలవ గట్టు మీదున్న సత్తార్‌గాడి పిండిమిల్లులో ఆడించుకురా" అంది మా అత్తయ్య.

సంతపేట దాటానో, లేదో అంత వరకూ బాగానే వున్న ఆకాశం నిండా నల్ల మబ్బులు మూసేశాయి.

ముమ్మరంగా వీయడం మొదలెట్టింది గాలి. ఇంకో నాలుగడుగులు వేసే సరికి వర్షం కూడా పట్టుకుంది.



తల మీదున్న మినుముల మూట తడిసిపోతే పిండి ఆడ్డానికి పనికిరావు. గబగబా పరుగెత్తుకెళ్ళి బాబూరావు మేష్టారి ఇంటి అరుగు ఎక్కాను.

గాలీ, వర్షం బాగా ముదిరాయి.

మేష్టారి కూతురు రత్నమాల తెల్లగా, సన్నగా, పొడుగ్గా వుంటుంది. తుంగచాప తీసుకొచ్చి అవతల పక్క అరుగు మీద పరిచి మళ్ళీ లోపలికెళ్ళి హార్మోనియం పెట్టె పట్టుకొచ్చి పెట్టింది.

కాస్సేపటికి లాల్చీ షరాయీ వేసుకున్న బాబూరావు మేష్టారు వేడి కాఫీ తాగుతూ ఇంట్లోంచి బయటికొచ్చి హార్మోనియం పెట్టె ముందు కూర్చుని, కురుస్తున్న వర్షాన్నే రెప్పార్పకండా చూస్తూ తాగిన కాఫీ గ్లాసు పక్కన పెట్టి, బీడీ వెలిగించాడు.

నేను మేష్టార్నే చూస్తున్నాను.

చాలాసేపు వర్షాన్ని చూశాక ఎడంచేత్తో బెల్లోస్ ఊపుతూ, కుడిచేతి వేళ్ళు హార్మోనియం మెట్లమీద నెమ్మదిగా ఆడించడం మొదలెట్టాడు.

అదేదో రాగం లాగుంది వాయిస్తున్నాడు. అలా చాలాసేపు పాడుతూ వాయించాడు. ఆయన వాయిస్తున్న తీరును చూస్తున్న నాకు, వర్షం తగ్గినా ఆ అరుగు మీంచి కదలబుద్ధవ్వలేదు.

వాతావరణం అలా వుండటంతో చాలా తొందరగానే దీపాల వేళయిపోయింది. హరికెన్ లాంతరు పట్టుకొచ్చి వేలాడ్తున్న తీగకి కట్టి వెళ్ళింది రత్నమాల.

*నీకోసం నీకోసం.. నా గానం నా ప్రాణం నీకోసం...* పాత సినిమా పాట వాయిస్తున్నాడు మేష్టారు.

చీకటి పడిపోయినా అక్కడ్నించి కదలబుద్ధవడం లేదు నాకు.

పాట తర్వాత పాట వాయిస్తూనే వున్నాడాయన.

బాగా చీకటి పడ్డాక నన్ను వెతుక్కుంటూ వచ్చిన మా అత్తయ్య ఇక్కడున్నావా అని రెండు బాది ఇంటికి తీసుకెళ్ళింది.

మళ్ళీ మొదలైన వర్షం ఆ రాత్రంతా కురుస్తూనే వుంది. మా మావయ్య మిలటరీ రగ్గు కప్పుకుని కిటికీ లోంచి చూస్తున్న నాకు హార్మోనియం వాయిస్తున్న బాబూరావు మేష్టారే గుర్తుకొస్తున్నారు. చాలాసేపు ఆయన్నే తల్చుకున్నాను. సందకాడ నా నెత్తి చుట్టూ తిరిగిన దోమల్లా ఏవేవో ఆలోచనలు ముసురుకుంటున్నాయి నాలో.

చివరి కనుకున్నాను. ఎప్పటికైనా ఆ మేష్టరంత బాగా హార్మోనియం వాయించగలగాలి అని. వర్షం, గాలీ మర్నాటి పొద్దుటికి బాగా పెరిగాయి.

సాయంత్రం ఆ వర్షంలోనే బుట్ట మార్కు గొడుగేసుకుని మేష్టారింటికి వెళ్ళేసరికి మా ఊళ్ళో కుర్రాళ్ళు సత్యానందం, చిన్నం బాబులూ కూర్చుని వున్నారు అరుగుమీద. వాళ్ళొచ్చింది మేష్టారు సంగీతం వినడానికి కాదు. ఆ పనిమీద వచ్చినట్టు నటిస్తూ రత్నమాలని చూడ్డానికి. అది తెల్సిన నేను వాళ్ళకి కాస్త దూరంగా కూర్చుని ఆయన వాయిస్తున్న పద్ధతినే చూస్తుండిపోయాను.

మాకేసి తలతిప్పి కూడా చూడ్డం లేదు బాబూరావు మేష్టారు.

రకరకాల పాత సినిమా పాటలూ, ఒక కీర్తనా వాయించాకా బీడీ వెలిగించుకుని ఆలోచిస్తూ వుండి పోయాడు.

*

ప్రొద్దుటే మా వూరి పుంత రేవు గట్టుమీద నడిచి వెళ్తున్న మేష్టారి చేతిలో చెంబు జారి కింద పడిపోయింది. వెనకే వస్తున్న నేను ఆ చెంబు తీసుకుని రేవులోకెళ్ళి ముందుకొచ్చి ఇచ్చాను.

"ఎవరబ్బాయివి?" అడిగాడు మేష్టారు.

చెప్పాను.

"రోజూ మీ అరుగు మీదకొచ్చి హార్మనీ వింటన్నానండి."

"ఆహాఁ" తర్వాతింకేం మాటాడలేదు.

ఇంటికొచ్చాక మా అత్తయ్య చిన్నప్పుడు సాధన చేసిన హార్మోనియం పెట్టి దుమ్ము దులిపి బెల్లోస్ ఊపుతూ మెట్లు నొక్కడం మొదలెట్టాను.

కుయ్యాఁముయ్యాఁమని వచ్చిన శబ్దాలకి పరుగెట్టుకుంటూ వచ్చిన మా అత్తయ్య నా వీపు మీద నాలుగేసింది.

"సరదాగా వాయించుదామనీ" అన్నాను.

"ఆఁ... ఇదొకటి మిగిలిపోయింది ఎదవ మొకానికి" అని తిట్టేసి వెళ్ళిపోయింది.

ఆమె వెళ్ళిపోయాక గది తలుపులన్నీ వేసేసి మళ్ళీ వాయించడం మొదలెట్టాను. అంతా రొద లాగుంది. మనసుకేం పట్టడం లేదు. విసుగొస్తుందో పక్కనించి.

మళ్ళీ సాయంత్రం మేష్టారింటి వేపెళ్తుంటే ఆయన వాయిస్తున్న తీరుని చూసి ఎక్కడ లేని ఉత్సాహం పుట్టేసింది. ఈ మేష్టార్ని మంచి చేసుకుని హార్మోనియం వాయించడం నేర్చుకోవాలి. ఎప్పటికైనా ఆయనంత బాగా వాయించగలగాలి అని బలంగా అనేసుకుని సందు దొరికితే చాలు ఆయన్నే అంటి పెట్టుకుని తిరిగేవాడ్ని.

ప్రతి శుక్రవారం మా ఊరి సంత కూరగాయల సంచి మోస్తూ మేష్టారి కూడా వెళ్ళేవాడ్ని. అరుగు మీద టైలరు సుందర్రావు దగ్గర వాళ్ళమ్మాయి పరికిణీలున్నాయంటే తెచ్చిపెట్టేవాడ్ని. వాళ్ళింట్లో పాలు ఇరిగిపోతే మా ఇంట్లోవి పట్టుకెళ్ళి ఇచ్చేవాడ్ని.

బాగా పొద్దుపోయాక "ఇక నువ్వు వెళ్ళిపో" అనేవాడాయన.

"పర్లేదు ఉంటానండి."

"నీ ఇష్టం" అని లోపలికెళ్ళి ఒక సీసా తెచ్చుకుని నీళ్ళు వున్న మరచెంబులో వంచుకుని తాగడం మొదలెట్టాడు. తాగే అలవాటున్న బాబూరావు మేష్టారి కోసం అప్పుడప్పుడూ నేనే సారా కొట్టుకెళ్ళి తెచ్చిపెట్టేవాడ్ని.

ఆయన ఇంట్లో లేనప్పుడు హార్మోనియం పెట్టి తీసి మెట్లు నొక్కుతుంటే కుయ్ కుయ్ఁమనే మోత తప్ప ఆయన వాయించినంత అందంగా పలికేది కాదు.

ఏమిటీ మహాత్యం... ఎప్పటికన్నా మేష్టారుగారంత బాగా వాయించాలి నేను అని ఒట్టేసుకుని ఇంట్లో తెగ ప్రాక్టీసు చెయ్యడం మొదలెట్టాను.

నా సాధనకి చాలా గొడవలయ్యేవి. పక్కింటాళ్ళు నిద్ర లేచిపోయి పిల్లాడు ఏడుస్తున్నాడనీ, రాత్రి మా ఆవు పలుపుతాడు తెంపుకుని పొలంగట్ల వేపు పారిపోయిందనీ తిట్టేవారు.

హార్మోనియం పెట్టి మా ఊరికర్రల వంతెన కిందికి పట్టుకెళ్ళిపోయి అక్కడ మొదలెట్టీవాడ్ని వాయించడం. అలా ఎన్నాళ్ళు వాయించినా బాబూరావు మేష్టారంత బాగా వాయించలేకపోతున్నాను. అదే మాట చెప్పాను మాష్టారుతో.

"రోజూ సాధన చేయాలి," అన్నాడు మేష్టారు.

"నేనూ వాయిస్తున్నానండీ" అన్నాను.

"అనుభూతికి లోనయ్యి సాధన చెయ్యాలి" అనేసి ఊరుకున్నాడు తప్ప ఆ అనుభూతి అన్నదానికి ఎలా లోనవ్వాలో చెప్పలేదు.

*

శ్రావణ శుక్రవారం.

ఆ రోజు తెల్లవారుఝామున రేవులో బయలుదేరిన రత్నమాల మెట్లు దిగి స్నానం చేస్తుంటే నీళ్ళలో మునిగిన సత్యానందం, నాగబాబూ ఆమె కాళ్ళు పట్టుకుని లోపలికి లాగేశారు. అది చూసిన నేను వాళ్ళతో చాలా పెద్ద గొడవే పడ్డాను.

ఒడ్డుకొచ్చాక బలమైన వాళ్ళిద్దరూ నా మీద కలబడేసరికి భయపడిపోయిన నేను ఏం చెయ్యాలో తెలీక పక్కనే వున్న ఎర్ర కంకర్రాయి తీసుకుని సత్యానందం ముక్కుమీద కొట్టాను. పచ్చడైపోయింది. అది చూసి దూసుకుంటూ నా మీదకి వచ్చిన నాగబాబు తల మీద ఒకటేశాను. పెచ్చూడిపోయింది.

ఇద్దర్నీ హాస్పిటల్‌కి తీసుకెళ్ళారు.

"ఆ నాగబాబు బతుకుతాడో, లేదో అనుమానమే" అన్నారు ఊరివాళ్ళు. ఇదంతా విన్న నేను మా ఊర్నుంచి పారిపోయి మద్రాసెళ్ళిపోయాను.

*

అక్కడ నానా కష్టాలు పడ్తున్న నన్ను చూసిన మైకేల్ అనే తబలిస్ట్ వింజమూరి పాత్రుడు అనే కొత్త మ్యూజిక్ డైరెక్టర్ ఇంటికి తీసుకెళ్ళి "ఈ కుర్రాడి ప్లేయింగ్ ఒకసారి చూడండి బానే వాయిస్తున్నాడు" అన్నాడు.

పాత్రుడికి సంగీతం రాదు. కనీసం హార్మోనియం పెట్టి మీద సా పా సా పట్టడం కూడా రాదు. కానీ ఏదన్నా రాగం కాస్సేపు వాయిస్తే ఆ రాగంలో ట్యూను కట్టెయ్యగలడు. ఆ విధంగా అతను మ్యూజిక్ చేసిన చిన్న సినిమా అయిదారు వారాలు ఆడిందీ మధ్య. దాంతో రెండు మూడు సినిమాలు చేసే అవకాశం వచ్చింది.

పాత్రుడు సక్సెస్ చూసిన అతని సీనియర్ హార్మోనిస్టు "ఇతనికేం రాదు... ఆ విషయం అందరికీ తెల్సు. ట్యూన్సు కూడా మేమే చెబుతుంటాం. అది నేర్చుకుని కంపోజింగ్‌కి కూర్చున్నప్పుడు తన సొంతంలా పాడ్తుంటాడు" అని ప్రచారం చేసేసరికి కోపమొచ్చిన పాత్రుడు అతన్ని పన్లోంచి తీసేసి "ఏమీ రానివాడ్ని పెట్టుకుని మ్యూజిక్ చేస్తాను చూడు" అని ఛాలెంజ్ చేశాడు.

ఆ కారణంగా నేను అతని దగ్గర కెళ్ళాను. పెట్టి తీసుకొచ్చి వాయించమన్నాడు.

ఓ అరగంట వాయించాను.

"నువ్వు ప్రాక్టీసు చెయ్యాల్సింది చాలా వుందిగానీ రేపట్నుంచి రా. కొత్త ట్యూన్లు కంపోజ్ చేద్దాం" అన్నాడు.

మర్నాటినించీ అతని దగ్గరకెళ్ళిన నేను అతను పాడే ట్యూన్స్‌కి ముందు శృతి పట్టుకుని తర్వాత వాయించే ప్రయత్నం చేసేవాడ్ని. అలా చేస్తున్నప్పుడు చాలా తప్పులు దొర్లేవి. నీకంటే రైళ్ళలో అడుక్కునేవాళ్ళు బెటరని తిట్టేవాడు పాత్రుడు.

అతన్తో ఎలాంటి మాటా పడగూడదని రాత్రుళ్ళు ప్రాక్టీసు చేసేవాడ్ని కానీ, అది మనసు పెట్టి చేస్తున్న ప్రాక్టీసు కాదు. ఏదో హడావుడిగా చేసేసేవాడ్ని. పోనుపోను చాలామంది మ్యూజిక్ డైరెక్టర్ల దగ్గర మ్యూజిక్ కంపోజింగ్స్‌కి వెళ్ళడం వల్ల కాస్త నలిగాను.

పెట్టి హార్మోనియంతో బతకడం కష్టమని సింతసైజర్ వేపు మళ్ళాను.

ఆ తర్వాత సీక్వెన్సర్‌లో మ్యూజిక్ ఫీడ్ చెయ్యడం తెల్సుకున్నాను. పెద్దగా శ్రమ పడక్కర్లేకుండా ఒక బార్ మ్యూజిక్ కంపోజ్ చేసి సీక్వెన్సర్‌కి ఫీడ్ చేస్తే అది ఎన్ని బార్స్‌గా అయినా పెంచుకోగలదు. కీబోర్డ్స్‌లో రకరకాల టోన్స్... ఫ్లాపీలు మారుస్తూ పోతుంటే లెక్కలేనన్ని... రిథమ్ బాక్స్‌లో రకరకాల రిథమ్ పేట్రన్స్ విని కంపోజ్ చేస్తాను.

నా దగ్గరున్న శాంప్లర్‌లో ఒక శృతిలో వాయించిన నోట్సుని రకరకాల శృతుల్లోకి మార్చుకోవచ్చు. ఆడ గొంతుని మగగొంతుగా, మగగొంతుని ఆడగొంతు చెయ్యొచ్చు. ఒక మనిషితో పాడించి వందమంది పాడినట్టుగా కన్వర్ట్ చెయ్యొచ్చు. ఈ మధ్య సి.డి. రేమ్, సి.డి. రోమ్, హార్డ్ డిస్క్ కూడా వచ్చాయి నా దగ్గరకి.

రీ- రికార్డింగప్పుడు మ్యూజిక్ డైరెక్టరు నా దగ్గరకొచ్చి తెర మీద కనిపించే ఫలానా సందర్భానికి చిన్న పీస్ కంపోజ్ చెయ్యమంటే ఏ మాత్రం తడుముకోకుండా అయిదు నిమిషాల్లో అతనడిగింది కంపోజ్ చేసి హెడ్ ఫోన్స్‌లో వినిపించేస్తాను.

అలా చేసేటప్పుడు ఎక్కువగా పాల్ మారియట్, జాన్ విలియమ్స్, జెర్రీ గోల్డ్‌స్మిత్, ఇన్నియో మోరికానీ, హ్యూగో మాంటిగ్రోల కాంపోజిషన్స్‌ని ఆశ్రయిస్తాను. ఏదన్నా మోడ్రన్ పీస్ అంటే సి.డి.లో డాక్టర్ ఆల్బన్ మ్యూజిక్ వినేసి వెంటనే ఫీడింగ్ మొదలెడతాను.

ఇప్పుడు నాకు మ్యూజిషియన్‌గా గుర్తింపుంది ఇండస్ట్రీలో.

ఒకోసారి మ్యూజిక్ ఫీడ్ చేస్తున్నప్పుడు బాబూరావు మేష్టారు గుర్తొస్తుంటారు నాకు. ఆయనకి సంగీతం గురించి అంతగా తెలీదు. ఏవో రెండు కీర్తనలూ, అరడజను సినిమా పాటలూ తప్ప, ఏదన్నా స్కేల్ చూపించి వాయించమంటే చేతులెత్తేస్తాడు.

ఈ హైటెక్ మ్యూజిక్ గురించి, కంప్యూటర్స్ గురించి స్థాలీపులాక న్యాయంగా కూడా తెలీదు. కానీ ఒకప్పుడు నేనూ... ఎప్పటికన్నా ఆయనంత బాగా వాయించగలనా అనుకునేవాడ్ని!!!

*

నన్ను పెంచుకున్న మా అత్తయ్య చావుబతుకుల్లో వుందని టెలిగ్రామ్ వస్తే మా ఊరు బయలుదేరాను.

నేను వెళ్ళేసరికి బెల్లంతో చేసిన పూతరేకులూ, మామిడి తాండ్రా తింటూ బానే వుంది మా అత్తయ్య. నన్ను చూడాలనిపించి టెలిగ్రామ్ నాటకం ఆడించిందట. ఇప్పుడు సంతపేటలో వుండే ఇంట్లో వుండటం లేదట బాబూరావు మేష్టారు. ఊరి చివరున్న యర్రా సుబ్బారాయుడిగారి మామిడితోటలో వుంటున్నారు.

ఆ రోజు పౌర్ణమి. ఆగాగి వీస్తోంది గాలి.

తోటలో సగం పడిపోయి వుంది ఆ పెంకుటిల్లు. అడిగితే నేరేడు చెట్టు దగ్గర వున్నారని చెప్పారు ఇంట్లో వాళ్ళు.

ఆకు సంపెంగ చెట్టు దగ్గర నిలబడి వున్న మేష్టారు అక్కడ్నించి కదిలి నందివర్ధనం చెట్టు పూచిన నాలుగు పువ్వుల్నీ తాకి గోరింటాకు చెట్టు దగ్గర కెళ్ళారు. అలా తోటంతా కల తిరిగి చివరికి ఇంటివేపొచ్చి బీడీ వెలిగించి మళ్ళీ చంద్రుడ్ని చూస్తూ వుండిపోయారు. ఆ చూడ్డంలో ఇంకో అరగంట గడిచింది.



ఎప్పటికో హార్మోనియం వాయించడం మొదలెట్టి ముందు సాకీలా కాసేపు లాగి తర్వాత పాడ్డం మొదలెట్టారు. అది పదేళ్ళక్రితం వాయించిన పాటే- *నీకోసం నీకోసం నా గానం నా ప్రాణం నీకోసం...*

సొంతం విన్న నా కనిపించింది నా అంచనా కరెక్ట్. చాలా పూర్‌గా వుందాయన ప్లేయింగ్ అనుకున్నాక ఇంటి కెళ్దామని వెనక్కి తిరిగినవాడ్నల్లా ఎలాగూ వచ్చాను గదా ఓసారి పలకరిద్దాం అని మేష్టారి దగ్గరకెళ్ళి నా గురించి గుర్తుచేశాను.

గుర్తు చేసుకున్నట్టు ఎటో చూస్తూ వుండిపోయిన ఆయన "ఆఁ నువ్వా! ఇప్పుడెక్కడుంటున్నావ్?" అనడిగారు.

చెప్పాను.

"సంతోషం" అని మళ్ళీ వాయించే పన్లో పడిపోతుంటే "కొత్తవి ఏమీ వాయించడం లేదాండీ?" అన్నాను.

నా ప్రశ్నకి ఓ నిమిషం ఆగి "ఆమధ్య తంజావూరు క్రిష్ణయ్యార్ అనే ఒక విద్వాంసుడొచ్చాడు ఇటుపక్కకి. నా దగ్గరకొచ్చి కాస్సేపు వాయించండి అన్నాడు."

"ఆయన చాలా గొప్ప విద్వాంసుడు... వాయించారా మేష్టారూ?"

"ఆఁ... నేను వాయించిందంతా విని నన్నేదో పొగిడి వెళ్ళిపోయారు... కొన్నాళ్ళకి నన్నెక్కడికో రమ్మని రాశారు... నే వెళ్ళలేదు" అని లోపల్నుంచి ఒక లెటర్ పట్టుకొచ్చి నా ముందు పడేసి తిరిగి వాయించుకునే పనిలో పడిపోయారు.

లాంతరు వెలుగులో చదివాను.

మేష్టారిలో విద్వత్తు గురించి ఘనంగా పొగుడుతూ రాసిన ఉత్తరం అది. చివరి వాక్యం ఇలా రాసుంది.

"నేను వాయించమంటే మీ బాదం చెట్టు కింద ఏదో అంటూ వాయించారు. మీకు తెలిసే వుంటుంది ఒక కొత్త రాగం వాయించారు. మీరు కనిపెట్టిన ఆ రాగానికి సముద్రదీపిక అని పేరు పెడితే బాగుంటుందని నా ఆలోచన."

*స్వాతి సపరివారపత్రిక*
*1 జులై 1998*



# అదో విబక!

న్యూ ఆర్లియన్స్ ఎయిర్‌పోర్టులో అమర్ దిగేసరికి ఉదయం ఎనిమిది గంటలు దాటింది. నవంబర్ చలి ప్లెజంట్‌గానే వుంది. లాంజ్‌లో కొచ్చిన తనకి బ్రౌన్ కలర్ సూటూ నీలం కళ్ళతో ఉన్న ఒక ఎగ్జిక్యూటివ్ చాలా యాక్టివ్‌గా దగ్గరకొచ్చి పరిచయం చేసుకున్నాడు. పేరు డోలియో డెన్నిస్ అట. ఇక్కడ అమర్ జాయిన్ కాబోయే సీక్ టెక్నాలజీస్ తాలూకు మనిషంట. కన్వేయర్ బెల్ట్ మీంచి వస్తున్న తన లగేజ్ తీసుకుని డిక్కీలో పెడ్తున్నాడు.

కార్లో కూర్చున్నాకా రిలాక్స్డ్‌గా వెనక్కి వాలి గట్టిగా కళ్ళు మూసుకున్న అమర్ 'నేను ప్రేమించిన ఆ షాలూని నా ప్రాణంలో ప్రాణమైన ఆ షాలూని మర్చిపోవడానికి ఇంత దూరం రావల్సి వచ్చిందా' అనుకున్నాడు.

కారు కదిలింది.

చాలా కలుపుగోలు మనిషి జోలియో డెన్నిస్.

"మా న్యూ ఆర్లియన్స్ సిటీకి రావడం ఇదే మొదటిసారా?" అడిగాడు కారు నడుపుతూనే.

"అమెరికాకి రావడమే మొదటిసారి" చెప్పేడు అమర్.



"ఇప్పుడు మీరు దిగిన ఎయిర్‌పోర్ట్ పేరేంటో తెల్సా?" అడిగేడు డెన్నిస్.

"ఏమిటీ?"

"లూయిస్ ఏమ్‌స్ట్రాంగ్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్... అసలు లూయిస్ ఏమ్‌స్ట్రాంగంటే ఎవరో తెల్సా?"

"ఎవరు?"

"జాజ్ మ్యూజిక్ ఈ నగరంలోనే పుట్టింది. అందుకే ఈ నగరంలో చాలా రెస్టారెంట్స్‌లో ఆ మ్యూజిక్ ప్లే చేస్తుంటారు. అయితే జాజ్‌ని ప్రపంచమంతా ప్రచారం చేసిన వాళ్ళలో ముఖ్యుడు లూయిస్ ఏమ్‌స్ట్రాంగ్" అంటూ నాన్‌స్టాప్‌గా మాటాడ్తూ పోతున్న డెన్నిస్ కాస్సేపట్లోనే క్లోజయిపోయేడు అమర్‌కి.

ఉండటానికి కంపెనీ తనకి ఏర్పాటు చేసిన అపార్ట్‌మెంట్ కొచ్చేక సామాన్లన్నీ లోపలపెట్టి "రిలాక్స్ అవ్వండి... లంచ్ టైమ్‌లో వస్తాను" అనెళ్ళిపోయేడు డెన్నిస్.

బెడ్‌మీద వెల్లకిలా పడుకుని హమ్మయ్యా షాలూని మర్చిపోయేను అనుకుని కాస్సేపు విశ్రాంతి తీసుకున్నాక లేచి బాత్‌రూమ్‌లోకెళ్ళి టబ్‌నిండా ఆ చలిలో పొగలుకక్కే హాట్‌వాటర్ నింపుకుని దాంట్లో చాలాసేపు జలకాలాడానికి తన ఒంటిమీద షర్ట్ తీసిన అమర్ నగ్నంగా ఉన్న తన షోల్డర్ భాగం మీద రాసున్న పేరు చూసుకుని స్టన్ అయిపోయేడు. షాలూ అని పొడిపించుకున్న పుట్టుమచ్చ, స్నానమయ్యేక తుడుచుకునే తెల్లటి టవల్ మూల షాలూ అనే ఎంబ్రాయిడరీ కుట్టు, ఒళ్ళు తుడుచుకుని గదిలోకొచ్చి షర్ట్ తీసేడు దాని జేబుమీద ఎంబ్రాయిడరీ చేసిన షాలూ పేరు. డ్రెస్ చేసుకున్నాకా షేవింగ్ కిట్‌లో ఉన్న పర్‌ఫ్యూమ్ బాటిల్ తీసుకుని స్ప్రే చేసుకున్నాడు. అది షాలూ వాడే జోవన్ స్పోర్ట్ ఫర్ వుమెన్. షాలూ... షాలూ... ఏం చెయ్యాలో తోచక ఆ గదిలో ఒక మూల చతికిలబడి పోయాడు. మర్చిపోవాలి... మర్చిపోవాలి... మర్చిపోయేను అనుకుంటున్నాడు.

షార్ప్‌గా ఒంటి గంటకి తన అపార్ట్‌మెంట్లో ప్రత్యక్షమైన డోలియో డెన్నిస్‌తోపాటు బయల్దేరాడు అమర్.

న్యూ ఆర్లియన్స్ నగరంలో వున్న ఆ పాకిస్తానీ రెస్టారెంట్‌లో ఒక టేబుల్ దగ్గర కూర్చుని నాన్ వెజిటేరియన్ ఐటమ్స్ ఆర్డర్ చేసిన డెన్నిస్ తన జేబు మీద ఆరెంజ్ కలర్ ఇంగ్లీషు అక్షరాలు చదివి "షాలూ... ఎవరు షాలూ?" అన్నాడు..

"ద గాడెస్. ఐయ్ ఫర్ గాట్" అన్నాడు అమర్.

క్యూరియాసిటీ పెరిగిన డెన్నిస్ ఇంకా ఏదో అడగబోయేలోపే ఆర్డర్ చేసిన ఐటమ్స్ వచ్చాయి.

తిన్నాకా ఆఫీస్ కెళ్ళారు.

రెండొందల మంది స్టాఫ్ వున్న ఆ ఆఫీస్‌లో అమెరికన్ అమ్మాయిలూ అబ్బాయిలూ లేచి తన జేబు మీద పేరు చదివి తన పేరు షాలూ అనుకుని "హలో షాలూ... వెల్‌కమ్ టూ న్యూ ఆర్లియన్స్" అన్నారు ఏకకంఠంతో. మతిపోయింది అమర్‌కి. ఆ అమెరికన్స్ మధ్యలో ఉన్న తన ముందుకి దూకి వచ్చిన షాలూ పళ్ళెం మీద నిలబడి భరత నాట్యం చేస్తుంటే ఏ కదలికా లేకుండా వుండిపోయేడు.

## 2

ఏ మనిషినైతే మర్చిపోదామని ఇన్నివేల మైళ్ళ దూరమొచ్చాడో ఆ మనిషిని మర్చిపోలేని పరిస్థితు

లేర్పడుతున్నాయి ఆ రాత్రి. అదే భరతనాట్యం దుస్తుల్లో తను పడుకున్న మంచం చుట్టూ కల తిరుగుతున్న షాలూ, తను పడుకోలేదు అమర్‌ని పడుకోనియ్యలేదు.

ఆరోజు ఆదివారం.

మిసిసిపీ నది న్యూ ఆర్లియన్స్ దగ్గరే సముద్రంలో కలుస్తుంది. ఆ సాయంత్రం నదిలోంచి రకరకాల మిలట్రీ బోట్లూ ప్రయివేటు బోట్లూ కాస్త దూరంగా షిప్పులూ వెళ్తున్నాయి. నది ఒడ్డున రివర్‌వాల్ అనే మాల్ ఉంది. మాల్ పక్కన నడుస్తున్న తను ఆలివ్ గార్డెన్ అనే ఇటాలియన్ రెస్టారెంట్‌లో కెళ్ళాడు. అక్కడంతా లైట్ కలర్ ఫర్నీచర్. ఒక మనిషి జాజ్ డ్రమ్స్ ఒక టెంపోలో వాయిస్తుంటే ఇంకో మనిషి చెల్లో మీదా మరొకడు సేక్సాఫోన్ మీదా ఇట్స్ బ్యూటిఫుల్ వరల్డ్ అనే సాంగ్ ప్లే చేస్తున్నారు. ఇంకాస్త ముందు కెళితే ఒక మెజిషియన్ కూర్చుని తింటున్న కస్టమర్స్‌కి తన మేజిక్కులు చేసి చూపిస్తున్నాడు. ఒక టేబుల్ మీద కూర్చున్న అమర్ ఎదురుగా కూర్చున్న ఒక అమ్మాయి ఆర్డర్ కోసం వచ్చిన మనిషికి ఆ వూళ్ళో మాత్రమే దొరికే క్రా ఫిష్ అనే చేపతో చేసిన పాస్తాస్ అనే ఫుడ్ ఐటమ్ ఆర్డర్ చేస్తుంది.

తలెత్తి ఆమెకేసి చూసేడు అమర్.

ఇటాలియన్ ఆమె. ఇటలీ కేప్టెల్... మిలాన్ నగరమంట వాళ్ళది. స్కిన్ టోనూ ఇన్‌స్టోట్ బ్లీచ్ చేసిన హెయిర్ స్టైల్‌లో తేడా తప్ప షాలూ పోలికలు చాలా కనిపిస్తున్నాయి ఆమెలో.

ఆ రాత్రంతా షాలూ గుర్తుకొచ్చింది. ఆలోచించి అర్ధరాత్రయ్యేక ఒక నిర్ణయానికొచ్చిన అమర్ హైదరాబాదులో ఉన్న షాలూకి మెయిల్ రాయడం మొదలెట్టాడు... నిన్ను మర్చిపోదామని ఎన్నో సముద్రాలు దాటి ఇక్కడికొచ్చేను. అయినా మర్చిపోలేని పరిస్థితులు ఇక్కడ ఏర్పడుతున్నాయి అని రాసి, షాలూ ఈ మెయిల్ అడ్రస్‌కి సెండ్ చేసేక చాలా రోజులు ఎదురుచూసేడు. ఎలాంటి రిప్లై లేదు షాలూ నించి.

అలాంటి అనుభావాలు ఎన్నో చూసిన అమర్ ఏ విధంగానూ రియాక్ట్ కాలేదు.

## 3

డియర్ షాలూ...!

ప్రతి ఏడూ ఫిబ్రవరిలో పదకొండు రోజులపాటు ఫెస్టివల్ చేస్తారిక్కడ. దాని పేరు మాడిగ్రాస్. ఇదే టైపు ఫెస్టివల్ బ్రెజిల్‌లో ఉన్న రియో సిటీలో కూడా జరుగుతుంది. ఇక్కడ ఫ్రెంచి క్వార్టర్ దగ్గర ఒక స్ట్రీటులో జరిగే ఆ ఫెస్టివల్‌లో మెడలో బీట్స్ అని పిల్చే రంగురంగుల పూసలదండలు వేసుకుని తిరుగుతున్న అమ్మాయిల్ని చూస్తున్నానీ పండగరోజుల్లో. ఆ అమ్మాయి నీలానే నడుస్తా వెళ్తుంది. వెనక నించి చూసిన నేను 'షాలూ' అని పలకరించేను. వెనక్కి తిరిగిన ఆమె 'అయామ్ మార్తా మెజరస్ ఫ్రమ్ హంగేరీ' అంది.

ఆమెకి సారీ చెప్పేను, నీకు మెయిల్ రాస్తున్నాను.

లవ్
అమర్



హవాయి ఐలాండ్స్‌లో నువ్వు కనిపించేవనీ న్యూయార్క్‌డౌన్‌టౌన్‌లోఉన్న మన్‌హాట్టన్‌లో పచ్చకళ్ళ బ్లాండ్ అమ్మాయి నీలాగే నవ్వితే డిన్నరిచ్చేననీ, కాలిఫోర్నియాలో ఉన్న గోల్డెన్ బ్రిడ్జి మీద అచ్చం నీలాంటి వాయిస్ గల మనిషిని చూసేననీ ఇలా చాలా మెయిల్సు షాలూకి రాసిన అమర్‌కి ఆమెనించి ఎలాంటి జవాబూ రాకపోయేసరికి ఆరోజు ఒక పెద్ద ఉత్తరం రాసేడు.

'ఇక్కడ నాకు పరిచయమైన మిత్రుడు. నా ప్రాణంలో ప్రాణమైన నీ గురించి నిత్యం అడుగుతున్నాడు. చివరికి మన కథ నాతో చెప్పించుకుని కదిలిపోయి కరిగిపోయి పేరిస్ తీసుకెళ్ళేడీవేళ.

ఈఫిల్ టవర్ ఎక్కాం. దాని చిట్టచివర్లో ఒక రెస్టారెంట్ ఉంది. చాలా కాస్ట్‌లీ రెస్టారెంట్ అది. ప్రియుడు తనతోపాటు తీసుకొచ్చిన అమ్మయి కిష్టమైన ఐటమ్సన్నీ ఆర్డర్ చేసి తిన్నాకా ఆమెతో కాస్సేపు చర్చించేక మోకాళ్ళ మీద ఒంగుని ఆమెకి రింగ్ ఇచ్చి విల్ యూ మేరీమీ?అని తన మనసులో కోరికని బయట పెడతాడు. ఆ రెస్టారెంట్లో ఉన్న జంటల మధ్య అలాంటివే జరుగుతున్నాయి. ఒకమూల పేన్ ఫ్లూట్‌తో ఇన్నియో మొరికానీ అనే ఇటాలియన్ కంపోజర్ ఒన్స్ అపానైటైమ్ ఇన్ అమెరికా అనే సినిమాలో కంపోజ్ చేసిన మ్యూజిక్ పీస్‌ని వాయిస్తున్నాడు. అతనికి కాస్త దూరంగా వేసున్న టేబుల్ మీద ఒంటరిగా నేను కూర్చున్నాను. ఎదురుగా నువ్వు లేవు. నీకు ఎంత రాసినా, నా గురించి ఎంత పాడినా నువ్వు కరగవు. కసాయివి గదా.

సృష్టిలో అందాన్నంతా ముద్దగా చేసి బొమ్మగా మలిచి వెన్నెల్లో ఆహ్లాదం వెన్నలో మృదుత్వం హరివిల్లు ఒంపులూ సెలయేటి సొంపులూ మెరుపుతీగ మోహనాకృతీ ఆ బొమ్మ మీద అద్దిన ఆ ముసలిబ్రహ్మ సరస్వతీదేవి శృంగార రసాస్వాదలో పడిపోయి పొరపాటున నీకు హృదయం పెట్టడం మర్చిపోయేడు... లేకపోతే నేనెంత రాసినా నీలో ఏ స్పందనా లేకపోవడం కఠినశిల లక్షణం కాదూ?' అని రాసి ఆ వుత్తరాన్ని పోస్ట్ చేశాడు.

షాలూ నించి రిప్లై రాకపోయినా మెయిల్స్ రాస్తూనే వున్నాడు. క్రితం రాత్రి తను ఏం రాశాడో మర్నాడు రాత్రి డెన్నిస్‌కి చెపుతుంటే వింటున్న ఆ డోలియో డెన్నీస్ "ఆ అమ్మాయి ఎంత అదృష్టవంతురాలు. మా కంట్రీలో మీలాంటి ప్రేమికుల శాతం తక్కువ మై ఫ్రెండ్" అని బాధపడ్తా "ఆమె ఈ మెయిల్ ఐ.డి. నాకియ్యి నేను కూడా మెయిల్స్ రాస్తాను" అంటే షాలూ ఈ మెయిల్ ఐడి ఇచ్చాడు అమర్.

చాన్నాళ్ళు గడిచాయి.

ఇప్పుడు ఉద్యోగం చేస్తున్న సీక్ టెక్నాలజీస్‌లో రిజైన్ చేసి లాకీడ్‌మార్టిన్ అనే ఫైటర్‌ప్లెయిన్స్ తయారు చేసే కంపెనీలోకి మారేడు అమర్. ఆదాయం పెరిగింది. గంటకి రెండు వందల డాలర్లు.

ఐతే కొత్త ఉద్యోగంలో పని బాగా ఎక్కువ. దాని వల్ల షాలూకి రాయడం తగ్గించినా రెగ్యులర్‌గా తన అపార్ట్‌మెంట్‌కొచ్చి డ్రింక్ చేసి వెళ్ళే ఆ మిత్రుడితో ఆమె మీద తన ఫీలింగ్స్ మట్టుకి చెప్పడం మానలేదు. శనివారం రాత్రి, ఆదివారాలు బయటి ప్రదేశాలకెళ్ళి ఎక్కువ తాగినప్పుడు షాలూ గురించి మరీ ఎక్కువగా చెప్పేవాడు. అప్పుడప్పుడూ ఏడ్చేవాడు కూడా. అంతా విన్న డోలియో డెన్నీస్ "మొన్న సన్ డే చర్చిలో నీ గురించి ప్రేయర్ చేశాను నీకు జీసెస్ హెల్ప్ చేస్తాడు" అని ఓదార్చేవాడు.

రోజులూ నెలలూ గడుస్తున్నాయి. అనుకోకుండా ఒకరోజు షాలూ నించి రిప్లై వచ్చింది. ఫోన్ చేసి పరమానందంగా తనకి 'ఎస్' చెప్పింది.

ఇండియాకొచ్చి షాలూని పెళ్ళి చేసుకుని వెంటనే ఆమెని తీసుకుని అర్జంటుగా అమెరికా వచ్చేశాడు.

## 4

ఆ సాయంత్రం తను రెంట్‌కుండే కెన్నర్ ఏరియాలో సన్‌లేక్ అపార్ట్‌మెంట్స్ కొచ్చిన డెన్నీస్‌కి "దిసీజ్ షాలూ" అని పరిచయం చేస్తుంటే ఆమెకి నమస్కారం పెట్టిన డెన్నీస్ "అవర్ జీసస్ ఈజ్ గ్రేట్... నా ప్రేయర్ ఆలకించేడు... మిమ్మల్ని కలిపేడు" అంటూ అమర్ వేపు తిరిగి "పదిరోజుల పాటు శలవు పెట్టి ఈ నగరంలో ప్లేసెస్ అన్నీ తిరగండి" అనేసి వెళ్ళిపోతుంటే చెయ్యి పట్టుకు అతన్ని ఆపిన అమర్ "నువ్వు చెప్పినట్టే చేస్తాను... అప్పుడు నాతో వచ్చావు గాబట్టి ఇప్పుడూ మాతో రావాలి" అన్నాడు.

అమర్‌ని చాలా ప్రేమించే డెన్నీస్ "అలాగే" అన్నాడు నవ్వుతా.

## 5

తన షాలూనీ డెన్నిస్‌నీ తీసుకుని  న్యూ ఆర్లియన్స్ సిటీలో వున్న అక్వేరియమ్ ఆఫ్‌ది అమేరికాస్, డరబన్ జూ... బొటానికల్ గార్డెన్స్... లూజియానా చిల్డ్రన్స్ మ్యూజియమ్... ఎలిగేటర్ స్వామ్‌టూర్స్... జాస్‌లేండ్ తీమ్ పార్క్... సిటీ పార్క్... పోన్‌చాలా ట్రైన్... ఫ్రెన్చ్ క్వార్టర్, బార్‌బన్ స్ట్రీట్... హరాస్ కేసినో... సైన్ట్ లూయిస్ కేతడ్రల్... మేర్‌డిగ్రస్ వార్డ్ తిరిగి చూశారు. పదోరోజు కేఫిటీ లేక్‌కి బయల్దేరుతుంటే దార్లో కొన్న ఆటోగ్రాఫ్ బుక్ జేబులోంచి తీసిన డోలియో డెన్నీస్ "నీ ఆటోగ్రాఫ్ కావాలి నాకు" అన్నాడు అమర్‌తో.

ఆశ్చర్యపోయిన అమర్ నా ఆటోగ్రాఫెందుకన్నాడు.

"నీలాంటి గొప్ప ప్రేమికుడ్ని నా ఊహ తెలిశాకా ఇదే చూడ్డం దయచేసి ఆటోగ్రాఫ్ ఇవ్వు జీవితాంతం దాచుకుంటాను" అన్నాడు.

నవ్విన అమర్ ఆ బుక్ మీద ఆటోగ్రాఫ్ చేశాడు.

లేక్ దగ్గరకొచ్చారు.

## 6

రంగు రంగుల బోట్లు ముఖ్యంగా నీలం రంగు బోట్లు వాటి మీద రకరకాల దేశాల్నించొచ్చిన టూరిస్టుల్తో కళకళ్ళాడిపోతుంది ఆ కేఫిటీ లేక్.

ఆ వాతావరణం చూసి చాలా ఎగ్జైట్ అయిపోయిన షాలూ "బోట్లో ఫిషింగ్ కెళదాం" అంది.

ఓ పట్టాన నోరు విప్పని ఆమె అలాగ అడిగేసరికి ఆమె పలుకే బంగారంగా ఫీలైన అమర్ వెంటనే అక్కడున్న స్టోర్‌లో ఫిషింగ్ చెయ్యడానికి సంబంధించిన సామాగ్రి పర్చైజ్ చేసేసి బోటు మాటాడి షాలూనీ డెన్నీస్‌నీ ఎక్కమన్నాడు.

యువకుడైన బోట్ ఓనర్ పేరు లీ గ్రేంట్. చాలా హుషారైన కుర్రాడు.  మెజంటా కలర్ నైలాన్‌తాడుని ఫాస్ట్‌గా లాగేసరికి స్టార్టయిన ఆ పాత బోటు లేక్ లోపలికి దూసుకుంటూ వెళ్ళిపోయింది. మధ్యలో ఆపిన ఆ







లీ గ్రేంట్ "ఇక్కడ చాలా మంచి చేపలు దొరుకుతాయి అయితే చాలా లోతెక్కువ" అన్నాడు.

హుషారుగా లేచిన షాలూ గేలం ముల్లుకి చిన్న మీట్ పీస్ తగిలించి నీళ్ళలోకి వదిలింది. గేలానికి తగిలించిన ఆహారాన్ని ఎంతకీ అందుకోడం లేదు చేప. చాలాసేపు చాలా ఓపిగ్గా ఉన్న షాలూ అసహనంగా కదుల్తుంది. నీళ్ళలోకే చూస్తుంది.

చేప రావడం లేదు, గేలం కదలడం లేదు.

చాలా టైమయ్యింది.

షాలూ ముఖం కందిపోతుంది. సహనం కోల్పోతున్న షాలూ ఆగి ఉన్న బోట్‌లో ఆ చివర్నించి ఈ చివరికీ ఈ చివర్నించి ఆ చివరికి నడుస్తుంటే అటూ ఇటూ ఊగిపోవడం మొదలెట్టింది బోటు.

అది చూసి కంగారు పడ్డ ఆ బోటు ఓనరు లీ "ముందే చెప్పానుగా ఇది చాలా లోతైన ప్రదేశం" అన్నాడు.

అతని మాటలేం వినపడ్డం లేదు షాలూకి. తన గేలానికి చేప దొరక్కపోడంతో కోపంతో ఎప్పుడూ లేంది చాలా ఇరిటేట్ అయి పోతుంది.

చూస్తున్న అమర్‌కీ డోలియో డెన్నిస్‌కీ అర్థంగాక కంగారు పడిపోతున్నారు.

"ప్లీజ్.... ప్లీజ్... నువ్విలా తిరుగుతుంటే బోటు తిరగలబడి పోద్ది" అని వార్న్ చేస్తున్నాడు లీ గ్రేంట్.

అలా తిరుగుతుండగా బోటు ఎడ్జి మీదున్న ఐహీల్స్ అంచు దగ్గర స్లిప్పవడంతో ధనాల్మని నీళ్ళలో పడిపోయింది షాలూ.

అది చూసిన అమర్ మతి చలించినట్టుగా అరుస్తూ "నా షాలూని సేవ్ చెయ్యి ప్లీజ్ నా షాలూని సేవ్ చెయ్యి. ప్లీజ్ నా షాలూని సేవ్ చెయ్యి... ప్లీజ్... నాప్రాణంలో ప్రాణమైన షాలూని కాపాడు ప్లీజ్" అనరుస్తున్నాడు. ఏడుస్తున్నాడు. పక్కనే ఉన్న డెన్నిస్ కూడా చాలా కంగారు పడ్తున్నాడు.

వాళ్ళ బాధని చూసి ఆ లోతైన చోట దూకేసిన లీ గ్రేంట్ లోపలికెక్కడికో వెళ్ళిపోయిన షాలూని వెతుకుతున్నాడు.

ఎక్కడా కనపడ్డం లేదా మనిషి.

మరీ లోపలికెళ్ళి పోయి వెతుకుతున్నాడు.

రెక్కలు పడిపోతున్నాయి.

కాళ్ళు చచ్చుపడిపోయేలాగున్నాయి.

ఇక ఊపిరి అందటం లేదు.

నానాయాతనా నరకయాతనా పడ్తున్నాడు.

కానీ, ఆ ప్రేమికుడి అరుపూ ఏడుపూ గుర్తొచ్చి పాపం తన ప్రాణంలో ప్రాణమైన మనిషి కోసం ఆ మగాడి ఏడుపు అనిపించి కల తిరుగుతున్నాడా లేక్ లోపల.

అలాగెక్కడికో వెళ్ళగా వెళ్ళగా.... చివరికి చిట్ట చివరికి కనిపించింది అట్టడుగుకి వెళ్ళిపోయిన షాలూ.

ఆ మనిషిని అందుకుని అష్టకష్టాలూ పడతా పైకి తీసుకొచ్చి బోట్లోకి ఎక్కించి తనూ అలసటగా పడిపోయాడు "ఆమెని పట్టుకుని నా ప్రాణమా నా జీవమా" అని అమర్ ఏడుస్తున్నాడు. అమర్ వేదనని చూస్తున్న డెన్నీస్‌కి కూడా ఏడుపొస్తుంది.

అదంతా చూసిన లీ ఒంచి వదిలిన స్ప్రింగులాగ పైకి లేచి బోటు ఇంజన్ స్టార్ట్ చేసి ఒడ్డుకొచ్చేక షాలూని దించి ముందు ఆమె ఎబ్డామిన్ మీద అరచేతులు పెట్టి గట్టిగా ప్రెషర్ ఇచ్చేసరికి ఆమె నోట్లోంచి ముక్కులోంచీ బుళబుళమంటా వచ్చాయి నీళ్ళు. చాలా నీళ్ళు తాగేసింది. మొత్తం నీళ్ళు కక్కేక ఆమె నోట్లో నోరు పెట్టి ఊది, అరిచేతులూ అరికాళ్ళూ రుద్ది రుద్ది మొత్తానికి బతికించేడా మనిషిని.

చాలా సేపటికి నీరసంగా కళ్ళు తెరిచింది షాలూ.

ఆమెని చూసి ఒంగి నుదుటి మీద ముద్దు పెట్టుకున్నాడు అమర్. ఇంకాస్సేపయ్యేక తన జేబులో చెయ్యి పెట్టి ఐదు డాలర్ల నోటు తీసి లీ గ్రేంట్‌కిస్తూ "థాంక్స్" అన్నాడు.

ఆ నోటునీ అమర్‌నీ చూసిన ఆ లీ గ్రేంట్ అనే ఆ అమెరికన్ కుర్రాడు "నీ ప్రాణంలో ప్రాణమైన నీ వైఫ్ ప్రాణం ఖరీదు ఫైవ్ డాలర్సా... ఆమె విలువ ఐదు డాలర్లేనా?"అని అడుగుతా వెటకారంగా నవ్వుతా "అక్కర్లేదు ఈ నోటు నువ్వే ఉంచుకో" అని అమర్ కిచ్చేసి తన డొక్కుబోటు స్టార్ట్ చేసుకుని లేక్‌లోకి వెళ్ళిపోయేడు.

వెనక్కి తిరిగి చూసిన అమర్‌కి ఒకానొక మార్దవంతో తన దగ్గర ఆటోగ్రాఫ్ తీసుకున్న డోలియో డెన్నిస్ కనపడలేదు.

ఆ తర్వాత ఎప్పటికీ కనపడలేదు.

*స్వాతి సపరివారపత్రిక*









ఆ మేడ తప్ప వేరే ఇళ్ళు లేవు ఆ ఏటిగట్టు మీద. ముప్ఫై ఏళ్ళక్రితమెప్పుడో సగం వరకూ కట్టి వదిలేసిన ఆ పాడైన మేడ కిటికీ మూలల్లోంచి రావి మొక్కలు మొలిచి బయటికొస్తున్నాయి.

గోడలన్నీ నాచుపట్టి పోయాయి. ప్రహారీ పడి పోయింది. ఇంటిముందూ, వెనకా పిచ్చిమొక్కలు మొలిచి ఎత్తుగా ఎదిగిపోయాయి.

కరెంటు లేదు. రాత్రయితే గబ్బిలాలు తిరుగుతూ వుంటాయి. గుడ్డి దీపం వెలుగుతూ వుంటుంది.

ఆదెమ్మగారు ఆ మేడకి యాజమాని,అంత పెద్ద మేడలో ఆమె ఒక్కర్తే వుంటుంది. సన్నగా ఒడిలిపోయి బాగా ఒంగిపోయిన డెభ్బై ఏళ్ళ మనిషామె.

శనగపప్పు, బెల్లంతో చేసిన చిన్నచిన్న వుండలూ, కొబ్బరి బిళ్ళలూ, బఠాణీలూ, మొరమొరాలూ మేడ ముందు చిన్న దుకాణంగా పెట్టుకుని కూర్చుంటుంది ఆదెమ్మ. కాకులు ఎత్తుకు పోకుండా బెత్తంలాంటిది పట్టుకుంటుంది.

కానీ ఇన్నాళ్ళలో ఆ ఏటిగట్టుమీద వాళ్ళెవరూ ఆమె దుకాణంలో కొన్న రుజువులు లేవు. ఆ ఉండలూ, బఠాణీలూ సాయంత్రమైతే గట్టు పక్క చేలల్లో పశువుల్ని మేపే కుర్రాళ్ళ పాలైపోతుంటాయి. లేకపోతే పక్కనున్న గోదావరి కాలవలో పడవలు నడిపే కుర్రాళ్ళొచ్చి ఆ కబురూ ఈ కబురూ చెప్పి ఆమెని ఉబ్బేసేసరికి వాళ్ళ సొంతం కూడా అయిపోతుంటాయి.

కొబ్బరితోట అవతల వుండే నీలాద్రిపేటలో మనిషి నరసమ్మొచ్చింది.

"ఏంటే ఇలా వచ్చావు?" అడిగింది ఆదెమ్మగారు.

"ఊరికే మామ్మగారూ! చాన్నాళ్ళయ్యింది గదా మిమ్మల్నొకసారి చూసి వెళదామని" లౌక్యంగా అంది నరసమ్మ.

పొంగిపోయిన ఆదెమ్మ "మాయమ్మే..అంత దూరంనించి వచ్చావా నన్ను చూడ్డానికి? ఇవిగో తిను" ముందున్న గోనె పట్టా మీద సీసాలోంచి రెండు శనగపప్పు ఉండలు తీసి పెట్టింది.

వాటి నందుకుంటూ "మా మనవరాలి పెళ్ళి మామ్మగారూ" అంది నరసమ్మ.

"ఎవరూ... సూరిగాడి కూతురికా?" అడిగింది ఆదెమ్మ.

"కాదండి... ఆఖరోడు సత్యం కూతురికి" చెప్పింది నరసమ్మ.

"చాలా సంతోషమే అమ్మా... ఎప్పుడటా?"

చెప్పిన నరసమ్మ ఆ మాటా ఈ మాటా చెప్పి "పులిహోర కలపడానికి పళ్ళెం లేదు. మీదోసారిస్తే కార్యం అయ్యాకా తిరిగి తెచ్చేస్తాను" అనడంతో గయ్‌మని లేచింది ఆదెమ్మగారు.

"ఆమధ్య మీ ఆఖరి కూతురు సవర్తాడిందని ఒక డెగిశా పట్టుకెళ్ళావు. అంతకుముందు మీ మరిది దినం అని చెప్పి రెండు రాగిబిందెలూ, ఇత్తడి తపేళా తీసుకెళ్ళావు. అంతకుముందు మీ మరిది దినం అని చెప్పి రెండు రాగి బిందెలూ, ఇత్తడి తపేళా తీసుకెళ్ళావు... తిరిగి తెచ్చావా?"

"అయ్యయ్యో కొత్త ఇల్లు నేసే పనిలో పడి మర్చిపోయాను. అన్నీ ఒకేసారి తెచ్చిస్తాను మామ్మగారు!"

"ముందు అవి పట్రా... వెళ్ళు".

"చుట్టాలు చాలామంది వస్తున్నారు. మామ్మగారూ!"

"వస్తే రాని... ఏయ్! నీ కళ్ళకు నేను వెర్రిబాగుల్దానిలా కనపడ్తున్నానా?"

"మిమ్మల్నలా ఎవరనగలరు మామ్మగారూ?"

"అన్నా పర్లేదుగానీ, నేను తాంబూళం ఇవ్వడం మాత్రం కుదరదు. ఎందుకంటే మా అబ్బాయి వుత్తరం రాశాడు... వచ్చేనెల దిగుతున్నాడట" అంది.

"ఏంటీ! పాండురంగంబాబు దిగిపోతున్నారా. ఆ బాబుని చూసి చాన్నాళ్ళయింది. వెళ్ళి పదేళ్ళవ్వలేదూ!"

"అయ్యింది! దిగిన వెంటనే వాడు మేడ బాగుచేయించే పనిలో పడతాడట."

"చాలా సంతోషం మామ్మగారూ! పెదబాబుగారు కడతా పోయిన ఈ మేడలో మళ్ళీ దీపాలు వెలుగుతున్నాయన్నమాట."

"అవును! వయసైపోవడం వల్ల నేను మర్చిపోయినా వాడికన్నీ గుర్తే. ఆనక వాడు సామాన్ల లెక్క అడిగితే నేనేం సమాధానం చెప్పను."

"ఆయన వచ్చేలోపు నేను తిరిగి వచ్చేస్తాను. మామ్మగారూ! పాండురంగంబాబుతో మీరు మాటపడేలా చేస్తానా చెప్పండి..." బతిమాలింది నరసమ్మ.

ఆ బతిమాలే కార్యక్రమం కాస్సేపు సాగాక కాస్త మెత్తబడ్డ ఆదెమ్మగారు... "ఆ కనిపించే మిద్దె గదిలో సరంబీ మీద వుంటాయి ఇత్తడిసామాన్లు... అందులో వుంటుంది చూసి పట్టుకెళ్ళు" అంది.

లోనికెళ్ళిన నరసమ్మ ఆ తాంబూళంతో పాటు ఆదెమ్మగారి కంటబడకుండా చిన్న కంచుకృష్ణుడి బొమ్మ, వెండి ఉగ్గిన్నె చీరలో దాచేసుకుని బయటికొచ్చి తాంబూళం మాత్రం చూపించింది.

*

తవుడులోంచి ఆయిలు తీసే మిల్లులో ఉద్యోగం చేస్తున్న శర్మకి సాయంత్రమైతే ఆ గట్టుమీద నడవడం అలవాటు. అతను అలా నడుస్తున్నప్పుడే పరిచయమయ్యింది ఆదెమ్మగారు.

శ్రేయోభిలాషులమనీ, బంధువులమనీ, దుబాయ్‌లో వుండే మీ అబ్బాయికి ప్రాణస్నేహితులమనీ వచ్చే జనం ఆ మేడలోంచీ ఏదోటి దోచుకుపోతారే తప్ప నిజమైన మనుషుల్లా ఎవ్వరూ ప్రవర్తించరు. ఏ అవసరం లేకుండా ఆమెని మనసారా పలకరించే మనిషి పొరుగూరి వాడైన శర్మ ఒక్కడే.

"ఊళ్ళోవాళ్ళకి మరీ లోకువ అయిపోయాన్రా అబ్బాయ్. మా పాండురంగం వస్తే వీళ్ళ భరతం పడతాడు. అయినా ఒంటరిగా వుంటే బతుకులు ఇంతేనేమో!" అంది ఆదెమ్మగారు.

"మీ మేడపక్క నాలుగిళ్ళు లేస్తే మీరు ఒంటరి ఎందుకవుతారు?" అన్నాడు శర్మ.

"నాలుగిళ్ళు ఎలా లేస్తాయ్ రా! అదుగో దూరంగా కనిపించే ఆ వంతెన దగ్గర్నుంచి మా మేడదాకా వున్న ఖాళీస్థలాలు ఎవరి వనుకుంటున్నావ్... మావే; కోర్టు గొడవల్లో వున్నాయి. మన తరపున పీసపాటి మూర్తిగారు వాదిస్తున్నారు. అసలు మా మేడ వెనక యాభై ఎకరాలూ ఎవరి వనుకుంటున్నావ్? అదీ మాదే. మావారు వేణు గోపాలస్వామి దేవాలయానికి రాసేశారు."

అంతా విన్న శర్మ "అలాగా" అన్నాడు.

అప్పుడప్పుడూ వచ్చి ఆదెమ్మగారు పెట్టే రుచికరమైన భోజనం చేసేవాడు. చల్లలో మిరపకాయలూ, గుమ్మిడి వడియాలూ, చింతచిగురు పప్పు వండినప్పుడు చాలా ఎక్కువే తినేవాడు.

తినకపోతే ఆమె ఊరుకునేదా!

"సన్నగా తేగబద్దలా వున్నావ్! కాస్త ఒళ్ళు చెయ్యాలంటే తినాల్రా" అని గొడవ చేసేది.

తనేమైనా ఆమె కోసం తీసుకెళితే- "మే మెవరనుకుంటున్నావ్... కాపవరం జమీందార్లం తెలుసా? మా పాండురంగానికి తెలిస్తే చిందులేస్తాడు నా మీద" అని తిరిగిచ్చేసేది.

బాగా చలి తిరిగినప్పుడు "ఇంట్లో బట్టలు వాళ్లు వీళ్ళు పట్టుకెళ్ళి పోయాన్రా. మా వాడికి రాశాను ఎర్ర శాలువా ఒకటి తెమ్మని" అనేది.

"మీ అబ్బాయిలాంటి వాడ్నే కదా మామ్మగారూ! నేను తెచ్చివ్వనా" అంటే గయ్‌మని లేస్తూ- "మే మెవరనుకుంటున్నావ్... కాపవరం జమీందార్లం" అని పెద్దగా కేకలేసేది.

*

మధ్యాహ్నానికే దీపాల వేళయినట్టుందా రోజు.

ఆకాశంనిండా మబ్బులు.

ఆగకుండా వీస్తోంది చలిగాలి.

ఆరోజు సెలవు అవడం వల్ల గట్టు మీదికి బయలుదేరిన శర్మ ఆదెమ్మగారి మేడ దగ్గర కెళ్ళేసరికి ప్లీడరు పీసపాటి మూర్తి కూర్చుని వున్నాడు.

కోర్టులో ఆదెమ్మగారు నెగ్గారట. ఇన్నాళ్ళకి ఈ స్థలాలన్నీ ఆమెకి దక్కాయి.

"మా వాడికి ఉత్తరం రాస్తాను. చలి బాగా తిరిగింది. వచ్చేటప్పుడు ఎర్రశాలువా మర్చిపోవద్దని కూడా గుర్తు చెయ్యాలి" అంది ఆదెమ్మ.

"అలాగేగానీ నేనో విషయం చెబుతాను. దాన్ని గురించి కూడా పాండురంగానికి రాస్తారా?" అన్నాడు పీసపాటి మూర్తి.

"ఏమిటి?" అడిగింది ఆదెమ్మగారు.

"మనకి తెల్సున్న వాళ్ళంతా ఈ ఖాళీస్థలంలో తలో ఇల్లు కట్టుకుంటారు! ఊరికే పాకల్లాంటివే. మనం కావాలన్నప్పుడు ఖాళీ చేసి వెళ్ళిపోతారు. అయితే ఆ షరతు మీద ఎగ్రిమెంట్ రాయండి. నేను వారి ప్లీడర్ని అన్నాను. దానికి సరే అన్నారు. ఈ విషయం పాండురంగానికి మనవి చెయ్యండి."

గయ్‌మని లేచిన ఆదెమ్మగారు "వాడు ఒప్పుకున్నా, నేను ఒప్పుకోను" అంది.

టాపిక్ బాగా మార్చేసి ఆమెను కాస్త శాంతపరిచిన పీసపాటి మూర్తి-

"చూడండి, ఆదెమ్మగారూ... ఇన్నాళ్ళుగా పోరాడి కేసు గెలిపించిన మీ ప్లీడర్ని నన్ను నమ్మండి. అయినా మేం మీకు ఈనాటి వాళ్ళమా, ఎన్ని తరాల్నుంచి మీ వంశానికి సేవలు చెయ్యటం లేదూ?" అని ఇంకా చాలా మాట్లాడి చివరికి ఆమెని ఒప్పించి చాలా కాగితాల మీద ఆమెతో చాలా సంతకాలు చేయించుకు వెళ్ళాడు మూర్తి.

వెళ్లిపోయిన ప్లీడరు గురించి చాలా నమ్మకంగా చెప్పిన ఆదెమ్మగారు-

"ఇవాళ పనసపొట్టు కూర చేశాను నీకోసం" అంది.

సాయంత్రం నాలుగింటికే చీకటి పడిపోయింది.

చలిగాలి మరీ పెరిగేసరికి "ఎర్రశాలువా" అని రెండుసార్లు గొణిగింది ఆదెమ్మగారు.

"నేను తేనా, మామ్మగారూ!"

"చెవుడా... ఎన్నిసార్లు చెప్పాల్రా, అబ్బాయ్ నీకు?" చిన్నగా విసుక్కుంది.

*

ఆదెమ్మగారి మేడలో దొంగలుపడి సామాన్లన్నీ పట్టుకుపోయారట!

అది తెల్సి పరుగెట్టుకెళ్ళాడు శర్మ.

జ్వరంతో ఒక మూల పడుకుని వుందామె.

చాలా కంచు సామాన్లూ, వెండిసామానులూ పట్టుకుపోయారట.

పంచలోహాలతో చేసిన దేవుడి విగ్రహాలూ, రెండు మూడు బంగారు పెళ్ళాలూ, నగలూ కూడా దోచుకుపోయారట!

"మట్టిపిడతలో బంగారు నాణాలు దాచారు పెద్దాయన... అవి కూడా పట్టుకుపోయి వుంటారు" అంటున్న ఆమె చలితో వణకడం మొదలుపెట్టింది.

"పోలీస్‌స్టేషన్‌కెళ్ళి కంప్లయింట్ ఇస్తాను. దానికంటే ముందు డాక్టర్ దగ్గర కెళతాను" అన్నాడు శర్మ.

"డాక్టర్ దగ్గరకు వెళ్ళక్కరలేదు. ఊళ్ళో వీరభద్రా మెడికల్ స్టోర్ తెల్సుగా? మందులు నాకు అంటే ఇస్తారు. నాకు ఉబ్బసం. అది వాళ్ళకి తెల్సు" అంది.

గబగబా పరుగెత్తుకు వెళ్ళాడు ఆదెమ్మగారు చెప్పిన మందులషాపుకి.

"ఎలాగుంది ఇప్పుడావిడకి?" మందులిస్తూ అడిగాడు వీరభద్రా మెడికల్ షాపు స్వామిగారు.

చెప్పిన శర్మ దొంగతనం గురించి కూడా చెప్పాడు.

అంతా విన్న స్వామి "ఈ వయసులో ఎవరికీ రాకూడని కష్టాలు ఆవిడ కొచ్చాయండీ" అన్నాడు.

"వాళ్ళబ్బాయి పాండురంగం వస్తున్నాడుగా... అన్నీ సెటిలావుతాయి లెండి" అన్న శర్మకేసి సూటిగా చూసిన స్వామి "మీరీ ఊరికి కొత్తగా వచ్చారా?" అన్నాడు.

"అవును మూడ్నెల్లయింది."

"అదీ అలా చెప్పండి."

"ఎందుకలా అడిగారు?"

"ఏం లేదు" అని కాస్సేపు నాన్చిన స్వామి, మళ్ళీమళ్ళీ అడిగేసరికి చెప్పక తప్పలేదు.

"వాళ్ళబ్బాయి పాండురంగంగారు దుబాయ్ వెళ్ళినమాట నిజమేకానీ ఆయన చనిపోయాడు."

"ఏమిటీ?"

"అవును! ఆయన పోయి పదేళ్ళయింది" చెప్పాడు స్వామి.

"పదేళ్ళయిందా?"

"ఈ విషయం ఆదెమ్మగారికి తెలుసు. తనకి తప్ప ఇంకెవరికీ తెలియదు అనుకుంటున్న ఆమె వూళ్ళో వాళ్ళు పెట్టే ఇబ్బందుల్ని నెగ్గుకు రావటానికి మావాడొచ్చి తేలుస్తాడు" అని బెదిరిస్తూ వుంటుంది..

"అతను పోయిన సంగతి ఆమె కంటే ముందే వూళ్ళోవాళ్ళకి తెలిసిన సంగతి ఎక్కడో ఏటిగట్టు మీద మేడలో వుంటూ బయటికి రాని ఆమెకి తెలీదు" చెప్పాడు స్వామి.

"ఆమె బయటికి రాదు సరే! లాయర్ పీసపాటి మూర్తిగారు కూడా తెలీనట్టే మాటాడాడు కదా?"

"అదో ట్రిక్కు."

అంతా విన్న శర్మ మనసు బాధతో నిండిపోయింది.

ఎప్పుడో వరదకి మునిగిపోయి ఇప్పటికీ తేలని గ్రామం గుర్తుకు వచ్చింది.

తనకి తెలీకుండానే నీళ్ళొచ్చాయి కళ్ళమ్మట.

నెమ్మదిగా షాపు మెట్లు దిగుతుంటే-

"మీరు పోలీసుస్టేషన్‌కి వెళుతున్నట్టున్నారు... ప్రయోజనం లేదు" అన్నాడు స్వామి.

"అదేంటి?"

"ఈ దొంగతనం ఆమె బంధువులే చేయించి వుంటారు. పోలీసులకి చెప్పి దండగ" అన్నాడు.

"ఏవన్నారు?"

"అవునండీ!"

"ఎందుకావిడమీద వాళ్ళ కంత కష్టం?"

"మాట మావిడల్లం, మనసు పటికబెల్లం అంటారే అలా ఆవిడ నోరు పెట్టుకుని పడిపోయేది అందరిమీదా. దాన్నే పట్టించుకుని, ఆమె మంచితనాన్ని అర్థం చేసుకోలేని బంధువులంతా శత్రువులయ్యారు" అన్నాడు స్వామి.

జీర్ణించుకోవడం శర్మ వల్ల కావడం లేదు.

భారంగా అడుగులేస్తూ గోదావరికేసి వెళ్ళాడు.

గాలి ఆడక ఉక్కగా వుంది.

నది ఒడ్డుకెళ్ళి నిలబడ్డాడు.

ఒక తెల్ల ఆవు ముందుకాళ్ళు రేగడిమట్టిలో కూరుకుపోవడం వలన లేవలేక అవస్థ పడుతోంది.

బూడిద రంగు డేగ ప్రాణంతో వున్న కప్పని నోట కరుచుకుపోతోంది.

రేవులో లంగరేసి వున్న గూటి పడవ మీద వాలి వున్న కొంగ ఇసుకలో నెమ్మదిగా పాక్కుంటూ వెళు తున్న పీత కనపడేసరికి అమాంతంగా లేచి వెళ్ళి ముక్కుతో దాన్ని పొడిచే ప్రయత్నం చేస్తుంది.

బాగా చీకటిపడింది.

తిరిగి వూళ్ళో కొస్తూ బట్టలషాపు కెళ్ళి వాళ్ళ దగ్గరున్న వాటిలో అతి ఖరీదయిన ఎర్రశాలువా కొనుక్కుని తిరిగి ఏటిగట్టు మీదున్న ఆదెమ్మగారి మేడవేపు నడవడం మొదలుపెట్టాడు.

చలి మరీ పెరగడంతో తనెళ్ళేసరికి బాగా ఒణుకుతోంది ఆదెమ్మగారు.

ఆమెకి తను తీసుకొచ్చిన మందులు వేసి, శాలువా కప్పాడు.

మర్నాడు పొద్దుటికి ఆదెమ్మగారు చనిపోయిందని చెప్పారు.

కన్నీరంతా నిన్నే కారి ఇంకిపోవడంతో ఇప్పుడు ఏడుపు రాలేదు శర్మకి.

శవం చుట్టూ మూగిన ఆమె బంధువులందరితోనూ-

"బతికున్నంతకాలం ఎర్రశాలువా అని కలలు గనేది. దయచేసి ఆ శాలువాతోనే ఆమెని మట్టితో కప్పెట్టండి" అన్నాడు.

దానికేం భాగ్యం అనేసి అందుకు ఒప్పుకున్నారంతా.

శ్మశానానికి తనూ వెళ్ళాడు.

ఎర్రశాలువా కప్పుకుని నిద్రపోతున్నట్టున్న ఆదెమ్మగారి శవాన్ని గోతిలో వేసి మట్టితో పూడుస్తుంటే ఎన్నో జన్మల హోరు ఏదో తన చెవులకి వినిపించింది. శవాన్ని మట్టితో పూర్తిగా కప్పెట్టే దాకా అక్కడుండి ఒంటరిగా వెనకొస్తుంటే బంధువుల్లో ఒకతను కాటికాపర్ని పిల్చి-

"రాత్రి నక్కలొచ్చి మట్టి లాగెయ్యకుండా చూడు" అని ఓ ఏభై రూపాయలు ఇచ్చాడు వాడికి.

*

ఇక ఆ ఊళ్ళో వుండటం చాలా కష్టం అనిపించింది శర్మకి.

చేస్తున్న ఉద్యోగానికి రాజీనామా చేసేసి బస్సెక్కాడు.

బస్సు ఊరు వంతెన దిగుతుంటే గట్టుమీద కనిపించిన మేడ కేసి ఆఖరిసారిగా చూశాడు.

ఊరుదాటి మలుపు తిరిగింది బస్సు.

ముందున్న ఆడాళ్ళ సీటులో కూర్చున ఒక స్త్రీ ఎర్రశాలువా కప్పుకుని వుంది. ఆమె కట్టుకున్న చీర, పెట్టుకున్న నగలతో పోలిస్తే అంత ఖరీదైన శాలువా కొనుక్కునే స్తోమతు కాదామెది అనిపించి ఎవర్నో అడిగితే చెప్పారు.

కాటికాపరి భార్యట ఆ మనిషి.

*స్వాతి సపరి వారపత్రిక*
*జూలై, 1998*





# మిస్టేక్





మొన్నటిదాకా కురిసిన భారీ వర్షాలకి అనంతగిరికి ముందు మూడో కిలోమీటరు మైలురాయి అవతల్నుంచి ఒక వంద అడుగుల ఘాట్‌రోడ్ తెగి అగాధంలో పడిపోయింది. దాంతో రోడ్, మొత్తం క్లోజయింది. రిపేర్లు పూర్తవడానికి పదిరోజులు పట్టొచ్చుట.

ఇక,

అరకు రావాల్సిన వాళ్ళు, అరకు నించి వైజాగ్ వెళ్ళాల్సిన వాళ్ళు పాడేరు మీంచి చుట్టు తిరిగి వెళ్ళాల్సి వస్తుంది. ప్రయాణీకులకి అసౌకర్యం కలక్కుండా రైల్వేవాళ్ళు రోజుకి ఒకసారి వచ్చే కిరండోలు పాసింజరు ఆరుసార్లు అరకు వచ్చి తిరిగి వాల్తేరు వెళ్ళేలా షెడ్యూల్స్ చేశారు.

చారులత ప్లాట్‌ఫారం మీది కొచ్చేసరికి వాల్తేరు వేపెళ్ళే కిరండోలు పాసింజరు స్పీడందుకుని వెళ్ళిపోయింది.

దాన్ని అందుకోలేకపోయినందుకు చాలా నీరసపడిపోయిన ఆమె ఎంక్వయిరీలో కనుక్కుంటే, ఇవేళ్టికి ఇదే ఆఖరి బండంట. మళ్ళీ రేపు సూర్యోదయం వరకూ లేదట.

డల్‌గా నడుస్తున్న ఆమెకి ప్లాట్‌ఫారం మీద పరిచయమయ్యాడు జగన్. అతను భద్రాచలం వెళ్ళే బస్సు ఎక్కాలంట. అదింకా రాక కాలక్షేపం కోసం ఈ రైల్వేస్టేషన్లోకి వచ్చేడంట.

పరిచయమైన కాస్సేపటిలోనే కాస్త దగ్గరయ్యాడు.

"నేను ఈ వూళ్ళో ఉన్న సెయింట్ జోసప్ రెసిడెన్షియల్ స్కూల్లో టీచర్ పోస్ట్‌కి ఇంటర్వ్యూ కోసం వచ్చాను. ఈలోగా మా ఇంటి నించి టెలిగ్రామొచ్చింది" అంది చారులత.

"ఏదన్నా చెడు కబురా?" అన్నాడు జగన్.

"కాదండీ ఒక గుడ్‌న్యూస్... మొన్న నన్ను చూసుకున్న ఆ ఎన్నారై సంబంధం సెటిలయ్యింది. పెళ్ళికొడుకు శ్రీరామ్‌కి నేను నచ్చానంట. అఫ్‌కోర్స్ అతను నాకు చాలా బాగా నచ్చాడనుకోండి" అంది చారులత.

"కంగ్రాట్స్" అన్నాడు.

"థాంక్సండీ" అని శ్రీరామ్ ఎంత అందగాడో ఎంత ఐశ్వర్యవంతుడో ఎంత గొప్పవాడో కాస్సేపు మాటాడి "రెండ్రోజుల్లో నా పెళ్ళి... విశాఖపట్నం వెళ్ళడానికి దారిలేదు. టాక్సీ మాటాడుకుని చుట్టు తిరిగి వెళ్దామంటే నా దగ్గరంత డబ్బు లేదు" అంది.

"సారీ అండీ నా దగ్గర కూడా అన్ని డబ్బులు లేవు" అన్నాడు జగన్.

"పర్లేదులేండి... రేపెళ్ళినా పర్లేదు" అంది చారులత.

స్టేషన్‌కి కుడిపక్కనున్న ఆకెళ్ళ ప్రకాశరావుగారనే ఆయన నడుపుతున్న కేంటీన్‌లో టీ తాగి శీతాకాలం ఎండని అనుభవిస్తూ ప్లాట్‌ఫారంకి దూరంగా వున్న సిమెంట్ బెంచీ మీద కూర్చుని మాటాడుకోడం మొదలెట్టారు.

"నాకు పులుపు బాగా ఇష్టం. తినే ప్రతిదాంట్లో నిమ్మకాయ పిండుకుంటాను"అంది చారులత.

"నాక్కూడా... బ్రౌనంటే నాకు ఇష్టం. చైనీస్ చెర్రీ పళ్లంటే ఇష్టం" అన్నాడు జగన్.

"చిత్రంగా ఉందే ఇవన్నీ అంటే నాక్కూడా చాలా ఇష్టం. నాకు మ్యూజిక్ కంపోజర్ హేండిల్ ఇష్టం... గేరీ కూపరన్నా, ఇంగ్రిడ్ బర్గ్‌మెన్ అన్నా జాన్ హూస్టన్ తీసిన 'ఆఫ్రికన్ క్వీన్' సినిమా అన్నా చాలా ఇష్టం" అంది చారులత.

"నాకిప్పుడో డౌటొస్తుంది... ఎవరో నా టేస్ట్‌లూ ఇష్టాలూ సీక్రేట్‌గా తెల్సుకుని మిమ్మల్ని పంపించేరు అవునా?" అన్నాడు జగన్.

"నా గురించి పూర్తిగా తెల్సుకుని ఎవరో మిమ్మల్నే నా దగ్గరకి పంపించేరు" అంది చారులత.

అలా ఒకపక్క మాటాడుకుంటూనే మధ్యమధ్యలో ఆ కాబోయే భర్త శ్రీరామ్‌ని తల్చుకుంటూ అతని అందం గురించీ అతని సంస్కారం గురించీ తల్చుకుంటూ మాటాడ్తూ ఆ అనుభూతినంతా కళ్ళతో తాగుతూ మాటాడ్తుంది చారులత.

"మీకింకా ఏం కాకుండానే మీతో ఇంతగా ప్రేమించబడ్తున్న మీ కాబోయే భర్త చాలా అదృష్టవంతుడు" అంటున్నాడు జగన్.

"శ్రీరామ్ భార్యని కాబోతున్నందుకు నేను అదృష్టవంతురాల్ని. అన్నట్టు నాదో కోరిక తీరుస్తారా" అంది చారులత.

"చెప్పండి" అన్నాడు జగన్.

"మీ భద్రాచలం బస్సు వచ్చినా వెళ్ళడానికి వీల్లేదు. రేపు నన్ను రైలెక్కించేకానే మీరు వెళ్ళాలి" ఆర్డరేసినట్టంది చారులత.

"అలాగే" అంటూ తన బేగ్ రెండు షోల్డర్స్ కీ బిగించాడు.

"అరకు అంటే నాకో గొప్ప పేషన్. అయితే ఆదరాబాదరా ఇంటర్వ్యూ కోసం ఇక్కడికొచ్చి ఏమీ చూడకండానే రైలెక్కి వెళ్ళిపోతున్నాను. రేపు పెళ్ళయ్యాక నా శ్రీరామ్‌తో పాటు ఫ్లై అయ్యి అమెరికా వెళ్ళిపోతాను. ఈ కోరిక కోరికలాగే వుండిపోతుంది. కాబట్టి... నాకీ అరకు రాణి అందాలన్నీ చూపించాలి. నిజంగా నా ఆజ్ఞ ఇది" అంది.

"అలాగే" అని నవ్వాడు జగన్.

చాలాసేపు మాటాడుకుని బయటికొచ్చేసరికి చీకటి పడిపోయింది. లాగికొడ్తుంది చలిగాలి. ఎటుచూసినా కోలాహలంగా వుంది.

ఇటు యండపల్లివలస నించి అరకులోయ దాకా రోడ్డుకి ఎడాపెడా దిగేసిన సర్వీకర్రలకి బిగించిన ట్యూబులైట్లు వెలిగిపోతున్నాయి.

చూస్తున్న చారులత "ఏంటీ జనం?" అంది.

"గంగమ్మతల్లి జాతరంట. ఈ రాత్రంతా ఇక్కడి దుకాణాలూ అవీ తెరిచే వుంటాయంట" అన్నాడు జగన్.

"రండయితే జాతర్లో తిరుగుదాం" అంటా లేచిన ఆమెని ఫాలో అయ్యాడు జగన్.

ఎక్కడ చూసినా దుకాణాలు, వాటి చుట్టూ జనాలు. ముదురురంగు చీరలు రెండు చుట్లు చుట్టుకుని జబ్బల దగ్గర ముళ్ళు వేసుకున్న ఆడాళ్ళు తలలో పెద్ద బంతిపువ్వు పెట్టుకున్నారు. ముక్కులకీ చెవులకీ ఇత్తడి నగలు పెట్టుకుని నుదుట పెద్ద కుంకుమబొట్లు పెట్టుకున్నారు. మగాళ్ళయితే పంచెలు పైకి లాగికట్టి చొక్కాలూ రంగు బనియన్లూ వేసుకున్నారు.

రోడ్డుకి కుడిపక్కనున్న గంగమ్మ తల్లి గుడి దగ్గర ఒకటే సందడి. గుడి చుట్టు మిలుకు మిలుకుమని వెలిగే సీరియల్ బల్బులు దడి కట్టేసారు. ఇంకా ముందుకి నడిస్తే ఆ లోయలో ఉన్న జ్యోతి థియేటర్ ముందు కుప్పలు తిప్పలుగా జనం.

వాళ్ళనే చూస్తూ బాగా దిగువకున్న రోడ్డుమీద నడుస్తుంటే వంతెన తగిలింది. దాని కింద నీటి ప్రవాహం. ఎడంపక్క విశాలమైన లోయ. కుడిపక్క రైల్వే ట్రాక్. దూరంగా కొండలు. వాటి వెనక నించి అప్పుడే పైకొస్తున్నాడు





చం(దుడు. మంచుపడ్డం మొదలైంది. కుడిపక్కన ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ వాళ్ళ ఆర్టిఫిషియల్ ఫారెస్ట్. దాన్ని దాటుకుని ముందుకెళ్తే ఒక సన్నటి బాట. ఆ బాట పట్టుకుని ముందు కెళ్తుంటే ఎడంపక్క ఎత్తులో ఆర్ అండ్ బి గెస్ట్‌హౌసూ, కుడిపక్క ఫారెస్ట్ మొదట్లో వుడెన్ గెస్ట్‌హౌసూ తగిలాయి. ఇంకా ముందుకెళ్తే లెవెల్ క్రాసింగ్ గేటు. డ్యూటీలో ఉన్న గేట్‌మేన్ దగ్గరకెళ్ళిన చారులత "ముందుకెళ్తే ఏ వూరు వస్తుంది?" అంది.

"చొంపి అనే గ్రామం" అంటూ చూపించాడు గేట్‌మేన్.

దూరంగా కొండ దిగువనున్న ఆ చొంపి గ్రామంలో వెలుగుతున్న దీపాన్ని చూస్తూ గేటు దాటి నడుస్తుంటే చంద్రుడు బాగా పైకొచ్చాడు. ఆ వెన్నెల వెలుగులో కురుస్తున్న మంచులో తెల్లతెల్లగా కనిపించాయి సమాధులు. గబగబా అటు నడుస్తున్న ఆమెని ఆపే ప్రయత్నం చేస్తూ "అది స్మశానం లాగుంది" అన్నాడు జగన్.

ఏం మాటాడకండా ముందుకెళ్తుంది చారులత.

"ఇదిగో మిమ్మల్నే" అంటున్నా వినకండా ముందుకెళ్ళి పచ్చటి గడ్డి మధ్యలో దూరం దూరంగా వున్న సమాధుల్లో ఒక సమాధి మధ్య కూర్చుని తన భుజాలకున్న బేగ్ సమాధి మీద పెట్టింది. దగ్గరకొచ్చి ఆమె ముందు నిలబడ్డ జగన్‌ను వచ్చి తన పక్కన కూర్చోమంది.

కూర్చున్నాడు.

"మీరు క్షమిస్తే సిగరెట్ వెలిగించుకుంటాను" అని సిగరెట్ పేకెట్ తీశాడు జగన్.

"అగ్గిపెట్టి ఒకసారి ఇవ్వండి" అని తీసుకుని అగ్గిపుల్ల వెలిగించి సమాధి ముందు చెక్కిన రాతిపలక మీద పేరు చదివింది. "జి. మంగభాను. జననం: **19-07-1975**, మరణం: **20-12-1994**" అని చదివి "అరె ఈ అమ్మాయి బతికుంటే నా వయసు మనిషి.. పాపం చిన్న వయసులో పోయింది" అంది చారులత.

సిగరెట్ పొగ వదిలిన జగన్ "ఊపిరి పీలిస్తే జననం. ఊపిరి వదిలితే మరణం. రెప్పపాటు జీవితం అంటగదా?" అన్నాడు.

"ఏమో అది నాకు తెలీదు. ఇలాంటి టాపిక్స్ మీద మాటాడుకోడం నాకిష్టం లేదు" అంది. ఓ గంట గడిచేక "చొంపి గ్రామంలో కెళ్దామా జాతర్లోకెళ్దామా?" అన్నాడు.

"జాతరలోకే వెళ్దాం" అంది.

వెనక్కి తిరిగారు.

గాలి ఇటు తిరిగినప్పుడల్లా కొండల్లోపలి అడివిలో జంతువుల అరుపులు వినిపిస్తున్నాయి. చెట్ల మధ్యలో ఉన్న కొత్తవలస అనే వూరి గుడి స్పీకర్లోంచి లవకుశలో పాటలు వినిపిస్తున్నాయి. వీళ్ళని దాటుకుంటూ వెళుతున్న ఇద్దరు ఆడాళ్ళు ఒరియా జానపదం పాడ్తున్నారు.

ఫారెస్ట్ గెస్ట్‌హౌసు దాటుతుండగా ఒక ఆడమనిషి అరుపులు, పెడబొబ్బలు వినబడేసరికి ఆ పక్కకి పరుగెట్టారు.

చూస్తే, తిడుతూ కొడుతున్నాడు మొగుడు. పొలికేకలు పెడుతూ అరుస్తుంది భార్య. ఇద్దరూ జీలుగు కల్లు బాగా తాగేసున్నారు. వాడా గెస్ట్‌హౌస్ వాచ్‌మేనట. ప్రతిరోజూ వాళ్ళకిది మామూలేనట.

పెళ్ళాం మీదున్న కోపంతో వాళ్ళు పెంచుకుంటున్న కుందేళ్ళ గూటి తలుపు తెరిచేసరికి లోపలి కుందేలు పిల్లలు చెల్లాచెదురై పోయి ఆ వెన్నెల్లో పారిపోతున్నాయి. చారులతా జగన్ వాటిని పట్టుకోడానికి అవస్థ పడ్తుంటే ఇద్దరి శరీరాలు రాసుకుంటున్నాయి. ఆ అనుభూతి ఇద్దరికీ అర్థమవుతుంది. కాస్సేపు గడిచింది. ఒక్క కుందేలు పిల్ల కూడా దొరకలేదు. మొత్తం అడివిలోకి పారిపోయాయి.

రోడ్డు మీదకొచ్చి జాతర జరుగుతున్న వేపు నడిచారు..

విజయనగరం వాళ్ళ రికార్డింగ్ డాన్సు ఒక పందిట్లోనూ ఫర్లాంగు దూరంలో ఉన్న ఇంకో పందిట్లో వైజాగు నించొచ్చిన వాళ్ళ లైట్ మ్యూజిక్ ప్రోగ్రాం జరుగుతున్నాయి.

జనం మధ్య నిలబడి ఒకో ప్రోగ్రాం చూస్తూ స్టేజి మీద వాళ్ళతో పాటు వీళ్ళిద్దరూ కూడా వూగిపోతా డాన్సులు చేస్తున్నారు. కాస్సేపటికి అలిసిపోయాకా అరకులోయ బస్టాండ్ వేపు నడుస్తుంటే రోడ్డుకి బాగా దిగువలో పాక ముందు చలిమంట వేసుకుంటున్నారిద్దరు.

జగన్ చెయ్యి పట్టుకు లాగిన చారులత "చలిగా ఉంది ఆ మంట దగ్గర కాస్సేపు కూర్చుందాం" అంది అక్కడికెళ్ళారు.

చలి కాచుకుంటున్న ఆ ఇద్దరు గిరిజనులూ ఒరియాలో మాటాడుకుంటున్నారు. వాళ్ళలో ఒకడు భూతవైద్యుడంట. పెద్ద కుంకుమబొట్టు పెట్టుకునున్నాడు. చారులతని చూసి పక్కవాడితో ఏదో మాటాడ్తున్నాడు.

కాస్సేపున్నాకా "ఇక ఎక్కువసేపు ఇక్కడుండడం మంచిది కాదేమో" అని లేచాడు జగన్.

నడుస్తుంటే ఒక మనిషి బాటకి ఒక పక్క గోనె పట్టా పరుచుకుని ఇలాయి బుడ్డి వెలిగించి దాని కాంతిలో ఒకమ్మాయి జబ్బమీద పచ్చబొట్టు పొడుస్తూ కనిపించాడు. సీలేరు నించి వచ్చేడంట వాడు. పరుగెట్టుకుంటా వెళ్ళి వాడి ముందు కూర్చున్న చారులత 'శ్రీరామ్' అని తన చేతిమీద పచ్చబొట్టు పొడిపించుకుంటుంటే ఆమెనే రెప్పార్పకండా చూసిన జగన్ కాబోయే ఆ భర్తని ఎంత ఇదిగా ప్రేమిస్తుందీ చారులత వీళ్ళకి శుభం కలగాలి, అని మనస్ఫూర్తిగా అనుకున్నాడు.

వాడికి డబ్బులిచ్చేకా అక్కడ్నించి లేచి ముందుకి నడుస్తుంటే ఎదురైన ఒకాయన చెప్పాడు. కొంచెం ముందుకెళ్ళి కుడిపక్కకి తిరిగితే కొత్తగా కట్టిన ఆదిమవాసుల మ్యూజియం కనిపిస్తుంది. ఈ అరకులోయ వచ్చినవాళ్ళు దాన్ని చూడకండా వెళ్ళరు అని.

'ఔనా' అనుకుంటా కుడిపక్కకి తిరిగిన వాళ్ళకి అరకు ఆదివాసీ ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్ షాపు కనిపించింది. లోపలికెళ్తే వెచ్చగా వుంది. నారతో చేసిన ఉయ్యాళ్ళూ, సంచులూ, ఉడుం చర్మంతో చేసిన డప్పులూ, డగ్గాలూ వెదురు బాణాలూ పూసలదండలూ వేలాడగట్టి కనిపించాయి. లోపలింకా దారుశిల్పాలూ, తోలు కొరడాలూ కనిపించాయి. కుర్రాడయిన షాపు ఓనరు... "ఈ మ్యూజికల్ హేండ్ స్టిక్ మాత్రం కొనండి" అంటా దాన్ని గాలిలో తిప్పితే పిల్లనగ్రోవిలా స్వరం బయటికొచ్చింది.



వెంటనే దాన్ని కొనేసిన జగన్ ఆ షాపు పక్కనే లోయ అంచునే ఖాళీగా ఉన్న ఆర్టీసి బస్టాండ్ ముందు గాలిలో తిప్పుతుంటే వింత స్వరం బయటికొచ్చింది. ఆ స్వరం విన్న చారులత డాన్స్ చెయ్యడం మొదలెట్టింది.

బస్సులు లేని ఆ చిన్ని బస్టాండ్లో వాళ్ళిద్దరే. జనమెవ్వరూ లేని ఆ స్థలంలో వాళ్ళిద్దరే.

అలా ఇష్టానికి ఊగి ఊగి ఆడి ఆడిన చారులత చివర్లో జగన్ భుజం మీద పడిపోయి "కళ్ళు తిరుగుతున్నాయి కాస్సేపిలాగే వుండండి" అంది.

ఆమె వదిలే వూపిరి తన మెడ మడతల మధ్య తగ్గుల్తుంది. వెంటనే శ్రీరామ్ గుర్తుకొచ్చేడు జగన్‌కి. "మరి మ్యూజియంలో కెళ్దామా?" అన్నాడు.

"సరే" అని సర్దుకు నిలబడింది.

అలా రెండడుగులు వేశారో లేదో ఆ చిన్ని బస్టాండ్ బిల్డింగ్ గోడ వెనక నించి అరుపులూ మూలుగులూ వినిపిస్తున్నాయి.

"ఏంటా" అనుకుంటా ఆ గోడ వెనక్కెళ్ళి చూస్తే,

ఒక ఆడా మగా. ఇద్దరి ఒంటి మీదా సగం సగం బట్టలు కూడా లేవు. ఆడమనిషిని గోడకి ఆన్చి ఆమె మీద అతను అతుక్కుపోతుంటే లోయలో వెండి వెన్నెల మొత్తం వాళ్ళమీదే పడ్తుంది. ఆడమనిషి అతన్తో పోరాడుతూనే ఇష్టంగా ఓడిపోతుంది.

వాళ్ళిద్దర్నీ చూస్తున్న ఈ ఇద్దరికీ చెమటలు పట్టేశాయి.

కాస్సేపలా రెప్పార్పకండా చూస్తున్నారు. లోయలోంచి ఇటుపక్క కెళ్తున్న రాత్రి పక్షి ఒకటి కూస్తూ వాళ్ళ పక్కనించి వెళ్ళిపోతుంది.

జేగురురంగులో ఉన్న మ్యూజియం. లోపల జనం. ఆర్రూపాయలంట టికెట్టు.

లోపల రకరకాల గిరిజనుల బొమ్మలు. కూర్చుని తంబురా వాయించేవాడు, నెమలిపింఛాల కిరీటం తలకి తగిలించుకుని డప్పు వాయించేవాడు, బట్టలు నేస్తున్న స్త్రీ, చాపలు అల్లుతున్న ముసలాడు, వ్యవసాయానికి వెళ్తున్న యువకుడు.

మ్యూజియం చూడ్డం అయ్యేకా మళ్ళీ జాతరలో కొచ్చి నడుస్తుంటే ఒక ఆడమనిషి జగన్ పక్కనే నడుస్తా అతని జబ్బ మీద చెయ్యేసింది.

జగన్ పట్టించుకోలేదుగానీ, చారులత గమనించింది.

మళ్ళీ జగన్ జబ్బమీద రాసిన ఆ మనిషి "ఓ ఫర్లాంగు నడిస్తే ఈ జనం ఉండరు" అంటా కొంటెగా నవ్వింది.

మాటాడ్లేదు జగన్.

"పానిరంగిని సైడెళ్ళి రైలుట్రాక్ దిగితే నరమానవుడుండడు" చెవి దగ్గర గుసగుసలాడింది.

నవ్వేడు జగన్.

కాస్సేపు కూడా నడిచిన ఆమె "నువ్వు అందంగా వున్నావ్ డబ్బులొద్దు రా"అని చెయ్యి పట్టుకు లాగుతుంది.

ఇందాకట్నించి చూస్తున్న చారులత ఇంక తట్టుకోలేక ఆ మనిషి మీద కలబడి జాకెట్టు చింపేసింది. జుట్టు పట్టుకుని పీచుకింద లాగేసింది. మెడ కొరికెయ్యడానికి మీద కొచ్చేస్తుంటే హడిలిపోయిన ఆ మనిషి పారిపోయింది.

షాకై పోయి చూస్తున్న జగన్‌తో "బుద్ధిలేదూ... అదలా పిలుస్తుంటే కూడా వెళ్ళిపోడమేనా?" అంది.

'ఏంటి నా మీద ఈ అధికారం?' అనుకుంటా నవ్వేడు జగన్.

"ఈ నవ్వునే లోకువగా తీసుకుందది" అంటా సొంతమనిషిలా అతని చెయ్యి పట్టుకుని ముందుకు లాక్కెళ్ళిపోయింది.

బాగా ముందుకి నడిచాకా, ఇంకాస్సేపు గడిచేక "సిగరెట్లు కాలుస్తున్నారు గదా... తాగుతారా?" అంది.

"వూఁ" అన్నాడు.

"ఎప్పుడూనా?"

"అప్పుడప్పుడూ... వైను."

"అది ఆడాళ్ళ డ్రింకు కదా?"

"మగాళ్ళు కూడా తాగొచ్చు."

"అయితే మనిద్దరం తాగుదామా?"

కంగారుపడ్డ జగన్ "ఏంటీ?" అన్నాడు.

"ఈ అరకులోయలో ఇలా మనం కల్సుకున్న జ్ఞాపకంగా" అంది.

"అయితే సరే" అని రోడ్డు పక్కనున్న మహేష్ వైన్స్ అన్న షాపుకెళ్ళి గోల్కొండ రెడ్ వైన్ ఫుల్ బాటిలు కొనుక్కొచ్చి ఆమెకిస్తే ఆ వైను బాటిలు చంకలో పెట్టుకుని దర్జాగా నడవడం మొదలెట్టింది.

భుజాలకి బేగ్స్ తగిలించుకుని నడుస్తున్న వాళ్ళిద్దరూ పానిరంగిని దాటి ముందుకెళ్తుంటే కుడిపక్కన పెద్ద పనసచెట్టు, దానికి కాస్త దూరంగా రైల్వేట్రాక్, అది దాటితే అక్కడక్కడా పోడు వ్యవసాయం తాలూకు పొగలొస్తున్న పెద్ద లోయ. అవన్నీ దాటుకుంటా మంచునీ వెన్నెల్నీ సరిసమానంగా అనుభవిస్తా ఒక దిబ్బ మీద చతికిలబడిపోయారు.

రెడ్‌వైన్ సీసా మూత విప్పిన జగన్ చేతిలోంచి ఆ సీసా లాక్కుని రెండు గుక్కలేసి అతనికిచ్చింది. వెర్రితీపి గల ఆ వైన్‌ని అతనూ తాగి ఆమెకిచ్చాడు.


"బాగా చలిగా వుంది" అంది.

తన వీపుకున్న బేగ్‌లోంచి వులెన్ షాల్ తీసి ఆమెకిచ్చాడు.

"నే నొక్కదాన్నీ కప్పేసుకుంటే మరి నీకో?" అంది.

"సగం సగం కప్పుకుందాం" అన్నాడు.





"చాలకపోతే?"

"శరీరాన్ని కప్పుకుందాం."

నాలుకలు మడతలు పడ్తున్నాయి. మాటల్లో తేడాలొస్తున్నాయి.

"ఇది కలా?" అన్నాడు జగన్.

"కాదు" అంది చారులత.

"అయితే అద్భుతం కదా?" అన్నాడు జగన్.

"మామూలు అద్భుతం కాదు మహాద్భుతం" అంది చారులత.

"అసలు నువ్వీ అరకులోయకి ఎందుకొచ్చావ్?" అడిగాడు జగన్.

"నీ వీపు మీద వాలి కలగనడానికి" అంది చారులత.

"ఎలాంటి కల?" అడిగేడు.

"పంచ రంగుల కల... రాజులకాలం నాటి కల" అంది.

"రాజకుమారుడెవరు?" అన్నాడు.

"నువ్వే" అంది.

మత్తుగా ఉన్న అతనికి శ్రీరామ్‌గానీ మరెవరూగానీ గుర్తు రాకపోడంతో "నాగమల్లివో తీగమల్లివో....నీవే రాజకుమారీ" అని పాడ్డం మొదలెట్టాడు.

సీసాలో రెడ్‌వైన్ అయిపోయింది. ఇద్దరికీ కిక్ బాగా పెరిగింది. అలాగ ఆ రాత్రంతా ఆ మత్తులో ఏవేవో మాటాడుకుని ఏవేవో పాటలు పాడుకుని ఒకళ్ళ మీదొకళ్ళు పడి నిద్రపోయారు.

తెల్లారేక లేచిన ఇద్దరూ రైల్వేస్టేషన్లో కొచ్చారు.

చారులతని విశాఖపట్నం వేపెళ్ళే ట్రైనెక్కించిన జగన్ రాత్రి మేజిక్ స్టిక్ తిప్పితే చారులత డాన్స్ చేసిన లోయ అంచున ఒంటరిగా ఉన్న ఆ బస్టాండ్ కొచ్చి తన బస్సుకోసం చూస్తున్నాడు.

## 2

తొమ్మిదేళ్ళు గడిచాయి.

డిసెంబరు నెల సాయంత్రం. ఆరింటికే చీకటి పడిపోయింది. చలి బాగా పెరిగింది. హైదరాబాద్ నిజాం గ్రౌండ్స్‌లో గత నాలుగురోజుల్నుంచీ బుక్ ఫెయిర్ జరుగుతుంది. విశాలమైన ఆ ప్రదేశంలో చాలా పొడుగ్గా ఆరేడు వరసలు. ఒకో వరసలోనూ ఏభయికి పైగానే ఇంగ్లీష్, హిందీ, ఉర్దూ, తెలుగుభాషల బుక్‌స్టాల్స్. ఆరు వరసల్లో ఉన్న షాప్స్‌కి ముందున్న విశాలమైన స్థలంలో కేంటిన్. ఐస్‌క్రీమ్స్, పాప్‌కార్న్, చిప్స్, మసాలా అమెరికన్ స్వీట్‌కార్న్ అమ్మే స్టాల్ ఉన్నాయి. వాటికి దగ్గర్లోనే స్టేజ్. దానిముందు రెండొందలకి పైనే వేసున్నాయి కుర్చీలు. ఆరోజు ఆదివారం కావడంతో చాలా బాగా వచ్చారు జనం.

ఆ బుక్ ఫెయిర్ పదిరోజులు జరుగుతుంది. అది జరిగిన ప్రతిరోజు రాత్రి ఆ స్టేజ్ మీద ఒక బుక్ రిలీజ్ ఫంక్షనుంటుంది.

జగన్ రాసిన 'ఏకశిల' అనే నవల ఇనాగరల్ ఫంక్షన్. అమెరికాలో టెక్సాస్‌లో ఉంటున్న జగన్ ఒక పని మీద ఇండియా రావడంతో ఆ రాకని ఎడ్వాంటేజ్‌గా తీసుకున్న సీగల్ బుక్ పబ్లిషర్ జయరాజ్ ఈ బుక్ రిలీజ్ ఫంక్షన్ ఏర్పాటు చేశాడు.

ఎలక్ట్రానిక్ మీడియా విచ్చలవిడి విహారం చేస్తున్న ఈ రోజుల్లో పుస్తకాలు కొనేవాళ్ళు బాగా తగ్గిన ఈ కాలంలో జగన్ సభకి బాగా వచ్చారు జనం.

'ఏకశిల' నవల ఎంత విశిష్టమైందో వివరిస్తూ ఉపన్యాసాలూ దండలూ ఫొటోలూ చానల్స్ వాళ్ళ వీడియో కెమెరాల ఎక్స్‌పోజింగ్సూ అయ్యేకా ప్రెస్ వాళ్ళందరికీ సపరేటుగా కుర్చీలు వేయించాడు పబ్లిషర్ జయరాజ్.

"జగన్‌గారూ అరకులోయ నేపథ్యంలో మీరు మొట్టమొదటి నవల రాశారు గదా! అందులో చారులత అనే నాయిక ఉంది గదా?" అడిగాడు త్రినాథ్ అనే జర్నలిస్టు.

"ఔను" అన్నాడు జగన్.

"ఆ నవల చాలా పెద్ద హిట్టు గదా?" మళ్ళీ అడిగాడు త్రినాథ్.

"ఔను" అన్నాడు జగన్.

"ఆ నవల ఆ బేక్‌డ్రాప్‌లోనే రాయడానికి ఇన్స్‌పిరేషనేంటి?" అడిగాడు ఇంకో జర్నలిస్టు దాస్.

"అనుభవం."

"వివరంగా చెప్పండి సార్?" కుతూహలంగా అడిగాడు యంగ్ జర్నలిస్టు నివాస్.

"ఆరోజు అరకులో చారులతతో నా అనుభవాలు. అసలుకొస్తే నేను రచయితని కాదు. ఆ అనుభవాల్లో ఆ చారులతే నాతో నా మొదటి నవల రాయించింది. జరిగింది జరిగినట్టు, చూసింది చూసినట్టు రాశాను. అది హిట్టయ్యాకా అరకులోయని నేపథ్యంగా పెట్టుకుని చారులతని నాయికగా ఎన్నెన్నో కల్పించుకుని అన్నీ నిజంగా జరిగినట్టు రాశాను. అసలుకొస్తే నా చారులత..." అంటూ ఆగిపోయిన జగన్ ఆ చీకట్లో ఒకపక్కకి చూసి అలా వుండిపోయాడు.

తననే చూస్తుంది చారులత. పాపికొండల వెనక చంద్రోదయంలా నవ్వుతుంది.

ఆ ప్రెస్‌వాళ్ళకి నమస్కారం చేసి బయటికొచ్చి చారులత ముందు నిశ్శబ్దంగా నిలబడ్డ జగన్... కాస్త వడిలిపోయిన ఆ చారులత ముఖాన్నే చూస్తా చివరికి అడిగాడు "బాగున్నావా?" అని.

బాగున్నానన్నట్టు తలూపింది చారులత.

మళ్ళీ నిశ్శబ్దం.

జగన్‌నే చూస్తున్న ఆమె పొడికళ్ళలో పిసరంత తడి. కాస్సేపు గడిచేకా "మా అపార్ట్‌మెంట్ దగ్గర్లోనే బజార్‌ఘాట్‌లో. ఒకసారి వస్తావా?" అంది.







"పద" అంటూ ఆమెతో బయల్దేరబోతున్న జగన్ దగ్గర కొచ్చిన ట్రావెల ఏజంట్ ఫకీర్ మోహన్ "మీరు దుబాయ్ కెళ్ళాల్సిన ఎమిరైట్స్ ఫ్లైట్ ఇంకో రెండు గంటల్లో బేగంపేట ఎయిర్‌పోర్ట్‌నించి బయల్దేరుతుంది" అని గుర్తు చేశాడు.

"వెంటనే వచ్చేస్తాను" అంటూ చారులతతో బయల్దేరాడు జగన్.

బజార్‌ఘాట్‌లో ఆంజనేయస్వామి గుడి పక్కనే ఉన్న చారులత డీలక్స్ అపార్ట్‌మెంట్‌లో కెళ్ళారు.

చాలా టేస్ట్ కనపడిందా అపార్ట్‌మెంట్ డెకరేషన్‌లో. స్త్రీ కళ్ళని విశాలంగా గీసే బెంగాలీ ఆర్టిస్టు జెమినీరాయ్ పెయింటింగ్స్ నకళ్ళు కనిపించాయక్కడ. ఏమూల చూసినా రా వుడ్ ఫర్నీచర్. లప్పం ఫినిషింగ్‌తో ఉన్న పింక్ కలర్ వాల్స్, కిటికీలకీ గుమ్మాలకీ డార్క్ బ్రౌన్ కర్టెన్స్. అక్కడక్కడా డెకరేట్ చేసిన ఏంటిక్స్. బ్రాంజ్ హారన్‌తో ఉన్న గ్రామ్‌ఫోన్. దాని మీద హెచ్.ఎమ్.వి. క్లే రికార్డ్. బ్లాక్ టీ ఇస్తూ "పెళ్ళయ్యిందా?" అంది చారులత.

పల్చగా నవ్వుతూ చారులతనే చూస్తూ "అయ్యింది. కాస్త లేటుగా అయ్యింది. ఫస్ట్ టైమ్ అబార్షనయ్యింది. మూడేళ్ళ తర్వాత మళ్ళీ ఇప్పుడు ప్రెగ్నెంటామె" అనాగి, "అవునూ వైజాగులో నీ పెళ్ళికి పిలవనే లేదు నన్ను... ఓ అయామ్‌సారీ నా అడ్రసు నీ దగ్గర లేదు కదూ?... అన్నట్టు నువ్వు, మీ శ్రీరామ్ కూడా అమెరికా వెళ్ళలేదా?" అన్నాడు జగన్.

"శ్రీరామ్ ఇండియా వచ్చేసి ఒక వ్యాపారం పెట్టారు ఆ పనిమీదే లాస్ట్‌వీక్ థాయ్‌లాండ్ వెళ్ళారు" అంది చారులత.

'మీ ఫ్లైట్‌కి టైమవుతుంద'ని ఫోనొచ్చింది ట్రావెల్ ఏజన్సీ ఫకీర్ మోహన్ నించి.

పొడిపొడిగా మొదలైన వాళ్ళ సంభాషణ తర్వాత తడిపొడై తర్వాత్తర్వాత మొత్తం తడైంది. తొమ్మిదేళ్ళ క్రితం అరకులోయలో ఆ జ్ఞాపకాల వరండా మెట్ల మీద నిలబడి ఎన్నెన్నో మాటాడుకుంటుంటే ఫకీర్ మోహన్ దగ్గర్నుంచి ఫోన్లు.

వాటినేం పట్టించుకోకండా ఆ జ్ఞాపకాలే నా వ్యాపకాలు అని మాటాడుకుంటా ఆ జ్ఞాపకాల ఉయ్యాలలోనే వూగుతుంటుంటే చివరికి వార్నింగ్ కాల్ చేశాడు ఫకీర్‌మోహన్. గతంలోంచి వర్తమానంలో కొచ్చిన జగన్ చారులతనే చూస్తా వెంటనే బయల్దేరెళ్ళి ఆ ఫ్లైట్ పట్టుకోపోతే నా షెడ్యూల్సన్నీ తేడా వచ్చేస్తాయి. పైగా ఆ ఫకీర్ మోహన్ బోర్డింగ్ కార్డు తీసేశాడంట. దుబాయ్ వెళ్ళేక న్యూయార్క్ ఫ్లైట్ ఎక్కాలి. మరి వెళ్తాను. మీ శ్రీరామ్‌కి నా నమస్కారాలు చెప్పు?"అన్నాడు. మళ్ళీ ఫకీర్‌మోహన్ నించి ఫోన్.

ఇక తప్పక బయల్దేరిన జగన్ ఆ చీకటిలో చీకటిలా కల్సిపోయాడు. చీకట్లో బయట గ్లాస్కో చీర ఆరేసినట్టు వెన్నెలున్నా లోపలున్న చీకట్లో ఆ జగన్‌కి కనబడని కన్నీళ్ళతో చెయ్యూపుతున్న చారులత విషయానికొస్తే, తొమ్మిదేళ్ళ క్రితం ఆదరాబాదరా అరకులో కిరండోలు పాసింజరెక్కి వైజాగులో ఉన్న దసపల్లా హిల్స్ కెళ్ళిన చారులతకి శ్రీరామ్‌తో పెళ్ళి సంబంధం చెడిపోయింది. అప్పట్నించీ జగన్ కోసం వెతకడం మొదలెట్టింది. దొరకలేదా మనిషి. అరకులో అతనితో గడిపిన ఆ మధురమైన జ్ఞాపకాల్లోనే గడుపుతా అతను రాస్తున్న నవలలు చదువుతా బతుకుతా అలాగుండిపోయింది. విశాఖపట్నంలో మునిగి చిట్టచివరికి హైదరాబాద్‌లో తేలింది. 'నాకు పెళ్ళయ్యింది మూడేళ్ళక్రితం అబార్షనయ్యింది. ఇప్పుడు ప్రెగ్నెంటు. కేరీ చేస్తుంది' అని జగన్ చెప్పడంతో, 'మా శ్రీరామ్ థాయ్‌లాండ్ వెళ్ళారు' అని అబద్దమాడింది.

ఇక జగన్ విషయానికొస్తే.....

ఆనాడు పెళ్ళి చేసుకోడానికి వైజాగ్ వెళ్ళిపోయిన చారులతనీ ఆ శీతాకాలం అరకులో గడిపిన సంఘటనల్నీ ఆ వెండి వెన్నెలరాత్రి అపూర్వమైన అనుభవాల్నీ పదేపదే తల్చుకుంటా ఆ అనుభూతుల్ని ఒక నవలగా రాసి ప్రసిద్ధుడయ్యేడు. అక్కడ్నించి తన చారులత కేరెక్టర్‌తో వెన్నెల్లో అరకులోయ నేపథ్యం మీద తొమ్మిది నవలలు రాసి చాలా పాపులరయ్యేడు.

ఇక అసలు విషయానికొస్తే .......

శ్రీరామ్‌ని పెళ్ళి చేసుకున్న చారులత జ్ఞాపకాల్లోనే బతుకుతున్న జగన్ అసలు పెళ్ళే చేసుకోలేదు.

*స్వాతి సపరివారపత్రిక*
*5 జనవరి 2007*









భూషణం పెట్రోమాక్స్ లైటు పట్టుకుని నడుస్తున్నాడు అడవిలో. వెనకాలే వెళుతోంది నల్ల సుశీల.

చీకటి చిక్కగా అలుముకు పోయి వుంది.

సుళ్ళు తిరుగుతూ వీస్తోంది కొండగాలి.

చుక్కలతో నిండిపోయి వుంది ఆకాశం.

నడుస్తున్న సుశీల కాళ్ళ మధ్యలోంచి నాగుపాము ఒకటి జరజరా పాక్కుంటూ వెళ్ళే సరికి టక్కున ఆగిపోయింది. ముందెళుతున్న భూషణం వెనక్కి తిరిగి, "ఆగిపోయావేం, రా!" అన్నాడు.

"పద!" నడవడం మొదలెట్టింది.

"ఇప్పటికే చాలా ఆలస్యమైపోయింది. ఆ దొరగారు మన కోసం చూస్తూ వుంటాడు. ఆయనగారికి కోపం చాలా ఎక్కువట," గొణుక్కున్నాడు భూషణం.

నలభై రెండో నంబరు టన్నెల్ దగ్గర ఎర్రదీపం ఆరగానే పచ్చదీపం వెలిగింది. గూడ్సు శిమిలిగూడా స్టేషన్ వదిలేసినట్టుంది.

కొంతదూరం నడిచారు. రైలుపట్టాలు దాటుతున్నప్పుడు కుడికాలి బొటనవేలుకి కలకర్రాయి గట్టిగా తగిలేసరికి, "అమ్మా!" అని ముందుకి వంగింది. సరిగ్గా అప్పుడే ఆమె మెళ్ళో ఉన్న పెద్ద పెద్ద మంగళసూత్రాలు కిందికి వేలాడి ఊగాయి.

ఆగిన భూషణం, "మళ్ళీ ఏమైంది?" అన్నాడు.

"గొప్పు తగిలింది!"

వెనక్కొచ్చి పెట్రొమాక్సు లైటు కింద పెట్టేసరికి దాని కాంతిలో కనిపించింది చిట్లి కారుతున్న రక్తం.

"అయ్యయ్యో! చాలా పెద్ద దెబ్బ...! తొందరగా పద! ఫారెస్ట్ గెస్ట్‌హౌస్‌కి వెళ్ళాక ఏదన్నా మందు అడుగుదాం," అన్నాడు.

కుంటుతూ అతని కూడా నడుస్తున్న సుశీల ఇప్పుడు బాగా పొడైపోయింది కానీ చాలా అందగత్తె. ఒకప్పుడు సన్నగా, పొడుగ్గా నీలం రంగులో వుండేది. చూపుడు వేలంత సన్నటి ముక్కు. దాని చివర మెరిసే ఎర్రరంగు ముక్కుపుడక. కాళ్ళకి మువ్వల పట్టాలు పెట్టుకుంది. నడుస్తుంటే లయనిబట్టి గాలికొండాపురంలో ఎవరన్నా సరే, 'ఆ వెళ్ళే మనిషి నల్ల సుశీల కదూ?' అనేవారు.

వాళ్ళమ్మ చినముత్యానికి సుశీలంటే ప్రాణం. తన కాలికిలా దెబ్బ తగిలిందని తెలిస్తే ఈ భూషణంగాడి ప్రాణాలు తీసేస్తది. చిన్నప్పట్నుంచీ ముద్దుగా పెంచుకుంది. అరికాళ్ళ కింద పావుకోళ్ళలాగ సుశీలని అంటి పెట్టుకుని ఉంది. నల్ల సుశీలకి సపోటా పళ్ళంటే మహా ఇష్టం. వాటిని ఒలిచి పాలల్లో వేసి పెడుతుంది. విమాన పసందు మామిడి పళ్ళు ఇష్టంగా తింటుందని సంతలోకెళ్ళి మేలైన పళ్ళని తనే ఏరి తెస్తుంది. జీడిపప్పులో పంచదార కలిపి పెడుతుంది. పొద్దుటే గేదె పొదుగుల దగ్గర తనే కూర్చుని పితికిన పాలు పరగడుపునే ఇస్తుంది. సుశీల కట్టని పట్టుబట్టగానీ, వాడని మేలురకం అత్తరుగానీ లేవు.

*

శీతాకాలం... శోభనం గది పువ్వులతో అలంకరించి వుంది. కట్ట అగరొత్తులూ ఒకేసారి వెలిగించెయ్యడంతో ఎటు చూసినా పొగ. ఎవరో పరుపు మీద పిఠాపురం సెంటుబుడ్డి ఒలకబోసేసారు. దాని సువాసనతో గదంతా నిండిపోయింది.

పందిరిపట్టి మంచం అంచు మీద కూర్చున్న సుశీలకి ఆయన లోపలికొచ్చాకా ఎలా మసులుకోవాలో వాళ్ళమ్మ చెప్పినవన్నీ గుర్తుకు వస్తున్నాయి.

కాస్సేపయింది...

తలుపు తెరుచుకుని లోపలికి వచ్చిన వల్లూరి మోహనరావు కాళ్ళకి నమస్కారం చేసి లేచింది.

ఆమె అందాన్నే చూస్తూ నిలబడ్డ మోహనరావు, "నువ్వు అమృతం తాగావు," అన్నాడు.

"అవును! మీరు పాలు తాగండి," అందించింది గ్లాసు.

"ఇందాకే విస్కీ తాగాను మరి!" అన్నాడు.

తల్లి చెప్పినట్టు అతనికి సర్వవిధాలా సహకరించింది.

ఆరోజు తర్వాతి నించీ ప్రతి రాత్రీ ఇంటి ముందాగే అతని బుల్లెట్ బండి శబ్దం కోసం ఎదురుచూసేది. కొన్నాళ్ళు తనతో గడిపిన అతను ఈమధ్య ఇటుపక్కకి రావడం మానేసాడు. సుశీల మాత్రం అతని బండి శబ్దం కోసం ఎదురుచూస్తూనే వుంది.

నల్ల సుశీలకి ఒక కొత్త కోరిక పుట్టిందిప్పుడు.

తనకో బిడ్డ పుట్టాలి.

వాడు తెల్లగా, బొద్దుగా, ముద్దొచ్చేలాగుండాలి. కాంతులు నిండిన కళ్ళతో కళకళలాడిపోతూ వుండాలి. అందమైన పేరు పెట్టాలి వాడికి.

అన్నప్రాసన రోజు చుట్టూ ఉన్న వస్తువుల్లో కొజారునే ముట్టుకోవాలి వాడు.

కొన్నాళ్ళు గడిచింది.

వల్లూరి మోహనరావు బుల్లెట్ బండి మసీదు సెంటర్‌కి అవతల వీధిలో వుండే రుక్మిణి చెల్లెలి ఇంటి ముందు ఆగడం మొదలెట్టిందిప్పుడు. అది తెలిసిన సుశీల ఒక రాత్రి లాంతరుతో బయల్దేరబోతుంటే ఆపేసిన చినముత్యం, "ఎక్కడికీ?" అంది.

"ఆయన దగ్గరకి. అడగడానికి..."

"ఏమని అడుగుతావ్?"

"మన ఇంటికి రాకుండా ఈ ఇంట్లో ఏం చేస్తున్నారని?"

"దుర్గమ్మ గుడి వీధిలో రాజ్యం చెల్లెలు నాని తెల్సు కదా!"

"తెలిస్తే?"

"ముందు నాని దగ్గరుండే మనిషి నీ దగ్గరికి రావడం మొదలెట్టాడు. అప్పుడు ఆ సాని మనింటికి వచ్చి అడగలేదుగదా... ఏ గొడవా పడ్లేదు కదా?"

"అంటే ఇప్పుడేమంటావమ్మా?"

"ఏం లేదు. పెళ్ళి చేసుకున్నవాడికీ, కన్నెరికం చేసుకున్నవాడికీ తేడా చెపుతున్నాను."

"అప్పుడు నాకు పెళ్ళి ఎందుకు చెయ్యలేదు?"

"నువ్వు పెళ్ళి చేసుకున్నా దానికంటే ఇదే నయం. డబ్బు, దస్కం రెండూ వస్తాయి. లోపలికి పద!"

తల్లి చినముత్యం ఆలోచనల్ని జీర్ణం చేసుకోడానికి కొన్నాళ్ళు పట్టింది తనకి. ఆ తరువాత పేర్నీడి ప్రభాకరం రావడం మొదలెట్టాడు.

నిజమైన మనిషి ప్రభాకరం. మనసంటే ఏందో అతనికి తెల్సు. మనిషిని ప్రేమించడం తెల్సు.

పరిచయమైన మూడోరోజే అన్నవరం వెళదాం అన్నాడు. 'మేం భార్యాభర్తలం,' అని గుళ్ళో అర్చన చేయించాడు. సాయంత్రం ఇద్దరూ కొండ దిగి గోపాలపట్నం వేపు నడుస్తున్నారు.

దేవుడి ప్రసాదం తినేసి విస్తరాకు దూరంగా విసిరేస్తూ, "నన్నెవరన్నా ఇంటర్వ్యూ చేస్తే ఒకటి చెప్పాల నుంది!" అన్నాడు ప్రభాకరం.

"మిమ్మల్నెవరూ చెయ్యరు. నాకు చెప్పెయ్యండి!" అంది సుశీల.

"సరే... ఈ ప్రపంచంలో నీ కిష్టమైన స్వీటేది? అని అడుగు."

అడిగింది.

"ఈ ప్రపంచంలో నాకిష్టమైన స్వీటు అన్నవరం సత్యన్నారాయణ మూర్తి ప్రసాదం!"

"నిజమే సుమా!" అని అతని నడుం చుట్టూ ఎడమచెయ్యి వేసి ముందుకు నడిచింది.

అదంతా మైదానం. ఉన్నట్టుండి ఆగిపోయిన ప్రభాకరం, "నన్ను ముద్దు పెట్టుకో," అన్నాడు.

"ఎవరన్నా చూస్తే?" అంది.





వెంటనే, "రక్షించండి! హెల్ప్! హెల్ప్!" అని అరవడం మొదలుపెట్టాడు. ఎవరూ రాలేదు. ఇక అరుపులాపి, "ఎవరూ రావట్లేదు. కాబట్టి ఇప్పుడు నన్ను ముద్దు పెట్టుకోవచ్చు!" అన్నాడు.

నవ్వేసిన సుశీల, "మొన్న చూసిన సినిమాలో సీనిది!" అని తన గులాబీరంగు పైట తీసి గుండెల మీద ముద్దు పెట్టించుకుని, అతని పెదాల మీద తనూ ముద్దు పెట్టింది.

అలా అల్లిబిల్లిగా అతనితో అల్లుకుపోయింది సుశీల. రోజులు హాయిహాయిగా గడుస్తున్నాయి. మధురంగా ఉంది జీవితం. మొలకగా ఉన్నప్పుడే గిల్లి వేయబడ్డ ఆశ మళ్ళీ మొలకెత్తడం మొదలెట్టింది.

తనకో బిడ్డ పుట్టాలి. వాడు ముద్దుగా, బొద్దుగా తన చంకలోంచి నలుగురూ లాగేసుకునేంత అందంగా వుండాలి.

కొన్నాళ్ళు గడిచాక ప్రభాకరం కూడా రావడం మానేసాడు.

ఏమయిందా అని వాకబు చేస్తే తెలిసింది, బావమరుదులు అతన్ని చంపేసి వాళ్ళ పొలాల మధ్య వుండే చింతాలమ్మ గుడిలో పారేసారట.

మూడునెలల పాటు గదిలోంచి బయటకి రాలేదు నల్ల సుశీల.

తర్వాత, ఏమిటీ జీవితం? అన్న ప్రశ్న.

మళ్ళీ ఎదురుగా తల్లి చినముత్యం.

ఆ తర్వాత తన జీవితంలో చాలామంది...

కాలం తన ఆయుష్షుని మింగేసింది. రాత్రి జడలో నలిగిన మల్లెపువ్వులా వాడిపోయింది అందం. చాలామంది కన్నెపిల్లలు తయారయ్యారు. కొత్తనీరు వచ్చేసింది. ఎంత అలంకరించుకున్నా వృథా! ఇలాంటి పరిస్థితులొచ్చాకా చాలామంది చిన్నచిన్న టౌన్లలో వుండే లాడ్జీలకి, ఆ తర్వాత హైవేల మీదకీ మారిపోతుంటారు.

ఏం చేద్దామా అని ఆలోచిస్తుండగా ఎవరో చెప్పారు గాలికొండపురం వెళ్ళిపొమ్మని.

అక్కడెవరున్నారంటే, 'అదో చిన్న టూరిస్టు ప్లేసు. మీలాంటి వాళ్ళెవరూ వుండరక్కడ. అక్కడికొచ్చి నాలుగు రోజులుండే టూరిస్ట్‌లకి మీ సుశీలే మహారాణి!' అని బోధించారు.

మెళ్ళో మంగళసూత్రం వేస్తుంటే, "ఇదెందుకు?" అంది సుశీల.


"పెళ్ళయింది. భర్త పొరుగూరు వెళ్ళాడు అని చెప్పాలి. పెళ్ళయిన ఆడదానితో సంభోగం అంటే అదో ఆనందం వాళ్ళకి. అయినా ఇప్పుడు ఒళ్ళు వడిలిపోయింది. కాబట్టి నీకిదే సరైన వేషం!"

అనుభవజ్ఞురాలైన తల్లి, వృత్తిలో లౌక్యాన్ని జీర్ణం చేసుకునేలా ప్రయత్నించింది సుశీల.

ఆ తర్వాత వాళ్ళు దండకారణ్యం మధ్యలో వున్న గాలికొండపురానికి మకాం మార్చారు.

*

ఎండ తీవ్రంగా కాస్తున్నా మధ్యాహ్నం రెండు గంటలకే చలిగాలి తిరిగింది. గుహల దగ్గర తిరిగే సాధువు గోస్తనీ నదిలో స్నానం చేస్తున్నాడు. రాత్రి డ్యూటీ కెళ్ళొచ్చిన స్టేషన్ సూపరింటెండెంట్‌గారు తన పెంపుడు కుక్కని వూళ్ళో తిప్పుతున్నాడు.



గెస్ట్‌హౌసుల్లో దిగిన యాత్రికులు కెమెరాలతో లోయల్లో తిరుగుతున్నారు. స్టేషన్లో కాంటీన్ నడిపే ఒరియావాడు మేకపాల కోసం ఊళ్ళోకొచ్చాడు. గాలికొండ కింద మిలటరీ హోటలు మీసాలరాజు నాటు కోళ్ళు కొనడానికి గిరిజనుల పాకల వేపు వెళుతున్నాడు.

రాత్రి పొగ చూరిపోయిన పెట్రోమాక్స్ లైటుని చిట్టుతో తోముతూ చినముత్యంతో మాట్లాడుతున్నాడు భూషణం. "రాత్రి గెస్ట్‌హౌస్‌లో దిగినతను ఇక్కడ పండే రంగురాళ్ళు కొనడానికి వస్తూంటాడట. లప్పా! బరంపురం లాల్చీ వేసుకుని బలంగా వుంటాడు... తాగితే మాత్రం రాక్షసుడి అవతారం ఎత్తుతాడట. నేనొచ్చినప్పుడల్లా నీకు కబురు చేస్తుంటాను. అస్తమాను ఇవ్వడం కుదరదు. ఇదిగో! అనేసి ఒకేసారి పదివేల కట్ట సుశీలకిచ్చేసాడు."

వాడలా మాట్లాడుతూ ఉండగా లోపల వాంతి చేసుకుంటున్న సుశీల కనిపించింది.

నల్ల సుశీల నెల తప్పింది.

అది విన్న చిన్నముత్యం ఇక ఈ వృత్తి మనకొద్దని నిర్ణయించేసుకుని కూతుర్ని పువ్వుల్లో పువ్వులా చూసుకోడం మొదలెట్టింది.

పోయిన శక్తీ, కాంతీ తిరిగొచ్చాయి సుశీలలో. ఇంతకుముందెప్పుడో పారేసుకున్న చలాకీతనం మళ్ళీ ప్రవేశించింది. తల్లి వద్దంటున్నా ఎగిరి గంతులేసింది. రాకపోయినా సారమతిరాగం పాడే ప్రయత్నం చేసింది. ఇప్పుడు పనిలేని భూషణం ఇంటికొస్తుంటే ఆట పట్టించేస్తోంది.

ఇలా కాలం గడుస్తుండగానే తొమ్మిది నెలలూ నిండిపోయాయి నల్ల సుశీలకి.

*





ఆరోజు...

పసుపురంగు పిట్ట ఒకటి టిల్లచెట్ల గుబుర్లలోకి దూరి చిగుళ్ళని మాత్రమే రుచిగా తింటోంది. నేల మీద పడున్న పచ్చి తాటాకు మీదకి చేరిన రెండు ఎర్రతొండలు దెబ్బలాడుకుంటున్నాయి. కొండ దిగువన మేస్తున్న గేదె వీపు మీద వాలిన కాకి నిశ్శబ్దంగానే కూర్చుంది. గాలికి వూగుతున్న సాలప చెట్టు ఆకు మీదకి జేరిన రామచిలక కిందికి జారిపోకుండా కాళ్ళతో పట్టుకుంది. గంతులేస్తూ పరుగెత్తుతున్న చిన్న గొర్రెపిల్లని ఎలాగయినా పట్టుకోవాలని వెనకాలే పరిగెడుతున్నాడు కొండ ముసలాడు.

రోజూ చూస్తున్నదే అదంతా. అయినా ఆరోజెందుకో చాలా అందంగా కనిపించింది.

అలా చూస్తున్న సుశీల మెడ వెనకేదో లాగినట్టయి తల పైకెత్తేసరికి నల్లటి మబ్బులతో మూసుకుంటున్న ఆకాశం కనిపిస్తుంది.

కాస్సేపటికి వీస్తున్న గాలిలో బాగా మార్పొచ్చింది.

ఇంకాస్సేపటికి నిలబడ్డ తను అమాంతంగా ఎగిరిపోయేంత ఉధృతంగా వీయడం మొదలెట్టింది గాలి.

లోయల్లో పెరిగే పనసచెట్లూ, కుంకుడు చెట్లూ వేళ్ళతో పాటు కూలిపోతాయేమో అన్నంత వికృతంగా వూగిపోతున్నాయి. కొండల మీద పండే కమలాఫలాలు, మామిడిపళ్ళు టపటపా నేల రాలిపోతున్నాయి. గిరిజనుల రెల్లుపాకల కొప్పులు ఎగిరిపోతున్నాయి. వాతావరణం చూస్తుంటే రాత్రి కింకేమవుతుందా అన్నంత భయానకంగా వుంది.

ఆరోజు, మర్నాడు కూడా అలాగే వుంది వాతావరణం.

పొద్దుట్నుంచీ కాస్త నులపరంగా వున్నట్టు అనిపించింది సుశీలకి. మధ్యాహ్నానికి జ్వరమొచ్చి, సాయంత్రమయ్యే సరికి కాలిపోవడం మొదలెట్టింది ఒళ్ళు. ముట్టుకు చూసిన చినముత్యం రైల్వే డాక్టరు కోసం పరుగెట్టింది. కానీ అతను మోటారు ట్రాలీ మీద చిమిడిపల్లి వెళ్ళాడు.

గాలి దుమారానికి ఎగిరొచ్చిన ఆకులు కిటికీ ఊసల్లోంచి దూసుకొచ్చి సుశీల పరుపు మీద పడ్డాయి. జ్వరంతో ఒకపక్క బాధపడుతూనే, చిన్నపిల్లలా వాటిని ఏరుకుని ఆడుకుంటూ, ఇక పుట్టబోయే తన బాబుకి స్వాగతం చెబుతోంది.

రాత్రయింది.

తుపానట!

వాతావరణం చాలా బీభత్సంగా మారింది.

వీస్తున్న గాలికి వర్షం తోడయ్యింది. కరెంటు కూడా పోయింది. గాలికొండపురం గ్రామం అంతా ఖాళీ చేసేసి వలస వెళ్ళిపోయినట్టయింది.

అంతలో...

మూసి ఉన్న ఇంటి తలుపు దబదబా బాదుతున్నారెవరో!

వెళ్ళి తీసింది చినముత్యం.

కాకిలా తడిసిపోయి బాటరీలైటు పట్టుకుని నిలబడ్డ భూషణం, వాడికి కాస్త దూరంగా బరంపురం లాల్చీలో బలంగా వున్న మనిషి నోట్లోంచి తాగిన వాసన వేస్తోంది.

వాళ్ళిద్దర్నీ గమనించిన చినముత్యం భూషణం కేసి చూసి, "నీకిదేం దొబ్బిడాయిరా సచ్చినోడ! ఏంటిది?"

"మొన్న గెస్ట్‌హౌస్ కెళితే పదివేలిచ్చారే... ఆ దొరగారు."

"మా సుశీలకి నెలలు నిండినయ్యని చెప్పలేదా?"

"చెప్పడమేంటి ఏడ్చి మొత్తుకున్నాను. లప్పా! (ఎత్తయిన కడుపుతో) నెలలు నిండిన ఆడాళ్ళతో శృంగారం గొప్పగా వుంటుందని ఆయనే లాక్కొచ్చేసారు!"

"ఛీ! నోర్ముయ్ వెధవా! జ్వరంతో దాని ఒళ్ళు కాలిపోతుంటే..."

ఆ మాట విన్న ఆ మనిషి విసురుగా దగ్గరకొచ్చి, "ఏంటీ, నెలలు నిండటంతో పాటు జ్వరం కూడా వచ్చిందా?" అన్నాడు.

"అవును దొరగారూ! దాని ఒళ్ళు పెనంలాగా కాలిపోతుంది!"

ఆనందంతో పెద్దగా అరిచిన ఆ మనిషి, "నెలలు నిండిన సుశీల ఒళ్ళు కాలిపోతున్న జ్వరంతో వుందా?... నేను కలకత్తాలో వున్నప్పుడు మా ఫ్రెండ్ హిరేన్ బోస్ చెప్పాడు. అలాంటి పరిస్థితుల్లో వున్న స్త్రీలతో కలిసే అవకాశం వస్తే వదులుకోకు అని... ఇదిగో చూడూ! ఇంతకుముందు పదివేల గురించి మర్చిపో! ఇదిగో ఇంకో పదివేలు!" అని అందించి మరుక్షణం సుశీల గదిలోకి దూసుకెళ్ళిపోయి దబ్బున తలుపేసుకున్నాడు!

*

తెల్లవారుతోంది. ఇంకా తగ్గని ఆ తుపానులోనే బయల్దేరిన శృంగార పురుషుడు తడిసిపోతూ తను దిగిన గెస్ట్‌హౌస్‌కి వెళ్ళిపోయాడు.

సుశీలకి నొప్పులు మొదలయ్యాయి. వాటిని భరించలేక మెలికలు తిరిగిపోతోంది. అంత తుపానులోనూ రైలెక్కించి శృంగవరపు కోట తీసుకెళ్ళింది చినముత్యం.


రాత్రికి ఆపరేషను చేసి బిడ్డను బయటకు తీసారు.

స్పృహ వచ్చిన నల్ల సుశీల పక్కలో వున్న బిడ్డని చూసుకుంది.

వాడు... తను కోరుకున్నట్టు మగపిల్లవాడే!

తాబేలు పొట్ట, పుల్లలాంటి చేతులు, కాళ్ళు, పెద్ద తలతో చలనం లేకుండా ఉన్నాడు.

*ఆంధ్రజ్యోతి దీపావళి ప్రత్యేక సంచిక, 1975*







# ఆ నాటి వాన చినుకులు





తను తీసే సినిమాల్లాగే జీవిస్తున్న మనిషి పతంజలి.

అతనో అందమైన డ్రీమర్ అని సమీక్షిస్తుంటారు కొందరు పత్రికా రచయితలు. ఈ ప్రపంచంలో మీ కిష్టమైన మనిషెవరు? అనడిగితే నేనే అంటాడు.

జవాబులో ఎంత అహంకారముందో ఎగబడి అతని సినిమాల్ని చూసే ప్రేక్షకులే గ్రహించాలి. తన ఫొటోలు ఏ పత్రికల్లోనూ రాకుండా జాగ్రత్తగా కాపాడుకుంటాడు. అతని సినిమాల్ని అంతగా ప్రేమించే ప్రేక్షకులకి పత్రికల్లో అతని ఫొటో చూసుకునే భాగ్యం కూడా కలగనియ్యకపోవడం అన్యాయం. ఇంటర్వ్యూ కావాలని ఏ జర్నలిస్టయినా అడిగితే మీరడిగే ప్రశ్నలకి ఆయన సినిమాలే జవాబులు చెబుతాయని చెప్పిస్తాడు సెక్రటరీతో.

బయటి ప్రపంచంలోకి రాకుండా నాలుగు గోడల మధ్య గడిపే ఈ పతంజలిని ఏమనాలి? అహంతో కళ్ళు నెత్తికెక్కాయి అనటంలో తప్పేం లేదేమో అని రాస్తుంటారు మరో వర్గం పత్రికలవాళ్ళు.

*

జీవితంలో పతంజలికి అత్యంత ఇష్టమైంది ఒంటరితనం.

స్నేహితులూ, సన్నిహితులూ లేరతనికి. ప్రారంభోత్సవాలకీ, ఫంక్షన్లకీ వెళ్లడు.

అత్యంత ఉన్నత సాహిత్యం తప్ప, సాదా సీదా పుస్తకాలూ, పత్రికలూ చదవడు.

అభిమానుల మంటూ వచ్చిన వాళ్ళని కలవాడు. వాళ్ళు రాసే లేఖల కేసి కన్నెత్తి చూడడు.

*

ఆఫీస్ రూమ్‌లో సీరియస్‌గా పని చేసుకుంటున్నాడు పతంజలి సెక్రెటరీ కృష్ణారావు.

అప్పుడే వచ్చిన పతంజలి "మనకి కనిపించే ప్రతిదీ పరిశుభ్రతతో ఉండాలి. అందమైన అభిరుచితో, చక్కని భావుకతతో నిండిపోవాలి. ఆరోజు వస్తుందంటావా కృష్ణారావ్?" అన్నాడు.

"వచ్చింది సార్!... నేను చూస్తూనే ఉన్నాను" పని చేసుకుంటూనే అన్నాడు కృష్ణారావు.

"నిజమా... ఎప్పుడు ఎక్కడా?" అడిగాడు పతంజలి.

"మీ సినిమాల్లో సార్?"

చిరాకుపడ్డ పతంజలి, "సినిమాలు నేనెందుకలా తీస్తున్నానో తెల్సా? అవి చూసిన జనంలో నే కోరుకునే మార్పు రావాలని" అన్నాడు.

"మీరు కోరుకున్నట్లు ఈ ప్రపంచంలో ప్రతి ఒక్కడూ భావుకుడు కాకూడదట, అదే జరిగితే అభినందించే వాళ్ళూ, విమర్శించే వాళ్ళూ ఉండరట. అప్పుడీ ప్రపంచమంతా అసహ్యంగా తయారవుతుందట" అన్నాడు కృష్ణారావ్.

"ఎవరు చెప్పారు నీకిది?" అన్నాడు.

"క్రియేటివిటీ అనే లెక్చర్‌లో భగవాన్ రజనీష్" అని కృష్ణారావు అనడంతో నవ్వేసిన పతంజలి, "చూడు కృష్ణారావ్, నువ్వు అందమైన బట్టలు కట్టుకున్నావనుకో- నీది మంచి టేస్ట్ అంటారు. నువ్వు అందమైన బట్టలు కుట్టావనుకో- నువ్వు మంచి క్రియేటర్ వంటారు. పై రెండింటికి తేడా ఉన్నట్టే క్రియేటర్‌కీ, భావుకుడికీ మధ్య కూడా చాలా తేడా ఉంది."

మాట్లాడలేదు కృష్ణారావ్.

"ఇంకో విషయం చెబుతాను విను. ఇది కూడా నా అనుభవంలోంచి పుట్టిన సత్యమే."

చెప్పమన్నాడు కృష్ణారావ్.

"ఒక ఖాళీ స్థలం ఉందనుకో. దాన్ని పరిశుభ్రంగా ఉంచటం నేర్చుకోవాలి మనిషి. అలా ఉంచడం అలవాటైతే తోట ఒకటి వేద్దామని ఆలోచన కలుగుతుంది. అభిరుచిలోంచి భావుకత జనిస్తుంది."

"ఆ భావుకత అన్నది మనిషిలో దానికిగా అది పుట్టాలిగాని, నేర్చుకోవడం వల్ల రాదు, అంటుంటారు మీరు. ఈ నేర్చుకోవడమెలాగ సార్?" అడిగాడు కృష్ణారావ్.

చెప్పడం మొదలుపెట్టాడు పతంజలి.

"విన్సెంట్ వేంగో, పికాసో, ఎడ్మండ్ డ్యులాక్, బోరిస్ వేలిజోల లాంటి పాశ్చాత్య కళాకారుల వర్క్స్‌ని స్టడీ చెయ్యాలి.

"ఉమర్ ఖయ్యాం, పిల్లలమర్రి చినవీరభద్రుడు, ఖలీల్ జిబ్రాన్ లాంటి కవుల్నీ, 'శిలాలోలిత' అనే కావ్యం రాసి ఆత్మహత్య చేసుకున్న రేవతిదేవి లాంటి కవయిత్రులు అందించిన ఆహ్లాదాన్నీ జీర్ణం చేసుకోవాలి.

"పాల్ మారియట్ 'ఇన్నియో మొర్రికాన్ని', హ్యూగో మాంటిగ్రో లాంటి వెస్టర్న్ మ్యూజిక్ కంపోజర్స్ కంపోజిషన్స్‌ని ఔపోసన పట్టాలి.

"నేర్చుకోవడం అంటే అదే. అప్పుడే... అప్పుడే... ఈ జనానికి పరిశుభ్రత, సంస్కారం, అభిరుచి, భావుకత ఏర్పడతాయి. మామూలు మనిషి కూడా మహానుభావుడిగా రూపాంతరం చెంది తీరుతాడు. అందుకు ఉదాహరణ ఎవరంటే-నేనే" అని ముగించాడు పతంజలి.

విన్న కృష్ణారావు "మనిషి భావుకుడుగా మారాలంటే మీరు చెప్పినట్టు స్టడీ చేసి తీరాలంటారా సార్!" అన్నాడు.

"ఔను" ఆల్మోస్ట్ అరిచినట్టు సమాధానం చెప్పాడు పతంజలి.

ఆలోచనలో పడ్డ కృష్ణారావ్ నిశ్శబ్దంగా నిష్క్రమించాడక్కడ్నించి.

*

ఎస్.ఎస్. నారాయణరావు

(స్కూల్ టీచర్)

గంధంవారి పాలెం,
జగ్గంపేట మండలం,
తూర్పుగోదావరి జిల్లా,
ఆంధ్ర ప్రదేశ్.





ఆ రోజు వచ్చిన అభిమానుల ఉత్తరాలన్నీ చదివి, పతంజలి తరపున ఓపిగ్గా జవాబులు రాసిన కృష్ణారావు ఆఖర్న విప్పాడు రిప్లై కవరు పెట్టి మరీ రాసిన ఆ నారాయణరావు లేఖని.

ఎలిమెంటరీ స్కూల్ టీచరైన నారాయణరావు రాసిన నూటనాలుగో ఉత్తరం అది. అతని ఇంటి గోడకి చనిపోయిన తన తల్లిదండ్రుల ఫొటోల్లేవట. తనూ, భార్యా పెళ్ళయ్యాక తీయించుకున్న ఫొటో పెట్టలేదట. ఏ దేవుళ్ళూ, దేవతల ఫొటోలు కూడా లేవట. ఉన్నదల్లా చాలా కష్టపడి సంపాదించుకున్న పతంజలి ఫొటో మాత్రమేనట. ప్రతిరోజూ అతను పూజించేది ఆ పటానికేనట. నారాయణరావు కోరిక ఒకటే, సెక్రటరీతో కాకుండా పతంజలి స్వదస్తూరితో నాలుగే నాలుగు వాక్యాలు రాసి సంతకం చేసి పోస్ట్ చేస్తే తనకి కోట్లు సంపాదించినంత సంతృప్తట. దేవుడు తనకిచ్చిన ఈ జన్మ ధన్యమైనట్టేనట. సాంతం చదివిన కృష్ణారావు కణతల మీద వేళ్ళతో రుద్దుకుంటూ నిట్టూర్చాడు. ఆంధ్రదేశంలో ఎక్కడో మారుమూల గ్రామం నుంచి రాస్తున్న ఆ అభిమాని ప్రతి లేఖలోనూ నిజాయితీ స్పష్టంగా కనిపిస్తుంది.

ఇంతటి అభిమానంతో రాస్తున్న ఉత్తరాలకు పతంజలి సమాధానం ఇవ్వకపోవడం అన్యాయం అనిపించింది కృష్ణారావుకి.

*

కార్తీక పౌర్ణమి ఆరోజు.

సంపూర్ణ చంద్ర దర్శనం.

పతంజలి భవనంలోకి శబ్దాలు చేయకుండా ప్రవేశిస్తున్నాయి చల్లగాలులు.

బాల్కనీలో పరచిన బూరుగు దూది పరుపు మీద కూర్చున్న పతంజలి సన్నగా పొడుగ్గా ఉన్న వైట్ రమ్‌ని చాలా నెమ్మదిగా చప్పరిస్తూ చేత్తో పక్కనే ఉన్న టేప్ రికార్డర్‌లో ప్లే బటన్ నొక్కాడు.

పింక్ ఫ్లాయిడ్ ట్రాక్ ఆరంభమైంది.

సంగీతాన్ని వింటూ చందమామని చూస్తూ, వైన్ చప్పరిస్తూ త్వరలో తియ్యబోయే సినిమా కథ గురించి ఆలోచిస్తుండగా అప్పుడే వచ్చిన కృష్ణారావు చేతిలో లెటర్ హెడ్ ఒకటుంది.

"క్షమించండి సార్, మీతో కొంచెం పనుంది."

విషయాన్ని వేమన పద్యమంత క్లుప్తంగా చెప్పాడు కృష్ణారావ్.

ఎలాంటి జవాబివ్వకుండా నిశ్శబ్దంగా ఉండిపోయిన పతంజలి కాసేపయ్యాకా అన్నాడు.

"నేనో తప్పు చేస్తున్నాననిపిస్తోంది కృష్ణారావుగారు!" అని.

సంభోదనలో మార్పుని గమనించిన కృష్ణారావు, "ఏంటి సార్?" అన్నాడు.

"మీతో కాస్త చనువుగా మాట్లాడటం."

"అలా మాట్లాడడం వల్ల నేనెలాంటి ఎడ్వాంటేజ్ తీసుకోలేదు సార్!"

"ఇప్పుడు నన్నీ పని చెయ్యమనడం ఎడ్వాంటేజ్ తీసుకోవడం కాదూ? అభిమాని నంటూ ఎవరో రాసిన ఉత్తరానికి నన్ను జవాబు రాయమనడాన్ని ఏమనాలి, కృష్ణారావుగారూ? పైగా ఈ టైమ్‌లో."

"చూడండి సార్! వంద ఉత్తరాలకి పైన రాసిన అతనికి మీరీ జవాబు రాయడం వల్ల అర్థణా లాభం ఉందా ఆ మనిషికి? మీరు ఆశించినట్టు ప్రతి మనిషీ భావుకుడు కావాలంటే లక్షల సంఖ్యలో మనుషులు మీ సినిమాలు చూడాలి. స్పందించాలి. మీరు కోరుకుంటున్న కోవకి చెందిన ఈ భక్తుడికి మీరు జవాబు రాయడం న్యాయం. మీ ఉత్తరం అందుకున్న ఆ అభిమాని ద్వారా మరో పదిమంది అభిమాన్లు పుడతారు. వాళ్ళని కూడా మనం గౌరవిస్తే ఆ పదిమంది లోంచి వందమంది, వాళ్ళలోంచి వేలమంది, లక్షలమంది, కోట్లమంది... అప్పుడే మీ కల నిజమౌతుంది. మీరే చెప్పారొకసారి- అభిమానిస్తూ ఉత్తరాలు రాస్తే తన ఆఖరి క్షణం వరకూ జవాబు లిస్తూనే వచ్చారు చలం అని... సత్యం మాటాడుతున్నాను. అర్థం చేసుకుంటే చాలా సంతోషిస్తాను. అవమానిస్తున్నానని అపార్థం చేసకున్నా కూడా సంతోషిస్తాను. మరి వస్తాను" వెళ్ళిపోయాడు కృష్ణారావ్.

*

ప్రతిరోజూ ఉదయం తొమ్మిది కాగానే ఆఫీస్ రూంలో కూర్చుని పని చేసుకునే కృష్ణారావు మర్నాడు రాలేదు.

మధ్యాహ్నం, సాయంత్రం దాటినా రాలేదు.

రాత్రి ఎనిమిదింటికి పతంజలే కృష్ణారావు ఇంటికి కారేసుకొచ్చి తన ఇంటికి తీసుకెళ్తూ దార్లో చెప్పాడు. "నువ్వే నెగ్గావ్ కృష్ణారావ్! ఇవాళ పొద్దుటే నారాయణరావుకి రిప్లై రాసి నా ఫొటో మీద సంతకం చేసి పోస్ట్ చేశాను."

"జవాబు రాయమన్నది నా పంతం నెగ్గించుకోవడానికి కాదు, ఒక అభిమానిని తృప్తి పరచడానికి సార్."

"సరే ఒప్పుకుంటున్నాను, కృష్ణారావ్. కానీ, రాత్రి నువ్వు అర్గ్యూ చేసిన పాయింట్‌కి మట్టుకి ఏ మాత్రం కన్విన్స్ కాను."

"ఏంటి సార్!"

ఒక అభిమాని ఆనందం ద్వారా పదులు, వందల్లోంచి లక్షల సంఖ్యలో అభిమానులు పుడతారన్నావ్. వాళ్ళంతా భావుకులుగా రూపాంతరం చెందుతారన్నావ్. నే నొప్పుకోను... ఒక మనిషి భావుకుడిగా మారాలంటే ఆమధ్య చెప్పినట్టు నాలా ఎంతో చదవాలి. ఎన్నో వినాలి. చూడాలి. ఏమంటావ్?"

సమాధానం చెప్పాలనిపించినా ఆ సమయంలో చెప్పటం అనవసరం అనిపించి మౌనంగా ఉండిపోయాడు కృష్ణారావ్.

వాచ్‌మేన్ గేటు తెరిచాడు. కారు లోపల పార్క్ చేసిన పతంజలి, 'బాల్కనీలో కెళదాం ర'మ్మని ఆహ్వానిస్తే వెనకే వెళ్ళాడు కృష్ణారావ్.

పరుపు మీద కూర్చున్నారిద్దరు. రమ్ ఆఫర్ చేస్తే తన కలవాట్లేదన్నాడు కృష్ణారావ్.





సరే అని గ్లాసందుకుని చంద్రుడ్ని చూడ్డంలో లీనం అయిన పతంజలి కాసేపయ్యాకా అన్నాడు.

"ఈ సారి సినిమా విలేజ్ బ్యాగ్రౌండ్లో తీద్దామని ఒక పాయింట్ అనుకున్నాను."

"అలాగే సార్!" అన్న కృష్ణారావ్ "చెప్పడం మర్చిపోయాను. రేపు నాకు లీవ్ కావాలి సార్!" అన్నాడు.

"ఎందుకు?" అడిగాడు పతంజలి.

"ఎన్నాళ్ళనించో కంచి పీఠాధిపతుల్ని చూడాలంటుంది మా ఆవిడ. మిమ్మల్నడిగి రేపు తీస్కెళ్తానన్నాను. మీరు సరే అంటే ఉదయాన్నే బయలుదేరతాం."

"అలాగే.. వచ్చేప్పుడు ఒక మంచి కథ తీసుకురా కృష్ణారావ్!..."

"కంచిలో పట్టుచీరలు దొరుకుతాయి గానీ... కథలెక్కడ దొరుకుతాయి సార్!"

"ఎందుకు దొరుకవు? కథలన్నీ చివరికి చేరేది కంచికే అంటారు కదా!" పతంజలి జోక్కి నవ్వేసిన కృష్ణారావ్ కాస్సేపయ్యాకా బయలుదేరాడు ఇంటికి.

*

ఆ రోజు పోస్ట్ చూసిన కృష్ణారావ్ మతి చలించినట్టయింది. అన్నీ గంధంవారిపాలెం నుంచి వచ్చిన ఉత్తరాలే. వందకి పైన ఉంటాయి.

స్కూల్ టీచర్ నారాయణరావు సుదీర్ఘ లేఖ సరే.

గంధంవారిపాలెం సర్పంచి,

గంధంవారిపాలెం పంచాయితీ బోర్డు ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్,

గంధంవారిపాలెం ఆర్.ఎం.పి. డాక్టర్,

గంధంవారిపాలెం టెంపుల్ ఈ.ఓ,

అలా ఆ ఊరి వాళ్ళంతా రాసేశారు.

నారాయణరావు చెప్తుంటే సొల్లు కబుర్లని కొట్టి పారేసిన వాళ్లు పతంజలి స్వహస్తాలతో రాసిన ఉత్తరం చూసి ఆశ్చర్యపోయారట. అతని సినిమాల్లో గొప్పదనం గురించి విపులంగా చెప్పేసరికి విని మంత్రముగ్ధులయిపోయేరట. వాళ్ళ ఊళ్ళో సినిమా హాలు లేదట, ఊరు ఊరంతా రాజమండ్రి వెళ్ళి ఈ మధ్యే విడుదలయిన 'సమాధి నెం. 7' సినిమా చూసేరట.

అది సినిమా కాదట- జీవితమట. అందులో పాత్రలు... పాత్రలు కాదట... నిత్య జీవితంలో వాళ్ళకి ఎదురవుతున్న మనుషులట.

ఆ ఊరి జనం ప్రార్థించేదేమిటంటే పతంజలికి గంధంవారిపాలెంలో ఘనమైన సన్మానం చేయాలని, ప్రయాణం కొంచెం కష్టమైనా వచ్చి తీరాలని మనసారా కోరుకుంటున్నారు.

*

ఆ(ఫ్టాల్ అభిమానికి ఉత్తరం రాయడానికే అంత రాద్ధాంతం చేసిన పతంజలి సన్మానం అంటే వస్తాడా? ఆలోచనలో పడ్డ కృష్ణారావ్ అతన్నెలా ఒప్పించాలా అని తెగ సతమతమవుతూ సాయంత్రం వరకూ గడిపాడు.

ఎంత ఆలోచించినా ఎలాంటి చిట్కా దొరకలేదు. ప్రయత్నించి చూద్దాం- అని బయలుదేరాడు లోపలికి.

డ్రాయింగ్‌రూమ్‌లో టీవీ చూస్తున్నాడు పతంజలి. వార్తలొస్తున్నాయి. చదువుతున్న అమ్మాయి చంద్ర కాంత అంత అందంగా ఉందిగానీ ఒకటే లోపం. ముఖానికి బొట్టు లేదు. క్రిష్టియన్ అనుకుంటాను. అని పెద్ద బొట్టు(స్టిక్కర్) ఒకటి తెచ్చి టీవీ స్క్రీన్ మీద ఆమె నుదుట భాగాన అంటించి అప్పుడు సంతృప్తిపడి మరీ వార్తలు చూడ్డంలో లీనమవుతున్నాడు పతంజలి.

ఇంతలో ఉత్తరాల కట్టతో ప్రత్యక్షమయ్యాడు కృష్ణారావ్.

అయిష్టంగా వాటిని చూసిన పతంజలిని పట్టించుకోకుండా సర్వం చదివి వినిపించాడు కృష్ణారావు.

విన్న పతంజలి ముఖంలో తమాషా అయిన కాంతిరేఖ ఒకటి మెరిసింది.

"ఇవన్నీ నాకెందుకు వినిపించినట్టు?"

"మీ కొచ్చిన ఉత్తరాలు."

"ఎప్పుడూ వస్తుంటాయి గదా. ఏనాడూ లేనిది ఈనాడు నా దగ్గరికి పట్టుకొచ్చి ఎందుకు వినిపించినట్టు?"

"ఎవరైనా ఒక పాపులర్ స్టార్ మార్కెట్లో ఉంటే ప్రతి ఊళ్ళోనూ, కిళ్ళీకొట్టు వాడూ, చిన్న ఫ్యాన్సీ షాపువాడు ఫాన్స్ అసోసియేషన్ అని లెటర్ పేడ్ వేయించి ఉత్తరాలు రాసేస్తుంటారు. ఫొటోలు పంపించమని కోరు తుంటారు. ఇవి అలాంటి వాళ్ళు రాసిన ఉత్తరాలు కాదు. ఒక దర్శకుడి సినిమాని మూకుమ్మడిగా చూసి స్పందించి రాసినవి. వీటిలో భాషాదోషాలుండొచ్చు. భావాలు మాత్రం స్పష్టంగా ఉన్నాయి."

"ఇంతకీ ఏమంటావ్? వీళ్ళందరికీ నేనే స్వయంగా జవాబులు రాయాలంటావా?"

"వాళ్ళు చెయ్యబోయే సన్మానానికి మీరు అటెండ్ కావాలంటాను."

"అవును సార్! ఎక్కడో కుగ్రామంలో ఉన్న జనం మనసుల్నీ ఒక్క సినిమాతో మీరు దోచేసుకోవటమన్నది సామాన్యమైన విషయం కాదు. ఎవరికైనా చెప్పినా నమ్మదగని విషయం. సార్ ఇది ఆస్కార్ రావటం కంటే గొప్ప విషయం ,కేన్స్ ఫిలిం ఫెస్టివల్‌లో మీ ఫిల్మ్ సెలక్టవడం, అవార్డ్ రావటం కంటే గొప్ప విషయం. ఈ విషయం పక్కన పెడితే, గ్రామీణ వాతావరణంలో మీరు తియ్యబోయే సినిమా కథకి సంబంధించి ఈ ట్రిప్ మీకు బాగా ఉపయోగపడ్తుంది."

సెక్రటరీ కృష్ణారావు చెప్పే ప్రతి మాటా సబబుగా వుండటమే కాకుండా సత్యంలా, అన్పించడంతో మరేం ఆలోచించకుండా సరే అనేశాడు పతంజలి.

*





సెంట్రల్ స్టేషన్లో రాత్రి పదిన్నరకి బయల్దేరాల్సిన హౌరా మెయిలు గంట లేటుగా బయల్దేరింది. ఏ.సీ. ఫస్ట్‌క్లాస్‌లో కూర్చున్న పతంజలి హమ్మయ్య అనుకున్నాడు. అంతసేపూ డిమ్‌గా వెలిగిన బల్బుల్లో కాంతి రెండు రెట్లు పెరిగింది. అప్పుడు చూశాడు తను కూర్చున్న సీట్‌కేసి- గ్రే కలర్ రెగ్జిన్ క్లాత్‌తో కుట్టిన ఆ సీట్లు వెడల్పయిన టేకు చెక్కలంత గట్టిగా వున్నాయి. వాటి మూలలూ, అంచులూ దుమ్ముతో నిండి అట్టగట్టుకుపోయున్నాయి. స్విచ్‌బోర్డ్ కింద ఫిక్స్ చేస్తున్న యాష్ ట్రే సిగరెట్ పీకల్తో నిండిపోయి ఉంది. వాటికేసి అసహ్యంగా చూసిన పతంజలి లేచి బాత్‌రూమ్ వేపెళ్ళాడు.

తలుపు తెరవగానే వాసన- గిజాటుగా ఉంది. మకిలి పట్టేసి ఉన్న స్టీల్ వాష్‌బేసిన్ పైనున్న టాప్ బలంగా ప్రెస్ చేసేసరికి ఎర్రటి నీళ్ళు ఫోర్స్‌డ్‌గా బయటికొచ్చాయి. ముఖం చేతులూ కడుక్కుందామనుకున్నవాడల్లా ముక్కు మూసుకు మరీ కూపేలో కొచ్చేశాడు.

ముఖం ఇబ్బందిగా పెడ్తూ సీట్లో కూర్చుని “నీళ్ళున్నాయా?” అన్నాడు.

స్టేషన్లో కొన్న పాండిచ్చేరి మినరల్ వాటర్ బాటిల్‌ని అందించాడు కృష్ణారావ్.

“యూరప్‌లో ఇలాంటి ట్రైన్స్ ఎంత శుభ్రంగా ఉంటాయో తెల్సా?” తాగిన నీళ్ళ సీసాని తిరిగి అందిస్తూ అన్నాడు పతంజలి.

తెలియదన్నట్టు చూశాడు కృష్ణారావ్.

“అక్కడే హాయిగా కాపురం చెయ్యొచ్చన్నంత పరిశుభ్రంగా ఉంటాయి ఫ్లాట్‌ఫారాలు. ఆగి వున్న ట్రైన్ కంపార్ట్‌మెంట్‌లోకి ఎక్కామో లేదో చాలా కాస్ట్‌లీ పెర్‌ఫ్యూమ్ వాసన ఆహ్లాదపరుస్తుంది. దివాన్ కాట్స్‌లా వున్న సీట్ల మీద గ్రే కలర్ వేసున్న రైలు పెట్టె గోడలు చేయబడి వున్నాయి.

“కూర్చున్న వాళ్ళకి ఏ నొప్పి తగలకుండా స్మూత్ జర్క్‌తో కదిలే ట్రైన్ కొన్ని క్షణాల్లోనే మన విమానాల స్పీడు అందుకుంటుంది. గులాబీరంగు డ్రెస్ వేసుకొచ్చే హోస్టెస్‌లు ఆరెంజ్ జ్యూసు అందించి ఏ రకంగా బ్రేక్‌ఫాస్ట్ కావాలో తెలుసుకుని నమ్రతగా నిష్క్రమిస్తారు.”

తలొంచుకున్న కృష్ణారావ్ “సారీ, సర్! మనం వెళ్ళే ప్రాంతానికి ఫ్లైట్ సర్వీస్ లేదు” అన్నాడు.

“ఫ్లైట్ గురించి కాదు. మనుషులు శుభ్రంగా వుంటే పరిసరాలు కూడా పరిశుభ్రంగా ఉంటాయి. ఆ మనిషే శుభ్రంగా వుండాలంటే వాడికి కొంత జ్ఞానం కావాలి. అదే ఉంటే కళాత్మకమైన జ్ఞానం పుడుతుంది. ఇవన్నీ మనిషిలో మూర్తీభవించాలంటే వెనకటికి నేను చెప్పానే ఆ స్టడీ కావాలి అని చెప్పిందే ఎన్నిసార్లు చెప్పించుకుంటావ్ నా చేత” అంటూ ఆర్టిస్టిక్ లైఫ్ గురించి, భావుకత గురించి చాలాసేపు మాట్లాడిన పతంజలి చాలా ఆలస్యంగా నిద్రపోయాడా రాత్రి.

*

ఉదయం పదిన్నరకి రాజమండ్రిలో ఆగింది మెయిల్.

పరికిస్తూ వికారంగా ముఖం పెట్టి చూస్తుండగా దిగిపోయారు పదిహేనుమంది జనం... అందరి చేతుల్లోనూ పూలదండలున్నాయి.

లాల్చీ పైజామా వేసుకుని నల్లగా, పొడుగ్గా వున్న బక్క పల్చని యువకుడు పతంజలినే రెప్పార్పకుండా చూస్తూ పెద్ద దండని పతంజలి మెళ్ళో వేసేసి సాష్టాంగపడిపోయాడు. "మనం బయల్దేరదామా! మనం మారాల్సిన ఆ పాసింజరు ఏ ప్లాట్‌ఫారంలో ఆగుతుంది" అన్నాడు ఇంకో మనిషి.

అసలే అంతులేని విసుగూ, వికారాల్తో వున్న పతంజలి మళ్ళీ పాసింజరేంటని అడుగుతుంటే మధ్యలో కొచ్చిన నారాయణరావు "మన్నించండి ఈ మెయిలు మా బలభద్రపురం స్టేషన్లో ఆగదండి" అంటుండగా ఆ జనం మధ్యలో ఉన్న ఒక మనిషి "మనం ఎక్కాల్సిన పాసింజరు బండి పక్క ప్లాట్‌ఫారం మీదుంది. సిగ్నలిచ్చేశారు..." రామభక్తుడైన ఆంజనేయస్వామిలా పతంజలి కాళ్ళ దగ్గరే కూర్చున్న నారాయణరావు తన ఆరాధ్యదైవమైన ఆ సినిమా దర్శకుడి నోట్లోంచి ఏ పలుకైనా బయటపడ్తుందేమోనని అల్లనేరేడు కాయల్లాంటి తన కళ్ళతో ఆత్రంగా చూస్తున్నాడు.

పతంజలి ఎవరికేసి మాత్రం చూడ్డం లేదు. శారీరకంగానూ, మానసికంగానూ, ఎంతో అందమైన యువకుడూ, భావుకుడు అయిన ఆ చలనచిత్ర దర్శకుడు ఈ లోకంలో లేడు. శీతవేళలో చందన పరిమళాల్ని ప్రసరించే ఒక సుమధురమూ, సుందరమూ అయిన లోకంలో ప్రయాణం చేస్తున్నాడు.

ఎటు చూసినా పచ్చని పైరులతో నిండిన వేలాది ఎకరాల పంట పొలాలు వాటి అంతమెక్కడో చూద్దామన్నా కంటి కందనంత విస్తీర్ణంగా పరుచుకుపోయి ఉన్నాయి. వాటి మధ్యలో పచ్చని ఆ భూదేవి తీసుకున్న పాపిట రైలు పట్టాలు. నలుపూ, మధ్యమధ్యలో నీలం పొగల్ని వదిలే రైలింజను తెల్లటి పాలరంగు వేసిన భోగీల్ని లాక్కుని వెళ్తోంది. లోపలి గోడలకి, మొట్టమొదటిసారిగా స్త్రీకి చారెడు కళ్ళని చిత్రించిన బెంగాలీ చిత్రకారుడు జెమినీరాయ్ చిత్రాలూ, రాజా రవివర్మ పెయింటింగులూ, బాపూ వర్ణచిత్రాలు వేలాడుతున్నాయి. ఎలాంటి మరకలూ లేని బూరుగుదూది పరుపులతో కుట్టి వున్న సీట్లు కునేగా మరికుళందు పరిమళాల్ని వెదజల్లుతున్నాయి. ఒక పరుపు మీద కూర్చున్న మహా గాయకుడైన గులామ్ ఆలీ పరుగెట్టే బండిలోంచి పుడ్తున్న తాలంలో ఊచల కిటికీలోంచి చూస్తున్న గాలి కెరటాలు చూపించే శృతి సాయంతో మేఘమల్హార్ రాగంలో ముషాయిరాల్ని గానం చేస్తున్నాడు.

ఆ గాయకుడికి ఎదురు పరుపు మీద కూర్చున్న పతంజలి అంజలి ఘటిస్తూ ఆస్వాదిస్తున్నాడు. వేగం తగ్గిన పొగబండి ఒక స్టేషన్లో ఆగేసరికి కిటికిలోంచి తిరిగి చూశాడు. ముదురు పచ్చని మామిడితోటల మధ్య బొమ్మరిల్లులా ఉందా స్టేషన్. పరిశుభ్రానికి నిర్వచనంలా ఉన్న ప్లాట్‌ఫారం మీద తెల్లటి యూనిఫాం వేసుకున్న నల్లటి స్టేషన్ మాస్టర్ శుక్లపక్ష చంద్రుళ్ళా నవ్వుతూ చేతిలో పచ్చజెండా ఊపేలోపు ఆమ్రపాలి లాంటి అందమైన వస్త్రాలు రకరకాల రంగుల్లో మెరిసిపోతున్నాయి.







ఆ జవ్వనులు అల్లుకున్న పొడుగాటి జడల చివర జల జలా మోగుతున్నాయి. గంటలు, వాళ్ళ జడపాయల మధ్యన ఇమిడిన బంతిపూలు సూర్యుడ్నించి తెంచుకొచ్చి తగిలించు కున్నట్టున్నాయ్. కాళ్ళకున్న వెండిమువ్వలు శృతిబద్ధంగా నిర్మించినట్టున్నాయ్. మొత్తంగా చూస్తే దేవకన్యలు మానవ రూపాలు ధరించి దర్శన మిస్తున్నట్టున్నారు.

వాళ్ళు లోపలికొచ్చారో, లేదో స్టేషన్ని మూసేసి ఉన్న మామిడితోటలో చిలకలూ, కోకిలలూ వేలాది సంఖ్యలో వచ్చి మూగాయా బోగీలో.

బలభద్రపురంలో బండి ఆగింది.

అందరితో పాటు రైలు దిగిన పతంజలి ప్లాట్‌ఫారం కూడా లేని ఆ చిన్న స్టేషన్ని చూస్తున్నాడు.

"ఇక్కడ్నుంచి మీ ఊరెళ్ళడానికి టేక్సీ ఏమన్నా ఏరేంజ్ చేశారా?" అడుగుతున్నాడు కృష్ణారావ్.

"క్షమించండి సార్! ఈ మారుమూల అలాంటివేం దొరకవండి" దాదాపు పతంజలిని అంటుకుపోయి నిలబడ్డ నారాయణరావు నమ్రతగా అన్నాడు.

"మరెలాగా వెళ్ళడం?"

"కాస్సేపట్లో రాజానగరం బస్సు వచ్చేస్తదండి. అందాకా గురువుగారు స్టేషన్ మాస్టరుగారి క్వార్టర్స్‌లో విశ్రాంతి తీసుకోవడానికి పర్మిషన్ తీసుకున్నానండి."

పతంజలి కేసి చూడ్డానికే భయపడ్తున్న కృష్ణారావు అతని ముందుకొచ్చి తలొంచుకుని నిలబడి "అక్కడ కట వెళ్దామా సార్!" అన్నాడు.

ఏ జవాబు ఇవ్వక పతంజలి నిలబడి వున్నాడు.

ఓ అరగంట కాలం గడిచాక హారన్ మోగించుకుంటూ రైలు పట్టాల్ని క్రాస్ చేసుకుంటూ వచ్చాగింది బస్సు.

బాగా దుమ్ము పట్టేసి ఉన్న ఆ ఎర్రరంగు డొక్కు బస్సు కాస్త ఖాళీగానే ఉండటంతో కండక్టర్ని బతిమలాడి

మధ్యలో ఉన్న సీటు మొత్తం పతంజలి, కృష్ణారావు తప్ప ఇంకో ప్రయాణీకుడెవ్వడూ కూర్చోకుండా ఏర్పాటు చేశారు నారాయణరావు సహచరులు.

లోపలికెక్కి కూర్చున్న పతంజలి ఆ బస్సు లోపలంతా పరిశీలించడం మొదలెట్టాడు మళ్ళీ. ముదురు నీలం రంగు రెగ్జిన్ సీట్లన్నీ చిరిగిపోయి కొబ్బరిపీచు బయటికొచ్చేస్తూ కన్పించాయి. బస్సు బాడీ కట్టిన కొత్తలో వేసుంటారు ఆలీవ్‌గ్రీన్ పెయింట్. అదిప్పుడు పెచ్చులూడిపోతూ రేకులకి పట్టిన తుప్పు కూర్చున్న వాళ్ళ నెత్తిమీద రాలుతూ ఉంది.

డ్రైవర్ సీటుపైన పటాలూ, వాటి ఫ్రేముల మూలల గుచ్చి వెలుగుతున్న అగరవత్తులూ కనిపించాయి.

వేగంగా ముందుకెళ్తోంది బస్సు.

చాలా గంటల తర్వాత నెమ్మదిగా నోరు విప్పిన పతంజలి అన్నాడు కృష్ణారావ్‌తో.

"ఏంటి సార్ అది!"

"ఇంతకుముందు చెప్పిందే."

"మళ్ళీ చెప్పండి సార్" వింటాను అనడంతో మళ్ళీ మొదలెట్టాడు పతంజలి.

"పరిశుభ్రమైన ఆలోచనలు మనిషిలో ఉంటే దానితో మన చుట్టూ ఉన్న వాతావరణాన్ని శుభ్రపరుస్తాడు. శుభ్రం లోంచే అభిరుచి ఏర్పడుతుంది. అభిరుచే ఊహాలోకాల్లోకి తీసుకెళుతుంది. అదే భావుకత. అతనే భావుకుడు. ఇది నేను నమ్మిన సత్యం. నువ్వు పెట్టిన ఈ ప్రయాణంలో నేను చూస్తున్న చేదు అనుభవాలు నన్నూ, నా సత్యాన్ని కఠిన సత్యాన్ని చేశాయి. నిజం, క్రిష్ణారావ్, ప్రతి మనిషి ఒక భావుకుడిగా మారాలంటే నాలా చాలా ఉద్గ్రంధాల్ని, నాలా సంగీతాన్ని, నాలా మహానుభావుల జీవిత చరిత్రల్ని చదివి, విని, పరిశీలించి పునీతం కావాలి. అప్పుడుగానీ మనిషి భావుకుడు కాలేడు. ఈ ప్రపంచాన్ని గొప్ప భావనా ప్రపంచం చెయ్యలేడు" ముగించాడు పతంజలి.

"మీలా స్టడీ చేస్తే తప్ప ఈ నాగరిక ప్రపంచంలో భావుకుడు అనేవాడు పుట్టడంటారా, సార్!" కృష్ణారావ్ బలంగా వేసిన ప్రశ్నకి,

"పుట్టడు గాక పుట్టడు" అన్నాడు పతంజలి.

*

ఎర్రకంకర దుమ్ము లేపుకుంటూ ఆగింది డొక్కుబస్సు.

అదంతా చేగల్నాడు ప్రాంతం.

ఎప్పట్లాగే చుట్టూ ఉన్న జనానికి కాస్త దూరంగా వెళ్ళి నిలబడి తన తలని మూడువందల అరవై డిగ్రీలూ తిప్పి చూసిన పతంజలికి సన్నటి మట్టిరోడ్డు తప్ప ఊరు అనేది కనుచూపు మేరలో కనిపించలేదు

అలా చూస్తూనే ఉన్న అతని దగ్గరకి పరిగెట్టుకుంటూ వచ్చిన నారాయణరావు. "ఈ మట్టిరోడ్డమ్మట మూడు మైళ్ళు వెళ్తే మన ఊరు వచ్చేస్తుంది గురువుగారూ! మిమ్మల్ని చాలా శ్రమ పెడ్తున్నందుకు మమ్మల్ని మన్నించాలి" అంటూ పతంజలి కాళ్ళమీద పడ్డ అతన్ని పైకి లేపిన కృష్ణారావు,





"మూడు మైళ్ళూ నడిచే వెళ్ళాలా?" అంటుండగా వచ్చి ఆగిందొక రిక్షా.

చెప్పులు లేకపోయినా చాలా పరిశుభ్రంగా ఉన్నాయి కాళ్ళు. చలువ చేయించి కట్టుకొన్న ఖాకీ నిక్కరూ మోచేతుల దాకా మడతపెట్టిన రంగు వెలసిన గళ్ళచొక్కా, నున్నగా గీసుకున్న గడ్డం, నూనె రాసుకుని దువ్వెనతో చక్కగా దువ్వుకున్న క్రాఫ్‌తో వున్నాడా రిక్షావాడు.

పరిగెట్టుకుంటూ వాడి దగ్గరకెళ్ళిన నారాయణరావు, "గురువుగారలా ఎండలో మండిపోతుంటే బొమ్మలా నిలబడి చూస్తావేంట్రా... వెళ్ళు, సామాన్లు పెట్టి దొరగార్ని సీట్లో కూర్చోబెట్టు" అని కసిరేసి మళ్ళీ పరిగెట్టుకుంటూ పతంజలి దగ్గరకొచ్చేసి, "వీడి పేరు గోపాలం సార్! మా ఊరు దాటి ఎరగడు. ఆ రిక్షా వీడి సొంతమేనండి. బండికి చిన్న రిపేరొస్తే చాలండి... దాన్ని బాగు చేసే దాకా బయటకు తియ్యడండి. ఆ డొక్కు రిక్షాకున్న రంగులు, దానికి ముందూ వెనకా ఉండే అక్షరాలు కూడా వీడు రాసుకున్నవేనండి. ఎప్పుడూ ఏదో ఆలోచిస్తూ ఉంటాడండి. మూడ్ బాగుంటేనే బేరం కడతాడండి. వీడు రాని రోజు బస్సు దిగి ఊళ్ళో కెళ్ళే మాలాంటోళ్ళకి నరకమేనండి మరి. దయచేసి తమరీ రిక్షాలో ఎక్కి కూర్చుంటే క్షణాల్లో లాగించేస్తాడండి."

ఖరీదైన సూట్‌కేసును రిక్షాలో పెట్టిన గోపాలం తన బండిని పతంజలి దగ్గరకు లాక్కొచ్చినప్పుడు అతని శిరస్సు నుంచి శిరిపాదం వరకూ పరిశీలించి చూసిన పతంజలికి ఎంత స్వచ్ఛంగా వున్నాడీ మనిషి అనిపించింది. రిక్షా సీట్లో కూర్చుని కాళ్ళు పెట్టుకునే చోట్లో రెండు పెద్ద సూట్‌కేసులుండడంతో సీట్లో కూర్చున్నా కాళ్ళు పెట్టుకోవడం ఇబ్బందనిపించిన కృష్ణారావు పతంజలితో అన్నాడు "మీరా సీట్లో కూర్చుని కాళ్ళు పెట్టుకో డానికి చోటులేక అవస్థపడ్తూ ఆ గతుకుల కంకర రోడ్లో ప్రయాణం చేసే కంటే మన కూడా ఉన్న వీళ్ళతో పాటు నడిచెళ్తేనే బాగుంటుందేమో సార్! ఈ రిక్షావాడ్ని సామాన్లతో ముందెళ్ళిపొమ్మని చెబుదాం" అన్నాడు.

సరే అని పతంజలి అనడంతో గోపాలం దగ్గరకొచ్చిన కృష్ణారావ్ "లగేజీతో నువ్వు పద. మేం వీళ్ళతో కలిసొస్తాం" అన్నాడు.

సరే అని రిక్షా ఎక్కిన గోపాలం గంధంవారిపాలేం వేపు నడుస్తున్న వాళ్ళని క్రాస్ చేసుకు వెళ్తుండగా కాకతాళీయంగా ఆ రిక్షా వెనుక సైన్ బోర్డ్ మీద రాసి వున్న ఆ వాక్యం మీద పడ్డాయి పతంజలి కళ్ళు. అది చదివిన అతడు, ఏదో మహాశక్తి ఆజ్ఞాపించినట్టు హఠాత్తుగా ఆగిపోయాడు. అతన్తోపాటు ఆగిపోయిన కృష్ణారావు కూడా చదివాడా వాక్యం.

ఆ రిక్షావాడు తన రిక్షా సైన్ బోర్డ్ మీద రాసుకున్న ఆ వాక్యం-

'ఆనాటి వానచినుకులు.'

ప్రాణమున్న శిల్పంలా నిలబడిపోయిన పతంజలి శరీరమంతా స్వేదంతో నిండిపోతూంది. దగ్ధమవుతున్న దండకారణ్యంలోంచి వీచే సెగల్లా ముక్కులోంచి వస్తున్నాయి ఆవిర్లు.

పెనుతుఫానుకి పరమేశ్వరుడి గుళ్ళో కంచు గంటల్లా కొట్టుకుంటున్నాయి. ఆ మండుటెండలో సైతం చల్లగా చల్లబడుతున్నాయతని కాళ్ళూ, చేతులూ.

మెదడులో నరాలు మొత్తం మెలి తిరుగుతున్నాయి చిత్రవిచిత్రంగా.

సొమ్మసిల్లి పడిపోతున్న అతన్ని దగ్గర్లో వున్న ముంతమామిడి చెట్టు నీడలో పడుకోబెట్టారు. కాస్సేపయింది.

సొమ్మసిల్లి పడిపోయిన అతను అతి నెమ్మదిగా పైకిలేచి తనలో తను మాత్రమే గొణుక్కుంటున్నాడు. ఆ భాషలో భావాలు భాస్వరంలా వెలుగుతున్నాయి.

ఏ ప్రేయిసి కరుణిస్తే హర్షించాయో ఆ వాన చినుకులు. ఏ ప్రేయసి మరణిస్తే వర్షించాయో ఆ వాక్యాలు. ఏ ఊర్వశి నిర్దయతో నిందిస్తే నిర్మించబడ్డాయో ఆ వాన చినుకులు. ప్రకృతి పరవశించినప్పుడా? విరహం వికటించినప్పుడా? గజ్జెలు కట్టిన లేగదూడ ఘలం ఘలించినప్పుడా?

ఆనాటి వానచినుకులు- ఎన్ని అర్థాలు నిక్షిప్తమై ఉన్నాయి ఆ వాక్యంలో. ఎంతమంది బైరన్‌లూ, కృష్ణ శాస్త్రులూ దాక్కుని ఉన్నారు ఆ వాక్యంలో... ఈ మారుమూలనున్న ఒక అజ్ఞాని గుండెల్లోంచి వెచ్చగా వెలుపలి కొచ్చిందా వాక్యం.

తనలో తనే స్వగతంగా అనుకుంటున్న మాటలు- పతంజలికి అతి చేరువగా కూర్చున్న కృష్ణారావుకి స్పష్టంగా వినిపించాయి.

అవి-

"అబద్ధం...అంతా అబద్ధం."

"ఒక మనిషి భావుకుడు కావాలంటే ఏవీ చదవక్కర్లేదు నాలాగ.. ఏదీ వినక్కర్లేదు... నాలాగా... మరేదీ పరిశీలించక్కర్లేదు నాలాగా...

"భావుకుడు తయారుకాడు, జన్మిస్తాడు, మనిషిలో స్పందన.

"ప్రకృతిలోంచి ఘనీభవించిన ఆ స్పందన జ్ఞానం.

"అది...

అదే ఉంటే భావుకత అనాలి. మహానగరం మధ్యలోనే కాదు. మహారణ్యం మధ్య కూడా జన్మిస్తుందనే సత్యాన్ని ఇప్పుడే తెల్సుకున్నాను. నిత్యమైన, సత్యమైన భావుకుడ్ని నేను కాదు... ఆ రిక్షా గోపాలం, ఎన్నో ఏళ్ళుగా అంతులేని అహంకారంతో సత్యం అని నమ్మిన ఒక అసంబద్ధాన్ని ఈ క్షణంలో ఇక్కడ సమాధి చేస్తున్నాను."

*స్వాతి సపరివారపత్రిక, 1996*







# సీతారామ లాంచీ సర్వీస్ రాజమండ్రి



అది నిండు పున్నమి రాతిరి.

అది పండు వెన్నెల జాబిలి.

ఆ రావిచెట్టు కింద పూసిన వెన్నెల మరకల్లో ఆడుకొంటున్నారు అందమైన ఆడపిల్లలు. ఆ చెట్టునే ఆన్చి ఉన్న కన్నె గోదావరి ఆడపిల్లల్ని చూసి పరమానంద పడిపోయి అలని ఆకాశం ఎత్తుకి లేపితే వచ్చిన చప్పుడుతో హాయి... హాయిగా పలకరించింది.

ఆ అందమైన పలకరింపుకి ఉబ్బి తబ్బిబ్బైపోయారు వాళ్ళు. దూసుకుంటా మెలికలు తిరుగుతా వాళ్ళ వేపొస్తున్న ఆ కన్నె గోదావరి వయ్యారాలు చూసి పులకించిపోయారు.



ఆ తర్వాత సుడిగుండాలుండే పాపికొండల వేపు నడుస్తుంటే అందంగా పిల్చిన అమ్మ గోదావరి ఆప్తంగా పలకరించేసరికి గోరుముద్దలు చేసి కలిపి తినిపించిన అమ్మలు, లాలపోసి గుండెలకి హద్దుకుంటా పూసల ఉయ్యాల్లో పడుకోబెట్టిన అమ్మలు గుర్తుకొచ్చారు. ఆ తల్లికి మనసారా దణ్ణమెట్టుకొని ఆడతా పాడతా చిల్లో బొల్లోమంటా సందళ్ళు చేసుకుంటా ముందుకెళ్తుంటే కొండల మలుపుల్లో ఇసక తిప్పల దగ్గర ముద్దుగా పలకరించింది చెల్లి గోదావరి. అత్తింటి నుంచి పండక్కి పుట్టింటికెళ్తే చిట్టిచెల్లెలు పలకరింపులాగుందా పలకరింపు.

దాంతో వాళ్ళ కళ్ళల్లో మతాబాల్లోంచి చిమ్మిన వెండిపువ్వుల్లాంటి మెరుపులు. ఝూమ్మంటూ వీస్తుంది అల్లరి గాలి. ఆకాశం నిండా కోటి వెలుగుల చంద్రుడు. ఇసక దిబ్బల మీదున్న ఆకు సంపంగి చెట్ల నీడల్లో నడుస్తున్న వాళ్ళు ఒక్కసారి ఆగిపోయి తలలెత్తి చూశారు.

అలల నురుగుల్తో అమాయకంగా నవ్వుతా బాల గోదావరి. వెన్నెల్లో పూసిన నందివర్ధనం పువ్వు లాంటి ఆ బుల్లి గోదావరి నవ్వు ఒక్కసారి చిన్నప్పటి రోజుల్లోకి లాక్కెళ్ళిపోతుంది.

ఈ అందమైన అనుభవాల్ని ఈ జ్ఞాపకాల్ని ఆ జిలుగు వెన్నెల్లో అడివి మల్లెపూలల్లో కలగలిపి చల్లటి నీళ్ళలో తడిపిన తెల్లటి మెట్టూరు మల్లుగుడ్డలో మూటగట్టి పది యుగాల పాటు దాచుకుందామనుకుంటా వెదురుపొదల్లోంచి నడుచుకుంటా వెన్నెల్లో ఆడుకుంటున్న నెమళ్ళ కంఠాన్ని ముద్దు పెట్టుకొన్నారు. తెల్లటి కుందేళ్ళతోనూ వెన్నముద్దల్లాంటి పావురాళ్ళతోనూ తెగ ఆడుకుంటా ఆ ఇసకలో ఎగిరెగిరి గంతులేస్తున్నారా వెన్నెల్లో ఆడపిల్లలు.

"రాజమండ్రి వచ్చింది గీతా," అంటా జబ్బ మీద చెయ్యేసి మెల్లగా కుదిపాడు హరికృష్ణ.

ముఖం నిండా కలల్తో ఆవులిస్తా లేచింది విమలగీత.

ఇంకా తెలవారలేదు. చీకటలాగే ఉంది. ఏ చప్పుడూ లేదా రాజమండ్రి రైల్వేస్టేషన్లో. చడీచప్పుడు చెయ్యకుండా ప్లాట్‌ఫారం మీదకొచ్చాగింది గౌతమీ ఎక్స్‌ప్రెస్.

దాంట్లోంచి దిగిన కొత్త దంపతులు విమలగీత, హరికృష్ణ ఆటో మాట్లాడుకొని శ్రద్ధానందఘాట్ రేవులో కెళ్ళేసరికి ఒకటే జనం. వాళ్ళ వెనకాల నీళ్ళల్లో తేలతా రకరకాల లాంచీలు. హరికృష్ణ, గీతల చుట్టూ మూగిన జనం, 'లాంచీ కావాలాండీ... పట్టిసీమ దాకానా... పాపికొండల దాకానా?' అంటున్నారు.

అలా అడుగుతున్న అందరిలోకీ నల్లటి కళ్ళద్దాలెట్టుకొని, మెళ్ళో పులిగోరు పతకం వేసుకొని, బుంగ మీసాల్తో ముఖం నిండా నవ్వుతో ఉన్న సీతారామా లాంచీ ఓనరైన పట్టిసీమ మాణిక్యంగారు బాగా నచ్చాడు విమలగీతకి. కాకీ నిక్కరూ, ఓపెన్ షర్టూ, కాస్త పొట్టిగా ఉన్న అతన్తో, "చూడండి, మూడు రాత్రులు, నాలుగు పగళ్ళూ మీ లాంచీ కావాలి. అంటే నాలుగు రోజులనుకోండి. ఈ నాలుగు రోజులూ మా ఇద్దరి భోజనాలు, రాత్రుళ్ళు నిద్ర మీ లాంచీలోనే. అసలు లాంచీ దిగం. ఈ దిగువ నుంచి ఆ ఎగువదాకా మేమెక్కడికి తిప్పమంటే అక్కడికి తిప్పుతూనే ఉండాలి. అన్నీ కలుపుకొని చెప్పండి రోజుకెంత కావాలో," అన్నాడు హరికృష్ణ.

కాస్సేపు ఆలోచించుకొన్న పట్టిసీమ మాణిక్యం, "నీళ్ళల్లో ఒక లీటరు డీసెలుకి ఒక మైలు మాత్రమే వెళ్ళద్దండి లాంచీ. తవరు చెప్పిన ప్రెకారం తిరగాలంటే రోజుకి వంద లీటర్ల డీజిలవ్వద్దండి. ఇక లాంచీ అద్దె, బోజనాలు అటికీ కలుపుకొని రోజుకి ఎనిమిది వేలేసుకోండి," అన్నాడు.

"ఎనిమిది కాదు, పదిహేను తీసుకోండి. నాలుగు రోజులకీ కలిపి అరవై వేలు," అని లెక్కెట్టి ఒక కట్ట మాణిక్యం చేతికందిస్తా ఉంటే మాణిక్యం, అతని లాంచీ స్టాఫూ మతోయినోళ్ళలా చూస్తా ఉండిపోయారు.

"ఈళ్ళెవరో ఆషామాషీ మనుషులు గాదు చాలా నికార్సయినోళ్ళు లాగున్నార్రోయ్," అని గుసగుసలాడు కోవడం మొదలెట్టారు.

లాంచీ ఇంజను పక్కనున్న కేబిన్ రూము అర్జెంటుగా శుభ్రం చేయించి వాళ్ళ సామాన్లు అందులో సర్దించిన మాణిక్యం ఇద్దరు కళాసీల్ని దగ్గర్లో తనకి తెల్సున్న రామదుర్గా లాడ్జికి పంపించి నాలుగు పరుపులూ, చలవ చేసిన దుప్పట్లూ తెప్పించి రూమ్‌లో పరిచాక, "ఇక తమరు లోపలికి రాండి. ఈ నాలుగురోజులూ ఈ కేబిన్ రూము తమదేనండి," అన్నాడు మాణిక్యంగారు.

"మరి లాగించెయ్యమంటారా సారుగారూ?" అడిగాడు సరంగు.

"అలాగే," అని హరికృష్ణ అనడంతో పడిచెక్క మీంచి ఒడ్డుకేసిన బల్లలాగేసి, లంగరెత్తి ఒడ్డునున్న తాడు తప్పించాడు కళాసీ. అది చూసి బెల్ కొట్టాడు ఇంకో సరంగు. లేలాండ్ ఇంజను స్టార్ట్ చేసిన డ్రైవరు ఫస్టు గేరేసేసరికి నీళ్ళలో పంకా తిరగడం, నెమ్మదిగా లాంచీ కదలడం మొదలెట్టాయి.

లాంచీ టాపెక్కి డోరియా రేకు మీద నిలబడ్డ ఇద్దరూ ఆ నవంబరు చలిని హాయిగా అనుభవిస్తా మబ్బుల్లోంచొస్తున్న వడ్లమూడి నారింజపండు రంగు సూర్యుణ్ణి ఇష్టంగా చూస్తున్నారు. అంతలో వాళ్ళిద్దరి దగ్గరకొచ్చిన పట్టిసీమ మాణిక్యం, "చూస్తుంటే కొత్తగా పెళ్ళయిన దంపతుల్లాగున్నారండి," అన్నాడు.

"అవును... హనీమూన్ కొచ్చాం... ఈ శీతాకాలం నాలుగురోజులే కాకుండా వేసవి కాలంలో నాలుగు రోజులూ... వర్షాకాలంలో నాలుగురోజులూ కూడా వస్తాం," అన్నాడు హరికృష్ణ.

"చాలా సంతోషమండి... వచ్చిన ప్రతిసారీ మా లాంచీలోనే ప్రయాణం చెయ్యాలి తవరు..." అంటా గోదావరికి కుడిపక్కన కనిపిస్తున్న పేపరుమిల్లునీ అది దాటాకా వచ్చే కోటిలింగాల రేవునీ చూపిస్తా వివరిస్తున్నాడు పట్టిసీమ మాణిక్యంగారు.

భార్య గీతవేపు చూస్తా, "ఆ రేవులో కోటిలింగాలు ఉండేవంట ఒకప్పుడు. వరద గోదావరి ఒకోసారి ఒకో లింగాన్ని తన గర్భంలో కలిపేసుకుందంట. అలా ఆ కోటిలింగాల్నీ తనలో దాచేసుకొన్న గోదావరి ఒక్క లింగాన్ని మట్టుకి వదిలేసిందంట. ఆ లింగమే కందుకూరి వీరేశలింగవంట..."

"నిజవా???" విస్తుపోతా అంది విమలగీత.

"ఒక పాటలో ఆరుద్రగారు రాశారు," అన్నాడతను.

"అద్భుతమైన కాయినింగ్," గోదారంతా వినబడేలాగ చప్పట్లు కొట్టింది గీత.

హరికృష్ణ, గీతల మాటలు ఏమాత్రం అర్థంగాని పట్టిసీమ మాణిక్యం వాళ్ళ మధ్యలోకి దూరిపోయి చెప్పడం మొదలెట్టాడు. ఈ గోదారితల్లికి ఎడంపక్క నున్నదంతా పశ్చిమ గోదారంట... కుడిపక్కది తూర్పు గోదావరంట. ఇలా పాపికొండలు మధ్యలో తెల్లదిబ్బలు అనే గిరిజన గ్రామందాకా సాగేక ఖమ్మం జిల్లా వస్తుందంట.

వాళ్ళది గోదావరికి ఎడమపక్కనున్న పట్టిసీమ అనే గ్రామం అంట. వాళ్ళ నాన్నగారయిన లోవరాజుగారు ఎప్పుడో కొన్న రెండు లాంచీల్లో సీతారామా లాంచీ తనూ, వెంకటేశ్వర లాంచీని వాళ్ళన్నయ్య సోమేశ్వర్రావు తిప్పుతున్నారంట. ఇంకో అన్నయ్య వీరేశ్వర్రావు ఊళ్ళో ఉన్న సామిల్లు చూసుకుంటున్నాడంట.





వెనకటికెప్పుడో వాళ్ళ లాంచీ సత్యసాయిబాబా గారెక్కారంట. దరిమిలా వాళ్ళ నాన్న లోవరాజు బాబాగారి భక్తులైపోయారంట. వాళ్ళది ఉమ్మడి కుటుంబవంట. వాళ్ళెప్పటికీ విడిపోకుండా ఉమ్మడిగానే ఉంటారంట అని స్టాఫందర్నీ పిల్చి, "ఈడు సరంగు గంటు తాతారావు, ఈడింకో సరంగు మైలపల్లి ఎల్లారావు, ఈ నల్లటోడు డ్రైవరులెండి పేరు దుమ్ము కన్నాజీ," అని ఇద్దరు కళాసీల్నీ పిల్చి, "ఈళ్ళు కళాసీ పనే గాకండా వంటపని కూడా చేస్తారండి. ఈ పొట్టోడి పేరు మెండా ముత్యం, ఈ సన్నటోడి పేరు రాగోతి సత్తిబాబు...' అని అందర్నీ పరిచయం చేసిన పట్టిసీమ మాణిక్యంగారు-

"మా ఇంట్లోనే గాదండీ... ఈ లాంచీలో కూడా మేం ఉమ్మడి కుటుంబంలాగుంటావండి," అన్నాడు.

స్టాఫ్‌లో అందరికంటే పెద్దోడయిన ఎల్లారావు, "లాంచీల్లో పనిచేసేవోళ్ళందరిదీ దవిళేశ్వరవేనండి... మొత్తం లాంచీలో రెండొందల పైచిలుకుంటావండి. అయితే మాలో ఎప్పుడూ ఏ లాంచీలోనూ ఏడాదికి మించి ఉండరండి. మేం మట్టుకు అలాక్కాదండి. మా వోనరు గారన్నట్టు మాదో ఉమ్మడి కుటుంబవండి. మాలో ఎవరన్నా నోరిప్పి అడ్మాంసు అడిగితే ఇస్తారుగానీ దాన్ని జీతంలో ఇరిపెట్టుకోరండి. మేం అడక్కండానే పండగలకి బట్టలూ అయ్యీ ఇస్తారండి... ఆయ్," అన్నాడు.

చాలా థ్రిల్లయిపోతా వాళ్ళని జూసిన హరికృష్ణ, "దేశాల్నీ రాష్ట్రాల్నీ విడగొట్టాలని చూసేవాళ్ళంతా వీళ్ళని చూసి బుద్ధి తెచ్చుకోవాలి," అన్నాడు.

ఆరికరేవులా, కుమారదేవం, కొత్త పట్టిసీమ, పాత పట్టిసీమ దాటేసిన సీతారామా లాంచీని, "ఒరేయ్ కన్నాజీ టావ్... టాపూ (స్టాప్... స్టాప్)," అని మాణిక్యం అరవడంతో ఆ ఇసకతిప్ప దగ్గరాగింది.

రైల్లోనే కాలకృత్యాలు తీర్చుకొన్న వాళ్ళిద్దరూ లాంచీ టాపు మీంచి నీళ్ళలోకి దూకి స్నానాలు చేస్తా చల్లని చలిలో శీతాకాలం వేడీ, వెచ్చని ఎండని అనుభవిస్తా ఉంటే ఈదుతుంటే సత్తిబాబుగాడితో తయారు చేయించిన గేలాలు వాళ్ళకిచ్చాడు మాణిక్యంగారు.

ఫిషింగ్‌లో అనుభవం ఉన్నట్టుంది వాళ్ళకి. ఇక చూస్కోవాలి. ఇద్దరూ నీళ్ళలో మునిగి తేలతా మధ్య మధ్యలో గేలాలకి తగిలిన చేపల్ని నీళ్ళు తోడుకొనే ఇనప బకెట్లో వేస్తున్నారు.

చాలాసేపయ్యింది.

చాలా చేపలు తగిలాయి గేలాలకి. పట్టిన ఆ చేపల్ని తీసుకొని పడిచెక్క మీద కూర్చున్న గీతనీ, బాల్చీ నీళ్ళల్లో వేసి నిండాక పైకి తోడుతున్న హరికృష్ణనీ రెప్పార్పకుండా చూస్తున్నారు లాంచీ జనం.

మధ్యాహ్నం పాత పట్టిసీమ దాటాక గోదావరికి కుడిపక్క ఒడ్డు మీదున్న పనసచెట్టు దగ్గర లాంచీ ఆపేసరికి ఆ చెట్టునీడలో భోజనాలారగించాక అక్కడి అందాల్ని చూస్తూ ఆ చుట్టుపక్కల కలతిరుగుతున్న విమలగీత కాల్లో తుమ్మముల్లు గుచ్చుకొంది. తీసే ప్రయత్నం చేస్తే కొంత లోపలుండి పోయింది. లంగరు చెయిను మీద కాళ్ళేసి చూపుకర్ర పట్టుకు నిలబడ్డాడు హరికృష్ణ.

కాస్సేపటికి లాంచీ బయల్దేరింది. శీతాకాలం మధ్యాహ్నం ఎండలో కల్సిన చల్లగాలి వాళ్ళ శరీరాల్ని తాకుతుంటే చాలా హాయిగా ఉంది. ఆ ఎండలో కలిసొచ్చే గాలిలో ఏవో జానపదాలు దూరంగా కనిపించే

ఎత్తయిన కొండల వెనుక నించెవరో పాడుతున్నట్టనిపించింది. దూరంగా కనిపించే ఇసకతిప్పల మీద నడుస్తున్న మనుషులు చల్లని నీడల్లా గున్నారు.

వింటిబద్దలా సాగుతున్న తెల్లటిపక్షుల గుంపొకటి కొంత దూరమెళ్ళాక ఒంపు తిరిగి అర్థాంతరంగా మాయమైపోయింది. మెత్తగా దున్నిన నల్లరేగడి చేను మొక్కల మొదళ్ళలో సీవండి బిందెల్తో గోదాట్లోంచి ముంచుకొచ్చిన నీళ్ళు పోస్తున్నారు. ఉన్నట్టుండి ఝురఝురా శబ్దం చేసుకొని సుళ్ళు తిరుగుతా వచ్చిన చలిగాలి వాళ్ళ శరీరాల్నోసారి తాకేసి ఎటో వెళ్ళిపోయేసరికి ఆ గాలి కూడా పరుగెడదావన్న సరదా పుట్టింది.

హరికృష్ణ తన అరచెయ్యి గీత కంఠం దగ్గరేసేసరికి సన్నటి కరెంటు నరాల్లోకి పాకినట్టు అదోలాగయి పోయిన ఆమె అతన్ని లాక్కుంది.

అప్పుడే తన నల్ల కళ్ళద్దాలు తుడుచుకుంటా ఆవరంలోంచి వాళ్ళ దగ్గరకొస్తున్న పట్టిసీమ మాణిక్యం ఆ రొమాంటిక్ సీను చూసి ధనాల్మని కేబిన్‌రూమ్‌లోకి దూకేశాడు.

చాలాసేపు ఏవో లోకాల్లో విహారం చేసి బయటికొచ్చిన వాళ్ళకి తీర్థంలో కొన్న ప్లాస్టిక్ బైనాక్యులర్‌లోంచి భద్రాచలం నించొస్తున్న పాసింజరు లాంచీని చూస్తున్న డ్రైవరు కన్నాజీ కనిపించాడు.

అది చూసిన హరికృష్ణ, "పొద్దుట్నుంచి చూస్తున్నాను గీతా... ఎగువనించి ఏ పడవ వస్తున్నా, ఏ లాంచీ వస్తున్నా ఆ బైనాక్యులర్‌తో చూస్తున్నాడు ఎందుకయ్యుంటుంది?" అన్నాడు.

"నేనూ చూస్తున్నాను... నాకూ ఇదే డౌటొచ్చింది," చూపుకర్ర దగ్గర నిలబడి కళ్ళద్దాలు సర్దుకుంటా గోదాట్లోకి చూస్తున్న పట్టిసీమ మాణిక్యంగార్ని పిలిచి అడిగితే నవ్వేసి ఏ సమాధానం చెప్పకుండా వెళ్ళిపోయాడు.

అతని ప్రవర్తన ఏమాత్రం అర్థం కాలేదు వాళ్ళకి.

పట్టిసీమ గుడిలాగే గోదావరి మధ్యలో నల్లటి కొండ మీదున్న మహా నందీశ్వరస్వామి గుడి, పోశమ్మగండీ దాటి గోదారికి కుడిపక్కనున్న పూడిపల్లి ఎడంపక్క ఉన్న పైడిపాక దాటుతుంటే ఒక ఒడ్డున లాంచీ కనిపించింది. చూడ్డానికది చిత్రంగా ఉంది.

దాని దగ్గరికి పోనిమ్మంది గీత.

బాగా దగ్గరకెళ్ళాకా గమనిస్తే చాలా తేడా కనిపిస్తుంది. తలుపుల పట్టీలకి ముదురుపచ్చ రంగు, లోపల భాగం లేతపచ్చ రంగు, లోపలి భాగమంతా తెలుపు రంగులూ వేసున్నాయి. ముందు ఫోర్ కార్నర్స్ బోట్ హాస్పిటల్ అని రాసుంది.

సరంగు దగ్గరుండే ఎదరాలు (ఎదురు హాలు)లో ఒక టేబులూ దాని ముందు చెయిరూ ఉన్నాయి. ఆ కుర్చీలో ఒక యంగ్ డాక్టరు కూర్చుని తన ముందున్న బల్లమీది పేషెంట్ బి.పి. చెక్ చేస్తున్నాడు.

అతని పక్కనున్న కాంపౌండరు కొత్త కాటన్ బండిల్ విప్పుతున్నాడు. రెండుపక్కలా బల్లల మీద పేషెంట్లు కూర్చునున్నారు. ఇంజను రూమ్ పక్కనే ఉన్న కేబిన్‌రూమ్‌లో మందులు, సెలైన్ బాటిల్సు, ఆక్సిజన్ సిలెండరు, పేషెంట్‌ని పడుకోబెట్టి చెక్ చెయ్యడానికో బల్లా ఉన్నాయి. లాంచీ పైన ఒక చిన్న హోండా జనరేటర్ బిగించి ఉంది.





సీతారామా లాంచీ రాగానే లోపల్నుంచి ఆ డాక్టర్ బయటికొచ్చి తన్ని పరిచయం చేసుకొన్నాడు. తన పేరు డెన్నీస్ జోసెఫ్. కేరళలో ఉన్న ఎర్నాకుళమంట వాళ్ళది.

ఈ మొబైల్ హాస్పిటల్ ఎవరిదీ, ఏంటీ అంటే చెప్పాడు. ఈ బోట్ హాస్పిటల్ ఐడియా చిలకలూరిపేట జాన్ డేవిడ్‌గారిదంట. ఇరవై అయిదు సంవత్సరాల్నుంచి ఈ గోదావరిలో నడుస్తుందంట ఇది.

"ఈ లాంచీలో హాస్పిటల్ ఐడియా రావడం చాలా గ్రేట్... ఎప్పుడైనా జాన్ డేవిడ్‌గార్ని కల్సి అభినందనలు చెప్పాలి మనం," అంది విమలగీత.

"ఇప్పుడాయన లేరమ్మ. వారబ్బాయి జెస్సీబాబు నడుపుతున్నారిది. మొత్తం రెండు బోట్ హాస్పిటల్సున్నాయి మాకు. ఒకటి గోదావరికి కుడిపక్కనించి పాపికొండల దాకా ప్రతి గ్రామాన్నీ టచ్ చేస్తూ వెళ్ళి వచ్చేటప్పుడు ఎడంపక్కనించి ఒకో విలేజీనీ చూసుకుంటూ వెనక్కొస్తుంది.

"రెండవది గోదావరి ఎడమపక్కనించి పాపికొండల దాకా వెళ్ళి వచ్చేటప్పుడు కుడిపక్కనించి వస్తుంది. మా ఫాదర్ జాన్ డేవిడ్‌గారి ధ్యేయం గిరిజనులకి వైద్యం చెయ్యడమే గాదు వాళ్ళని మూఢనమ్మకాల్నుంచి దూరం చెయ్యాలి. వాళ్ళకి వైద్య సహాయం చెయ్యడంతోపాటు ఆరోగ్యవిద్యని కూడా అందించాలి," అన్నాడు డెన్నీస్.

"ఎక్కడో కేరళ నుంచి మీరెలా వచ్చారు?" అడిగాడు హరికృష్ణ.

"ఆ జీసస్ పంపించాడు..." అని నవ్వి, "ఈ బోట్ హాస్పిటల్లో పనిచెయ్యడానికి డాక్టర్లు రావడంలేదని హిందు పేపర్లో చదివి వెంటనే బయల్దేరి వచ్చి ఈ సేవకి అంకితమయ్యాను."

అమాయకులైన ఆ గిరిజనులకి వైద్యసేవ చెయ్యడానికంత గొప్ప ఆలోచన వచ్చిన స్వర్గీయ జాన్‌డేవిడ్ గారికి ఆకాశంకేసి చూసి నమస్కారం చేసుకొని డాక్టర్ డెన్నీస్ జోసఫ్‌కి బై చెప్పి బయల్దేరారు.

చీకటి పడ్తోంది. గోదారొడ్డున దూరంగా కనిపిస్తున్న దేవీపట్నం పోలీస్‌స్టేషన్లో దీపాల్లో దానికి ఎడంపక్క కొండమీది గుళ్ళల్లో దీపాలూ గమ్మత్తుగా వెలిగి పోతున్నాయి.

కాస్సేపటికి ఆ దేవీపట్నం రేవులో ఆగిన సీతారామా లాంచీని గునపం దిగేసి తాడుతో కట్టేశారు.

భూజు భూజుమంటూ ఒకటే గాలి. అది వింటుంటే మనకర్థంగావటం లేదుగానీ గాలికి కూడా ఒక భాష ఉందేమో అనిపిస్తుంది.

చంద్రోదయమైంది. ఆరోజు నవంబరు అయిదో తేది. కార్తీక పౌర్ణమి. జ్వాలాతోరణం. వెన్నెలెంత తెల్లగా ఉందో గాలి అంత చల్లగా ఉంది.

ఒడ్డునే ఉన్న కొండమీద ఉన్న సీతారాముల గుడితో పాటు చోడేశ్వరస్వామి, ఆంజనేయస్వామి గుళ్ళలో దీపాలు దివ్యంగానే వెలుగుతున్నాయి. చలిగాలి పెరుగుతోంది. కళాసీలు సలసలా మరిగిన వేణ్ణీళ్ళ గుండిక లాంచీకి దూరంగా గోదావరి ఒడ్డున పెట్టి, గీత స్నానం చెయ్యడానికి మరుగ్గా నాలుగు రాటలు పాతి డోరియా రేకు మీదున్న టార్పాలిన్‌తో చిన్న దడి కట్టారు.

ఆకాశంలో పున్నమి చంద్రుణ్ణి, చుట్టూ ఉన్న గోదావరిని చూస్తూ చలిగాలిని అనుభవిస్తూ తలమీంచి వేణ్ణీళ్ళు పోసుకొని స్నానాలు చేస్తుంటే వెన్నెలలో మల్లియలూ... మల్లెలలో వెన్నెలలూ... ఘుమఘుమలో

గుసగుసలూ... ఏవేవో కోరికలూ... అన్న పాట ఆ గాలిలో కల్సి వినిపిస్తున్నట్టు అనిపించింది వాళ్ళకి. చిక్కని నీడలున్న పొన్నచెట్టు కింద వెన్నెల పొడలు కదుల్తున్నాయి.

గత జన్మలో గోపాలస్వామి గుడి గోడల పక్కన రాలిన పారిజాతాల్ని ఈ జన్మదాకా ఏరుకొంటున్నారు వాళ్ళిద్దరూ. ఎగువనించొస్తున్న లాంచీని బైనాక్యులర్‌తో చూస్తున్న కన్నాజీని చూసిన గీత సత్తిబాబుని పిల్చి, "ఆ డ్రైవరు కన్నాజీ పైనించొస్తున్న లాంచీల్ని పడవల్నీ ఎందుకలా బైనాక్యులర్స్‌తో చూస్తున్నాడు," అనడిగింది.

"మా కన్నాజీబాయ్యది ఒక బ్యాడ్‌స్టోరీలెండి... ఈ రాత్రిపూటొద్దు పగలెప్పుడైనా చెపుతాలెండి," అనెళ్ళి పోయాడు సత్తిబాబు.

ఆ కొత్త దంపతులిద్దరికీ దూరంగా చాలా దూరంగా వెళ్ళిపోయి ఆ వెన్నెల్లో ఒక గుంపుగా మూగిపోయి మందు పుచ్చుకోడం మొదలెట్టిన వాళ్ళంతా పెద్దాచిన్నా భేదాలు లేకుండా తాగుతా పాటలు పాడి, డాన్సులు చేసి తిని పడుకోడం వెచ్చటి ఉలెన్ రగ్గులో ఉన్న గీత, హరికృష్ణ గమనిస్తా ఉన్నారు. కాసేపైన తర్వాత గీత జబ్బ మీద చెయ్యేసాడు హరికృష్ణ. అమాంతంగా అతని మీదకి పాకిన గీత అతని కింద పెదవిని కొరికితే అతనామె రెండు పెదాల్నీ సుతిమెత్తగా కొరికాడు.

"మీ పళ్ళింత షార్ప్‌గా కత్తుల్లాగున్నాయేంటి?" అంది విమలగీత.

"నీ పళ్ళు సూదుల్లా అలా దిగుతున్నాయేంటి?" అన్నాడు హరికృష్ణ.

తాగుతా నిషాలో ఉన్న ఎల్లారావు లాంచీకేసి చూస్తే గమ్మత్తుగా ఊగుతా కనిపించింది. దాంతో తాతారావు వేపు తిరిగి, "ఒరే గోదాట్లో గాలాడ్డంలేదు. నీళ్ళు కదలడంలేదు. అవునా?" అన్నాడు.

"అవును," అన్నాడు తాతారావు.

"మరి లాంచీ మట్టుకి అలా ఊగుతుందేంటి?" అన్న ఎల్లారావు చట్ట మీద ఒక తన్ను తన్నిన మాణిక్యం, "ఒరే ఎదవ తొత్తుకొడకా... లాంచీ కేబిన్లో హనీమూన్ జంటుంది. ఆ మాత్రం అర్థం చేసుకోలేవా?" అన్నాడు.

*

ఒడ్డునున్న చోడేశ్వరస్వామి గుడి గోపురాలకి కట్టిన స్పీకర్లోంచొస్తున్న భక్తి పాటలకి నిద్ర లేచిన అందరూ ఒడ్డున తలో మూలకీ వెళ్ళొచ్చి దంత ధావనాలూ అవీ కానిచ్చి పవిత్ర గోదాట్లో స్నానాలు చేసి తడిబట్టలిప్పేసి పొడి బట్టలు కట్టుకొని ఒడ్డున పాడైపోయిన బ్రిటీషోళ్ళ కాలంనాటి పాత పోలీస్‌స్టేషన్ పక్కనే ఉన్న కొత్త పోలీస్‌స్టేషన్ని చూస్తా నడుస్తుంటే ఆ స్టేషన్ ఎస్సై అంజిబాబు గట్టు దిగి వస్తున్నాడు.

ఆ కొత్త దంపతుల దగ్గరకొచ్చి తనని తను పరిచయం చేసుకొని, "ఈ రేవులోకి కొత్తోళ్ళు ఎవరొచ్చినా వచ్చి కలుస్తానండి," అన్నాడు.

ఈలోగా అక్కడికొచ్చిన మాణిక్యం, "ఈరిలా సాదాసీదాగా కనిపిస్తారుగానీ మామూలు మనిషి గాదండి... నేను పుట్టాకా ఇలాంటోర్ని చూళ్ళేదండి. మొన్న వర్షాకాలంలో గోదారి వరదలొచ్చినప్పుడు దిక్కూ మొక్కూ లేకండాపోయి కొండమీద గుళ్ళలో తలదాచుకొన్న జనాలకి సొంత డబ్బుతో వండించి స్వయంగా వడ్డించేరండి.





"ఈరి దగ్గరకొచ్చిన కేసులకి సాధ్యమైనంతవరకూ రాజీచేసి పంపుతారు. గొడవెంతకీ తేలకపోతే అప్పుడు కేసు బుక్ చేస్తారు. అసలు విషయం చెప్పనాండీ... లంచం అంటే ఏంటో ఎరగని నిప్పండీ. మామూలు నిప్పు గాదండీ ఈ కొండల్లో మండే చింతనిప్పు ఈ అంజిబాబుగారు," అన్నాడు. మాణిక్యం నోట్లోంచి అదంతా చిన్న టేప్‌రికార్డర్‌తో రికార్డ్ చేసిన హరికృష్ణ ఆ యంగ్ ఎస్పైని గౌరవంగా చూశాడు.

"ఇవ్వేళ మీ బ్రేక్‌ఫాస్ట్, లంచ్ మాతోనే," అంది గీత.

"బ్రేక్‌ఫాస్ట్‌కుంటాను లంచ్‌కి మాత్రం రాలేనండీ. రంపచోడవరం నించి డిఎస్పీగారొస్తున్నారు," అన్నాడు అంజిబాబు.

వాళ్ళందరితోపాటు ఫలహారం ఆరగించి బయల్దేరుతున్న అంజిబాబుకి కొత్త సంవత్సరం డైరీ, ఒక కొత్త బాల్‌పాయింట్ పెన్ను ఇస్తూ, "మళ్ళీ సమ్మర్‌లో వస్తాం. అప్పుడింకా హాయిగా మాటాడుకొందాం. ఈలోగా ఈ గోదావరి మీద అనుభూతులు మొత్తం ఈ డైరీలో రాసుకోండి. మీ రాతల ద్వారా మీ అనుభవాలూ, అనుభూతులూ మాకు చెప్పాలి. సరేనా?" అన్నాడు హరికృష్ణ.

మనసారా నవ్విన ఆ ఎస్పై అంజిబాబు, "అలాగేనండి... థాంక్స్," అన్నాడు. లాంచీ బయల్దేరింది.

*

కళాసీ ముత్యం అప్పుడే వంట మొదలెట్టాడు. దేవీపట్నం ఊళ్ళోకెళ్ళి పట్టిసీమ మాణిక్యంగారు తెచ్చిన నాటుకోడితో ఇగురు, అప్పుడే వలేసి పట్టిన చేపలతో పులుసు కాస్తుంటే ఆ ఘుమఘుమలు లాంచీ అంతా నిండిపోయాయి. సరంగు తాతారావు వాళ్ళావిడ పోయిన నెల ఇనిస్టాలుమెంట్లో చీర కొని డబ్బులు కట్టలేకపోతే వాళ్ళమ్మ ఎంత తెలివిగా సర్దుబాటు చేసిందో చెప్తున్నాడు ఎల్లారావుకి. మాణిక్యం దగ్గరకొచ్చిన కన్నాజీ, "కింద పంకా వాంటింగొచ్చేలాగుంది మాయ్యగారూ," అన్నాడు.

చిరాకుపడ్డ మాణిక్యం, "స్పేరు పంకా ఒకటి పెట్టండ్రా తత్తుకొడకల్లారా అని చెప్తుంటే చెవికెక్కడం లేదు. నిక్కు చాలా ఎక్కువైపోయిందొరే మీకు," అన్నాడు.

"ఇప్పుడు తిరుగుతున్నది స్పేరు పంకానే మాయ్యగారూ," అన్నాడు తాతారావు.

"నా ప్లాయింటు (పాయింటు) మీకు అర్థంగాటంలేదు. ఇప్పుడీరుండగా ఆ పంకా వాంటింగొస్తే మన పరువేం గానురా దగుల్బాజీ ఎదవల్లారా," అని మళ్ళీ చిరాకు పడ్తుంటే ఆయన ముందుకొచ్చిన ఎల్లారావు, "అది వాంటింగొచ్చేలోపు రిపేరు జేయించే పూచీ నాది సరేనాండీ," అన్నాడు.



కాస్త తమాయించుకొన్న మాణిక్యం, "సరే పులిస్పీడు (ఫుల్ స్పీడు) పెంచండి మరి," అన్నాడు.

ఇంతలో ఉడుకుతున్న పులుసు కొంచెం సీవండి గరిట్లో వేసుకొని పడిచెక్క మీంచి నడుస్తా ఎదరాల్లో కొచ్చిన సత్తిబాబు, "పులుసులో ఉప్పు జూడండి మాయ్యగారూ," అన్నాడు.

పొగలు గక్కే ఆ చిక్కటి పులుసు ఊదుకుంటా అరచేతిలో వేసుకు నాకిన మాణిక్యం, "బ్రెమ్మాండం... ఇంత రుసిగా ఉంది ఏం గలిపేవురా సత్తీ?" అన్నాడు.

"సీక్రేటు సెబితే మీరు కాఫీ గొట్టేత్తారు," అనెళ్ళి పోతున్న సత్తిబాబుతో, "ఒరేయ్ సత్తిగా చింతకాయా పప్పు నేనే జేస్తానియ్యాళ," అంటూ చుక్కాని అంటా ఎదరాల్లోంచి పడిచెక్క మీదకి దూకి దగ్గరున్న వంటగది వేపేళ్ళాడు.

వాళ్ళని చూస్తా వాళ్ళ మాటలు రికార్డు చేసిన విమలగీతా, హరికృష్ణా చాలా ముచ్చటపడిపోతున్నారు. 'ఈ నదిలో నీళ్ళలాగ, మట్టిలాగ ఎంత స్వచ్ఛమైన మనుషులు వీళ్ళు,' అనుకొంటుండగా నవ్వుతా వాళ్ళనే చూస్తా చుక్కాని చిలక తిప్పుతున్న తాతారావుని, "కచ్చులూరు ఎంత దూరంలో ఉంది?" అనడిగాడు హరికృష్ణ.

"ఇంతకుముందు మా గోదాట్లోగ్గానీ వొచ్చేరా అబ్బాయిగారూ?" అన్నాడు.

"ఇదే మొదటిసారి," అన్నాడు హరికృష్ణ.

"పని గట్టుకొని ఆ వూరి పేరెందుకడిగేరు మరి?" అడిగాడు తాతారావు.

"ఆ ఊళ్ళో నాకో మిత్రుడున్నాడు. కథలు రాస్తాడు. అవి చదవి ఉత్తరాలు రాస్తుంటానతనికి?"

"ఎలాగుంటాడు?"

"ఒక్క ఉత్తరాల్లో తప్ప ఒకళ్ళనొకళ్ళం చూసుకోలేదు. ఇప్పుడు మేం వస్తున్నట్టు ఉత్తరం రాశాను."

"ఎవరండీ ఆ ఊళ్ళో," అన్నాడు తాతారావు.

"రత్నప్రసాదనీ... పోస్ట్‌మాస్టరు," అన్నాడు హరికృష్ణ.

లాంచీ ఊగిపోయేలాగ నవ్వేసిన తాతారావు, "మీరు భళేవోరే... రత్నం మేష్టారా?" అన్నాడు.

"ఆ... ఆయనే... ఇంకా ఎంత టైము పడ్తుంది ఆ ఊరెళ్ళడానికి?" ఆత్రుతగా అడిగాడు హరికృష్ణ.

"ఇంకో గంటన్నరలో వెళ్ళిపోతాం. మన మధ్యాన్నం అన్నాలు ఆ ఊరి తిప్ప మీదే... మీకో సంగతి తెల్సా అబ్బాయిగానూ... పిట్లుకొండ మెలికలో ఉంటదా ఊరు. వర్షాకాలం వరదల్లో చాలా ప్రెమాదకరమైన మలుపులండీ అక్కడ. పాపి కొండలు తర్వాత ఎక్కువ సుడిగుండాలుండేవి ఈ మలుపులోనే," అని ఆ తాతారావు అంటుంటే, 'అలాగా,' అన్న హరికృష్ణ ఇందాక ఎల్లారావుతో వాళ్ళమ్మ గురించి చాలా గొప్పగా మాటాడిన మాటలు గుర్తుకొచ్చి, "అవును తాతారావూ మీ అమ్మంటే అంతిష్టమా నీకు?" అన్నాడు.

"ఇష్టంగాదండి బాబూ... ప్రేణం... ఆరోప్రేణవండి," అన్నాడు తాతారావు.



"ఎందుకో," అని హరికృష్ణ అడుగుతుంటే అంతసేపూ టాపెక్కి డోరియా రేకు మీద కూర్చున్న విమలగీత రికార్డర్‌తో సహా కిందికి దూకింది.

"మా యమ్మ పేరు రాజ్యలక్ష్మండి. చాలా పొడుగండి. చాలా అందగత్తండి. దవిళేశ్వరం బేరేజీ దగ్గర చేపల మార్కెట్లో వరుసగా దుకాణాలు పెట్టుకొని చేపలమ్మే ఆడోళ్ళలో నెంబర్ వన్నండి మా యమ్మ. మా నాన్నకి అందరితో కలుపుగోలుతనంగా మాటాడే మా యమ్మ మీద అనుమానవండి. పరమ దురమార్గుడండి మా నాన్న. తాగొచ్చి మా అమ్మని కొట్టేవోడండి. అది చూసి కుదేలైపోయేవోడ్నండి. మమ్మల్ని పువ్వుల్లా చూసు కొనేదండి మా యమ్మ.

"బక్కపల్చగా కాకీనిక్కరేసుకొని కావిడిబద్దలాగుండే మా నాన్న రోజంతా తాగుతానే ఉండేవోడండి. ఆడి తాగుడి డబ్బులు మా యమ్మే ఇచ్చేదండి. అలాంటి మా నాన్న ఒకరోజు తాగుతానే కాలం చేసేడండి.

"మా ఆవిడ మా నాన్న మేనకోడలండి. అచ్చం మా నాన్న ముఖమేనండి దాన్ది. దాని ముఖంలో పోయిన మా నాన్నే కనబడతాడండి. అందుకే అదంటే నాకు ఇష్టముండదండి. నాకిష్టం లేకపోయినా మా యమ్మ చేతులట్టుకొని బతిమాల్తా కళ్ళమ్మట నీళ్ళెట్టుకుంటే చేసుకోక తప్పలేదండి," అని ఇంకా ఏదో చెపుతూ పోతుంటే అంతా రికార్డ్ చేస్తుంది విమలగీత.

గోదావరికి కుడిపక్కనున్న పాత మడిపల్లి, కొత్త మడిపల్లి, మంటూరు ఎడంపక్కనున్న మాంధాపురం, కొండ్రుకోట, వాడపల్లి దాటి పిట్లుకొండకి కుడిపక్క పెద్ద మలుపు తిరిగి ముందుకెళ్తుంటే ఒడ్డునున్న ఆ అందమైన గ్రామమే కచ్చులూరు. ఇంత అందంగా కనిపించే గ్రామం ఈ గోదారి ఒడ్డు గ్రామాల్లో ఇంకెక్కడా లేదు.

లాంచీ కచ్చులూరు రేవుకి దగ్గరగా వస్తుంటే పసుపురంగు చొక్కా తెల్లటి పేంటూ వేసుకొన్న పొడుగాటి గిరజాల జుట్టు మనిషి చేతులూపుతున్నాడు.

హరికృష్ణా, విమలగీతా అతన్నే చూస్తున్నారు.

లాంచీ రేవులో ఆగేకా ఆత్రంగా దగ్గరకొచ్చిన ఆ మనిషిని చూస్తే అర్థమైంది అతనే రత్నప్రసాదని.

"హల్లో రత్నప్రసాద్... నువ్వు ఎదురుచూస్తున్న హరికృష్ణని నేనే... ఈవిడ నా భార్య విమలగీత," అని పరిచయం చేసుకొన్నాడు హరికృష్ణ.

ఎక్కడ్నించో వచ్చి ఈ గోదావరి అంచునున్న కొండల మధ్య గిరిజన గ్రామంలో పోస్ట్‌మాస్టరుజ్యోగం చేస్తూ రచనలు చేస్తున్న రత్నప్రసాద్ కథల్నిండా గోదావరి అందాలే, మానవ సంబంధాలే. వాటిని చదివిన హరికృష్ణ అభిమానైపోయాడీ రత్నప్రసాద్‌కి.

చాలా ప్రేమతో హరికృష్ణనీ, విమలగీతనీ తాకిన రత్నప్రసాద్ ఎత్తైన కొండలకి దిగువలో ఉన్న వాళ్ళ కచ్చులూరు గ్రామంలో పర్ణశాలలాంటి తన ఇంటికి తీసుకెళ్ళి చాలా మర్యాదలు చేసి ఇక్కడే ఉండిపొమ్మని గొడవ చేశాడు.

నవ్వేసిన హరికృష్ణ, "ఉత్తరంలో రాసేనుగదా. ఇది మా హనీమూన్ ట్రిప్ అని. సమ్మర్‌లో కూడా వస్తాం. అప్పుడు ఎక్కడా ఆగకుండా సరాసరి ఈ కచ్చులూరు వచ్చి ఇక్కడే గడుపుతాం," అని కొత్త సంవత్సరం

డైరీ, ఖరీదైన పెన్ను, దానికంటే ఖరీదైన ఎంపిత్రీ ప్లేయరు, మ్యూజిక్ సాఫ్ట్‌వేరు అతనికి బహుమానంగా ఇచ్చి, "మర్చిపోవద్దు బాగా గుర్తుంచుకోండి. వచ్చే వేసవిలో నాలుగు రోజులుంటాం. డిటెయిల్స్ లెటర్‌లో రాస్తాం," అనేసి ఆ గంగ్రడు ఇసుకలో నడుస్తా లాంచీ ఎక్కారు.

ముందుకెళ్తుంది లాంచీ. హరికృష్ణ పక్కన కూర్చున్న విమలగీత, "ఆ రచయితలంటే మీకిష్టంకదా ఆయన్ని కూడా మనతో రమ్మనొచ్చుగదా?" అంది.

"కానీ మనం హనీమూన్‌కొచ్చేం గదా?" అన్నాడు.

బొటనవేలు ఊడిపోతే ఎర్రగా ఉన్న ఆ చర్మం మీద భూతద్దం ఎండలో తన్నించి చుక్క గోరూడిన ఎర్రని చర్మం మీద వేస్తున్న ఎల్లారావుని, "ఏంటిది?" అనడిగింది గీత.

"భూతద్దం ఎండలో పెట్టి ఇలా తన్నిస్తే పుండు తొరగా మానిపోద్దండి. మీకు తెల్దా?" అన్నాడు.

నవ్వింది గీత. ముందుకెళ్తుంది లాంచీ. లంకలోకి దిగిన దోర ఆవులు ఎండని ఆనందంగా భరిస్తా ఒత్తుగా పెరిగిన జలగడ్డిని మేస్తున్నాయి. ఒడ్డు మీద చేలో తెల్లని కంకులేసిన పచ్చని మొక్కజొన్న చేను గాలికి ఊగుతుంది. దానికి కాస్త దూరంగా పెరుగుతున్న మిరపచేను పచ్చగా మెరుస్తుంది. కూనవరం నించొస్తున్న వెంకటేశ్వరీ పాసింజరు లాంచికేసి తన బైనాక్యులర్‌తో ఆత్రంగా చూస్తున్నాడు కన్నాజీ.

అతన్నే చూస్తా పడిచెక్క మీంచి నడుస్తున్న గీత అరికాల్లో కలుక్కుమంది. డోరియారేకు మీదేసిన పరుపుల మీద వెల్లకిలా పడుకొని తాతారావునడిగి తీసుకొన్న సూదిపిన్నీసు హరికృష్ణకిస్తే దాంతో మడం కింద కుడతా ముల్లు తీసే ప్రయత్నం చేస్తున్నాడతను. ఆ నొప్పి హాయిగా ఉంది. గోరువెచ్చటి ఎండ శరీరమంతా తగుల్తుంటే ఇంకా హాయిగా ఉంది. చలికాలపు ఎండ హాయిని అనుభవిస్తా గోదారి నీళ్ళని చూస్తా, "కొండలకోనల సూరీడూ కురిసే బంగారునీరూ," అని పాడ్తుంది.

నలకలాంటి ముల్లు బయటికి తీసేసిన హరికృష్ణ కిందకి దిగి పడిచెక్క మీంచి నడుస్తా వంటగది వేపెళ్ళి కాసేపయ్యాక వచ్చి, "ఈ శీతాకాలం వెళ్ళిపోయాక ఇంట్లోకెళ్ళి తలుపులేసేసుకొని మళ్ళీ శీతాకాలం వచ్చినప్పుడే తెరవాలనిపిస్తుంది గీతా," అన్నాడు.

"నాకూ అలాగే అనిపిస్తుందిగానీ ఇంతసేపూ ఎక్కడికెళ్ళొచ్చారు?" అంది.

"ఆ డ్రైవరు తాతారావు వాళ్ళమ్మ గురించీ, వాళ్ళావిడ గురించీ కథలు కింద చెప్తుంటే విని వచ్చేను," అన్నాడు హరికృష్ణ.

"ఆ తాతారావుని సైకియాట్రిస్ట్ దగ్గరికి తీసుకెళ్ళి థెరపీ చేయించాలి. లేకపోతే జీవితాంతం ఆ భార్యని ఇబ్బంది పెడుతూనే ఉంటాడు," అంది గీత.

"అవును. అతని గురించి ఏదన్నా సొల్యూషన్ ఆలోచించాలి," అన్నాడు హరికృష్ణ.

వాళ్ళలా మాటాడుకుంటుండగా భద్రాచలం నించొస్తున్న వీరభాస్కరా లాంచీ వాళ్ళకెదురొస్తోంది. దాన్ని చూసిన డ్రైవరు కన్నాజీ తన బైనాక్యులర్‌తో ఆ లాంచీలో జనాన్నే చూస్తా ఎవరికోసమో వెతుకుతున్నాడు.





అది చూసిన దంపతుల్లో కుతూహలం బాగా పెరిగిపోయింది. తన నల్ల కళ్ళద్దాలు తుడుచుకొంటున్న పట్టిసీమ మాణిక్యంగార్ని కేబిన్‌రూమ్‌లో కూర్చోబెట్టి, "ఈ సస్పెన్సు భరించలేకపోతున్నాం చెప్పండి," అంటా కూర్చున్నారు.

ఒకపక్క ఇబ్బంది పడతానే ఆ మాణిక్యం చెప్పడం మొదలెట్టేసరికి కుతూహలంగా వినడం మొదలెట్టారు.

"మొత్తం కత చెప్పాలంటే చాలా టైము పడద్దిగానండి ఇంత ఇదిగా అడుగుతున్నారు గాబట్టి మూడు ముక్కల్లో చెప్పేళతానండి," అన్నాడు మాణిక్యం.

అలాగే చెప్పమన్నారు.

"ఆ పిల్లపేరు చంద్రావతి. బాగుంది గదండి పేరు?"

చాలా బాగుందన్నారు వాళ్ళు.

"పేరు కంటే అందగత్తండి మనిషి. అది మామూలందం గాదండి... అనాథని అంటా ఎగువ గోదారి నించి దిగిన ఆ మనిషిని జేరదీసి చాలా సాయంజేసిన మా కన్నాజీగాడు ఒక్కనాడు కూడా ఆ పిల్ల ఒంటి మీద చెయ్యేస్తే ఒట్టు. అయితే పెళ్ళి చేసుకుందాం అని మట్టుకి మనసులో అనుకున్నాడండి.

"ఆ ఎర్రటిపిల్ల ఇంట్లోకి అడుగుపెట్టినప్పట్నుంచీ మొదలయ్యాయండి ఈ కష్టాలు. ఈడు ప్రాణంలా చూసుకొనే తండ్రి వేటకెళ్ళి కత్తిరోడ్డు దిగడిపోయి కాలం చేసేడండి. పెళ్ళి ముహూర్తం పెట్టిన మూడోరోజు ఈడి చెల్లెలు ఎవడితోనో లేచిపోయిందండి. అప్పిచ్చిన షావుకారు మెండా హనుమంతరావుగారు ఉంటున్న ఇల్లు సొంతం చేసుకొన్నాడు.

"నా రాణి, నా ప్రాణం నాతో ఉంటే చాలు ఏం జరిగినా పర్లేదు, ఎవరెలా పోయినా పర్లేదు అనుకొన్నాడు కన్నాజీగాడు. ఇంటి పరిస్థితంతా దిగజారిపోతుంది. మేవంతా ఓ పక్క నించి చెపుతానే ఉన్నాం. 'ఒరేయ్... శనిని తలమీద పెట్టుకొన్నావ్ పంపించెయ్యరా ఆ ఇనప పాదాన్ని,' అని. అలా అన్న పాపానికి మా స్టాఫ్‌లో అంతా వాడితో తన్నులు తిన్నారండి ఓనర్నయిన నేను తప్ప.

"చాలా తక్కువ కాలంలోనే కటిక దరిద్రుడయిపోయేడండి దమ్ము కన్నాజీగాడు. ఒకరోజు తెల్లవారు ఝామునేవయిందో తెల్సాండీ?"

"ఏవయ్యిందీ?" అన్నారు.

"మనిద్దరం పెళ్ళి చేసుకొందామా సెంద్రావతీ అనడిగితే వీధిలో జనం లేచేంత సొండుతో నవ్వేసి, ఎంత గీర్మాణంగా మాటాడిందో తెల్సాండీ... 'నీది చాలా అసహ్యమైన ముఖం. మీ ఇంట్లో అద్దమెక్కడైనా ఉంటే చూసుకో,' అని చెప్పి ఎగువకెళ్ళే పచ్చిగోళ్ళ వీర్రాజుగారి రామతులసి లాంచీ ఎక్కి వెళ్ళిపోయిందండీ ఆ శనిదేవత.

"విచిత్రం అదెళ్ళిన తర్వాత దరిమిలా ఈడి జీవితం మళ్ళీ బాగుపడింది. కష్టాలో కొలిక్కొచ్చినియ్యి కానీ, ఈడు మాత్రం ఎగువకెళ్ళిన మనిషి దిగువకి రాకుండా బోతుందా అని అటుపక్క నుంచి ఏ లాంచీ

వస్తున్నా, ఏ గూటిపడవ వస్తున్నా ఆ బైనాక్యులరట్టుకొని చూస్తానే ఉంటాడండి... మీరైనా కొంచెం గడ్డెట్టండాడికి... ఆ ఇనపగజ్జెల తల్లికోసం చూడొద్దురా అని," అంటా ఆగిన మాణిక్యం, "మీకో సంగతి తెల్సాండీ," అన్నాడు.

"ఏంటి?" అన్నాడు హరికృష్ణ.

"ఆ మనిషిని చీకటడ్డాకా మేం తల్సుకోం తెల్సాండీ... అందుకేనండీ నిన్న రాత్రడిగితే మీకలా సమాధానం చెప్పారు మా కుర్రోళ్ళు. ఆడికి కొంచెం గడ్డెట్టండి," అని ఇంకా ఏదో చెప్పబోతుండగానే మెరక తగిలాగిపోయింది లాంచీ. 'ఇవ్వేళ పంకా రెక్క విరిగిపోడం గేరంటీ,' అనుకుంటూ కళ్ళద్దాలు సర్దుకుంటా చుక్కానివేపు పరిగెట్టేడు మాణిక్యంగారు.

ఇసుకమేట తగిలిన లాంచీ ఆగిపోయింది.

గెడేసి చూసిన సత్తిబాబు, "లోతులేదు దిగి తొయ్యొచ్చు," అన్నాడు.

లాంచీ స్టాఫందరితో పాటు గీత, హరికృష్ణ నీళ్ళలోకి దిగి తొయ్యడం మొదలెట్టారు. కదలడంలేదు లాంచీ.

అది జూసిన మాణిక్యంగారు, "ఫేను రెక్క విరిగిపోవడం ఖాయం," అంటా అరుస్తున్నాడు.

ఈలోగా క్రాసింగవుతున్న వీరభాస్కరా లాంచీ వాళ్ళ దగ్గరకొచ్చింది. అందులో జనమంతా కూడా దిగి తొయ్యడం మొదలెట్టారు.

అలా కండలు కరిగేలాగ తోస్తుంటే కాస్సేపటికి ముందుకు కదిలిన లాంచీ నీళ్ళలో తేలింది. ఇంజను స్టార్టయ్యింది. కానీ లాంచీని కదల్నియ్యకుండా పెద్దగా అరుస్తుందో పెళ్ళయిన ఆడమనిషి.

"ఏంటిమ్మా ఏంటి నీ గొడవా?" అన్నారు పట్టిసీమ మాణిక్యంగారు.

"ఇంతసేపూ ఆ లాంచీలోంచి నీళ్ళల్లోకి దూకి మీ లాంచీ తోసిన జనాల్లో నేనూ ఉన్నాను," అంది.

"ఉంటే?" అన్నాడు మాణిక్యం.

"తోస్తున్నప్పుడు నా కాలిపట్టాల్లో ఒకటి ఊడిపోయింది. ఇదిగానీ మా ఆయనకి దెలిస్తే నన్నొదిలేస్తాడండి బాయ్యగారూ!" అంటా ఏడవడం మొదలెట్టేసరికి లాంచీలో జనంతోపాటు హరికృష్ణ కూడా నీళ్ళల్లోకి దూకాడు.

వెతకడం మొదలెట్టారంతా.

చాలాసేపటికి హరికృష్ణకి దొరికిన ఆ కాలిపట్టాని ఆ అమ్మాయికిచ్చాకా ఆ లాంచీ కదిలింది.

ముఖం నిండా నవ్వుతా నల్లకళ్ళద్దాలు సర్దుకుంటా హరికృష్ణ దగ్గరకొచ్చిన మాణిక్యం, "హమ్మయ్యా మమ్మల్ని గట్టెక్కించేరండి సార్‌గారూ," అన్నాడు.

"ఎందుకూ?" అన్నాడు హరికృష్ణ.

"అందరితోపాటు తవరూ కష్టపడ్డారు. జబ్బలు పులిసిపోయేలాగ లాంచీ తోసేరు... అట్టడుక్కెళ్ళి ఇసకలో ఎతికి ఆ పిల్ల పట్టాని ఒడుపుగా పట్టుకున్నారు," అన్నాడు.

ముందుకి కదిలిన సీతారామా లాంచీని చీకటిపడే టైముకి ఎడంపక్క ఒడ్డునున్న టేకూరు, కుడిపక్క ఒడ్డునున్న తాళ్ళూరుకీ మధ్యలో ఉన్న ఆ పొడుగాటి తిప్ప అంచునాపేరు.





పౌర్ణమి వెళ్ళిన రెండోరోజు.

నలభై అయిదు నిమిషాలు ఆలస్యంగా ఆకాశంలో కొచ్చాడు చంద్రుడు. ఝుర్రా... ఝుర్రా, జుయ్యా... జుయ్యా అంటా వీస్తుంది గాలి. ఆ చలిగాలీ, చల్లని వెన్నెల్లో తల మీంచి వేణ్ణీళ్ళ స్నానం. గత జన్మ గుర్తొస్తున్న ఒక రకమైన బాధ వేదనల్తో కల్సిన హాయి... ఆనందం.

ఏదో జన్మలో చేసుకున్న పుణ్యానికి ఫలం ఈ జన్మలో అనుభవిస్తున్నాం. ఈ మానవజన్మనీ ఈ అపురూప వరాన్నీ ప్రతి జన్మలోనూ ఇమ్మని ఎగువలో ఉన్న ఆ భద్రాద్రి రాముణ్ణి కోరుకుంటా... మహానందంలో ఈదుకుంటా ఇంకేవేవో లోకాల కెళ్ళిపోతున్నారు వాళ్ళు.

కాస్సేపయ్యేకా వాళ్ళ దగ్గరకొచ్చిన మాణిక్యంగారు, "మంచు కురుస్తుంది లేవండి సారుగారూ... తమరి పక్కలు కేబిన్‌రూమ్ లోనే వేయించేను... వెళ్ళండి," అన్నాడు.

అదోలా నవ్వుకుని ఎప్పటికో అక్కణ్నించి కదిలారు కేబిన్ రూమ్ కేసి.

వరదలొస్తే ఇట్టే మునిగిపోయి అది లాగేసేక వెంటనే బయట పడిపోయే ఆ తిప్ప చాలా పెద్దది.

ప్రతి ఏటా బాగా బాగా దిగువలో ఉన్న కోటిపల్లికి దగ్గర్లో ఉన్న జమీందార్ల ఊరయిన కపిలేశ్వరపురం నించి దీపావళి దాటేక బయల్దేరొచ్చి ఈ శీతాకాలం, వేసవికాలం దాకా చేపలు పట్టుకుని పొట్టకి పోగా వెనకేసుకున్నది ఊళ్ళో కమ్మోరి దగ్గర చేసిన అప్పులు తీర్చడానికి పట్టుకెళ్ళే ఆ పల్లెజనం వేసుకున్న పాకలు సర్కసు వాళ్ళ గుడారాల్లా చాలా ఉన్నాయా తిప్ప మీద.

మడగట్టిన తాటాకుల్తో వేసున్న ఆ పాకల ముందున్న వాళ్ళ పొయ్యిలు వెన్నెల్లో వెచ్చగా మండుతున్నాయి. మట్టి దాకల్లో ఉడుకుతున్న చేపల పులుసులు కుతకుత మంటా చప్పుళ్ళు చేస్తా మరుగుతున్నాయి. వెంటనే ఆరగిద్దాం అన్న ఆత్రం కలగజేస్తున్నాయి. వాళ్ళలో మగాళ్ళు సారా పుచ్చుకుని వెన్నెల్ని అనుభవిస్తున్నారు.

పొయ్యిల ముందు కూర్చున్న ఆడాళ్ళయితే హాయిగా మాటాడుకుంటున్నారు. మొలలకి గోచీల్లేని చంటిపిల్లలు ఆ వెన్నెల్లో ఆటాడుకుంటున్నారు.

విమలగీత, హరికృష్ణ వాళ్ళ మధ్యలోకెళదాం అనుకునేలోపే దిగిపోయేడా అరవయ్యేళ్ళ బక్కపల్చటి మనిషి. పంచె మోకాళ్ళ దాకా లాగికట్టి వేసుకున్న తెల్లటి మల్లు లాల్చీకి పునుగు రాసుకున్నాడు.

తమలపాకులు నముల్తా వాళ్ళ మధ్యలోకొచ్చి కూర్చున్న అతని పేరు అచ్చిరెడ్డి మంగరాజంట. సొంతనావ ఒకటుందంట. చేపల వేటలో సంపాదించిన సొమ్ము వాళ్ళ జనాలకే వడ్డీకిస్తాడంట. అదీ పావలాకి.

"పావలా మరీ తక్కువ గదా?" అడిగాడు హరికృష్ణ.

"రెండు రూపాయలకిస్తే ఆ వచ్చేది నేనేం జేసుకోనండీ? ఏవండి... మానవజన్మ ఎత్తేం గనక ఎంతో కొంత నిజాయితీగా బతికి తీరాలి. ఏ పనిచేసినా మనస్ఫూర్తిగా చెయ్యాలండీ... అలా చేసినపుడు అందులో ఉన్న ఆనందం అంతా ఇంతా కాదండి. నేను మట్టుకి అలాగే చేస్తానండి ఆయ్... ఇంకో చిన్నముక్కండి. ఏదో కొంపలంటుకు పోయేంత అవసరమొస్తే తప్ప అబద్ధం ఆడకూడదండి," అని ఏ చదువూ లేని ఆ మంగరాజు అంటుంటే రెప్పలార్పకుండా చూస్తుండిపోయేరు వాళ్ళు.

"నువ్వు ఆచరిస్తున్నావా?" అంది గీత.

"నూటికి నూరుపాళ్ళు పాపగారూ," అన్నాడు.

"నువ్వన్న ఈ మాటలకి మీ గుంపులో ఎవరన్నా మారారా?"

"ఏదో వాగుతుంటాడులే బ్రహ్మచారిగాడు అనేసి కొట్టిపారేసేవోళ్ళే ఎక్కువండి."

"ఏంటీ నీకు పెళ్ళవ్వలేదా?" అంది గీత.

"లేదు పాపగారూ," అన్నాడు మంగరాజు.

"ఎందుకు చేసుకోలేదూ?" అంది గీత.

మంగరాజు సమాధానం చెప్పేలోగానే క్రిష్ణుడు అనే మనిషి వాళ్ళ మధ్యలోకి దూరిపోయి చెప్పడం మొదలెట్టాడు. "మా ఊళ్ళో అమ్మోరిపేరు కోలపిల్లమ్మండి. ఆవిడ గుడి పొలాల మధ్యలో మాసిపోయి ఉంట దండి. ఆ తల్లంటే ఈ మంగరాజుగాడికి ప్రాణమండి. అసలు తల్లిని ఎప్పుడో మర్చిపోయిన ఈడికి ఆ తల్లి రాత్రుళ్ళు కల్లోకొచ్చేదండి. అలా కొన్నేళ్ళు గడిచిపోయేటప్పటికి ఆ కోలపిల్లమ్మ ఈడి శిరస్సు నించి సిరిపాదం దాకా ఎక్కేసిందండి. ఆ తర్వాత నించి ఏ ఆడమనిషిని చూసినా ఈడికి ఆ మనిషిలో కోలపిల్లమ్మోరే కనిపించేదండి. అమాంతంగా ఆ మనిషి పాదాల మీద సాష్టాంగ పడిపోయి దణ్ణాలు పెట్టేసేవోడండి.

"ఓసారి కోటిపల్లి కోటలో ఒక పిల్లని చూడ్డానికి తీసుకెళ్ళేరండి. చక్కగా అలంకరించుకుని ఈడి ముందు నిలబడ్డ ఆ పిల్ల కాళ్ళ మీద పడిపోయేడండి. అలాంటియ్యి చాలా జరిగినియ్యండి ఈడి లైపులో. దాంతో ఈడికి పెళ్ళవ్వలేదండి. సన్నగా తేగ తొక్క లాగున్నాడుగానీ ఈడి వయసెంతో తెల్సా. అరవై దాటి నియ్యండి... అంతేగదా మంగరాజు తాతా?" అన్నాడు.

"నోర్మూయ్యెహె నా వయసు ముందు నీ వయసెంతరా," అన్నాడు మంగరాజు.

"ఇక వడ్డీ వ్యాపారమంటారా సంపాయించిందంతా పావలా వడ్డీకి మావోళ్ళందరికీ ఇస్తాడండి. నాకు తెల్సి పుచ్చుకున్నోళ్ళే తప్ప తిరిగి ఇచ్చినోళ్ళు లేరండి."

వాడ్ని ఇసుకలోకి తోసేసిన మంగరాజు, "తాగున్నాడు ఈడి మాటలు నమ్మకండి మీరు," అన్నాడు.

దులుపుకుంటా ఇసుకలోంచి లేచిన క్రిష్ణుడు, "ఒప్పుకుంటున్నానండీ తాగున్నాను. తాగనోడ్ని పిల్చి అడగండి ఏం చెపుతాడో," అన్న క్రిష్ణుడు విమలగీతని, హరికృష్ణని వాళ్ళ పాకల మధ్యలోకి తీసుకెళ్ళాడు.

అంతా చెప్పిన మాటల్లోంచి అచ్చిరెడ్డి మంగరాజు అనే ముసలోడు ఒక దేవుడని తేలింది.

నవ్వుతా మంగరాజు దగ్గరకెళ్ళిన హరికృష్ణ "నాక్కూడా అప్పిస్తావా... రేపు వేసంగుల్లో వచ్చినప్పుడు వడ్డీతో సహా తీర్చేస్తాను," అన్నాడు.

"భలేవోరే ఎంతగావాలో చెప్పండి పొద్దుటికి సర్దుబాటు చేస్తాను," అన్నాడు మంగరాజు.

"వడ్డీ పావలాకి మించి ఇవ్వం," అంది గీత.

"అంతకుమించి ఇచ్చినా నేను పుచ్చుకోను," అన్నాడు అచ్చిరెడ్డి మంగరాజు.



కొత్త దంపతులు బాగా కల్సిపోయి మాటాడ్డంతో నిమిషాల్లో కపిలేశ్వరపురం జనం దగ్గరయిపోయేరు. అది చూసి అవాక్కయిపోయిన లాంచీ జనం, 'ఇన్నేళ్ళనించి తిరుగుతున్నాం మనకి దగ్గరవ్వని ఈ జాలరి జనం ఈరి కలివిడితనానికి ఎంత సొంతవయిపోయేరు,' అనుకున్నారు.

ఆ రాత్రి వెన్నెల్లో ఆ ఇసుకతిప్ప మీద కపిలేశ్వరపురం జాలరి జనంతోపాటు కల్సిపోయి కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్న విమలగీత, హరికృష్ణల అనుభూతి ఇలాంటిదని చెప్పడం కష్టం.

అంత ఆనందంగా చలిని హాయిగా అనుభవిస్తా తిరగేసిన వెండికుండలాంటి చంద్రుడ్ని ఆనందంగా చూస్తా ఉన్న వాళ్ళిద్దరికీ ఆ గుంపులో ఉన్న కొత్తగా పెళ్ళయిన భార్యాభర్తలు ఎడమొకంగా ఉండటం చూసి మంగరాజుని అడిగితే చెప్పడం మొదలెట్టాడు.

"కండలు తిరిగి కత్తిలాగున్న ఆ కుర్రోడి పేరు కర్రి గంగారావు. అందమైన ఆకు సంపంగి పువ్వులాగున్న ఆ పిల్ల పేరు ధనలక్ష్మి. ఇద్దరికీ ఈమధ్యే పెళ్ళయ్యింది. అదయిన కొన్నాళ్ళకి దీపాలమవాస తర్వాత బయల్దేరే వంద కుటుంబాల్తోపాటు ఈళ్ళు వచ్చేరు.

"చాలా చెలాగ్గా కల తిరుగుతా అందరితోటి చిల్లో బొల్లోమంటా మాటాడ్తున్న తన భార్య ధనలక్ష్మి మీద ఏదో అనుమానమొచ్చి ఆమధ్య ఇలా పండువెన్నెల రాత్రప్పుడు ఇసకలో ఈ గుంపుకి దూరంగా అలాగ నడిపూడి దాకా నడిపించుకెళ్ళి ఒకచోట ఆగాక, 'ఇదిగో... మనం ఓ విషయం మాటాడుకోడం మర్చిపోయేం,' అన్నాడు.

'ఏంటో,' అంది ధనలక్ష్మి.

'అసలీ విషయం శోభనం రోజున మాటాడుకోవాలి. మతిమరుపెక్కువ నాకు,' అన్నాడు గంగారావు.

'ఇయ్యాలైతే ఏవయ్యిందిలే చెప్పు,' అంది ధనలక్ష్మి.

'ఏం లేదొలే... మనం కల్సి వందేళ్ళు కాపరం జెయ్యాలి కాబట్టి మన పెళ్ళికి ముందు నువ్వు అనుభవించిన బాధలు నాకూ, నేను భరించినియ్యి నీకూ చెప్పేసుకుంటే ఆ తర్వాత జీవితం వాలుగాలిలో తెరచాప పడవలా సుఖంగా సాగిపోద్ది,' అన్నాడు గంగారావు.

'ఐతే ఇప్పుడేంజెయ్యాలీ... మన పెళ్ళికి ముందు నాకేం జరిగిందో నేనేం చూసేనో చెప్పేయ్యాలి అంతేనా?' అంది ధనలక్ష్మి.

'కాదు ముందు నేనెలాంటియ్యి చూసేనో ఎలాంటోళ్ళు నన్ను కలిసేరో నీకు చెపుతాను. ఆ తర్వాత నువ్వు చెప్పుదుగానీ,' అన్న గంగారావు యానాం అవతల దరియాల తిప్ప కాఫీ హోటేలు క్రిష్ణవేణితో తనకున్న శారీరక సంబంధం గురించీ, కోటిపల్లి రేవులో పెసర పొణుకులమ్మే సావిత్రితో సంబంధం గురించీ, కపిలేశ్వర పురం ఒడ్డున కిళ్ళీకొట్టు మంగతో అనుభవాల గురించి తెగ చెప్పేసి, 'నన్ను క్షెమించు,' అంటా తలొంచుకున్నాడు.

"పర్లేదు అంటా ఆ వెన్నేల్లో పైకి లేచిన ధనలక్ష్మి గోదారిలంకలో ఉన్న ఇటుకబట్టీ ఓనరు దగ్గరికి పని కెళ్తే అతను తన్ని ఒక వర్షం రాత్రి లోబర్చుకున్న విషయం చెప్పేసింది.

"అంతే, దాంతో రెచ్చిపోయిన గంగారావు నువ్వు నాకు పనికి రావంటా గొడవ పడ్డాడు. నీకో రూలూ, నాకో రూలూనా అంటా ఎదురు తిరిగిన ధనలక్ష్మి ఓడిపోయింది చివరికి. వాళ్ళిద్దరూ విడిపోయేరు," అని చెప్పడం పూర్తిచేసిన అచ్చిరెడ్డి మంగరాజు, "ఇక్కడున్న మా జనాల్లో రాంపండు అని ఒక దొంగ తత్తుకొడుకున్నాడు. ఈళ్ళు విడిపోవడం జూసి వాడు ఎప్పుడా ధనలక్ష్మిని లేపుకుని భద్రాచెలం సైడు పారిపోదామా అని జూస్తున్నాడు.

"ఆ ధనలక్ష్మి జూస్తే పండుగాడి సైడే మొగ్గుతుంది. జూస్తున్న మా అందరి గుండెల్లో ఒకటే గుబులు, ఒకటే టెన్షను. ఈ పని మీదే ఆ ఎగువనున్న సీతారాములు పంపేరేమో తమర్ని... బాబ్బాబు కాస్త పుణ్యం గట్టుకుందురూ వాళ్ళిద్దర్నీ కలిపి ఆ పండుగాడ్ని చావగొడుదురూ," అన్నాడు మంగరాజు.

చలి బాగా పెరిగిందిగానీ ఇదంతా విన్న వాళ్ళ శరీరాలు చాలా వేడెక్కాయి. వెన్నెల కురుస్తున్న ఆ ఇసుకలో చాలాసేపు కలతిరిగిన విమలగీత, హరికృష్ణ ఒక నిర్ణయానికొచ్చేక గీత గంగారావు దగ్గరికీ, హరికృష్ణ ధనలక్ష్మి దగ్గరికీ వెళ్ళారు. అరగంట గడిచింది... గంట గడిచింది... అలా చాలా గంటలు గడిచాయి.

సూర్యోదయమవుతోంది. వాళ్ళతో వీళ్ళేం మాటాడారో తెలీదు. ఒకళ్ళ భుజాల మీద ఒకళ్ళు చేతులేసుకొంటా వాళ్ళ కపిలేశ్వరపురం జనం మధ్యలో కొచ్చిన గంగారావు, ధనలక్ష్మి, "ఇప్పుడు మేమిద్దరం కల్సిపోయేం... మాలో మాకు ఒకళ్ళ మీదొకళ్ళకి ఏ అనుమానం రాదు. రాకూడదు. ఈ జన్మకి గాదు ఏ జన్మకీ విడిపోము. కపిలేశ్వరపురం గోదారి గట్టు మీదున్న ఆంజనేయసామి మీదొట్టు... గండి పోశమ్మ తల్లి మీదొట్టు... భద్రాచెలం రాములోరి మీదొట్టు. మనందరికీ ఇష్టమైన ఈ మంగరాజు మీదొట్టు," అంటా వాళ్ళ పాకలోకి వెళ్ళిపోయారు.

కల్సిపోయిన వాళ్ళని చూసి సంబరపడిపోయిన ఆ కపిలేశ్వరపురం మగోళ్ళంతా తెగ తాగేస్తుంటే వాళ్ళ దగ్గరకొచ్చిన ఆడోళ్ళు కూడా పరమానందంతో తాగేశారా వెన్నెల రాత్రిలో. ఇదంతా జూసి బాగా దురదొస్తే వీపు బరికేసుకుంటున్నట్టు తెగ ఊగిపోతున్న రాంపండుగాడ్ని చింత బరికతో చితగ్గొట్టి, నావతెడ్డుతో నడుం విరగ్గొట్టేశారంతా. దాంతో సంసారసుఖానికి పనికిరాకుండా పోయాడు ఆ రాంపండు. వాళ్ళతో చాలాసేపు గడిపేక, "వేసవికాలంలో వస్తాం," అంది విమలగీత.

"మీరు వచ్చేటప్పటికి మేవంతా ఇక్కడే వుంటాం బుల్లీ... వచ్చెయ్యండి. మనవంతా కోళ్ళు కోసుకొని అమ్మ గండిపోశమ్మ తల్లికి నైవేద్యాలు పెట్టుకుని అన్నాలు తిందాం... తొందరగా వచ్చెయ్యండి బిడ్డల్లారా," అన్నాడు మంగరాజు.

"వస్తాంలేగానీ... వడ్డీకి డబ్బు అప్పు ఇస్తానన్నావ్," అంది విమలగీత.

"ఇస్తా తల్లీ, ఎంతగావాలో చెప్పట్లేదు."


"రెండొందల రూపాయలు... వడ్డీ పావలాకి మించి ఇవ్వలేం," అంది విమలగీత.

పౌర్ణమి వెళ్ళిన తర్వాతిరోజులాగ తెల్లగా నవ్వేసిన మంగరాజు తన మొల్లో ఉన్న మాసిన దాచేగుడ్డ సంచీ తీసి దాని తాడు లాగి, 'లాభం' అంటా లెక్కెట్టిచ్చి, "మీరు కూడా లెక్కెట్టుకోండమ్మా," అన్నాడు.









వాళ్ళ మధ్యలోకొచ్చిన హరికృష్ణ, "ఏం నమ్మిస్తున్నావ్ అప్పు?... రేపు వేసవికాలంలో మేం రాకపోతే?" అన్నాడు.

వెన్నెల్లో తెల్ల కలువపువ్వులాగ నవ్వేసిన మంగరాజు, "నేను అప్పిచ్చేటప్పుడు ముఖం చూసి ఇస్తానుగానీ లోటు (నోటు) రాయించుకునివ్వను అబ్బులుగారూ," అన్నాడు.

తెల్లారేక స్నానాలు చేస్తుంటే, "ఇవ్వేళ మన పలహారాలు రవణమ్మ ఒటేల్లో చేద్దాం సారుగారూ," అన్నాడు మాణిక్యం.

"ఈ కొండల మధ్య రవణమ్మెవరు?" అడిగేడు హరికృష్ణ.

సత్తిబాబుకేసి చూసి అదో రకంగా నవ్విన మాణిక్యం, "పదండి తర్వాత మాటాడుకుందాం," అన్నాడు.

మాణిక్యంగారు తన నల్ల కళ్ళద్దాల్లోంచి సత్తిబాబుకేసి చూసి నవ్వడం గమనించిన గీత పైకి అడిగేసింది.

'ముందు పదండి చెప్తాను,' అనడంతో లాంచీ ఆ తిప్ప మీంచి ఎదురుగా ఉన్న టేకూరు రేవులో ఆగింది. చాలా ఎత్తయిన గట్టుమీదుంది టేకూరు గ్రామం.

వరదొచ్చినప్పుడల్లా ఊటకి గట్టు నాని అండలండలుగా పడిపోవటంవల్ల, వరద నీరు గట్టుని కోరుకుపోవడం వల్లా ఒడ్డునున్న చింతచెట్టూ, దానిపక్కనే ఉన్న వేప చెట్ల వేర్లు బయటపడిపోయాయి. వేపచెట్టు నీడలో సిమ్మెంటు గట్టు మీద ఆంజనేయ స్వాములారున్నారు. స్వామికి కాస్త ఎడంగా ఉన్న ఆ తాటాకిల్లే రవణమ్మ కాఫీ ఒటేలు.

పాక ముందు పెనం పెట్టుకొని అట్లేస్తున్న రవణమ్మ మాణిక్యంగార్ని చూసి దణ్ణాలెడ్తా, "రాండి, రాండి," అన్న ఆ మనిషి వయసు నలభై లోపుంటది. పుష్టిగా బలంగా ఉన్న ఆమె నడుం దగ్గర రెండు మడతలున్నాయి.

ఇంకా చక్కని వంపులున్న ఆమె శరీరాన్ని ఆరుగజాల పులగుర్తనేత చీరతోనూ, వదులు జాకెట్టుతోనూ కప్పేసుకొంది. పున్నమిచంద్రుడ్ని మింగినట్టు నవ్వుతా పెసరట్లూ ముతక గోధుమరంగు ఉప్మా, అల్లప్పచ్చడీ వేసి పెట్టింది. తింటున్న వాళ్ళ గొంతుల్లోనే ఉండిపోయిన ఆ రుచికి, "పుట్టేకా ఇంత గొప్ప రుచిగల పెసరట్లు నేను తిన్లేదు," అనేశాడు హరికృష్ణ. ఔనౌనంది గీత.

ఇంకాస్సేయ్యాక పుల్లట్లూ,చింతపండు కలిపిన శనగపిండి పచ్చడి, మొరుగ్గా దంచిన కారప్పొడి వేసి అందించింది పళ్ళాలు. వాటి రుచికి మతిపోయింది గీతకి.

చలిగా వీస్తున్న గోదావరినే చూస్తా ఆ ఫలహారాన్ని ఆరగించేక వెయ్యి రూపాయల నోటు ఆమెకిచ్చి, "ఉంచుకోమ్మా... నీ వంటలకి జోహార్లు," అన్నాడు హరికృష్ణ.

ఎంతయిందో అంతే తీసుకొని మిగతా చిల్లరిచ్చేసిన రవణమ్మ, "అప్పనం సొమ్ము నాకెందుకబ్బాయి గారూ," అంది. ఆశ్చర్యపోతూ చూస్తున్నారు వాళ్ళు.

ఈలోపు గోదాట్లోకెళ్ళి స్నానం చేసొచ్చిన సత్తిబాబు రవణమ్మ తాటాకింట్లోకెళ్ళి ఒంటిమీద బట్టలు మాసిపెట్లో పారేసి పొడిబట్ట లేసుకోవడం చూసింది గీత.

రమణమ్మకి థాంక్స్ చెప్పి రేవులోకొచ్చి ఎక్కేక కదిలిన లాంచీ వాళ్ళ మకాం వేసెళ్తుంది.

డొంకినీతో గోదాట్లో కొట్టుకొస్తున్న చెట్టుకొమ్మ లాగుతున్న మాణిక్యంగారి దగ్గరకొచ్చిన గీత ఆ సత్తిబాబుకేసి మీరు అదోరకంగా చూసి నవ్వడానికి... గోదాట్లో స్నానం చేసిన సత్తిబాబు రవణమ్మింట్లోకెళ్ళి బట్టలు మార్చుకు రావడానికి కారణ మేంటని అడిగింది.

నల్ల కళ్ళద్దాలోసారి తీసి మళ్ళీ పెట్టుకున్న మాణిక్యంగారు, "ఆడిదో స్టోరీలేండి," అన్నాడు.

"చూస్తుంటే ఇక్కడ మీలో ప్రతి ఒక్కళ్ళకీ ఒక స్టోరీ ఉన్నట్టుందే," అన్నాడు హరికృష్ణ.

మళ్ళీ నవ్వేసిన మాణిక్యంగారు, "సారుగారూ... మీ అంత చదుకున్నోణ్ణి గాకపోయినా మీరేవనుకోనంటే ఒక మాట చెప్తానండి... మా జీవితాల గురించొదిలెయ్యండి... మీ జీవితాల్లో కథలు లేవంటారా జెప్పండి?" అన్నాడు.

ఒక నిమిషం ఆలోచించిన వాళ్ళు మాణిక్యం మాటాడింది చాలా సబబుగా ఉంది అనుకొన్నారు. 'పులి స్పీడు' అంటా కన్నాజీ దగ్గరకెళ్తున్న మాణిక్యంగార్ని ఆపి, "ఒప్పుకుంటున్నాం ఈ సత్తిబాబు కథేంటి?" అన్నారు.

"చెప్తానుగానీ ఎటెళ్ళమంటారో చెప్పండి," అన్నాడు.

"పాపికొండలవేపు," అంది గీత.

చుక్కాని చిలక పట్టుకున్న ఎల్లారావుతో, "సెంటర్గాగొయ్యిరా ఎదవతత్తు కొడకా... ఒరేయ్ కన్నాజీ పులిస్పీడంటే ఎనబడదా ఎదరాల్లో ఎవడూ?" అంటా అరిచి హడావుడి చేస్తూనే కేబిన్‌రూమ్‌లో ఉన్న వాళ్ళిద్దరి మధ్యలోకొచ్చి చతికిలబడి ఇక చెప్పడం మొదలెట్టాడు.

"ఒటేలు రవణమ్మ మొగుడిపేరు రామదాసు. టేకూరు ఊళ్ళో అంతా స్మగ్లింగ్ దాసు అని పిలుస్తారు. వర్షాకాలం వరదలప్పుడు గోదాట్లో కొట్టుకొచ్చే టేకుచెట్లు పాపికొండల మధ్య పట్టుకుని వాటి మీదెక్కి టేకూరు దాకా వచ్చేక వాటిని ఒడ్డుకి లాగి ఆ తర్వాత బయటూళ్ళ నించి వచ్చిన షావుకార్లకి చవగ్గా అమ్ముతుంటాడు. వరదల రోజుల్లో ఒక వెన్నెల కాస్తున్న వర్షాకాలం బ్రిటీషోళ్ళ కాలంనాటి ఒక టేకు చెట్టు గోదాట్లో కొట్టుకొస్తుంటే దాని మీదెక్కి కూర్చున్న దాసుని చెట్టుకొమ్మలకి మెలికలు తిరిగున్న పాము ఒకే ఒక్క కాటేసింది. దెబ్బకి కూర్చున్న మనిషి కూర్చున్నట్టుగానే ప్రాణాలొదిలేసేడు.

"మూడేళ్ళు గడిచినియ్యి. శివరాత్రినాడు పట్టిసీమ తీర్థంలో తన్ని చూసి నవ్విన తనకంటే చిన్నోడయిన రాగోతి సత్తిబాబు దగ్గరయ్యేడు. ఇద్దరూ ఒకళ్ళకొకళ్ళు దగ్గరయ్యేకా వయసు తేడా ఉన్నా మనం పెళ్ళి చేసుకుందామా?" అంది రవణమ్మ.

"వాడు సరే అన్నాక భద్రాచలమెళ్ళి రాములోరి గుళ్ళో సీక్రెటుగా పెళ్ళి చేసుకొచ్చేరు. ఇప్పటికీ ఆ మేటరు సీక్రేటుగానే వుంచేరు..." అంటా చెప్పుకుంటాపోతా ఆగిన మాణిక్యం, "ఇంకో విషయం జెప్పమంటారా సారుగారూ... లాంచీ ఎక్కే మీలాటోళ్ళందరికీ ఆడు వంటలు చేసిపెట్టడానికి కారణమెవరనుకుంటున్నారు. ఆ ఒటేలు రవణమ్మే. ఈడు ఆ మనిషి దగ్గర నేర్చుకున్న వంట లేనండీ అయ్యన్నీ," అని ఓ క్షణం ఆగాడు.

*

టాపు మీద ఒక మూలకెళ్ళిన విమలగీత, "ఇప్పుడు బానే ఉన్నారుగానీ ఆ సత్తిబాబు కంటే రెట్టింపు వయసున్న రవణమ్మని జీవితాంతం వాడు చూసుకుంటాడా అంటే నాకు డౌటే," అంది.

"ఎందుకు డౌటు?" అడిగాడు హరికృష్ణ.

"వీడు యవ్వనంలో ఉండగానే రవణమ్మ ముసల్దయిపోద్ది. దాంతో ఈ సత్తిబాబు ఇంకో మనిషిని దేన్నో తగులుకుంటాడు. తేడా వచ్చేలా లేదూ వాళ్ళ జీవితాల్లో?"

ఆలోచించిన విమలగీత, "ఏదన్నా తరుణోపాయం ఆలోచించాలి," అంది.

"దాంతోపాటు ఆ కన్నాజీ గురించి కూడా," అన్నాడు.

ఓ పక్క చలిగాలి, ఇంకోపక్క పొడి ఎండ. కలిపితే చలెండ. జన్మజన్మకీ ఈ శీతాకాలం మధ్యాహ్నపుటెండ కావాలనిపిస్తుంది. అంతలో వాళ్ళకెదురొస్తున్న లాంచీ టాపు మీద అందమైన రెండు నల్లటి మేకలు కనిపించాయి. మెడకి పలుపుతాడున్నా ఆ చలిగాలికి ఆనందంగా ఎగిరి గంతులేస్తున్నాయి.

రెండు బారల పొడుగు మాత్రమే ఉన్న తాడు కట్టిన బకెట్టు గోదాట్లోకి ముంచి నీళ్ళు నిండాకా దాన్ని పైకి తోడిన సరంగు మేకల ముందు పెట్టేసరికి చాలా ఆబగా తాగుతున్నాయవి. ఒక తిప్ప మీద మనిషంత పొడుగు ఎదిగిన రెల్లుగడ్డి పక్కనించెళ్తుంది సీతారామాలాంచీ.

ఆ గడ్డి దుబ్బుల్లో చెవుల పిల్లలున్నట్టున్నాయి. చిత్రంగా చప్పుళ్ళు చేస్తున్నాయి రెల్లు దుబ్బులు. చిన్న మేఘం వచ్చి సూర్యుడ్ని కమ్మి వెంటనే వెళ్ళిపోవడంతో మళ్ళీ మళ్ళీ ఎండాగాలీ హాయి. గీత ఒళ్ళో తల పెట్టుకున్నాడు హరికృష్ణ. "ఇప్పుడొద్దు రాత్రికి," అంది నెమ్మదిగా.





లాంచీ గోదావరికి ఎడమ పక్కనున్న పశ్చిమ గోదావరి జిల్లాలో వున్న కొరుటూరు, తాటివాడ దాటేక ఎడాపెడా తగిలే చాలా గ్రామాల్ని దాటుకుంటా ముందుకెళ్తే ఎదురయ్యే పాపికొండల్ని దర్శనం చేసుకొన్నారు. ఆ కొండల పైకెక్కేస్తే ఇక ఆకాశాన్నందేసు కోవచ్చు. అంతెత్తున్నాయవి. ఎడాపెడా ఎత్తుగా ఉన్న ఆ పాపి కొండల మధ్య సన్నగా కాలవలాగయిపోయింది.

రాజమండ్రి దగ్గర మూడు కిలోమీటర్లు వెడల్పుండే గోదావరి ఇక్కడ అరకిలో మీటరుకి చిక్కిపోయింది. లాంచీ కొండల్లోపలి కొచ్చేసరికి భయంకరమైన నిశ్శబ్దం.

వాళ్ళ దగ్గరకొచ్చిన మాణిక్యంగారు, "చాలా జాగర్త సారుగారూ... పొరపాటున నీళ్ళలోకిగానీ దిగేరు ముష్ఠితాళ్ళ (ముష్ఠి తాడిచెట్ల) లోతంటిక్కడ," అన్నాడు.

అలా కొన్ని కొండల్ని దాటగానే తెల్లదిబ్బలు అనే చిన్న గిరిజన గ్రామం దాటేక ఖమ్మం జిల్లా వచ్చేసింది. ఆరు కిలో మీటర్లు పొడుగున్న పాపికొండలు దాటేక ఎడం పక్కనున్న పేరంటపల్లి రేవులో ఆగింది లాంచీ.

ఏ.పి. టూరిజం వాళ్ళ గోదావరి విహారీ అనే నీలంరంగు బోటు, పున్నమి అనే ఇంకో ప్రైవేటు బోటు ఇంకా టాపుమీద షామియానాలు కట్టిన రెండు లాంచీలు ఆ ఒడ్డున ఆగి ఉన్నాయి. రేవులోకి దిగితే పైకెక్కడానికి సిమ్మెంటు మెట్లున్నాయి. దారికి కుడిపక్క తల్లివేరుతో సైతం బయటికొచ్చేసిన పెద్ద చింతచెట్టు కనిపించింది.

పచ్చని చెట్ల లోపలున్న పేరంటపల్లి గ్రామం వేపెళ్తుంటే దేవుడ్ని దర్శనం చేసుకొని తిరిగొస్తున్న జనం కనిపించారు. స్వాములవారి ఆశ్రమం అది. లోపలున్న సెలయేట్లో స్నానం చేసి శివుడ్ని దర్శనం చేసుకొన్నారు.

ఆ గుడిని అక్కడి గిరిజనులే చూసుకుంటున్నారు. ఎవరూ మాటాడకూడదు. ఇంకో ముఖ్యమైన కండిషనేంటంటే ఎవరూ హుండీలో డబ్బులెయ్యకూడదు. అసలు కొస్తే అక్కడి హుండీ అనేదే లేదు. ఆదిదేవుడికి నమస్కారం చేసుకొని తిరిగొచ్చేక తడిబట్టలు మార్చుకొని భోజనాలు చేసేసరికి మధ్యాహ్నం మూడయ్యింది. ఎండ కాస్తున్నా చలి తిరిగిందో పక్కనుంచి. దూరంగా కొండల మధ్య మంచు. ఆ మంచులో నీళ్ళలో తిరుగు తున్న రెండు వేట నావలు కనిపించాయి. కూనవరం నించొస్తున్న పాసింజరు లాంచీ ఆగకుండా వెళ్ళిపోతుంటే బైనాక్యులర్‌తో ఆ లాంచీలో జనాన్నే చూస్తున్నాడు కన్నాజీ.

లాంచీ బయల్దేరింది. ఒడ్డునించో మనిషి సన్నగా పొడుగ్గా ఉన్న ఒక ఎండిన కొమ్మని భుజాన్నేసుకు పోతున్నాడు. ఒక కొండోళ్ళ కుర్రోడు బాణాల్ని ఇసకలోకి కొట్టి ప్రాక్టీసు చేస్తున్నాడు. దూరంగా అడివి చిక్కుడు చెట్టు మీదున్న పేరు తెలీని ఆ పక్షి ఆగాగి కూస్తోంది.

లేత ఆకుల్తో గుబురుగా ఉన్న చింతచెట్టుకి చాలా పిచ్చుకగూళ్ళు వేలాడుతున్నాయి. ఆ పాక ముందున్న గానుగచెట్టుకి చీరతో వేలాడదీసిన ఉయ్యాల్లో చంటోడ్ని పడుకోబెట్టేకా చేటలో వేసిన అపరాల్ని బాగుచేస్తుందా తల్లి. వెళ్తున్న లాంచీ డోరియారేకు మీద నిలబడి హాయిగా చూస్తున్న ఆ కొత్త దంపతులకి విప్పిన కంటిరెప్పలు ముయ్యబుద్ధెయ్యడం లేదసలు.

ఎండ తగ్గడం మబ్బులు మూసుకోవడం, చలి పెరగడం చూస్తుండగానే జరిగిపోయాయి. పాపికొండలింకా రాకుండానే చీకటిపడిపోయిందా వేళ. దాంతో లాంచీని గోదారికి ఎడంపక్కనున్న ఇసకదిబ్బల పక్కకి లాగి ఒడ్డున గునపం బలంగా గుచ్చి దానికి లాంచీ తాడుకొస ముడేశారు.

ఆ ఇసక దిబ్బని ఆన్చి చిన్న గ్రామం ఉంది. దాని పేరు కొల్లూరంట. "రాత్రికిక్కడే మన మకాం సారు గారూ," అన్నాడు పట్టిసీమ మాణిక్యం.

చుట్టూ ఉన్న కొండల్లోంచొస్తున్న చలి చెరిగేస్తుంది. ఆ గాలి గోదారి నీళ్ళకి తగలడంతో తపతపమంటా అలల చప్పుళ్ళు. ఈలోగా రాజమండ్రి వేపు నించొస్తున్న లాంచీ భద్రాచలం వేపెళ్ళేసరికి అంతసేపూ నిలకడగా ఉన్న నీళ్ళు చెల్లాచెదరైపోయి ఒడ్డునాగిన సీతారామాలాంచీని కూడా కుదిపేశాయి. దాంతో కొల్లూరు రేవంతా ఒకటే చప్పుళ్ళు.

పౌర్ణమి వెళ్ళిన రెండో రోజు. ఆకాశంలోకి గంటన్నర ఆలస్యంగా వచ్చాడు చంద్రుడు. ఆ వెన్నెల్లో గోదావరి ఒడ్డున కూర్చుని తలారా వెన్నీళ్ళ స్నానాలు చేస్తుంటే వర్ణనకీ, వివరణకీ అందని, దొరకని తన్మయానందం.

ఆ ఆనందంలో వాళ్ళ ఊహలు, గురుపౌర్ణమినాటి రాత్రి నాగమల్లి చెట్ల నీడల్లోంచి తీగమల్లి తోటల్లోకి వాళ్ళ పరుగులు. పొడి బట్టలు కటుకునొచ్చి టాపెక్కేసరికి వాళ్ళ కెదురుగా నిలబడ్డ సత్తిబాబు, "గుళ్ళోకెళ్ళొచ్చేరు గదండి అందుకని పలారం చేసేవండి. ఈ తిప్ప అంచునున్న కొల్లూరులో మడకం సూర్య నారాయణగారని చాలా పెద్దమనిషున్నారండి. ఆరి అబ్బాయి రాజబాబుగారు మాకు క్లోజండి. తేనెపాణకం ఇచ్చేరండి," అన్నాడు.

వాళ్ళు పలారం అని చెప్పి చేసిన వేడివేడి దిబ్బరొట్టె ముక్కల్ని అడుగున చక్కర గట్టిన చిక్కని తేనె (బెల్లం) పానకంలో ముంచుకు తింటుంటే అమృతవంటే ఇదే... అద్భుతమంటే ఇదే అని అనిపించాయి.

*

తెల్లవారింది. గాలి తూర్పు వేపుండటంతో చాలా స్పీడుగా వెళ్తుంది లాంచీ. పాపికొండలు దాటేకా కపిలేశ్వరపురం మిత్రులకీ, కచ్చులూరు రత్నప్రసాదుకీ, దేవీపట్నం ఎస్సైగారికీ థాంక్సు చెప్పుకుంటా వచ్చే వేసవిలో మళ్ళీ దిగిపోతావంటా ముందుకి కదుల్తుంటే మాంధాపురం జనం జానపదం పాడుకుంటా బట్టలు ఉతుకుతున్నారు. ఒక ఆరేళ్ళ కుర్రాడైతే మాసిన పెద్ద బట్టలమూట మీద పడుకొని అటూ ఇటూ దొర్లుతున్నాడు.

వాడికి కాస్త దూరంగా ఒక ఆడకుక్కా, మగకుక్కా కాస్సేపు ఒకదాన్నొకటి కరుచుకొని తర్వాత సృష్టి కార్యంలో కెళ్ళిపోయాయి. కొత్తూరు రేవులో ఇంజను రిపేరొచ్చిన లాంచీ బాగుచేస్తున్న వాళ్ళకి చలెండవల్ల చెమటలు పట్టడంలేదు. సింగన్నపల్లి రేవులో మొబైల్ చెక్‌పోస్ట్ వాళ్ళాపి కలప ఏవన్నా స్మగ్లింగ్ చేస్తున్నారా అని చెక్ చెయ్యడానికొస్తే గీత ఆ చెక్‌పోస్టుని చూస్తోంది. లాంచీలోపల ఎదరాల్లో చెయిర్సు, టేబులు దానిమీద ఫైల్సు. చూడ్డానికి తమాషాగా ఉన్న ఆ మొబైల్ చెక్‌పోస్ట్ ఫోటో తీసింది.

సీతారామాలాంచీ ముందుకి కదిలింది. కొన్నిగంటలయ్యేకా కుమారదేవం రేవు పడమటికి దిగిపోతున్న అద్భుతమైన సూర్యుడు. చూసి మైమరిచిపోయారు వాళ్ళు. రాజమండ్రి రేవులో దిగేసరికి చాలా చీకటిపడింది.

చలిగాలి ముమ్మరం పెరిగింది. లాంచీ దిగిన విమలగీత, హరికృష్ణ ఆ స్టాఫ్‌లో వాళ్ళని పేరుపేరునా, పుట్టాకా వాళ్ళంతవరకూ పిలిపించుకోనంత ప్రేమగా పిల్చి అందరికీ డబ్బులిస్తా, 'వచ్చే సమ్మర్‌లో వస్తాం,' అని చెప్పి మాణిక్యంగారికి నమస్కారం చేసి ఒడ్డుకొచ్చి రోడ్డు మీదున్న ఆటోవాడితో స్టేషనుకి మాటాడు కున్నాకా అందులో వాళ్ళ సామానేసుకు బయల్దేరారు.





స్టేషన్లో ఆగిన గౌతమీ థర్డ్‌క్లాస్ రిజర్వేషన్ కంపార్ట్‌మెంట్లో కెక్కిన కాస్సేపటికి కదిలిందది. ఆ తొడతొక్కిడి జనం మధ్య నలిగిపోతూ వాళ్ళ మాటలు, కేకలు ఇష్టంగా భరిస్తూ, స్టేషన్లో ఉన్న దీపం రెస్టారెంట్లో పార్సెలు కట్టించుకొన్న ఇడ్లీ పొట్లాలు విప్పుకొని తిన్నాకా సైడుబెర్తులో ఎవరో సందిస్తే బయటికి చూస్తున్న విమలగీత చేతిలో చాలా కేసెట్లున్నాయి. వాటిని చూసిన హరికృష్ణ, "రికార్డెడ్ కేసెట్సెన్ని?" అన్నాడు.

"పద్దెనిమిది," అంది గీత.

గడ్‌గడాగడ్‌గడా శబ్దాలు చేస్తూ గోదావరి పాతబ్రిడ్జి మీంచెళ్తున్న గౌతమీ ఎక్స్‌ప్రెస్ కొవ్వూరు, నిడదవోలు, తాడేపల్లిగూడెం దాటుతోంది.

ఆంధ్రప్రదేశ్‌లో మూడు పవర్‌ప్లాంట్లు, మూడు సిరామిక్ ఫ్యాక్టరీలు, హైదరాబాద్, బెంగుళూరు, ముంబయి, చెన్నై నగరాల్లో స్టార్ హోటల్స్‌కి ఛైర్మన్ అయిన అరవై అయిదేళ్ళ జీవన్‌రెడ్డిగారి సంతానం ముగ్గురు కొడుకులు, ఒక కూతురు. ఆ కూతురే ఈ విమలగీత.

అమెరికాలో చాలా పెద్ద సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో ఒకటైన సీఫ్ట్ అనే కంపెనీకి ఛైర్మన్ హరికృష్ణ.

వారంరోజుల క్రితం హైదరాబాద్ హైటెక్స్‌లో హరికృష్ణకి, విమలగీతకి పెళ్ళయ్యింది. దుబాయ్ సముద్రంలో ఉన్న హోటల్ బర్జ్ అల్ అరబ్‌లో రూమ్ రెంట్ రోజుకి ఒక లక్షా పద్దెనిమిదివేల ఆరువందల అయిదు రూపాయలు. జీవన్‌రెడ్డి ఆ కొత్త దంపతుల హనీమూన్ కోసం నెలరోజులు ఆ హోటల్‌లో రూమ్ బుక్ చేస్తే కాదన్న వీళ్ళు ఒకో సీజన్లో నాలుగు రోజులు గోదావరిలో గడుపుదామని నిర్ణయించుకొని ఇలా వచ్చారు.

*

న్యూజెర్సీలో జనసంచారం లేకుండా చాలా నిశ్శబ్దంగా ఉన్న డగ్లాస్ సిర్క్ స్ట్రీట్‌లో ఉన్న ఆ పెద్ద ప్రహరీ లోపల రెండు మండువాల లోగిలిని చాలా విచిత్రంగా చూస్తుంటారంతా. అసలా ఇంటి నిర్మాణం ఎలా జరిగిందంటే డెల్టా కెనాల్ పక్కనున్న ఆత్రేయపురంలో దండు రామకృష్ణంరాజుగారి పాత లోగిలిని కొనేసి, ఆ ఇంటి ప్రతి చిన్నమూలా వీడియో ఫోటోలు తీసి తర్వాత ఇల్లు మొత్తం కూల్చేసి కిటికీలు, నగిషీలు చెక్కిన ద్వారబంధాలు, తలుపులు, పైన వేసిన వాడపల్లి పెంకు షిప్‌లో న్యూజెర్సీ తెప్పించి అదే ఇల్లు ఇక్కడ కట్టేసరికి చాలా ఖర్చయ్యింది. మన ఇండియన్ కరెన్సీలోకి తర్జుమా చేసి లెక్కగడితే పన్నెండు కోట్ల చిల్లర.

ఆరోజు ఉదయం ఎనిమిది గంటలకే రెడీ అయిపోయిన హరికృష్ణ హాల్లో ఉన్న ఇత్తడి గొలుసుల ఉయ్యాలబల్ల మీద కూర్చుని, "గీతా!" అని పిల్చాడు.

వంటగదిలో పప్పుపులుసు తిరగమోత పెడ్తున్న గీత, "మీకు పుట్టినరోజు శుభాకాంక్షలు," అనరిచింది.

"థాంక్స్... రాత్రి నిద్రలేపి చెప్పావుగా..." అన్నాడు.

"ఇప్పుడు మళ్ళీ చెప్తున్నాను... మీకెన్నిసార్లన్నా చెప్పాలి. అన్నట్టు మీకోసం పులిహోరా, పూర్ణంబూరెలూ చేశాను," అంటూ ప్లేటులో వాటిని పట్టుకునొచ్చింది గీత.

వాటిని తింటూ, "ఇవ్వేళ చాలా పని గీతా నాకు... న్యూయార్క్ వెళ్ళి సిటీగ్రూప్ వాళ్ళని కలవాలి. అక్కడ్నించి కనక్టికట్ వెళ్ళి ఈ ఎక్స్ టెక్నాలజీస్ వాళ్ళని, రోడ్ ఐలేండ్‌లో వర్డ్‌కామ్ ఎగ్జిక్యూటివ్స్‌ని కలవాలి," అన్నాడు.

"నాక్కూడా చాలా పనుంది ఆఫీసులో. బోస్టన్ నించి ఆర్బియాన్ ఇంటర్నేషనల్ చీఫ్ వస్తున్నాడు. వాళ్ళకి మరో వెయ్యిమంది మేన్ పవర్ కావాలంట," అంది.

ఇద్దరు కాస్సేపు వాళ్ళ ప్రోగ్రాం గురించి మాటాడుకున్నాక ఎవరి కార్లలో వాళ్ళు బయల్దేరారు. తన కారులో ఇంటి దగ్గర్నుంచి ఏభై కిలోమీటర్ల దూరంలో ఉన్న వాళ్ళ ఆఫీసుకి బయల్దేరిన గీత కారు టేప్‌రికార్డర్లో బుక్ కేసెట్ పెట్టేదెప్పుడూ. బుక్‌కేసెట్ అంటే షిడ్నీ షెల్డన్ మెమరీస్ ఆఫ్ మిడ్‌నైట్ లాంటి నవలని ఒక పాపులర్ సినిమా ఆర్టిస్టు చదివితే దాన్ని కేసెట్ చేసి అమ్ముతారు.

గీతలా కాస్త లాంగ్‌డ్రైవ్ చేసేవాళ్ళు ఆ క్యాసెట్ పెట్టుకొని వింటా నడుపుతారు కారు. అలాంటిది ఇప్పుడు మాణిక్యంగారి కుటుంబ కథా, తాతారావు ఫేమిలీ స్టోరీ, సత్తిబాబూ రవణమ్మల ప్రేమ వివాహం కథా, అందరికంటే మా గొప్పగా ఆకట్టుకొన్న మనిషెవరంటే మంగరాజు, అతని మాటలు, సిద్ధాంతాలు, ధోరణి టేపుల్లో వింటుంటే ఎంత తొందరగా గోదాట్లోకి వెళ్తామా, ఎంత తొరగా ఆ జనాల్లో మంగరాజుని చూస్తామా అనుంది.

అలా ఆలోచిస్తున్న విమలగీత మనసు నిండా ఆ పవిత్ర గోదావరి సువాసనలే. అటుపక్క కార్లో న్యూయార్క్ వెళ్తున్న హరికృష్ణ కూడా తాతారావు కథ వింటున్నాడు. అలా వింటున్న అతని మనసు నిండా శీతాకాలం చలిగాలే. నవ్వులనిండా వచ్చే వేసవి వెన్నెల వెలుగులే.

*

గత వారంరోజుల్నుంచీ ఇలాగే ఉంది. ఉన్నట్టుండి పొత్తి కడుపులో విపరీతంగా నొప్పొస్తుంది. పనుల ఒత్తిడిలో పడ్డ గీత డాక్టర్ దగ్గరకి ఇవాళ వెళ్దాం, రేపెళ్దాం అని వాయిదాలు వేస్తుండగా ఆ రాత్రి మరీ ఎక్కువగా వచ్చింది.

తనకి చాలా క్లోజ్‌ఫ్రెండైన ఫేమస్ గైనకాలజిస్టు బుద్ధవరపు భానుమతిగారు న్యూయార్క్‌లో ఉంటుంది. ఆరోజు ఉదయం ఫ్లైట్‌కి న్యూయార్క్ వెళ్ళిన విమలగీత జరిగిందంతా చెప్పింది డాక్టర్‌కి. "మెన్సెస్సప్పుడు రక్తం ఎక్కువగా పోతుందా?" అడిగింది భానుమతి. అవునంది గీత.

అల్ట్రా స్కేనింగు, ఇంకా కొన్ని టెస్టులు చేసి రిజల్ట్స్ చూసిన ఆ డాక్టర్ ఫ్రెండ్ ముఖం మాడిపోయింది. అది చూసిన గీత ఏవైందంది.

"అయామ్ సారీ గీతా," అంది భానుమతి.

"ఏవైందో చెప్పు భానూ," అడిగింది గీత.

"నీ యూటిరస్ తీసెయ్యాలి... నీకీ జన్మకి పిల్లలు పుట్టరు," అంది భానుమతి.



అది తెల్సిన హరికృష్ణ స్టేట్స్‌లో ఉన్న ఫేమస్ గైనకాలజిస్టులందరి దగ్గరకీ తీసుకెళ్లాడు. ఎక్కడికెళ్ళినా భానుమతిగారు చెప్పిందే చెప్పారు. ఒకానొక రోజున ఆపరేషన్ చేసి విమలగీత గర్భసంచి తీసేశారు.

తెల్లటిగోడలు, తలుపులు, తెల్లటి ఫర్నీచర్, ఆ హాస్పిటల్లో ఎక్కడ చూసినా తెలుపే. హాల్లోంచి నడుచు కుంటా వచ్చిన హరికృష్ణ ఆ తెల్లటిగదిలో తెల్లటి దుప్పటి కింద పడుకొన్న గీత దగ్గరకొచ్చి నిలబడ్డాడు.

నీరసంగా కళ్ళు విప్పి హరికృష్ణనే చూస్తా నవ్వింది.

తెల్లటి దుప్పటిలోంచి బయటకొచ్చిన ఆమె గులాబీరంగు చెయ్యి మీద తన చెయ్యేశాడు.

ఆ చేతిని తన గుండెల దగ్గర పెట్టుకొందామె.

"మా నాన్న దగ్గర్నుంచి చాలా కోట్లు వస్తుంది. ఇక్కడ మనకి చాలా కోట్లున్నాయి కానీ, మనకి బిడ్డలు పుట్టకపోవడం ఎంత విచారకరం," అంది గీత.

"అంతా ఇచ్చి ఎక్కడో చిన్న లోటు పెడతాడా దేవుడు," అన్నాడు హరికృష్ణ.

ఇద్దరూ నవ్వుకొన్నారుగానీ గీత కంట్లోంచి కారిన కన్నీటిబొట్టు హరికృష్ణ ముంజేతి మీద, హరికృష్ణ కళ్ళలోంచి కారిన కన్నీళ్ళు గీత చెంపలమీద పడ్డాయి. నవ్వారుగానీ, ఆ రాత్రంతా వెక్కివెక్కి ఏడుస్తానే వున్నారు. కొన్నాళ్ళకి హాస్పిటల్నుంచి డిశ్చార్జయిన గీత రొటీన్‌లో పడింది.

వేసవికాలం వచ్చేసింది. పౌర్ణమిరోజు దగ్గరపడింది. ఇండియా వెళ్తున్నాం, గోదావరిలోకి దిగబోతున్నాం అన్న ఆలోచన రాగానే గీతలో కొత్త శక్తి వచ్చింది.

*

ఎప్పట్లానే రాజమండ్రి స్టేషన్లో ఆగింది రైలు. పల్చటి జనంతో దాదాపు ఖాళీగా ఉన్న ఆ ప్లాట్‌ఫారం మీదికి ఇలా దిగుతున్నారో లేదో సీతారామాలాంచీ స్టాఫ్ మొత్తం వచ్చి వాళ్ళిద్దరి చుట్టూ మూగిపోయారు. గీత, హరికృష్ణ వాళ్ళతోపాటు శ్రద్ధానందఘాట్ రేవుకి బయల్దేరారు.

శ్రీతులసి, వీరభాస్కర, వెంకటలక్ష్మి, ఉమా పరమేశ్వరి ఇలా చాలా లాంచీలు రేవులో ఉన్నాయి.

ఆ లాంచీల మీద, రేవు మెట్ల మీద కూర్చుని, నిలబడి మాటాడుకుంటున్న ఆ గోదావరి జనం మాటల్లో గోదావరి యాసగోసా అచ్చంగా వినిపిస్తున్నాయి.

గోదావరి ఉదయం గాలి పల్చగా హాయిగా వీస్తుంది. ఆ అఖండ గోదావరిలో కాటన్ లాంచి (అది గవర్నమెంటుది) ఎవరో పెద్ద ఆఫీసరుగార్నెక్కించుకొని ఎగువ గోదాట్లోకెళ్తుంటే రెండు ఇసుకలోడు పడవలు దానికెదురుగా వస్తున్నాయి. అక్కడక్కడా తెరచాపలెత్తిన నావలు లేసుతెరలాగ పల్చగా గోదావరి మధ్య పట్టున్న మంచుతెరలో కదుల్తున్నాయి.

సామాన్లన్నీ ఎక్కించేకా ఏ కదలికా లేని గోదారి నీళ్ళలోంచి కదిలింది సీతారామా లాంచీ.

డోరియారేకు మీద జంబుకానా వేస్తే దానిమీద కూర్చుని పల్చటి ఆ మంచు పట్టిన గోదావరి చూస్తున్న వాళ్ళిద్దరి దగ్గరికీ వచ్చిన సరంగు తాతారావు, "మీరొస్తున్నారన్నట్టు మాయావిడ చెపితే అదేం పట్టించుకోలేదు గానండి మాయమ్మ మట్టుకి ఇదిచ్చిందండి. ఈ కేరేజీ లోపల పులేరం (పులిహోర) ఉందండి. తవరిద్దరూ

ఇది తినాలండి," అనేసి టాపు నించి కింద కేసున్న ఇనుపనిచ్చెన దిగి వెళ్ళిపోతుంటే పడిచెక్క మీంచి ఒక్క జంప్‌తో టాప్ ఎక్కిన ఎల్లారావు, "మా అక్క మీకోసం పాలముంజులు వండిందండి," అని ఒక గిన్నె ఇచ్చెళ్ళాడు.

ఇంకాస్సేపటికి ఒక చిన్న గోనెసంచితో దిగిన డ్రైవరు కన్నాజీ, "ఈళ్ళలాగ వండించి పట్రాడానికి నాకు భార్య లేదుగదండీ... అందుకని మా దవిళేశ్వరం రథం వీధిలో ఉన్న పచ్చిపులుసు పద్మగారితో మీకోసం రేగుపళ్ళ వడియాలు పెట్టించి తీసుకొచ్చేనండి. తక్కిన జిల్లాల సంగతి నాకు తెల్దుగానండీ ఈ రేగుపళ్ళ వడియాలు మా జిల్లాలో మట్టుకి చాలా ఫేమస్సండీ ఆయ్," అని సంచి వాళ్ళ కిచ్చాడు. కళాసి సత్తిబాబు పరవాన్నం గిన్నెతోను, మెండా ముత్యం సత్యనారాయణమూర్తి ప్రసాదం (రవ్వకేసరి) కేరేజీతోను వచ్చి ఇచ్చి వెళ్ళారు.

అతన్ని చూసిన విమలగీత, హరికృష్ణల కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. వాళ్ళకేసి ప్రేమగా చూస్తా, "ఆ మంగరాజెలాగున్నాడు?" అన్నాడు కృష్ణ.

నవ్వేసిన సత్తిబాబు, "ఆడికేంటండి ఇంచక్కా పాతకలాగున్నాడు. ఇయ్యాలో రేపో చూస్తారుగదా?" అన్నాడు.

"మంగరాజునలా తిడ్తున్నారేంటి?" అంది గీత.

"ఏదో వేళాకోళానికంటాంగానీ మంగరాజు తాతని తిట్టడానికి నేనేగాదు గోదారి ఈ చివర్నుంచి ఆ చివరిదాకా ఎవ్వడూ సరిపోడు," అని నవ్వాడు రాగోతి సత్తిబాబు.

*

అంతసేపూ వీచిన గాలి ఆగిపోయింది. వేసవికాలం ఎండ పెరుగుతూ ఉంది. ఒకటే ఉక్క. శరీరమంతా చిరచిరలాడుతోంది. చెమట జుట్టుల్లోంచి కారి ముక్కు మీంచి పడ్తోంది. ఆ ఎండనే ఆ తాపాన్నే హాయిగా భరిస్తా డోరియా రేకు మీద మూడు వందల అరవై డిగ్రీలూ కలతిరుగుతున్నారు.

కాస్త ఒడ్డునున్న డ్రాక్లైనర్ తిప్ప మీది ఇసుకని తన బకెట్‌తో తీసుకొని లారీలో పోస్తోంది. లంక పొలాల్లో ఒంటి పన్లు చేసుకొంటూ పాటలు పాడుకొంటున్నారాడాళ్ళు. ఎడంపక్క ఏటిగట్టు మీది కుర్రోడు తాడి చెట్టెక్కి ముంజికాయల గెలల్ని కొట్టి దించేక ఒక్కోకాయనీ కొట్టి ఇస్తుంటే వాడి ముందు మూగిన ముగ్గురు కుర్రోళ్ళు వాళ్ళ బొటన వేళ్ళతో ముంజి కాయల కళ్ళు పొడిచి పైకెత్తి జుర్రుతున్నారు.

తెలివైన ఒక కొంగ గోదారి అంచు నీళ్ళ మీదే కాళ్ళని పైకెత్తి దించుతా ఇంకో పక్క నించి తనక్కావల్సిన చితుకు చేపల కోసం చూస్తుంది. ఏటి ఒడ్డున పెసర పడుగుని తల్లీ కొడుకులు ఎగరబోస్తుంటే వయసులో ఉన్న కోడలు సంచుల్లో కెక్కిస్తుంది.

కూనవరం వేపు నించొస్తున్న ఝూన్సీరాణి లాంచీని తన బైనాక్యులర్‌తో ఆత్రంగా చూస్తున్నాడు కన్నాజీ. లాంచీని కుమారదేవం రేవులో ఆపుదావని జూస్తే ఆ రేవుగట్టు మీద నిద్రగన్నేరు చెట్టు నీడలో చింత పుల్లల మధ్య ఒక శవం కాల్తుంది. ఊళ్ళో షావుకారిగారి మనుగడుపు అల్లుడిదంట ఆ శవం.







"టాపు ఇక్కడొద్దు ముందుకు పోనియ్యండొరేయ్," అని తన నల్ల కళ్ళద్దాల్లోంచి ముందుకి చూస్తూ మాణిక్యంగారు అరిచేసరికి లాంచీ గోదావరి మధ్యలోకొచ్చింది.

చాలా రేవులు దాటేక పట్టిసీమ వచ్చింది లాంచీ. చుట్టూ గోదావరి దాని మధ్యలో చాలా ఎత్తుగా ఉన్న ఇసుకతిప్ప. ఆ తిప్ప మీద పచ్చటి చెట్లు. తోట మధ్య తెల్ల సున్నమేసిన మూడు గుళ్ళు. భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి, భావన్నారాయణ స్వామి, సీతారాముల గుళ్ళవి.

ఆ తిప్ప అంచు మీద ఆపేరు లాంచీని. తోట మధ్య గుళ్ళల్లో కంచుగంటలు వినిపిస్తున్నాయి.


తాళ్ళ చుట్ట మీద బాసిపట్టం వేసుకొని చతికిలబడ్డ మాణిక్యాన్ని పిల్చిన గీత, "ఇలా గోదావరి మధ్యలో కొండ మీది దేవాలయాలు మొత్తం ఎన్నున్నాయండీ?" అంది.

నవ్వుతా వాళ్ళకి కాస్త దూరంగా నిలబడ్డ పట్టిసీమ మాణిక్యంగారు, "భద్రాచలం దగ్గర మోతీశ్వరుడండి, అశ్వారావుపేట మండలంలో ఉన్న ఇరపిండి దగ్గర హిరండీశ్వరుడు... పోలవరం దగ్గర మహానందీశ్వరుడు... ఈ పట్టిసం దగ్గర వీరేశ్వరుడు... నరసాపురం దగ్గర అంతర్వేదిలో లక్ష్మీనరసింహస్వామి. ఈ అయిదుగురూ అన్న దమ్ములంటండి," అన్నాడు.

"అలాగా," అంటూ షార్ట్స్ వేసుకొని టాపెక్కి నీళ్ళలోకి దూకబోతున్న హరికృష్ణ చెయ్యట్టుకొని ఆపిన మాణిక్యం, "వద్దండి. దూక్కండీ... ఇక్కడ కత్తిరోడ్డుంది," అన్నాడు.

"కత్తిరోడ్డా... అదేంటి?" అడిగింది గీత.

"గోదారి మధ్యలో లోతయిన గొయ్యి ఎన్నో వందల మీటర్ల పొడుగుండటం వల్ల దాన్ని కత్తిరోడ్డు అంటారు. పొరపాటున ఆ రోడ్డులోకెవరైనా దిగితే ఇక కొట్టుకుపోయి నట్టేనండీ. అలాంటి రోడ్డు ఇక్కడుందండి... పాపికొండల కెళ్ళేలోపు చాలా ఉన్నాయనుకోండి," అని చెప్పి లాంచీ కొంత దూరం వెళ్ళేక చుక్కాని దగ్గరకెళ్ళి తక్కువ లోతెక్కడుందో చూసుకుంటా ఒకచోట కెళ్ళేకా, "టాపు టాపు కొట్టరా," అనరిచేసరికి ఇంజను రూములో ఫస్టు బెల్లు మోగింది. నీళ్ళలోనే చూసుకుంటా రెండుసార్లు తాడు లాగేరు పట్టిసీమ మాణిక్యంగారు.



ఇంజను న్యూట్రలు చేశాడు కన్నాజీ.

ఒక పక్ర అంచు చూపించిన తాతారావు, "ఇక్కడ తమరు జలకాలాడొచ్చు," అంటూ మూడుసార్లు తాడు లాగేడు. దాంతో ఇంజను మొత్తం ఆగిపోయింది.

గెళ్ళేసి లాంచీని ఒడ్డుకి లాగి గునపం దిగేసి దానికి మోకుతాడు కట్టేరు. వాళ్ళిద్దరి దగ్గరకీ వచ్చిన మాణిక్యంగారు, "ఇక తవరు స్నానాలు చెయ్యొచ్చు సారుగారూ," అంటా వంటగది వేపున చూస్తా, "ఒరే సత్తిబాబూ, ముత్తెం మొదలెట్టండ్రా వంట," అనరిచేడు. ఇద్దరూ తల్లి గోదాట్లోకి దిగి స్నానాలు చేసి లాంచీలో వాళ్ళకోసం ఏర్పాటుచేసిన కేబిన్‌రూమ్‌లోకి వెళ్ళి బట్టలు మార్చుకునొచ్చేరు.

వంటింకా అవ్వలేదు. చుక్కాని చిలక పైనున్న తాడు లాగితే వెళ్తున్న సీతారామా లాంచీ ఒక కొండ మలుపు తిరిగింది. ఆ మలుపులో గోదావరికి కుడిపక్కన ఒడ్డు మీదున్న పసుపూ ఎరుపు రంగులేసున్న గండి పోశమ్మ తల్లి గుడి కనిపించేసేరికి లాంచీ అక్కడాపేరు.

అంతసేపూ గోదాట్లో ఎక్కడ చూసినా ఉడికిపోతా ఉన్న వాతావరణం ఇక్కడ మట్టుకి చెట్లనీడల మధ్యలో చల్లగా హాయిగా ఉంది. కారణమేంటని కన్నాజీ నడిగితే, "ఈ అమ్మవారు మహాశక్తి," అన్నాడు. వివరంగా చెప్పమంటే మరి మొదలెట్టాడు.



ఈ పోశమ్మ తల్లి గిరిజన జాతికి చెందిందంట. చింతచెట్టు కింద వెలిసిన ఈవిడకి పూడిపల్లి గొందూరు ఊళ్ళ జనం గుడి కట్టించేరంట. అయితే ఈ గుడిలో గణాచారి ఉండడంట. లాంచీల మీదా, నావల మీదా అమ్మవారి దర్శనాని కొచ్చిన భక్తులు కోళ్ళు మేకలూ కోసి ఆ శక్తికి నైవేద్యం పెట్టేక ఆ చెట్ల కిందే వండుకు తిన్నాకా చీకటిపడేలోపే వెళ్ళిపోయేవారంట. ఎందుకంటే అది నది ఒడ్డునున్న అడవి ప్రాంతం. అందులోకీ చాలా భయం కలిగించే అమ్మవారి నిలువెత్తు రూపం. దరిమిలా భక్తుల కోరికలు నెరవేరడంతో జనం బాగా పెరిగారు. అమ్మవారి ఆదాయం పెరిగింది. దాంతో ఎండోమెంటువారు గుడిని స్వాధీనం చేసుకొన్నారు.

బొచ్చి అప్పారావు అనే అతనొచ్చి కొబ్బరికాయల దుకాణం పెట్టాడు. సారిక నాగేశ్వరావొచ్చి కాఫీ హోటలు పెట్టాడు. దుర్గారావు కిళ్ళీకొట్టు, పన రాములు కిరాణా కొట్టు పెట్టి కాపురాలు కూడా అక్కడే ఉండే సరికి వచ్చిన భక్తులు కూడా రాత్రుళ్ళు అక్కడే ఉండిపోవడం మొదలెట్టారు. ఎక్కడెక్కడ నుంచో వచ్చిన జనం బతుకుతెరువు చూసుకుంటా అక్కడే కాపురాలు పెట్టారు. దాంతో అక్కడో చిన్న గ్రామం ఏర్పడింది. ఆ గ్రామం ఇప్పుడు పోశమ్మ గండిగా పిలవడుతుంది.

వర్షాకాలంలో వరదలప్పుడు వడి ఆ గండి దగ్గరే ఎక్కువ ఉంటుందంట. అటుగా వెళ్ళే జనాల్ని ముఖ్యంగా చేపలు పట్టే జాలరోళ్ళనీ ఆ మహాతల్లే కాపాడు తుంది. అందుకే చాలామంది జాలరివాళ్ళు వాళ్ళ పిల్లలకి పోశమ్మ తల్లి పేరు పెట్టుకొంటారు. వాళ్ళ వేటనావల మీద ఆ ఆదిశక్తి పేరు రాసుకొంటారు.

పోశమ్మ గండిలో దిగి ఆదిశక్తిని దర్శనాలు చేసుకొచ్చిన అందరూ ఎందుకో తెలీదుగానీ పోశమ్మ తల్లి గుడి దగ్గరే విశ్రాంతి తీసుకోవడం మొదలెట్టారు.

చల్లని ఆ చెట్లనీడలో ఆదమరిచి నిద్రపోయిన విమలగీత, హరికృష్ణ లేచేసరికి సాయంత్రమైంది.

కళాసీ ముత్యం టీ పట్టుకొచ్చేడు. అది తాగి లాంచీ ఎక్కేసరికి కదిలి ముందు కెళ్తుందది. గాలి ఏమాత్రం ఆడ్డంలేదు. శరీరాల్లోంచి పొంగుకొస్తున్న చెమట్లకి కట్టుకొన్న బట్టలన్నీ తడిసిపోతున్నాయి. అర్జంటుగా స్నానాలు చేస్తే బాగుణ్ణు అనిపించింది గీతకి.

ఎడంపక్కనున్న పైడిపాక రేవులో లాంచీని ఆపమని గోదాట్లోకి మునిగి స్నానాలు చేశాకా ముందుకెళు తుంటే నదికి కుడిపక్కనున్న అందమైన పూడిపల్లి గ్రామం కనిపించేసరికి లాంచీ స్పీడు తగ్గించేడు కన్నాజీ.

లాంచీలోంచే చూస్తున్న విమలగీత, హరికృష్ణలకి పూరిపాకలు పెంకుటిళ్ళ మధ్యలో రంగు వెలిసిపోయిన మేడలు, డాబా ఇళ్ళు కనిపించాయి.

ముందుకెళ్తుంది సీతారామాలాంచీ. సూర్యుడు పడమర దిగిపోతున్నాడు. గోదాట్లో గాలి సుళ్ళు తిరుగుతా వీస్తుంది. లాంచీ దేవీపట్నం రేవులో ఆగింది.

ఒడ్డునే కొండ మీదున్న గుళ్ళల్లో దీపాలు వెలుగుతున్నాయి. పూజార్ల మంత్రాలు మొదలవుతున్నాయి.

ఆవేళ పౌర్ణమి. గోదావరికి తూరుపు దిక్కున చంద్రోదయమవుతుంది. వెన్నెల్లో గోదారి చాలా అందంగా ఉంది. దాన్ని కళ్ళతో చూడాలి తప్ప చెప్పకూడదు. గోదాట్లో పూసిన వెన్నెల్లో వీస్తున్న ఆ గాలి తన గులాబీరంగు వేళ్ళ సందుల్లోంచి చూస్తుంటే మహదానందంగా అనిపిస్తున్నాయి. గత జన్మలు గుర్తుకొస్తున్నాయి.

ఆ వెండి వెలుగుల్లో కల్సిన పారిజాత పరిమళాల్లో కల్సిన గుండ్రటి వెండి చంద్రుడు ఒకటే వెలిగిపోతున్నాడు. గోదావరి ఒడ్డుకి కుడిపక్కన ఉన్న గ్రామంలోంచి నన్ను దోచుకొందువటే వన్నెల దొరసానీ... పాట గాలిలో కల్సి వినిపిస్తుంది.

పాపికొండల్నుంచి వస్తున్న టూరిజం బోట్లో జనం పాటలు వింటూ డాన్సులు చేస్తున్నారు. గాలి గిసగిసా శబ్దాలు చేస్తా వినిపిస్తుంది.

గోదాట్లో వలలు వేసిన చోట వచ్చేపోయేవాళ్ళు గుర్తించేందుకు ఆనవాలుగా ఆనపకాయల్లో ఉంచిన ఇళాయిబుడ్లు నేలకి దిగిన నక్షత్రాల్లో మెరుస్తున్నాయి.

లాంచీ ఆగగానే దిగిపోయిన అంజిబాబు, "సరిగ్గా పౌర్ణమి చూసుకొనే దిగిపోయేరన్నమాట," అన్నాడు.

"మా ప్లానే అది గదండీ," అంది గీత.

"ఈ గోదారి ఒడ్డున ఉద్యోగం చెయ్యడం గతజన్మలో చేసుకొన్న పుణ్యమే నండీ," అంటూ డైరీ తీసి నది మీద తను రాసుకొన్న అనుభూతుల్ని చదూ తుంటే బుంగమీసాల్తో నవ్వుతా వాళ్ళ మధ్యలోకొచ్చిన మాణిక్యం, "ఇంక తవఁరు ఈ పోలీసుజ్జోగానికి రాజీనామా చేసేసి కవిత్వం రాసేసుకోవచ్చండోయ్," అన్నాడు.

దానికి అంజిబాబు నవ్వేస్తుంటే ఆ వెన్నెల్లో నావ వేసుకొని కచ్చులూరు నించి దిగిపోయిన రత్నప్రసాద్, "ఈసారి మా ఊళ్ళోనే మకాం పెడ్తానని ప్రామిస్ చేసి ఇదేంటి?" అంటా చాలా పెద్ద గొడవే పడ్డాడు.

ఆకాశంలో ఎదుగుతున్న చంద్రుడు వెండిరంగులో కొస్తున్నకొద్దీ నీళ్ళల్లో మెరుపులు పెరుగుతున్నాయి. చల్లగాలితోపాటు అలల తపతపల చప్పుళ్ళు పెరిగాయి. అంతా నది మధ్యలో ఉన్న ఆ ఇసకతిప్ప మీద కూర్చుని ఆకాశంకేసి చూస్తూ, "ఇలాంటి అనుభవాలు ఏ కొందరు అదృష్టవంతులకో తప్ప అందరికీ దక్కవు," అన్నారు.

*

పదిగంటలు దాటేసరికి గోదావరంతా వెన్నెలే వెన్నెల. వాతావరణం బాగా చల్లబడిపోయింది. వాళ్ళకి కాస్త దూరంగా పెద్ద ఇసుకతిప్ప ఉంది. దాని వెనక్కి వెళ్తే ఎవ్వరికీ కనబడరు. అలా వెళ్ళిన వాళ్ళిద్దరూ ఆ రాత్రంతా ప్రకృతి ఒడిలో శృంగారానికి దిగారు.

తెల్లవారింది. కొండ మీద ఆంజనేయస్వామి గుళ్ళోంచి దండకం విన్పిస్తుంది. రాత్రినించీ వీస్తున్న గాలి ఇప్పుడాగిపోయింది. నావల్లో కెక్కిన జనం అవతలున్న కంపెనీ రేవు (ఆ రేవు పేరు)లో కెళ్ళడానికి బట్టల మూటల పైకిలూ, సీవండి గిన్నెల పైకిలో నావలోకెళ్తున్నాయి.

కూనవరం నించి రాజమండ్రి వెళ్తున్న పాసింజరు లాంచీ ఈ రేవులోకొస్తుంటే తన బైనాక్యులర్‌తో ఆ లాంచీలో జనాల్ని చూస్తా వెతుక్కొంటున్నాడు కన్నాజీ. రేవుకి కాస్త దూరంగా బట్టలుతికేవోళ్ళ గూనల్లో చౌడేసి నానబెట్టిన బట్టలు ఉడుకుతున్నాయి. రేవంతా సందడిగా ఉంది. గాలాడ్డం లేదు. ఒకటే ఉక్క. పెరిగే ఎండ గూబలు వాయగొట్టడం మొదలెట్టింది. ఎస్సై అంజిబాబుకి బై చెప్పడంతో బయల్దేరింది లాంచీ.

సింగన్నపల్లి రేవులో మొబైల్ చెక్‌పోస్టు వాళ్ళు ఆపితే సంతకాలు చేసొచ్చాడు మాణిక్యంగారు. ముందుకు పోనిమ్మన్నాడు. లాంచీ కొత్తూరు దాటి మాంధాపురం వచ్చిందో లేదో అడుగున పెద్దబండరాయి తగిలి ఫేను





రెక్క విరిగిపోవడంతో ఆగిపోయింది. రెంచి పట్టుకొని నీళ్ళలో మునిగి కన్నాజీ విరిగిన ఫేన్ నిప్పుకొని పైకి తేలాడు.

స్పేరుఫేన్ కోసం వెతికితే లేదు. అందరి మీదా చాలా కోపం వచ్చేసింది మాణిక్యానికి. ఎవరితోనూ ఏం మాటాడక లాంచీ టాపు మీదున్న టైరు మీద కూర్చున్నాడు. దాంతో అంతా తెగ భయపడిపోతున్నారు. ఆ వాతావరణం అంతా చూసిన హరికృష్ణ ఇనప నిచ్చెనెక్కి మాణిక్యం దగ్గరకెళ్ళి, "మీరేం ఫీలవ్వకండి మాణిక్యం గారూ! పోలవరంలో ఎవరో మంచి వెల్డరున్నాడంట తాతారావుతో పాటు నేనూ వెళ్ళొస్తాను," అన్నాడు.

"ఈ ఎదవ తత్తుకొడుకు కండకావరం గాకపోతే జూడండి మీ ముందే మొన్న సీజన్లో తిడితే భరోసా ఇచ్చేరు..." అన్నాడు.

"వాళ్ళనేవీ అనకండి... మేవేం ఇబ్బంది పడటంలేదు."

"స్వారీ అండి సార్‌గారూ," అని మాణిక్యం తెగ బాధపడిపోతుంటే నవ్వేసిన హరికృష్ణ క్రాసవుతున్న పాసింజరు లాంచీని ఆపి తాతారావుతో పాటు ఎక్కి పోలవరం రేవుకి టిక్కెట్లు కొన్నాడు.

లాంచీ నిండా ఒకటే జనం. ఎదరాలు బల్లల మీద చోటులేక చాలామంది గిరిజనులు కిందే కూర్చున్నారు. వాళ్ళతోపాటు ఒక చిలకజోస్యం వాడూ కూర్చున్నాడు. వాడి దగ్గరకెళ్ళి కూర్చుని జోస్యం చెప్పించుకొంటున్న హరికృష్ణ కేసి చూస్తున్న లాంచీలో కొందరు మూగేరు. కాస్సేపటికి వాడు బిజీ అయిపోయాడు.

రకరకాల రేవులు దాటుకుంటూ పోలవరం రేవులో ఆగిందా పాసింజరు లాంచీ.

నది ఒడ్డున ఉన్న చిన్న టౌను పోలవరం. కాఫీహోటెళ్ళ లోంచి లేటెస్ట్‌గా రిలీజైన సినిమా పాటలు జాంజామ్మంటా వినిపిస్తున్నాయి. రోడ్డుకి ఎడంపక్క టూరింగ్ టాకీస్‌లో మాస్ హీరో పోస్టరొకటి అంటించుంది.

ఆంజనేయ స్వామి గుళ్ళో నుంచి వస్తున్న భక్తిపాటని స్పీడుగా వచ్చిన బస్సు రోడ్డుకి అటుపక్క వాళ్ళకి విన్పించకుండా కట్ చేసి అదెళ్ళాకా మళ్ళీ వినిపిస్తుంది పాట. ఎక్కడ చూసినా జనం గోదారి యాసలో రకరకాల మోటుమాటలు, కేకలు, కూకలు.

తాతారావూ హరికృష్ణా ఆ చిన్న వర్క్‌షాపు దగ్గరకొచ్చేసరికి షాపు ఓనరూ వర్కరూ దెబ్బలాడు కొంటున్నారు.

వాళ్ళ గొడవలోంచి అర్థమవుతుందేంటంటే ఆ వర్క్‌షాపు ఓనరు పేరు పుల్లారావు. ఆ వర్కర్ పేరు సాయిరాజు. చాలా బ్రిలియంటైన వాడో మూడీ ఫెలో. తనకి మూడ్ వస్తే తప్ప పనిచెయ్యలేడు. 'మిషన్‌లా పనిజెయ్యడం నాకు రాదు,' అంటున్నాడు వాడు. 'బేరం ఒప్పుకొన్నాకా మూడు, గాడిదగుడ్డూ అంటే ఎలాగ. ఒకరోజు గాదు రెండ్రోజులు గాదు ప్రెతీరోజూ ఇదే పెంటయిపోతుందీడితో,' అంటున్నాడు పుల్లారావు.

గొడవయ్యాక తెగెతెంపులు చేసుకొని ఆ చిన్న వర్క్‌షాపు లోంచి బయటి కొచ్చేస్తున్న సాయిరాజు, తాతారావు చేతిలో రెక్క విరిగిపోయిన ఫేన్ చూసి, 'కొత్తది చెయ్యాలి. ఇది పనికిరాదు,' అని దాన్నందుకొని వెంటనే ఇనుము కరిగించి పోతపోసి గ్రైండ్ చేసి మర కొయ్యడానికి లేత్ మిషనెక్కిస్తుంటే మతోయినట్టు చూస్తున్నాడు పుల్లారావు. ఇప్పుడే వస్తానండి అంటా బయటికెళ్ళాడు తాతారావు.

ఒక పక్కన లేత్ మిషన్‌కి పళ్ళచక్రాలు బిగిస్తా, "ఏ ఊరు గురూ మన్ది?" అన్నాడు సాయిరాజు.

"హైదరాబాదు," అన్నాడు హరికృష్ణ.

"ఈమధ్య గోదాట్లో టూరిస్టులు బాగా పెరిగారు నువ్వూ ఆ బాపతే అనుకొంటాను," అని నవ్వి, "నువ్వేం అనుకోపోతే పక్కనే ఉన్న పీర్ల సాయిబు హోటెల్లో ఓ టీ చెప్పేసి వస్తా... ఓ అరపెట్టి చార్మినార్రా," అన్నాడు.

నవ్వుతా, 'అలాగే,' అని బయల్దేరిన హరికృష్ణని వెనక్కి పిల్చి, "టీ సాయిరాజుకని చెప్పు. పొడుం మార్చి కొంచెం చిక్కగాజేసి మరగేస్తాడు," అన్నాడు.

"అలాగే," అంటా నవ్వుతా వెళ్ళిన హరికృష్ణ పక్కనే ఉన్న సాయిబు హోటల్లో టీ చెప్పి తనో టీ తాగి తిరిగొస్తా సాయిరాజడిగిన చార్మినార్ సిగరెట్లు కొనుక్కొచ్చే లోగా కొత్త ఫేన్ రెడీ అవ్వడమే గాకుండా పాత ఫేన్ని వెల్డింగ్ కూడా చేసేసేడు సాయిరాజు.

డబ్బులు తీసుకొంటున్న వర్క్‌షాపు ఓనరు పుల్లారావు, "ఈడంత ఆషామాషీ మనిషి కాదండి... కాస్త చదువుగానీ ఉండుంటే చాలా గొప్ప ఇంజనీరయిపోయుండే వోడండి... కాపోతే ఒకటే ఇబ్బందండి... ఏంజేసినా మనసుతో చెయ్యాలంటాడు. అలా చెయ్యడానికి మూడు రావాలంటాడు... కొరుక్కు తినేస్తున్నాడనుకోండి," అన్నాడు.

ఈలోగా ఏదో కాయితం పొట్లంతో దిగిన తాతారావుతో, "బయల్దేరదావా?" అంటే, "ఆయ్," అన్నాడు.

తాతారావు భుజం మీద చెయ్యేసిన హరికృష్ణ "అడగడం మర్చిపోయేను. మీ ఆవిడెలాగుంది?" అన్నాడు.

"దానికేంటండీ... రుబ్బురోలు పొత్రంలాగ బానే ఉందండి... తెల్లారితే టీవీ ముందే గడండీ కూకోడం. మీకో విషయం తెల్సాండీ మా యావిడ పోలికలు మట్టుకే మా నాన్నయ్యి అనుకొన్నాను బుద్దులు కూడా అని పోనుపోను అర్థవయ్యిందండి," అన్నాడు తాతారావు.

"మీ అమ్మ ఎలాగుంది?" అన్నాడు హరికృష్ణ.

నవ్వేసిన తాతారావు, "నేను బతికున్నంతకాలం మాయమ్మ బానే ఉంటదండి," అన్నాడు.

"మీ అమ్మనెంత బాగా చూసుకుంటావో మీ ఆవిడ్ని కూడా అంత బాగా చూసుకోవాలి తాతారావ్."

"మీరు కూడా ఇలాగే మాటాడ్తారేంటండి అబ్బులుగారూ. తిన్నగా ఉంటే చూసుకుంటాం. మా నాన్నలాగ దగుల్బాజీ పన్లు చేస్తుంటే ఎలా చూసుకుంటాం?"

"ఏం చేసింది?" అడిగాడు హరికృష్ణ.

"మొన్నటికి మొన్న రథం వీధిలో మెండా హనుమంతరావుగారి దగ్గర అయిదు వేలకి చీటీకట్టి మూడోనెల తర్వాత అడ్డంగా పాడి డబ్బులు తీసేసుకొని ఆ తర్వాత కట్టడం మానేసింది. దాంతో కొంపమీద కొచ్చేరా షావుకార్లు. అడ్డెళ్ళిన మా యమ్మ చేతి మురుగులమ్మి కట్టింది గాబట్టి సరిపోయింది. లేకపోతే ఏమవును?" అన్నాడు.

చాలా దిగువలో ఉన్న రేవులోకొచ్చిన వాళ్ళకి కూనవరం వెళ్ళే పాసింజరులాంచీ కనిపిస్తే పిల్చి ఎక్కి మాంధాపురం రేవులోకి టిక్కెట్లు కొన్నారు. పల్చగా ఉన్నారు లాంచీలో జనం. కొండల్లోపలి గ్రామాల్లో గిరిజనులే ఎక్కువున్నారు. మిగతా వాళ్ళంతా బట్టలు, అల్యూమినియం సామాను, కిరాణా అమ్ముకొనే వ్యాపారస్తులు.





సాయిరాజు చేసిన ఫేన్ రెక్కనే చూస్తున్న హరికృష్ణ, "నువ్వు పసిగట్టేవో లేదోగానీ తాతారావూ... ఆ సాయిరాజు చాలా గొప్ప వర్కరు. మారుమూలుండిపోయిన మేధావి తెల్సా?" అన్నాడు.

"అలాగాండీ," అంటా ఆ ఫేన్‌ని చూసిన తాతారావు, "నిజవేనండి. ఇలాంటియ్యి మా దవిళేశ్వరంలో ఉన్నా పెద్దపెద్ద పాండ్రీల్లో పోతపోస్తారు. మీరన్నట్టు ఈ మారు మూలనున్న ఈడిలా జెయ్యడం అది క్షణాల మీద జెయ్యడం... గొప్ప విషయవేనండీ," అన్నాడు.

"ఐతే... ఏంజేసినా మనసు పెట్టి చేస్తాడా సాయిరాజు... ఈ టైములో మన మంగరాజు గుర్తుకొస్తున్నాడు నాకు... అతను కూడా ఇదే చెప్పాడు ఏం చేసినా మనసుతో చెయ్యి అని... ఈ గొప్పమాట ఎవరు చెప్పారో తెల్సా?"

"ఎవరు చెప్పారు?"

"మన అచ్చిరెడ్డి మంగరాజు," అంటా మాటాడ్తూ పోతున్న హరికృష్ణని ఆ మనిషి చూశాడు.

నల్లగా, బలంగా, ఎత్తుగా తుమ్మదుంగ లాగున్నాడు. తెల్లటి టెరికాటన్ లాల్చీ పైజామా, చంకలో బ్రౌన్‌కలర్ తోలుసంచీతో ఉన్న ఆ మనిషి బరువు నూట ఇరవై కిలోలకి తక్కువుండడు. హరికృష్ణ మాటతీరూ కలుపుగోలుతనం చూసి, "ఏ ఊరు మన్ది?" అన్నాడు.

"హైదరాబాదు," అన్నాడు హరికృష్ణ.

"చూస్తుంటే ఏ గవర్నమెంటాఫీసులో ఉజ్జోగం చేసే మనిషిలాగనిపిస్తున్నావ్... నేనన్నది రైటేనా?" అన్నాడు.

నవ్విన హరికృష్ణ చెప్పండన్నాడు.

తన పేరు మాజేటి రామాంజనేయులంట. ఈ గోదాట్లో తిరిగే మహారాణీ, యువరాణీ, త్రిలోకసుందరీ లాంచీలు తనవేనంట. ముందుకెళ్తే వందల ఎకరాల్లో ఎండే మిరపపంటలంతా తను కొంటాడంట.

"అలాగా," అన్నాడు హరికృష్ణ.

"మాటలు మెత్తగా ఉన్నా నీ మొకం మాటతీరూ జూస్తుంటే చాకులాగున్నావ్. నీకొచ్చే జీతం కన్నా అయిదొందలెక్కువిస్తాను. నా దగ్గర గుమాస్తా వుజ్జోగం చెయ్యొచ్చు గదా?" అన్నాడు షావుకారు.

చెయ్యొచ్చన్నట్టు నవ్వాడు హరికృష్ణ.

"నవ్వడం గాదబ్బాయ్... నీ ఫేమిలీతోపాటు మా రాజమండ్రి వస్తే డైలీ తిరిగే రాజమండ్రి... కొండమొదలు పాసింజరు లాంచీలో నీకు గుమాస్తా పోస్టు ఇస్తాను. వందా రెండొందలుగాదు నెలకి ఏడొందలిస్తాం. ఏవంటావ్?"

చాలాసేపట్నుంచి అతనడిగినదానికి నవ్వుతున్న హరికృష్ణ మళ్ళీ ఇంకోసారి నవ్వేసి, "రావాల్సిన పరిస్థితి వస్తే తప్పక వస్తానండి," అన్నాడు.

"మా రాజమండ్రిలో ఇప్పుడు చాలా డబ్బున్నోళ్ళంతా ముందు మాలాంటి షావుకార్ల దగ్గర పనిజేసినోళ్ళే," అన్న ఆ రామాంజనేయులు కొంతదూరమెళ్ళాక ఆరబెట్టిన మిరపపళ్ళ దగ్గర దిగిపోయాకా మళ్ళీ కదిలిన లాంచీ మాంధాపురం రేవులో వాళ్ళిద్దర్నీ దింపెళ్ళింది.

వెల్డింగ్ చేయించిన ఫేన్‌ని లాంచీ అడుగున బిగించేసరికి మధ్యాహ్నం మూడు. కాయకష్టం చేసొచ్చినట్టు అలిసిపోయిన హరికృష్ణకి, తాతారావుకి అన్నం పెట్టిన సత్తిబాబు నాటుకోడి, పచ్చి జీడిపప్పు ఇగురు వేసి చారుగిన్నె ముందు పెట్టాడు. అద్భుతమైన ఆ కూర రుచికి మతిపోయిన హరికృష్ణ, "ఏం టేస్టూ... ఏం టేస్టూ... ఎక్కడ నేర్చుకొన్నావయ్యా ఇంత గొప్పగా చెయ్యడం," అన్నాడు.

ఆబగా తింటున్న తాతారావు కొంచెం ఆగి, "ఇంకెక్కడండి వాళ్ళ రవణమ్మ దగ్గర," అన్నాడు.

ఇంతలో అక్కడికొచ్చిన గీత, "మనం ఇన్ని రకాల సూప్స్ తాగేం కానీ... ఈ చింతపండు చారు రుచి ఎక్కడా చూసెరగం. నేనైతే గ్లాసులో పోసుకు తాగేసేను," అంది.

ఆ భోజనాన్ని తెగ మెచ్చుకొంటూ తింటుండగానే లాంచీ స్టార్ట్ చేసిన కన్నాజీ ఫస్ట్ గేరేసి చుక్కాని చిలకతో కుడిపక్కకి కోసేడు. గోదావరి మధ్యలోకొచ్చిన లాంచీ కోండ్రుకోటా, వాడపల్లి దాటగానే కూనవరం నుంచి రాజమండ్రి వేపెళ్తున్న ఇంకో పాసింజరు లాంచీ వాళ్ళకెదురైంది. దాని పేరు వెంకటేశ్వరి. అదీ మాణిక్యం గారిదే. అయితే వాళ్ళన్నయ్య సోమేశ్వర్రావు నడుపుతాడు దాన్ని. ఇంజనురూములో కూర్చునే బైనాక్యులర్ తీసి ఆ లాంచీలో జనాన్ని చూస్తున్నాడు కన్నాజీ.

లాంచీ ఎర్రవరం రేవులో కొచ్చేసరికి ఆ రేవు ఒడ్డున ఆగున్న మొబైల్ హాస్పిటలు లాంచీ లోపల ఒక స్త్రీ గుక్కతిప్పుకోకుండా అరుస్తుంది. అవి కేకలు. మామూలు కేకలు గాదు పొలికేకలు. అది చూసిన విమలగీత, "మన లాంచీని అక్కడికి పోనియ్యండి," అనరిచింది.

ఆగిన లాంచీలోంచి ఆ గట్టు మీదకి దూకిన వాళ్ళంతా మొబైల్ హాస్పిటల్లోకి పరుగెత్తారు. కేబిన్‌రూమ్‌లో బల్లమీద నెలలు నిండిన కొండరెడ్ల సీతమ్మ నొప్పులు రావడంతో గిలగిలా కొట్టుకొంటోంది. ఆమెని పట్టుకొన్న ఇద్దరు మేల్ నర్సులూ ఆపలేకపోతున్నారు. కడుపులో బిడ్డ అడ్డం తిరిగిందని డాక్టరు చెపుతుంటే ఒడ్డున నిలబడ్డ సీతమ్మ భర్త రాజన్న ఏడుస్తున్నాడు. మగాడలా ఏడుస్తుంటే చూళ్ళేకపోయిన విమలగీత ఓదార్చిందతన్ని.

సిజేరియన్ చెయ్యాలి సంతకం పెట్టమని పేడ్ క్లిప్పు పెట్టిన కాయితం ఇస్తే వేలిముద్ర వేశాడు రాజన్న.

కేబిన్‌రూమ్ తలుపులు మూసెయ్యబోతుంటే లోపలికి దూరింది గీత. ఇద్దరు నర్సులూ సీతమ్మని కూర్చోబెట్టి నడుం ముందుకు వంచుతుంటే గీత కూడా సాయపడింది. డాక్టరు చెపితే ఆ సీతమ్మ తలని మోకాళ్ళ మధ్యలో పెట్టి నొక్కింది గీత. స్పెషల్ ఎనస్తీషియా ఇచ్చాడు డెన్నిస్ జోసెఫ్.

కొండరెడ్ల సీతమ్మని ఆపరేషన్ టేబిల్ మీద వెల్లకిలా పడుకోబెట్టి కాళ్ళు ఎడం చేసి ఉంచారు. ఆరు నిమిషాల తర్వాత పొత్తికడుపు దగ్గర ఏడు సెంటీమీటర్లు కట్ చేసి బిడ్డ తలని ముందు బయటికి తీసేసి బొడ్డు కోసి మేల్ నర్స్‌కిస్తే ఆ నర్స్‌తో పాటు గీత కూడా వెళ్ళింది. ఏడ్వని బిడ్డ పిర్రల మీద మెత్తగా కొట్టేసరికి మరి ఏడుపు మొదలెట్టింది.

బొడ్డు దగ్గర దారం కట్టిన నర్సు ఆ బిడ్డని శుభ్రం చేసి స్నానం చేయిస్తుంటే గీత కూడా సాయపడ్డం మొదలెట్టింది.

చాలా చాతుర్యంగా సీతమ్మకి కుట్లేసిన డాక్టర్ డెన్నిస్ ఆ జీసస్‌కి ప్రేయర్ చేస్తుంటే వెనకే నిలబడ్డ గీత కూడా ప్రార్థన చేసింది.

ఆపరేషన్ సక్సెస్. ఆడపిల్ల అందంగా ఏడుస్తుంది.

గట్టు మీద నిలబడ్డ రాజన్నతో, "పిల్లని బాగా చూసుకోండి... మంచి బట్టలు కొనుక్కోండి," అంటా పదివేల రూపాయల నోట్లకట్ట ఆ రాజన్న చేతికిచ్చింది గీత.





దాన్ని చూసిన రాజన్నతోపాటు ఆ చుట్టుపక్కల జనాలకి మతులు పోయాయి.

పుట్టేకా పదివేలని చూడని రాజన్నకి ఇది కలో నిజమో అర్థం గావడం లేదు. అదిరిపోతా బెదిరిపోతా చూస్తున్నాడు.

కాకీనిక్కరు బొజ్జమీదికి లాక్కుంటా, రాజన్న దగ్గర కొచ్చి వాడి జబ్బ మీద చరిచిన మాణిక్యంగారు, 'ఆ అమ్మగారెవరనుకుంటున్నావ్‌రా ఎదవ తత్తుకొడకా, మామూలు బట్టల్లో దిగిన సీతమ్మోరు... ఇంక బెదిరిపోతా జూడ్డం మానేసి ఆటినందుకోరా బాబా," అంటా తన నల్లకళ్ళద్దాలోసారి తీసి తుడిచి మళ్ళీ పెట్టుకొన్నాడు.

*

వాళ్ళు కపిలేశ్వరపురం జనం కాపురముంటున్న ఆ ఇసుకతిప్ప మీదికొచ్చేసరికి చంద్రుడు ఆకాశంలో కొచ్చేసి బ్రహ్మాండంగా వెలిగిపోతున్నాడు. దిగిన గీత, హరికృష్ణల చుట్టూ బిలబిలమంటా సందడిచేస్తా వాళ్ళ ముందు మూగిపోతా మంగరాజు కనబడకపోయేసరికి, "ఆ ముసలతనెక్కడా?" అనడిగాడు హరికృష్ణ.

"కొల్లూరు తిప్పమీదుంటున్న బద్రరావుగాడికి ఒంట్లో బాగోలేదంటే చూడ్డానికని మధ్యాహ్నం లాంచీలో వెళ్ళేడండి," అంది ధనలక్ష్మి.

"అతన్నెప్పుడు చూద్దామా అని ఆత్రంగా ఉంది... ఇక్కడికి పాపికొండలెంత దూరం?" అడిగింది గీత.

"పది కిలోమీటర్లండి," అన్నాడు గంగారావు.

"అయితే ఇది ఆ పాపికొండలగాలే... చూడు గీత ఎంత చల్లగా ఉందో," అని ధనలక్ష్మిని దగ్గరికి పిల్చి, "చూడమ్మా వెన్నెల వెచ్చగా ఉంటుందా, చల్లగా ఉంటుందా?" అన్నాడు హరికృష్ణ.

"చల్లగా ఉంటదండి," అంది ధనలక్ష్మి.

పెళ్ళాన్ని ఇసకలోకి తోసి వాళ్ళ ముందుకొచ్చిన గంగారావు, "వెచ్చగా ఉంటదండి," అన్నాడు.

"కాదు చల్లగా ఉంటది."

"కాదెహె వెచ్చగా ఉంటది." వాళ్ళలా దెబ్బలాడుకుంటుండగానే ఒకపక్క నించి ఆ సందడి చూస్తానే ఆ పాకల్లో మగోళ్ళంతా పూటుగా తాగడం మొదలెట్టేరు. అది చూసిన లాంచీ స్టాఫులో కొందరు వాళ్ళని ఫాలో అయిపోయేరు. అందరికంటే ముందు సత్తిబాబు. వెన్నెల్లో ఆ ఇసుకతిప్ప మీద ఒకటే సందడిగా ఉంది.

అంతలో ఒక పాకలోంచి వెంకటలక్ష్మి అనే ముప్ఫై ఏళ్ళ మనిషి మట్టిదాకలో పొగలు కక్కుతా కమ్మటి వాసనేస్తున్నదేదో తెచ్చింది. "ఏంటిదీ?" అంది గీత.

"లచ్చుంచారు (లక్ష్మీచారు) కుండకి బొట్లెట్టి పూజచేసి అన్నం వార్చిన గెంజీ కడుగూ ఆ కుండలో ఏసి అది పులిసేక కాస్తారు లచ్చుంచారు... సవ్వాదిగా ఉంటదని మీకోసం ఎండిరెయ్యిల తలకాయలేసి మరీ కాసేనండి," అంది వెంకటలక్ష్మి.

ఒక స్పూనుతో దాన్ని తీసుకొని తాగిన హరికృష్ణ, "చాలా బాగుంది రుచి," అన్నాడు.

మరిడమ్మ అనే ఇంకో మనిషి ఎండురొయ్యలు, తెలగపిండి కూర, పచ్చి రొయ్యలు, చింతచిగురు తెచ్చింది. వాటి రుచి చూసిన గీత "అమోఘం. ఈ గోదావరిలోకి రాకపోతే ఈ రుచులు మిస్సయిపోదును," అనరిచింది.

ఇంతలో ఆ వెన్నెట్లో అప్పటికప్పుడు పట్టిన జెల్లని నిప్పుల్లో కాల్చి తన పొడుగాటి గోళ్ళతో ఆ చేప చర్మం లాగిపారేసేక ఆ ఉడికిన ఫ్లెష్ మీద సముద్రలవణం, ఎర్రకారం, నారింజరసం అద్ది వాళ్ళకందించేడు.

ఆకాశంలో చంద్రుడ్ని చూస్తా వెన్నెల్లో గోదావరిని చూస్తా అది తిన్న గీత, హరికృష్ణలు-

"అద్భుతం. నిన్ను, ఈ రుచినీ ఎప్పటికీ మర్చిపోలేం," అన్నారు.

చాలా సంతోషంగా నవ్వుతా ఆ వెన్నెల్లో వెలిగిపోతున్న వాళ్ళనే చూస్తా వెళ్ళిపోతున్న మనిషెవరో కాదు... రాంపండు. చేసిన తప్పుని ఒప్పుకొని పూర్తిగా మారిపోయిన రాంపండు. అందరు చేసినవీ బాగున్నాయి. రాంపండు చేసిందయితే మహాద్భుతంగా ఉన్నాయనుకొన్నారు వాళ్ళు. "ఈ రుచులు స్టార్ హోటల్స్‌కెళ్ళి వేలు పోస్తే వస్తాయా... అసలివన్నీ ఇంత రుచిగా ఉండటానికి వీటిలో వాళ్ళేం వేసి కలియబెట్టారో తెల్సా?" అంది గీత.

"ఏం వేసేరు?" అడిగాడు హరికృష్ణ.

"ఆప్యాయత... అనురాగం... అవును వాటిని ఈ వంటలో వేసి చెక్కగరిటెతో కలబెట్టారు... లేకపోతే ఇంత రుచెలాగొస్తుంది?" అని ఎదురు ప్రశ్నేసింది విమలగీత.

వాతావరణంలో గాలి పెరిగింది. వెన్నెల్లో వెలుగు పెరిగింది. ఆ వెన్నెల్ని చూస్తా పేరు తెలీని కొన్ని పక్షుల గుంపు ఆకాశంలో ఆ పక్కన ప్రయాణమై చంద్రుడి మీంచి ఈ పక్కకెళ్తుంది.

కపిలేశ్వరపురం జాలరి పాకల మధ్య మందెక్కువైన కృష్ణుడు రామాంజనేయ యుద్ధం నాటకంలో పద్యాలు పాడ్తున్నాడు.

ఆ వేసవికాలం వెన్నెల్లో వేద గోదావరి వింతవింత అందాల్తో వెండి వెన్నెల జిలుగుల్తో మెరిసిపోతుంది. విమలగీత, హరికృష్ణల ముందు గుమిగూడిన మిగతా జనంతో కల్సి చాలాసేపు మాటాడి, పరాచికాలాడి వాళ్ళతో పాటే భోజనం చేసి, ఆపిన లాంచీ పక్క ఇసుకతిప్ప వెనక వేసిన పరుపుల మీద కెళ్ళి వెచ్చటి రగ్గులు కప్పుకొని నిద్రపోకుండా ఆకాశంలో చంద్రుడ్నే చూస్తున్నారు. కాస్సేపటికి వెన్నెల వాళ్ళని కాటేసింది. తెల్లటి పరుపు మీద వెల్లకిలా పడుకున్న విమలగీత మీద వాలాడు హరికృష్ణ. తక్కిన విషయాల్లో ఏమోగానీ ఈ విషయంలో మట్టుకి గీతదే డామినేషనంతా. తను చెప్పినట్టే జరగాలంటుంది. అలా ఆ రాత్రంతా ఆమె కింద చాలాసార్లు ఓడిపోయాడు హరికృష్ణ.

తెల్లవారింది. వాకబు చేస్తే మంగరాజింకా రాలేదని తెల్సింది.

"ఓ పని జేస్తావండి... మేవెళ్ళి తీసుకునొస్తాం," అంటా నావ వేసుకుని బయలుదేరారు గంగారావూ, కృష్ణుడూ.

అందరూ ఆ ఒడ్డునున్న చెట్ల వెనక్కెళ్ళి వచ్చి ముఖాలు కడిగి స్నానాలు చేసేక గుచ్చిన గునపం లాగిన సత్తిబాబు, "ఒరేయ్ ఎల్లారావూ, టేకూరు రేవులోకి కొయ్యరా. ఇయ్యాళ మనందరి పలహారాలూ రవణమ్మ హోటల్లోనే," అనడంతో ఇంజను స్టార్ట్ చేశాడు కన్నాజీ.







చల్లని గాలి ముఖం మీదకొస్తుంటే సీతారామా లాంచీ టేకూరు వేపేళ్తుంటే మెండా ముత్యాన్ని పిల్చిన హరికృష్ణ, "ఆ మంగరాజు ఎగువలో ఉన్న కొల్లూరులో కూడా వడ్డీ వ్యాపారం చేస్తాడా?" అన్నాడు.

"ఆడు కొల్లూరులో ఏంటండీ ఇంకా పైనున్న కొయిదాలో కూడా చేస్తాడు... ఒక్క ముక్క జెప్పమంటారాండీ... ఎక్కడ ఎవడి ప్రేణం జిల్లార్చుకుపోద్దో అక్కడ మంగరాజుంటాండండీ," అన్నాడు.

టేకూరు రేవులో లాంచీ ఆగ్గానే లంగ రేసేస్తుంటే రేవులో బట్టలు ఉతుక్కుంటున్న ఆడోళ్ళంతా వీళ్ళనే చూస్తున్నారు.

నత్తిబాబుని ఒక ఆడమనిషికి చూపించిన మరో ఆడమనిషి గొంతు తగ్గించి ఏదో చెపుతుంది.



ఆకాశమంత ఎత్తున్న ఆ గట్టు పైకెక్కి రవణ మహోటలు దగ్గర కెళ్ళేసరికి పొయ్యి దగ్గర కూర్చున్న రవణమ్మ, "రాండి రాండి," అంటా స్వాగతం పలికింది.

ఆమె పొయ్యికి దూరంగా ఉన్న రుబ్బురోలు ముందు కూర్చున్న ఒక పిల్ల నానబెట్టిన పెసల్ని రుబ్బుతుంటే అక్కడికెళ్ళిన సత్తిబాబు పిల్లని అల్లంముక్క పట్రమ్మని చెప్పి తనే రుబ్బడం మొదలెట్టేసరికి బలంగా ఉన్న వాడి కండలు మరింత బలంగా ఉబ్బడం మొదలెట్టాయి.

నెయ్యి కాస్తున్న రవణమ్మ పక్కనే కూర్చున్న మెండా ముత్యం చకచకా ఉల్లిపాయ ముక్కలూ, పచ్చి మిరపకాయ ముక్కలూ కొయ్యడం మొదలెట్టాడు.

పెనం మీద అప్పుడే కాచిన నెయ్యి వేసేక గిన్నెడు పెసరపిండి వేసేకా ఆ గిన్నెని బోర్లించి పిండి మీదెట్టి అట్టులా వెడల్పు చేసిన వెంటనే కోడిగుడ్డు కొట్టి ఆ అట్టుమీద గుమ్మరించింది.

కాస్త కాలేక తిరగేసి మరగేసి దోరగా కాలేక లేత అరిటాకు ముక్కలోకి దాన్ని లాగి ఇస్తుంటే పొగలు కక్కుతున్న పెసరట్టుముక్కని తుంపుకొని నోట్లో వేసుకొంటున్న విమలగీత, హరికృష్ణ, "అబ్బో బ్రహ్మాండం," అనరిచి ఈ కొండల మధ్య గిరిజన గ్రామంలో ఉంటున్న ఈ రవణమ్మకి ఎలా అబ్బింది ఇంత గొప్పగా వంటలు చెయ్యడం అనుకుంటా, "చూడు రవణమ్మా... నువ్వూ, సత్తిబాబూ మాతో పాటు వచ్చేస్తారా?" అన్నాడు హరికృష్ణ.

ఒక పక్కనించి అట్లేస్తానే నవ్విన రవణమ్మ, "వద్దండి... తల్లినీ పిల్లల్నీ విడదియ్యకండి బాబయ్యా," అంది.

అర్థంగాని హరికృష్ణ, "తల్లెవరూ... పిల్లలెవరూ," అన్నాడు.

"తల్లంటే మా గోదారి, పిల్లలంటే మేవండి," అని నవ్వింది రవణమ్మ.

ఒక్కోళ్ళు మూడేసి పెసరట్లు చొప్పున లాగించేసేక రవణమ్మ ఇచ్చిన టీ చప్పరించిన గీత, "ఇదేం టీ ఇంత రుచిగా ఉంది. ఏం కలిపేవు దీంట్లో?" అంది.

"అన్నముక్క మళ్ళీ అనాలి అద్భుతం, అమృతం. మాతో రాకపోతే పోయేవు ఎలా కాచేవో కొంచెం చెప్పు నేర్చుకొని అక్కడ కాచుకుంటాం," అన్నాడు హరికృష్ణ.

"ఏం లేదండి మరిగిన మేకపాలల్లో టీ పొడుం వేసి కాసేపయ్యాక సవ్వాదిగా ఉంటదని చిన్న అల్లంముక్క చితగ్గొట్టేసేనంతేనండీ," అంది.

ఆవేళ టిఫిను బిల్లు వెయ్యినూట పదహార్లు ఒటేలు రవణమ్మకివ్వబోతే తన బిల్లు కింద నూట ఏడు రూపాయలు తీసుకొన్న రవణమ్మ మిగతా డబ్బు ఆంజనేయస్వామిలోరి డిబ్బీలో వేసేసింది.

అది చూసి విస్తుపోతున్న గీత, హరికృష్ణలని పిల్చిన రవణమ్మ, "మధ్యాన్నం మూడింటికి తవరిక్కడికొస్తే మీరింతకు ముందు తినందీ, ఇక ముందూ తినందీ ఒకటి చేసి పెడతా," నంది.

లాంచీ ఎక్కారు.

టేకూరునించి తిప్ప దగ్గరకొచ్చింది లాంచీ. మంగరాజు గురించి అడిగితే, "గంగారావు నావెళ్ళింది ఇందాకే గదండీ," అన్నాడు రాంపండు.

కాకీనిక్కరు బొజ్జపైకి లాక్కుంటా నల్ల కళ్ళద్దాలు తుడుచుకుంటా వచ్చిన మాణిక్యంగారు, "లాంచీ ఏ పక్కకి పోనిమ్మంటారు సారుగారూ," అన్నాడు.

"వాళ్ళకి ఎదురెళ్ళినట్టుంటది అలా కొరుటూరు దాటి పాపికొండల్లోకి పోనియ్యండి," అనడంతో, "తాతారావూ టాప్‌జేసి వెనక్కి లాగరా జెప్తాను," అన్నాడు మాణిక్యం.

లాంచీ గోదారికి ఎదరువెళ్తూ పాపికొండలవేపు ప్రయాణం చేస్తుంది.

కేబిన్‌రూమ్‌లో కూర్చున్నవాళ్ళకి పడిచెక్క మీదెళ్తున్న ఎల్లారావు కాళ్ళు కనిపించేసరికి అతన్ని పిల్చి, "మాతో రమ్మంటే చాకుతో కోసినట్టు ఆ రవణమ్మ అలా మాటాడిందేంటి?" అన్నాడు హరికృష్ణ.

నవ్విన ఎల్లారావు, "గోదారితల్లి మీదున్న మమకారవండి. నన్నడిగినా అలాగే అంటానండి... కాదండి అంతకంటే ఫోర్సుగా మాటాడ్తానండి... ఎందుకంటేనండీ నా తల్లికంటే గోదారితల్లినే ఎక్కువ ఇష్టపడతానండి... ఎందుకంటేనండీ నా తల్లి నన్ను ఎప్పుడో వదిలెళ్ళిపోయిందొండి దేవుడి దగ్గరికి. నాకు బువ్వ పెడ్తుంది ఈ గోదారి తల్లేనండి," అనెళ్ళిపోయాడు.

"గోదావరి అంటే ఎంత ప్రేమ వీళ్ళకి," అన్నాడు హరికృష్ణ. ఎడంపక్కనున్న చీడూరు దాటిన లాంచీ శివగిరి, కొరుటూరు దాటి శిరివాక తెల్లదిబ్బలు దాక వెళ్ళింది. పాపికొండలు లోపలున్న వాళ్ళు లాంచీ ఆపమని కెమెరాల్తో ఫోటోలు తీసుకొన్నాకా ముందుకెళ్ళమన్నారు.

లాంచీ వెళ్తుంటే వాళ్ళ దగ్గరకొచ్చిన మాణిక్యంగారు, "ఇందాక మీరు చూసే ఉంటారు పాపికొండల్లోకి మనం ఎంటరవ్వడానికి ముందు కొరుటూరు కొండ మీద టూరిజం వాళ్ళ గెస్ట్‌హౌస్‌లు కట్టి వాటిని మెయింటెన్ చెయ్యమని ఇక్కడ చదువుకొన్న గిరిజనుల కప్పగించేరండి. మీక్కావాలంటే లాంచీ వెనక్కి తిప్పి మాటాడతా నండి."

"వద్దులేండి," అన్నాడు హరికృష్ణ.

తెల్లదిబ్బలు దాటిన లాంచీ ఖమ్మం జిల్లాలోకొచ్చి కొల్లూరుదాకా వెళ్ళింది. క్రితంసారొచ్చినప్పుడు తేనె పానకం ఇచ్చిన మడకం సూర్యనారాయణగారబ్బాయి రాజబాబు పరిచయమయ్యి మొన్న వరదల్లో వాళ్ళ బోటు కొట్టుకుపోయిందని చెప్పాడు.

మంగరాజు గురించి అడిగితే, "నాకు తెల్దు... మా తిప్ప మీద కొందరు ఆ ఊరోళ్ళున్నారు అడుగుదాం," అని వాళ్ళని పిల్చి అడిగాడు. అతను కొయిదా వెళ్ళినట్టు చెప్పారాళ్ళు. వెనక్కి తిరిగింది లాంచీ.

మధ్యాన్నం ఒంటిగంట దాటినా ఎవరికీ ఆకలిగా లేదు. "పెసరట్లు తింటే అంతేనండి. కడుపులో ఉబ్బరంగా ఉంటది. అందులోకీ ఇవ్వేళ మనం తిన్నయ్యి కోడిగుడ్డు పెసరట్లు," అన్నాడు ముత్యం.

"మధ్యాన్నం భోజనం వద్దు మాకు... మూడయ్యేసరికి టేకూరు రేవులోకి తీసుకెళ్ళండి లాంచీని, ఏదో చేసి పెడ్తానంది రవణమ్మ," అంది గీత. తిరుగు ప్రయాణం చేస్తున్న లాంచీ ఈసారి గోదావరి ఎడంపక్కనున్న తూర్పు గోదావరి గ్రామాలు నడిపూడి, తెలిపేరు, తాళ్ళూరు, గొందూరు దాటుకుంటా మధ్యమధ్యలో ఆగుతా కపిలేశ్వరం జనం తిప్ప దగ్గరకొచ్చేసరికి పావు తక్కువ మూడయ్యింది. టేకూరు రేవులోకి తిప్పమంది గీత.

*

మొక్కజొన్న పంట బాగా పండుతుంది టేకూర్లో. ఆవేళ శివగిరి అబ్బులుగాడి మొక్కజొన్న చేలోకెళ్ళిన రవణమ్మ మరీ లేతగానూ, మరీ ముదురుగానూ గాకండా తినడానికి రుచిగా ఉండే మొక్కజొన్న పొత్తులు ఓ పాతిక కోసుకొచ్చింది. వాటి తొక్కలూ, సన్నగా దారాల్లాగుండే ఈనులూ తీసి శుభ్రం చేసింది.


అల్లం, వెల్లుల్లిపాయ, ధనియాలు, జీలకర్ర, పండు మిరప్పళ్ళు, రాతి ఉప్పు కలిపి కచ్చాపచ్చాగా రుబ్బి తాజాగా ఉన్న ఆ మొక్కజొన్న పొత్తుల్నిండా దాన్ని బాగా అద్ది అప్పుడే కాచిన ఆవునేతిలో ఒకో పొత్తునీ ముంచి నీలం నిప్పులమంట మీద ఆ మొక్కజొన్నపొత్తుని తిప్పుతా ఆరారా పొత్తుమీద నెయ్యి పోస్తుంది.

కాస్సేపటికి నీలంమంటలో మాడకుండా మెత్తగా ఉడికిన ఆ పొత్తుల్ని వాళ్ళ కందిస్తే తింటున్న హనీమూన్ దంపతులు, "ఈ జన్మలో ఏది పంటితో కొరుకుతన్నా ముందు నిన్నూ... నీ వంటల్నీ గుర్తు పెట్టుకొంటాం రవణమ్మా," అన్నారు.

"నా అరాకొరా వంటల్ని మీలాంటోరు తినడం నా అదురుష్టమండి," అంది రవణమ్మ.

మొక్కజొన్న పొత్తు రుచి గొంతులోనే ఉండిపోయిన వాళ్ళు రవణమ్మకి ఇంకో సారి థాంక్సు చెప్పి తిప్ప దగ్గర కెళ్ళేసరికి ఆడోళ్ళంతా ఒకళ్ళ ముందొకళ్ళు కూర్చుని ఒకళ్ళ తలకొకళ్ళు కొబ్బరినూనె రాసి జడ లేసుకుంటుంటే వాళ్ళల్లోకి దూరిన గీత తను కూడా నూనె రాయించుకొని జడ వేయించుకొంది.





ఎగువ నుంచొస్తున్న లాంచీల్లో మంగరాజుగానీ ఉన్నాడా అని వాళ్ళు చూస్తుంటే, బైనాక్యులర్‌లోంచి కన్నాజీ ఆ జనాల్లో తన సెంద్రావతి ఉందాని చూస్తున్నాడు.

పడమటి పాపికొండల్లోపలి సూర్యుడు వెనక్కెళ్ళిపోతున్నాడు. ఎటు చూసినా చీకటి ఆవరిస్తా ఉంది. గాలిపోటు బాగా ముదిరింది. మసక వెన్నెల్లో అటుపక్క నించి ఇటుపక్కకి వస్తున్న నావ తెరచాప కర్రకి తెల్లగా వెలుగుతున్న లాంతరు కట్టి ఉంది. అది చూసిన వాళ్ళకి అర్థం కాలేదు. తిప్ప మీది గుడిసెల్లో జనాన్ని పిల్చి ఏంటిది అనడిగితే మాకూ అర్థం గావటంలేదన్నారు.

పోనుపోను దగ్గరవుతున్న ఆ నావ వాళ్ళ తిప్ప దగ్గరకే వచ్చి జేరింది. ఒడ్డున ఆగిన నావ చుట్టూ గుంపుగా మూగిన వాళ్ళంతా ఆ నావనే చూస్తున్నారు. నావలో ఉన్న గంగారావూ, కృష్ణుడూ మాసిన గళ్ళ దుప్పటి కప్పిన మంగరాజు శవాన్ని కిందికి దించుతున్నారు.

బ్రహ్మచారైన అబ్బిరెడ్డి మంగరాజింక లేడని, అందరికీ ఆత్మీయుడైన మంగరాజు లేడన్న విషయం తెల్సిన కపిలేశ్వరపురం జనం గొళ్ళుగొళ్ళుమంటూ మంగరాజు శవం ముందు జేరిపోయి ఒకటే ఏడ్పులు, పెడబొబ్బలు. ఆ ఏడుస్తున్న జనాల్లోకి సీతారామా లాంచీ స్టాఫ్‌తో పాటు గీత, హరికృష్ణ కూడా చేరిపోయారు.

రాత్రిపూట మనిషి పోవడం వల్ల శవాన్ని లేపలేదు. తెల్లారేదాక శవం దగ్గర కూర్చున్న హరికృష్ణ తల దగ్గర వెలుగుతున్న ప్రమిదలో నూనె అయిపోతున్నప్పుడల్లా పోస్తున్నాడు. కృష్ణపక్షమి వెన్నెల మసకమసగ్గా ఉంది. గాలొక మోస్తరుగా వీస్తుంది.

గోదారంతా ఒకటే నిశ్శబ్దం.

శవం చుట్టూ మూగిన జనం ఏడ్చి ఏడ్చి సొమ్మసిల్లి పడున్నారు.

ఉన్నట్టుండి గాలులు వీయడం మొదలెట్టాయి. తిప్ప మీద ఇసుక ఎగురుతుంది. గోదారి నిండా అలల చప్పుళ్ళు. చిక్కటి మబ్బుల్తో మూసుకుపోయిందాకాశం.

ఉన్నట్టుండి వర్షం కురవడం మొదలెట్టేసరికి శవాన్ని పాకలోకి తీసుకెళ్ళిపోయారు. శవం తల దగ్గర ప్రమిద మట్టుకి ఆ ఇసుకలో వెలుగుతుంది. బాగా తడిశాక ఆరిపోయింది. దబదబా కురిసిన వర్షం. పావుగంట తర్వాత ఆగిపోయింది. మూసుకున్న మబ్బులన్నీ తేలిపోయాయి. శవాన్ని బయటికి తీసుకొచ్చేరు.

ఆరిపోయిన ప్రమిదలో నీళ్ళొలకబోసి నూనె పోసి ఒత్తిని కదిపి మళ్ళీ వెలిగించాడు హరికృష్ణ. బ్రహ్మచారి శవం పాడె కోసం తాటాకు చాపా, వెదురుబొంగూ, తడపల కోసం వెతుకుతున్నారు.

చాలాసేపట్నుంచి కుదెళ్ళిపోతా ఏడుస్తున్న కృష్ణుడు, "బ్రెహ్మచారి శవం గొయ్యి తీసి పాతిపెడతారు గదా తను పోతే మట్టుకి కాల్చి బూడిద చెయ్యమని నవ్వుతా చెప్పేడోసారి," అన్నాడు.

"నాతో కూడా నవ్వుతాలకో మాటన్నాడోసారి," అన్నాడు గంగారావు.

"ఏవన్నాడు," అడిగాడు రత్నప్రసాద్.

"తనకి తమలపాకులు నమలడం అన్నా, పునుగు రాసుకోడం అన్నా చాలా ఇష్టం గదా. తను పోయినప్పుడు ఆటిని తన శవం మీద ఎయ్యమన్నాడు."

తమలపాకులంటే గట్టుమీద దొరుకుతాయి. పునుగు కోసవంటే ఏ రాజమండ్రో, కాకినాడో ఎళ్ళి రావాలి, ఎలాగా అనుకుంటున్న రత్నప్రసాద్‌కి ఒక ఆలోచనొచ్చి మంగరాజు పాకలోకెళ్ళి వెతికితే ట్రంకుపెట్టి బట్టల మడతల్లో రెండు పునుగు సీసాలు కనిపించాయి.

తెల్లవారింది. శవాన్ని ఈతాకు చాపలో చుట్టి చేంతాళ్ళు బలంగా కట్టి వెదురుగెడ తోసేసరికి రెండు కొమ్ముల్లో ఒక కొమ్ము హరికృష్ణ పట్టేడు.

పొడుగాటి ఆ తిప్ప చివరికి తీసుకెళ్ళి పేర్చిన పుల్లల మీద పడుకోబెడుతుంటే బ్రహ్మచారి శవానికి బట్టలుండకూడదన్నాడు వాళ్ళల్లో ఒక ముసలాడు.

దాంతో శవం మీద బట్టలు తీసేసి పుల్లల మీద పడుకోబెట్టి అవతలొడ్డు నించి తెప్పించిన మోదలో తమలపాకులు బట్టలు లేని మంగరాజు శవం ఒంటినిండా పరిచి పైన పుల్లలేస్తున్న హరికృష్ణకి రత్నప్రసాద్ కూడా సాయం చేశాడు.

నా అన్నవాళ్ళెవరూ లేని మంగరాజుకి తలకొరివి ఎవరు పెడతారా అని తర్జనభర్జన పడ్తుంటే, "నేను పెడతాను," అని ముందుకొచ్చిన హరికృష్ణ ఆ శవదహన కార్యక్రమంలో ఏ లోటూ లేకుండా చేశాకా అంటుకొన్న చితి కాలడం మొదలెట్టింది.

"ఏ పని చేసినా మనసుతో చెయ్యండి. ఎంతో అవసరంబడితే తప్ప ఉత్తుత్తినే అబద్ధాలాడకండి," లాంటి గొప్ప జీవితసత్యాలు చెప్పిన అబ్బిరెడ్డి మంగరాజు, తన జీవితకాలంలో ఎందరికో ఎన్నో సాయాలు చేసి నష్టాలే తప్ప లాభాలెరుగని మంగరాజు కాలి బూడిదవుతున్నాడు.

ఎవరికి ఎవరు?

అసలు అబ్బిరెడ్డి మంగరాజు ఎవరు?

అపర కుబేరుడైన హరికృష్ణ ఎవరు?

ఇద్దరికీ ఏమిటి సంబంధం?

అసలా మంగరాజుకి హరికృష్ణ తలకొరివి పెట్టడం ఏంటీ?... ఏమిటీ మానవ సంబంధాలు?... ఏంటీ సృష్టికర్త విచిత్రమైన తలరాతలు? ఎంత ఆలోచించినా ఈ జన్మకే కాదు ఏ జన్మకీ అర్థంగాని ఒక విచిత్రం.

ఇంకో గొప్ప విచిత్రమేం జరిగిందంటే తిప్ప అంచున కాలిబూడిదైన మంగరాజుని అప్పుడే పోటుమీది కొచ్చిన గోదారితల్లి పొంగుతా ఆ బూడిదని తనలో కలిపేసుకుంటా ముందుకెళ్ళిపోయింది.

అందరితోపాటు తనూ గోదాట్లో మునిగి స్నానం చేసిన హరికృష్ణ మరి బయల్దేరడానికి సిద్ధమవుతూ సాగనంపడానికి చుట్టూ మూగిన ఆ జాలరి జనంతో-

"ఊపిరి పీలిస్తే జననం, ఊపిరి వదిలితే మరణం, రెప్పపాటుది జీవితం అన్నారెవరో. ఆ చివరిరోజు వచ్చి మనలో ప్రతి ఒక్కర్నీ పలకరిస్తుంది. జన్మెత్తాకా తప్పదు," అని పల్చగా నవ్వి, "ఇదంతా మీ అందరికీ తెల్సిందే చెప్పడానికి భాష రాక నోరు విప్పరు మీరు. భాష తెల్సిన మేం వాగుతున్నాం... సెలవు," అంటా లాంచీ టాపెక్కుతున్న హరికృష్ణ వెనకాలే విమలగీత, రత్నప్రసాద్ కూడా ఉన్నారు.





"వచ్చే వర్షాకాలంలో కూడా వచ్చి ఈ నదిలో నాలుగు రాత్రులు గడిపి వెళ్తాం... అదే మా ఆఖరి ట్రిప్పు. దాంతో మా హనీమూన్ రోజులు పూర్తవుతాయి," అన్న విమలగీత మాటాడ్డం ఆపేసి విస్తుపోయి చూసింది వాళ్ళకేసి.

వాళ్ళంతా ఏడుస్తున్నారు.

"ఎందుకు ఏడుస్తున్నారు... మీకేం కావాలి?" అన్నాడు హరికృష్ణ.

"మాకేం వద్దు... డబ్బులయితే అసలే వద్దు. మీరు మళ్ళీ ఇక్కడకు రావాలి, మాతో గడపాలి..." అంది ధనలక్ష్మి.

"రేపు వర్షాకాలం వస్తామంటున్నాం గదా?" అంది గీత.

"అప్పుడు మేం ఉండం... ఈ ఎగువలో ఉండేది ఏడాదిలో ఎనిమిది నెలలు మట్టుకేనండి," అన్నాడు కృష్ణుడు.

"తర్వాతొచ్చే శీతాకాలంలో కూడా మీరు రావాలండి... తప్పదండి," అన్నాడు రాంపండు.

"మీరు వస్తానని మాటిస్తే తప్పకుండా వస్తారండి. వస్తాం అనండి చాలు," అంది అప్పుడే నావలో దిగిన హోటేలు రవణమ్మ. "వాళ్ళ ప్రేమ చూడండి... కొంచెం కనికరించండి," అన్నాడు రత్నప్రసాద్. 'సరే,' అన్నాకా అక్కడి జనం ఆనందానికి హద్దుల్లేకుండా పోయాయి.

"మనం వెంటనే బయల్దేరకపోతే గౌతమీ ఎక్స్‌ప్రెస్ అందుకోలేవండీ," అని పట్టిసీమ మాణిక్యం అరవడంతో లాంచీ అక్కణ్ణించి బయల్దేరింది.

*

రత్నప్రసాద్‌ని దింపిన లాంచీ చీకటిపడేసరికి రాజమండ్రిలో రేవులో ఆగింది. స్టాఫ్‌లో ప్రతి ఒక్కడ్నీ పేరుపేరునా పిల్చి డబ్బులిచ్చి రేవు పైకొచ్చి రిక్షా కోసం చూసి అది దొరక్క ఆటో ఎక్కిన, థర్డ్‌క్లాస్ బోగిలోకెక్కిన గీత, హరికృష్ణలకి సైడు బెర్తులు దొరికాయి.

కదిలిన రైలు కాసేపయ్యాక గోదావరి బ్రిడ్జి మీంచెళ్తుంది. దిగువలోకి చీకటి మింగేసిన గోదావరి తల్లిని చూస్తున్న ఆ ఇద్దరికీ అప్పుడు గుర్తుకొచ్చింది, సరదాకి అబ్బిరెడ్డి మంగరాజు దగ్గర పావలా వడ్డీకి వంద రూపాయలు అప్పు తీసుకొన్న సంగతి.

"ఈ ప్రపంచంలో నా అన్నవాళ్ళు లేని అనాథ అయిన అబ్బిరెడ్డి మంగరాజు డబ్బులు వడ్డీతో సహా ఎవరికివ్వాలి?" అంది విమలగీత.

*

అక్కడ ప్రతి నిమిషం చాలా విలువైంది గాబట్టి అమెరికా వెళ్ళారు. వాళ్ళ ఐ.టి. పనుల్లో తలమునకైపోయారుగానీ మనసంతా గోదావరి మీదే ఉంది. రాబోయే వర్షాకాలంలో వరద గోదావరిలో విహారం మీదే ఉంది.

రోజులూ వారాలూ నెలలూ గడిచి వర్షాకాలం వచ్చీ రావడంతో ఈసారి ఎమిరైట్స్ ఫ్లైట్‌లో వచ్చిన వాళ్ళు హైదరాబాదులో దిగి ఏ జెట్‌లాగూ ఫీలవ్వకుండా ఆ రాత్రే గౌతమీ ఎక్స్‌ప్రెస్ ఎక్కేశారు.

*

రైలు విజయవాడ దాటేక మొదలైంది వర్షం.

ఈదురుగాలులు, దాంతోపాటు వర్షం నీళ్ళు మూసిన కిటికీ తలుపుల సందుల్లోంచి లోపలికొచ్చేస్తున్నాయి. కాస్సేపటికే కంపార్ట్‌మెంటంతా చల్లని ఫ్రిజ్‌లా తయారైపోయింది. అలా చాలాసేపు కురిసి తాడేపల్లిగూడెం వచ్చేసరికి వర్షం ఆగిపోయింది. గాలి కూడా ఆగిపోయింది. వాతావరణంలో నిశ్శబ్దం.

తెలతెలవారేసరికి రాజమండ్రిలో ఆగింది రైలు. దిగి ఆటో ఎక్కి రేవు వైపు వెళ్తున్నారు. రాజరాజ నరేంద్రుడు పరిపాలించిన ఆ పురాతన నగరం ఇంకా నిద్ర లేవలేదు. నిశ్శబ్దం... అందమైన నిశ్శబ్దం.

రేవులోకొచ్చి తమకోసం ఇష్టంగా ఎదురుచూస్తున్న సీతారామాలాంచీ స్టాఫ్‌లో అందర్నీ పేరుపేరునా పలకరించేసరికి పొంగిపోయిన వాళ్ళు టాపు డోరియారేకు మీద పరుపులేసి కూర్చోబెట్టారు. కళాసీలు లంగరు లాగారు. ఇంజన్ స్టార్ట్ చేసి గేరేసేడు. చుక్కాని ఎడంపక్కకి తిప్పేసరికి ముందుకు కదిలింది లాంచీ. దూరంగా చూస్తే అందంగా సూర్యోదయమవుతుంది.

గీత, హరికృష్ణల ముందు నల్ల కళ్ళద్దాలు సర్దుకుంటా కూర్చున్న మాణిక్యంగారు చెప్పుకుంటా పోతున్నారు.

వర్షం రాత్రుళ్ళు దబదబా కురిసి తెల్లారేసరికి ఆగిపోతుందట. పగటిపూట ఎండ రోహిణీకార్తె కంటే దారుణంగా కాస్తుందంట.

ఎగువలో ఉన్న మహారాష్ట్ర ప్రాంతాలలో తుపాన్లు, వరదలు లేని కారణంగా ఈ ఏడాది గోదారి నీళ్ళరంగు మారలేదంట. నీటిమట్టం పెరగలేదంట. పి.డబ్ల్యూ.డి. వాళ్ళ దగ్గర్నుంచి ఫస్ట్ వార్నింగు, సెకెండ్ వార్నింగు, థర్డ్ వార్నింగుల్లాంటివి లేవంట.

అసలుకొస్తే వర్షాకాలంలో లాంచీల్ని పాపికొండలవేపు పోనియ్యరు కానీ, ఈ ఏడాది వదిలేస్తున్నారంట ఆ పి.డబ్ల్యుడి. డిపార్ట్‌మెంట్ వాళ్ళు. "కాబట్టి సారుగారూ... మనం ప్రతి సీజన్లోలాగే ఈ సీజన్లో కూడా టేకూరు, తాటివాడ మధ్య తిప్ప మీదే కేంప్ చేద్దాం," అన్నాడు.

ఎండ పెరుగుతుంది. ఉక్క మొదలైంది. గాలి ఆడ్డంలేదు. స్నానం చేశాక తొడుక్కున్న బట్టలన్నీ తడిసిపోతున్నాయి. వచ్చీపోయే లాంచీల్లో జనం కేరింతలు కొడతా పలకరిస్తున్నారు. వాళ్ళకి వీళ్ళు అంతకంటే ఎక్కువ మోతాదులో అరుస్తా బదులిస్తున్నారు.

కుమారదేవం రేవు ఇంకా రాకముందే ఒక తిప్ప మీద లాంచీ ఆపితే హాయిగా గోదారి స్నానాలు చేసి వాళ్ళందరి మధ్యలో కూర్చుని ముత్యం, సత్తిబాబు ఫలహారా లారగించి సీవండి గ్లాసుల్లో టీ తాగేకా కదిలింది లాంచీ.





ఎండ బాగా పెరగడంతో చిరచిరలాడుతుంది. కదలకుండా ఆగిపోయిన నీళ్ళ లోపలి పెద్ద పెద్ద చేపలు తెగ కదుల్తున్నాయి. దాంతో నీళ్ళు నీచువాసనొస్తున్నాయి.

ఈ వాతావరణంలో సెగని ఏమాత్రం పట్టించుకోడం లేదు వాళ్ళు. ఈరోజు పౌర్ణమి. ఈ వర్షాకాలం గోదావరి మధ్య చంద్రోదయం ఎప్పుడవుతుందా... తెల్లవారు ఝాము ఎప్పుడొస్తుందా, ఆ ఝాములో కురిసే వర్షం ఎలాగుంటుందా అన్న హాయైన ఆలోచనల్తో ఉన్నారు.

మధ్యాహ్నమైంది. కుడిపక్క గోదారొడ్డునున్న వందేళ్ళ నాటి ఆ చింతచెట్టు ప్రతి ఏటా వచ్చే వరదలకి గట్టు కోసెయ్యడంతో వేళ్ళు బయటికొచ్చి సగానికి పైగా గోదాట్లోకి ఒంగిపోయి తన నీడని నీళ్ళ మీద పరుస్తుంది. ఆ చల్లని నీడలో ఆపారు లాంచీని.

గట్టు మీద చిన్న కుర్రోడు రెండు కుక్కలకీ బండి గట్టి ఆడుకుంటున్నారు. ఇంకాస్త దూరంలో రెండు కుక్కలు చెలగాటాలాడుకుంటున్నాయి. వడ్రంగిపిట్ట నేల మీద పచ్చగా పాకిన తీగల మీద వాలి ముగ్గిన పళ్ళని ముక్కుతో పొడుచుకు తింటుంది.

ఎగువ నించి నీళ్ళల్లో కొట్టుకొస్తున్న పెద్ద దుంగ మీద ఇద్దరు కుర్రోళ్ళు కూర్చున్నారు. గాలి తూర్పు దిక్కుకి వీయడంతో తెరచాపలెత్తిన రెండు నావలు ఇంజను నావల కంటే స్పీడుగా వస్తున్నాయి.

పొగలు గక్కుతున్న అన్నంలో పొలసల పులుసు కలుపు తింటుంటే ఆ రుచి వర్ణించడానికి వీల్లేకుండా ఉంది. వాళ్ళ ముందు నిలబడ్డ సత్తిబాబు, "పొద్దుటికి మీరు దిగుతున్నారని తెల్లారురఝామునే వేటకెళ్ళొచ్చిన వీర్రాజుగాడి దగ్గర ఈ చేపుచ్చుకున్నానండి," అన్నాడు.

తింటున్న వాళ్ళిద్దరికీ మాటల్లేవు. చెమటలు తల్లోంచి కారుతున్నాయి. చాలా ఎక్కువ తినేసి ఎదరాల్లో పడుకున్న వాళ్ళు నిద్ర లేచేసరికి సాయంత్రం అయిదు దాటేసింది. లేచి చూస్తే ముందుకెళ్తున్న లాంచీ దేవీపట్నం దాటేసి కచ్చులూరు రేవులో ఆగగానే రత్నప్రసాదెక్కాడు. తాళ్ళూరుకీ టేకూరుకీ మధ్యలో ఆ ఇసుకతిప్ప మీదకి ఇంకో గంటలో చేరింది లాంచీ.

అంతసేపూ ఉక్కగా ఉన్న వాతావరణంలో అప్పుడే గాలి తిరిగింది. సూర్యుడు పడమటన అస్తమిస్తు న్నాడు. తూర్పున చంద్రుడుదయిస్తున్నాడు. ఏడు దాటేసరికి గోదారంతా ముగ్గుపిండి జల్లినట్టు వెన్నెల. ఇద్దరూ నీళ్ళల్లో జలకాలు, ఆ జలకాల్లోంచే సరసాలు.

ఆ వెన్నెల్లో నావెక్కి టేకూరు ఒడ్డునున్న తన రవణమ్మ దగ్గర కెళ్ళిపోతున్నాడు రాగోతి సత్తిబాబు. లాంచీ కేబిన్‌లోకి దూరిన స్టాపులో కొందరు వచ్చేప్పుడు తెచ్చుకున్న సారాసీసాల మూతలు విప్పుతున్నారు.

స్నానాలయ్యేకా పొడిబట్టలు కట్టుకొని ఇసుకలో వేసిన పరుపుల మీద కూర్చుని వెలుగువెన్నెల గోదావరిని, వెండి వెన్నెల జాబిలిని చూస్తూ... ఆ పరుపుల మీదే నిద్రపోబోతుంటే అక్కడికొచ్చిన మాణిక్యంగారూ, తాతారావూ కాస్సేపయ్యాకా వర్షం మొదలవుద్దని వాళ్ళ పక్కలు ఎప్పట్లాగే కేబిన్‌రూమ్‌లోకి మార్పించారు.

దభదభా కురుస్తున్న చప్పుడు. విపరీతంగా వీస్తున్న ఈదురుగాలికి అటూ ఇటూ కదుల్తుంది లాంచీ. దళసరి రగ్గులోపలెక్కడో వెచ్చగా పడుకున్న వాళ్ళిద్దరూ లేచి టార్చి ఆన్‌చేసి టైము జూస్తే తెల్లవారురఝాము

అయిదు. రగ్గు ముసుగులోంచి ఆ కేబిన్‌రూము కిటికీకేసి జరిగి చిడతని తిప్పి కిటికీ రెక్కని మెల్లిగా తెరిస్తే ఒకటే వర్షం. ఆ ఎదరాలు కిటికీ రెక్క ఒక్కటి తెరిచారు.

ధారలుగా కురుస్తున్న వర్షం. హాయిగా కురుస్తున్న వర్షం. రగ్గు ముసుగులోంచి తలలు మాత్రమే బయటపెట్టిన వాళ్ళిద్దరూ ఆ వర్షాకాలం, వర్షం కురుస్తున్న ఆ తెల్లవారుఝామునే రెప్పార్పకుండా చూస్తున్నారు. హరికృష్ణ శరీరం వేడెక్కింది. అదే విషయం గీతతో చెపితే, "నాకూ ఇందాకట్నించీ నూటపన్నెండు జ్వరమొచ్చినట్టు కాల్తుంది ఒళ్ళు," అంది మగతగా.

"అప్పుడు ఆలస్యం దేనికీ?" అని దుప్పటి ముసుగు తలల మీదికి లాగాడు మెత్తగా. అలా ఎంతోసేపు చూస్తానే ఉండిపోయారు. "ఈ సీజన్లో మనం వచ్చింది ఇది చూడ్డానికే గదా?" అని. అలా చాలాసేపు గడిపేకా గాలి వాలుకు మళ్ళీ జల్లు వాళ్ళ మీదికి కొడ్తుంటే కిటికీ రెక్క మూసేసి మళ్ళీ రగ్గులోకి దూరిపోయారు.

బాగా తెల్లారింది. వర్షం, గాలీ ఆగిపోయి చాలాసేపయ్యింది. రగ్గు ముసుగులోంచి బయటికొచ్చి కాల కృత్యాలు పూర్తిచేశాకా, "ఇయ్యాల టిఫినీ పెసరట్లండి. అయితే కూసింత ట్రైంబడద్దండి," అన్నాడు మెండా ముత్యం. ఇసుకతిప్ప మీద నడుస్తున్న గీత ఉన్నట్టుండాగి తడిగా ఉన్న ఆ ఇసుకతో పిచ్చుకగూడు కట్టింది.

చాలా సహజంగా కట్టిన ఆ గూడుని మతిపోయినట్టు చూసిన మాణిక్యంగారు తక్కినోళ్ళని పిల్చి చూపిస్తే వాళ్ళూ అదే అన్నారు.

అంతలో ఒక పిచ్చుక వచ్చి ఆ గూడు మీద వాలి క్షణకాలం దాన్ని ఎగాదిగా చూసి వాసన చూసి వెళ్ళి పోయింది.

అలా పిచ్చుక వెళ్ళడాన్ని చిత్రంగా చూసింది గీత.

"ఆ పిచ్చుకేం చేసిందో మీకేవన్నా అర్థమైందా?" అన్నాడు రత్నప్రసాద్.

"కాలేదు," అంది గీత.

"తను లేనప్పుడు గూడుని ఎవరైనా ముట్టుకుంటే వచ్చి వాసన చూశాకా తెల్సిపోద్దంట పిచ్చుకకి. ఈ గూడు తనది గానీనా అని ఒకసారి వాలి వాసన చూసి వెళ్ళిపోయిందా పిచ్చుక," అని వివరించిన రత్నప్రసాద్, "గూడు అంత నేచురల్‌గా కట్టారు మీరు," అన్నాడు.

మాటాడుకుంటున్న వాళ్ళ మధ్యలోకొచ్చిన ముత్యం, "పెసరపిండి పులిసి పోయిందండి," అన్నాడు.

నవ్వేసిన హరికృష్ణ, "ఏం పర్లేదు మన రవణమ్మ ఒటేలుంది గదా గుచ్చిన లంగరు తీసి లాంచీని టేకూరొడ్డుకి పోనిమ్మను," అన్నాడు.

దిగిన అందరికీ పెసరట్లు కాదుగానీ వాటికంటే సవ్వాడిగా ఉండే పుల్లట్లేసి పెట్టింది. వాళ్ళు తింటుండగా పాకలో ఎప్పుడు నిద్రలేచి స్నానం చేసొచ్చాడో సత్తిబాబు వాళ్ళ మధ్యలోకి దూరి చేతిలో ఉన్న సీవండి పళ్ళెం చూపిస్తే వాడికీ పుల్లట్లేసింది.

టిఫిన్లు తినేసి స్ట్రాంగ్ టీలు తాగుతుంటే హోటేలు పాకకి కాస్త దూరంగా ఉన్న సీమచింత చెట్టు కింద పాకలో నీరసంగా ఉన్న సీతమ్మ కనిపించింది.





క్రితంసారి మొబైల్ హాస్పిటలు వాళ్ళు సిజేరియన్ చేసి తీసిన పిల్ల ఆ సీతమ్మ ఒళ్ళో ఉంది.

"పాపం పుట్టిన ఆ పిల్లకి పాలిద్దామంటే రాటం లేదండి," అంటా ఒకటే బాధపడింది హోటేలు రవణమ్మ.

"మొన్న డబ్బిచ్చామే," అంది గీత.

"దాన్ని అప్పులోళ్ళు వడికేసుకొన్నారు. దీని మొగుడో వెర్రిబాగులోడు," అంది రవణమ్మ.

వాళ్ళని కూడా పిల్చి టిఫిన్లు పెట్టించారు.

అంతా లాంచీ ఎక్కేకా చూపుకర్ర దగ్గర నిలబడి నల్లకళ్ళద్దాలోంచి చూస్తున్న మాణిక్యంగారు, "లాంచీ ఏ పక్కకి పోనిమ్మంటారు సారుగారూ?" అనడిగేడు.

"ఇంకెటు... పాపికొండలవైపు," అన్నాడు హరికృష్ణ.

"ఒరేయ్ కన్నాజీ కుడిపక్కకి కోసి పులిస్పీడు మీద పోనియ్. ఎదురువాలు జాగర్తొరేయ్," అనరిచిన మాణిక్యంగారు, రత్నప్రసాదూ వర్షాకాలం ఉగ్రరూపం దాల్చి చూసేవాళ్ళను భయభ్రాంతులకి గురిచేసిన ఈ గోదావరి తల్లి కథలు ఒకరి తర్వాతొకరు చెపుతుంటే వింటున్న గీత, హరికృష్ణలు కంగారుపడ్తున్నారు.

"మీ అదృష్టం ఈ సంవత్సరం వర్షాలూ, వరదలూ లేవు. లేకపోతే మనం ఇక్కడిదాకా వద్దుమా?" అన్నాడు రత్నప్రసాద్.

*

పగలు పదిగంటలు దాటింది. గాలాడ్డం లేదు. ఒకటే ఎండ చిరచిర లాడిపోతుంది. ఎండాకాలం కంటే దారుణంగా ఉంది వాతావరణం.

నీళ్ళలో కొట్టుకొస్తున్న పెద్ద టేకుదుంగ మీద ఇద్దరు మనుషులు కూర్చునున్నారు. "దాన్నేం చేస్తారు వాళ్ళు?" మాణిక్యంగార్నడిగింది గీత.

"ఈ దుంగని టేకూరు రేవులోకి జేర్చి అక్కడ్నుంచి ఊళ్ళోకి దొర్లిస్తారండి. అక్కడ మంచాలో, కుర్చీలో జేసి కిందికి తీసుకెళ్తే ఇక పారెస్టోళ్ళు పట్టుకోరు గదండీ."

"అందుకేనా ఈ ఊరికి టేకూరని పేరొచ్చింది?" అని అడిగింది విమలగీత.

"కావచ్చండి," అన్నాడు కన్నాజీ. అంతలో కూనవరం పాసింజరు లాంచీ క్రాసింగవుతుంటే ఆ లాంచీలో ద్వారపూడి బట్టల మూటోడు మాణిక్యాన్ని పలకరిస్తా, "కొత్తరకం చొక్కాగుడ్డొచ్చింది. మీ స్టాపులో తలొకడికీ చింపమంటారా మాణిక్యంగారూ?" అన్నాడు.

"ముందు చూపించు. మావోళ్ళకి నచ్చితే అలాగే చింపుదూగాని," అన్నాడు మాణిక్యంగారు.

ఆ కూనవరం లాంచీ సరంగుని బతిమాలుకుని ఆ లాంచీని వీళ్ళ లాంచీ పక్కకి మళ్ళించే ఏర్పాటు చేసుకొన్న ఆ బట్టల మూటోడు చూపించిన గుడ్డ అందరికీ నచ్చడంతో మనిషికో చొక్కా చొప్పున కట్ చేయిస్తుంటే, హరికృష్ణ కూడా ఒక చొక్కాకి సరిపడా గుడ్డ చింపించుకున్నాడు. ఆ బట్టల మూటోడి మొత్తం తాను అమ్ముడవ్వడమే గాదు కూనవరం లాంచీలో పాసింజర్లు ఇంకా చాలా కొన్నారు బట్టల మూటోడి దగ్గర.

దాంతో మాణిక్యంగార్ని నవ్వుతా చూసి ఆ ద్వారపూడి మూటోడు, "మీ బోణీ మా గొప్పది," అన్నాడు.

"నోర్మూద్దూ ఎదవ కాకా నువ్వూను," అంటా కళ్ళద్దాలు తీసి మళ్ళీ పెట్టుకున్నాడు మాణిక్యం. మధ్యాహ్నం దాటాకా వాతావరణంలో బాగా మార్పులొచ్చాయి. ఎండాకాలాన్ని మించిపోయి కాస్తున్న ఎండ ఉన్నట్టుండి మాయమయిపోయింది. ఆకాశం నిండా మూసుకుపోయాయి నల్లటి మబ్బులు. సుడిగాలులు వీస్తున్నాయి. తుపానుగానీనేమో అని భయపడ్డ వాళ్ళ లాంచీని కొరుటూరు రేవు దగ్గరకి జేర్చి ఒడ్డున పెద్ద గునపం సగానికి పైగా నేలలోకి దిగేసి అంగుళం కైవార ముండే లాంచీ తాడు దానికి కట్టేసరికి లాంచీలో వాళ్ళంతా రేవులోకి దూకేశారు.

దూరంగా ఎక్కడో వర్షం కురుస్తున్నట్టుంది. చల్లటిగాలి ఇటువైపు వస్తుంది. ఆకాశంలో మెరుపులు, పిడుగులు పడ్డ శబ్దాలు.

మాణిక్యంగారూ, రత్నప్రసాదూ చెప్పిన కథలు గుర్తొస్తున్నాయి విమలగీతకి. వర్షం మొదలయ్యి తుపానొచ్చి గోదావరి పైకొచ్చేస్తే ఈ గిరిజన గ్రామం నుంచి బయటపడేదెలాగా అని భయపడతా ఆలోచిస్తున్నారు. ఈలోగా పెద్ద చింతచెట్టు ఫెళఫెళా శబ్దం చేస్తా నేల కూలిపోయింది. వీస్తున్న గాలికి నీళ్ళలో లాంచీ అటూ ఇటూ తెగ ఊగిపోతుంది. చలిగాలి గడగడా ఒణికించేస్తుంది.

ఏం చేద్దాంరా దేవుడా అనుకుంటున్న ఆ టైములో ఇక కురవబోయే వర్షం, వీస్తున్న గాలి ఆగిపోయాయి. ఆకాశంలో కమ్ముకున్న నల్లటి మబ్బులన్నీ ఏ పక్కకో చెదిరిపోయాయి. సూర్యుడు బయటికొచ్చాడు. మళ్ళీ ఎండ మామూలే. వాతావరణంలో ఆ మార్పుకి లాంచీ స్టాఫంతా మాట రాకుండా ఉండిపోయారు.

"ఈ నదిలో బతికే మా జీవితాల్లో ఇలాంటి మార్పు మేం చూసెరగం," అన్నారంతా.

"నేనూ ఎరగను," అన్నాడు రత్నప్రసాద్.

విమలగీత, హరికృష్ణల దగ్గరకొచ్చిన సరంగు ఎల్లారావు, డ్రైవరు కన్నాజీ, "మీరు సీతారాములండి. రండి లాంచీ ఎక్కండి," అన్నారు.

వెనక్కి తిరిగిన లాంచీ రాత్రయ్యేసరికి వాళ్ళు దిగిన అదే ఇసుకతిప్ప మీదాగింది. చీకటిపడ్డ కాస్సేపటికి చంద్రుడొచ్చేడు. గాలి చలచల్లగా వీస్తుంది.

టైమయ్యేకొద్దీ గోదావరంతా వెన్నెలతో నిండిపోయింది. వాళ్ళు రవణమ్మ దగ్గరికి నావలో బయల్దేరాడు సత్తిబాబు. గాలిలో ప్రయాణం చేస్తా నెమ్మదిగా వస్తున్న ఆ చిన్నమబ్బు చంద్రుడ్నలా మూసి ఇలా వెళ్ళిపోతుంది.

అది మూసినప్పుడు చిరుచీకటి వెళ్ళేకా వెండి వెలుగు. ఆ చంద్రుడ్ని చూస్తూ గడుపుతున్న వాళ్ళకి స్టాఫ్‌లో చాలామంది తాగుతా హుషారుగా మాటాడుకుంటా డాన్సులవీ చేస్తుంటే వీళ్ళకీ కొంచెం పుచ్చుకోవాలనిపించింది.

భోజనాలు చేసి కాసేపు వెన్నెల్లో కలతిరిగి పడుకున్నాకా మళ్ళీ గాలి వీయడం మొదలెట్టింది. వెచ్చటి దళసరి ఉలెన్ రగ్గు కప్పుకున్న కాస్సేపటికే నిద్రపట్టేసింది.

సాయంత్రం తూర్పునున్న చంద్రుడు ఇప్పుడు పడమటి వేపుకొచ్చేడు. టైమెంత య్యిందో తెలీదుగాని దభదభా కురుస్తుంది వర్షం. రగ్గులోంచి తలలు బయటపెట్టి ఎదరాలు కిటికీ తలుపు తెరిచి ఆ వర్షాకాలంలో









ఆ తెల్లవారుఝామున కురుస్తున్న ఆ వర్షాన్ని రెప్పార్పకుండా చూస్తున్నారు. అలా చూస్తున్న వాళ్ళ ముఖాల్నిండా ఆనందం నిండిపోయింది.

అలా బాగా తెల్లారేదాకా చూస్తూనే ఉన్నారు. గాలివాటం మళ్ళేసరికి జల్లు కొట్టడం మొదలెట్టింది. అలా కొడ్తున్నప్పుడు పరమానందపడిపోతున్నారు. ఒకళ్ళ నొకళ్ళు గాఢంగా కౌగిలించుకొని ఆ వర్షాన్నే చూస్తున్నారు. బాగా తెల్లారేక ఆగి పోయిందా వర్షం.

నిన్న రాత్రి వాళ్ళ కచ్చులూరు వెళ్ళిపోయిన రత్నప్రసాద్ అప్పుడే ఒక నావలో దిగాడు. అతని చేతిలో ఉన్న ఆ పెద్ద సీవండి గిన్నె మూత తీస్తే మిరియాలపొడి, కొత్త బెల్లం వేసి కాసిన ఆవుపాల జున్నుంది. ఆరోజు టిఫిన్లతో పాటు ఈ జున్ను కూడా తిన్నారంతా.






చిన్న క్యారేజీలో కాస్త జున్నేసి దాస్తున్న సత్తిబాబుని, "ఇదెవరికిరా... మీ రవణమ్మకా?" అని ముత్యం అడిగితే అవునన్నట్టు తలూపాడు వాడు.

ఎండ ముదురుతోంది. గాలాడ్డం మానేసింది మళ్ళీ. కూనవరం నించొస్తున్న పాసింజరు లాంచీ వాళ్ళని క్రాస్ చేసుకుంటూ వెళ్ళిపోతుంది. టేకూరు రేవు నుంచి అపరాలు కొనడానికి నావ మీద బయల్దేరిన పోలవరం షావుకారు వీళ్ళని పలకరిం చాడు. తెల్లవారుఝామునెప్పుడో సింగన్నపల్లి రేవులో బయల్దేరిన ఫారెస్ట్ డిపార్ట్ మెంట్ లాంచీలో ఆఫీసర్లు వీళ్ళనే చూస్తున్నారు.

స్విమ్మింగ్ డ్రెస్ తీసుకొని ఆ తిప్పమీద కొంచెం ముందుకెళ్ళి దభీల్మని దూకాడు హరికృష్ణ. అతని వెనకాల దభీల్మంటూ గీత. ఆడతా పాడతా కాస్సేపు ఈదేకా ఇంకా ముందుకెళ్ళిన హరికృష్ణ పెద్ద కేకపెట్టాడు.



గిరుక్కున అటు తిరిగి చూసింది గీత. పెద్దగా కేకలు పెడుతూ ఆమె కళ్ళ ముందే నీళ్ళల్లోకి దిగబడి పోతున్నాడు హరికృష్ణ. అవాక్కయి చూస్తుండిపోయిన గీతకి నోట్లోంచి మాటలు రావడం లేదు.

క్షణాల్లో తేరుకొన్న గీత, "హెల్ప్... హెల్ప్," అంటా గావుకేకలు పెట్టడంతో పాకల్దగ్గరున్నోళ్ళు, లాంచీ స్టాఫూ వచ్చేసి జరిగింది తెల్సుకొని నీళ్ళల్లోకి దూకేశారు.

నీళ్ళలో కెళ్ళిపోయిన హరికృష్ణ కనపడ్డం లేదు. దాంతో ఒకటే ఏడుపు. ఆమె చుట్టూ మూగిన జనం, "గోదారమ్మ మీలాంటి పుణ్యాత్ముల కన్యాయం చెయ్యదు," అంటున్నారు. కానీ, అవేం వినబడ్డంలేదు గీతకి. గొళ్ళుగొళ్ళుమంటా ఏడుస్తానే ఉంది. నీళ్ళలోకి దూకిన గజ ఈతగాళ్ళంతా ఒడ్డుకొచ్చేరు. హరికృష్ణ దొరకలేదు.

దాంతో పెద్దగా అరుస్తా పడిపోయింది గీత. అంతలో దూరంగా ఒడ్డున పడున్న హరికృష్ణని జూసిన తాతారావు పరుగెట్టుకుంటా వెళ్తుంటే అంతా వాడి వెనక పరుగెట్టారు.

నీళ్ళు బాగా తాగేయడం వల్ల పొట్టంతా ఉబ్బిపోయి ఉంది. హరికృష్ణని బోర్లా పడుకోబెట్టిన ఎల్లారావు బలంగా నొక్కుతుంటే ముక్కుల్లోంచీ, నోట్లోంచీ తిన్న దంతా బయటికొచ్చేసింది. ఇంకా ఇంకా బలంగా నొక్కాడు. ఫోర్స్‌గా బయటి కొస్తున్నాయి నీళ్ళు. ముక్కుల్లోంచీ నోట్లోంచీ వస్తానే ఉన్నాయి. ఏడుస్తా హరికృష్ణ మీద పడ్డ మాణిక్యం అతని ముక్కు మూసి నోట్లో నోరు పెట్టి గాలి ఊదుతున్నాడు. ఊదుతానే ఉన్నాడు చాలాసేపు.

కాస్సేపటికి ఊపిరాడ్డం మొదలెట్టింది హరికృష్ణకి. ఈలోగా లాంచీ వేసుకెళ్ళిన కన్నాజీ, తాతారావులు మొబైలు హాస్పిటలు వాళ్ళని వెంటబెట్టుకొచ్చారు.

లాంచీ ఆగ్గానే అందులోంచి దూకిన డాక్టర్ డెన్నీస్ కాంపౌండర్ల సాయంతో హరికృష్ణని హాస్పిటల్ కేబిన్ రూమ్‌లోకి తీసుకెళ్ళి పడుకోబెట్టి ఆక్సిజనివ్వడం మొదలెట్టారు. అప్పుడే వచ్చిన రవణమ్మ పడిపోయిన విమలగీతని నీళ్ళు చల్లి లేపింది.

లేచి పరుగెట్టుకుంటా వచ్చిన విమలగీత మొబైల్ హాస్పిటల్లో ప్రాణాల్తో ఉన్న హరికృష్ణ దగ్గరకి పరుగెట్టి ఆ గోదారి తల్లికి దణ్ణవెట్టుకుంది.

రెండు గంటల తర్వాత ప్రమాదం లేదు అని హరికృష్ణని సీతారామాలాంచీ కేబిన్‌రూమ్‌లోకి పంపించేసిన డెన్నీస్ గీత కోరిక మీద ఆ రాత్రి తన హాస్పిటల్‌తో పాటు ఆ ఒడ్డునే ఉంటాననేసరికి అతనికి పదేపదే పది సార్లు థాంక్స్ చెబితే నవ్వేసిన డెన్నీస్, "గ్రేట్నెస్ అంతా ఆ జీసస్‌ది. మా ఫాదర్ జాన్ డేవిడ్‌గారిది," అన్నాడు.

రాత్రయ్యింది. షాక్‌లో ఉన్న హరికృష్ణకి లోబీపీ టాబ్లెట్లూ, బలం కోసం గ్లూకోజ్ ఇచ్చాడు డెన్నీస్. లాంచీ స్టాపు సీతారామా లాంచీ చుట్టూరా మూగేసున్నారు.

లోపల పడుకున్న హరికృష్ణ విపరీతంగా దగ్గుతున్నాడు. "కంగారు పడకండి. ఎంత దగ్గితే లంగ్స్‌లో మిగిలిన నీరు అంత బయటికొచ్చేస్తుంది," అన్నాడు డెన్నీస్. అలా రాత్రి పదిగంటల దాకా దగ్గిన హరికృష్ణ ప్రశాంతంగా ఉన్నాడు. గాలి కూడా ప్రశాంతంగా వీస్తుంది. హరికృష్ణకి ఏ ప్రమాదం లేదని తెల్సినా ఆ రాత్రి లాంచీ స్టాఫంతా మందుగాదు అసలు అన్నం మెతుకు నోట్లో పెట్టుకోలేదు.

వాళ్ళ ప్రేమకీ, నిజాయితీగల వాళ్ళ మనస్సులకి నిలువెల్లా కరిగిపోయిన గీత వాళ్ళవేపు తిరిగి మనసారా దణ్ణంపెట్టుకుంది.

*

నల్లటి మబ్బులు ఆకాశాన్ని కమ్మేశాయి. అందాల చంద్రుడ్ని అందంగా దాచేసుకున్నాయి. గాలి ముమ్మరం పెరిగింది. వీస్తున్న గాలికి ఊగుతుంది లాంచీ.

ఇంకాసేపటికి వర్షం మొదలైంది. కిటికీ సందుల్లోంచి గాలి కొట్టడంతో రగ్గులోంచి బయటికొచ్చిన హరికృష్ణ కిటికీ చిడతని తిప్పి బయటికి చూస్తే వర్షం. ముఖం మీదికి జల్లు కొడతా వర్షం. పక్కనే అతుక్కు పడుకున్న గీత కూడా లేచింది. పవిత్ర గోదావరిని ఉయ్యాల ఊపుతున్న లాంచీలో ఊగుతున్న ఆ ఇద్దరూ తెల్లారేదాకా, వర్షం ఆగేదాకా చూస్తానే ఉన్నారు.

ఇలా తెల్లారిందో లేదో వేడివేడి ఇడ్లీలు, మూడురకాల పచ్చళ్ళతో కోటిపల్లి సుందరంగాడి నావలో దిగి పోయిన రవణమ్మ హరికృష్ణతో పళ్ళు తోమించి ఆ ఇడ్లీలు పెట్టింది. ఆవేళ ఇడ్లీలు ఆ తిప్ప మీదున్న అందరికీ ఫ్రీ. మొబైల్ హాస్పిటలు జనం దగ్గరకెళ్ళి, "ఆ బాబుగార్ని బతికించిన మీక్కూడా ఫ్రీయేనండి. రాండి ఆరగిద్దురుగాని బాబయ్యా," అంది రవణమ్మ.

తూర్పున సూర్యోదయమయింది.

సూర్యుడు పైకెదుగుతున్న కొద్దీ చల్లగాలి తగ్గుతుంది. ఇంకిక్కడ్నుంచి ఎండ మామూలే దంచేస్తుంది వేసవి కాలంలా. ఆ రోజంతా ఆ జనానికే గాదు టేకూరు జనానికీ, తాళ్ళూరు జనానికి సంతర్పణ చేయించింది గీత.

సాయంత్రం దాకా తాగి తిని మీరు వెయ్యేళ్ళు బతకాలని ఆశీర్వదించేరంతా.

*

తెల్లవారుఝాము. మళ్ళీ వర్షం. గాలి ఊపుతున్న ఉయ్యాలా జంపాలా. చాలాసేపు రగ్గులోనే ఉన్న ఇద్దరూ ఇక ఈవేళ వెళ్ళిపోతున్నాం గదా అనుకొని కిటికీ రెక్కలు తెరిస్తే లావాటి తీగల్లా పడ్తున్న వర్షం ధారలు. జల్లు వాళ్ళవేపు కొడ్తుంటే మళ్ళీ ఎప్పుడొస్తామో అనుకుంటా మొత్తం తడిసిపోవడం మొదలెట్టారు వాళ్ళు.

అలా తెల్లారేదాకా వర్షం ఆగేదాకా అలాగే నిలబడిపోయి ఉన్నారాళ్ళు.

తూర్పున తెల్లావారి ఎర్రవారింది. వర్షం ఆగింది. లేచిన జనం తిప్పమీద తలో మూలకీ వెళ్ళొచ్చాక పందూపుల్లలు నముల్తా పళ్ళు తోముకొని స్నానాలు చేసి తూర్పుకి తిరిగి దణ్ణాలు పెట్టుకుంటున్నారు.

గాలి ఆగిపోవడంతో ప్రవాహంలోంచి మెదప వాసన. సూర్యుడు పైపైకి లేస్తున్నాడు.





ఈలోగా నావలో దిగిపోయిన రవణమ్మ, "మీరివ్వేళ మట్టుకే ఉంటారని తెల్సి ఒటేలు కట్టేసి వచ్చేసేనండి," అంది.

ఎండ బాగా ముదిరేకా లాంచీని పాపికొండలు వేపు మళ్ళించాడు తాతారావు. దాంతో కొంచెం గాలాడ్డం మొదలెట్టింది. తాతారావు చేతిలో చుక్కాని చిలక పట్టుకొన్న గీత అటూ ఇటూ తిప్పడం మొదలెట్టింది. అంతసేపూ ఆవరంలో ఉన్న ఎల్లారావుతోనూ, మాణిక్యంగారితోనూ మాటాడిన రవణమ్మ ముత్యం, సత్తిబాబు వంట మొదలెట్టేసరికి వాళ్ళ దగ్గరకెళ్ళి సాయపడ్తా, సత్తిబాబు జేబులో కొంత డబ్బు పెట్టి, "సాదరు కర్చుల కుంచు... రాత్రుళ్ళు తాగుడు కొంచెం తగ్గించు," అంది.

అది చూసిన విమలగీత భర్త దగ్గరకెళ్ళి, "చూడు వాళ్ళ బంధంలో ఎంత ప్రేమ, ఎంతిష్టం ఉన్నాయో... మానవ సంబంధాలు అంటే ఇవి కావా?" అంది.

"అవును," అన్నాడు హరికృష్ణ.

"నాదో కోరిక," అంది గీత.

ఏంటన్నాడు హరికృష్ణ.

"నా యూటిరస్ తీసేశారు గదా... నాకీ జన్మలో పిల్లలు పుట్టరు గదా?" అంది.

"పుట్టకపోతే?" అన్నాడు హరికృష్ణ.

"రవణమ్మ హోటలు పక్కనున్న సీతమ్మ కూతుర్ని మనం దత్తత తీసుకొందాం."

మాట రాకండా చాలాసేపుండిపోయిన హరికృష్ణ "అలాగే అడిగి చూద్దాం," అన్నాడు.

మాణిక్యంగారు అవతలొడ్డుకి చూస్తా, "లాంచీని టేకూరు రేవు వేపు పోనియ్యండి," అనేసరికి వెనక్కి తిరిగిన లాంచీ కాసేపటికి టేకూరు రేవులో ఆగింది.

రేవులోంచి పైకెక్కాలంటే చాలా ఎత్తుగా ఉంటుంది. ఇందాకే వర్షం కురిసి ఆగడంతో బురద తొక్కు కుంటా వెనకటి కెప్పుడో కట్టిన సిమ్మెంటు మెట్లెక్కి పాకలో ఉన్న రంగన్న సీతమ్మల్ని కల్సి విషయం చెపితే, "ఆకలితో మాడి చస్తాం గానీ మా బిడ్డ నివ్వవండి," అన్నారాళ్ళు.

వాళ్ళ దగ్గరకెళ్ళిన హోటెలు రవణమ్మ, "ముందు నేను మాటాడేకా మీరు మాటాదురుగాని మాటాడ్నా మరి?" అంది.

ఏం మాటాడ్తావన్నట్టు చూసిన సీతమ్మని పక్కకి తీసుకెళ్ళి పావుగంటసేపేం మాటాడిందో ఆ రవణమ్మ సరాసరి బిడ్డని తీసుకొచ్చి గీత చేతిలో పెట్టేసింది.

చాలా సంబరపడ్డ విమలగీత లక్ష రూపాయలు ఆ సీతమ్మకిస్తే నీలం గోదావర్లా నవ్వేసిన సీతమ్మ, "నా బిడ్డని మీకిస్తున్నది ఈ డబ్బుకోసం కాదు తల్లీ. నీకీ జన్మకి పిల్లలు పుట్టరని చెప్పింది రవణమ్మ పిన్ని అందుకోసం. ఆ జాలితో ఇస్తున్నాను. నేను గొడ్రాలిని కాదు, మళ్ళీ కంటానన్న నమ్మకంతో ఇస్తున్నానమ్మా," అంది.

ఆమెకి నమస్కారం పెట్టిన విమలగీత, "నేనీ డబ్బు ఇస్తున్నది బిడ్డని నీ దగ్గర కొనుక్కున్నందుకు అనుకోవద్దు. ఈ దరిద్రం నించి మీ భార్యాభర్తలు బయటపడ్డం కోసం చిన్న సాయం అనుకోండంతే," అంది.

ఆఖరిసారిగా ఆ బిడ్డని గుండెల దగ్గర అద్దుకున్న సీతమ్మ, "పిల్లని బాగా జూసుకోండమ్మా," అని ఏడవడం మొదలెట్టేసరికి మధ్యలోకొచ్చిన రవణమ్మ, "నీ బిడ్డ ఆరి కూడా అమెరికా వెళద్ది. మారాణి అవ్వుద్ది... నువ్వు తీసుకెళ్ళగలవా ఆ దేశాలూ... నువ్వు చెయ్యగలవా మారాణిని... నోర్మూసుకుని డబ్బులు తీసుకో," అంది.

ఆ టేకూరు గ్రామం సర్పంచ్‌ని, అక్కడి ప్రముఖులైన గిరిజనుల్నీ పిల్చి వాళ్ళ సమక్షంలో లక్ష రూపాయలు కేష్ ఆ దంపతలకిచ్చి ఆ బిడ్డని అందుకున్న విమలగీత అందరికేసి చూస్తా, "మీ అందరి సమక్షంలో ఈ బిడ్డకి పేరు పెడ్తున్నాను... ఏంటో తెల్సా?" అంది.

"ఏంటీ?" అన్నాడు పట్టిసీమ మాణిక్యంగారు.

"గోదావరి... ఈ పాపకి గోదావరి అని పేరు పెడ్తున్నాను," అంది విమలగీత.

"ఆహా ఈ పూర్ణించెల్తా అమ్మ గోదార్ని కూడా తీసుకెళ్తున్నావా తల్లీ! నమస్కారం అమ్మా," అన్నారంతా.

బిడ్డ నిచ్చేటప్పుడు సీతమ్మ, రంగన్న ఏడుస్తుంటే తట్టుకోలేకపోయింది గీత.

"ప్రతి ఏడూ మీరు రావాలి, మీ చేతుల్లో పెరిగే మా బిడ్డని మేం చూడాలి," అన్నారాళ్ళు.

క్షణం ఆలోచించిన గీత, "ఇక్కడ చాలామంది కిచ్చిన మాట ప్రకారం వచ్చే ఏడాది మట్టుకు తప్పకుండా వస్తాం. ఆ తర్వాత అప్పుడప్పుడు వస్తాం కానీ ప్రతి ఏడు రావడం వీలుకాదు," అంది.

మధ్యలోకి దూరిన రవణమ్మ, సత్తిబాబు, "ఈరు వస్తే ఏంటి రాపోతే ఏంటి మీ బిడ్డని మారాణిలా జూసుకుంటారని చెప్తున్నానా లేదా... ఏ నక్షత్రంలో పుట్టిందో మారాణి," అంటా వాళ్ళనింక మాట్లాడకుండా చేసేసేరు.

లాంచీ రాజమండ్రి వేపెళ్తుంది. ఆకాశంలో నల్లమబ్బులు మూసుకున్నాయి. వాలుగాలి వీస్తుంది. భద్రాచలం వేపు నించొస్తున్న లాంచీల్లోకి ఎప్పట్లాగే తన బైనాక్యులర్‌తో చూస్తున్నాడు కన్నాజీ.

చాలా స్పీడుగా రకరకాల రేవులు దాటుకుంటా ముందుకెళ్ళిపోతోంది లాంచీ.

టైమయిపోవడంతో దేవీపట్నం ఒడ్డున నిలబడ్డ ఎస్సైగారికి లాంచీలోంచే చేతులూపారు.

"ఇవ్వేళ చాలా ఆలస్యమైపోయింది," అంటా నిజంగా అమృతంలాంటి భోజనం పెట్టింది రవణమ్మ.

భోజనాలయ్యేక రవణమ్మని, రాగోతి సత్తిబాబుని పిల్చి తలో పదివేలు వాళ్ళ చేతుల్లో పెట్టి, లాంచీలో అందరికీ తలో పదేసివేలు ఇస్తా వీస్తున్న చల్లగాలిలా హాయిగా నవ్వింది విమలగీత.

ఆ డబ్బు పట్టుకున్న జనం కళ్ళు చెదిరిపోయాయి. జన్మలో ఎవరూ అంత డబ్బు టిప్ కింద ఇవ్వలేదు వాళ్ళకి.

*





రాత్రి ఎనిమిదీ నలభై నిమిషాలకి ఆగిన గౌతమీ ఎక్స్‌ప్రెస్‌లో ఎక్కిన విమలగీత, హరికృష్ణ వాళ్ళ ఒళ్ళో ఉన్న గోదావరిలని చూస్తా, "వచ్చే శీతాకాలం మీకోసం చూస్తుంటాం సార్‌గారూ," అన్నాడు పట్టిసీమ మాణిక్యంగారు. అతని వెనకాల రామభక్తుల్లా నిలబడున్న లాంచీ స్టాఫు, రవణమ్మ కూడా అదే ముక్కన్నారు.

రైలు కదిలి స్పీడందుకుంటుంటే ప్లాట్‌ఫారం మీద పరుగెడ్తా అదే ముక్క పదేపదే అంటున్నారు.

*

హైదరాబాదులో దిగిన మర్నాడు తెల్లవారుఝామునే గోదావరితో పాటు ఎమిరేట్స్ ఫ్లైట్ ఎక్కి ఫ్రాంక్ ఫర్డ్‌లో దిగి అక్కడ్నుంచి న్యూజెర్సీ చేరిన వాళ్ళిద్దరూ చాలా బిజీ అయిపోయారు. ఐ.టి. పనుల్లో పూర్తిగా లీనమైపోయిన హరికృష్ణ న్యూయార్క్‌లో ఇంకో ఆఫీసు, పిట్స్‌బర్గ్‌లో, ఒహాయోలో ఆఫీసులు తెరవడంతో రోజుకి ఇరవై నాలుగ్గంటలూ చాలడం లేదు. అంత బిజీ.

అతని పన్లు సగం గీత చూసుకోవడంతో హరికృష్ణ కంటే బిజీ అయిపోయిందామె. గోదావరి మట్టుకు వాళ్ళ దగ్గర మారాణిలా రారాణిలా పెరుగుతోంది.

*

శీతాకాలంలో ఇండియాలో రాజమండ్రి వెళ్ళి ఆత్మబంధువులందర్నీ పలకరించి రావాలనుకున్నారు. కానీ, పనుల ఒత్తిడి కదల్నివ్వడం లేదు.

గోదావరి యాసాగోసా కలిసిన డ్రైవరు దుమ్ము కన్నాజీ వెళ్ళిపోయిన తన చంద్రావతి మళ్ళీ వస్తుందేమో అని బైనాక్యులర్‌తో చూస్తున్న దానికో సొల్యూషను దొరికింది వాళ్ళకి. తన వయసుకి రెట్టింపు వయసు రవణమ్మని పెళ్ళి చేసుకున్న సత్తిబాబుకో సొల్యూషను, తల్లిని నరకయాతన పెట్టి కాలం చేసిన తండ్రి పోలికల్తో ఉన్న మేనకోడల్ని చేసుకున్న తాతారావుకో సొల్యూషనూ- ఇలా వాళ్ళ కథలన్నీ టేపుల్లో విన్న వాళ్ళకి రకరకాల సొల్యూషన్స్ దొరికాయి. ఇవి వాళ్ళకి చెపితే వాళ్ళ జీవితాలు ఈ జన్మకి బాగుపడిపోవడం ఖాయం. వాళ్ళ బతుకుల్లో గొప్ప గొప్ప మార్పులు రావడం ఖాయం అని నమ్ముతున్న వాళ్ళిద్దరూ చాలా తొందరల్లో గోదాట్లో లాంచీ ఎక్కాలి, ఈ సొల్యూషన్స్ వాళ్ళలో ఇంజెక్ట్ చెయ్యాలి, వాటి ద్వారా వాళ్ళ జీవితాల్లో గొప్ప మార్పు తీసుకురావాలి అనుకోసాగారు. అలా అనుకుంటూ ఎప్పటికప్పుడు ఇండియా వెళదామనుకోవడం ఆఖరి నిమిషంలో ఏదో టెన్షన్‌లో వెళ్ళలేకపోవడం, వాళ్ళు పెంచుకుంటున్న ఆ పసిపాప గోదావరిలో ఆ అఖండ గోదావరిని చూసుకు తృప్తిపడ్డం జరుగుతోంది.

ఏడేళ్ళు గడిచిపోయాయి.

ఆ సంవత్సరం శీతాకాలం ఎట్టి పరిస్థితుల్లోనూ వెళ్ళాలని నిర్ణయించుకొని కపిలేశ్వరపురం జనానికి, లాంచీ స్టాఫ్‌లో ప్రతి మనిషికి, రవణమ్మకి, రత్నప్రసాద్‌కి, ఎస్సై అంజిబాబుల్తో పాటు గోదావరి తల్లిదండ్రులైన రంగన్న, సీతమ్మలకి, ఫార్ కార్నర్స్ హాస్పిటలు డాక్టర్ డెన్నీస్ జోసెఫ్‌కీ ఇంకా వాళ్ళ స్టాఫ్‌కి జన్మలో వాళ్ళెప్పుడూ చూడని, ఊహించని ఖరీదైన కానుకలు కొన్నారు.

బొద్దుగా, ముద్దుగా ఎదిగిన ఏడేళ్ళ పాప గోదావరిని ఆమె తల్లిదండ్రులైన రాజన్న, సీతమ్మలకి చూపించాలన్న తాపత్రయంతో ఆ నవంబరు నెల మొదటి వారం ఇండియాకొచ్చి, ఆ రాత్రి గౌతమీలో రాజమండ్రి బయల్దేరి తెలతెల్లారేక దిగి ఆటో ఎక్కి రేవులోకొచ్చిన వీళ్ళకి ఒక్క లాంచీ కూడా కనిపించలేదా చీకట్లో.

రేవులో జనమే లేరు. అఖండ గోదావరి ఎండిపోయి ఉంది. చలిగాలి చూస్తే ముమ్మరంగా వీస్తుంది. చీకటింకా విడిపోలేదు. రేవులో సందడి లేదు. 'ఏంటి చెప్మా చిత్రం,' అనుకుంటా కోటగుమ్మం దగ్గరకెళ్ళారు.

పోలవరం వెళ్ళడానికి కారు మాటాడుకొని లగేజీ అంతా అందులో పెట్టుకొని బయల్దేరారు.

బ్రిడ్జి దాటి కొవ్వూరొచ్చి అక్కడ్నుంచి ముప్ఫై కిలోమీటర్లు ప్రయాణం చేసి పోలవరం రేవులోకొచ్చిన వాళ్ళకి రేవులో నిండా నీళ్ళకి బదులు ఇసుకతిప్పలు కనిపించాయి. ఎక్కడా ఒక్క పడవకానీ, లాంచీగానీ కనపడలేదు.

ఇసుకతిప్పల మధ్య అక్కడక్కడా పిల్లకాలువలా పారుతున్న నీళ్ళు. దూరంగా పైకెళ్ళి పోలవరం దగ్గర రామయ్యపేట నుంచి అవతలొడ్డు అంగళూరు దాకా మహాద్భుతంగా కళ్ళు చెదిరిపోయేలా కట్టిన మూడువందల యాభై అడుగుల ఎత్తున్న పోలవరం ప్రాజెక్టు.

దాన్ని చూసిన వాళ్ళకి మాట పడిపోయింది.

వాళ్ళు తిరిగిన నది ఒడ్డు గ్రామాలూ, పాపికొండలూ, చెట్లూ, పుట్టలూ, తిప్పలూ- అన్నింటినీ మింగేసి ఆకాశం ఎత్తున పొంగుతుందా నదిలో నీలం నీరు.

కాలకృత్యాలు తీర్చుకుని దిగువలో ఉన్న నదిపాయలో స్నానం చేసి వెళ్తున్న ఒక ముసలి ఆచార్లుగార్ని ఆపి, "ఏవండీ ఇక్కడ పట్టిసీమ మాణిక్యంగారి లాంచీలు రెండుండాలి ఎక్కడా?" అన్నాడు హరికృష్ణ.

తాత్త్వికంగా నవ్విన ముసలి ఆచారిగారు, "ఇంకెక్కడ బాబూ?" అన్నారు. ఈ పోలవరం ప్రాజెక్టు కట్టాకా ఆ మా తల్లి గోదావరి ఎండిపోవడంతో ఈ రేవులో లాంచీలు, నావలు అంతరించిపోయాయంట.

ఆయన చెప్తున్నదంతా విని చలించిపోయిన వాళ్ళు, "దేవీపట్నం రేవులో ఎస్సై అంజిబాబుగార్ని, కచ్చులూరులో రచయిత మిత్రుడు రత్నప్రసాదన్ని, టేకూరు రేవులో ఒటేలు రవణమ్మని, కపిలేశ్వరపురం జాలరి జనాల్ని, ముఖ్యంగా వాళ్ళ పాప బాల గోదావరి తల్లిదండ్రులైన రంగన్న, సీతమ్మల్ని కలవాలనుకుంటున్నాం, ఎలాగండి ఆచార్యులుగారూ?" అంది గీత.

"మీరు చెప్పిన మనుషులెక్కడున్నారో, ఏమైపోయారో చెప్పడం నావల్ల కాదుగానీ, వాళ్ళుండే ఆ గ్రామాలన్నీ జలసమాధి అయిపోయాయి. దాంతో ఆ జనం చెట్టుకీ పుట్టకీ చెదిరిపోయారు," అంటా వెళ్ళిపోయాడాయన.

ఎన్నో గంటలలా నిలబడిపోయారు.

మధ్యాహ్నమైంది... సాయంకాలమైంది. విమలగీత, హరికృష్ణ ఎడంపక్క పొంగుతున్న గోదావరినీ, కుడిపక్క ఎండిపోయిన గోదావరినీ చూస్తున్నారు. సాయంత్రం గాలి జీబురు జీబురుమంటా వీస్తుంది.

అక్కడెక్కడో ఉన్న చింతచెట్టు మీద పక్షొకటి ఏడుస్తా కూస్తుంది. ఒక కొంగల బారు తూర్పుదిక్కుగా వెళ్తుంది. అవతలి గోదారి ఒడ్డున అలలు తపతపా కొట్టుకుంటున్నాయి. ఎక్కడ్నించో ఏ కొండవాడో పక్కా శృతిలో పాడుతున్న విషాద జానపదం గాలిలో కలుస్తా అస్పష్టంగా వినపడి అమాంతంగా మాయమైపోయింది.





ఐతే... అందమైన ఏటిగట్లు గ్రామాలు, అమాయకమైన ఆ కొండోళ్ళు ఈ జన్మకే కాదు మరే జన్మకీ కనబడరా... తిప్పల మీద కట్టుకున్న పిచ్చికగూళ్ళు, మాణిక్యంగారి పరాచికాలు, సత్తిబాబు కంటే పెద్దదైన అందాల రవణమ్మ అమృతం కలిపిన వంటలూ... పాపికొండల మధ్య శీతాకాలం మధ్యాహ్నాలూ, వేసవికాలం వెన్నెల రాత్రులు, వర్షాకాలం ఆ తెల్లవారురఝాములు ఇంకలేవా... ఆ నిజాన్ని భరాయించుకోలేకపోతున్నారు.

ఒక కుటుంబంలాగా తమలో కల్సిపోయిన వాళ్ళు ఇంకెప్పటికీ కనబడరన్న నిజాన్ని బొత్తిగా అరాయించుకోలేకపోతున్నారు. తమకి బాగా దగ్గరైపోయిన లాంచీలో వాళ్ళ జీవితాల్లో మార్పు కోసం చెప్పాలనుకున్న ఆ పరిష్కారమార్గాలు ఇక్కడెవరికి చెప్పాలి.

వాళ్ళ కోసం తెచ్చిన కానుకలన్నీ కారు నిండా ఉన్నాయి. అవన్నీ ఇప్పుడెవరికివ్వాలి? ఎంత ఆపుకొందామన్నా ఆగడం లేదు బాధ. కళ్ళల్లోంచి... ధారలుగా కన్నీళ్ళు.

ఎంతో ప్రేమతో ఎన్నో సముద్రాలు దాటి, ఎన్నో వేల మైళ్ళు దాటి వస్తున్న వాళ్ళు ఏడుస్తున్నారు.

ఏ చప్పుడూ లేకుండా ఏడుస్తున్న వాళ్ళ కన్నీళ్ళు ఆ ఇసుకలో ఇంకిపోతున్నాయి. గొల్లవాళ్ళ పిల్లంగ్రోవి అల్లంగానాల్నీ, కోయిల కూనిరాగాల్నీ, ఇప్పటికీ ఎప్పటికీ ఏ జన్మకీ ఎన్నెన్ని జన్మలకీ చూడలేం, చూడబోం అనుకుంటా ఏ చప్పుడు లేకుండా ఏడుస్తున్నారు.

ఎప్పుడూ నవ్వుతా ఉండే మమ్మీడాడీలు ఏడుస్తుంటే వాళ్ళ మధ్యలోకొచ్చి ఎందుకేడుస్తున్నారని అడిగింది గోదావరి. ఆ పిల్లకే సమాధానం చెప్పకుండా ఏడుస్తానే ఆ గోదావరి మాతని ఎడాపెడా చూస్తా ఆకాశంలో పేదరాశి పెద్దమ్మ కుంకుమ ఆరబెట్టడం వల్ల ఎర్రగా ఉన్న ఆకాశాన్ని చూస్తా వాళ్ళొచ్చిన కారు వేపు నడుస్తున్నారు.

*స్వాతి వారపత్రిక*
*తెలుగునాడి అమెరికా పత్రికలలో ధారావాహికం, 2007*



ఈ ఆకుపచ్చని జ్ఞాపకాలను పదిలంగా దాచుకుందాం!

సీతారామా లాంచీ సర్వీస్ - రాజమండ్రి




ఇండియన్స్ ఇండియా బుక్స్
4వ అంతస్తు ప్లాట్ నెంబరు 13
ఫేజ్.3 జూబ్లీ హిల్స్
హైదరాబాద్ 500033